# సంప్రదాయ సాహిత్యం - నాటకం

**ఎం.ఏ. - తెలుగు, మొదటి సంవత్సరం, సెమిస్టర్-2, పేపరు-1**


*రచయితలు*

**ఆచార్య బూదాటి వేంకటేశ్వర్లు,**
ఎం.ఏ., పిహెచ్.డి.
తెలుగు విభాగం
బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం, వారణాసి.

**డా॥ ఇరపని మాధవి,**
ఎం.ఏ., పిహెచ్.డి.
తెలుగు & ప్రాచ్యభాషా విభాగం
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్.

*సంపాదకులు*

**డా॥ ఇరపని మాధవి,**
ఎం.ఏ., పిహెచ్.డి.
తెలుగు & ప్రాచ్యభాషా విభాగం
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్.

*సమన్వయకర్త*

**డా॥ ఇరపని మాధవి,**
ఎం.ఏ., పిహెచ్.డి.
తెలుగు & ప్రాచ్యభాషా విభాగం
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్.

*డైరక్టర్*

**డా॥ నాగరాజు బట్టు,**
**M.B.A., M.H.R.M., L.L.M., M.Sc. (Phy),**
**M.A. (Soc.)., M.Ed., M.Phil., Ph.D.**
హెచ్.ఆర్.ఎం. విభాగం



## దూర విద్యా కేంద్రము

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్-522 510.
Ph: 0863-2293299, 2293356 (08645), 211023, 211024 (Study Material)
Cell : 98482 85518
E-mail : Info@anucde.ac.in
Website: www.anucde.ac.in (or) www.anucde.info

**M.A. Telugu :**

Edition:

No. of Copies:

(C) Acharya Nagarjuna University

This book is exclusively prepared for the use of students of Distance Education, Acharya Nagarjuna University and this book is meant of limited circulation only.

Published by:

**Dr. NAGARAJU BATTU**

Director

Centre for Distance Education

Acharya Nagarjuna University

# ముందుమాట

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 1976లో స్థాపించినది మొదలు నేటి వరకు ప్రగతిపథంలో పయనిస్తూ వివిధ కోర్సులు, పరిశోధనలు అందిస్తూ 2016 నాటికి NAAC చే A గ్రేడును సంపాదించుకొని దేశంలోనే ఒక ప్రముఖ విశ్వవిద్యాలయంగా గుర్తింపు సాధించుకొన్నదని తెలియజేయటానికి సంతోషిస్తున్నాను. ప్రస్తుతం గుంటూరు, ప్రకాశం జిల్లాలలోని 447 అనుబంధ కళాశాలల విద్యార్థులకు డిప్లమో, డిగ్రీ, పి.జి. స్థాయి విద్యాబోధనను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అందిస్తోంది.

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఉన్నత విద్యను అందరికి అందించాలన్న లక్ష్యంతో 2003-04లో దూరవిద్యా కేంద్రాన్ని స్థాపించింది. పూర్తి స్థాయిలో కళాశాలకు వెళ్ళి విద్యనభ్యసించలేని వారికి, వ్యయభరితమైన ఫీజులు చెల్లించలేని వారికి, ఉన్నత విద్య చదవాలన్న కోరిక ఉన్న గృహిణులకు ఈ దూర విద్యా కేంద్రం ఎంతో ఉపయోగపడుతుంది. ఇప్పటికే డిగ్రీ స్థాయిలో బి.ఏ., బి.కాం., బి.ఎస్.సి., మరియు పి.జి. స్థాయిలో ఎం.ఏ., ఎం.కాం., ఎం.ఎస్.సి., ఎం.బి.ఏ., ఎల్.ఎల్.యమ్., కోర్సులను ప్రారంభించిన విశ్వవిద్యాలయం గత సంవత్సరం కొత్తగా 'జీవన నైపుణ్యాలు' అనే సర్టిఫికేట్ కోర్సును కూడా ప్రారంభించింది.

ఈ దూర విద్యా విధానం ద్వారా విద్యనభ్యసించే విద్యార్థుల కొరకు రూపొందించే పాఠ్యాంశాలు, సులభంగాను, సరళంగాను, విద్యార్థి తనంతట తానుగా అర్థం చేసుకొనేలా ఉండాలనే ఉద్దేశ్యంతో విశేష బోధనానుభవం కలిగి, రచనా వ్యాసంగంలో అనుభవం గల అధ్యాపకులతో పాఠ్యాంశాలను వ్రాయించడం జరిగింది. వీరు ఎంతో నేర్పుతో, నైపుణ్యంతో, నిర్ణీత సమయంలో పాఠ్యాంశాలను తయారు చేశారు. ఈ పాఠ్యాంశాల పై విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు నిష్ణాతులైన వారు ఇచ్చే సలహాలు, సూచనలు సహృదయంతో స్వీకరించబడతాయి. నిర్మాణాత్మకమైన సూచనలను గ్రహించి మున్ముందు మరింత నిర్దిష్టంగా, అర్థమయ్యే రీతిలో ప్రచురణ చేయగలం. ఈ పాఠ్యాంశాల అవగాహన కోసం, సంశయాల నివృత్తి కోసం వారాంతపు తరగతులు, కాంటాక్టు క్లాసులు ఏర్పాటు చేయటం జరిగింది.

దూరవిద్యా కేంద్రం ద్వారా విజ్ఞాన సముపార్జన చేస్తున్న విద్యార్థులు, ఉన్నత విద్యార్హతలు సంపాదించి జీవనయాత్ర సుగమం చేసుకోవడమే గాక, చక్కటి ఉద్యోగావకాశాలు పొంది, ఉద్యోగాలలో ఉన్నత స్థాయికి చేరాలని, తద్వారా దేశ పురోగతికి దోహదపడాలని కోరుకుంటు న్నాను. రాబోయే సంవత్సరాలలో దూర విద్యా కేంద్రం మరిన్ని కొత్త కోర్సులతో దినదినాభివృద్ధి చెంది, ప్రజలందరికి అందుబాటులో ఉండాలని ఆకాంక్షిస్తున్నాను. ఈ ఆశయ సాధనకు సహకరిస్తున్న, సహకరించిన దూరవిద్యా కేంద్రం డైరెక్టర్లకు, సంపాదకులకు, రచయితలకు, అకడమిక్ కో-ఆర్డినేటర్లకు మరియు అధ్యాపకేతర సిబ్బందికి నా అభినందనలు.

**ప్రొఫెసర్ పి. రాజశేఖర్,** M.A., M.Phil., Ph.D.
కులపతి (FAC),
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం.

## ఎం.ఏ. - తెలుగు, మొదటి సంవత్సరం, సెమిస్టర్-2, పేపరు-1

## Prescribed Texts and Drama (నిర్ణయించిన పాఠ్యాంశాలు)

## సంప్రదాయ సాహిత్యం - నాటకం

### సిలబస్

పాఠం 1. పోతన - మహాభాగవతం - నవమస్కంధం - అంబరీషోపాఖ్యానం
(81 నుంచి 153 వ పద్యం వరకు)

పాఠం 2. శ్రీకృష్ణదేవరాయలు - ఆముక్త మాల్యద - షష్ఠాశ్వాసం - మాలదాసరి కథ
(3 నుంచి 66 వ పద్యం వరకు)

పాఠం 3. తెనాలి రామకృష్ణుడు-పాండురంగ మహాత్మ్యం - పంచమాశ్వాసం అయుతనియుతోపాఖ్యానం
(167 నుంచి 323 వ పద్యం వరకు)

పాఠం 4. కంకంటి పాపరాజు - శ్రీమదుత్తర రామాయణం - షష్ఠాశ్వాసం - సీతా పరిత్యాగం
(232 నుంచి 351 వ పద్యం వరకు)

పాఠం 5. తిరుపతి వేంకట కవులు - పాండవోద్యోగము నాటకం

**ఆధార గ్రంథాలు:**

1. మహాభాగవతం - పోతన
2. ఆముక్త మాల్యద - శ్రీకృష్ణదేవరాయలు
3. పాండురంగ మహాత్మ్యం - తెనాలి రామకృష్ణ కవి
4. శ్రీ మదుత్తర రామాయణం - కంకంటి పాపరాజు
5. పాండవోద్యోగం - తిరుపతి వేంకట కవులు

# ఎం.ఏ. - తెలుగు, మొదటి సంవత్సరం, సెమిస్టర్-2, పేపరు-1

## Prescribed Texts and Drama (నిర్ణయించిన పాఠ్యాంశాలు)

## సంప్రదాయ సాహిత్యం - నాటకం

**మాదిరి ప్రశ్నాపత్రం**

**సమయం: 3 గంటలు** **మార్కులు: 70**

**1. ఈక్రింది పద్యాలలో ఒకదానికి సమగ్ర వ్యాఖ్య రాయండి.**

అ. చలమున బుద్ధిమంతులగు సాధులు నా హృదయంబు లీల దొం
గిలికొనిపోవుచుండును రకిల్టిష భక్తి లతాచయంబుల
న్నిలువఁ గఁ బట్టి కట్టుదురు నేరుపుతో మదకుంభికైవడిన్
వలలకుఁ జిక్కి భక్తజన వత్సలతన్ జను చుందుఁ దాపసా

ఆ. నిదురయు గూడు బోఁ జదివి నేనిటగన్నది యేమి యెవ్వడీ
చదువుల యర్థవాదపు మృషల్విని బేల్పడు నీవు మాయెడం
జదువుల మాటలాడి కనజాల వొకానొక మెచ్చు నొక్కడీ
చదివిన కూర వింతచవి చాలగదెమ్మను మెచ్చు దక్కగన్.

**2. ఈక్రింది వాటిలో ఐదింటికి సందర్భ సహిత వ్యాఖ్యలు రాయండి. 2 × 5 = 10.**

a) సమలోష్టహేముఁడై సర్వ కర్మంబులు హరిపరంబులుగాఁగ నవని యేలె

b) సఖ్యం సాప్తపదీన మన్మన మిథ స్సాంగత్యమూహించుచున్.

c) వివిధ శుభంబులీవలయు వేల్పులటంచు నమస్కరించినన్.

d) సొరిదిన్ నైజగుణంబులై సరసవచ్ఛుం గాదె మిత్రాకృతిన్.

e) పడతి మఱియంతటను వట్టి బయలు సూచు.

f) గుండల్నీరుగ నెండగాలి పసితాకుం జూడకాప్రాహ్ణమున్.

g) సంధి యొనర్చి మా భరత సంతతి నిలుపుము

h) వీతరాగులమని విఱ్ఱవీఁగెదరు కొందఱు బోడలు నానగండలై

i) నెమ్మి యొకయింత నా మీఁద నిల్పుమనుము.

j) సుఖినై యేనొనర్తుఁ గాఁ పురమచటన్.

**3. ఈ క్రింది ప్రశ్నలలో నాల్గింటికి సమాధానాలు రాయండి. 12 × 4 = 48.**

a) “అంబరీషోపాఖ్యానం” ఆధారంగా పోతన కవితారీతులను వివరించండి?

b) “మాలదాసరి కథ” ఆధారంగా రాయల కాలం నాటి సామాజిక పరిస్థితులను చిత్రీకరించండి?

c) అయుతనియుతోపాఖ్యాన ఇతివృత్తాన్ని రాయండి?

d) మీ పాఠ్యభాగమాధారంగా సీతాదేవి ఆవేదనను ఆవిష్కరించండి?

e) మాలదాసరి-బ్రహ్మరాక్షసుల సంవాదాన్ని వివరించండి?

f) ‘పాండవోద్యోగం” నాటకంలోని ప్రధాన పాత్రలను పరిచయం చేయండి?

g) శ్రీకృష్ణుడు రాయబారం వెళ్ళే సమయంలో పాండవులు, ద్రౌపది శ్రీకృష్ణుడికి సంధి పట్ల తెలిపిన అభిప్రాయాలను వివరించండి?

# ఎం.ఏ. - తెలుగు, మొదటి సంవత్సరం, సెమిస్టర్-2, పేపరు-1
## Prescribed Texts and Drama (నిర్ణయించిన పాఠ్యాంశాలు)
## సంప్రదాయ సాహిత్యం - నాటకం

### విషయ సూచిక


| సంఖ్య | పాఠం | పుట |
|---|---|---|
| 1. | అంబరీషోపాఖ్యానము | |
| 2. | అంబరీషోపాఖ్యానము | |
| 3. | అంబరీషోపాఖ్యానము | |
| 4. | అంబరీషోపాఖ్యానము | |
| 5. | మాలదాసరి కథ | |
| 6. | మాలదాసరి కథ | |
| 7. | మాలదాసరి కథ | |
| 8. | మాలదాసరి కథ | |
| 9. | అయుత నియుతోపాఖ్యానము | |
| 10. | అయుత నియుతోపాఖ్యానము | |
| 11. | అయుత నియుతోపాఖ్యానము | |
| 12. | అయుత నియుతోపాఖ్యానము | |
| 13. | సీతా పరిత్యాగము | |
| 14. | సీతా పరిత్యాగము | |
| 15. | సీతా పరిత్యాగము | |
| 16. | సీతా పరిత్యాగము | |
| 17. | పాండవోద్యోగము | |
| 18. | పాండవోద్యోగము | |
| 19. | పాండవోద్యోగము | |

# 1. అంబరీషోపాఖ్యానం - పోతన

**కవిపరిచయం:**

ఏ నరపతీ తన కృతికి పతికాదని శ్రీయః పతికే అంకితంగా పోతన రచించిన భాగవతం ఆంధ్రుల పుణ్యాల ఫలం. పోతన భాగవత పద్యాలు వందలాదిగ తెలుగు వాళ్ల నోటికి ఎక్కాయి. 'విద్యావతాం భాగవతే పరీక్షా' అన్న నానుడి బాగా ప్రసిద్ధమైన నానుడి. భారతాన్ని చదవటం కష్టం. భాగవతానికి అర్థం చెప్పటం కష్టమని పండితులు భావిస్తారు. అంటే తాత్త్వికార్థపు లోతులు తెలిసిచెప్పటమని తాత్పర్యం. గ్రంథస్థాధారాన్ని బట్టి సంస్కృత భాగవతం వ్యాసుని చివరి రచనగా తెలుస్తుంది. ఈ వ్యాస భాగవతాన్ని బమ్మెర పోతన తెనుగుజేసి తనకు, భాగవతానికి పునర్జన్మ లేకుండా చేసుకున్నాడు. భారతాన్ని రచించిన నన్నయ తిక్కనాదులు భాగవతాన్ని రచించక పోవడం తన అదృష్టంగా పోతన భావించాడు. కాని అది తెలుగుజాతి చేసుకున్న అదృష్టంగా భావించాలి.

**మ॥ "ఒనరన్ నన్నయ తిక్కనాది కవులీయుర్విన్ పురాణావళుల్**
**తెనుగున్ జేయుచు మత్పురాకృత శుభాధిక్యంబు దానెట్టిదో**
**తెనుగుంజేయురుమున్న భాగవతమున్ దీనిం దెనింగించి మ**
**జ్జనంబున్ సఫలంబుఁజేసెదఁబునర్జన్మంబు లేకుండగన్"**

అని వినయ శిరస్కుడై పేర్కొన్నాడు. వేదాలను వింగడించి, అష్టాదశ పురాణాలను రచించి, బ్రహ్మ సూత్రాలను ప్రవచించి, భారతాన్ని ప్రబంధీకరించినప్పటికీ వ్యాసునికి విష్ణుకథ విరచించని కొరతతోచింది. అలాగే పోతన్నకు కూడ శ్రీమన్నారాయణ కథా ప్రపంచ విరచనా కుతూహలం మోసులెత్తింది. రాకానిశాకాలంలో గంగాస్నానంచేసి, మహేశ్వర ధ్యానంతో ఉన్న పోతనకు రామభద్రుడు సాక్షాత్కరించి మహాభాగవతం తెనుగు చేయమని కోరగా పోతన్న అంగీకరించాడు. విష్ణు కథారచనాకుతూహలంతో ఉన్న పోతన్నకు, ఈశ్వర ధ్యానంతో ఉన్న పోతన్నకు రాముడు కనిపించి గోవింద కథా కదంబమైన భాగవతాన్ని రచించి తన కంకితమిమ్మని కోరాడు. శ్రీరామచంద్రుని సన్నిధానాన్ని కల్పించుకొని 'హారికి', 'నందగోకుల విహారికి' అంటూ షష్ఠ్యంతాలు రచించి కృష్ణునికంకితం చేశాడు. శివుడు, కేశవుడు, రాముడు కృష్ణుడు ఈ నలుగురు మూర్తుల్ని ఏకత్ర భావించి భజించడం పోతన్న అభేదభక్తికి నిదర్శనం.

పోతన ఓరుగల్లు సమీపంలోని బమ్మెర'వాసి. బమ్మెర గ్రామం వీరశైవానికి ప్రతిష్ఠతెచ్చిన 'పాలకుర్తి' సమీపంలో ఉంది. తండ్రి కేసనం, తల్లి లక్కసానమ్మ', తండ్రి 'శైవశాస్త్రమతాలలోతు చూసినవాడు'. తల్లి 'సదాశివ పాదయుగార్చనానుకంపాయన వాగ్భవాని'. పోతన అన్న పేరు తిప్పయ్య. అన్నకూడా ఈశ్వరసేవా కాముకుడే. ఇలా అబాల్యంగా దైవభక్తి, ఈశ్వర సేవానురక్తి కుటుంబసిద్ధంగా పోతనకు అబ్బింది. వీరభద్రవిజయం బాల్యంలో వ్రాశాడని, భోగినీదండకం తరుణ వయస్సులో రచించాడని పరిశోధకులు భావిస్తున్నారు. క్రీ.శ. 1430 ప్రాంతంలో సింగమనీడు రాజ్యానికి వచ్చిన కొత్తలో పోతనకు రాజాశ్రయం దొరికి ఉంటుంది. 1430-33 ప్రాంతాలలో భోగినీదండకం రచించి ఉండవచ్చు.

పోతనగారి భాగవతావతారికను, తిక్కనగారి భారతావతారికను తులనాత్మకంగా పరిశీలించి చూస్తే, విరాట పర్వావతారికకు తోబుట్టువుగా పోతన భాగవతావతారికను తీర్చిదిద్దినట్లు కనిపిస్తుంది. తిక్కన్నలాగే వస్తువరణంలో పోతన స్వేచ్ఛ ప్రదర్శించడం, తిక్కన భారతరచనాకౌతుకం కనబరచినట్లే పోతన శ్రీమన్నారాయణ

కథా ప్రపంచ విరచనా కుతూహలం కనబరచడం, తిక్కనకు హరిహరనాథుడు కలలో కనిపించినట్లుగా, గంగాతీరంలో మహేశ్వర ధ్యానంలో ఉన్నా పోతన్నకు రాముడు కనిపించడం, కరుణారసము పొంగి పొరలెడు చాడ్పున అన్న సీసపద్యంలో హరిహరనాథుణ్ణి తిక్కన రూపు కట్టిస్తే, 'మెఱుగు చెంగటనున్న మేఘంబుకైవడి' అన్న సీసపద్యంలో రమానాథుని పోతన చిత్రించటం, ఇద్దరినీ కృతికోసం దైవమే అర్థించడం నరులనుగాక, సర్వేశ్వరుణ్ణి కృతిపతిగా ఇద్దరూ స్వీకరించడం, ఇవన్నీ తిక్కన పోతన్నలు ఇద్దరిలోను కనిపించే సమగుణం. "పోతన తాను కేవలం నిమిత్తమాత్రుడనంటూ–

**క॥ "పలికెడిది భాగవతమట**
**పలికించెడివాడు రామ భద్రుండటనే**
**పలికిన భవహరమగునట**
**పలికెద వేరొండుగాథ పలుకగనేలా**

– అని పేర్కొని తన ఆనందాన్ని ప్రకటించాడు. విష్ణుభక్తుల కథా వాటికి, కృష్ణలీలా పేటిక అయిన భాగవతంలో ఎన్నెన్నో వేదాంత గ్రంథులు ఉన్నాయి. ఆ గ్రంథుల్ని విడదీయడం శూలికి తమ్మి చూలికి కూడ కష్టమైన విషయమే

**ఆ.వే. భాగవతము తెలిసి పలుకుట చిత్రంబు**
**శూలికైన తమ్మి చూలికైన**
**విబుధజనుల వలన విన్నంత కన్నంత**
**తెలియవచ్చినంత తేట పఱతు".**

అని భాగవతాన్ని తెలుసుకోవడం, తెలిసి చెప్పడం కష్టమైన విషయమని, ఆ భాగవత రహస్యం ఆపరమాత్మకే తెలియాలి. అందుకని భారం ఆయనపైనే వేసి, వ్యాస భాగవత వ్యాఖ్యాతయైన శ్రీధరుణ్ని ఆలంబనం చేసుకొని తెలియవచ్చినంత తేటపరిచాడు పోతన. తాను రచించదలచిన శైలిని గురించి చెపుతూ

**క॥ కొందఱికి దెనుగు గుణమగు**
**గొందరికి సంస్కృతంబు గుణమగు, రెందున్**
**గొందరికి గుణములగు, నే**
**నందఱమెప్పింతుఁ గృతుల నయ్యెయెడలన్".**

ఆయా సందర్భాలను బట్టి అందరినీ మెప్పిస్తానని అన్న మాటలో ఎంతో వినయం, విశ్వాసం ఒదిగి ఉంది. సంస్కృత గుణం, తెలుగుదనం భాగవతం నిండా పరచుకొని కనిపిస్తాయి. వేయినిగమాలు చదివినా సుగమం కాని ముక్తి, భాగవత నిగమాన్ని పఠిస్తే అత్యంత సుగమం అవుతుందని విశ్వసించి, ఆ ముక్తివాంఛతోనే భాగవతాన్ని రచిస్తున్నానని చెపుతూ

**శా॥ శ్రీ కైవల్య పదంబు జేరుటకునై చింతించెదన్ లోకర**
**క్షైకారంభకు భక్తపాలన కళా సంరంభకున్ దానవో**
**ద్రేకస్తంభకు గేళిలోల విలసద్దృగ్జాల సంభూత నా**
**నాకంజాతభవాండ కుంభకు మహానందాంగనా డింభకున్"**

అని నాందీ శ్లోకంలా ఆరంభంలో పేర్కొన్నాడు. ఈ పద్యంలో నమస్క్రియతో పాటు వస్తు నిర్దేశం కూడా ఉంది. కథానాయకుడు నందనందనుడు, లోక రక్షణమే అతని అవతారాలకు ప్రేరణ, భక్తుల్ని పాలించే కళా సంరంభం, దానవోద్రేకాన్ని స్తంభింపచేయడం ఆయన లక్షణం. ఇలా కేళిలోల విలస దృగ్జాల సంభూత నానా కంజాత భవాండ కుంభకున్" అనటంలో సృష్టిస్థితి కారుణ్ని ప్రస్తావించడం గమనించవచ్చు. ఇలా భవబంధరాహిత్యాన్ని, జన్మ సాఫల్యాన్ని, కోరుతూ కైవల్య సాధకంగా భాగవతాన్ని పోతన భావించడం గమనించవచ్చు.

పూర్వకవులతో పాటు, వర్తమాన కవుల్ని, వీరితో పాటు భావికవుల్ని కూడా సంభావించిన వ్యక్తిత్వం పోతన్నది. సమకాలీ కవులంటేనే పెద్దగా పట్టించుకోని సందర్భాలలో పుట్టని కవుల్ని కూడా ప్రస్తుతించడం పోతన వ్యక్తిత్వపు గొప్పదనం. భాగవత కల్పతరువును పోతన భావించిన తీరు చూడండి.

**మ॥ లలితస్కంధము, కృష్ణమూలము, శుకాలాపాభిరామంబు మం**
**జులతాశోభితమున్, సువర్ణసుమనస్సుజ్ఞేయమున్, సుందరో**
**జ్జ్వలవృత్తంబు, మహాఫలంబు, విమల వ్యాసాలవాలంబునై**
**వెలయున్, భాగవతాఖ్య కల్పతరువుర్విన్ సద్ద్విజశ్రేయమై** (1-22)

విమల వ్యాసాలవాలమైన భాగవత కథల్లో ఉపాఖ్యానాల్లో పోతన్న మూలాతిరిక్తంగా పెంచిన పట్టుల్నిబట్టి, పేర్చిన పద్యాలను బట్టి, పోతన వ్యక్తిత్వం ఊహించవచ్చు. గజేంద్రుని సంవేదనలో, ప్రహ్లాదుని నిశ్చయంలో, గోపికల ఉద్వేగంతో, వామనుని ఉత్తేజంలో నవ విధభక్తిభావవికాసంలో – పోతన్నే కనిపిస్తాడు. మూలాన్ని మరచి, ఆయా భక్తుల పాత్రలలో లీనమైపోయి, పరవశించి, మూలాతిరిక్తంగా పద్యాల సంఖ్యను పెంచి, ప్రతిభా సమున్మేషంగా రచించిన సందర్భాలు భాగవతంలో ఎన్నో ఉన్నాయి.

ఇటువంటి భాగవతంలో ఉన్న పన్నెండు స్కంధాలలో, పోతన వ్రాసినవి ఎనిమిది స్కంధాలే.. మిగిలినవి ఇతరులు వ్రాశారు. ఒకటి నుండి నాలుగు, ఏడు నుండి పదిస్కంధాలను పోతనగారు వ్రాశారు. పంచమ స్కంధాన్ని బొప్పరాజు గంగన, షష్ఠస్కంధాన్ని ఏర్చూరి సింగన, ఏకాదశ ద్వాదశ స్కంధాలను వెలిగందల నారయ వ్రాశారు. ఇలా ఇంతమంది భాగవతాన్ని వ్రాయటానికి గల కారణాన్ని పండితులు రకరకాలుగా ఊహించారు.

**మల్లంపల్లి సోమశేఖర శర్మ:** పోతన లోకాంతరగతుడు కావటం వల్లనే ఏకాదశ ద్వాదశ స్కంధాలు పోతన రచించక పోయిఉండవచ్చు. పంచమ షష్ఠస్కంధాలు ఉత్పన్నమవటానికి రాజకీయ పరిస్థితులే కారణం కావచ్చు.

**నిడదవోలు వెంకటరావు:** పోతన మొదటి నాలుగు స్కంధాలు రచించాక, సప్తమ, అష్టమ, నవమ, దశమ స్కంధాలు తానే రచించదలచి పంచ, షష్ఠ స్కంధాలను గంగన సింగనకిచ్చి రచించమని కోరిఉండవచ్చు. దశమ స్కంధం పూర్తయ్యేసరికి చాలాకాలం పట్టటం చేత, ఏకాదశద్వాదశ స్కంధాలను తన శిష్యుడైన వెలిగందల నారయకిచ్చి ఉండవచ్చు.

ఖండవల్లి వారు, పింగళివారు నిడుదవోలు వారితో ఏకీభవించారు. రాళ్లపల్లి వారు మాత్రం సర్వజ్ఞసింగభూపాలుడే అంకితమివ్వలేదని కోపంతో పాతిపెట్టించాడని, క్రిములు దానిని ధ్వంసంచేశాయని,

గ్రంథాన్ని పైకి తీశాక నష్టభాగాల్ని మిగిలిన వాళ్లు గురువుమీద, గ్రంథం మీద ఉన్న గౌరవంతో పూరించారని విశ్వసించారు. భాగవతాన్ని పాతిపెట్టటమనే కథను ప్రచారం చేసిన వాడు కూచిమంచి తిమ్మకవి.

**భోగినీదండకం:**

**కర్తృత్వం:** తెలుగు సాహిత్యంలో పోతన పేరుతో వివాదాస్పదమైన గ్రంథాలలో భోగినీ దండకం ఒకటి. పోతన్న పేరు చెపితేనే " "తెలుగుల పుణ్యాల పేటి" – అంటు పరవశించే తెలుగువాళ్లు నరాంకితం చేయని పోతన వేశ్యపై దండకాన్ని రాయడం అసంభవమని భావించి, ఇది పోతన' కృతం కాదని తిరస్కరించారు. దండకంలో ఎక్కడా పోతన్న పేరులేదు. కాని గ్రంథాంతంలో పోతన రచించినట్లు తెలిపే పద్యం ఒకటి ఉంది.

**ఉ॥ పండితకీర్తనీయుడు బమ్మెర పోతన యాసుధాంశుమా**
**ర్తాండకులాచలాంబునిధి తారకమై విలసిల్లభోగినీ**
**దండకమున్ రచించె బహుదాన విహర్తకు రావు సింగభూ**
**మండలభర్తకున్ విమతమానవనాథమదాపహర్తకున్".**

ఒక వేశ్య సింగభూపాలుడనే రాజును వలచి, వలపింపచేసుకోవడం భోగినీదండకంలోని ప్రధాన ఇతివృత్తం. గోపాల దేవోత్సవ క్రీడలో పాల్గొన్న సింగభూపాలుణ్ని, వారకాంత, మేడలో నుండి చూసి మోహిస్తుంది. తల్లి ఎంత చెప్పినా వినకుండా తల్లిని తిరస్కరించి, తన సోదరిని పంపి సింగభూపాలుణ్ణి తీసుకురమ్మని సందేశం పంపడం, రాజువచ్చి, భోగినీపట్టం కట్టి ఆమెను స్వీకరించటం ఇందులోని ఇతివృత్తం. సరిగా ఈ భోగినీ దండకంలోని ఇతివృత్తాన్ని పోలినటువంటిదే తమిళంలో 'ఉలా ప్రబంధం' – అనే ప్రక్రియ ఉంది. బహుశా వైష్ణవ దీక్ష నొసగిన వైష్ణవ స్వాముల వలన ఏమైనా ఈ ఉలా ప్రబంధాన్ని గురించి గ్రంథ కర్త విని ఉ ండవచ్చునేమో! ఈ గ్రంథం పోతన రచన కాదా? అవునా? అనటానికి పోతన గారి భాగవతంతో పోల్చి పరిశీలిస్తే ఇది పోతన కృతమేనని స్పష్టంగా తెలుస్తుంది.

**వీరభద్ర విజయము:**

పోతన పేరుతో చలామణి అవుతున్న గ్రంథమిది. చాలా మంది సాహితీవేత్తలు దీనిని పోతన బాల్యకృతిగా భావించారు. అలా భావించటం వీరభద్ర విజయాన్ని పూర్తిగా చదవకుండా చేసిన నిర్ణయమేని పోతన శ్రీమహాభాగవతంలో దక్షాధ్వర ధ్వంస రచన సందర్భంగా శివనింద చేసి తద్దోషపరిహారంగా వీరభద్రవిజయ గ్రంథాన్ని రచించాడు అని తెలిపే

**ఉ॥ "భాగవత ప్రబంధమతి భాసురతన్ రచియించి దక్షదు**
**ర్యాగ కథా ప్రసంగమున నల్పవచస్కుడనైతి దన్నిమి**
**త్తాగత వక్త, దోష పరిహారముకై యజనైక శైవ శా**
**స్త్రాగము వీరభద్ర విజయంబు రచించెద పేరు నామదిన్"** (వీర.వి. 1-41)

అనే పద్యం వీరభద్ర విజయంలో ఉంది. పాత్ర ముఖంగా చేసిన నింద నింద కాదు. ఇంతా చేసి వీరభద్ర విజయంలో దక్షుడు దాక్షాయణితో శివుని గూర్చి పల్కిన పల్కులు భాగవతంలోని శివనిందను మించి ఉన్నాయి.

**సీ॥ కట్టంగ దిక్కులేకాని కోకలు లేవు.**
**పూయగంధము లేదు విభూతి గాని**

**కాలకూటమే కాని కంఠమాలిక లేదు.**

**పడిగాని తొడుగంగ మణులు లేవు.**

**తలకు బువ్వులు లేవు నెలయ కాని**

**యెక్క గుఱ్ఱము లేదు నెద్దు గాని,**

**ఆ.వె. "మూడు మూర్తులందు మొగి నెవ్వడును గాడు**

**జాతిలేదు పుట్టు జాడలేదు**

**పరము దొంటిగాడు బ్రహ్మాదు లెఱుగరు**

**తిరుగు జోగిదగునె దేవుడనగ.** (వీర. వి -1-137)

ఎవరో రచించి పోతన పేరు పెట్టిన గ్రంథమిది. శ్రీమన్మహామహేశ్వర యివటూరి సోమనారాధ్య దివ్య శ్రీపాద పద్మారాధకునిగ పోతన పేర్కొనబడటం, భాగవతంలో ప్రతిపాదించబడిన శివకేశవాభేదం, వీరభద్ర విజయంలో పాటించక పోవడం వంటి కారణాల వల్ల కూడా వీరభద్ర విజయం పోతన రచన కాదని తెలుస్తుంది. గురజాడ శ్రీరామమూర్తి గారు కవి జీవితములు అనే గ్రంథంలో ఈ అభిప్రాయాన్నే వ్యక్తం చేశారు.

**నారాయణ శతకం :**

పోతనగారి పేరుతో ప్రచారంలో ఉన్న శతకాలలో నారాయణ శతకం ఒకటి. ఇందులోని పద్యాలు కొన్ని భాగవత పద్యాల ఒరవడిలో కనిపిస్తాయి. ఉదా॥

మ॥ ధర సింహాసనమై నభంబు గొడుగై తద్దేవతల్ భృత్యులై

పరమామ్నాయము లెల్ల వందిగణమై బ్రహ్మాండ మాగారమై

సిరి భార్యామణియై విరించి కొడుకై శ్రీగంగ సత్పుత్రియై

వరుస న్నీఘనరాజసంబు నిజమై వర్ధిల్లు నారాయణా!

శా॥ నీపుత్రుండు చరాచర ప్రతతుల న్నిర్మించి పెంపారఁగా

నీపుణ్యాంగన సర్వజీవతతుల న్నిత్యంబు రక్షింపఁగా

నీపాదోదక మీజగత్త్రయముల న్నిష్పాపులం జేయఁగా

నీపెంపేమని చెప్పవచ్చు సుగుణా! నిత్యాత్మ నారాయణా!

ఈ పై పద్యాలు పోతన హృదయ స్పర్శను తెలియజేస్తున్నాయి.

# పాఠ్యభాగ సారాంశం

నాభాగుని కుమారుడు అంబరీషుడు. భూలోకానికి చక్రవర్తియై అంతులేని సంపదతో జ్ఞానియై ప్రకాశిస్తున్నాడు. ఈ ప్రపంచంలోని వస్తువులు అశాశ్వతమని అవి మానవుల వివేకాన్ని మింగిస్తాయనే యెరుకతో ప్రపంచమంతా స్వప్న తుల్యంగా భావించేవాడు. మహారాజుగా సకల భోగాలు అనుభవిస్తున్నప్పటికీ అవన్నీ అశాశ్వతమని చిరకాలం ఉండవని తెలిసి ప్రాపంచిక విషయాలలో చిక్కుకొనకుండా జీవిస్తున్నాడు.

నాభాగునికి తగిన పుత్రుడు అంబరీషుడు. ఎల్లప్పుడూ మనస్సును బ్రహ్మవిద్య యందే లగ్నంచేసి. నారాయణునిపై విశేషమైన భక్తితో ఉండటంచేత ఈ భౌతిక ప్రపంచపు ఆకర్షణలు ఒక మట్టి ముద్ద మాత్రమేయని గుర్తించటం అంబరీషునికి తేలికైంది. పరమ భాగవతుడై నారాయణుని పాదపద్మాలను నిరంతరం మనసున ధ్యానిస్తూ, నోటితో నారాయణ కీర్తనలను ఆలపిస్తూ, భగవంతుని మందిరములో సేవలు చేయటానికే తన చేతులను వినియోగిస్తూ, భాగవత కథలను వినటానికి తన చెవులు ఉన్నాయని భావిస్తూ, కన్నులు దేవాలయంలో భగవంతుని ప్రతిమలను గాంచి ఆనందించడానికేనని తలచే అంబరీషుని పాదాలు పవిత్ర స్థలాలకు వెళ్ళటానికి మాత్రమే ఉత్సాహపడేవి. అటువంటి నారాయణ భక్తుడైన అంబరీషుడు ఈ భూమిని కడు సమర్థంగా పరిపాలిస్తున్నాడు.

వశిష్ఠుడు, గౌతముడు తోడుగా సరస్వతీ నదీతీరంలో అశ్వమేధ యాగం చేశాడు. భాగవతుల అనురాగంతో వారిసేవా భాగ్యంతో ఈ లోకంలో జీవించే అంబరీషుని నారాయణుడు మెచ్చుకొని తన సుదర్శన చక్రాన్ని అంబరీషునకు ప్రసాదించాడు. ఆ చక్రం అంబరీషుని అతని రాజ్యాన్ని రక్షిస్తుండగా ఏ వెలితి లేకుండా కాలాన్ని గడుపుతున్నాడు. ఒకనాడు ద్వాదశీ వ్రత మాహాత్మ్యాన్ని గురించి అంబరీషుడు విన్నాడు. భార్యా సమేతుడై ఒక సంవత్సర కాలం ఈ ఏకాదశీ వ్రతం ఆచరించి, వ్రతం ముగిసేముందు కార్తీక మాసంలో మూడు రోజులు ఉపవాసం చేశాడు. తర్వాత నదిలో పవిత్ర స్నానం చేసి, మధు వనానికి పోయి నారాయణుని పూజించాడు. బ్రాహ్మణులకు గో, సువర్ణ దానాలు చేసి తన గృహానికి వచ్చి భార్యతో సహా ప్రక్కన కూర్చుని ఉపవాస విరమణ చేయటానికి సిద్ధపడ్డాడు. ఆ సమయంలో దుర్వాస మహర్షి అక్కడకు వచ్చాడు.

అంబరీషుడు లేచివెళ్ళి, దుర్వాస మహర్షికి తగిన ఆసనం ఏర్పరచి అర్ఘ్య పాద్యాది ఆచమనములతో గౌరవించాడు. సాష్టాంగ దండ ప్రణామం చేసి పూజించాడు. తన అతిథ్యం స్వీకరించి భోజనం చేయవలసినదని ప్రార్థించాడు. రాజు వినయానికి దుర్వాస మహర్షి సంతసించి ఇలా అన్నాడు. "నీ ఆతిథ్యం తప్పక స్వీకరిస్తాను. ముందుగా నదికి వెళ్లి ఉదయ సంధ్య పూర్తిగావించుకొని వస్తాను" అని పలికి దుర్వాసుడు నదిలో అఘమర్షణ స్నానమాచరించి, మంత్ర సూక్తాలను పఠిస్తూ నదిలోనుండి బయటకు రాలేదు. అంతలో ద్వాదశి ఘడియలు పూర్తి కావచ్చాయి. దానితో రాజు చిక్కు పరిస్థితిలో పడ్డాడు. అతని ద్వాదశి వ్రతం సఫలం కావటానికి ద్వాదశి ఘడియలు అంతమయ్యే లోపుగా "పారణ" (అనగా ద్వాదశి భోజనం) తప్పక చేయాలి. ద్వాదశి భోజనం తప్పనిసరి మాత్రమే కాదు అలా చేయకపోతే మిక్కిలి పాపమని చెప్పటం చేత ఏమి చేయాలో తోచక రాజు బ్రాహ్మణుల సలహాను కోరాడు. వారు తులసి తీర్థం పుచ్చుకుంటే అటు పారణ ఫలము ఇటు అతిథిని గౌరవించిన ఫలము దక్కుతాయని అలా చేస్తే పాపం అంటదని సలహా ఇచ్చారు. వాళ్ళు చెప్పినట్లే తులసి తీర్థం తీసుకుని దుర్వాస మహర్షి రాకకై అంబరీషుడు ఎదురుచూడ సాగాడు.

తిరిగివచ్చిన దుర్వాసుడిని రాజు సాదరంగా ఆహ్వానించాడు. దుర్వాసుడు తన మనోనేత్రంతో జరిగిన విషయాన్ని తెలుసుకొన్నాడు. రాజు అతిథి వచ్చే వరకు వేచి ఉండక పారణ పూర్తిచేసి అతిథిని అవమానించాడని దుర్వాసుడు ఆగ్రహావిష్టుడయ్యాడు. కోపంతో దుర్వాసుని శరీరమంతా కంపించింది. కళ్ళు ఎర్రబడ్డాయి. రాజుతో "నీవు అధికార సంపదలతో మదించి ఉన్నావు నీకు అతిథిని గౌరవించటం తెలియదు. అహంభావంతో మిడిసిపడుతున్నావు. అతిథిని అవమానించినందుకు ఇప్పుడే నీకు గుణపాఠం చెప్పి శిక్షిస్తాను అని జడలు కట్టిన తన తలనుండి ఒక వెంట్రుకను లాగి, దానికి జీవంపోసి దానికి కృత్య అనేపేరుపెట్టి అంబరీషునిపైకి పంపాడు. కృత్య కత్తిని ధరించి అంబరీషునిపైకి వడివడిగా వెళ్లి సమీపించింది. అయినప్పటికీ అంబరీషుడు చెక్కుచెదరక నిలబడి చూస్తున్నాడు. ఇంతలో సుదర్శన చక్రం ప్రత్యక్షమై దుర్వాసుడు సృష్టించిన కృత్యను దగ్ధం చేసింది. ఇది చూచి దుర్వాసుడు అచ్చెరువొందాడు. సుదర్శన చక్రం అంతటితో ఆగలేదు దుర్వాసుడిని వెంటాడింది.

సుదర్శనచక్రం నుండి తప్పించుకోవటానికి దుర్వాసుడు పరిగెత్తాడు. సుదర్శన చక్రం దుర్వాసుడిని వెంటాడుతూనే ఉంది. దుర్వాసుడు అడవికి పరుగెత్తగా, అరణ్యంలోని అగ్నిలా సుదర్శన చక్రం వెంబడించింది. మేరుపర్వతంలోని ఒక గుహలోనికి దుర్వాసుడు ప్రవేశించగా తిరిగి చక్రం అక్కడ ఎదురయ్యింది. తర్వాత స్వర్గంలోని ఇంద్రుని వద్దకు పోగా సుదర్శన చక్రం దుర్వాసుని తరుముకుంటూ వస్తున్నది. ఆ తర్వాత సృష్టికర్త బ్రహ్మ కడకేగి "రక్షించు! రక్షించు! నారాయణుని ఆయుధమైన సుదర్శన చక్రంబారి నుండి నన్ను రక్షించు!" అని ప్రార్థించాడు. అప్పుడు బ్రహ్మ నేను భగవంతుని సేవకుడను. నిస్సహాయుడను. నీకు నారాయణుని ఆయుధమైన సుదర్శన చక్రానికి మధ్య నేను జోక్యము చేసుకోలేనని అన్నాడు. ఆ తర్వాత మహాదేవుని వద్దకు వెళ్ళి రక్షించమని దుర్వాసుడు వేడగా "నారాయణుని వద్దకు వెళ్లి అతని పాదాలపైనే పడి ప్రార్థించమని మహాదేవుడు చెప్పాడు. వెంటనే అక్కడి నుండి దుర్వాసుడు వైకుంఠానికి పరిగెత్తాడు. అప్పుడు నారాయణుడు లక్ష్మీ సమేతుడై ఉండటాన్ని దుర్వాసుడు చూచి వారి పాదములపై పడి "దయచేసి నన్ను రక్షింపుము. నీ సుదర్శన చక్రం నుండి నన్ను విడిపింపుము. ఆ చక్రం నుండి వెలువడే వేడి తీవ్రతకు నేను తట్టుకొనలేకున్నాను. నేను దగ్ధము కాబోవుచున్నాను. నీవు మాత్రమే నన్ను రక్షించగలవు" అని విలపించాడు. అప్పుడు నారాయణుడు "ఇది ఎలా జరిగింది. ఈ విధముగా నా సుదర్శన చక్రం నిన్నెందులకు వెంబడిస్తున్నది. అంతయు వివరంగా చెప్పుము" అని అడిగాడు. సిగ్గుతో కుంచించుకు పోయిన ముఖంతో, మాటలు తడబడగా జరిగిన దంతా దుర్వాసుడు వివరించి చెప్పాడు. "నీ భక్తుని నేను బాధించితిని. అందుకు శిక్షగా ఈ సుదర్శన చక్రము. నన్ను వెంటాడుచున్నది. దయచేసి నన్ను రక్షింపుము. దేవాదిదేవుడైన నీకు అసాధ్యమేదియు లేదు. నా ప్రవర్తనకు నేను పశ్చాత్తాపపడుచున్నాను. నన్ను రక్షింపుము" అని వేడుకొన్నాడు.

నారాయణుడు చిరునవ్వుతో ఓ దుర్వాసా! బ్రహ్మ రుద్రులవలే నేను కూడా నిస్సహాయుడనని నీవు తెలుసుకోలేవా. నీకు నా గురించి పూర్తిగా తెలియదు. నాకు పూర్తి స్వేచ్ఛ లేదు. నా ఇష్టం వచ్చినట్లు చేస్తున్నట్లుగా గోచరించవచ్చును. కానీ మొట్టమొదట నేను నా భక్తుల ఆధీనములో ఉన్నాను. నా సర్వస్వము వారిదే. వారు సర్వస్వము త్యజించి నాకు శరణాగతులైనారు. వారు భార్యా పిల్లలు, ఇల్లు, బంధువులు అన్నిటిని వదిలి ఇహలోకముపై గాని పరలోకముపై గాని ఎటువంటి ఆలోచన చేయక, స్వర్గమును సైతము లెక్కచేయక నా అనుగ్రహమునే వారు కోరుచుందురు. అందుకు ప్రతిఫలముగా ఎట్టి పరిస్థితుల యందు వారిని వదిలివేయనని ప్రతిజ్ఞ తీసుకున్నాను. వారికి నా యందు గల భక్తియే నా మనసులో మొట్టమొదట మెదలును. తమ ప్రేమ చేత

వారు నన్ను జయించిరి. వారి ప్రేమ శక్తి ముందు నేను శక్తి హీనుడను. నాది అని ప్రత్యేకంగా నాకు ఏదియు లేదు. వారి సంతోషమే నా సంతోషము. వారి దుఃఖమే నా దుఃఖము. నేను భక్త పరాధీనుడనని ప్రసిద్ధికెక్కి ఉన్నాను. నాకు భక్తులపై ఉన్న మక్కువ కంటే నాపై నాకు గాని నా భార్యయైన లక్ష్మీ యందు గాని ఎక్కువ మక్కువ లేదు. అటువంటి పరిస్థితులలో వారితో యథాలాపముగా నేనెట్లు వ్యవహరించగలను? నా భక్తులను అవమానించిన నన్ను అవమానించినట్లే యగును. ఉత్తమ వనితలు తమ ప్రేమ చేత భర్తల నెట్లు బానిసలుగా చేసుకొందురో అటులనే భక్తులకు నేను బానిసను.

నీవు కూడా నాకు భక్తుడవే. అయితే ఈ చక్రాన్ని నేను ఉపసంహరింపజాలను. నిన్ను నీవు రక్షించుకొనుటకు ఏమి చేయవలెనో నీకు చెప్పెదను. నీకు ఒకే ఒక మార్గం గలదు. తిరిగి భూలోకమునకు వెళ్లి, నీ బాధకు గురి అయిన నా భక్తుడు అంబరీషుని పాదములపైబడి వేడుకొనుము. నాభాగుని పుత్రుడైన అంబరీషుడు నిన్ను క్షమించును. అప్పుడే సుదర్శన చక్రం వెనుకకు మరల గలదు. నీ కొరకు అంబరీషుడు ఈ చక్రమును ఉపసంహరించగలడు. ఆ విధముగా నీకు రక్షణ కలుగును" అని నారాయణుడు దుర్వాసునకు బోధించగా ముఖము వేలాడగా దుర్వాసుడు అంబరీషుని ఇంటి ద్వారము వద్దకు ప్రవేశించాడు. అంబరీషుని పాదాలను తన రెండు చేతులతో పట్టుకొన్నాడు. జరిగిన పరిణామానికి అంబరీషుడు ఆశ్చర్యపడ్డాడు. అప్పుడు. అంబరీషుడు భగవంతుని ప్రార్థించి సుదర్శన చక్రాన్ని ఉపసంహరింప చేశాడు. అప్పుడు అంబరీషుడు "ఓ సుదర్శనా నీకు నా ప్రణామములు నీవే అగ్ని. నీవే సూర్యుడు, నీవే చంద్రుడు, నీవే నక్షత్రములు, నీవే లోకమంతయు వ్యాపించి ఉన్నావు. కరుణా సముద్రుడైన నారాయణునికి ఇష్టమైన ఆయుధమవు, నీశక్తి వైభవము ముందు అస్త్రములన్నియు శక్తిహీనములు నీ పాదములకు నమస్కరించుచున్నాను. ఈ దుర్వాసుని క్షమించమని కోరుచున్నాను. నీవు దుష్టులను, దుష్టశక్తులను నిర్మూలించెదవు. నీ క్రోధము ఈ బ్రాహ్మణునిపై ప్రసరింపజేయకుము" అని ప్రార్థించాడు.

అంబరీషుని ప్రార్థనలకు సంతుష్టుడైన సుదర్శనుడు శాంతించి దుర్వాసుని వెంటాడటం మానాడు. మనసు మారిన దుర్వాసుడు అంబరీషునితో ఇలా అన్నాడు. "నీవు చాలా ఉదారపురుషుడవు. అకారణముగా నిన్ను బాధించిన నాతో సరళముగా ప్రవర్తించుట చాలా గొప్ప విషయము. నారాయణ భక్తుల గొప్పతనము గ్రహించినాను. తమ భక్తితో నారాయణుని ఆకట్టుకున్న భక్తులకు అసాధ్యమైనది ఏదియు లేదు. మనసులో ఎల్లప్పుడూ భగవంతుని రూపమును చింతించు నీ వంటి భక్తులు గంగా నది వలె పవిత్రులు, పరిశుద్ధులు. నీవు నన్ను చాలా దయతో చూచినావు. నేను పలికిన పరుష వాక్యములు విస్మరించి నన్ను రక్షించినావు". అని పాదాలపై పడగా అంబరీషుడు ఆ ఇరకాటపు పరిస్థితి నుండి దుర్వాసుని తప్పించటానికి ప్రయత్నించాడు. తన పట్ల తగిన గౌరవం చూపలేదని అంబరీషునిపై కోపగించిన దుర్వాసుడు, చివరకు తనను తాను రక్షించుకోవటానికి అంబరీషుని పాదాలపై పడవలసి వచ్చింది. ఇటువంటి సన్నివేశం ఇద్దరికి ఇబ్బంది కరమే! ఎలాగో ఆ క్షణం గడచిపోయింది.

దుర్వాసుడు ముల్లోకాలు తిరిగి అంబరీషుని వద్దకు వచ్చేసరికి ఒక సంవత్సర కాలం గడిచింది. ఆ సంవత్సర కాలమంతా రాజు ఒక మెతుకైనా తినలేదు. తన దుడుకు ప్రవర్తనకు ఫలితం ఎంత తీవ్రంగా ఉంటుందోనని ఊహించి దుర్వాసుడు, రాజును భోజనం చేయమని పదే పదే కోరాడు. అయితే అతిథిని మొదట గౌరవింపవలెనని రాజు ఉద్దేశం. అది గ్రహించిన దుర్వాసుడు సంతుష్టమనస్కుడై హృదయంలో ఆనందముప్పొంగగా అంబరీషుని ఆతిథ్యం స్వీకరించటానికి అంగీకరించాడు. దుర్వాసమహర్షి భుజించి సంతుష్టుడైన పిదప అంబరీషుడు భోజనం చేశాడు. అప్పుడు దుర్వాసుడు ఇలా అన్నాడు. "నారాయణ భక్తుడవైన నీతో పరిచయము కలిగిన నేను

అనుగ్రహము పొందినాను. ఈ సంఘటన మన ఇద్దరి చరిత్రలు చిరకాలం ఈ లోకములో నిలిచి పోవునట్లు చేయగలదు". అని రాజు వద్ద సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు. అంబరీషునకు జరిగినదంతా ఒక స్వప్నంలా తోచింది. దుర్వాసుని రాక, అతని ఆగ్రహం, సుదర్శన చక్రం అతనిని వెంబడించటం, చివరకు పశ్చాత్తాప పడటం, ఈ విచిత్రాలన్నీ అంబరీషుడు తలచుకొని తనలో ఇలా అనుకొన్నాడు. "ఇదంతయు భగవంతుని లీల. దీని వెనుకనున్న ప్రయోజనము ఎవరూ ఎరుగలేరు కదా"! ఇలా భగవంతుని సేవ కంటే భాగవత సేవ విశిష్టమని చెప్పటానికి అంబరీషోపాఖ్యానము భాగవతంలో చెప్పబడింది.

# ప్రతిపదార్థ తాత్పర్యాలు

**శా॥ సప్తద్వీపవిశాల భూ భరము దోః స్తంభంబునం బూని సం**
**ప్రాప్తశ్రీయుతుఁడై మహావిభవ సంపచ్చాతురిం గల్గి దు**
**ర్వ్యాప్తిం జెందక వైష్ణవార్చనల మేరం గాలముం బుచ్చుచున్**
**సుప్తిం బొందక యొప్పె సద్గుణ గరిష్ఠుం డంబరీషుం డిలన్.** (9-81)

**కవి పరిచయం**: ఈ పద్యం బమ్మెర పోతనామాత్యునిచే రచించబడిన ఆంధ్రమహాభాగవతము నవమ స్కంధము నుండి గ్రహింపబడిన 'అంబరీషోపాఖ్యానము" అనే పాఠ్యభాగంలోనిది.

**సందర్భం:** పరీక్షిన్మహారాజుకు భాగవత కథను వినిపిస్తూ శ్రీ శుకమహర్షి, నాభాగుని పుత్రుడైన అంబరీషుని గొప్పతనాన్ని చెప్పే సందర్భంలోనిది.

| | | |
|---|---|---|
| **ప్రతిపదార్థం:** | సప్తద్వీప | = సప్తద్వీపములతోకూడిన |
| | విశాల | = విశాలమైన; |
| | భూ | = భూమండల; |
| | భారమున్ | = బాధ్యతను; |
| | దోః | = భుజములు అనెడి; |
| | స్తంభంబునన్ | = స్తంభములపైన; |
| | పూని | = ధరించి; |
| | సంప్రాప్త | = లభించిన; |
| | శ్రీయుతుండు+ఐ | = శుభములుగలవాడయి; |
| | మహావిభవ | = రాజభోగములు; |
| | సంపత్ | = సంపదలు; |
| | చాతురిన్ | = చాతుర్యము; |
| | కల్గి | = పొంది; |
| | దుర్వ్యాప్తిన్ | = చెడునడతను; |
| | చెందక | = లోనుగాక; |
| | వైష్ణవ | = హరి; |
| | అర్చనలన్ | = పూజలందు; |
| | మేరన్ | = మాత్రమే; |
| | కాలమున్ | = సమయమంతను; |
| | పుచ్చుచున్ | = గడుపుతూ, |
| | సుప్తిన్ | = ఏమరుపాటును; |
| | పొందక | = చెందకుండగ; |

| | |
|---|---|
| సద్గుణ | = మంచిగుణములతో; |
| గరిష్ఠుండు | = గొప్పవాడు; |
| అంబరీషుండు | = అంబరీషుడు; |
| ఇలన్ | = ఈలోకమునందు |
| ఒప్పెన్ | = పేరుపొందెను; |

**తాత్పర్యం:** సప్తద్వీపాలతో కూడిన ఈ భూభారాన్ని తన భుజస్తంభాలపై వహించి, శుభాలు పొంది, రాజభోగాలను సంపదలను అనుభవిస్తూ కూడా గర్వం పొందక, హరిపూజలతోనే కాలాన్ని గడుపుతూ ఏమరుపాటు లేకుండా జీవితాన్ని గడుపుతూ సద్గుణాలతో పేరుకెక్కాడు.

**సంధులు:** సంపత్ + చాతురిన్ = సంపచ్చాతురిన్ (శ్చుత్వసంధి)
దుః + వ్యాప్తి = దుర్వ్యాప్తి (రేఫాదేశ విసర్గసంధి)
సుప్తిన్ + పొందప = సుప్తింబొందక (ద్రుతసంధి)

**సమాసాలు:** దోస్తంభములు : భుజాలనేస్తంభాలు (రూపకం)
వైష్ణవార్చనలు : విష్ణువుయొక్క అర్చనలు (షష్ఠీతత్పురుష సమాసం)
సప్తద్వీప విశాల భూభరము : సప్తద్వీపాలతో కూడిన విశాలమైన భూమియొక్క భారము (తత్పురుష)
సద్గుణ గరిష్ఠుడు : సద్గుణాల చేత గరిష్ఠుడు (తత్పురుష సమాసం)

**విశే:** 'సప్తద్వీపావసుంధరా' – అని ప్రాచీనులు భూమండలం మొత్తం సప్తద్వీపాలతో కూడి యుందని భావించేవారు. అవి 1) జంబూద్వీపం, 2) ప్లక్ష, 3) శాల్మలీ, 4) కుశ, 5) క్రౌంచ, 6) శాక, 7) పుష్కర అనే ఏడు ద్వీపాలు.

**ఛందస్సు:** UUUIIU IUI IIU UUI UUI U
**సప్తద్వీ | పవిశా | ల భూభ | రము దో | స్తంభంబు | నం బూని | సం**

1. ఇది శార్దూల వృత్త పద్యం. ఇందులో నాలుగు పాదాలుంటాయి.
2. 'మ–స–జ–స–త–త–గ' అనే గణాలు వరుసుగా వస్తాయి.
3. యతి స్థానం 13 వ అక్షరం
4. ప్రాసనియమముంది.

శా॥ **పా లేఖై ప్రవహింప దగ్గఱుచు లేఁ బ్రాయంబులున్ రూపము**
**ల్మేలై ధూర్తలు గాక వెండిగొరిజ ల్హేమోరు శృంగంబులుం**
**గ్రాలం గ్రేపుల యఱ్ఱు నాఁకుచును రంగచ్చేలలై యున్న మం**
**దాలన్ న్యర్బుదషట్క మిచ్చె విభుఁ దుద్యద్వేదిక శ్రేణికిన్.** (9–92)

**కవి పరిచయం:** ఈ పద్యం బమ్మెర పోతనామాత్యునిచే రచించబడిన ఆంధ్రమహాభాగవతము నవమ స్కంధము నుండి గ్రహింపబడిన 'అంబరీషోపాఖ్యానము" అనే పాఠ్యభాగంలోనిది.

**సందర్భం:** అంబరీషుడు ఏకాదశీ వ్రతం చేసి, వ్రత సమాప్తికై మూడురోజులు ఉపవసించి, మధువనంలో హరికి అభిషేకాది అర్చనలు చేసి, విప్రులకు లెక్కలేనన్ని గోవుల్ని దానం చేశాడని చెప్పే సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం:** పాలు = క్షీరములు;

ఏట్రై = కాలువలుగట్టి;

ప్రవహింపన్ = పారెడివు;

అంగ = శరీరములు;

రుచులున్ = కాంతులుగలవి;

ప్రాయంబులున్ = మంచివయసులో నున్నవి;

రూపముల్మేలై = రూపములు స్వరూపములు;

మేలు+ఐ = మంచిగానున్నవి అయ్యి;

ధూర్తలు = పొగరుమోతువి;

కాక = కానివి;

వెండి = వెండి తొడుగులుగల;

గొరిజలున్ = కాలిగిట్టలు;

హేమ = బంగారుకుప్పెలుగల;

ఉరు = పెద్ద,

శృంగంబులున్ = కొమ్ములుతో;

క్రాలన్ = విలసిల్లుతుండగా;

క్రేపులన్ = దూడల;

అఱ్ఱు = మెడవంపును;

నాకుచునున్ = నాకుతూ;

రంగత్ = మెరుస్తున్న

చేలలు + ఐ = వస్త్రములుగలవయ్యి;

ఉన్న = ఉన్నట్టి;

మందాలన్ = పాడి పశువులను;

న్యర్బుదషట్కము = ఆరువందలకోట్లు;

విభుడు = రాజు;

ఉద్యత్ = మిక్కిలి;

వైదిక = వేదజ్ఞానముగలవిపుల;

శ్రేణికిన్ = సమూహనికి;

ఇచ్చెన్ = దానముచేసెను.

**తాత్పర్యం:** పాలు ధారలై ప్రవహించేవి, మంచి కాంతిగలిగినవి, వయసులో ఉన్నవి, మేలైన రూపంతో ఉన్నవి, పోట్లమారితనంలేనివి, వెండి తొడుగులతో కూడిన కాలిగిట్టలతో, బంగారు తొడుగులతో కూడిన కొమ్ములతో విలసిల్లేవి అయిన దూడల్ని, మెరుస్తున్న వస్త్రాలతో అలంకరింపబడి అఱ్ఱునాకుతున్న ఆవులను ఆరువందల కోట్లను వేదవిదులైన విప్రుల సమూహానికి అంబరీషుడు దానం చేశాడు.

**సంధులు:** లేత + ప్రాయంబులున్ = లేఁబ్రాయంబులున్ (ప్రాతాది సంధి)
రంగత్+ చేలలై = రంగచ్చేలలై (శ్చుత్వసంధి)

**సమాసాలు:** లేఁబ్రాయంబు : లేతదైన ప్రాయంబు (కర్మధారయ సమాసం)
వెండిగొరిజలు : వెండితో చేయబడిన గొరిజల తొడుగులు (కర్మధారయ సమాసం)
హేమోరుశృంగంబులు : బంగారుతో చేయబడిన కొమ్ముల తొడుగులు (కర్మధారయ సమాసం)

**ఛందస్సు:** U U U I I U I UI I I U U U I U UI U
**పా లేతై | ప్రవహిం| ప దగ్గ | ఱుచు లేఁ | బ్రాయంబు| లున్ రూప | ము**

1. ఇది శార్దూల వృత్త పద్యం. ఇందులో నాలుగు పాదాలుంటాయి.
2. 'మ-స-జ-స-త-త-గ' అనే గణాలు వరుసుగా వస్తాయి.
3. యతి స్థానం 13 వ అక్షరం
4. ప్రాసనియమముంది.

**విశే:** ప్రాచీన కాలంలో గోవును దానమిచ్చేటప్పుడు ఎలా అలంకరించి ఇచ్చేవారో తెలుపుతుందీ పద్యం. ఈ పద్యంలో ప్రస్తావించిన 'న్యర్బుద' - మనే పదం ప్రాచీన సంఖ్యావిధానంలోని సంఖ్యా పదాన్ని తెలుపుతోంది. 'అయుతము' అంటే పదివేలు, 'నియుతము' అంటే లక్ష, 'ప్రయుతము' అంటే పది లక్షలు, 'అర్బుదము' అంటే $10^{11}$, 'న్యర్బుదము' అంటే $10^{12}$... ఇలా ఉండేవి.

శా॥ **ఏలోకంబున కైన వెంటఁబడి తో నేతెంచు చక్రానల**
**జ్వాలల్ మానుపువారు లేమిఁ జని దేవజ్యేష్ఠు లోకేశు వాఁ**
**డాలోకించి "విధాత! విశ్వజనన వ్యాపార పారీణ రే ఖా**
**లీలేక్షణ! కావవే కరుణఁ జక్రంబు న్నివారింపవే."** (9-108)

**కవి పరిచయం**: ఈ పద్యం బమ్మెర పోతనామాత్యునిచే రచించబడిన ఆంధ్రమహాభాగవతము నవమ స్కంధము నుండి గ్రహింపబడిన 'అంబరీషోపాఖ్యానము" అనే పాఠ్యభాగంలోనిది.

**సందర్భం:** దుర్వాసునిపైకి వచ్చే సుదర్శన చక్రం వదలక ఏలోకానికి వెళ్లినా వెన్నంటి రావటంతో, భయపడి బ్రహ్మలోకం వెళ్లిన దుర్వాసుడు బ్రహ్మతో మొఱపెట్టుకునే సందర్భంలోనిదీ పద్యం.

| **ప్రతిపదార్థం:** | | |
|---|---|---|
| | ఏలోకంబునకున్ + ఐనన్ | = ఎటువంటి లోకానికైనా; |
| | వెంటబడి | = వెనుదగిలి; |
| | తోన్ | = కూడ; |
| | ఏతెంచున్ | = వచ్చును; |
| | చక్ర | = చక్రము అనెడి; |
| | అనల | = అగ్ని; |
| | జ్వాలల్ | = మంటలను; |
| | మానుపువారు | = ఆపగలిగిన వారు; |
| | లేమిన్ | = లేకపోవుటచేత, |

| | |
|---|---|
| చని | = వెళ్ళి; |
| దేవశ్రేష్ఠున్ | = బ్రహ్మదేవుని (దేవశ్రేష్ఠుడు – దేవతలలో శ్రేష్ఠుడు, బ్రహ్మ) |
| లోకేశున్ | = బ్రహ్మదేవుని (లోకేశుడు–లోకములకుప్రభువు, బ్రహ్మ) |
| వాడు | = అతను; |
| ఆలోకించి | = దర్శించి; |
| విధాత | = బ్రహ్మదేవుడు (విధాత– సర్వము సృజించువాడు, బ్రహ్మ); |
| విశ్వ | = లోకములను; |
| జనన | = సృష్టించెడి; |
| వ్యాపార | = పనిలో, |
| పారీణ | = నేర్పు; |
| రేఖా | = తీర్పులతో; |
| లీల + ఈక్షణ | = విలాసమైన దృష్టిగలవాడా; |
| కావవే | = కాపాడుము; |
| కరుణన్ | = దయతో; |
| చక్రంబున్ | = చక్రమును; |
| నివారింపవే | = ఆపుము. |

**తాత్పర్యం:** ఏ లోకానికైనా వదలకుండా వెంటబడి వస్తున్న చక్రపు అగ్నిజ్వాలల నుండి రక్షించే వారు లేక పోవటంతో, దేవతలలో పెద్దవాడైన బ్రహ్మవద్దకు పోయి 'ప్రపంచాన్ని సృష్టిచేసే ఓ విధాతా! కరుణించి చక్రబాధనుండి నన్ను రక్షించు' – అని వేడుకున్నాడు.

**సంధులు :** చక్రంబున్ + నివారింపవే = చక్రంబున్నివారింపవే (ద్రుత ద్విత్వసంధి)
వాడు + ఆలోకించి = వాడాలోకించి (ఉత్వసంధి)

**సమాసాలు:** దేవజ్యేష్ఠుడు : దేవతలలో జ్యేష్ఠుడు (తత్పురుష సమాసం)
లోకేశుడు : లోకాలకు ఈశుడు (తత్పురుష సమాసం)

**ఛందస్సు:** U U U  I I U  I U I  I I U  U U I  U U I  U
**ఏలోకం | బున కై | నవెంటఁ | బడి తో | నేతెంచు | చక్రాన | ల**

1. ఇది శార్దూల వృత్త పద్యం. ఇందులో నాలుగు పాదాలుంటాయి.
2. 'మ–స–జ–స–త–త–గ' అనే గణాలు వరుసుగా వస్తాయి.
3. యతి స్థానం 13 వ అక్షరం
4. ప్రాసనియమముంది.

**విశే:** సృష్ట్యారంభంలో శ్రీమహావిష్ణునాభికమలం నుండి బ్రహ్మ ఆవిర్భవించాడు. అందుకే 'దేవజ్యేష్ఠున్' – అని అనటం.

**మ॥ కర మర్థిన్ ద్విపరార్థ సంజ్ఞగల యీ కాలంబుఁ గాలాత్ముఁడై**
**సొరిదిన్ నిండఁగఁ జేసి లోకముల నా చోటున్ విభుం డెవ్వఁడో**
**పరిపూర్తిన్ గనుఁగ్రేవఁ గెంపుగదురన్ భస్మంబుగాఁ జేయు నా**
**హరిచక్రానల కీల కన్యుఁ డొకరుం దడ్డంబు గా నేర్చునే?** (9–110)

**కవి పరిచయం**: ఈ పద్యం బమ్మెర పోతనామాత్యునిచే రచించబడిన ఆంధ్రమహాభాగవతము నవమ స్కంధము నుండి గ్రహింపబడిన 'అంబరీషోపాఖ్యానము" అనే పాఠ్యభాగంలోనిది.

**సందర్భం:** అంబరీషునిపై కోపించి, కృత్యను ప్రయోగించిన దుర్వాసునిపైకి సుదర్శన చక్రము రాగా, ఊహించని దుర్వాసుడు పరుగుపరుగున బ్రహ్మలోకానికి పోయి బ్రహ్మను శరణుకోరగా బ్రహ్మ పలికిన సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం:**

| | |
|---|---|
| కరము | = మిక్కిలి; |
| అర్థిన్ | = ప్రీతితో; |
| ద్విపరార్థ | = ద్విపరార్థ (ద్విపరార్థ – రెండు పదార్థముల ప్రమాణముగలది, భూత భవిష్య లక్షణముగలది); |
| సంజ్ఞ | = అనెడిపేరు; |
| కల | = ఉన్నట్టి; |
| యీ | = ఈ |
| కాలంబున్ | = కాలమును; |
| కాలాత్ముడు + ఐ | = కాలస్వరూపుడయ్యి; |
| సొరిదిన్ | = క్రమముగ; |
| నిండగన్ | = పూర్తగునట్లు; |
| చేసి | = చేసి; |
| లోకములున్ | = లోకములు; |
| ఆ | = అవి ఉన్న; |
| చోటున్ | = ప్రదేశమును; |
| విభుండు | = ప్రభువు; |
| ఎవడో | = ఎవరైతే అతడు; |
| పరిపూర్తిన్ | = కాలమునిండాక; |
| కను + క్రేవన్ | = కళ్ళ కొనలందరి; |
| కెంపున్ | = ఎఱ్ఱదనము; |
| కదురన్ | = గద్దించగా |
| భస్మంబున్ + కాన్ | = కాలిబూడిదైపోవునట్లు; |
| చేయు | = చేసెడి; |
| ఆ హరిచక్ర | = ఆ విష్ణుచక్రము అనెడి; |

అగ్ని = నిప్పు;
కీలలకున్ = మంటలకు;
అన్యుడు = వేరేవాడు;
ఒకరుండు = ఇంకొకడు;
అడ్డంబున్ + కాన్ = అడ్డుపడటానికి
నేర్చునే = తగినవాడా! (సమర్థుడా)

**తాత్పర్యం:** భూత భవిష్యత్తులనే పేరుతో కాలము, కాలాత్ముడునై లోకాలను నింపి, కాలం తీరాక తన క్రీగంట కమ్మిన ఎర్రజీరలతో గద్దించినంతనే కాలి బూడిద చేసే విష్ణుచక్రాగ్నికి అడ్డుగా నిలబడగల వాడెవడు?

**సంధులు :** సొరిదిన్ + నిండగ = సొరిదిన్నిండగ (ద్రుతసంధి)
కను + క్రేవ = కనుగ్రేవ (ద్రుతసంధి)
అడ్డంబు + నేర్చునే = అడ్డంబుగానేర్చునే (గసడదవాదేశసంధి)

**సమాసాలు:** కనుఁగ్రేవ : కనులయొక్క గ్రేవ (తత్పురుష సమాసం)
చక్రానలలీల : చక్రమనే అనలం యొక్క లీల (రూపకం, తత్పురుషం)

**ఛందస్సు:** IIU UII UIU III UUU IUU IU
**కరమ | ర్థిన్ద్విప | రార్థసం | జ్ఞగల | యీకాలం | బుఁగాలా | త్ముఁడై**
1. ఇది మత్తేభవృత్తం. ఇందులో నాలుగు పాదాలుంటాయి
2. స-భ-ర-న-మ-య-వ అనే గణాలు వరుసగా వస్తాయి
3. యతిస్థానం 14వ అక్షరం
4. ప్రాస నియమం ఉంది.

శా॥ **ఆ వైకుంఠములోని భర్మ మణి సౌధాగ్రంబు పై లచ్చి దాం**
**గ్రేవన్ మెల్లన నర్మభాషణములం గ్రీడించు పుణ్యున్ హరిన్**
**దేవాధీశ్వరుఁ గాంచి "యో వరద! యో దేవేశ! యో భక్త ర క్షా**
**విద్యాపరతంత్ర! మానుపఁ గదే, చక్రానలజ్వాలలన్.** (9-115)

**కవి పరిచయం:** ఈ పద్యం బమ్మెర పోతనామాత్యునిచే రచించబడిన ఆంధ్రమహాభాగవతము నవమ స్కంధము నుండి గ్రహింపబడిన 'అంబరీషోపాఖ్యానము" అనే పాఠ్యభాగంలోనిది.

**సందర్భం:** అంబరీషునిపై కోపించి, కృత్యను ప్రయోగించిన దుర్వాసునిపైకి సుదర్శన చక్రము రాగా, ఊహించని దుర్వాసుడు పరుగుపరుగున బ్రహ్మలోకానికి పోయి బ్రహ్మను శరణుకోరగా బ్రహ్మ పలికిన సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం:** ఆ = ఆ
వైకుంఠములోని = వైకుంఠమందలి;
భర్మ = బంగారు;
మణి = రత్నాల;

| | |
|---|---|
| సౌధ | = భవనము; |
| అగ్రంబున్ | = డాబా; |
| పైన్ | = మీద; |
| లచ్చితో | = లక్ష్మీదేవితో, |
| క్రేవన్ | = పార్శ్యమునందు; |
| మెల్లన | = మెల్లిగ |
| నర్మభాషణములన్ | = సరసపుమాటలతో; |
| క్రీడించు | = ఆడుతున్న; |
| పుణ్యున్ | = నారాయణుని (పుణ్యుడు=పుణ్యమేతానైనవాడు విష్ణువు); |
| హరిన్ | = నారాయణుని; |
| దేవేశ్వరున్ | = నారాయణుని (దేవేశ్వరుడు = దేవతలకు దేవుడు, విష్ణువు); |
| కాంచి | = దర్శించి; |
| ఓవరదా | = ఓ వరాలిచ్చేవాడా! |
| ఓ దేవేశ | = ఓ దేవతాప్రభు; |
| ఓ భక్తరక్షా | = ఓ భక్తులను రక్షించె; |
| విద్యాపరతంత్ర | = నేర్పునందు లగ్నమైనవాడా; |
| చక్ర | = చక్రపు; |
| జ్వాలలన్ | =మంటలను |
| మానుపగదే | = పోగొట్టుము. |

**తాత్పర్యము:** ఆ వైకుంఠంలోని బంగారు రత్న సౌధంపై చివరిలో లక్ష్మీదేవితో నెమ్మదిగా సరససంభాషణ చేస్తూ క్రీడిస్తున్న దేవాదిదేవుడైన హరిని చూచి "ఓ వరదా! దేవేశ్వరా! భక్తరక్షా విద్యాపరతంత్రా! నన్నీ చక్రాగ్ని బారినుండి రక్షించు!" – అని దుర్వాసుడు వేడుకున్నాడు.

**విశే :** శ్రీమన్నారాయణుని 'భక్తరక్షణ విద్యాపరతంత్రుడ'నటం ఇందులోని విశేషం.

**సంధులు:** సౌధ + అగ్రంబు = సౌధాగ్రంబు (సవర్ణదీర్ఘసంధి)
దేవ + అధీశ్వర = దేవాధీశ్వర (సవర్ణదీర్ఘసంధి)

**సమాసాలు:** భర్మమణిసౌధము : బంగారము, మణులతో కూడిన సౌధము (కర్మధారయ సమాసం)
నర్మభాషణము : నర్మగర్భమైన భాషణము (కర్మధారయ సమాసం)

**ఛందస్సు:** UUU II U IUI I I U UU I UUI U
**ఆ వైకుం | ఠములో | నిభర్మ | మణిసౌ | ధాగ్రంబు | పైలచ్చి | దాం**

1. ఇది శార్దూల వృత్త పద్యం. ఇందులో నాలుగు పాదాలుంటాయి.
2. 'మ–స–జ–స–త–త–గ' అనే గణాలు వరుసగా వస్తాయి.
3. యతి స్థానం 13 వ అక్షరం
4. ప్రాసనియమముంది.

**ఉ॥ నీ మహిమార్ణవంబు తుది నిక్కముగా నెఱుఁగంగ లేక నీ**
**ప్రేమకు వచ్చు దాసునకుఁ గించుఁదనంబున నెగ్గు చేసితిన్**
**నా మఱపున్ సహింపు మట నారకుఁడైన మనంబులో భవ**
**న్నామము చింతసేసిన ననంత సుఖస్థితిఁ జెందకుండునే?** (9-116)

**కవి పరిచయం**: ఈ పద్యం బమ్మెర పోతనామాత్యునిచే రచించబడిన ఆంధ్రమహాభాగవతము నవమ స్కంధము నుండి గ్రహింపబడిన ‘అంబరీషోపాఖ్యానము” అనే పాఠ్యభాగంలోనిది.

**సందర్భం:** అంబరీషునిపై కోపించి, కృత్యను ప్రయోగించిన దుర్వాసునిపైకి సుదర్శన చక్రము రాగా, ఊహించని దుర్వాసుడు పరుగుపరుగున బ్రహ్మలోకానికి పోయి బ్రహ్మను శరణుకోరగా బ్రహ్మ పలికిన సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం:**

| | |
|---|---|
| నీ | = నీయొక్క |
| మహిమ | = మాహాత్మ్యము అనెడి; |
| అర్ణవము | = సముద్రమునకు; |
| తుదిన్ | = చివర; |
| నిక్కము | = తథ్యముగా, |
| ఎఱుగంగ | = తెలిసికొన లేక లేక |
| నీ ప్రేమకున్ | = నీ యొక్క ప్రీతికి; |
| వచ్చు | = పొందిన; |
| దాసునకున్ | = భక్తునికి; |
| కించుదనంబునన్ | = నీచత్వముతో; |
| ఎగ్గు | = అపరాధము; |
| చేసితిన్ | = చేసితిని; |
| నా | = నాయొక్క; |
| మఱపున్ | = అజ్ఞానమును, |
| సహింపుము | = క్షమించు; |
| అట | = అక్కడ; |
| నారకుడు | = నరకములోనుండువాడు; |
| ఐనన్ | = అయినను, |
| మనంబులోన్ | = మనసునందు; |
| భవత్ + నామమున్ | = నీ పేరును; |
| చింత | = ధ్యానము; |
| చేసినన్ | = చేసినచో; |
| అనంత | = అంతులేని; |
| సుఖస్థితిన్ | = సౌఖ్యములను; |

చెందకన్ = పొందుకుండా;

ఉండునే = ఉంటాడా, ఉండదు.

**తాత్పర్యం:** నీ మహిమ అనే సముద్రపు హద్దులు ఏమిటో నిజంగా తెలుసుకోలేక, నీ ప్రేమ పొందిన దాసునికి నీచత్వంతో అపరాధం చేశాను. నా అజ్ఞానాన్ని మన్నించు. నరకంలోనుండే వాడైనా, మనసులో నీ నామాన్ని ధ్యానిస్తే అనంత సుఖస్థితిని పొందకుంటాడా?

**సంధులు:** మహిమ + అర్ణవంబు = మహిమార్ణవంబు (సవర్ణదీర్ఘసంధి)

భవత్ + నామము = భవన్నామము (అనునాసిక సంధి)

**సమాసాలు:** మహిమార్ణవంబు : మహిమ అనే అర్ణవము (రూపక సమాసం)

అనంతసుఖస్థితి : అనంతమైన సుఖస్థితి (కర్మధారయ సమాసం)

**ఛందస్సు:** UII UIU III UII UII UIU IU

**నీమహి | మార్ణవం | బుతుది | నిక్కము | గానెఱు౦ | గంగలే | క నీ**

1. ఇది ఉత్పలమాలవృత్తం. ఇందులో నాలుగు పాదాలుంటాయి
2. భరనభభరవ అనే గణాలు వరుసగా వస్తాయి
3. యతిస్థానం 10వ అక్షరం
4. ప్రాస నియమం ఉంది

**అలంకారం:** అర్థాంతరన్యాసం

నరకంలోనున్న వాడైనా సరే! భగవన్నామాన్ని ధ్యానిస్తే అనంతసుఖాలు కలుగుతాయనే విషయాన్ని చెప్పి తాను చేసిన తప్పును క్షమించమనటం చేత అర్థాంతరన్యాసం.

**చ॥ చలమున బుద్ధిమంతులగు సాధులు నా హృదయంబు లీల దొం**
**గిలి కొనిపోవుచుందురు రకిల్బిషభక్తి లతాచయంబుల**
**న్నిలువఁగఁ బట్టి కట్టుదురు నేరుపుతో మదకుంభికైవడిన్**
**వలలకుఁ జిక్కి భక్తజన వత్సలతన్ జనుచూదుఁ దాపసా!** (9-118)

**కవి పరిచయం**: ఈ పద్యం బమ్మెర పోతనామాత్యునిచే రచించబడిన ఆంధ్రమహాభాగవతము నవమ స్కంధము నుండి గ్రహింపబడిన 'అంబరీషోపాఖ్యానము" అనే పాఠ్యభాగంలోనిది.

**సందర్భం:** ఎవరి వలనా రక్షణ పొందలేక, తనపైకి వచ్చే సుదర్శన చక్రపు బారినుండి రక్షించమని దుర్వాసుడు శ్రీమన్నారాయణుని శరణుకోరగా, ఆ శ్రీహరి దుర్వాసునితో పలికే సందర్భంలోనిది ఈ పద్యం.

**ప్రతిపదార్థం:** అధిపా = గొప్పవాడా!

చలమునన్ = చలాకీగా;

బుద్ధిమంతులు = జ్ఞానముగలవారు;

అగు = అయిన;

సాధులు = మంచివారు;

| | |
|---|---|
| నా హృదయంబున్ | = నా యొక్క మనసును; |
| లీలన్ | = సులువుగా; |
| దొంగిలికొనిపోవుచున్ | = ఎత్తుకుపోతూ; |
| ఉండుదురు | = ఉంటారు; |
| అకిల్బిష | = నిర్మలమైన; |
| భక్తి | = భక్తి యనెడి; |
| లత | = తీగల; |
| చయంబులన్ | = సమూహములచే; |
| నిలువగన్ | = ఆగిపోవునట్లు; |
| పట్టి | = పట్టుపట్టి; |
| కట్టుదురున్ | = కట్టివేయుదురు; |
| నేరుపు తోన్ | = నేర్పుతోటి; |
| మద | = మదించిన; |
| కుంభి | = ఏనుగు (కుంభి – కుంభములుగలది ఏనుగు); |
| కైవడిన్ | = వలె; |
| వలలకున్ | = వలలందు; |
| చిక్కి | = తగులుకొని; |
| భక్త | = భక్తులఎడ; |
| వత్సలతన్ | = వాత్సల్యము; |
| చనక | = తప్పించుకుపోకుండ; |
| ఉందున్ | = ఉండెదను; |

**తాత్పర్యం:** బుద్ధిమంతులైన సాధువులు నా హృదయాన్ని అలవోకగా దొంగిలించుకపోతుంటారు. నిర్మలమైన భక్తిలతలతో నన్ను పట్టి బంధిస్తుంటారు. వలలో చిక్కిన మదగజంలాగా భక్తులపట్ల గలవాత్సల్యంతో వాళ్ల వెంటబడి పోతుంటాను.

**సంధులు :** లతాచయంబులన్ + నిలువక = లతాచయంబులన్నిలువక (ద్రుత ద్విత్వ సంధి)

**సమాసాలు :** భక్తిలతాచయంబులు : భక్తి అనే లతాచయంబులు (రూపక సమాసం)
భక్తజనవత్సలత : భక్తజనుల పట్లగల వత్సలత (తత్పురుష సమాసం)
మదకుంభి : మదించిన కుంభి (తత్పురుష సమాసం)

**అలంకారం:** భక్తిలతాచయాలతో పట్టి కట్టిన మదపుటేనుగులాగా శ్రీహరి ప్రవర్తిస్తాడనటం ఉపమాలంకారం.

**ఛందస్సు:** III IUI UII IUI IUI IUI UIU
**చలము | నబుద్ధి | మంతుల | గుసాధు | లునాహృ | దయంబు | లీలదొం**
1) ఇది చంపకమాల వృత్తం. ఇందులో నాలుగు పాదాలుంటాయి.
2) ప్రతిపాదంలో వరుసగా 'న–జ–భ–జ–జ–జ–ర' అనే గణాలు వస్తాయి.

3) 1-11 అక్షరాలకు యతి చెల్లుతుంది.

4) ప్రాసనీయమముంది.

**మ॥ అని శ్రీవల్లభుఁ డానతిచ్చిన మహోద్యచ్చక్రకీలావళీ**
**జనితాయాసుఁడు నిర్వికాసుఁ డుదితశ్వాసుండు దుర్వాసుఁ డ**
**ల్లన యేతెంచి సుభక్తిఁ గాంచెఁ గరుణాలావణ్య వేషున్ విదో**
**షు నయోదారమనీషు మంజుమితభాషు న్నంబరీషున్ వెసన్.** (9-127)

**కవి పరిచయం**: ఈ పద్యం బమ్మెర పోతనామాత్యునిచే రచించబడిన ఆంధ్రమహాభాగవతము నవమ స్కంధము నుండి గ్రహింపబడిన 'అంబరీషోపాఖ్యానము" అనే పాఠ్యభాగంలోనిది.

**సందర్భం:** శ్రీ హరిని రక్షించమని శరణుకోరిన దుర్వాసునితో శ్రీమన్నారాయణుడు మాట్లాడుతూ 'పరమభాగవతుడైన ఆ అంబరీషుడినే పోయి శరణు వేడమని చెప్పాడు. అప్పుడా దుర్వాసుడు అంబరీషుని కోసం పోయే సందర్భంలోనిది ఈ పద్యం.

**ప్రతిపదార్థం:**

| | |
|---|---|
| అని | = అని; |
| శ్రీవల్లభుడు | = విష్ణుమూర్తి (శ్రీవల్లభుడు: శ్రీ - లక్ష్మీదేవి, వల్లభుడు-భర్త, విష్ణువు); |
| ఆనతిచ్చినన్ | = ఆజ్ఞాపించగా; |
| మహా | = మిక్కలి; |
| ఉద్యత్ | = ఎగసిపడెడి; |
| చక్ర | = విష్ణుచక్రముయొక్క; |
| కీలా | = మంటల; |
| అవళీ | = ఉపద్రవమువలన; |
| జనిత | = పొందిన; |
| ఆయాసుడు | = ఆయాసముకలవాడు; |
| నిర్వికాసుడు | = వికాసముతప్పినవాడు; |
| ఉదితశ్వాసుడు | = రొప్పుతున్నవాడు; |
| దుర్వాసుడు | = దుర్వాసుడు; |
| అల్లన | = నెమ్మదిగ; |
| ఏతెంచి | = వచ్చి; |
| సు | = మంచి; |
| భక్తిని | = భక్తితోటి; |
| కరుణా | = దయయనెడి; |
| లావణ్య | = కాంతిని; |
| వేషున్ | = ధరించినవానిని; |
| విదోషున్ | = దోషములు లేనివానిని; |
| నయ | = మిక్కిలి; |

ఉదార = త్యాగశీలమైన;
మనీషున్ = మనసుగలవానిని;
మంజు = హితవుగ;
మిత = పరిమితముగ;
భాషున్ = మాట్లాడేవానిని;
అంబరీషున్ = అంబరీషుని;
వెసన్ = శీఘ్రమే;
కాంచెన్ = చూసెను.

**తాత్పర్యం:** అంబరీషుడినే పోయి శరణుకోరుకోమన్న శ్రీహరి మాటలకు, ఉగ్రమైన జ్వాలలతో ఎగసిపడుతున్న సుదర్శన చక్రపు దెబ్బకు ఆయాసపడుతూ, వికాసం తప్పి రొప్పుతూ దుర్వాసుడు పరుగెత్తుకొంటూ వచ్చాడు. వచ్చి కరుణ అనే లావణ్యాన్ని ధరించినవాడు, దోషాలేమీ లేనివాడు, ఉదారమనస్కుడు, మిత మంజు భాషణుడునైన అంబరీషుడిని చూశాడు.

**సంధులు :** మహా + ఉద్యత్ = మహోద్యత్ (గుణసంధి)
ఉద్యత్ + చక్ర = ఉద్యచ్చక్ర (శ్చుత్వసంధి)
జనిత + ఆయాసుడు = జనితాయాసుడు (సవర్ణదీర్ఘసంధి)
నయ + ఉదార = నయోదార (గుణసంధి)
మితభాషున్ + అంబరీషున్ = మితభాషున్నంబరీషున్ (ద్రుత ద్విత్వసంధి)

**సమాసాలు :** చక్రకీలావళి : చక్రము యొక్క కీలావళి (తత్పురుష సమాసం)
నయోదారుడు : నయ, ఉదారగుణాలతో కూడిన వాడు (తత్పురుష సమాసం)
కరుణాలావణ్యవేషుడు : కరుణ అనే లావణ్యపు వేషం గలవాడు (రూపక సమాసం)

**ఛందస్సు:** IIU UII UIU III UUU IUU IU
**అనిశ్రీ | వల్లభుఁ | దానతి | చ్చినమ | హోద్యచ్చ | క్రకీలా | వళీ**

1. ఇది మత్తేభవృత్తం. ఇందులో నాలుగు పాదాలుంటాయి
2. స-భ-ర-న-మ-య-వ అనే గణాలు వరుసగా వస్తాయి
3. యతిస్థానం 14వ అక్షరం
4. ప్రాస నియమం ఉంది.

**మ॥ హరిచే నీవు విసృష్టమై చనఁగ ము న్నాలించి నీ ధారలన్**
**ధరణిన్ వ్రాలుట నిక్క మంచు మునుపే దైత్యేశ్వర వ్రాతముల్**
**శిరముల్ పాదములున్ భుజోరుయుగమున్ చేతుల్ నిజాంగంబు ల**
**ప్పారగం ప్రాణసమీరముల్ వెడలు నీ యుద్ధంబులం జక్రమా!** (9-130)

**కవి పరిచయం:** ఈ పద్యం బమ్మెర పోతనామాత్యునిచే రచించబడిన ఆంధ్రమహాభాగవతంనందలి నవమ స్కంధము నుండి గ్రహింపబడిన 'అంబరీషోపాఖ్యానము" అనే పాఠ్యభాగంలోనిది.

**సందర్భం:** సుదర్శన చక్రపు బారినుండి కాపాడమని తన పాదాలంటి వేడుకున్న దుర్వాసుని పట్ల కరుణతో, అంబరీషుడు సుదర్శన చక్రాన్ని ప్రార్థించే సందర్భంలోనిది ఈ పద్యం.

**ప్రతిపదార్థం:**

| | |
|---|---|
| చక్రమా | = ఓ చక్రమా; |
| హరిచేన్ | = విష్ణుమూర్తి చేత; |
| నీవున్ | = నీవు; |
| విసృష్టము+ఐ | = విసరబడినదై; |
| చనగన్ | = వెళ్ళగా; |
| మున్ను | = ముందు; |
| ఆలించి | = పసిగట్టి; |
| నీ ధారలన్ | = నీ యొక్క పదునులచే; |
| ధరణిన్ | = నేలమీద; |
| వ్రాలుట | = పడిపోవుట; |
| నిక్కము | = తప్పనిది; |
| అనుచున్ | = భావించుకొని; |
| మునుపే | = ముందుగానే; |
| దైత్య | = రాక్షస; |
| ఈశ్వర | = ప్రభువుల; |
| వ్రాతముల్ | = సమూహములు; |
| శిరముల్ | = తలలు; |
| పాదములున్ | = కాళ్ళు; |
| భూజా | = భుజముల; |
| యుగళముల్ | = జంటలు (2); |
| చేతుల్ | = చేతులు; |
| నిజ | = తమదైన; |
| అంగంబులన్ | = దేహములనుండి; |
| ఒరుగన్ | = తెగిపోగా; |
| ప్రాణసమీరముల్ | = ప్రాణవాయువులను; |
| నీయుద్ధంబులన్ | = నీవు చేసెడి యుద్ధాలలో; |
| వదలున్ | = వదలెదరు. |

**తాత్పర్యం:** ఓ చక్రమా! హరిచేతనీవు ప్రయోగించబడ్డావన్న విషయాన్ని ముందే తెలిసికొని, నీ పదునైన ధారలతో ప్రాణాలు పోవటం ఖాయమని భావించి, నీ యుద్ధాలలో ముందే రాక్షసులు తమ తలలు, భుజాలు, చేతులు, శరీరంనుండి పోగొట్టుకొని ప్రాణాలు వదిలేస్తున్నారు.

**సంధులు :** మున్ను + ఆలించి = మున్నాలించి (ఉత్వసంధి)
నిక్కము + అంచు = నిక్కమంచు (ఉత్వసంధి)

దైత్య + ఇంద్ర = దైత్యేంద్ర (గుణసంధి)

భుజ + ఉరుయుగము = భుజోరుయుగము (గుణసంధి)

**ఛందస్సు :** IIU UII UIU III UU U IUU IU

**హరిచే | నీవువి | సృష్టమై | చనఁగ | మున్నాలిం | చినీధా | రలన్**

1. ఇది మత్తేభవృత్తం. ఇందులో నాలుగు పాదాలుంటాయి
2. స-భ-ర-న-మ-య-వ అనే గణాలు వరుసగా వస్తాయి
3. యతిస్థానం 14వ అక్షరం
4. ప్రాస నియమం ఉంది.

**అలంకారం:** అతిశయోక్తి

ప్రాణాలు పోవటం ఖాయమని తెలిసి, ముందే అవయవాల్ని శరీరం నుండి కోల్పోయి ప్రాణాలు పోగొట్టుకోవటం అతిశయోక్తి.

ఉ॥ **చీఁకటి వాపుచున్ వెలుఁగు సేయుచు సజ్జనకోటి నెల్ల స**
**శ్రీకులఁ జేయు నీరుచులు చెల్వుగ ధర్మసమేతలై నినున్**
**వాకున నిట్టి దట్టిదని వర్ణన సేయ విధాత నేరఁ డ**
**స్తోకము నీదు రూపు గలదుం దుది లేదు పరాత్పరాద్యమై.** (9-132)

**కవి పరిచయం**: ఈ పద్యం బమ్మెర పోతనామాత్యునిచే రచించబడిన ఆంధ్రమహాభాగవతము నవమ స్కంధము నుండి గ్రహింపబడిన 'అంబరీషోపాఖ్యానము" అనే పాఠ్యభాగంలోనిది.

**సందర్భం:** సుదర్శన చక్రపు బారినుండి కాపాడమని తన పాదాలంటి వేడుకున్న దుర్వాసుని పట్ల కరుణతో, అంబరీషుడు సుదర్శన చక్రాన్ని ప్రార్థించే సందర్భంలోనిది ఈ పద్యం.

**ప్రతిపదార్థం:**

| | |
|---|---|
| చీకటిన్ | = చీకటిని; |
| పాపుచున్ | = పారద్రోలుతూ; |
| వెలుగున్ | = కాంతిని |
| చేయుచున్ | = పుట్టిస్తూ; |
| సజ్జనకోటిన్ | = మంచివారి సమూహములు; |
| ఎల్లన్ | = అన్నిటిని; |
| సశ్రీకులన్ | = సుసంపన్నులను; |
| చేయు | = చేసే; |
| నీ | = నీయొక్క |
| రుచులు | = కాంతులు; |
| చెల్వుగ | = చక్కగా, |
| ధర్మసమేతలు+ఐ | = ధర్మముగలవారై, |
| నినున్ | = నిన్ను; |

| | |
|---|---|
| వాకున | = నోటి మాటలతో; |
| ఇట్టిదట్టిది | = వివరముగ; |
| అని | = పలికి; |
| వర్ణనచేయన్ | = కీర్తించుటకు; |
| విధాత | = బ్రహ్మదేవుడు; |
| నేరదు | = సరిపోదు; |
| అస్తోకము | = మహోన్నతము; |
| నీదు | = నీ యొక్క; |
| రూపున్ | = స్వరూపము; |
| అందున్ | = దానిలో; |
| తుది | = అంతము; |
| లేదు | = లేదు; |
| పరాత్పర+ఆద్యము+ఐ | = విష్ణుమూర్తితో మొదలైనదై; |
| కలదు | = ఉన్నది. |

**తాత్పర్యం:** చీకటిని పారద్రోలి, కాంతిని కలిగిస్తూ సజ్జనకోటిని సుసంపన్నం చేసేనీ కాంతుల వలన ధర్మ సమేతులై ప్రజలు ప్రకాశిస్తున్నారు. నిన్ను ఇలాంటి దానివని చెప్పి వర్ణించటానికి బ్రహ్మదేవుడైనా సరిపోదు. మహోన్నతమైన నీ రూపమే ఉన్నది. దానికి తుదిలేదు. పరాత్పరుడైన శ్రీ మహావిష్ణువుతో మొదలైనదది.

**సంధులు :** ఇట్టిది + అట్టిది + అన = ఇట్టిదట్టిదన (ఇత్వసంధి)
వర్ణన + చేయ = వర్ణనసేయ (గసడదవాదేశసంధి)
పరాత్పర + ఆద్యమై = పరాత్పరాద్యమై (సవర్ణదీర్ఘసంధి)
కలదున్ + తుదిలేదు = కలదుందుదిలేదు (ద్రుతసంధి)

**సమాసాలు:** ధర్మసమేతలు : ధర్మంతో సమేతలు (తత్పురుష సమాసం)
పరాత్పరాద్యమై : పరాత్పరునకు ఆద్యము (షష్ఠీతత్పురుష సమాసం)

**ఛందస్సు :** U I I  U I U  I I I  U I I  U I I  U I U  I U
**చీఁకటి | వాపుచున్ | వెలుఁగు | సేయుచు | సజ్జన | కోటినె | ల్లస**
1) ఇది ఉత్పలమాల వృత్త పద్యం. ఇందులో నాలుగు పాదాలుంటాయి.
2) ప్రతిపాదంలో వరుసగా 'భ-ర-న-భ-భ-ర-వ' అనే గణాలు వస్తాయి.
3) 1-11 అక్షరాలకు యతి చెల్లుతుంది.
4) ప్రాసనియమముంది.

మ॥ **'నరనాథోత్తమ! మేలు సేసితి కదా! నాతప్పు మన్నించి శ్రీ**
**హరి పాదాబ్జము లింతముట్టఁ గొలుతే? యాశ్చర్య మౌ నెన్నుచో**
**నరుదంద్రే నినుఁ బోఁటి సాధులకుఁ దానై యిచ్చుటల్ గాచుటల్**
**సొరిదిన్ నైజగుణంబులై సరస వచ్చుం గాదె మిత్రాకృతిన్.** (9-140)

**కవి పరిచయం**: ఈ పద్యం బమ్మెర పోతనామాత్యునిచే రచించబడిన ఆంధ్రమహాభాగవతము నవమ స్కంధము నుండి గ్రహింపబడిన 'అంబరీషోపాఖ్యానము" అనే పాఠ్యభాగంలోనిది.

**సందర్భం:** సుదర్శన చక్రపు బారినుండి కాపాడమని తన పాదాలంటి వేడుకున్న దుర్వాసుని పట్ల కరుణతో, అంబరీషుడు సుదర్శన చక్రాన్ని ప్రార్థించే సందర్భంలోనిది ఈ పద్యం.

**ప్రతిపదార్థం:**

| | |
|---|---|
| నరనాథోత్తమ | = మహారాజ (నరనాథోత్తముడు–నరనాథు(రాజు)లలో ఉత్తముడు మహారాజు), |
| మేలు | = ఉపకారము; |
| చేసితి | = చేసావు; |
| కదా | = సుమ్మా; |
| నా | = నాయొక్క; |
| తప్పు–తప్పున్ | = పొరపాటును; |
| మన్నించి | = క్షమించి; |
| శ్రీహరి | = విష్ణుని; |
| పాదములున్ | = పాదములను; |
| ఇంత | = చాలా ఎక్కువగా; |
| ముట్టన్ | = గాఢముగా; |
| కొలుతే | = సేవించితివి; |
| ఆశ్చర్యము | = ఆశ్చర్యకరము; |
| ఔన్ | = ఐనది; |
| ఎన్నుచో | = తరచిచూసినచో; |
| అరుదు | = అపూర్వమైనది; |
| అంద్రే | = అంటారా, అనరు; |
| నినున్ + పోటి | = నీవంటి; |
| సాధులకున్ | = మంచివారికి; |
| తానై | = తనంతతానే; |
| ఇచ్చుటల్ | = దానముచేయుటలు; |
| కాచుటల్ | = కాపాడుటలు; |
| సొరిదిని | = మామూలుగా; |
| నైజ | = సహజ; |
| గుణంబులు + ఐ | = గుణములై; |
| సరసన్ | = చెంతకు; |
| వచ్చున్ + కాదే | = సంప్రాప్తిస్తావు కదా; |
| మిత్ర | = మిత్రుని; |
| ఆకృతిన్ | = వలె. |

**తాత్పర్యం:** ఓ రాజా! నా తప్పును మన్నించి నాకు మేలు చేశావు కదా! శ్రీహరి పాదాలనింత గాఢంగా సేవించావు. తలచి చూస్తే ఆశ్చర్యం! మీలాంటి సత్పురుషులకు తమకు తాముగా దానం చేయటం, కాపాడటం నైజగుణాలై మిత్రాకృతిలో వచ్చి చేరతాయి.

**సంధులు :** మేలు + చేసితి = మేలుసేసితి (గసడదవాదేశసంధి)
అరుదు + అంద్రే = అరుదంద్రే (ఉత్వసంధి)
వచ్చున్ + కాదే = వచ్చుంగాదే (ద్రుతసంధి)

**సమాసాలు :** నరనాథోత్తమ : నరనాథులలో ఉత్తముడు (తత్పురుష సమాసం)
పాదాబ్జము : పాదమనే అబ్జము (రూపక సమాసం)

**ఛందస్సు :** IIUUII UIU III UUU IUU IU
**'నరనా | థోత్తమ! | మేలుసే | సితిక | దా!నాత | ప్పుమన్నిం | చిశ్రీ**
1) ఇది మత్తేభ వృత్త పద్యం. ఇందులో నాలుగు పాదాలుంటాయి.
2) ప్రతిపాదంలో వరుసగా 'స-భ-ర-న-మ-య-వ' అనే గణాలు వస్తాయి.
3) 1-14 అక్షరాలకు యతి చెల్లుతుంది.
4) ప్రాసనియమముంది.

**విశే :** నీలాంటి సజ్జనులకు దాతృత్వం, రక్షించటం అనే గుణాలు మిత్రాకృతిలో వచ్చి సహజగుణాలుగానే కుదురుకుంటాయి కదా! అని అనటంలో దుర్వాసుడు పొందిన హృదయశాంతి, దానిని కల్పించిన అంబరీషుని గొప్పదనం ఎన్నదగినవి.

**మ॥ ఒక మా టెవ్వని పేరు కర్ణములలో నొయ్యారమై సోఁకినన్**
**సకలాఘంబులు పల్లటిల్లి తొలఁగున్ సంభ్రాంతితో నట్టి స**
**త్సుకరున్ మంగళతీర్థపాదు హరి విష్ణున్ దేవదేవేశుఁ దా**
**నకలంకస్థితి గొల్చు భక్తులకు లే దడ్డంబు రాజాగ్రణీ!** (9-142)

**కవి పరిచయం**: ఈ పద్యం బమ్మెర పోతనామాత్యునిచే రచించబడిన ఆంధ్రమహాభాగవతము నవమ స్కంధము నుండి గ్రహింపబడిన 'అంబరీషోపాఖ్యానము" అనే పాఠ్యభాగంలోనిది.

**సందర్భం:** తను చేయబూనిన అపకారాన్ని పట్టించుకోకుండా తనను కాపాడిన అంబరీషుడిని వేయి విధాలుగా ప్రశంసించి, తాను సెలవుతీసికొని వెళ్లబోతూ అంబరీషునితో దుర్వాసుడు పలికిన సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం:**

| | |
|---|---|
| రాజాగ్రణి | = రాజులలో గొప్పవాడా! |
| ఒక మాటు | = ఒక్కసారి; |
| ఎవ్వని | = ఎవనియొక్క; |
| పేరు | = నామము; |
| కర్ణముల | = చెవుల; |

| | |
|---|---|
| లోనన్ | = అందు; |
| ఒయ్యారము+ఐ | = విలాసముగా; |
| సోకినన్ | = స్పర్శించినను; |
| సకల | = సమస్తమైన; |
| అఘంబులున్ | = పాపములు; |
| పల్లటిల్లి | = పటాపంచలై, చలించి; |
| తొలగున్ | = పోవును; |
| సంభ్రాంతి | = భయభ్రాంతుల; |
| తోన్ | = తోటి; |
| అట్టి | = అటువంటి; |
| సత్సుకరున్ | = నారాయణుని (సత్సుకరుడు – సత్ (మంచి) సుకరుడు (మేలు) కరుడు (కలిగించువాడు) విష్ణువు) |
| మంగళతీర్థపాదున్ | = నారాయణుని (మంగళతీర్థపాదుడు – శుభకరమైన తీర్థము పాదములవద్ద కలవాడు–విష్ణువు); |
| హరిన్ | = నారాయణుని; |
| విష్ణున్ | = నారాయణుని; |
| దేవదేవేశునిన్ | = నారాయణుని; |
| అకలంక | = నిష్కళంకమైన; |
| స్థితిన్ | = విధముగా; |
| కొల్చు | = సేవించెడి; |
| భక్తులకున్ | = భక్తులకు; |
| అడ్డంబులేదు | = సాధ్యముగానిది లేదు; |

**తాత్పర్యం:** ఒక్కసారి ఎవరిపేరు చెవిలో చెపితే సమస్త పాపాలూ తొలగిపోతాయో, అటువంటి నారాయణుని, మంగళకరమైన గంగాది తీర్థాలు జన్మించిన పాదాలుగల నారాయణుని కొలిచే భక్తులకు త్రిభువనాలలో అడ్డమేముంది?

**సంధులు :** సకల + అఘంబులు = సకలాఘంబులు (సవర్ణదీర్ఘసంధి)
దేవదేవ + ఈశు = దేవదేవేశు (గుణసంధి)
రాజ + అగ్రణీ = రాజాగ్రణీ (సవర్ణదీర్ఘసంధి)

**సమాసాలు :** సకలాఘంబులు : సకలమైన అఘములు (కర్మధారయ సమాసం)
అకలంకస్థితి : అకలంకమైన స్థితి (కర్మధారయ సమాసం)

**అలంకారం:** పరికరాలంకారం. సాభిప్రాయవిశేషణాలు విష్ణువునకు వాడటం చేత ఇది పరికరాలంకారం.

ఛందస్సు :   IIU  UII  UIU  III  UUU  IUU  IU

**ఒకమా | టెవ్వని | పేరుక |ర్ణముల | లోనొయ్యా | రమైసోఁ | కినన్**

1. ఇది మత్తేభవృత్తం. ఇందులో నాలుగు పాదాలుంటాయి
2. స-భ-ర-న-మ-య-వ అనే గణాలు వరుసగా వస్తాయి
3. యతిస్థానం 14వ అక్షరం
4. ప్రాస నియమం ఉంది.

శా॥ **"కంటిన్ నేఁటికి నిన్ను నీ వచనముల్ కర్ణద్వయ ప్రీతిగా**
**వింటి న్నన్నముఁ గొంటి నీ గృహమునన్ వేడ్కన్ ఫలం బబ్బె నే**
**మంటిన్ బోయెద! నీ చరిత్ర మమరుల్ మర్త్యుల్ సుఖాసీనులై**
**మింటన్ మేదిని సన్నుతింపఁ గల రీమీఁద న్నరేంద్రాగ్రణీ!** (9-145)

**కవి పరిచయం**: ఈ పద్యం బమ్మెర పోతనామాత్యునిచే రచించబడిన ఆంధ్రమహాభాగవతము నవమ స్కంధము నుండి గ్రహింపబడిన 'అంబరీషోపాఖ్యానము" అనే పాఠ్యభాగంలోనిది.

**సందర్భం:** అంబరీషుని వద్ద సెలవు తీసికొని వెళ్లబోతూ దుర్వాసుడు పలికిన సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం:**నరేంద్రాగ్రణీ = మహారాజా (నరేంద్రాగ్రణి-నరేంద్రు(రాజు)లలో అగ్రణి (అధికుడు) మహారాజు).

కంటిన్ = చూసితిని;
నేటికిన్ = ఇప్పటికి;
నిన్నున్ = నిన్ను;
నీ = నీయొక్క;
వచనముల్ = మాటలను;
కర్ణద్వయంబున్ = రెండు చెవులకు;
ప్రీతిగా = ఇష్టపూర్వకముగా;
వింటిన్ = విన్నాను;
అన్నమున్ = ఆహారము;
కొంటిన్ = తీసుకొన్నాను;
నీ = నీ యొక్క;
గృహమునన్ = ఇంటిలో
వేడ్కన్ = సంతోషముతో;
ఫలంబు = ఫలితము;
అందెన్ = దక్కినది;
ఏన్ = నేను;
మంటిన్ = బతికితిని;

| | |
|---|---|
| పోయెదన్ | = వెళ్లిపోయెదను; |
| నీ | = నీయొక్క; |
| చరిత్రమున్ | = కథను; |
| అమరుల్ | = దేవతలు; |
| మర్త్యుల్ | = మానవులు; |
| సుఖ + ఆసీనులు+ఐ | = సుఖంగా కూర్చొన్నవారై; |
| మింటన్ | = స్వర్గమునందు; |
| మేదినిన్ | = భూమ్మీద; |
| సన్నుతింపగలరు | = కీర్తించెదరు; |
| ఈమీదన్ | = ఇకపైన; |

**తాత్పర్యం:** ఓ రాజా! ఇన్నాళ్లకు నిన్ను చూశాను. నీ మాటల్ని చెవులకింపయ్యే రీతిగా నేటికి విన్నాను. నీ ఆతిథ్యం స్వీకరించాను. మీ ఇంట్లో నా కోరిక ఈడేరింది. నేను బ్రతికాను. వెళ్లివస్తాను. ఇక మీద నీ చరిత్రను దేవతలు, మానవులు, సుఖాసనాసీనులై కీర్తిస్తే, ఆకాశం నుండి దేవతలు ప్రస్తుతిస్తారు.

**సంధులు :** కంటిన్ + నేటికి = కంటిన్నేటికి (ద్రుత ద్విత్వ సంధి)
వింటిన్ + అన్నము = వింటిన్నన్నము (ద్రుత ద్విత్వసంధి)
నరేంద్ర + అగ్రణీ = నరేంద్రాగ్రణీ (సవర్ణదీర్ఘసంధి)

**సమాసాలు :** నరేంద్రాగ్రణీ : నరేంద్రులలో అగ్రణి (తత్పురుష సమాసం)
కర్ణద్వయ ప్రీతి : కర్ణద్వయానికి ప్రీతి (తత్పురుష సమాసం)

**ఛందస్సు:** UUU IIU IUI IIU UUI UUI U
**కంటిన్నేఁ | టికి ని | న్నునీవ | చనముల్ | కర్ణద్వ | యప్రీతి | గా**

1. ఇది శార్దూల వృత్త పద్యం. ఇందులో నాలుగు పాదాలుంటాయి.
2. 'మ-స-జ-స-త-త-గ' అనే గణాలు వరుసుగా వస్తాయి.
3. యతి స్థానం 13 వ అక్షరం
4. ప్రాసనియమముంది.

# సందర్భ సహిత వ్యాఖ్యలు

**1) "అతఁడు రాచ తపసి యనఁగనొప్పె" (9-84)**

**కవిపరిచయం:** ఈ వాక్యము బమ్మెర పోతనామాత్యునిచే రచించబడిన ఆంధ్రమహాభాగవతమునందలి నవమ స్కంధము నుండి గ్రహింపబడిన 'అంబరీషోపాఖ్యానము" అనే పాఠ్యభాగంలోనిది.

**సందర్భం:** అంబరీషుని వ్యక్తిత్వాన్ని పరిచయం చేస్తే శుకమహర్షి పరీక్షిన్మహారాజుతో చెప్పిన మాటలు.

**భావం:** అంబరీష మహారాజు గొప్ప వైభవంతో పుణ్యాత్ముడై వశిష్టుడు మొ॥న ఋషులతో కూడి యజ్ఞేశుడైన శ్రీహరిని గూర్చి సరస్వతీ నదీతీరంలో లెక్కలేనన్ని దక్షిణలు పెట్టి, ఎన్నో అశ్వమేధ యాగాలు చేశాడు. బంగారాన్నీ మట్టి పెళ్లనూ సమానంగా చూచే అతడు సర్వకర్మలనూ విష్ణుపరం చేసి భూమిని పాలించాడు. విష్ణుభక్తుల పట్ల, శ్రీహరి పట్ల మనసును లంకెపెట్టి, తనకు విహితమైన రాజ్యపాలనను వదలకుండా రాజర్షిగా విరాజిల్లాడు - అని పరీక్షిన్మహారాజుకు శుకమహర్షి చెప్పాడు.

**2) "పురమునందునంతిపురమునందు"(9-88)**

**కవిపరిచయం:** ఈ వాక్యము బమ్మెర పోతనామాత్యునిచే రచించబడిన ఆంధ్రమహాభాగవతమునందలి నవమ స్కంధము నుండి గ్రహింపబడిన 'అంబరీషోపాఖ్యానము" అనే పాఠ్యభాగంలోనిది.

**సందర్భం:** అంబరీషుని వ్యక్తిత్వాన్ని పరిచయం చేస్తే శుకమహర్షి పరీక్షిన్మహారాజుతో చెప్పిన మాటలు.

**భావము:** అంబరీషుడు రాజర్షియై, పుణ్యాత్ముడై, భగవంతునియందు లగ్నమైన మనస్సుగలవాడై చక్కగా రాజ్యాన్ని పాలిస్తున్నాడు. అతనికి, గుఱ్ఱాలు, ఏనుగులు, సంపదలు, ఉద్యానవనాలు, కొడుకులు, బంధుమిత్రులు, పురము, అంత:పురము మొ॥న భోగభాగ్యాల పట్ల ఆసక్తి ఉడిగిపోయింది అని పరీక్షిన్మహారాజుకు, శ్రీ శుక్రమహర్షి చెప్పాడు.

**3) "వినిపింపుడర్హమైన విధమెట్టిదియో" (9-97)**

**కవిపరిచయం:** ఈ వాక్యము బమ్మెర పోతనామాత్యునిచే రచించబడిన ఆంధ్రమహాభాగవతమునందలి నవమ స్కంధము నుండి గ్రహింపబడిన 'అంబరీషోపాఖ్యానము" అనే పాఠ్యభాగంలోనిది.

**సందర్భం:** సంవత్సరకాలం ఏకాదశవ్రతమాచరించిన అంబరీషుడు పారణ చేయబోయే సందర్భంలో దుర్వాస మహర్షి వచ్చాడు. వచ్చిన అతిథికి అర్ఘ్యపాద్యాదులిచ్చి భోజనానికి ఆహ్వానించాడు. సరేనని కాళిందీనదికి వెళ్లి స్నానమాచరించి, ధ్యానం చేస్తూ ఎంతకూ రాని దుర్వాసునికి భయపడి, ద్వాదశి ఘడియలు దాటిపోనున్న వేళ ఏమి చేయాలో తోచక బ్రాహ్మణులను సలహా అడిగే సందర్భంలోనిది.

**భావం:** స్నానానికి వెళ్లిన దుర్వాసముని కాళింది నుండి ఎంతకూ రాడు. ద్వాదశి వెళ్లిపోబోతోంది. ఈలోగానే పారణ చేయాలి. ఇప్పుడు తగిన ధర్మాన్ని మీరే చెప్పండని బ్రాహ్మణులను అంబరీషుడు అడిగాడు.

**4) "కుడువకుంటకాదు, కుడుచుటయునుగాదు" (9-99)**

**లేదా**

**"సలిలిభక్షణంబు సమ్మతంబు" (9-99)**

**కవిపరిచయం:** ఈ వాక్యము బమ్మెర పోతనామాత్యునిచే రచించబడిన ఆంధ్రమహాభాగవతమునందలి నవమ స్కంధము నుండి గ్రహింపబడిన 'అంబరీషోపాఖ్యానము" అనే పాఠ్యభాగంలోనిది.

**సందర్భం:** సంవత్సరకాలం ఏకాదశవ్రతమాచరించిన అంబరీషుడు పారణ చేయబోయే సందర్భంలో దుర్వాస మహర్షి వచ్చాడు. వచ్చిన అతిథికి అర్ఘ్యపాద్యాదులిచ్చి భోజనానికి ఆహ్వానించాడు. సరేనని కాళిందీనదికి వెళ్లి స్నానమాచరించి, ధ్యానం చేస్తూ ఎంతకూ రాని దుర్వాసునికి భయపడి, ద్వాదశి ఘడియలు దాటిపోనున్న వేళ ఏమి చేయాలో తోచక బ్రాహ్మణులను సలహా అడిగినపుడు వారు అంబరీషునితో పలికిన సందర్భంలోనిది.

**భావం:** నదికి వెళ్లి దుర్వాసుడు ఎంతసేపటికీ రాకపోవటం చేత ద్వాదశి పారణను మానివేయాలను కోవటం ధర్మం కాదు. నీళ్లు తాగితే భోజనం చేసినట్టూ అవుతుంది. చేయనట్టూ అవుతుంది. ఇది ధర్మ సమ్మతమే. అని అంబరీషునికి బ్రాహ్మణులు చెప్పారని భావం.

**5) "వచ్చెనదియుఁ బ్రళయ వహ్నిపగిది" (9-105)**

**(లేదా)**

**"వ్యాళంబు వెనుకొనుదవానలంబు చందంబున" (9-105)**

**కవిపరిచయం:** ఈ వాక్యము బమ్మెర పోతనామాత్యునిచే రచించబడిన ఆంధ్రమహాభాగవతమునందలి నవమ స్కంధము నుండి గ్రహింపబడిన 'అంబరీషోపాఖ్యానము" అనే పాఠ్యభాగంలోనిది.

**సందర్భం:** తాను వచ్చేవరకూ వేచి చూడకయే పారణ చేసిన అంబరీషునిపై కోపించి, కృత్యను ప్రయోగించిన దుర్వాసునిపైకి శ్రీమహావిష్ణువు సుదర్శన చక్రాన్ని పంపిన సందర్భంలోనిది.

**భావం:** దుర్వాసుడు అంబరీషునిపై కృత్యను ప్రయోగించిన విషయం తెలిసి, దుర్వాసుని మాయను చక్కబెట్టేందుకు విష్ణువు సందర్శనాన్ని పురమాయించాడు. అది ప్రళయాగ్నిలాగా వచ్చి కృత్యను దహించింది. అంతటితో ఆగక ముని వెంటపడింది. అప్పుడు దుర్వాసుడు మేరుపర్వతపు గుహలోనికి ప్రవేశించాడు. వెంటనే ఆ సుదర్శన చక్రం పామును వెంటాడే కార్చిచ్చులాగా గుహలో ప్రవేశించింది అని భావం.

**6) "హరిచక్రానలకీల కన్యుఁ డొకరుండడ్డంబుఁ గానేర్చునే" (9.109)**

**కవిపరిచయం:** ఈ వాక్యము బమ్మెర పోతనామాత్యునిచే రచించబడిన ఆంధ్రమహాభాగవతమునందలి నవమ స్కంధము నుండి గ్రహింపబడిన 'అంబరీషోపాఖ్యానము" అనే పాఠ్యభాగంలోనిది.

**సందర్భం:** సుదర్శన చక్రానికి భయపడిన దుర్వాసుడు బ్రహ్మలోకానికి పోయి బ్రహ్మను శరణు కోరగా బ్రహ్మ దుర్వాసునితో తన అశక్తతను తెలిపే సందర్భంలోనిది.

**భావం:** ఓ దుర్వాసా! కాల స్వరూపుడై కాలాన్ని ఎవరు సృష్టిస్తున్నారో, కాలం తీరక బ్రహ్మాది లోకాలను, ఇతరలోకాలను ఎవరు బూడిద చేస్తున్నారో అటువంటి శ్రీహరి సుదర్శన చక్రపు అగ్ని జ్వాలలకు అడ్డుపడే శక్తి గలవారు ఎవరున్నారు? - అని బ్రహ్మదేవుడు పలికెనని భావం.

**7) "ఎవ్వనిమాయనెఱుఁ గలేము"( 9-112)**

**(లేదా)**

**"తొలఁగ జేయ మాకు దుర్లభుండు" (9-112)**

**కవిపరిచయం:** ఈ వాక్యము బమ్మెర పోతనామాత్యునిచే రచించబడిన ఆంధ్రమహాభాగవతమునందలి నవమ స్కంధము నుండి గ్రహింపబడిన 'అంబరీషోపాఖ్యానము" అనే పాఠ్యభాగంలోనిది.

**సందర్భం:** ఎక్కడికి వెళ్లినా వెంటాడి వచ్చే సుదర్శన చక్ర జ్వాలలకు భయపడి కైలాసానికి వెళ్లి శివుని శరణు కోరగా శివుడు దుర్వాసునితో పలికిన పలుకులివి.

**భావం:** ఓ దుర్వాసా! ఆ విశ్వేశ్వరునిలో బ్రహ్మాండాలు పుట్టిగిట్టిపోతుంటాయి. నేను, దేవలుడు, కపిలుడు, బ్రహ్మ, ప్రహ్లాదుడు మొ॥న పరతత్త్వవిదులంతా అటువంటి సర్వేశ్వరుని సుదర్శన చక్రాన్ని తొలగించటం మా వల్ల అయ్యేపని కాదు- అని ఈశ్వరుడు చెప్పాడని భావం.

**8) "గోవు వెంటఁదగులు కోడెభంగి" (9-118)**

**(లేదా)**

**"విడవనెట్టి వారినైన" (9-120)**

**(లేదా)**

**"మంచివరున్ బుణ్యసతులు మరగిన భంగిన్" ( 9-121)**

**(లేదా)**

**"చేతోమోదంబు చెఱచు సిద్ధము సుమ్మీ" (9-124)**

**(లేదా)**

**"సాధులెఱుంగుదురు నాదు చరితము విప్రా" (9-123)**

**కవిపరిచయం:** ఈ వాక్యము బమ్మెర పోతనామాత్యునిచే రచించబడిన ఆంధ్రమహాభాగవతమునందలి నవమ స్కంధము నుండి గ్రహింపబడిన 'అంబరీషోపాఖ్యానము" అనే పాఠ్యభాగంలోనిది.

**సందర్భం:** ఈ రేడు లోకాలలో ఎక్కడా శరణు లభించక వైకుంఠంలో శ్రీమహావిష్ణువు చెంతకు పోయి శరణు కోరగా శ్రీమహావిష్ణువు దుర్వాసునితో పలికే సందర్భంలోనిది.

**భావం:** దుర్వాసా! నా భక్తుడైన వాడు నా క్షేమాన్నే కోరుతాడు. భక్తులకు నేనే దిక్కు. గోవువెంట పడే కోడె లాగ, భక్తుడు ఎటుపోతే నేను అటే పోతాను. భార్యాబిడ్డల్ని, తనదేహాన్ని, జీవితాన్ని, సంపదల్ని వదిలి నన్నే నమ్ముకున్న వాళ్లను వదిలిపెట్టను. పతివ్రతలు ఉత్తముడైన భర్తను స్వాధీన పరచుకొన్నట్లు, పంచేంద్రియాల మార్గాలను దారి తప్పించి నన్నే పుణ్యాత్ములు మనసులో నిలుపుకొంటారు. సాధుల హృదయం నాది. సాధువుల హృదయాన్ని, వాళ్ళను నేనెరుగుదును. వాళ్లకు నా చరిత్ర తెలుసని శ్రీమహావిష్ణువు చెప్పెనని భావం.

**9) "సతులు ప్రభాతమంచు లేచి పలవరింప" (9-130)**

**కవిపరిచయం:** ఈ వాక్యము బమ్మెర పోతనామాత్యునిచే రచించబడిన ఆంధ్రమహాభాగవతమునందలి నవమ స్కంధము నుండి గ్రహింపబడిన 'అంబరీషోపాఖ్యానము" అనే పాఠ్యభాగంలోనిది.

**సందర్భం:** శ్రీమహావిష్ణువు ఆజ్ఞపై పోయి అంబరీషుడినే దుర్వాసుడు శరణువేడి ప్రార్థించాడు. అప్పుడు అంబరీషుడు దుర్వాసుని రక్షింపమని కోరుతూ సుదర్శన చక్రాన్ని ప్రార్థించిన సందర్భంలోనిది.

**భావం:** ఓ సుదర్శన చక్రమా! రాత్రి కలలో నీవు కనిపించినంతనే రాక్షసులు మరణిస్తారు. పడకల్లోని వారి భార్యలు తెల్లవారగనే లేచి, వారిని చూచి గొల్లుమని విలపిస్తారు అని అంబరీషుడు సుదర్శనచక్ర స్తోత్రం చేశాడు.

**10) "నైజగుణంబులై సరసవచ్చుంగాదె మిత్రాకృతిన్॥ (9-139)**

**కవిపరిచయం:** ఈ వాక్యము బమ్మెర పోతనామాత్యునిచే రచించబడిన ఆంధ్రమహాభాగవతమునందలి నవమ స్కంధము నుండి గ్రహింపబడిన 'అంబరీషోపాఖ్యానము" అనే పాఠ్యభాగంలోనిది.

**సందర్భం:** అంబరీషుని చేత రక్షింపబడిన దుర్వాసుడు శాంతిని పొంది, చల్లని మాటలతో రాజును దీవిస్తూ పలికిన మాటలివి.

**భావం:** ఓ రాజశేఖరా! నా తప్పును కాచి మేలు చేశావు. శ్రీహరి పాదపద్మాలను ఇంత గాఢంగా నమ్మి సేవించావా! ఇది ఆశ్చర్యం! కాని నీవంటి సాధువులకు ఇది అరుదేమీ కాదు. కోరింది ఇవ్వటమూ, కాపాడటమూ అనేవి నీ వంటి సాధువుకు సహజగుణాలై మైత్రీ భావంతో సరసంగా సంప్రాప్తిస్తాయి కదా! - అని దుర్వాసుడు అంబరీషుని కీర్తించెనని భావం.

# ప్రశ్నలు - సమాధానాలు

**1. అంబరీషుని పాత్రను పోతన చిత్రించిన విధం రాయండి.**

అంబరీషుడు ఇక్ష్వాకు వంశానికి చెందిన చక్రవర్తి అంటే శ్రీరామచంద్రుని వంశానికి చెందినవాడు. ఆ వంశంలో శ్రీరామునికి పూర్వుడు. నాభాగుని కుమారుడు. విష్ణువుకు అత్యంత ప్రియమైన స్వసాలతో కూడిన ఈ భూమండలాన్ని పాలిస్తూ సత్ శీలంతో, దైవచింతనతో కాలాన్ని గడుపుతూ లోకథశ్మిని గాంచాడు..

**నిరంతర విష్ణుభక్తి తత్పరుడు:**

అంబరీషుడు హరిభక్తి తత్పరుడు. మనస్సును శ్రీహరిపాదాలమీద, మాటలు హరిగుణ సంకీర్తనమందు, చేతులు నారాయణుని మందిరాలు శుభ్రపరచేందుకు, చెవులు హరికథలు వినటానికి చూపులు గోవిందుని రూపాన్ని తనివితీరా చూడటానికి, శిరసుకేశవునికి నమస్కరించటానికి, పాదాలు విష్ణుదేవుని మందిరాలు చుట్టి రావటానికి, కోరిక శ్రీహరికైంకర్యమందు. తెలిమి విష్ణుభక్తుల పాదపద్మాలయందు, నాలుక పవిత్ర తులసీదళములందు, కోరికలు పుణ్యవిషయాలయందు మాత్రమే లగ్నం చేసి జీవించేవాడు.

తలచినా, చూచినా, తాకినా, వాసన చూచినా, రుచి చూచినా 'హరి' – అనే స్మరించేవాడు. ఇలా నిరంతర విష్ణుభక్తితత్పరతతో భగవంతునికి తనను తాను సమర్పించుకున్నాడు.

**రాజర్షి:**

అంబరీషుడు రాజదండాన్ని ఋషిదండంగానే చూసేవాడు, భగవత్ సేవను భాగవతసేవను వదలక బంగారాన్ని మట్టి పెళ్లను సమానంగా చూస్తూ సర్వకర్మలను దైవపరంచేసి జీవించసాగాడు. ఎంత సంపద ఉన్నా తామరాకుమీది నీటిబొట్టులా ఇహలోక సౌఖ్యాలపట్ల ఆసక్తి కనబర్చకుండా జీవించాడు. సంసారం పట్ల మోహాన్ని విడిచి నిర్మల చిత్తుడై హరిధ్యానంతో బ్రతుకుసాగించాడు.

**క్రతువుల పట్ల వ్రతముల పట్ల ఆసక్తి:**

అంబరీషునకు క్రతవులపట్ల, వ్రతాలపట్ల అత్యంతశ్రద్ధ, ఆ ఆసక్తితోనే వశిష్టాది ఋషుల సాయంతో సరస్వతీ నదీతీరంలో, శ్రీమన్నారాయణుని గురించి ఎన్నో అశ్వమేధ యాగాలు చేశాడు. అగణితమైన భూరి దక్షిణలను ఇచ్చాడు. ఆ ఆసక్తితోనే ఏకాదశీవ్రతానికి భార్యతోకలసి పూనుకొని ఏడాదిపాటు కొనసాగించాడు. వ్రతాంతంలో కార్తీక మాసంలో మూడు రోజులు ఉపవసించి హరిని అర్చించాడు.

**విప్రభక్తి:**

అంబరీషునకు విప్రులపట్ల అమితమైన భక్తి, అందువలననే తాను చేసిన అశ్వమేధ సందర్భాలలో భూరి దక్షిణనిచ్చి గౌరవించాడు. ద్వాదశీవ్రతం చేసినప్పుడు కూడా ఆరువందలకోట్ల పాడియావుల్ని వేదవిప్రులకు దానం చేశాడు. పెక్కుమంది విప్రులకు షడ్రసోపేతమైన భోజనాన్ని పెట్టి, ఉపవాసానంతరం తాను భోజనానికి సిద్ధమయ్యాడు. ఈ భక్తి దుర్వాసమహర్షిని ఆతిథ్యానికి ఆహ్వానించటానికి కారకమైంది. చివరికి చక్రంబారినుండి దుర్వాసుడిని కాపాడటానికి కూడా హేతువైంది. ద్వాదశీఘడియలు మించిపోతున్న సందర్భంలో, ఆహ్వానించిన దుర్వాసుడు ఎంతకూ రాకుండా యున్నందున ఏమి చేయాలో తోచక చివరకు విప్రుల సలహాతోనే నీటితో పారణ గావించాడు. తనకు అపకారం చేసినప్పటికీ, శరణమన్న దుర్వాసుడిని కాపాడి అతని పాదపద్మాలకు నమస్కరించి,

యథావిధి అర్చించటం వెనుక అంబరీషుని హృదయంలోనున్నది ఈ విప్రభక్తే. అంబరీషునకు విప్రులపట్ల ఇటువంటి భక్తి శ్రద్ధలు కనిపిస్తాయి.

**శ్రీహరి కృపకు పాత్రుడు:**

భగవంతుడు భక్తసులభుడు అని చెప్పే మాటకు ప్రత్యక్షసాక్ష్యం అంబరీషుడు, అంబరీషుని భక్తికి మెచ్చిన దైవం 'ప్రతిభటశిక్షణంబును', 'నిజజనరక్షణంబును', నిఖిల జగదవక్రంబునునైన సుదర్శన చక్రాన్ని అంబరీషునకు కాపుదలగా పెట్టి అనుగ్రహించాడు. దుర్వాసుడు కృత్యను తనపైకి పంపినప్పుడు అంబరీషుడు చలించకుండా నిర్భయంగా ఉండటానికి కారణం. కృత్య అంబరీషునిపైకి దూకినప్పుడు విష్ణుమూర్తి 'వెఱ్ఱి తపస్సు చేయు వేడ బందు దక్కఁబెట్టు' మరి సుదర్శనాన్ని ఆజ్ఞాపించాడు. ఈ సుదర్శన చక్రాన్ని కాపుగా పెట్టిన దైవపు అండే కారణం. సుదర్శన చక్రపు బారినుండి కాపాడమంటూ దుర్వాసుడు శ్రీమహావిష్ణువు వద్దకు పోయినప్పుడు శ్రీహరి అన్నమాటల్ని పరిశీలించండి:

"భక్తుఁ డెందుఁ జనినఁ బఱతెంతు వెనువెంట
గోవు వెంటఁ దగులు కోడెభంగి" (9-119)

"సాధుల హృదయమునాయది
సాధుల హృదయంబునేను; జగంబులనెల్లన్
సాధులు నేనయెఱుంగుదు
సాధులెఱుంగుదురు నాదుచరితము విప్రా!" (9-123)

అని చెప్పి నాతేజం సాధుజనుల్లో ఉంటుంది. సాధువులను కష్టపెట్టే వారి తాలూకు ఆయుధమై ఆ తేజస్సు భయాన్ని కలిగిస్తుందని చెప్పి వెళ్లి అంబరీషుడినే శరణుకోరుకొమ్మని చెపుతాడు. అలా పరిపూర్ణమైన స్వామి అనుగ్రహాన్ని పొందినవాడు అంబరీషుడు.

**క్షమాశీలి:**

తనకు అపకారం చేసే వారినైనా క్షమించే స్వభావం భాగవతులకు సహజంగానే ఉంటుంది. అంబరీషుడు భాగవతోత్తముడు. కాబట్టి దుర్వాసుడు తనపై కృత్యను ప్రయోగించి ఇబ్బంది పెట్టినా పట్టించుకోలేదు. వచ్చి శరణుకోరినప్పుడు, ఋషి తన పాదాలను పట్టుకొన్నందుకు వెనుకాడి, దయార్ద్ర హృదయుడై విష్ణుచక్రాన్ని స్తుతించి "ఇంకఁజాలు, నాపన్నుడైయున్న తపసింగావు నీవు ధర్మవృత్తి" – అని అభ్యర్థించి దుర్వాసుడిని రక్షించాడు. అంతటి కారుణ్య హృదయం అంబరీషునిది.

**సందర్భోచితవర్తనుడు:**

ఏ సందర్భంలో ఎలా మసలుకుంటే ధర్మానికి భంగం కలగదో తెలిసివర్తించే తత్త్వం అంబరీషునిది. ద్వాదశి పారణ చేయబోయేముందు వచ్చిన దుర్వాసుడు నదికివెళ్లి రావటం ఆలస్యమయింది. ద్వాదశి ఘడియలు దాటిపోతే సంవత్సరకాలంగా చేసిన వ్రతఫలం దక్కదు. పైగా ద్వాదశి ఘడియలలో పారణ చేయకపోతే పాపమని చెప్పటంతో ఏమి చేయాలో తోచక విప్రులను సలహాకోరగా, తులసీతీర్థం పుచ్చుకుంటే అటుపారణ ఫలము, ఇటు అతిథిని గౌరవించిన ఫలము దక్కుతాయని చెప్పటంతో అది ఉచితవర్తనమేననిపించి అలాగే చేశాడు. అదే దుర్వాసుని కోపానికి కారణమైంది.

శ్రీమహావిష్ణువు చేసిన సూచనను అనుసరించి అంబరీషుని పాదాలపై బడ్డప్పుడు, మహర్షి తన పాదాలపై పడటమేమిటని వెనుకకు తగ్గి, దుర్వాసుని గౌరవించిన ఉదాత్త వర్తనుడు అంబరీషుడు. ఇటువంటి ఉదాత్తమైన వర్తనాన్ని కలిగియున్నందునే హరి అంబరీషుని పరమైనాడు.

**లోకోత్తర చరితుడు:**

ఏ వ్రతపారణ సందర్భంలోనైతే మునితో సమస్య ప్రారంభమయిందో, ఆమునే తన వద్ద శరణుపొంది. విముక్తుడైనప్పటికీ ఆతనిపట్ల గౌరవాన్ని ఏమాత్రమూ వీడని లోకోత్తర చరిత్ర అంబరీషునిది. "రాజా! నీ వల్ల నా ప్రాణాలు దక్కాయి" - అని దుర్వాసుడన్నప్పటికీ "తపసి నెగులు మాన్పc దానెంతవాడను, హరికృపా మహత్త్వమనుచు" ఆ గొప్పతనం శ్రీహరికరుణావిశేషమని కర్తృత్వం భగవంతునికే అర్పించిన లోకోత్తర చరితుడు అంబరీషుడు. అంతేకాదు దుర్వాసుని పాదపద్మాలకు నతులనర్పించి, గౌరవించి సుష్టుగా భోజనం పెట్టి తృప్తి పరిచాడు. అవమాన భారంతో అల్లాడిపోయే ఆతని హృదయానికి ప్రశాంతిరసాయనం పూసి చిత్తస్వాస్థ్యతను కల్పించాడు. చివరికి

శా॥ "కంటిన్ నేcటికి నిన్ను నీ వచనముల్ కర్ణద్వయప్రీతిగా
వింటి న్నన్నముcగొంటినీ గృహమునన్ వేడ్కనఫలంబబ్బె నే
మంటిన్ బోయెద! నీ చరిత్రమమరుల్ మర్త్యుల్ సుఖాసీనులై
మింటన్ మేదిని సన్నుతింపc గలరీమీద న్నరేంద్రాగ్రణీ!" (9-146)

అని దుర్వాసుడే ఆశీర్వదించి వెళ్లిపోయాడు.

**<u>వైరాగ్యచిత్తుడు:</u>**

రాజదండాన్ని బ్రహ్మదండంగా భావించి పాలించిన అంబరీషుడు బ్రహ్మపదవి, భోగభాగ్యాలు అన్నీ నరకంతో సమానమైనవేనన్న తలంపుతో రాజ్యం పట్ల మోహాన్ని మానుకొన్నాడు. చివరికి రాజ్యభారాన్ని కొడుకులకు అప్పగించి తాపసవృత్తిని అవలంబించి అడవికి వెళ్లాడు. శ్రీహరి కటాక్షాన్ని పొందాడు. ఆ విధంగా చిత్తంలో వైరాగ్యభావాన్ని నిలుపుకొని మనస్సన్న్యాసిగానే సన్యసించేవరకు గడిపాడు.

**2. మీ పాఠ్యభాగమాధారంగా దుర్వాస మహర్షి పాత్రను వివరించండి.**

దుర్వాసుడు అత్రిమహర్షి, అనసూయల పుత్రుడు. దుర్వాసుడు వేదాలను పుక్కిటపట్టినవాడు. గొప్ప తపస్సంపన్నుడు. యోగాభ్యాస నిపుణుడు. సూర్యునిలా ప్రకాశించే తేజస్సంపన్నుడు. పేరుకు తగ్గట్టే కోపమనే దుర్వాసన వెన్నంటి ఉంటుంది. ఏ కొద్దిపాటి తేడావచ్చినా తన ముక్కోపాన్ని ప్రదర్శించి హడలెత్తిస్తాడు. తనను భక్తిశ్రద్ధలతో ఆదరించి పూజించిన వారిని అనుగ్రహించటం కూడా అంతే తీవ్రంగా ఉంటుంది. దయలో ప్రేమలో, నవ్యనవనీతమైన నిండు హృదయం. కోపంలో దారుణాఖండలమైన శస్త్రతుల్యమైన వాక్కు. దుర్వాస మహర్షి వర్తనంలో కనిపించేది.

అంబరీషోపాఖ్యానంలో దుర్వాసుని భంగపాటే చెప్పబడింది. ఉచితానుచితాలు తెలియని కోపం మనిషిని ఎలా ముంచుతుందో తెలియజెప్పిన సందర్భమిది. తాను చేసిన తప్పును గమనించకుండా, ఎదుటివారి తప్పులనే ఎంచే రంధ్రాన్వేషకులకు ఎలాంటి భంగపాటు కలుగుతుందో దుర్వాసుని పాత్ర తెలియజేస్తుంది.

అంబరీషుడు ద్వాదశీ వ్రతం చేశాడు. వ్రతాంతంలో కార్తీకమాసంలో త్రిరాత్రోపవాసంచేసి దానధర్మాదులు, బ్రాహ్మణ సంతర్పణ చేసి, తాను పారణచేయబోయే సందర్భంలో దుర్వాసుడు అతిథిగా వచ్చాడు. వచ్చిన

దుర్వాసుడిని గద్దెపై కూర్చుండబెట్టి అర్ఘ్యపాద్యాది విధులతో అర్చించి భోజనానికి ఆహ్వానించాడు. దుర్వాసుడు ఎంతో సంతోషంగా అంగీకరించాడు. కాళిందీనదికి పోయి స్నానం చేస్తూ, తాను ఆతిథ్యాన్ని అంగీకరించానన్న విషయాన్ని మరచి ధ్యానమగ్నుడయ్యాడు. ఎంతకూ లేచిరాడు. పారణ చేయవలసిన అంబరీషునికి, ద్వాదశి ఘడియలు మించిపోయే సమయం సమీపిస్తోందని ఆందోళన. ద్వాదశి ఘడియలలో పారణ చేయకపోతే వచ్చే ప్రతికూలఫలానికి భయపడి, 'సలిలభక్షణంబు సమ్మతంబు' – అని చెప్పిన విప్రుల సలహామేరకు తులసీతీర్థాన్ని స్వీకరించాడు – ఇందులో అంబరీషుని దోషమేముంది?

యముననుండి వచ్చిన దుర్వాసునిపట్ల ఎంతో భక్తిశ్రద్ధలను చూపి భోజనానికి అంబరీషుడు ఆహ్వానించాడు. రాజు తాను రాకుండానే పారణ చేసిన విషయాన్ని గ్రహించి ఆగ్రహోదగ్రుడయ్యాడు. 'ఐశ్వర్యమదమెక్కి, కన్నూ మిన్నూ గానక భోజనానికి రమ్మని పిలిచి తానే ముందు ఆరగిస్తాడా? ధర్మభంగం చేసిన దుష్కర్ముడు వీడు, నేనేమిటో ఇప్పుడే చూపిస్తా. నేను కోపిస్తే మాన్పేవాడెవడు? అని

చ॥ "పెటపెట పండ్లు గీటుచును. భీకరుడై కనుఁగ్రీవనిష్ఫుకల్
పొటపొటరాల, గండములు పొంగ, మునీంద్రుడు హుంకరించుచున్
జటమొదలంటగాఁ బెఱికి చక్కన దానన కృత్యనాయుథో
త్కటవలమాన హస్తయుతంగా నొనరించె నయించే రాజుపైన్" (9–102)

అంబరీషునిపై కృత్యను ప్రయోగించాడు. చేయని తప్పుకు అంబరీషుడిని బలిచేయాలనుకున్నాడు. అంటే దుర్వాసుడు తొందరపాటుమనిషని తెలుతున్నది.

అంబరీషునికి రక్షగానున్న సుదర్శనం కృత్యను మింగి దుర్వాసుని వెంటబడింది. దాంతో భయం ప్రారంభమైంది.

ఉచితానుచితాలు పట్టించుకోకుండా ఎదుటివారి మీదికి దూకితే ఎలా ఉంటుందో దుర్వాసుడికి తెలియవచ్చింది. మేరుపర్వత గృహలలోనికి పోయినా, భూమిలో దూరినా, సముద్రంలో మునిగినా, దిక్కులుపట్టి పరుగెత్తినా, ఆకాశానికి ఎగిరినా సుదర్శన చక్రం వదలలేదు. రక్షించమనగా బ్రహ్మరుద్రులు కూడా తమ అశక్తతను తెలిపారు. చివరికి ఈశ్వరుని సూచనమేరకు విష్ణువు నాశ్రయించాడు. అంటే ప్రాణభీతి ఎలాంటిదో తెలియవచ్చింది. చివరకు విష్ణువు చెప్పినట్లుగా అంబరీషుడినే ఆశ్రయించక తప్పలేదు.

సుదర్శన చక్రపు మంటలకు ఆయాసాన్ని పొంది వెలవెలపోతూ రొప్పుతూ పోయి అంబరీషుడి పాదాలపైబడి రక్షించమని వేడుకున్నాడు. ఉచితానుచితాలు తెలిసినవాడు కాబట్టి మహర్షి తన పాదాలు పట్టుకోవటమేమిటని అంబరీషుడు వెనుకాడాడు. సుదర్శనాన్ని ప్రార్థించి దుర్వాసుడిని కాపాడాడు. అంటే తాను ఎవరినయితే అవమానించి, కృత్యద్వారా అపకారం చేయాలని భావించాడో ఆ వ్యక్తి పాదాలనే ఆశ్రయించటమంటే, అంతకుమించిన మానహాని ఉంటుందా? 'మానహానికంటే మరణంబుమేల'ని కదా! ఆర్యోక్తి. దుర్వాసుడు మానావమానాల్ని లెక్కచేయకపోవటానికి ప్రాణభయమే కారణం. ఆ సందర్భం కూడా వాటిని పరిగణించే సందర్భంకాదు. అందుకే అంబరీషునిపై కోపించే సందర్భంలో ఎలా ముందువెనుకలు చూసుకోలేదో, ఇప్పుడు కూడా అలాగే ఏ ఆలోచనలు పెట్టుకోకుండా సరాసరి వెళ్లి అంబరీషుని పాదాలపై పడ్డాడు. ఋషి హృదయం:

సాధారణంగా తాను అపకారంచేయాలని భావించిన వ్యక్తులవలననే తనకు ప్రాణదానం జరిగినప్పుడు. మానవులకా అవమానభారం భరించరానిదవుతుంది. ఘోషయాత్రలో పాండవులవమానించనెంచిన దుర్యోధనునికి గంధర్వునినుండి ఎదురైన ముప్పు పాండవుల వలననే తప్పించుకోగలిగాడు. కాని దుర్యోధనుడు ఆ తరువాత పాండవులపై అంతకుముందున్న పగను ఇంకా తీవ్రతరం చేసుకొన్నాడు. ఆ అపరాధ భావన (Guilty Consciousness) మనిషిని తొలిచివేయగా ఆత్మహత్య చేసికోవాలనుకున్నాడు. కాని ఇక్కడ దుర్వాసుడు మహర్షి. ఆయనది ఋషిహృదయం. పరమహంసల హృదయం. అది పసిపిల్లల హృదయంలాంటిది. ఏ కపటమూ ఎరుగనిది. ఏదీ మనుసులో దాగదు. అలా దాచిపెట్టుకొని సందర్భం వచ్చినప్పుడు మనిషిని ఏమార్చదు. కోపంవచ్చిందా ఒక శాపం! ఒక తిట్టు! ఆనందం వచ్చిందా ఒక వరం! అంతే. లెక్కలు ఆ ఘటనతోనే సరి. ఇక్కడ దుర్వాసుని వర్తనం కూడా అంతే. అంబరీషుడు తనకోసం వేచిచూడకుండా నీళ్లయినా ముట్టడని ఒక విశ్వాసం. కాని జరిగినది తన ఊహకందనిది అంతే! తట్టుకోలేకపోయాడు. కోపోద్రిక్తుడై అంబరీషుడిని ఇబ్బంది పెట్టాలనుకున్నాడు. తీవ్రమైన కోపస్వభావం గలవారు మంచి చెడులను విచారించలేదు. జరిగిన దానిలో తన తప్పే ప్రధానమన్న విషయాన్ని గుర్తెరగ లేకపోయాడు, ప్రాణభయంలోనున్న వాడు ఎవరేమిచెపితే అదే చేస్తాడు. దుర్వాసుడు కూడా చేసింది.

ప్రాణభీతి తొలగిన తరువాత హృదం ప్రసన్నమై అంబరీషునితో అన్నమాటల్ని చూడండి!

మ॥ నరనాథోత్తమ! మేలు సేసితికదా! నా తప్పు మన్నించి శ్రీ
హరిపాదాబ్జములింతముట్టఁగొలుతే? యాశ్చర్యమౌ నెన్నుచో
నరుదంద్రేనినుఁ బోటి సాధులకుఁ దానైయిచ్చుటల్ గాచుటల్
సొరిదిన్ నైజ గుణంబులై సరసవచ్చుంగాదె మిత్రాకృతిన్ (9–140)

నీవంటి సాధువులకు తానైయివ్వటం కాపాడటం సహజగుణాలు. అవి మిత్రాకృతిలోవచ్చి చేరతాయని అభినందించాడు.

మత్తకోకిల॥ తప్పులోఁగొని చక్రపావక దాహముం బెడఁబాసి తా
నొప్పునొప్పు భవద్దయారసమోనరేశ్వరా! ప్రాణముల్
సెప్పుమున్నునుపోయి క్రమ్మఱఁజేరె ధన్యుఁడనైతినీ
కెప్పుడున్ శుభమేనుగోరెద నింకఁబోయెద భూవరా! (9–143)

అంటూ శుభాకాంక్షలను తెలిపి బయలుదేరాడు. అంటే తాను చేసిన తప్పును మరచి, ఎదుటిమనిషి నుండి తాను పొందిన లాభానికి పరమానందపడిన మనిషి మనసులోనుండి వచ్చిన మాటలివి. ఆ కోపం, ఈ ప్రేమ రెండూ అవధిలేనివే! అందుకే అది ఋషిహృదయం.

చివరికి అంబరీషుని ఆతిథ్యం స్వీకరించి, తృప్తిగా ఆశీర్వదించి దుర్వాసుడు ఆకాశయానంతో బ్రహ్మలోకానికి చేరుకున్నాడు.

ఇలా దుర్వాసుని కోపం అంబరీషుని మహిత వ్యక్తిత్వాన్ని, తిరుగులేని విష్ణుభక్తిని లోకానికి చాటటానికి ఉపయోగపడింది.

**3. మీ పాఠ్యభాగమాధారంగా బమ్మెర పోతన కవితారీతుల్ని విశదీకరించండి.**

భాగవతంలో ప్రసిద్ధమైన ఘట్టాలలో అంబరీషోపాఖ్యానం ఒకటి. శ్రీమహావిష్ణువును అంబరీషవరదునిగా నిరూపించే ఉపాఖ్యానమిది. సంస్కృత భాగవతాన్ని తెలుగులోనికి అనువదించిన పోతన

మ॥ "ఒనరన్ నన్నయతిక్కనాదికవులీ యుర్విన్ పురాణావళుల్
తెనుగున్ జేయుచు మత్పురాకృతశుభాధిక్యంబు దానెట్టిదో
తెనుగుంజేయరుమున్ను భాగవతమున్ దీనిందెనింగించి మ
జ్జననంబున్ సఫలంబుఁ జేసెద బునర్జన్మంబులేకుండగన్"

అని సంబరపడిపోయాడు. నన్నయ తిక్కనాదులు భాగవతం జోలికిపోకపోవటం తన అదృష్టంగా భావించిన పోతన భాగవతాన్ని అనువదించి పునర్జన్మలేకుండా చేసుకుంటానని అన్నాడు. తనకే కాదు, భాగవతానికి కూడా తెలుగులో మళ్లీ పునర్జన్మ లేకుండా అనువాదం చేశాడు. అంటే పోతనలా మళ్లీ భాగవతాన్ని ఎవరూ అనువాదం చేయలేకపోయారు.

విబుధజనుల వలన విన్నది కన్నది తనకు తెలియవచ్చినది జోడించి భాగవత రచనను పోతన చేశాడు. పోతన్నను 'తెలుగుల పుణ్యపేటి' – అని విశ్వనాథ కీర్తించటంలోని ఆంతర్యము కూడా అదే.

తెలుగువాళ్ల నోళ్లలో భాగవత పద్యాలు నానినంతగా మరే యితర గ్రంథాల పద్యాలు నానలేదు. అందుకు కారణం పోతన ప్రతిభ, భక్తి తాత్పర్యాలు మాత్రమే. ఆ భక్తి తాత్పర్యాలు ఈ ఉపాఖ్యానంలో అడుగడుగునా కనిపిస్తాయి. అంబరీషుని పాత్రలో పోతనయే లీనమైనట్లు కనిపిస్తాడు.

అంబరీషుని పాత్రను పరిచయం చేస్తూ చెప్పిన ఈ పద్యాన్ని చూడండి. పోతన గారి పాత్ర చిత్రణ విధానం ఎటువంటిదో తెలుస్తుంది.

సీ॥ చిత్తంబు మధురరిపుశ్రీపాదముల యంద
పలుకులు హరిగుణపఠనమంద
కరములు విష్ణుమందిరమార్జనములంద
శ్రవములు హరికథా శ్రవణమంద
చూపులు గోవింద రూపవీక్షణమంద
శిరముకేశవనమస్కృతులయందు
పదములీశ్వరగేహ పరిసర్పణములంద;
కామంబు చక్రికైంకర్యమంద

తే.గీ. సంగమచ్యుత జనతను సంగమంద
ఘ్రాణమసురారి భక్తాంఘ్రి కమలమంద;
రసనఁ దులసిదళములంద; రతులు పుణ్య
సంగతులయంద యారాజ చంద్రమునకు. (9–82)

అంబరీషుని మనో వాక్కాయకర్మలు, జ్ఞానేంద్రియ – కర్మేంద్రియల వ్యాపారాలన్నీ శ్రీహరిచుట్టే పరిభ్రమిస్తున్నాయని చెప్పి అంబరీషుని పాత్రను పరిచయం చేశాడు. భాగవతంలో భక్తుడైన ప్రతిపాత్రను ఈ

విధమైన వర్ణనతో పాఠకులకు రూపుకట్టిస్తాడు.

**రసోచితవర్ణనలు:**

రసోచిత వర్ణనలు సందర్భోచితంగా చేయటం పోతనకు వెన్నతో పెట్టిన విద్య. అంబరీషునిపై కోపించి కృత్యను ప్రయోగించిన దుర్వాసుని కోపాన్ని వర్ణించి చెప్పిన ఈ పద్యాన్ని చూడండి.

చ॥ "పెటపెట పండ్లు గీటుచును. భీకరుడై కనుఁగ్రీవనిప్పుకల్
పొటపొటరాల, గుండములు పొంగ, మునీంద్రుడు హుంకరించుచున్
జయమొదలంటగాఁ బెఱికి చక్కన దానన కృత్యనాయుధో
త్కటవలమాన హస్తయుతఁగా నొనరించె నయించే రాజుపైన్" (9–102)

**కృత్యవర్ణన:**

కం॥ కాలానల సన్నిభయై,
శూలాయుధ హస్తయగుచు సుఱసుఱ స్రుక్కున్,
నేలఁ బదంబులఁ ద్రొక్కుచు
వాలి మహాకృత్య మనుజవల్లభుఁ జేరెన్.(9–104)

**అంబరీషుడు దానంచేసిన గోవర్ణన:**

శా॥ పా లేఱై ప్రవహింప దగ్గఱుచు లేఁ బ్రాయంబులున్ రూపము
ల్మేలై ధూర్తలు గాక వెండిగొరిజ ల్పైమోరు శృంగంబులుం
గ్రాలం గ్రేపుల యఱ్ఱు నాఁకుచును రంగచ్ఛాయలై యున్న మం
దాలన్ న్యర్బుదషట్క మిచ్చె విభుఁ డుద్యద్వేదిక శ్రేణికిన్. (9–92)

**పోతన మనసులో కొలువున్న వైకుంతవాసుని దృశ్యం:**

భాగవతంలో ఏ భక్తుడు ప్రమాదంలో నున్నా, ఎప్పుడు పిలిచినా విష్ణుమూర్తి వైకుంఠంలో మూలసౌధంలో ఏ కొలని యొడ్డునో, పూలసెజ్జపైప్రాలి లక్ష్మీదేవితో విలాసక్రీడల్ని అనుభవిస్తుంటాడు. గజేంద్రుని మొఱను విన్నప్పటి విష్ణువులాగే, దుర్వాసుని వెంట చక్రముబడినప్పుడు, భయంతో వైకుంతానికి దుర్వాసుడు పోయినప్పుడు కూడా విష్ణువు అలాగే ఉన్నాడు చూడండి.

శా॥ ఆవైకుంఠములోని భర్మమణి సౌధాగ్రంము పైలచ్చిదాఁ
గ్రేవన్ మెల్లన నర్మభాషణములంగ్రీడించు పుణ్యున్ హరిన్
దేవాధీశ్వరుఁగాంచి "యో వరద! యో దేవేశ! యో భక్త ర
క్షా విద్యాపరతంత్ర! మానుపఁ గదే, చక్రానలజ్వాలలన్." (9–115)

దీనిని బట్టి పోతనకు ఆ దృశ్యం మిక్కిలి ఇష్టమైందని తాత్పర్యం. ఎప్పుడు విష్ణుస్మరణ చేసినా పోతన మనోవీథిలో ఆ దృశ్యం సాక్షాత్కరిస్తుందన్నమాట. అందుకే మూలంలో లేకపోయినా విష్ణువును అలాగే వర్ణించాడు.

**అలంకారాలు:**

అలంకారాలు లేకుండా ఏ కవీ రచనను చేయలేదు. పోతనకూడా శబ్దార్థాలంకారాలను సమయోచితంగా ఉపయోగించుకున్నాడు.

**ఒకే పదాన్ని పునరుక్తి చేయటం:**

క॥ హరియని సంభావించును
హరియని దర్శించు; నంటు; నాఘ్రాణించున్
హరియని రుచిగొనఁదలచును
హరి హరి! ఘనునంబరీషు నలవియె పొగడన్. (9–86)

క॥ సాధుల హృదయము నాయది
సాధుల హృదయంబునేను జగములనెల్లన్
సాధుల నేనయెఱుంగుదు
సాధులెఱుంగుదురు నాదు చరితము విప్రా. (9–123)

సీ॥ నీవపావకుఁడవు; నీవ సూర్యుండవు
నీవచంద్రుండవు; నీవజలము
నీవనేలయునింగినీవ సమీరంబు
నీవభూతేంద్రియ నికరమీవ
నీవ బ్రహ్మంబును; నీవ సత్యంబును
నీవ యజ్ఞంబును నీవఫలము
నీవలోకేశులు నీవ సర్వాత్మయు
నీవ కాలంబును నీవ జగము
తే.గీ. నీవ బహుయజ్ఞ భోజివి; నీవ నిత్య
మూలతేజంబు; నీకునేమ్రొక్కువాఁడ
నీరజాక్షుండు చాల మన్నించు నట్టి
శస్త్ర ముఖ్యమ! కావవే చాలు మునిని. (9–129)

**అనుప్రాసలు:**

ఆ.వె. అతని కీహమానె హరులందు కరులందు
ధనములందు కేళివనములందు
పుత్త్రులందు బంధుమిత్రులయందును
పురమునందు నంతిపురమునందు

క॥ భాసుర నిగమపదోప
న్యాసుడు సుతపోవిలాసుఁడనుపమయోగా
భ్యాసుఁడు రవిభాసుఁడు, దు
ర్వాసుఁడతిథియయ్యెఁ దన్నివాసంబునకున్

ఇలా శబ్దాలంకారమండితంగా పద్యాన్ని భావాన్ని అలంకరించటం పోతనగారి ప్రత్యేకత.

**అర్థాలంకారాలు:** కావ్యశోభను ఇనుమడింపచేసేవి అర్థాలంకారాలే.

**సందేహం:** "కుడువకుంటకాదు కుడుచుటయునుగాదు" (9-99)

**ఉపమ:** "తనతోడినీడకైవడి

నసురూపగుణాఢ్యయైన యాత్మమహిషితో" (9-90)

"భక్తుఁడెందుఁజనినఁబఱతెంతువెనువెంట

గోవువెంటఁదగులు కోడెభంగి" (9-119)

**రూపకం:** భాసుర నిగమపదోప

న్యాసుడు సుతపోవిలాసుడు (9-95)

**స్వభావోక్తి:** దానంచేసే గోవర్ణన ()

"పాలేపై ప్రవహింపదగ్గఱుచు (9-92)

"పెటపెటపండ్లు గీటుచు (9-102)

**అర్థాంతరన్యాసము:** "నరనాథోత్తమ! మేలుసేసితిగదా! నా తప్పు మన్నించి.... (9-140)

ఇలా శబ్దార్థాలంకారాల్ని సమయోచితంగావాడి పాఠకులకు ఆసక్తిని కలిగించి విషయోద్దీప్తిని కలిగించాడు.

**శైలి:** "కొందఱకు తెలుగు గుణమగు

కొందఱికిని సంస్కృతంబు గుణమగు రెండున్

కొందఱకు గుణంబగునే

నందఱమెప్పింతు కృతుల నయ్యెయెడలన్"

అన్న పోతనకు ఏది ఎక్కడ ఏ మేరకు వాడాలో తెలుసు. తెలుగుదనమంటే కేవలం అచ్చతెనుగులోనే రాయటం కాదు. కఠినమైన సంస్కృతం అర్థం చేసుకోవటం ఎంత కష్టమో పూర్తి అచ్చతెనుగు అర్థం చేసుకోవటమూ అంతే కష్టం. పోతన ప్రధానంగా రీతికవి. రీతిని సృష్టించాలంటే సంస్కృతశబ్ద సాయంలేకుండా కేవలం తెలుగు శబ్దాలతో రీతిని సృష్టించటం కష్టం. అందుకే నన్నయగారి కాలంనుండి సంస్కృతశబ్దాలనాశ్రయించక కవులకు తప్పలేదు.

ఆ.వె. అతిథిపోయి రామినధిప! యీ ద్వాదశి

పారణంబుమానఁబాడిగాదు

కుడువ కుంటకాదు కుడుచుటయునుగాదు

"సలిలభక్షణంబు సమ్మతంబు"

ఈ పద్యంలో 'పోయిరామి', 'మానఁబాడిగాదు', 'కుడువకుంటఁగాదు కుడుచుటయునుగాదు' – అనే తెలుగు క్రియాపదాలు మిగిలిన సంస్కృతపదాలతోపాటు ఎంత చక్కగా ఒదిగిపోయాయో గమనించండి.

అలాగే "భక్తుఁడెందుఁజనినఁబఱతెంచువెనువెంట

గోవువెంటఁదగులు కోడెభంగి" –

అన్నదానిలో భక్తుడు, గోవు శబ్దాలే సంస్కృతం. మిగిలిన శబ్దాలన్నీ దేశ్యాలే. గ్రామీణ వాతావరణంలో రైతు జీవనంతో పరిచయమున్న స్వభావశీలునికే ఇలా పద్యాన్ని అత్యంత సహజంగా రాయటం వీలవుతుంది.

**సంస్కృతపదశైలి:**

అంబరీషుని పరిచయం చేస్తూ ఆరంభంలో చెప్పిన పద్యం సంస్కృత పదశైలికి నిదర్శనం

శా॥ సప్తద్వీప విశాల భూభరముదోఃస్తంభంబునం బూని సం
ప్రాప్త శ్రీయుతుఁడై మహీవిభవసంపచ్చాతురిం గల్గి దు
ర్వ్యాప్తిం జెందక వైష్ణవార్చనల మేరం గాలముం బుచ్చుచున్
సుప్తిం బొందక యొప్పె సద్గుణ గరిష్ఠుం డంబరీషుం డిలన్. (9-81)

శ్రీమహావిష్ణువు, అంబరీషుని వద్దకు పోయి శరణువేడుకొమ్మని దుర్వాసునికి చెప్పినప్పటి పద్యం

మ॥ అని శ్రీవల్లభుఁడానతిచ్చిన మహోగ్రాద్యచ్చ క్రకీలావళీ
జనితాయాసుఁడు నిర్వికాసుఁ దుదితశ్వాసుండు దుర్వాసుఁ డ
ల్లన యేతెంచి సుభక్తిఁ గాంచెఁ గరుణాలావణ్య వేషున్ విదో
షు నయోదారమనీషు మంజుమితభాషు న్నంబరీషున్ వెసన్. (9-127)

ఇలా సంస్కృతప్రేమికుల్ని, తెలుగు ప్రియుల్ని భాషాశైలివిషయంలో మెప్పించిన ఘనత పోతనది. ఆ శైలిలో తెలియని ఒక మాంత్రికత ఉంది. ఇట్టే ఆకర్షిస్తుంది. నిరాఘంటగమనంగల ధారాశుద్ధి. ఆలంకారిక పరిభాషలో చెపితే ఆయన శైలి ద్రాక్షాపాక సమన్వితం. వైదర్భీరీతి సుందరం. రసోచితంగా ఆయా సందర్భాలలో ఇతరరీతి వృత్తి పాకాలు కనిపించినా మౌళికంగా సరళంగా నుండటమే పోతనశైలి.

పోతన వర్ణనల్ని, పాత్రల్ని వర్తనాన్ని గమనిస్తే ఒక పెద్దాయన మనతోమాట్లాడుతున్నట్లే అనిపిస్తుంది. పాత్రలతో 'వినవయ్యా! తండ్రీ!' (10-113) 'సిద్ధముసుమ్మి!' (10-125) వంటి మాటల్ని పలికించటంలో ఇంట్లో పెద్దలు మాట్లాడినట్లే అనిపిస్తుంది. చివరలో దుర్వాసుడు అంబరీషుని వద్ద వీడ్కోలు పలికే సందర్భంలో

శా॥ "కంటిన్ నేటికి నిన్ను నీవచనముల్ కర్ణద్వయప్రీతిగా
వింటిన్నన్నముఁ గొంటి నీ గృహమునన్ వేడ్కన్ ఫలంబబ్బెనే
మంటిన్ బోయెద! నీ చరిత్ర మమరుల్ మర్త్యుల్ సుఖాసీనులై
మింటన్ మేదిని సన్నుతింపఁ గలరీమీదన్నరేంద్రాగ్రణీ!" (9-146)

అని అన్న ఈ పద్యాన్ని గమనించండి. కొడుకులతో కోడండ్రతో, మనుమలతో ప్రేమవాత్సల్య పూరితుడైన ఒక శాంతస్నిగ్ధమూర్తి పలికినట్లనిపిస్తుంది. ఎన్నాళ్లకు చూశాను. కర్ణపేయంగా ఎన్నాళ్లకు నీ మాటలు విన్నాను నాన్నా! ఈ వేళ కడుపునిండా తిన్నానమ్మా! - అని పెద్దవాళ్లు మన ఇళ్లల్లో పలికినట్లే ఉంటుంది. పోతన గారి పాత్రలు మాట్లాడుతుంటే.

**రసపోషణ:**

ఈ కథలో ప్రధాన రసం ధర్మవీరం. అంబరీషుడు ధర్మబద్ధంగా జీవిస్తూ, భార్యతోకలసి చేసిన ద్వాదశీవ్రత ఫలం దక్కనీయకుండా దుర్వాసుడు చేయబోయిన ప్రయత్నం వికటించి అంబరీషుని ధార్మిక ఉత్సాహాన్ని మరింతగా ఇనుమడింపచేసింది. తెగిన చుక్కలా ఊడిపడ్డ దుర్వాసుడు అనుకోని అతిథిగా రావటమే విస్మయం. ఆ విస్మయం కాళిందికేగి పరమధ్యానంలో మునిగిపోయి అంబరీషుని పారణకు అంతరాయం కలిగేలా ప్రవర్తించటంతో,

అంబరీషుని ఉత్సాహానికి వికలత కలిగి నట్లయింది. కాని విప్రుల సలహాతో తులసీతీర్థంతో పారణ చేయటంతో వికల్పం కావలసిన ఉత్సాహం పునఃప్రేరితమైంది. దుర్వాసుని కృత్యను మింగిన సుదర్శనం అంబరీషుని ఉత్సాహాన్ని స్థాయిభావస్థాయికి చేర్చింది. దుర్వాసరక్షణం, వ్రతసమాప్తితో అది రసస్థాయికి చేరింది. సుదర్శన విజృంభణం అద్భుతపోషకమైంది. చివరికి అంబరీషుడు ప్రశాంత చిత్తంతో విరాగియై, రాజ్యాన్ని సంతానానికి అప్పగించి తపోవృత్తికై వనాలకు పోవటంతో ఈ ప్రస్తావించిన రసాలన్నీ శాంతంలో అణగిపోయినట్లు అనిపిస్తుంది. అంబరీషుడు తాపసవృత్తి నవలంబించటం వంటిదే ఈ భక్తి శాంతంగా పర్యవసించటం.

**అనువాద విధానం:**

అనువాదవిధానంలో కవిత్రయం చూపిన మార్గం అనన్యసామాన్యమైంది.

1. మూలాన్ని యథాతథంగా అనువదించటం
2. మూలాన్ని సంక్షిప్తించటం
3. మూలాన్ని అన్యథా ప్రకల్పించి రాయటం
4. మూలాన్ని పరిహరించటం
5. మూలాన్ని ప్రపంచించటం

ఈ పై అన్ని పద్ధతుల్ని పాటించినప్పటికీ మూలకథను దృష్టిలో పెట్టుకొని స్వతంత్ర రచనమా అన్నట్లే పోతనరాశాడు. పోతన చేసినంత అమూల కల్పనలు మరెవరూ చేయలేదంటే ఆశ్చర్యం కాదు. పాత్రలు భగవంతుని స్తుతించే సందర్భంలో భక్త్యావేశపూరితుడై ఒక జలపాతంలా కవిత్వపు గంగను దూకిస్తాడు. పాఠకుడు ఆ రసప్రవాహంలో పడి మునకలు వేయవలసిందే తప్ప అడ్డుచెప్పలేడు.

తనను శరణుకోరి రక్షించమని ప్రార్థించిన దుర్వాసునితో శ్రీహరిచెప్పిన

చ॥ చలమున బుద్ధిమంతులగు సాధులు నా హృదయంబు లీల దొం
గిలి కొనిపోవుచుండుదు రకిల్బిషభక్తి లతాచయంబుల
న్నిలువఁగఁ బట్టి కట్టుదురు నేరుపుతో మదకుంభికైవడిన్
వలలకుఁ జిక్కి భక్తజన వత్సలతన్ జనుచుందుఁ దాపసా! (9-118)

ఆ.వె. నాకు మేలుగోరునాభక్తుడగు వాఁడు
భక్తజనులకేన పరమ గతియు;
భక్తుఁడెందు జనినఁ బఱతెంతు వెనువెంట
గోవు వెంటఁ దగులు కోడెభంగి. (9-119)

అనే పద్యాలు అమూలకాలు.

ఈ విధంగా శుకాలాపమైన భాగవతాన్ని, అభినవ శుకవాణిగా తీర్చి తెలుగు జాతికందించిన పోతన, తెలుగు భాష బ్రతికున్నంతకాలం చిరంజీవే. స్థిరజీవే.

పాఠం - 5

# మాలదాసరి కథ

## - శ్రీకృష్ణదేవరాయలు

## (ఆముక్త్యమాల్యద-షష్ఠాశ్వాసం 3వ పద్యం నుండి 66వ పద్యం వరకు)

### కవి పరిచయం, పాఠ్యభాగ ఇతివృత్తం

### 5.1. కవి పరిచయం:

"తెలుగదేలయన్న దేశంబు తెలుగేను
తెలుగు వల్లభుండ తెలుగొకండ
ఎల్లనృపులు గొలువ నెరుగవే బాసాడి
దేశభాషలందు తెలుగులెస్స".

అని చాటిన రాజకవి, కవిరాజు శ్రీకృష్ణదేవరాయలు 16వ శతాబ్దానికి చెందినవాడు. యుగపురుషుడైన శ్రీకృష్ణదేవరాయలు విజయనగర సామ్రాజ్యాధిపతియై తన పూర్వతరాలవారు కాంచిన స్వప్నాలన్నీ నిజం చేసి శత్రుదుర్నిరీక్షమైన ప్రతాపంతో కటకం నుంచి కన్యాకుమారి వరకు గల దక్షిణ భూభాగం మొత్తాన్ని తన ఏలుబడిలోకి తెచ్చి తనది రామరాజ్యం అనిపించుకున్నాడు. శత్రుభయంకరుడైన వీరుడిగా కవి పండిత సమాదరంగల భాషాపోషకుడుగా, సంస్కృతాంధ్ర కవితా ప్రజ్ఞానిధిగా రాయలు పొందిన కీర్తి ఆంధ్రదేశాన్ని పాలించిన ఏ రాజు పొందలేదు. సాహితీ సమరాంగణ సార్వభౌముడు, ఆంధ్రభోజుడు అయిన శ్రీకృష్ణదేవరాయలు విజయనగర సామ్రాజ్యాన్ని గొప్పగా పరిపాలించి రాయల కాలమంటే "స్వర్ణయుగం" గా పేరు గాంచినవాడు. భూభారాన్ని ఎనిమిది ఏనుగులు మోస్తుంటాయంటారు. అలాగే శ్రీకృష్ణదేవరాయలు క్రీ.శ. 1509-1530 మధ్య కాలంలో విద్యావినోదాలు జరుపుకొన్న సభాభవనం పేరు 'భువన విజయం'. ఈ భువనవిజయంలో ఎనిమిది దిక్కులలో ఎనిమిది సింహ పీఠికల నుంచి ఎనిమిది మంది కవులను ప్రతిష్ఠించిన సాహితీ పోషకుడు శ్రీకృష్ణదేవరాయలు. ఈ ఎనిమిది మంది కవులను అష్టదిగ్గజాలంటారు. రాయలకాలం నుండి ఆంధ్రదేశంలో ఈ అష్టదిగ్గజ సంప్రదాయం వ్యాప్తిలోకి వచ్చింది. బహుభాషాకోవిదుడైన రాయల ఆస్థానంలో తెలుగు కవులే కాక ఇతర భాషా కవులు ఉండేవారు. గొప్పకవి పోషకుడు, ప్రబంధ యుగానికి ఆద్యుడు శ్రీకృష్ణదేవరాయలు. ఆముక్తమాల్యద, మదాలస చరిత్ర, సత్యవధూ ప్రీణనం, సకల కథాసారసంగ్రహం, జ్ఞాన చింతామణి , రసమంజరి అనేవి రాయల రచనలు. ఇంత గొప్పవాడైన రాయలు తన పాలనలోని చివరి ఐదారు సంవత్సరాలు మాత్రం చిత్తశాంతి లేక గడిపి 1530వ సంవత్సరంలో పరమపదించాడు. తెలుగు సాహితీజగత్తులో మాత్రం చిరంజీవిగా నిలిచాడు .

## 5.2. ఆముక్త మాల్యద:

తెలుగు పంచకావ్యాలలో ఒకటి "ఆముక్త మాల్యద". దీనికి "విష్ణు చిత్తీయం" అనే పేరు కూడా ఉంది. 'ఆముక్త' అంటే ధరించి విడిచిన, 'మాల్య' అంటే పూలదండను, 'ద' అంటే ఇచ్చునది అని అర్థం. ఆముక్త మాల్యద అంటే ధరించి విడిచిన పూలదండను ఇచ్చునది అని అర్థం. నాయిక అయిన గోదాదేవి తన తండ్రి శ్రీహరి కోసం కట్టిన పూలమాలలను ముందుగా తాను ధరించి తర్వాత దేవుడికి ఇచ్చేది. కనుక దానికి ఆముక్త మాల్యద అనే పేరు వచ్చింది.

శ్రీకాకుళాంధ్ర మహావిష్ణువుని సేవించటానికి వెళ్ళి హరివాసరోపవాసం అక్కడ చేయగా ఆ రాత్రి శ్రీకృష్ణదేవరాయల కలలో తెలుగు వల్లభరాయడు దర్శనమిచ్చి

"పలికి తుత్ప్రేక్షోపమలు జాతి పెంపెక్క
    రసికులౌనన మదాలస చరిత్ర
భావ ధ్వని వ్యంగ్య సేవధిగాఁ గఁ జె
    ప్పితిని సత్యావధూ ప్రీణనంబు
శ్రుతి పురాణోప సంహిత లేర్చి కూర్చితి
    సకల కథా సార సంగ్రహంబు
శ్రోత ఘచ్చటలు విచ్చుగ రచించితి సూక్తి
    నైపుణి జ్ఞానచింతామణి కృతి
మఱియు రసమంజరీ ముఖ్యమధుర కావ్య
రచన మెప్పించు కొంటి గీర్వాణభాష
నంధ్రభాష యసాధ్యంబె యందు నొక్క
కృతి వినిర్మింపు మిఁక మాకుఁ బ్రియము గాఁ గ"

కృష్ణదేవరాయలు ముందు చేసిన రచనలన్నింటిని తెలిపి తెలుగులో రాయవలసిన రచన ఏదో కూడా తెలియజేశాడు తెలుగు వల్లభరాయడు.

"ఎన్నినుఁ గూర్తునన్న విను మే మును దాల్చిన మాల్య మిచ్చున
ప్పిన్నది రంగమందయిన పెండిలి సెప్పుము మున్ను గొంటినే
నన్ననదండ మొక్క మగ వాఁడిడ నేను దెలుంగురాయఁడ
న్గన్నడ రాయ యక్కొదువఁ గప్పు ప్రియా పరిభుక్త భాక్కథన్"

తెలుగు వల్లభరాయడి ఆదేశానుసారం శ్రీకృష్ణదేవరాయలు ఆముక్త మాల్యదను తన సర్వతోముఖ పాండిత్యానికి నిదర్శనంగా, వైష్ణవ తత్వానికి, జ్ఞాన భక్తి వైరాగ్యాలకి, వర్ణనా వైభవానికి, భావనాబలానికి, రాజనీతిజ్ఞతకి, ప్రౌఢ శైలీవిన్యాసానికి దర్పణంగా తీర్చిదిద్దాడు.

'ఆముక్త మాల్యద' లోని "మాలదాసరి కథ" ప్రస్తుత పాఠ్యాంశం.

## 5.3. పాఠ్యభాగ నేపథ్యం:

గోదాదేవి విరహం అర్థంకాని ఆమె తండ్రి విష్ణుచిత్తుడు శ్రీరంగనాథుడితో మొరపెట్టుకోగా ఆయన మాల దాసరి కథను విష్ణుచిత్తుడికి చెప్పాడు. మూలంలో వరాహమూర్తి భూదేవికి మాలదాసరికథను చెప్పినట్లుంది. భూదేవి మాలదాసరి కథలోని కైశికీ గాన మహాత్మ్యాన్ని విని ఆమే గోదాదేవిగా జన్మించింది. భూదేవి గోదాదేవిగా జన్మించటానికి ఇది కారణంగా కృష్ణదేవరాయలు రాశాడు. కనుక మాల దాసరికథకు, గోదాదేవి కథకు ఒక సంబంధం ఏర్పడుతుంది. కైశికీగాన మహత్మ్యం వివరించి అలాగే తానూ స్వామిని గురించి పాడవలెనని భూదేవి గోదాదేవిగా అవతరించిందనే కల్పనను శ్రీకృష్ణదేవరాయలు చేశాడు. భగవంతుడిపై భక్తి కలిగి ఉండటానికి , ఆయనను సేవించడానికి, కీర్తించి తరించటానికి, ఇతరులను తరింపజేయటానికి కులం అడ్డుగోడ కాదని అంచంచలమైన భక్తి విశ్వాసాలతో ఏదైనా సాధ్యమేనని కవి “మాలదాసరి” కథ ద్వారా నిరూపించాడు. భగవంతుడే స్వయంగా మాలదాసరి కథ చెప్పటం ఇక్కడ విశేషం. భగవంతుడు కులాన్ని కాదు గుణాన్ని చూస్తాడని చెప్పడం కూడ కవి ఉద్దేశ్యమై ఉండవచ్చు.

## 5.4. పాఠ్యభాగ ఇతివృత్తం:

నా భక్తుడొకడు మాలదాసరి ఉండేవాడు. అతడు పూర్వం నేను వామనావతారంలో నివసించిన పుణ్యాశ్రమానికి మూడామడల దూరంలో ఒక గ్రామంలో నివసించేవాడు. అతడు ప్రతిరోజు బ్రహ్మ ముహూర్తంలో ఇక్కడికి వచ్చి నా స్తోత్రాలు మంగళ కైశికి అనే రాగంలో పాడేవాడు.

అతడు ప్రతి రోజు నా ప్రీతి కొరకు తన జాతికి ఉచితమైన ధర్మమే ఆచరిస్తూ, మనస్సును ఎప్పుడు శుచిగా ఉంచుకునేవాడు. మసిగుడ్డలో కట్టిన మాణిక్యంలాగా దోషరహితుడుగా ఉండేవాడు. విష్ణుభక్తుడైన ఆ మాలదాసరి చమురు అంటుకున్న తోలుచొక్కా, టోపీతో శంఖ, చక్ర ఆకారాలలో ఇత్తడితో చేయబడిన చెవి కమ్మలు ఒప్పుతుండగా దీపస్తంభం, చర్మపు సంచి, ములికి లేని బాణం, మెడ మీద మొగలి ఆకు గొడుగు ఒప్పుతుండగా నా పాదుకను, గుర్రపు నిడుద వెంట్రుకలతో కుట్టిన చీలిన అల్పపు కిన్నెర ఒప్పుతుండగా చిన్న తాళాలు చంకలో వ్రేలాడుతున్న బుట్టకు అప్పుడప్పుడు నడక వేగంలో వడిచేత అవి కలిసి మ్రోగుతుండగా, పెద్ద పెద్ద తులసి పూసలతో కూడిన కంఠహారం, నల్లటి శరీరం, తిరుమణితో వెడల్పుగా, దళంగా ధరించిన పట్టెవర్ధనంతో ఎరుపు తేరుచున్న బెదరు చూపులతో, పసుపు పొడిగల తోలు సంచితో నన్ను కొలవటానికి వస్తూ ఉంటాడు. జాతి చేత చండాలుడైనా ఉత్తమోత్తముల ఆచారాలను అనుసరించే ఆ దాసరి ప్రతిరోజు తన బరువులు ఆ ప్రక్క దింపి, ఎండను, గాలిని, ఆకలిని గురించి ఆలోచించకుండా మధ్యాహ్నం వరకు శరీరమంతా గగుర్పొడుస్తుండగా రాళ్ళు కరిగేవిధంగా తన చండాల వీణను వాయిస్తూ, ఆనంద బాష్పాలు చెక్కిళ్ళను నిండా కప్పి వేస్తుండగా, నా స్తోత్రాలు పాడి ఆ భక్తుడు భక్తి ఉద్రేకంతో తాండవం చేస్తాడు.

ఆ విధంగా చాలాసేపు నన్ను సేవించి సాష్టాంగ నమస్కారం చేసి మ్రొక్కి, గర్భ మండపాన్ని కడిగిన మలిన జలం గుడి లోపలి రాతి తొట్టి నిండటం కారణంగా కాలువలాగా పారి గుడి బయటకు రాగా ఆ నీటిని శూద్రుడు ఇవ్వగా త్రాగుతాడు. ఆ దాసరి బ్రాహ్మణాదుల వంటి ఉత్తమజాతి వారిని చూడగానే దూరంగా పోతాడు. ఎండను గాలిని తలుచుకోకుండా ఎంత సేపైనా ఉండి స్వామి ప్రసాదం వితరణ జరిగేదాకా వేచి ఉండి తరువాత బ్రాహ్మణేతరులెవరైనా

ఇతని భగవద్భక్తికి మెచ్చుకొని తాము తెచ్చుకున్న ప్రసాదంలో దయతలచి కొంత పెడితే దానిని తన కిన్నెరను చాపి స్వీకరించి ఎంతో వినయంతో వారికి మ్రొక్కి, ఆ ప్రసాదదాత ఇచ్చిన తీర్థాన్ని త్రాగుతాడు. ఈ విధంగా తన చండాల జన్మ కారణంగా లభించిన నీచత్వానికి అనగా అస్పృశ్యత కారణంగా మిగిలిన జనులు బాధపడకుండా గుడి బయట నీరు వెలువడే తూము దగ్గర నిల్చివుండి, గుడి బయట ఆవరణకే ప్రదక్షిణం చేసి తన పట్టణానికి ప్రొద్దెక్కేటప్పుడు వెళతాడు.

ఇలా ఉండగా ఒకరోజు అర్థరాత్రి సమయంలో ఆ సమీపంలో తమ గూటిలోకి పిల్లి చొరబడటం కారణంగా కోళ్ళు కూయగా, ఆ కోడి కూతలు తెల్లవారుఝాము కోడి కూతలని భావించిన మాలదాసరి వెంటనే లేచి నన్ను కీర్తించుట కోసం వస్తూ దారిలో మరులతీగను తొక్కి, ఓ చీకటి! అని పిలిస్తే ఓ అని బదులు పలికేటట్లున్న చీకటి రాత్రిలో దారి తప్పి పొలాలన్నీ తిరిగి తూర్పున తెల్లవారే సమయానికి నిర్మానుష్యంగా ఉన్న అడవి ప్రదేశంలో ప్రవేశించి వెళుతూ ఉన్నాడు. ద్వారపార్శ్వాలు కూలిపోతే ఆ ప్రదేశంలో పొట్టి రేగులు, కసివెందలు, కోరిదలు పొదలుగా బలిసి పెరిగాయి. గాదెలు పడిపోగా వాని క్రింద బొక్కలలో ఆకలితో నకనకలాడుతున్న పందికొక్కులు అప్పటికి కాపరమున్నాయి. బావులు, పాతగోతులు దుమ్ముపడి సగం పూడిపోగా వాని నోళ్ళకు మూతలాగా చిగిరింత పెరిగింది. చీమలు గునుకు వరి గింజలను ఈడ్చుకొని వెళ్లే దారిలో సారం లేని కంచెల సమీపంలో ఆ గునుకు గింజలు పడి మొలిచి వెన్నులు పెరిగి పండి ఎండి రాలి అణగిపోయాయి. పెంటల మీద పెరిగిన దొగ్గలి చెట్లలో ముది పిల్లులు ఆకలి వెన్ను కడుపు కంటుకొనిపోగా మీసాలను కూడా కదపకుండా పడి ఉన్నాయి. పొలాలున్న దగ్గర గాదం పెరిగింది. మళ్ళలో ఔరు దుబ్బులు మెండుకున్నాయి, ఏతాలు నాశనమైపోయి అవి ఉన్న ప్రదేశాలలో వాని రాడులు మాత్రం మిగిలి ఒరిగిపోయి ఉన్నాయి. అలాంటి ప్రదేశాల నుండి దాసరి పోతూ ఉన్నాడు. దారి తప్పి నడుస్తూ ఉత్తరేణి కాయలు కాళ్ళకు గుచ్చుకోగా వాటిని తుడిచి వేస్తూ, పల్లేరు కాయలు గుచ్చుకుంటే ఉపాయంతో తొలగిస్తూ వెళుతున్నాడు.

ఆ విష్ణు భక్తుడు అలా పోతుండగా అతడికి పెద్ద మర్రిచెట్టు ఒకటి కనిపించింది. దానికి రెండేసి క్రోసుల నిడివిగల ఊడలు దిగి ఉన్నాయి. వాని పైభాగాల నుండి కొమ్మలు మొలిచాయి. ఆ కొమ్మల నుండి కొమ్మలు మొలిచాయి. ఈ మహాసముదాయంలో గాలి చరిస్తుంది. దాని వేగం చేత చెట్టు నుండి పురుగులు దొలిచిన గీరలతో కూడిన ఆకులు ఎగిరిపోయి దూరంగా వస్తున్న బాటసారుల దగ్గరపడుతున్నాయి. వారు ఆ చెట్టులో బ్రహ్మరాక్షసుడున్నాడని తెలుసుకొని దూరంగా పోతున్నారు. ఆ ఆకులలోని గీరలు "అయ్యా, మీరు నా దగ్గరకు రావద్దు, నాలో బ్రహ్మరాక్షసుడు ఒకడున్నాడు, వాడు మిమ్మల్ని తింటాడు" అని ఆ బాటసారులకు మర్రి రాసిన హెచ్చరిక జాబులాగా ఆ ఆకులున్నాయి. అలా హెచ్చరించి బాటసారులను అక్కడకు రానీయకుండా ఆపి వారి ప్రాణాలను రక్షించిన మహాపుణ్యఫలం అనే విధంగా ఆ చెట్టు నిండా లెక్కలేనన్ని పండ్లు ఉన్నాయి. ఆ దాసరి ఆ మర్రిని చూచి, అంతట ఒక కాలిబాటను చూచి ఆ ప్రదేశంలో దారి దొరకటమే గొప్పదైన లాభంగా భావించి వేగమైన నడకతో ఆ మర్రి చెట్టును క్రమక్రమంగా సమీపించి ఆ దుర్గంధపు దారిలో ఆ మర్రిని సమీపించాడు.

ఆ చెట్టు క్రింది ఎలనీటిని త్రాగి మీగడ వంటి లేత కొబ్బరిని గీకి గీకి తిని పారవేసిన కొబ్బరి బోండాలలాగా లోపల మెదడంతా జుర్రి పారవేసిన పుర్రెలు ఉన్నాయి. పళ్లతో మాంసాన్ని గీరి గీరి తినగా పైన అయిన జీరలతో ఎముకలు

ఇంకా పచ్చిగానే ఉన్నవి ఉన్నాయి.ఈగల తుట్టెలు దొనదొనయని కమ్ముకొని కిక్కిరిని ఉండటం వలన దాని స్వరూపమే కనబడకుండా ఉన్న పచ్చితోళ్లు కంపల మీద వ్రేలాడుతున్నాయి.

తినబడిన పురుషుల తల వెంట్రుకల తిప్పలు ధూళితో కూడి గాలికి రేగి కదులుతున్నాయి. అక్కడక్కడ నరుల అవయవాలు ముక్కలై పడిపోగా వాటి కోసం ఒకదానితో ఒకటి పెనుగులాడుతున్న పులుల వంటి క్రూరమృగాలున్నాయి. వాటి పొట్లాటలో వాని కాళ్ళు తొక్కడం చేత నలిగిన ఎండు మాంసపు ముక్కల నుండి దుస్సహదుర్గంధం వస్తుంది. ఆ చెట్టు దగ్గర ఆడ కుక్కలు దొంగ చూపులతో ఊర్ధ్వంగా ముందు కాళ్ళు చాచి ఎముకలను కరుచుకొని పారిపోతున్నాయి. గ్రద్దలు మాంసఖండాల తోరణాలను దొంగిలించి గబుక్కున ఎగిరిపోవడం కారణంగా కొమ్మదెబ్బ తగిలి రొదపెడుతున్నాయి. కొమ్మల మీద కోతులు అడ్డం వచ్చి వెనుకనుండి అరచేతుల దెబ్బతిని రెండు రొండులపై రెండు చేతులు పెట్టుకొని ఏడుస్తున్నాయి. ఉన్నట్లేవుండి చెట్టుపై కొన్ని చోట్ల కంటికి కనిపిస్తూ మరలా అంతలోకే అవి అదృశ్యమై వేరే చోట్ల కనిపించేటట్లుగా చేస్తున్న వ్యాపారాలు జరుగుతున్నాయి. దీనిని చూచి దాసరి తన మనస్సులో ఈ చెట్టులో ఎవడో ఉన్నాడు. వాడు మనిషి కాదు, ఒకవేళ ఆకులు, కట్టెలు తీసుకుపోవడానికి వచ్చినవాడా అనుకోవడానికి ఇది తగిన సమయం కాదు. అంతేగాక మాంసపు గాలి వీస్తుంది, నేను వెళ్ళవలసిన దారి దూరంగా ఉంది అని సందేహిస్తున్న సమయంలో ఆ దాసరికి ఆ చెట్టు మీద ఒక బ్రహ్మరాక్షసుడు కనిపించాడు.

ఆ బ్రహ్మరాక్షసుడు ఒక నరశవాన్ని గోచిపెట్టుకోగా అది పొడుగు చాలక మొలత్రాటికి బిగించి తగిలించటం వల్ల దాని నెత్తురు బొడ్డు మీదికి బావిగోడ లాంటి మొలత్రాటి మోకు మీదికి చిలికి ఉంది. అతడు తన నల్లని శరీరాన్ని ఎర్రటి దుప్పటితో కప్పుకొని బాపన చీమలు దట్టంగా పైన పట్టిన వక్రభల్లాతకి లాగా ఉన్నాడు. వాని ముఖం తలక్రిందులుగా చేసిన ఏనుగు తలలాగా ఉంది. పెదవి క్రింది నుండి కంఠం వరకు రెండు భాగాలుగా చీలినట్లున్న గడ్డం ఏనుగు తలక్రిందైన కుంభం లాగా, నోటి నుండి క్రిందికి వంగిన కోరలు రెండు తలక్రిందులైన ఏనుగు తలలోని రెండు కోరలుగా ఉన్నాయి. గడ్డం, మీసాలు అంతా ఒకటిగా నిలువుగా ఉండి కందిరీగల తుట్టెలాగా గొరోజనం రంగులో ఉంది. అందులో కొంత భాగం చొంగచేత కప్పబడి ఉంది. తనకు ఆహారం కోసం ఎవరైనా బాటసారి దారితప్పి తన చెట్టు దగ్గరకు వస్తాడేమో అని చూడటానికి పై కొమ్మల మీదకి ఎక్కి చూచే తొందరలో ప్రేగు జంధ్యం భుజాల మీద నుండి జారిపోతే దానిని కోపంగా మళ్ళీ భుజాన వేసుకుంటున్నాడు, అతడికి వ్రేలాడే బొజ్జ, బూరకాలు, చెంబుతల ఉన్నాయి. ముచ్చిలి గుంటలో కొంచెం జుట్టు మొలచి ఉంది. కళ్ళలో కండలు పెరిగి ఉన్నాయి. అతడు ఆకలి కారణంగా పిశాచికలను మాటిమాటికి కారుతిట్లు తిడుతున్నాడు. కొండంత బరువుగలవాడు, పేరు కుంభజానుడు. పేరుకు తగినట్లే అతడి మోకాళ్ళు, కుండలులాగా ఉన్నాయి.

ఆ బ్రహ్మరాక్షసుడు నిన్ను చూశాను, పోవద్దని కొమ్మల సమూహం నుగ్గు అయ్యే విధంగా నేలమీదకు దూకాడు. దాసరి కూడా రేయింబగళ్ళు, శూరుడగుట చేత యుద్ధంలో మగటిమితో కొంతకాలం భూమిపై ప్రసిద్ధి చెందినవాడైన కారణంగా బలవంతుడు కావటం వలన ఎదురు నిలిచి తన జోడమ్ముతో రాక్షసుడిని కొట్టగా వాడు జోడమ్మును త్రుంపివేశాడు.

దాసరి కూడ గర్వంతో రాక్షసుడు తనను లాగితే అడుగులు తన పాదాలను ఉన్నచోటి నుండి కదలనీయకుండా రాక్షసుడి వక్షస్థలాన్ని చరిచి అవతలకు తొలగి లంఘించి, రాక్షసుడు తనను కొట్టగా ఆ దెబ్బను ఉపాయ విశేషం చేత తప్పించుకొని, వాని వెన్ను వైపు తిరిగి వాని చేతకు కావలసిన చూపును వానివైపు ఉంచి, తన మీద రాక్షసుడు పడగా వాని చను నలుపులుండే చోట్ల గురిపెట్టి తన ముష్టి దెబ్బల బలం చేత రాక్షసుడికి లొంగకుండా నిలిచి, రాక్షసుడు తన రొమ్ము మీదకి చొరబడటానికి చూడగా తాను క్రిందికి తగ్గి తన పిడికిళ్ళ బిగువు తనకు ప్రాకారంగా వానిని తన రొమ్ము మీదకి రానీయకుండా వాడు ఎటు తిరిగినా అలాగే తిరిగి రాక్షసుడు చంపడానికి ఏదో ఒక సాధనం వెదకు సమయంలో వానిని పిడికిలితో కొట్టి, తన్ని, వాడు వెనుకకు తిరగ్గానే అమర్చుకున్న పిడికిలితో సమీపంలో నిలిచి దొరకిన సందుకు తగినట్లు వెనక్కు నడవటం చేత వెనక వీపు నడుం సందులో కొట్టి, నడిచి నా పాదాలపై ధ్యానం మనస్సులో మర్చిపోకుండా ఉన్నాడు. ఆ దాసరి తన్ని పోబోతుండగా ఆ రాక్షసుడు తన రాక్షసీ సమూహం మొత్తాన్ని పిలువగా, వారు చెట్టు దిగి రాగా, ఆ దాసరి పోతున్నాడు రండి రండి అని రాక్షసుడు పరిగెత్తి తాను, వారు కలిసి దాసరిని పట్టుకోగా ఆ దాసరి బలవంతుడు కావటం చేత ఆ రాక్షసుడిని కాళ్ళతో తంతూ మోచేతులతో వాని శరీరం రెండు ప్రక్కల పొడుస్తూ, పెనుగులాడుతుండగా ఆ రాక్షసుడు అతడిని పట్టి తెచ్చి ఈ విధంగా అన్నాడు. పొగరెక్కిన నీ తలను కత్తితో తల నుండి నరికి వేసి ఆరకుండానే దప్పిక తీర పంచ ప్రాణాలు తృప్తిపడేటట్లుగా భలే రుచిగా తాగుతాను.

ఆ తరువాత నీ మాంసాన్ని ముక్కలుగా వండి నా భార్య పిశాచి నాకు తెచ్చి యిస్తే వాటిని నంజుకుంటూ ఇదే ఈ తాటితోపులో దుత్తలుగా కట్టి ఉన్న మనుషుల పుర్రెలలోకి కారుతున్న తాటికల్లు తాగుతాను. నన్ను ఇంతగా బాధపెట్టావు కాబట్టి నిన్ను తిన్నగా చంపక చిత్రవధ చేస్తాను అని అరుస్తూ, బుసకొడుతూ ఆ పాపాత్ముడు అలిసిపోవటం చేత, అరుచుట చేత అస్పష్టవాక్యాలు పలుకుతూ దాసరిని ఖండించటానికి కత్తిని, వాడి రక్తం పట్టడానికి పాత్రను తెమ్మని పిశాచికలను పంపి, అతడిని ప్రేగుతాళ్ళ కోలగగ్గెరతో పడద్రోయగా ఆ దాసరి చెట్టు మీదకి ఒరిగి ఆ రాక్షసుడితో దిగులు లేకుండా ధర్మసూక్తి ఈ విధంగా చెప్పాడు.

ఓయి రేద్రిమ్మరి! ఒక మాట విను, తొందరెందుకు, నిను దేవతలైనా జయించగలరా? నేను నీ కంచంలోని ఆహారాన్ని, ఎక్కడకు పొగలనింక. పోరాడకుండా ప్రాణాలు రక్షించుకోవటాన్ని ఉపేక్ష చేయటం పాపమని నేను నీతో పోరాడాను. అందుకోసం నీవు కోపగించకు, నాకీ శరీరం మీద ఏ మాత్రం కోరికలేదు ఇది పోవటమే మంచిది. నీచపు జన్మ నశించటం, అది నేను నీకాహారం అవటం చేత నువ్వు సంతోషించటం మోక్షం సమీపానికి వెళ్ళటమే అవుతుంది. అశాశ్వతమైన శరీరాన్ని ఇచ్చి స్వర్గాన్ని పొందటంలో శిబి చక్రవర్తి సర్వశ్రేష్ఠుడు కదా! రోగం చేతో, దెయ్యం వలనో, తేలో, విషమో, గొప్ప మనోవ్యాధో, బందిపోటో, క్రూర జంతువులో, అగ్నో, దుర్వ్యసనాలో, పుండో, పామో, పిడుగో కారణంగానో చనిపోయేటటువంటి దుర్భల శరీరం అలా ఊరకనే నశించకుండా భూమిపై ఒక ఆకలి గొన్న వానిని రక్షించటం మంచిది కదా! సరే అది అలా ఉండనీ, ఇంకా మంచిమాట చెబుతాను. అది కూడ ప్రాణభయం చేత కాదు, మధ్యస్థుని మాటగా విను.

ప్రాణుల మేలు కోరి చెప్పేమాటకు భగవంతుడు కూడా మెచ్చుకుంటాడు కదా. పులి, సింహం, పంది, తోడేలు, కూర మృగాలలో ఒక హీనజన్మవు కాదు నువ్వు. దేవతాజన్మ కలవాడివి, నీకు కూడా మాకు లాగే కాళ్ళు, చేతులు, ముఖం, ఇంద్రియాలున్నాయి. మాకు లాగానే ఏది చేయతగింది, ఏది చేయకూడనిది అనే ఆలోచనలు సమానమే. కాదు పొరబాటుగా

అన్నాను, స్థిరంగా ఉండే చెట్ల కంటే కీటకాలకు, కీటకాల కంటే జంతువులకు, జంతువుల కంటే పశువులకు, పక్షులకు, వాటి కంటే మాకూ, మాకంటే మీకు ఇంద్రియాలు లోనగు దేహపటుత్వమెక్కువ. జ్ఞానం కూడా ఎక్కువే. అలాంటి నీకు చంపదగింది, చంపకూడనిది, తినదగింది, తినకూడనిది, తాగదగింది తాగకూడనిది అనే వివేకం లేకపోవటం సరిఅయిదేనా.

రుచిగాను, శుచిగాను ఉండని చెడ్డ ఆహారమిది, అదీగాక పాపములోనే ఎక్కువైన హింసతో పొందేది. హింస పరలోకంలో కదా బాధకలిగించేది. పరలోకం ప్రాణం పోయిన తర్వాత కదా, చిరకాలం స్థిరంగా ఉండే ప్రాణులమైన మాకెందుకు హింసా భయం అనవద్దు. ప్రాణభయం అనేది మనుషులమైన మాకు ఈ రోజైతే, మీకు తరువాత రోజో లేదా చివరకో, యుగాంతానికో తప్పదు కదా. మరణానికి భేదమేమి? మరణం పొందటం పరమాణువుకైనా, పరమాత్మకైనా తేడా ఏముంది ? ముందు జరిగింది ఆలోచించవద్దా ! తపస్సు కారణంగా లభించిన వరగర్వం చేత దేవతల గర్వమణచిన హిరణ్యకశిపుడు, రావణాసురుడు వందల వేల సంవత్సరాలు జీవించినా చివరకు తాము జయించిన యముడి చేతిలోనే చిక్కలేదా. ఇక్కడ మీరు బలవంతులైతే అక్కడ యముడు బలవంతుడు. అన్ని జీవరాశుల ఎక్కువ తక్కువలు తమ స్థానబలం చేతే కదా. ఆ యముడి ఇంట ధర్మం మీరితే మాకు తప్పని విధంగానే మీకు బాధ తప్పదు. మీరు ఆ యముడికి సోదరులు. అలా అయినా పరలోకంలో ఒకరు బాధించేవారు ఇంకొకరు బాధపడేవారవుతున్నారు. తేజస్సంబంధమైన వ్యత్యాసానికి తమోగుణం, సత్వగుణం కారణాలు, దానికి ఆహారాలు కారణాలు. భూర్భువస్సువరాది మంత్రాల చేత యజ్ఞాలలో హవిస్సుల ద్వారా వచ్చిన అన్నం కారణంగా వారు పవిత్రులై మీ కన్నా వారు ఎక్కువ కాలం జీవిస్తున్నారు. ఆ పవిత్రత చూచేకదా బ్రహ్మాంశలో పుట్టిన చంద్రుడు సకల రసాలకు అవధి అయిన సుధారసంతో తృప్తినందిస్తున్నాడు. దాని అర్థం మేము ఉచ్చరించకూడదు గానీ వేదం తొలికళను చంద్రుడు తాగునని చెపుతుంది కదా. ఇదంతా ఆలోచించి నీకు తోచినట్లు ప్రవర్తించు అనగా పెద్దగా నవ్వి ఆ బ్రహ్మరాక్షసుడు దాసరితో ఇలా అన్నాడు.

నేనూ శాస్త్రాలు చదివినవాడినే, వేదాలు చదివినవాడినే. నాకవి ఇష్టంగా లేవు. నీవు ఆ దేవతల గుణాలను పొగిడావు. వారు బ్రహ్మాంశ సంభూతులన్నావు. ఆ చంద్రుడి కళలను అగ్ని మొదలుకొని అందరూ తినువారే కదా. మేము వారికి సోదరులమన్నావు. వారు అమృతం త్రాగుతారు కానీ మాలాగా అపవిత్రమైనవి తినరన్నావు. చంద్రకళలను భుజించువారిలో మొదటివాడైన అగ్ని సర్వభక్షకుడు కదా. మేము అతని ఆచారాన్నే అవలంభించాము. కాబట్టి మాలో దోషమేమీ లేదు. ఎవరికైనా ఏ అన్నమైనా జాత్యన్నంతో సమానం కాదు. శ్రీహరికి వాహనమైన గరుత్మంతుడు ఉత్తమాన్నమైన అమృతాన్ని ఇచ్చి వేసి దానికి బదులుగా పాము ఆహారంగా కోరుకోలేదా. నిద్రాహారాలు మాని చదివి నేనిక్కడ పొందింది ఏముంది? ఈ చదువుల మిద్యా కల్పనలు విని ఎవడూ మోసపోడు. నీవు మాతో శాస్త్రాలలోని మాటలు చెప్పి ఒక్క మెచ్చుకోలూ పొందలేవు. ఈ చదివిన దాసరికూర రుచి అద్భుతంగా ఉంది. ఇంకా తెమ్మనే మెచ్చుకోలు తప్ప. అని నాస్తిక మతం అవలంబించి తన మాటలను హేళన చేస్తున్న రాక్షసుడి పిడివాదానికి కృష్ణ స్మరణం చేసి ఇతడితో వాదులాడిన ఇంక ఏమి వినవలసి వస్తుందో బుద్ధి క్షోభిస్తుంది. పని జరగాలంటే ఈ వాదనలతో పనిలేదని అనుకొని మనస్సులో బుద్ధ దేవుడిని నిలుపుకొని రాక్షసుడికి ఆనందం కలిగించే విధంగా "నీవు సర్వజ్ఞుడువి, నేను మానవుడిని, తక్కువ కులస్థుడిని, శాస్త్రాలు చదవనివాడిని, నీకు సమాధానం చెప్పగలనా? నా మాటలు మనసులో నుంచుకోక దయచేసి నా ప్రార్థన విను. నీవు ముందే రాక్షసులలో కీర్తిమంతుడివి. నేను నీకింకా కీర్తి కలిగేటట్లు చేస్తాను. నీకు నా శరీరాన్ని ఇస్తాను. దానిని మానను. నేను

ప్రతిరోజు చేసే వ్రతమొకటి ఉంది. అది ఈ రోజు కూడా జరిగేటట్లు నువ్వు సహాయం చెయ్యి. ఏడడుగులు కలిసి నడిస్తే స్నేహం కలుగుతుందనే మాట ప్రకారం మనకు స్నేహం కలిగింది. ఆ స్నేహాన్ని తలచి నా కోరిక తీర్చు. నా ప్రతిదిన నియమం ప్రకారం ఈ దగ్గరలోని కురుంగుడికి వెళ్ళి అక్కడి నారాయణుడికి స్తోత్రాలు పాడి ఆ సేవ పూర్తయిన తర్వాత నీకు ఆహారమవుతాను" అన్న దాసరి చెక్కిలికొట్టి రాక్షసుడు "నిన్ను నమ్మకూడదు, నీవు శక్తి కలిగినంత కాలం దార్లుకొట్టావు. ఈ నాటికి ఇది సులభమైన మార్గం జీవించడానికని లేని వైరాగ్యం నటిస్తూ దాసరి వేషం వేశావు. మోసం చేయడానికి అవసరమైన మాటలు కల్పించి తప్పించుకొని పారిపోవాలనుకుంటున్నావు. ఎవడూ నోటి దగ్గర కొచ్చిన కబళాన్ని వదలమన్నా వినడు, ఎవడు తన ప్రతిజ్ఞ నెరవేర్చటానికి శరీరాన్ని ఇవ్వటానికి తిరిగిరాడు. నేను పోనీయను, నీవు తిరిగి రావనేది నిశ్చయం. నీవు ఎన్ని మాటలాడినా ఎంత విచారించినా, ఎంత దుఃఖించినా ప్రయోజనం లేదు" అన్నాడు.

దానికి దాసరి చెవులు మూసుకొని నారాయణా అంటూ నీవు నన్ను నమ్ము, నమ్మకపోతే నేను పెట్టే ఒట్టు చేత నమ్ము అనగా బ్రహ్మ రాక్షసుడు ఒప్పుకోగా వేలకొలదీ ప్రమాణాలు చేశాడు. ఆ ప్రమాణాలకు రాక్షసుడు ఒప్పుకోకపోతే అయితే నేను మాటతప్పి నీ దగ్గరకు రాకపోతే ఎవరి చేత ఈ జగత్తు సృష్టించబడుతుందో, ఎవరిలో వసిస్తుందో, ఎవ్వరిలో లయమవుతుందో అలాంటి విష్ణువుతో ఇంకొక దేవుడిని పోల్చిన పాపినవుతాను అని శపథం పలుకగా రాక్షసుడు దానికి ఒప్పుకొని అతని కట్లను విప్పాడు. ఆ దాసరికి మిగిలిన పాపఫలం ఈ బంధనం. ఈ బంధనంతో ఆ పాపం తీరిపోగా అతడు వెంటనే కురుంగుడికి వెళ్ళి విష్ణు దేవుడి కీర్తనలు ఆయన మెచ్చే విధంగా పాడి, అసత్య దోషం కలుగకుండా ఉండటానికి వడివడిగా రాక్షసుడి దగ్గరకు వచ్చి తన వ్రతం పూర్తయిన సంతోషంతో ఈ విధంగా అన్నాడు. 'ఓ రాక్షసుడా! నా వ్రతం పూర్తయింది. నాకు ముక్తనుభవం కలిగింది, ఇంక నాకు ఏ చెరభయం లేదు. నీకు పంపేటప్పుడు ఏ కాళ్ళు చేతులు, ఏ కడుపు, రొమ్ము ఉన్నాయో ఆ అవయవాలు ఇప్పుడు అలాగే ఉన్నాయో లేదా చూసుకో', అని దాసరి అనగా అతని సత్యానికి ఆ బ్రహ్మరాక్షసుడు ఆనంద భాష్పాలు కురిపిస్తూ శరీరమంతా గగుర్పొడుచగా తన పెద్ద బట్టతలపై మధ్యాహ్నపు యెండ మెరుస్తుండగా ఆ దాసరిని కలవటానికి పరుగునవచ్చాడు. ఆ రాక్షసుడు కొండ తిరిగినట్లుగా దాసరికి భక్తితో ప్రదక్షిణం చేసి, పాకలపుటేనుగు ఎలా తనను కట్టి వేసిన చెట్టు చుట్టూ తిరుగుతుందో, కొండలు హోరెత్తేటట్లు రొదపెడుతూ తన నొసలు ఆ చెట్టు వేర్లకు తాకిస్తుందో అలా ఆ దాసరి పాదాలకు తన నొసలు తగులునట్లుగా కొండలు ప్రతిధ్వనించేటట్లుగా దాసరిని రాక్షసుడు స్తుతించాడు. తన కోరలతో దాసరి పాదాలను ఒకటొకటిగా తన తలపై చేర్చుకొని ఈ లోకంలో దేవాసురులు, రాజులు, మునులు, ఇలాంటి శరీరదానంలోకాక ఇతర పనులలో తమ మాట నిలుపుకున్నారు. కానీ నీలాగా అతి భయంకరమైన శరీరదాన ప్రతిజ్ఞను నెరవేర్చినవారు ఎవరు లేరు.

నేను బహుకాల వృద్ధుడిని, నాకు బాగా తెలుసు, నీలాంటి ప్రతిజ్ఞా నిర్వాహకులు జగత్తులో లేరని ప్రతిజ్ఞ చేస్తున్నాను. నువ్వు మధురమైన హరిస్తోత్రగాన సముద్రపు అలలను దివ్యనాద ప్రదంగా తుంబి కట్టిన నీ వీణ అనే తెప్పచేత దాటుతున్నావు. కురుంగుడి భగవంతుడి కరుణ నీకు పట్టుగొమ్మగా ఉంది. అలాంటి నీకు ధైర్యంలో, జ్ఞప్తిలో, మాటనిలుకడలో, శ్రీహరి సేవనమే పరాయణమైన బుద్ధిలో సాటి ఎవరు లేరు' అని రాక్షసుడనగా దాసరి అతడిని కౌగిలించుకొని "ఓ రాక్షసవరేణ్యుడా, పాపరహితుడా, నువ్వు ఈ రోజు నా వ్రతాన్ని నెరవేర్పించావు, నీ దయతో కూడిన కటాక్ష వీక్షణం చేత ఆ పని నేను నెరవేర్చగలిగాను. ప్రతిజ్ఞలను నమ్మవచ్చా? ఆపన్నుడు ప్రాణం తప్పించుకోవటానికి లక్ష

ప్రమాణాలైనా చేస్తాడు. వాటిని నమ్మి ఎంతో కష్టంతో లభించిన అన్నాన్ని వదులుకొనే మంచివాడుంటాడా, నీవు మాత్రమే అలాంటి పుణ్యాత్ముడివి. బ్రహ్మణవంశంలో పుట్టిన ఓ మహాత్ముడా, పుణ్యజనులని రాక్షసులకు కలిగిన పేరు నీ ఒక్కడిదే సుమా, నీ మూలంగా కులం మొత్తానికి పేరు కలిగింది, నీ అంత పుణ్యాత్ముడు లేడు. కడుపు ఆకలితో నకనకలాడుతున్నా నన్ను కృతార్థుడిని చేయటం కోసం పొమ్మని విడిచిపెట్టావు, మనుషులమైన మేము రాక్షసులైన మీకు జాత్యుచితమైన ఆహారం. మమ్మలిని తినటం వలన మీకే పాపం కలుగదు. అందుకు విరుద్ధంగా నువ్వు ఏమీ మాట్లాడవద్దని నా ఆన. నీకు నా పట్ల స్నేహం ఉంటే నీ అలసట పోయేవిధంగా ఈ నా శరీరాన్ని ఆరగించు. ఓ రాక్షసుడా ! నా మాటలో కపటం కానీ లోపం గానీ లేనందున భగవంతుడే సాక్షి. కాబట్టి, నువ్వు నా శరీరంలో సమృద్ధిగా ఉన్న మెదడును, క్రొవ్విన మాంసాన్ని భుజించు'' అన్నాడు.

ఆ రాక్షసుడు దుఃఖంలో 'పుణ్యాత్ముడా, నీవలా చెప్పకూడదు, నేను పుట్టిన దగ్గర నుంచి ఈ నరమాంసమే ఈ పొట్టకు పెట్టి శరీరాన్ని పెంచి మహా పాపం సంపాదించి, తరువాత అందుకు దుఃఖిస్తూ ఏనాటికైనా ఒక మహాముని, వ్రతో రాడా, ఎవరో ఒక మహాపురుషుడు ఈ దారిని రాడా, అతడి కరుణాకటాక్షంతో ఈ జన్మను పోగొట్టుకోవచ్చని చాలా కాలంగా ఎదురు చూస్తున్నాను. నువ్వు వచ్చి కూడా నన్ను భుజించు అంటున్నావు, అలా అనవద్దు. పరుసవేది నిరపరాధి అయిన గొడ్డలి ఇనుమును సమానం గానే బంగారంగా చేస్తుంది. ఈ ఉత్తమ న్యాయం నాబోటి వారి పట్ల నాలాంటివారు అవలంబించవద్దా, ఈ కరుణకు పవిత్రుడు పాత్రము. పాపి పాత్రము కాడు అనే భావం ఉండకూడదు. అందరినీ మీరు సమానంగానే అనుగ్రహించాలి.

కాబట్టి పాపినైన నన్ను కడతేర్చుట మీకు ఉచితం'' అన్నాడు. ఈ విధంగా కుంభజానుడు అనగా దాసరి అతనిని “నా శరీరాన్ని అర్పిస్తానంటే వద్దని దుఃఖంతో విచారిస్తున్నావు, మరి నీకు కావలసిన దేమిటి ?'' అని అడుగగా ఆ రాక్షసుడు 'అయ్యా, నా జీవుడి పాపాన్ని తొలగించి నన్ను శుద్ధుడిని చేయటం నాపట్ల దయచూపటం అవుతుంది కానీ నీ దేహాన్ని నాకు తినటానికి ఇవ్వటం దయ చూపటం ఎలా అవుతుంది, నీ శరీరం నాకు వద్దు, నన్ను పవిత్రుడిని చేసి నా ఈ పాడు జన్మను తొలగించమని' ప్రార్థించాడు. నేను ఘంటాకర్ణుడి కన్నా ఎక్కువ పాపం చేశానా, అతని పాపాన్ని పోగొట్టి శ్రీహరి అతడికి మోక్ష సామ్రాజ్యాన్ని ఇవ్వలేదా. ఆ హరిభక్తులు శ్రీహరి కన్నా ఎక్కువ ఇవ్వగలరు కదా. కనుక నీవు నాకు ఆ ఘంటాకర్ణుడికి శ్రీహరి చేసిన మేలును చేయి. ఏదైనా ఒక ప్రాగిని సంతోషపెట్టడం హరి పూజనమే కాబట్టి నాకు మేలు చేయడం నీకు మహాపుణ్యప్రదమౌతుంది అని రాక్షసుడు అన్నాడు. అదెలా సాధ్యమని దాసరి అడుగగా నేను బ్రహ్మరాక్షసుడిని , కుంభజానుడనే పేరుగలవాడిని. క్రూరకర్మలు చేసినవాడిని. మర్రిచెట్టు నాశ్రయించి బాటసారుల్ని బ్రాహ్మణుల్ని నమిలి మింగేసినవాడిని. పూర్వజన్మలో సోమశర్మ అనే బ్రాహ్మణుడిని, దయతలచదగినవాడిని. చేసిన చెడు పనులు కారణంగా ఈ జన్మ వచ్చింది. నీవు ఈరోజు స్వామిని గురించి పాడిన పాట ఫలాన్ని నాకు జలపూర్వకంగా ఇస్తే భయంకరమైన ఈ జన్మ పోతుంది. నీకు ఆర్తులను రక్షించిన పుణ్యఫలం సిద్ధిస్తుంది.

ధర్మ సాధనమైన ఈ శరీరం ఇల్లు చేరుతుంది అని రాక్షసుడు దాసరిని వేడుకొన్నాడు. ఆ మాటలకు దాసరి నవ్వి నేను ఉత్తమమైన అధమమైన జన్మలెన్నో ఎత్తాను అందులో ఇదొకటి. ఈ శరీరం కోసం హరినామ కీర్తనాఫలం ఒక రోజుది

కాదు. తృటికాలపు ఫలమైనా నేను ఇవ్వను. విష్ణుసేవ ప్రార్థనీయము, దుర్లభము. ఈ శరీరం క్షుద్రమైంది, ఈ క్షుద్రమైన దాని కోసం విష్ణుసేవను ఇవ్వలేను. ఈ సంసారచక్రంలో విష్ణుభక్తికి వెలియయిన అల్పపుణ్యాలచే ఉత్తమ జన్మలు, పాపాలచే అధమజన్మలు వస్తాయి. విష్ణుభక్తి ఉంటే అధోజన్మలు రావు. మరి ఉత్తమ జన్మల కంటే మోక్షమే ఎక్కువ కనుక అదే కలుగుతుంది. సోమయాజులం అని చెప్పుకునే వారి శ్రౌతకర్మ నిష్ఠకంటే విష్ణుసేవే ఎక్కువ. ఇతర జన్మ పరంపరల కన్నా భాగవతజన్మ పవిత్రమైంది. నీవు, నేను ఎన్నిసార్లు లోకపాల దేహాన్ని ధరించాము వెంటనే బిచ్చగాని శరీరాన్ని ఎత్తలేదు. రాజు శరీరాన్ని, దాసుడి శరీరాన్ని , సింహం శరీరాన్ని, పురుగు శరీరాన్ని, ఏనుగు శరీరాన్ని , దోమ శరీరాన్ని, సోమయాజులుగా, చండాల జన్మలుగా పుట్టలేదు. ఈ శరీరం ఊటనీటిలాగా నిలువనిది, సాలిపురుగు నేసిన నేతలో కట్టిన బూరుగుదూదిలాగా స్థితిలేనిది. ఎండలోని పసుపు కాంతి లాంటిది, దూలంలో పురుగు తొలిచిన అక్షరం వంటిది. దీని మీద మమకారంతో హరిస్తుతి గీతఫలం అమ్మటం కర్పూరం చెల్లించి ఉప్పుకొనటం లాంటిది అని దాసరి అన్నాడు. ఆ మాటలు విని రాక్షసుడు ఓ మాలదాసరి, దయచేసి ఈ రోజుటి సంగీతఫలంలో సగమైనా ఇవ్వు. చేప తాగిన గుక్కనీళ్ళ చేత సముద్రం తక్కువౌతుందా. ఒకరోజు గీతఫలంలో సగం నాకిస్తే ఫలితం తక్కువవ్వదు కదా అని రాక్షసుడు ప్రార్థించాడు. అప్పుడు దాసరి 'ఓయీ రాక్షసుడా మరొకసారి చెబుతున్నాను. నీవు అడిగింది శరీరాన్ని, దేహాన్నిస్తానని అప్పుడే ప్రతిజ్ఞ చేశాను, గానఫలాన్ని నీవు అప్పుడు కోరలేదు, నేను ఇస్తానని చెప్పలేదు. నీవు లోతు ప్రశ్నలను మానెయ్. నీవు మరీ బలవంతం చేస్తే కోపంతోనో, విసుగుతోనే నీకు గీతఫలాన్ని ఇస్తానని అనుకోవద్దు. ఎలాంది పరిస్థితుల్లోనూ గానఫలం ధారపోయటం కుదరదు. బావి తవ్వగా భూతం బయటపడుతుంది" అన్నాడు, అప్పుడు రాక్షసుడు దాసరీ ! పాటలో పరక భాగఫలమైనా ఇవ్వరాదా, అందుకు నేను సిద్ధం కాకపోతే ఈవేళ బ్రహ్మముహూర్తంలో నువ్వు పాడిన చరమగీత ఫలమైనా ప్రసాదించి నన్ను అనుగ్రహించమని వేడుకున్నాడు.

అప్పుడు దాసరి దయతో లేవనెత్తి పూర్వ వృత్తాంతం చెప్పమనగా బ్రహ్మరాక్షసుడు సోమశర్మ తన వృత్తాంతమంతా వివరించాడు. అతడి కథ విన్న దాసరి "గానానికి ఫలితం ఉందో లేదో నాకు తెలియదు. ఫలితమనేది పరమేశ్వరుడి అధీనం, ఫలితం కావాలని కోరుకోవటం కూడా బంధ కారణమే. ఆ భగవంతుడే నిన్ను రక్షిస్తాడు" అని ఓదార్చాడు. దాసరి నోటి వెంట ఆ మాట రాగానే బ్రహ్మరాక్షసుడు బ్రాహ్మణ వేషంలో ఉన్న సోమశర్మగా మారి శాపవిముక్తి పొందాడు.

భూమిని ఎత్తే సమయంలో వరాహమూర్తి భూదేవికి గానమహాత్మ్యం గురించి తెలియజేయడం కోసం మాలదాసరి కథ చెప్పాడని, గానవిశిష్టతను విన్న భూదేవివే గోదాదేవిగా జన్మించిందని శ్రీ రంగనాధుడే స్వయంగా ఈ కథను విష్ణుచిత్తుడికి చెప్పడం ద్వారా మాలదాసరి ఔన్నత్యం నిరూపించబడింది.

**డా॥ ఇరపని మాధవి**
తెలుగు & ప్రాచ్య భాషా విభాగం,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,
నాగార్జున నగర్.

**పాఠం - 6**

# మాలదాసరి కథ

## - శ్రీకృష్ణదేవరాయలు

## సమగ్ర వ్యాఖ్యలు

3. **కలడొకరుండు పేరుకొనగాని కులంబు మదీయభక్తుడి**
**య్యిల మునువాడు వామనత నే వేసియుంపనొ పుణ్యభూమి నం**
**దుల కొకయోజన త్రయపు దూరపుటూర వసించి బ్రహ్మవే**
**ళల జనుదెంచి పాడు మము లాలస మంగళనామకైశికిన్**

**పరిచయం:**

ఈ పద్యం సాహితీ సమరాంగణ సార్వభౌముడైన శ్రీకృష్ణదేవరాయలు రచించిన 'ఆముక్త మాల్యద' షష్ఠాశ్వాసం లోని 'మాలదాసరి కథ' అనే పాఠ్యభాగం నుండి గ్రహించబడింది.

**సందర్భం:**

స్వయంగా శ్రీహరే తన భక్తుడైన మాలదాసరి కథ విష్ణుచిత్తుడికి తెలియజేసే సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| ఒకరుండు | = | ఒకడు |
| పేరుకొనగాని కులంబు | = | చెప్పరాని జాతివాడు (పంచముడు) |
| మదీయ భక్తుడు | = | నా యొక్క భక్తుడు |
| కలడు | = | ఉండేవాడు |
| వాడు | = | అతడు |
| మును | = | పూర్వం |
| ఈ యిల | = | ఈ భూమిపై |

| | | |
|---|---|---|
| ఏన్ | = | నేను |
| వామనతను | = | వామనావతరంలో |
| పుణ్యభూమిన్ | = | ఒక పుణ్యక్షేత్రంలో |
| వసింపనో | = | నివసించానో |
| అందులకున్ | = | ఆ ఆశ్రమానికి |
| యెజన త్రయపు | = | మూడామడల |
| దూరపుటూరన్ | = | దూరపు గ్రామంలో |
| వసించి | = | నివాసముంటూ |
| బ్రహ్మవేళలన్ | = | తెల్లవారుఝామున బ్రాహ్మీముహుర్తకాలంలో |
| చనుదెంచి | = | వచ్చి |
| మమున్ | = | నన్ను |
| లాలసన్ | = | మహాభిలాషతో |
| మంగళనామకైశికిన్ | = | మంగళ కైశికీ రాగంతో |
| పాడును | = | గానం చేయును |

**తాత్పర్యం:**

నా భక్తుడొకడు మాలదాసరి ఉండేవాడు. అతడు పూర్వం వామనావతారంలో ఉండగా నేను నివసించిన పుణ్యాశ్రమానికి మూడామడల దూరంలో ఒక గ్రామంలో నివసిస్తూ ప్రతిరోజు బ్రాహ్మీముహుర్తంలో ఇక్కడికి వచ్చి నా స్తోత్రాలు మంగళ కైశికి రాగంలో పాడుతుండేవాడు.

**విశేషాంశాలు:**

శ్రీ వామన మూర్తి నివసించిన దివ్య ప్రదేశానికి తమిళంలో 'కురుంగుడి' అని పేరు.

కైశికీ రాగం - 15 మేళకర్త, సమ మప - సనిప మరిస

కైశికీ పురాణంలో "యస్తు గాయతి సంయుక్తం కైశికం విష్ణు సంసది

సతార యతి దుర్గాణి శ్వపాకో రాక్షసం యథా"అని భగవంతుడు చెప్పాడు.

**ఛందస్సు :**

| న | జ | భ | జ | జ | జ | ర |
|---|---|---|---|---|---|---|
| I I I | I U I | U I I | I U I | I U I | I U I | U I I |
| కలడొ | కరుండు | పేరుకొ | నగాని | కులంబు | మదీయ | భక్తుడి |

ఈ పద్యపాదం చంపకమాల వృత్తానికి సంబంధించింది. నజభజజజర అనే గణాలుంటాయి. ప్రాసనియమం కలదు. యతిస్థానం 11వ అక్షరం.

7. **గండా భోగముల మ్మదశ్రులహరు ల్గప్పన్నుతుల్పాడియా**
**దండన్వ్రేగులు డించి భక్తి జనితోద్యత్తాండవం బాడు నా**
**చండాలేతర శీలుడుత్పులకుడై చాండాలికన్మీటుచున్**
**గుండుల్నీరుగ నెండ గాలి పసితాకుంజూడ కాప్రాహ్ణమున్**

**పరిచయం :**

ఈ పద్యం సాహితీ సమరాంగణ సార్వభౌముడైన శ్రీ కృష్ణదేవరాయలు రచించిన 'ఆముక్త మాల్యద' షష్ఠాశ్వాసం లోని 'మాలదాసరి కథ' అనే పాఠ్య భాగం నుండి గ్రహించబడింది.

**సందర్భం :**

మాలదాసరి మంగళకైశికి రాగంలో విష్ణుమూర్తి స్తుతులను పాడు విధానాన్ని వర్ణించు సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| ఆ చండాల + ఇతర శీలుడు | = | చండాలురకు వ్యతిరేకమైన ప్రవర్తన కలవాడు / సాధువర్తన కలిగినవాడు |
| ఆ దండన్ | = | ఆ సమీపంలో |
| వ్రేగులు | = | తన బరువులు |
| డించి | = | దించి |
| ఉత్ + పులకితుడై | = | ఉద్గతములైన పులకములు కలవాడై |
| ఎండన్ | = | ఎండ వేడిని |
| గాలిన్ | = | కసురు గాలిని |
| పసితాకున్ | = | ఆకలి దెబ్బను (పసి = ఆకలి (తమిళంలో)) |

| | | |
|---|---|---|
| చూడక | = | తలంచక |
| ఆ ప్రాహ్ణమున్ | = | మధ్యాహ్నం వరకు |
| గుండుల్ నీరుగన్ | = | రాళ్ళు కరిగే విధంగా |
| చాండాలికన్ | = | చండాల వీణను |
| మీటుచున్ | = | వాయిస్తూ |
| గండ ఆ భోగములన్ | = | చెక్కిళ్ళ నిండా |
| ముత్ అశ్రులహరుల్ | = | ఆనంద బాష్పప్రవాహాలు |
| కప్పన్ | = | కమ్ముకోగా |
| ముతుల్ | = | నా స్తోత్రాలు |
| పాడి | = | గానం చేసి |
| భక్తి జనితోద్యత్తాండవం | = | భక్తి జనిత + ఉద్యత్ + తాండవం |
| భక్తి జనిత | = | భక్తి వలన పుట్టిన |
| ఉద్యత్ | = | విజృంభిస్తున్న |
| తాండవంబు | = | నాట్యం |
| ఆడున్ | = | చేస్తాడు |

**తాత్పర్యం :**

జాతి చేత చండాలుడైనా ఉత్తమోత్తములైన ఆచారాలలో ఉన్న దాసరి ప్రతిరోజు తన బరువులు ఆ ప్రక్కనే దింపి ఎండను, గాలిని, ఆకలిని తలంచక మధ్యాహ్నం వరకు శరీరమంతా గగుర్పొడిచే విధంగా, రాళ్ళు కరుగునట్లుగా, తన చండాల వీణను వాయిస్తూ ఆనంద బాష్పాలు చెక్కిళ్ళ నిండా కమ్ముకునే విధంగా నా స్తోత్రాలు పాడి భక్తి ఉద్రేకంతో తాండవమాడతాడు.

**విశేషాంశాలు:**

ఈ పద్యంలో బాష్పరోమాంచం అనే సాత్వికభావాలు చెప్పబడ్డాయి. గుండుల్నీరుగా అనే లోకోక్తి ప్రయోగించ బడింది. అంటే సంగీతం తెలియనివారు కూడా అపరిమితానందాన్ని పొందుతారని అర్థం. పగలు ప్రాహ్ణం, మధ్యాహ్నం, అపరాహ్ణం అని మూడు భాగాలు. ప్రాహ్ణం అంటే తొలి పదిగడియల సమయం. ఆప్రాహ్ణమున్ అంటే ఆ పదిగడియల సమయము అని అర్థం.

**ఛందస్సు :**

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| మ | స | జ | స | త | త | గ |
| U U U | I I U | I U I | I I U | U U I | U U I | U |
| గండాభో | గముల | న్మదఁశు | లహరు | ల్గప్ప న్ను | తాల్పాడి | యా |

ఈ పద్యం శార్దూలం వృత్తానికి చెందింది. మసజసతతగ అనే గణాలుంటాయి. ప్రాసనియమం కలదు. యతిస్థానం 13వ అక్షరం.

**15. కాంచెన్వైష్ణవుడర్ధ యోజన జటాఘాటోత్థశాఖోపశా**
**ఖాంచజ్ఝాట చరన్మరు ద్రయదవీయః ప్రేషితోద్యచ్ఛదో**
**దంచత్కోరుకృత వ్రణచ్ఛలనలిప్యాపాది తాధ్వన్యని**
**స్సంచారాత్త మహోఫలోపమ ఫలస్ఫాయ ద్వటక్ష్మాజమున్**

**పరిచయం :**

ఈ పద్యం సాహితీ సమరాంగణ సార్వభౌముడైన శ్రీ కృష్ణ దేవరాయలు రచించిన 'ఆముక్త మాల్యద' షష్ఠాశ్వాసం లోని 'మాలదాసరి కథ' అనే పాఠ్యభాగం నుండి గ్రహించబడింది.

**సందర్భం :**

మాలదాసరి అర్ధరాత్రి సమయంలో అడవిలో దారితప్పి పోతూ ఉండగా అతడికి పెద్ద మఱ్ఱి చెట్టు కనిపించిన సందర్భంలోనిది పద్యం.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| వైష్ణవుడు | = | ఆ విష్ణు భక్తుడైన దాసరి |
| అర్ధయోజన | = | సగమామడు (రెండు క్రోసులు) నిడివిగల |
| జటాం | = | ఊడల |
| ఘాటా | = | పైభాగపు ప్రక్కల నుండి |
| ఉత్థ | = | మొలచిన |
| శాఖా | = | కొమ్మలయు |
| ఉపశాఖా | = | ఆ కొమ్మల కొమ్మలయు |
| అంచత్ | = | పర్వుచున్న |

| | | |
|---|---|---|
| ఝూట | = | సమూహాల నుండి |
| చరత్ | = | సంచరిస్తున్న |
| మరుత్ | = | గాలి |
| రయ | = | వేగం చేత |
| దవీయః | = | దూరానికి |
| ప్రేషిత | = | పంపబడినవై |
| ఉద్యత్ | = | పోవుచున్న |
| ఛద | = | ఆకులలోని |
| ఉదంచత్ | = | ఒప్పుచున్న |
| కీట కృత వ్రణ | = | పురుగుల చేత చేయబడిన రంధ్రాలనే |
| ఛలన | = | మిషగల |
| లిపి | = | రాత చేత |
| ఆపాదిత | = | సమకూర్చబడిన |
| అధ్వన్యనిస్సంచార | = | బాటసారులు నడయుడుట లేని కారణంగా |
| ఆత్త | = | పొందబడిన |
| మహాఫల | = | గొప్పఫలం (పుణ్యాఫలం) |
| ఉపమ | = | సాటి అయిన |
| ఫల | = | పండ్ల చేత |
| స్ఫాయత్ | = | విస్తరిల్లుచున్న |
| వటక్ష్మాజమున్ | = | మర్రిచెట్టును |
| కాంచెన్ | = | చూశాడు |

**తాత్పర్యం :**

ఆ విష్ణుభక్తుడైన దాసరి అలా పోతూ ఉండగా అతడికి పెద్ద మర్రి చెట్టొకటి కనిపించింది. దానికి రెండేసి క్రోసుల నిడివిగల ఊడలు దిగి ఉన్నాయి. వానిపై భాగాల నుండి కొమ్మలు మొలిచి, ఆ కొమ్మలకు మళ్ళీ కొమ్మలు మొలిచున్నాయి. ఈ మహా సముదాయంలో గాలి చరిస్తుంది. ఆ గాలి వేగం చేత చెట్టు నుండి పురుగులు తొలిచిన గీరలు గల ఆకులు ఎగిరి దూరాన వస్తున్న బాటసారుల దగ్గర పడుతున్నాయి. వారు ఆ చెట్టుపై బ్రహ్మరాక్షసి ఉందనే ప్రతీతితో దీని దగ్గరకు రాకుండా దూరంగా పోతుంటారు. అందువల్ల ఆ ఆకులలోని ఆ గీరలు 'అయ్యా, మీరు నా దగ్గరకు రావద్దు, నాపై బ్రహ్మ

రాక్షసుడు ఉన్నాడు, వాడు మిమ్మలిని భక్షిస్తాడు' అని ఆ బాటసారులకు ఆ మర్రి రాసిన హెచ్చరిక జాబులేమో అని భావించేవిధంగా ఉన్నాయి. బాటసారులను దగ్గరకు రానీయని పుణ్యఫలమేమో అనే విధంగా ఆ చెట్టునిండా లెక్కలేనన్ని పండ్లున్నాయి.

**విశేషాంశాలు:**

ఈ పద్యంలో ఉన్న రీతి 'గౌడి'. పరుషమైన అక్షరాలతో, దీర్ఘ సమాసాలతో ఉన్న పదరచనే గౌడి. రీతి ఎప్పుడూ రసపోషకంగా ఉండాలంటారు. తరువాత పద్యంలో పోషించబడే బీభత్సానికి పోషకంగా ఈ పద్యరచన ఉంటుంది. శ్రీ కృష్ణ దేవరాయల రచనా వైదుష్యం ఈ పద్యంలో చూడవచ్చు.

**ఛందస్సు :**

| మ | స | జ | స | త | త | గ |
|---|---|---|---|---|---|---|
| U U U | I I U | I U I | I I U | U U I | U U I | U |
| కాంచెన్వై | ష్ణవు డ | ర్ధ యోజ | న జటా | ఘాటోత్థ | శాఖోప | శా |

ఈ పద్యం శార్దూలం వృత్తానికి చెందింది. మసజసతతగ అనే గణాలుంటాయి. ప్రాసనియమం కలదు. యతిస్థానం 13వ అక్షరం.

**21. వాడును గంటిబోకుమని వ్రాలె మహీన్విటపాళి నుగ్గుగా**
**వీడును మున్నురే పగటివేళకు మానిసి యౌటఁ బోరిలో**
**వాడిమి గోంతకాల మిల వ్రాలుట లావరి యౌట నిల్చియా**
**వాడి శరంబుచే వాడది ద్రుంపుడు వీడు నుద్దతిన్**

**పరిచయం :**

శ్రీకృష్ణదేవరాయలు రచించిన 'ఆముక్త మాల్యద' లోని షష్ఠాశ్వాసం లోని 'మాలదాసరి కథ' అనే పాఠ్యభాగం నుండి గ్రహించబడింది.

**సందర్భం :**

బ్రహ్మరాక్షసుడు చూసిన మర్రిచెట్టు సమీపానికి వచ్చిన దాసరిని ఆ బ్రహ్మరాక్షసుడు చూసిన సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం :**

వాడును = ఆ బ్రహ్మ రాక్షసుడును

| | | |
|---|---|---|
| కంటిన్ | = | నిన్ను చూశాను |
| పోకుము అని | = | పారిపోకు అని |
| విటపాళి | = | కొమ్మల సమూహం |
| నుగ్గుగాన్ | = | నలిగి పోయే విధంగా |
| మహిన్ | = | భూమి మీదకు |
| వ్రాలెన్ | = | దూకాడు |
| వీడును | = | దాసరి కూడా |
| మున్ను రేపగటి వేళకున్ | = | రాత్రింబగళ్ళకు |
| మానిసి ఔటన్ | = | శూరుడగుట చేత |
| పోరిలోన్ | = | యుద్ధంలో |
| వాడిమిన్ | = | మగటిమితో |
| కొంతకాలం | = | కొన్ని రోజులు |
| ఇలన్ | = | భూమిపై |
| వ్రాలుటన్ | = | ప్రసిద్ధి పొందిన వాడైనందున |
| లావరి | = | బలవంతుడు |
| ఔటన్ | = | అయినందున |
| నిల్చి | = | పారిపోక నిలబడి |
| ఆవాడి శరంబుచేన్ | = | తన పదునుగల జోడమ్ముతో |
| అడవన్ | = | రాక్షసుని కొట్టగా |
| వాడు | = | ఆ రాక్షసుడు |
| అది | = | ఆ జోడమ్మును |
| త్రుంపుడన్ | = | ఖండింపగా |
| వీడున్ | = | దాసరి కూడా |
| ఉద్ధతిన్ | = | గర్వంతో |

**తాత్పర్యం :**

ఆ బ్రహ్మరాక్షసుడు నిన్ను చూశాను, పోవద్దని కొమ్మల సమూహం నుగ్గు అయ్యే విధంగా నేలపైకి దూకాడు. దాసరి కూడా రేయింబగళ్ళు శూరుడగుట చేత యుద్ధంలో ముగటిమితో కొంతకాలం పోరి భూమిపై ప్రసిద్ధి చెందినవాడవటం చేత, బలవంతుడు అవటం చేత అక్కడే నిలబడి తన జోడమ్ముతో రాక్షసుడిని కొట్టాడు. ఆ రాక్షసుడు ఆ జోడమ్మును త్రుంపగా దాసరి కూడా గర్వంతో

**విశేషాంశాలు:**

దాసరితో విష్ణు భక్తే కాదు దేశభక్తి కూడా ఉందని నిరూపించే పద్యం. దాసరి ధైర్య సాహసాలను శూరత్వాన్ని నిరూపించే పద్యమిది.

**ఛందస్సు :**

| భ | ర | న | భ | భ | ర | వ |
|---|---|---|---|---|---|---|
| U I I | U I U | I I I | U I I | U I I | U I U | I U |
| వాడును | గంటిబో | కుమని | వ్రాలెమ | హిన్విట | పాళిను | గ్గగా |

ఈ పద్యపాదంలో భరనభ భరవ అనే గణాలున్నాయి. ప్రాసనియమం కలదు. యతిస్థానం 10వ అక్షరం. కాబట్టి ఇది ఉత్పలమాల వృత్తం.

**25. సారాస్వాదనఁ బ్రాణ పంచకము తృష్ణం బాసి సంతర్పణ**
**న్మారింబో దసిఁ ద్రుంచి పొంగెడు భవన్మాంసంబు ధారోష్ణమిం**
**పారం గ్రోలి పిశాచి నీదు కణకుట్లందీ నీదస్త్రాల కాం**
**తారాంతర్న్భ కపాల కుండ నిగళన్మైరేయముం ద్రాగెదన్**

**పరిచయం :**

ఈ పద్యం సాహితీ సమరాంగణ సార్వభౌముడైన శ్రీకృష్ణదేవరాయలు రచించిన 'ఆముక్త మాల్యద' షష్ఠాశ్వాసం లోని 'మాలదాసరి కథ' అనే పాఠ్యభాగం నుండి గ్రహింపబడింది.

**సందర్భం :**

దాసరితో పోరిన బ్రహ్మరాక్షసుడు అలసటతో, కోపంతో దాసరితో మాట్లాడే సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం :**

సార ఆస్వాదనన్ = శ్రేష్ఠమైన రుచిచేత

| | | |
|---|---|---|
| తృష్ణన్ | = | దప్పికను |
| పాసి | = | తీర్చుకొని |
| సంతర్పణన్ | = | తనియించుట చేత |
| ప్రాణపంచకము | = | పంచ ప్రాణాలు |
| మూరిన్‌పోన్ | = | విజృంభించే విధంగా |
| పొంగెడు భవత్ ముండంబున్ | = | గర్వమెక్కి ఉన్న నీ తలను |
| అసిన్ | = | కత్తితో |
| త్రెంచి | = | నరికి |
| ధార ఉష్ణము | = | వేడి ఆరని నెత్తుటిని |
| ఇంపు ఆరన్ | = | ప్రీతితో |
| క్రోలి | = | త్రాగిన వాడనై |
| పిశాచి | = | నా భార్య అయిన పిశాచి |
| నీదు కఱకుట్లు | = | కఱకుగుచ్చి నిప్పులమీద త్రిప్పుతూ కాల్చిన నీ మాంసం |
| అంది-ఈన్ | = | నాకు అందించగా |
| అదః | = | ఈ |
| తాలకాంతార | = | తాటి చెట్ల తోపులలోని |
| అంతః | = | లోపలి |
| నృకపాల | = | మనిషి పుర్రెలనెడి |
| కుండ | = | కుండలలో |
| విగళత్ | = | ఓడుతున్న |
| మైరేయమున్ | = | కల్లును |
| త్రాగెదన్ | = | పానం చేస్తాను |

**తాత్పర్యం :**

పొగర్కొన్న నీ తలను కత్తితో మెడ నుండి నరకివేసి నీ మొండెం నుండి దుమికే నీ మొండెపు రక్తాన్ని వేడి ఆరకనే దాహం తీరే విధంగా పంచప్రాణాలు తృప్తిపడే విధంగా బలే రుచితో త్రాగుతాను. నీ మాంసాన్ని కఱకుట్లుగా

వండి నా భార్య పిశాచి నాకు తెచ్చియిస్తుంది. వాటిని నంజుకుంటూ ఈ తాటితోపులో దుత్తలుగా కట్టి వున్న మనిషి పుర్రెలలోనికి ఓడుతున్న తాటికల్లు త్రాగుతాను.

**ఛందస్సు :**

| మ | స | జ | స | త | త | గ |
|---|---|---|---|---|---|---|
| U U U | I I U | I U I | I I U | U U I | U U I | I |
| సారాస్వా | దన బ్రా | ణపంచ | కము తృ | ష్ణం బాసి | సంతర్ప | ణ |

ఈ పద్యపాదంలో మసజసతతగ అనే గణాలున్నాయి. ప్రాసనియమం కలదు. యతిస్థానం 13వ అక్షరం. కాబట్టి శార్దూలవృత్తమిది.

**28. వినుమొక మాట రాత్రిచర వేగిరమేటికి నిన్ జయింతురే**
**యనిమిషులైన భాజనగతాన్నమ నేనిఁ క నెందుఁ బోయెదన్**
**బెనఁగక ప్రాణరక్షణ ముపేక్ష యొనర్చుట పాపమిందుకై**
**కనలకు నాకు మేనియెడ గాంక్షయు లేదిది వోవుటే యురున్**

**పరిచయం :**

ఈ పద్యం సాహితీ సమరాంగణ సార్వభౌముడైన శ్రీకృష్ణదేవరాయలు రచించిన 'ఆముక్త మాల్యద' షష్ఠాశ్వాసం లోని 'మాలదాసరి కథ' అనే పాఠ్యభాగం నుండి గ్రహింపబడింది.

**సందర్భం :**

బ్రహ్మరాక్షసుడితో తలపడిన తర్వాత బ్రహ్మరాక్షసుడు దాసరిని కట్టివేసి అతడిని ఖండించడానికి కత్తిని, వాని రక్తం పట్టటానికి పాత్రను తెమ్మని పిశాచికలను పంపిన తర్వాత అతడితో దాసరి మాట్లాడే సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| రాత్రిచర | = | రాత్రి సమయంలో తిరిగే ఓ రాక్షసుడా |
| వినుము | = | విను |
| ఒక మాట | = | ఒక మాట |
| వేగిరం | = | తొందర |
| ఏటికి | = | ఎందుకు |

| | | |
|---|---|---|
| నిన్ | = | నిన్ను |
| జయింతురే | = | గెల్వగలరా |
| అనిమిషులైనా | = | దేవతలైనా |
| భాజనగత అన్నమును | = | నీ కంచంలోని ఆహారాన్ని |
| పెనగక | = | పోరాడక |
| ప్రాణ రక్షణ | = | ప్రాణాన్ని రక్షించుకోవటం |
| ఉపేక్ష యొనర్చుట | = | ఉపేక్షించటం |
| పాపం | = | పాపం |
| ఇందులకై | = | ఇందు కోసమై (నేను నీతో పెనుగులాడినందుకు) |
| కనలకు | = | కోపగించవద్దు |
| నాకు | = | నాకు |
| మేని యెడ | = | శరీరం పట్ల |
| కాంక్షయు లేదు | = | కోరిక లేదు |
| ఇది | = | ఈ శరీరం |
| పోవుటే | = | పోవడమే |
| ఉరున్ | = | తగును |

**తాత్పర్యం :**

రాత్రి సమమయంలో సంచరించే ఓ బ్రహ్మరాక్షసుడా! ఒక మాట విను. తొందరెందుకు? నిన్ను దేవతలైనా జయించగలరా? నేను నీ కంచంలోని ఆహారాన్ని. నేను ఇంక ఎక్కడకు వెళతాను? పెనుగులాడక ప్రాణరక్షణను ఉపేక్షించటం పాపం. అందుకోసం నేను నీతో పోరాడినందుకు కోపగించకు. నాకీ శరీరం పట్ల కోరిక లేదు. ఈ దేహం పోవటమే తగినది.

**ఛందస్సు :**

| న | జ | భ | జ | జ | జ | ర |
|---|---|---|---|---|---|---|
| I I I | I U I | U I I | I U I | I U I | I U I | U I U |
| వినుమొ | క మాట | రాత్రిచ | రవేగిర | మేటికి | నిన్ జ | యింతురే |

ఈ పద్యపాదంలో నజభజజజర అనే గణాలున్నాయి. ప్రాసనియమం కలదు. యతిస్థానం 11వ అక్షరం. కాబట్టి ఇది చంపకమాల.

**33. నిలుమొహో మము వారి భ్రాతలనుచున్ నీ వంటి వారల్సుధా**
**శుల పూతాశులుగారటంటి ప్రతిపత్సోమాంసము న్గోలుమున్**
**జ్వల నుండంటిక నొండు నిన్నడిగెదన్ సర్వాశిగాడా యతం**
**డిల దన్న్యాయము చాలు మాకునఘమే వృద్ధానుచారంబికన్**

**పరిచయం :**

ఈ పద్యం సాహితీ సమరాంగణ సార్వభౌముడైన శ్రీకృష్ణదేవరాయలు రచించిన 'ఆముక్త మాల్యద' షష్ఠాశ్వాసం లోని 'మాలదాసరి కథ' అనే పాఠ్యభాగం నుండి గ్రహింపబడింది.

**సందర్భం :**

దాసరి రాక్షసుడికి హింసతో కూడిన తినకూడని ఆహారం భుజించడం మంచిదికాదని చెప్పినప్పుడు అతడికి బ్రహ్మరాక్షసుడు సమాధానం చెప్పే సందర్భం లోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| నిలుము | = | నిలువుము |
| ఓహో | = | ఆశ్చర్యం |
| మమున్ | = | మమ్మల్ని |
| వారి భ్రాతలు | = | వారి సోదరులము |
| అనుచున్ | = | అంటూ |
| నీవు | = | నువ్వు |
| అంటి | = | అన్నావు |
| వారల్ | = | దేవతలు |
| సుధా ఆశులు | = | అమృత భోజనులు |
| అపూత + ఆశులు | = | అపవిత్రమైన భోజనం కలవారు |
| కారు అంటివి | = | కారని అన్నావు |
| జ్వలనుండు | = | అగ్ని |

| | | |
|---|---|---|
| ప్రతిపత్ సోమఅంశమున్ | = | పాడ్యమి నాటి సోముడి కళను |
| క్రోలున్ అంటి | = | తింటాడు అన్నావు |
| ఇకన్ | = | ఇంక |
| ఒండు | = | ఒకటి |
| నిన్నడిగెదన్ | = | నిన్ను అడుగుతాను |
| ఆతండు | = | ఆ అగ్ని |
| సర్వ ఆశి | = | సర్వ భకక్షుడు |
| కాడే | = | అయి వుండలేదా |
| ఇలన్ | = | భూమిపై |
| తత్న్యాయము | = | అతడి ఆచారమే |
| మాకున్ | = | రాక్షసులమైన మాకు |
| చాలున్ | = | ప్రమాణం |
| ఇకన్ | = | మరి |
| వృద్ధ అనుచారంబు | = | పెద్దల నడవడిక ప్రకారం నడుచుకోవటం |
| అఘమే | = | పాపమూ (కాదనుట) |

**తాత్పర్యం :**

మేము వారి భ్రాతలమన్నావు. వారు అమృతాన్నే భుజిస్తారు కానీ మాలాగా అపవిత్ర భోజనం చేయని వారన్నావు. చంద్రకళలను భక్షించుటలో మొదటివంతువాడయిన అగ్ని సర్వభక్షకుడు కదా, మేమూ అతడి ఆచారాన్ని పాటిస్తున్నాము, కాబట్టి మా పాపమేమీ లేదు.

**ఛందస్సు :**

| స | భ | ర | న | మ | య | వ |
|---|---|---|---|---|---|---|
| I I U | U I I | U U U | I I I | U U U | I U U | I U |
| నిలుమో | హో మము | వారి భ్రా | తలను | చున్ నీ వం | టి వార | ల్సుధా |

ఈ పద్యపాదంలో సభరనమయవ అనే గణాలున్నాయి. ప్రాసనియమం కలదు. యతిస్థానం 14వ అక్షరం. కాబట్టి ఇది మత్తేభం.

35. నిదురయు గూడు బోఁజదివి నేనిటగన్నది యేమి యెవ్వడీ
చదువుల యర్థవాదపు మృషల్విని బేల్పడు నీవు మాయెడం
జదువుల మాటలాడి కనజాల వొకానొక మెచ్చునొక్కడీ
చదివిన కూర వింత చవి చాలగదెమ్మను మెచ్చు దక్కగన్

**పరిచయం :**

ఈ పద్యం సాహితీ సమరాంగణ సార్వభౌముడైన శ్రీకృష్ణదేవరాయలు రచించిన 'ఆముక్త మాల్యద' షష్ఠాశ్వాసం లోని 'మాలదాసరి కథ' అనే పాఠ్యభాగం నుండి గ్రహింపబడింది.

**సందర్భం :**

బ్రహ్మరాక్షసుడు మాలదాసరితో అమృతమైనా జాత్యనానికి సమానం కాదని, అలాంటి శాస్త్ర విశేషాలు చెప్పి మెప్పు పొందలేవని మాలదాసరితో చెప్పే సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| నిదురయు | = | నిద్ర |
| కూడు | = | అన్నం |
| పో చదివి | = | పోయేవిధంగా చదివి |
| నేను | = | నేను |
| ఇట | = | ఇక్కడ |
| కన్నది ఏమి | = | అనుభవించింది ఏముంది |
| ఎవ్వడీ | = | ఎవరు ఈ |
| చదువుల | = | విద్యల |
| అర్థ వాదపు మృషల్ | = | ఉదాహరణ కోసం కల్పించబడిన మిథ్యాకల్పనలను |
| వినేని | = | విని |
| బేల్పడున్ | = | మోసపోతాడు |
| నీవు | = | నువ్వు |
| మా యెడ | = | మాపట్ల |
| చదువుల మాటలు | = | శాస్త్ర విషయాలు |
| ఆడి | = | చెప్పి |

| | | |
|---|---|---|
| కనజాలవు | = | పొందలేవు |
| ఒకానొక | = | ఒక్కటైనా |
| మెచ్చు | = | పొగడ్త |
| ఒక్క | = | ఒకటే |
| ఈ చదివిన కూర | = | భోజ్యమైన ఈ చదివిన దాసరి |
| వింత రుచి | = | అద్భుతమైన రుచి |
| చాలగన్ | = | ఇంకా ఇంకా |
| తెమ్మను | = | తీసుకు రండి అనే |
| మెచ్చు | = | మెచ్చుకోలు |
| దక్కగన్ | = | తప్పించి |

**తాత్పర్యం :**

నిద్ర, అన్నం పోగొట్టుకొని చదివి నేనిక్కడ అనుభవించింది ఏముంది? ఎవరు ఈ చదువుల్లో ఉదాహరణ కోసం కల్పించబడిన మిథ్యా కల్పనలను విని మోసపోతారు (తాను మోసపోనని అర్థం). నువ్వు శాస్త్ర సంబంధ విషయాలు మాతో మాట్లాడి ఒక మెచ్చుకోలు కూడా పొందలేవు. ఈ చదివిన దాసరి కూర అద్భుతమైన రుచిగా ఉంది. ఇంకా తెండి అనే ఒక్క మెప్పు తప్పించి.

**ఛందస్సు :**

| న | జ | భ | జ | జ | జ | ర |
|---|---|---|---|---|---|---|
| I I I | I U I | U I I | I U I | I U I | I U I | U I U |
| నిదుర | యు గూడు | బోఁజది | వి నేని | టగన్న | ది యేమి | యెవ్వడీ |

ఈ పద్యపాదంలో నజభజజజర అనే గణాలున్నాయి. ప్రాసనియమం కలదు. యతిస్థానం 11వ అక్షరం. కాబట్టి ఇది చంపకమాల వృత్తం.

37. **ప్రఖ్యాతుండవు దైత్యులందు మును పాపైనొక్క నీకాయశో**
**భిఖ్య న్నేనును బేర్తు మేయొసగు దప్పింపన్ వ్రతంబొక్కడే**
**ముఖ్యంబై యొనరింతు దాని సఫలంబు న్సేయగా లేవుగా**
**సఖ్యం సాప్తపదీన మన్మన మిథస్సాంగత్యమూహించుచున్**

**పరిచయం :**

ఈ పద్యం సాహితీ సమరాంగణ సార్వభౌముడైన శ్రీకృష్ణదేవరాయలు రచించిన 'ఆముక్త మాల్యద' షష్ఠాశ్వాసం లోని 'మాలదాసరి కథ' అనే పాఠ్యభాగం నుండి గ్రహింపబడింది.

**సందర్భం :**

బ్రహ్మరాక్షసుడితో దాసరి తను ఆచరిస్తున్న వ్రతం గురించి చెప్పే సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| మునుపు | = | మొదలనే |
| దైత్యులందున్ | = | రాక్షసులలో |
| ప్రఖ్యాతుండవు | = | ప్రసిద్ధి చెందినవాడివి |
| ఆపైన్ | = | దానికి తోడుగా |
| నేనును | = | నేను కూడా |
| నీకా | = | నీకు |
| యశః అభిఖ్యన్ | = | కీర్తి యొక్క శోభను |
| బేర్తున్ | = | కూరుస్తాను |
| మే ఒసగున్ | = | దేహం ఇవ్వటం |
| తప్పింపన్ | = | మానను |
| ముఖ్యంబై | = | ప్రధానంగా |
| వ్రతంబు ఒక్కడే | = | ఒక వ్రతాన్నే |
| ఒనరింతున్ | = | ఆచరిస్తాను |
| సఖ్యం | = | స్నేహం |
| సాప్తపదీనమ్ | = | ఏడు అడుగులు నడిస్తే కలుగుతుంది |
| అను | = | మన |
| మిథస్ సాంగత్యము | = | ఒకరితో ఒకరికున్న సంబంధం |
| ఊహించుచున్ | = | తలుచుకుంటూ |

| | | |
|---|---|---|
| దానినే | = | ఆ వ్రతాన్ని |
| సఫలంబున్ | = | నెరవేరిన దానిగా |
| సేయవే | = | చేయలేవా |

**తాత్పర్యం :**

నీవు మొదటనే రాక్షసులలో కీర్తిమంతుడివి. నేను కూడా నీకు ఇంకా కీర్తి కలిగేటట్లు చేస్తాను. నీకు నా దేహం ఇవ్వటం మానను. నేను నిత్యం ఆచరించే ఒక వ్రతం ఉంది. అది ఈ రోజు జరిగే విధంగా నువ్వు చెయ్యి. ఏడు అడుగులు కలిసి నడిస్తే వారికి స్నేహం కలుగుతుందనే సుద్ది ప్రకారం మనకు స్నేహం కలిగింది. ఆ స్నేహం తలచి నా కోరికను తీర్చు.

**ఛందస్సు :**

| మ | స | జ | స | త | త | గ |
|---|---|---|---|---|---|---|
| U U U | I I U | I U I | I I U | U U I | U U I | U |
| ప్రఖ్యాతు | ండవు దై | త్యులందు | ముసు పా | పైనొక్క | నీకాయ | శో |

ఈ పద్యపాదంలో మసజసతతగ అనే గణాలున్నాయి. ప్రాసనియమం కలదు. యతిస్థానం 13వ అక్షరం. కాబట్టి ఇది శార్దూల వృత్తం.

41. **ఏ రాజ్యంబు నరుండు నోరి కడివో నీ బోధ మాలించు నిం**
**కే రాజ్యంబు నరుండు బాసకయి మేనీదాన మేతెంచుదీ**
**పారన్నే జననీ మియు న్మగిడి నీవా రామియుం దెల్ల మే**
**లారంతుల్పలు పల్కు లంత్యకుల యేలా చింత లేలావగల్**

**పరిచయం :**

ఈ పద్యం సాహితీ సమరాంగణ సార్వభౌముడైన శ్రీకృష్ణదేవరాయలు రచించిన 'ఆముక్త మాల్యద' షష్ఠాశ్వాసం లోని 'మాలదాసరి కథ' అనే పాఠ్యభాగం నుండి గ్రహింపబడింది.

**సందర్భం :**

ఆ రోజు వ్రతమాచరించడానికి పంపమన్న దాసరికి బ్రహ్మరాక్షసుడు సమాధానం చెప్పే సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| ఏ రాజ్యంబు నరుండు | = | ఏ దేశపు మనిషి |

| | | |
|---|---|---|
| నోరికడి | = | నోటిలోని కబళం |
| పోన్ | = | తప్పిపోవునట్లుగా |
| ఈ బోధము | = | ఇప్పటికి పోనిమ్మనెడి ఈ ఉపదేశాన్ని |
| ఆలించున్ | = | వినును |
| బాసకయి | = | చేసిన ప్రతిజ్ఞ కోసం |
| మేన్ఈన్ | = | తన శరీరాన్ని ఇవ్వటానికై |
| యేతెంచు | = | వస్తాడు |
| తీపు ఆరన్ | = | నీకు సంతోషం కలుగునట్లు |
| చననీవమియున్ | = | పోనివ్వనియు |
| నీవా | = | నువ్వు |
| మగిడి | = | తిరిగి |
| రామియున్ | = | రావనియు |
| తెల్లం | = | స్పష్టం |
| అంత్యకుల | = | కడపటి జాతివాడా |
| ఏలా | = | ఎందుకు |
| రంతుల్ | = | రచ్చలు |
| ఏలా | = | ఎందుకు |
| చింతల్ | = | ఆలోచనలు |
| ఏలా | = | ఎందుకు |
| వగలు | = | దుఃఖాలు |

**తాత్పర్యం :**

ఎవ్వడు నోటి దగ్గరి కబళాన్ని వదలమన్నా వినడు, ఎవడూ తన ప్రతిజ్ఞ నెరవేర్చడానికి శరీరం ఇవ్వటం కోసం మరలారాడు. నేను పోనివ్వనని, నీవు రావనటం నిశ్చయం. ఎక్కువ మాటలాడి రచ్చ చేయటం చేత ప్రయోజనం లేదు. నీవు ఎంత విచారించినా, ఎంత దుఃఖపడినా ప్రయోజనం లేదు.

**ఛందస్సు :**

| మ | స | జ | స | త | త | గ |
|---|---|---|---|---|---|---|
| U U U | I I U | I U I | I I U | U U I | U U I | U |
| ఏ రాజ్యం | బు నరుం | డు నోరి | కడివో | నీ బోధ | మాలించు | నిం |

ఈ పద్యపాదంలో మసజసతతగ అనే గణాలున్నాయి. ప్రాసనియమం కలదు. యతిస్థానం 13వ అక్షరం. కాబట్టి ఇది శార్దూల వృత్తం.

**43.** **ఎవ్వనిచూడ్కి జేసి జనియించు జగంబు వసించు నిజ్జగం**
**బెవ్వని యందు డిందు మఱి యెవ్వనియందిది యట్టి విష్ణుతో**
**నివ్వల నొక్కివేల్పు గణియించిన పాతకి నౌదు నేడనే**
**నెవ్విధినైన నినదియ నేని యనన్విని బందమూడ్చినన్**

**పరిచయం :**

ఈ పద్యం సాహితీ సమరాంగణ సార్వభౌముడైన శ్రీకృష్ణదేవరాయలు రచించిన 'ఆముక్త మాల్యద' షష్ఠాశ్వాసం లోని 'మాలదాసరి కథ' అనే పాఠ్యభాగం నుండి గ్రహింపబడింది.

**సందర్భం :**

ఎన్ని ఒట్లు పెట్టినా తనను పంపనన్న బ్రహ్మరాక్షసుడితో వెళ్ళి తప్పక తిరిగి వస్తానని దాసరి చివరి ఒట్టు పెట్టే సందర్భంలోనిది పద్యం.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| నేడ | = | ఈ దినమే |
| నేను | = | నేను |
| ఎవ్విధినైనన్ | = | ఏవిధంగానైనా |
| నిన్ | = | నిన్ను |
| కదియనేని | = | చేరకపోతినా |
| ఎవ్వని చూడ్కిజేసి | = | ఏ విష్ణువు కటాక్షం చేత |

| | | |
|---|---|---|
| జగంబు | = | లోకం |
| జనియించున్ | = | పుట్టునో |
| ఇజ్జగంబు | = | ఈ లోకం |
| ఎవ్వనియందున్ | = | ఏ విష్ణువులో |
| వసించున్ | = | స్థితినొందునో |
| మఱి | = | పిమ్మట |
| ఇది | = | ఈ లోకం |
| ఎవ్వని యందున్ | = | ఏ విష్ణువు నందు |
| డిందున్ | = | లయించునో |
| అట్టి విష్ణుతో | = | అలాంటి విష్ణువుతో |
| ఇవ్వలన్ | = | ఈ ప్రక్క |
| ఒక్కవేల్పున్ | = | ఒక దేవతను |
| గణియించిన | = | లెక్కపెట్టిన |
| పాతకిన్ | = | పాపాత్ముడిని |
| ఔదున్ | = | అవుతాను |
| అనన్ | = | అని అనగా |
| విని | = | రాక్షసుడు విని |
| బంధము | = | కట్టిన కట్టును |
| ఊడ్చినన్ | = | విప్పివెయ్యగా |

**తాత్పర్యం :**

నేను ఏవిధంగానైనా ఈ రోజు మరల నీ దగ్గరకు రాకపోతే సృష్టి స్థితిలయకారుడైన విష్ణువుతో వేరేదైవాన్ని సాటిచేసిన పాపానపోతాను అని దాసరి శపథం పల్కగా, రాక్షసుడు దానికి ఒప్పుకొని అతడి కట్లను విప్పివేశాడు. విష్ణువుకు మరియే దైవం సాటికాదని అర్థం.

**44. అతడు తదల్పపాపఫల మందుట సుంకము దీఱిపోయిత**
**చ్ఛత దళపత్ర నేత్రునకు జాగిలి మ్రొక్కి రణద్విపంచి యై**
**స్తుతి కలిత ప్రబంధముల జొక్కగఁ బాడి యసత్య భీభర**
**ద్రుత గతి వచ్చి రాత్రిచరుతో వ్రతపూర్తి గతార్తినిట్లనున్**

**పరిచయం :**

ఈ పద్యం సాహితీ సమరాంగణ సార్వభౌముడైన శ్రీకృష్ణదేవరాయలు రచించిన 'ఆముక్త మాల్యద' షష్ఠాశ్వాసం లోని 'మాలదాసరి కథ' అనే పాఠ్యభాగం నుండి గ్రహింపబడింది.

**సందర్భం :**

దాసరి తన వ్రతపూర్తి చేసుకున్న సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| అతడు | = | ఆ దాసరి |
| తదల్ప | = | ఆ బంధనమనే అల్పమైన |
| పాపఫలమందుటన్ | = | పాప ఫలితాన్ని అనుభవించటం |
| సుంకము | = | ప్రతిబంధకం |
| తీఱి | = | తొలగగా |
| పోయి | = | తాను వెళ్ళి |
| తత్ | = | ఆ కురంగుడిలోని |
| శతదళపత్రనేత్రునకున్ | = | కమలాక్షుడైన శ్రీహరిక |
| చాగిలి మ్రొక్కి | = | దండ ప్రణామ మాచరించి |
| రణత్ విపంచియై | = | మ్రోయుచున్న వీణ కలవాడై |
| స్తుతి కలిత ప్రబంధములన్ | = | స్తోత్రాలతో కూడిన పాటలను |
| చొక్కగన్ | = | శ్రీహరి ఆనందించేటట్లు |
| పాడి | = | గానం చేసి |
| అసత్య | = | అబద్ధపు |

| | | |
|---|---|---|
| భీ | = | భయము యొక్క |
| భర | = | భారం చేత |
| ద్రుతగతిన్ | = | వేగపు నడకతో |
| వచ్చి | = | రాక్షసుడి దగ్గరకు వచ్చి |
| వ్రతపూర్తిన్ | = | వ్రతం నెరవేరుట వలన |
| గత ఆర్తిన్ | = | పోయిన పీడ చేత |
| ఇట్లనున్ | = | ఇలా అన్నాడు |

**తాత్పర్యం :**

ఆ దాసరికి ఏ పాపలేశం మిగిలి వుందో దాని ఫలమే ఆ బంధనం. తదనుభవం చేత ఆ పాపలేశం తీరిపోయింది. అతడు తటాయిన కురుంగుడికి వెళ్ళి విష్ణు దేవుడి కీర్తనలు ఆయన మెచ్చునట్లు పాడి, అసత్యదోషం తనకు తగలకుండా ఉండే విధంగా వేగంగా రాక్షసుడి దగ్గరకు వచ్చి తన వ్రతం పూర్తి అయిన సంతోషంతో వానిలో ఇలా అన్నాడు.

**ఛందస్సు :**

| న | జ | భ | జ | జ | జ | ర |
|---|---|---|---|---|---|---|
| I I I | I U I | U I I | I U I | I U I | I U I | U I I |
| అతడు | తదల్ప | పాపఫ | ల మందు | ట సుంక | ము దీటి | పోయిత |

ఈ పద్యపాదంలో నజభజజజర అనే గణాలున్నాయి. ప్రాసనియమం కలదు. యతిస్థానం 11వ అక్షరం. కాబట్టి ఇది చంపకమాల వృత్తం.

**47. కొండయుబోలె భక్తివల గొంచునె వాడు నిజ ద్రుమ భ్రమీ**
**హిండన వ్రాలు పాకలపు టేనుగుబోలె నొసల్త దంష్ట్రులం**
**దుండ రొదన్మహాగిరులు హోరన బ్రస్తుతి వ్రాలి దంష్ట్రికా**
**దండము లెత్తిపట్టిన పదం బొకడొక్కడ నెత్తిజేర్చుచున్**

**పరిచయం :**

ఈ పద్యం సాహితీ సమరాంగణ సార్వభౌముడైన శ్రీకృష్ణదేవరాయలు రచించిన 'ఆముక్త మాల్యద' షష్ఠాశ్వాసం లోని 'మాలదాసరి కథ' అనే పాఠ్యభాగం నుండి గ్రహింపబడింది.

**సందర్భం :**

సత్యానికి కట్టుబడి వచ్చిన దాసరిని చూసిన బ్రహ్మరాక్షసుడి స్థితిని వర్ణించే సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| వాడు | = | ఆ రాక్షసుడు |
| కొండయుబోలెన్ | = | తానొక కొండేమో అనే విధంగా |
| భక్తిన్ | = | భక్తితో |
| వలగొంచునె | = | ప్రదక్షిణం చేస్తూనే |
| నిజ | = | తనను కట్టి ఉన్న |
| ద్రుమ | = | చెట్టు |
| భ్రమీ | = | బవిరిగా |
| హిండనన్ | = | తిరగటం చేత |
| వ్రాలు పాకలపు ఏనుగువోలెన్ | = | పడెడు పాకల వ్యాధి ఉన్న ఏనుగులాగా |
| నొసలు | = | తన నుదుటి భాగం |
| తత్ | = | ఆ దాసరి యొక్క |
| అంఘ్రులందున్ | = | పాదములందు |
| ఉండన్ | = | తగులునట్లుగా |
| రొదన్ | = | పెను మ్రోత చేత |
| మహాగిరుల్ | = | పెద్ద కొండలు |
| హోరు అనన్ | = | హోరు మ్రోగగా |
| ప్రస్తుతిన్ | = | స్తుతిస్తూ |
| వ్రాలి | = | పడి |
| దంష్ట్రికా దండములు | = | కోరలతో |
| ఒక్కటొక్కటిగా | = | ఒకదాని తరువాత ఒకటిగా |

| | | |
|---|---|---|
| నెత్తిన్ | = | శిరసుపై |
| చేర్చుచున్ | = | ఉంచుచూ |

**తాత్పర్యం :**

ఆ రాక్షసుడు కొండ తిరిగినట్లుగా దాసరికి భక్తితో ప్రదక్షిణం చేసినవాడై, పాకలపుటేనుగు ఏవిధంగా తన కట్టుకంబమైన చెట్టు చుట్టూ బమ్మెర తిరిగి, గిరులు మారుమ్రోగునట్లు రొదపెడుతూ దాని వేరులకు తన నొసలు తగిలేటట్లు కొండలు మారుమ్రోగేటట్లు పడుతుందో అలాగే ఆ రాక్షసుడు దాసరి పాదాలకు తన నొసలు తగిలే విధంగా కొండలు మారు మ్రోగేటట్లు అతడిని స్తుతిస్తూ వ్రాలి కోరలతో అతడి పాదాలను ఎత్తి ఒకటొకటిగా తన శిరస్సుపై ఉంచు కున్నాడు.

**48. ఈ సర్వం సహదేవ దానవ మహీభృన్మౌని వాచాతప**
**శ్శ్రీ సర్వస్వము నేత దన్యకృతులం జెప్పంబడు న్ఘోరమౌ**
**నీ సత్యం బరరీకృతాంత మిలనెంతే వృద్ధనై మంటినే**
**నా సత్యం బిక నిన్ను బోలె గృత సంధా ధూర్వహు ల్లేమికిన్**

**పరిచయం :**

ఈ పద్యం సాహితీ సమరాంగణ సార్వభౌముడైన శ్రీకృష్ణదేవరాయలు రచించిన 'ఆముక్త మాల్యద' షష్ఠాశ్వాసం లోని 'మాలదాసరి కథ' అనే పాఠ్యభాగం నుండి గ్రహింపబడింది.

**సందర్భం :**

బ్రహ్మరాక్షసుడు దాసరి సత్యసంధత గురించి పొగుడు సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| ఈ సర్వంసహన్ | = | ఈ భూలోకంలో |
| దేవదానవ | = | దేవతల, రాక్షసుల |
| మహీభృత్ | = | రాజుల |
| మౌని | = | తపస్వుల |
| వాచా | = | వాగ్రూపమైన |
| తపః | = | వ్రతం యొక్క |

| | | |
|---|---|---|
| శ్రీ | = | సమృద్ధి యొక్క |
| సర్వస్వం | = | సకల ధనం |
| ఏతత్ | = | ఈ శరీర దానం |
| ఔనీ సత్యంబు | = | ఇంత దారుణమైన నీ ప్రతిజ్ఞ |
| ఉరరీకృత అంతము | = | నెరవేర్చబడిన నిశ్చయం కలది |
| ఏన్ | = | నేను |
| ఎంతేన్ | = | మిక్కిలి |
| వృద్ధను ఐ | = | ముసలివాడనై |
| మంటిన్ | = | జీవించి ఉన్నాను |
| ఇంకన్ | = | ఇంకా |
| నిన్నుపోలె | = | నీలాగా |
| దొరమునట్టి కృత | = | చేయబడిన |
| సంధా | = | ప్రతిజ్ఞ యొక్క |
| ధూర్వహుల్ | = | సాధకులు |
| లేమికిన్ | = | లేరనుటకు |
| నా సత్యంబు | = | నా ప్రతిజ్ఞ |

**తాత్పర్యం :**

ఈ లోకంలో దేవాసురులు, రాజులు, మునులు ఇలాంటి శరీరదానంలో కాక ఇతర పనులలో తమ వాక్సత్యాన్ని నెరవేర్చుకున్నవారు కలరు కానీ నీలాగా అతి దారుణమైన శరీరదాన ప్రతిజ్ఞను నెరవేర్చినవారు ఎవరూ లేరు. నేను చాలా వృద్ధుడిని. నేను చక్కగా ఎరుగుదును. నీవంటి ప్రతిజ్ఞా నిర్వాహకులు జగత్తులో లేరని ప్రతిజ్ఞ చేస్తున్నాను.

**51. బాసలు బండి కండ్లు మఱి ప్రాణభయంబున లక్ష సేసి నం**
**గ్రాసము కృచ్ఛలబ్ధ ముడుగన్వసమే యిది నీక చెల్లెనో**
**భూసుర వంశ్య పుణ్యజన పుణ్యజనాంకము దావకీనమే**
**పోసమకూరెడిం గులము పొత్తున దైత్యుల కెల్ల నంకతన్**

**పరిచయం :**

ఈ పద్యం సాహితీ సమరాంగణ సార్వభౌముడైన శ్రీకృష్ణదేవరాయలు రచించిన 'ఆముక్త మాల్యద' షష్ఠాశ్వాసం లోని 'మాలదాసరి కథ' అనే పాఠ్యభాగం నుండి గ్రహింపబడింది.

**సందర్భం :**

బ్రహ్మరాక్షసుడి గొప్పతనాన్ని దాసరి మెచ్చుకునే సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| బాసలు | = | ప్రతిజ్ఞలు |
| బండికండ్లు | = | నిలుకడలేనివి |
| మఱి | = | అటు పైని |
| ప్రాణభయంబునన్ | = | తన ప్రాణం పోతుందనే భయంచేత |
| లక్ష | = | లక్ష ప్రమాణాలు |
| చేసినన్ | = | చేసినప్పటికీ |
| కృచ్ఛ్ర లబ్ధము | = | క్లేశం చేత పొందబడినదైన |
| గ్రాసము | = | ఆహారాన్ని |
| ఉడుగన్ | = | వదులుట |
| వసమే | = | శక్యమా |
| ఇది | = | ఇలా ఆహారాన్ని వదలటం |
| నీక | = | నీకు మాత్రమే |
| చెల్లెన్ | = | సాధ్యమైంది |
| ఓ భూసుర వంశ్య | = | ఓయి బ్రాహ్మణ కులంలో జన్మించినవాడా |
| పుణ్యాజన | = | రాక్షసుల యొక్క |
| పుణ్యాజన అంకము | = | పుణ్యమనెడి పేరు |
| తావకీనమే పో | = | నీదే సుమా |
| కులము పొత్తునన్ | = | కులం సాహచర్యంతో |
| దైత్యులకెల్లన్ | = | రాక్షసులకందరకు |

| | | |
|---|---|---|
| అంకతన్ | = | పేరుగా |
| సమకూరెడిన్ | = | కలిగింది |

**తాత్పర్యం :**

ప్రతిజ్ఞలు బండి చక్రాల వంటివి, స్థిరంగా ఉండవు కాబట్టి ప్రతిజ్ఞలను నమ్మవచ్చునా ? ఆ పన్నుడు ప్రాణం రక్షించుకోవటానికి లక్ష ప్రమాణాలైన చేస్తాడు. వానిని నమ్మి ఎంతో కష్టంతో లభించిన అన్నాన్ని వదులుకునే గొప్పవాడు కలడా. నీవు ఒక్కడివే అలాంటి పుణ్యాత్ముడివి. బ్రాహ్మణవంశంలో జన్మించిన ఓ మహాత్ముడా! పుణ్యజనులని రాక్షసులకు కలిగిన పేరు నీ ఒక్కడిదే సుమా. నీ మూలంగా కులాన్ని ఉమ్మడి చేయటం వలన వారికి పేరయ్యింది.

**54. ఎట్టూ యిట్టగునయ్య పల్కదయలేకిన్నాళ్లు నీకూడె యీ**
**పొట్టంబెట్టి మహోఘలబ్ధి దనువుం బోషించి యెన్నాళ్ళకే**
**నెట్టే నొక్క తపస్వి యొక్క వ్రతిరాడే చూడడే తత్కృపన్**
**బుట్టు న్నీగెన దీని నా నొదవి యోపుణ్యాత్మయిట్లంటివే**

**పరిచయం:**

ఈ పద్యం సాహితీ సమరాంగణ సార్వభౌముడైన శ్రీకృష్ణదేవరాయలు రచించిన 'ఆముక్త మాల్యద' షష్ఠాశ్వాసం లోని 'మాలదాసరి కథ' అనే పాఠ్యభాగం నుండి గ్రహింపబడింది.

**సందర్భం:**

నా శరీరంలోని మాంసాన్ని, మెదడును ఇంక భక్షించు అని దాసరి అనగా బ్రహ్మరాక్షసుడు బాధపడే సందర్భం లోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| ఎట్టూ | = | ఎలా |
| యిట్టగునయ్యా | = | ఇలా జరుగుతుంది |
| పల్కన్ | = | అనటానికి |
| దయలేక | = | దయలేకుండా |
| ఇన్నాళ్ళున్ | = | ఇంతకాలం |
| ఈ కూడె | = | ఈ నరమాంసమే |
| ఈ పొట్టన్ | = | ఈ పాడు కడుపులో |

| | | |
|---|---|---|
| పెట్టి | = | పెట్టి |
| మహత్ అఘలబ్దిన్ | = | గొప్పపాపం సంప్రాప్తించటం చేత |
| తనువున్ | = | ఈ దేహాన్ని |
| పోషించి | = | పెంచి |
| ఎన్నాళ్ళకేని | = | ఎంతకాలానికైనా |
| ఎట్టేని | = | ఏ కారణం చేతనైనా |
| ఒక్క తపస్వి | = | ఒక్క తపస్వి |
| ఒక్క వ్రతి | = | ఒక్క వ్రతస్తుడు |
| రాడే | = | రాడా |
| జన్మమును | = | రాక్షస జన్మని |
| నీగెదన్ | = | తొలగించుకుంటాను |
| నాన్ | = | అని నేను ఆశిస్తూ ఉంటే |
| ఒదవి | = | వచ్చికూడా |
| ఓ పుణ్యాత్మాడా! | = | ఓయీ పుణ్యాత్ముడా! |
| ఇట్లు అంటివే | = | ఈ విధంగా పలికావు |

**తాత్పర్యం:**

అయ్యా పుణ్యాత్ముడా, నీవలా చెప్పకూడదు. నేను పుట్టినప్పటి నుంచి ఈ నరమాంసమే ఈ పొట్టకు పెట్టి దేహాన్ని పెంచి మహాపాపం సంపాదించి, పిమ్మట అందుకు దుఃఖిస్తూ ఏనాటికైనా ఒక మహా తపసు చేసిన మునో, వ్రతస్తుడో, ఎవరో ఒక మహా పురుషుడు ఈ దారిన రాడా, అతడి కరుణాకటాక్షం చేత ఈ జన్మను తొలగించుకుంటాను కదా అని చిరకాలం నుండి ఆశించి వేచివున్నందుకు, నీవు వచ్చి కూడా ఇలా నిన్ను భుజించమని పల్కావు కదా, అలా అనవద్దు మహానుభావా.

**డా॥ ఇరపని మాధవి**
తెలుగు & ప్రాచ్య భాషా విభాగం,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,
నాగార్జున నగర్.

ꩰ ꩰ ꩱ ꩱ

పాఠం - 7

# మాలదాసరి కథ

## - శ్రీకృష్ణదేవరాయలు

## సందర్భ సహిత వ్యాఖ్యలు

### 1. మసిపాత మానికంబై యొదుగన్

**పరిచయం:** శ్రీకృష్ణదేవరాయలు రచించిన 'ఆముక్త మాల్యద' షష్ఠాశ్వాసం లోని 'మాలదాసరి కథ' అనే పాఠ్యభాగం నుండి ఈ వాక్యం స్వీకరించబడింది.

**సందర్భం:** తన భక్తుడైన మాలదాసరి గురించి మహావిష్ణువు విష్ణుచిత్తుడికి చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** దాసరి నా ప్రీతి కోసం తన జాతికి ఏర్పడిన ధర్మమే ఆచరిస్తూ, మనస్సును ఎప్పుడూ శుచిగా ఉంచుకొని తన శరీర సాంగత్యంతో మసి గుడ్డలోని మాణిక్యంలా ఉన్నాడు. మాణిక్యాన్ని మసిగుడ్డలో కట్టినా ఆ మసి దాని కంటదు, దాని విలువ తగ్గదు. అలాగే దాసరి మాల అయినప్పటికీ అతడు ఎంతో పవిత్రంగా ఉన్నాడని భావం.

### 2. వచ్చు సేవింప సురియాళు వైష్ణవుండు

**పరిచయం:** శ్రీకృష్ణదేవరాయలు రచించిన 'ఆముక్త మాల్యద' షష్ఠాశ్వాసం లోని 'మాలదాసరి కథ' అనే పాఠ్యభాగం నుండి ఈ వాక్యం స్వీకరించబడింది.

**సందర్భం:** తన భక్తుడైన దాసరిని అతడు కురుంగిడిలోని స్వామిని సేవించడానికి వెళ్ళే సమయంలో ఎలా ఉంటాడో స్వామి వర్ణించి చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** చమురు అంటుకున్న తోలు చొక్కా, టోపితో, శంఖ, చక్ర ఆకారాలతో నున్న ఇత్తడి చెవి కమ్మలు, దీప స్తంభం, చర్మపు సంచి, ములికి లేని బాణం, మొగలి ఆకు గొడుగు, కిన్నెర, చిన్న తాళాలు, తులసి పూసలతో కూడిన కంఠహారం, నల్లటి శరీరం, వెడల్పైన బొట్టుతో, బెదురు చూపులతో, పసుపు పొడి అంటిన తోలు సంచితో నను కొలవడానికి వస్తుంటాడొక విష్ణు భక్తుడు.

### 3. గుడి వెడలి వద్దునది శూద్రుడిడగ గ్రోలి

**పరిచయం:** శ్రీకృష్ణదేవరాయలు రచించిన 'ఆముక్త మాల్యద' షష్ఠాశ్వాసం లోని 'మాలదాసరి కథ' అనే పాఠ్యభాగం నుండి

ఈ వాక్యం స్వీకరించబడింది.

**సందర్భం:** దాసరి విష్ణుమూర్తిని స్తుతిస్తూ కీర్తనలు పాడి సేవించే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** దాసరి ఆ విధంగా చాలాసేపు సేవించి సాష్టాంగం చేసి, గర్భ మండపాన్ని కడిగిన మలిన జలం లోపలి రాతి తొట్టి నిండి గుడి బయటి రాతితొట్టి నిండి కాలువగా పారి గుడి నుండి బయటకు పారే దానిని శూద్రుడివ్వగా త్రాగుతాడు.

## 4. శూన్య గహన వాటిఁ జొచ్చి చనుచు

**పరిచయం:** శ్రీకృష్ణదేవరాయలు రచించిన 'ఆముక్త మాల్యద' షష్ఠాశ్వాసం లోని 'మాలదాసరి కథ' అనే పాఠ్యభాగం నుండి ఈ వాక్యం స్వీకరించబడింది.

**సందర్భం:** అర్ధ రాత్రి సమయంలో పిల్లి ఒక ఇంటిలో చొరబడగా భయపడి కోళ్ళు కూయగా తెల్ల వారిందనుకొని దాసరి తాను దేవుడిని కీర్తించే సమయమైందనుకొని వెళ్ళే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** మర్లు మాతంగి తీగను తొక్కి ఓ చీకటి అంటే చీకటి ఓ అని బదులు పలుకుతుందా అన్నట్లున్న చీకటి రాత్రిలో దాసరి దారితప్పి పొలాలన్నీ తిరిగి తెల్లవారే సమయానికి ఒక నిర్మానుష్యమైన అడవి ప్రదేశానికి చేరాడు.

## 5. నేరుపున న్పల్లేరు లీడ్చి త్రోయుచుజనుచున్

**పరిచయం:** శ్రీకృష్ణదేవరాయలు రచించిన 'ఆముక్త మాల్యద' షష్ఠాశ్వాసం లోని 'మాలదాసరి కథ' అనే పాఠ్యభాగం నుండి ఈ వాక్యం స్వీకరించబడింది.

**సందర్భం:** దాసరి దారితప్పి అపమార్గంలో వెళ్లే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** దాసరి దారితప్పి నడుస్తూ ఉత్తరేని కాయలు కాళ్ళను పట్టుకోగా వాటిని ఎదురుగా తీస్తే తెగుతుంది కనుక విపరీతంగా తుడిచి వేస్తూ, పల్లేరుగాయలు గ్రుచ్చుకుంటే ఉపాయంగా తొలగించుకొంటూ పోతున్నాడు.

## 6. వరుగు దణచగు ముఱుత్రోవ నరిగి యెదుట

**పరిచయం:** శ్రీకృష్ణదేవరాయలు రచించిన 'ఆముక్త మాల్యద' షష్ఠాశ్వాసం లోని 'మాలదాసరి కథ' అనే పాఠ్యభాగం నుండి ఈ వాక్యం స్వీకరించబడింది.

**సందర్భం:** దాసరి అపమార్గంలో వెళ్ళి ఒకచోట పెద్ద మర్రిచెట్టును చూసి ఆ చెట్టు దగ్గరకు వెళ్ళటానికి కాలి దారి కనిపిస్తే ఆ దారి వెంట వెళ్ళి ఆ మర్రిచెట్టును సమీపించే సమయంలో మర్రిచెట్టు దగ్గరున్న పరిస్థితులను వర్ణించే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** ఆ దుర్గంధపు దారినిండా ఎలనీటిని త్రాగి మీగడ లాంటి లేతకొబ్బరిని గీకిగీకి తిని పారవేసిన కొబ్బరి బొండాలలాగా

మెదడంతా జుర్రి పారవేసిన పుర్రెలు, తుదిముట్ట చీకిపారవేసిన ఎముకలు, ఈగల తుట్టెలు ముసిరిన పచ్చితోళ్లు, నరుల తలల వెంట్రుకల తిప్పలు ఉన్నాయి. అక్కడక్కడ నరుల అవయవాలు తెగిపడున్నాయి. వాటిని ఘాతుకమృగాలు రెండు మూడు చేరి కరచుకొని పోవటం కోసం పెనుగులాడుతున్నాయి. ఆ పోరాటంలో వాటి కాళ్ళు త్రొక్కడం వలన నలిగిన యెండు మాంసం నుండి దుర్గంధం వ్యాపిస్తుంది. అటువంటి దారి గుండా దాసరి వెళ్ళాడు.

## 7. కుంభ జానువను నొక్క ద్విజనిశాచరుని గనియె

**పరిచయం:** శ్రీకృష్ణదేవరాయలు రచించిన 'ఆముక్త మాల్యద' షష్ఠాశ్వాసం లోని 'మాలదాసరి కథ' అనే పాఠ్యభాగం నుండి ఈ వాక్యం స్వీకరించబడింది.

**సందర్భం:** దాసరి బ్రహ్మరాక్షసుడిని చూసిన సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** బ్రహ్మరాక్షసుడు ఒక నరశవాన్ని గోచిపెట్టుకోగా అది పొడుగు చాలక మొలత్రాడుకి బిగించి తగిలించటం వల్ల దాని నెత్తురు బొడ్డు మీదికి చిలికి ఉంది. అతడు తన నల్లటి శరీరాన్ని ఎర్రటి దుప్పటితో కప్పుకొని బాపన చీమలు దట్టంగా పైన పట్టిన వక్రభాల్లాతకి లాగా ఉన్నాడు. వాని ముఖం తలక్రిందులుగా చేసిన ఏనుగుతలలాగా ఉంది. పెదవి క్రింది నుండి కంఠం వరకు రెండు భాగాలుగా చీలినట్లున్న గడ్డం ఏనుగు తలక్రిందైన కుంభం లాగా, నీటి నుండి క్రిందికి వంగిన కోరలు రెండు తల క్రిందైన ఏనుగు తలలోని రెండు కోరలులాగా ఉన్నాయి. గడ్డం, మీసం అంతా ఒకటిగా ఉండి కందిరీగల తుట్టెలాగా గోరోజనం రంగులో ఉంది. అందులో కొంతభాగం చొంగచేత కప్పబడి ఉంది. తనకు ఆహారం కోసం ఎవరైనా బాటసారి దారి తప్పి తన చెట్టు దగ్గరకు వస్తాడేమో అని చూడటానికి పై కొమ్మలు మీదకి ఎక్కి చూసే తొందరలో ప్రేగు జంధ్యం భుజాల మీది నుండి జారిపోతే దానిని కోపంగా మళ్ళీ భుజాన వేసుకుంటున్నాడు. వ్రేలాడే బొజ్జ, బూరకాలు, చెంబుతల, ముచ్చెలిగుంటలో కొంచెం జుట్టు, కళ్ళలో కండలు గలవాడిని చూశాడు. ఆకలితో పిశాచికాలను తిడుతున్నవాడిని, కొండంత బరువు గలవాడిని, కుండలులాగా మోకాళ్ళు గల కుంభజానుడు అనే వాడిని దాసరి చూశాడు.

## 8. మత్పదస్మృతి యాత్మనేమఱక యతడు

**పరిచయం:** శ్రీకృష్ణదేవరాయలు రచించిన 'ఆముక్త మాల్యద' షష్ఠాశ్వాసం లోని 'మాలదాసరి కథ' అనే పాఠ్యభాగం నుండి ఈ వాక్యం స్వీకరించబడింది.

**సందర్భం:** దాసరి బ్రహ్మరాక్షసుడితో పోరే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** బ్రహ్మరాక్షసుడు తన పాదాలను లాగితే దాసరి అడుగులను ఉన్న చోట నుండి కదలనీయక, రాక్షసుడి వక్షస్థలంపై చరిచి అవతలకి దూకి, రాక్షసుడు తనను కొడితే ఉపాయంతో దానిని తప్పించుకొని, వాని వెనుకవైపు నుండి చూపును రాక్షసుడి మీదే ఉంచి తన మీద పడగా చను నలుపులుండే చోట్ల గురిపెట్టి తన ముష్టి దెబ్బల బలం చేత రాక్షసుడికి

లొంగకుండా నిలిచి, రాక్షసుడు తన రొమ్ము మీదకి చొరబడటానికి చూస్తే తాను క్రిందికి తగ్గి, రాక్షసుడు చంపటానికి సాధనం వెతికే సమయంలో గ్రుద్ది, అవసరమైనప్పుడు వెనుకెనుకకు నడిచాడు. అంత పోరాడుతున్నా మదిలో ఆ విష్ణుమూర్తి స్మరణ మాత్రం మరువలేదు.

## 9. పాఱి వారును దానును బట్టికొనుడు

**పరిచయం:** శ్రీకృష్ణదేవరాయలు రచించిన 'ఆముక్త మాల్యద' షష్ఠాశ్వాసం లోని 'మాలదాసరి కథ' అనే పాఠ్యభాగం నుండి ఈ వాక్యం స్వీకరించబడింది.

**సందర్భం:** దాసరిని బ్రహ్మరాక్షసుడు బంధించే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** బ్రహ్మరాక్షసుడు, దాసరి అలా పోరాడుతూ ఉండగా దాసరి రాక్షసుడిని తన్ని తాను పోబోగా రాక్షసుడు తన రాక్షసీ సమూహాన్ని అంతనూ పిలువగా వారు చెట్టు దిగి రాగా వాడు పోతున్నాడు రండి రండి అంటూ బ్రహ్మరాక్షసుడు పరిగెత్తి వారూ, తానూ కలిసి దాసరిని పట్టుకున్నారు.

## 10. ధర్మమెఱిఁగించు సూక్తి నాతండు పలికె

**పరిచయం:** శ్రీకృష్ణదేవరాయలు రచించిన 'ఆముక్త మాల్యద' షష్ఠాశ్వాసం లోని 'మాలదాసరి కథ' అనే పాఠ్యభాగం నుండి ఈ వాక్యం స్వీకరించబడింది.

**సందర్భం:** పట్టుకున్న దాసరిని చెట్టుకు కట్టివేసి కత్తి, పాత్ర తీసుకురావడానికి రాక్షసీ సమూహాన్ని పంపిన సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** కత్తిని, పాత్రను తెమ్మని పిశాచికలను పంపి బ్రహ్మరాక్షసుడు దాసరిని ప్రేవుతాళ్ళ కొలగగ్గిరతో పడతోయగా అతడు ఆ చెట్టు మీద కొరిగి రాక్షసుడితో దిగులు లేకుండా ధర్మ సూక్ష్మం చెప్పాడు.

## 11. నశ్వరపు దేహమమ్మి పరముగొనుట

**పరిచయం:** శ్రీకృష్ణదేవరాయలు రచించిన 'ఆముక్త మాల్యద' షష్ఠాశ్వాసం లోని 'మాలదాసరి కథ' అనే పాఠ్యభాగం నుండి ఈ వాక్యం స్వీకరించబడింది.

**సందర్భం:** బ్రహ్మరాక్షసుడికి తనకు శరీరంపై వ్యామోహం లేదని దాసరి చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** నా శరీరాన్ని నీకు ఆహారంగా ఇవ్వటం వలన నాకు మేలు జరుగుతుంది. ఎలాగంటే ఈ చండాలజన్మ తొలగిపోతుంది. ఒక ప్రాణి అన్నం తిని సంతోషిస్తాడు. నాకు మోక్షం కలుగుతుంది. అందుకు డేగకు పావురం బదులు తన శరీరం కోసి ఇచ్చి శిబిచక్రవర్తి అశాశ్వతమైన శరీరాన్ని ఇచ్చి మోక్షాన్ని పొందిన వారికి ఉత్తమోదాహరణ కదా!

## 12. యమృతమైనను జవుల జాత్యన్న సమమె

**పరిచయం:** శ్రీకృష్ణదేవరాయలు రచించిన 'ఆముక్త మాల్యద' షష్ఠాశ్వాసం లోని 'మాలదాసరి కథ' అనే పాఠ్యభాగం నుండి ఈ వాక్యం స్వీకరించబడింది.

**సందర్భం:** దాసరి బ్రహ్మరాక్షసుడితో హింసతో కూడిన మాంసాహారం మంచిది కాదని శాస్త్ర వాక్యాలు ఉదహరించినప్పుడు అతడికి బ్రహ్మరాక్షసుడు సమాధానం చెప్పిన సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** బ్రహ్మరాక్షసుడు దాసరితో మేము దేవతలవలె పవిత్ర భోజనులం కాదన్నావు. అగ్ని సర్వభక్షకుడు కదా, మేము అదే ఆచారాన్ని అవలంభించాము. హరికి భక్తుడు, సఖుడు, రథము అయిన గరుత్మంతుడు అమృతాన్ని దేవతలకు ఇచ్చివేసి దానికి బదులుగా పాములను తనకు ఆహారంగా కోరలేదా ఎవరికైనా ఏ అన్నమైనా జాత్యన్నంతో సమానం కాదు.

## 13. వేనవేల్సత్యములు వల్కి వినకయున్న

**పరిచయం:** శ్రీకృష్ణదేవరాయలు రచించిన 'ఆముక్త మాల్యద' షష్ఠాశ్వాసం లోని 'మాలదాసరి కథ' అనే పాఠ్యభాగం నుండి ఈ వాక్యం స్వీకరించబడింది.

**సందర్భం:** బ్రహ్మరాక్షసుడితో దాసరి తనను శ్రీహరిని స్తుతించటానికి పంపమని, తప్పక తిరిగి వచ్చి ఆహారమవుతానని చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** ఎవరూ నోటి ముందున్న కబళాన్ని వదలమంటే వినడు, ఎవడూ తన ప్రతిజ్ఞ నెరవేర్చటం కోసం శరీరాన్ని ఇవ్వటానికి తిరిగిరాడు, నేను పోనీయను, నీవు తిరిగిరావనేది నిశ్చయం అని బ్రహ్మరాక్షసుడనగా దాసరి చెవులు మూసుకొని నారాయణా అంటూ నన్ను నమ్ము అంటే బ్రహ్మరాక్షసుడు వినలేదు. అప్పుడు దాసరి వేలవేల ప్రమాణాలు చేసినా ఆ రాక్షసుడు ఒప్పుకోలేదు.

## 14. ఆ చరణంబు లాయుదర మాయుర మాశిర మా కరంబులున్

**పరిచయం:** శ్రీకృష్ణదేవరాయలు రచించిన 'ఆముక్త మాల్యద' షష్ఠాశ్వాసం లోని 'మాలదాసరి కథ' అనే పాఠ్యభాగం నుండి ఈ వాక్యం స్వీకరించబడింది.

**సందర్భం:** బ్రహ్మరాక్షసుడు పంపగా ఆరోజు వ్రతం పూర్తి చేసుకొని వచ్చిన దాసరి ఇంక తనను భుజించమని రాక్షసుడితో చెప్పే సందర్భం లోనిదీ వాక్యం.

**వివరణ:** ఓ రాక్షసుడా! నా వ్రతం నెరవేరింది, నాకు ముక్త్యనుభవం చేకూరింది. ఇక నాకూ చెరభయం లేదు. నీవు నన్ను పంపేటప్పుడు ఏ కడుపు, ఏ రొమ్ము, ఏ చేతులు, ఏ కాళ్ళు ఉన్నాయో అవే కాళ్ళు, కడుపు, రొమ్ము, శిరస్సు, చేతులు ఉన్నాయో లేదో చూడు అని దాసరి బ్రహ్మరాక్షసుడితో అన్నాడు.

## 15. ఇతరులు నీకు నీడె మణి

**పరిచయం:** శ్రీకృష్ణదేవరాయలు రచించిన 'ఆముక్త మాల్యద' షష్ఠాశ్వాసం లోని 'మాలదాసరి కథ' అనే పాఠ్యభాగం నుండి ఈ వాక్యం స్వీకరించబడింది.

**సందర్భం:** తిరిగి వచ్చిన దాసరిని చూసి సంతోషించిన బ్రహ్మరాక్షసుడు దాసరిని కీర్తించే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** ఈ లోకంలో దేవతలు, రాక్షసులు, రాజులు, మునులు ఎవరూ ఇలాంటి శరీర దాన ప్రతిజ్ఞను నెరవేర్చినవారు లేదు. నీవు మధురమైన హరిస్తోత్ర గాన సముద్రపుటలలను దివ్యనాదప్రదంగా తుంబికట్టిన నీ వీణ అనే తెప్పచేత దాటుతున్నావు. కురుంగుడి భగవంతుడి కరుణ నీకు పట్టగొమ్మగానుంది. అలాంటి నీకు ధైర్యంలో, మాట నిలకడలో, శ్రీహరి సేవనమే పరాయణమైన బుద్ధిలో సాటి ఎవ్వరూ లేరు అని రాక్షసుడు దాసరితో అన్నాడు.

## 16. నీ యురు కృపాకటాక్షమునజేసి ధన్యుడనైతి ననఘ

**పరిచయం:** శ్రీకృష్ణదేవరాయలు రచించిన 'ఆముక్త మాల్యద' షష్ఠాశ్వాసం లోని 'మాలదాసరి కథ' అనే పాఠ్యభాగం నుండి ఈ వాక్యం స్వీకరించబడింది.

**సందర్భం:** బ్రహ్మరాక్షసుడు దాసరికి సాటి ఎవ్వరూ లేరన్నప్పుడు బ్రహ్మరాక్షసుడి గొప్పతనాన్ని దాసరి చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** బ్రహ్మరాక్షసుడిని కౌగిలించుకొని దాసరి 'ఓయీ అసురవరేణ్యుడా, అనఘుడా, నీవు ఈ రోజు నా వ్రతాన్ని నెరవేర్పించావు. నేను నీ అంత దయాపూర్ణ కటాక్ష వీక్షణం చేత నా పని నెరవేర్చుకున్నాను' అన్నాడు.

## 17. బడలిక దీఱ నిత్తనువు బారణ సేయుము మైత్రిగల్గినన్

**పరిచయం:** శ్రీకృష్ణదేవరాయలు రచించిన 'ఆముక్త మాల్యద' షష్ఠాశ్వాసం లోని 'మాలదాసరి కథ' అనే పాఠ్యభాగం నుండి ఈ వాక్యం స్వీకరించబడింది.

**సందర్భం:** ఇంక తనను భుజించమని దాసరి బ్రహ్మరాక్షసుడికి చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** నీ కడుపు ఆకలితో నకనకలాడుతుండగా నన్ను వ్రతం పూర్తిచేయటం కోసం పొమ్మని విడిచిపెట్టావు. మనుషులమైన మేము రాక్షసులమైన మీకు జాత్యుచితంగా బ్రహ్మ నియమించిన ఆహారం. ఈ విషయంలో మీకే పాపం కలుగదు.అలా చేయకుండా నువ్వు వేరే ఏది పలికినా అలా పలకవద్దని ఒట్టు సుమా. నీకు నా పట్ల స్నేహం ఉంటే నీ అలసట తీరేవిధంగా ఈ నా దేహాన్ని భుజించు అని దాసరి బ్రహ్మరాక్షసుడిని కోరాడు.

## 18. యేమము వెనుకటిది చూడకీక్షింపు కృపన్

**పరిచయం:** శ్రీకృష్ణదేవరాయలు రచించిన 'ఆముక్త మాల్యద' షష్ఠాశ్వాసం లోని 'మాలదాసరి కథ' అనే పాఠ్యభాగం నుండి ఈ వాక్యం స్వీకరించబడింది.

**సందర్భం:** బ్రహ్మరాక్షసుడు దాసరిని తినలేనని దయలేక మాట్లాడవద్దని బాధపడే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** 'పుణాత్ముడా ! నీవు అలా చెప్పకూడదు. నేను పుట్టిన దగ్గర నుంచి ఈ ఆహారాన్ని ఈ పొట్టకు పెడుతున్నాను. ఏనాటికైనా ఒక మహామునో, వ్రతస్థుడో, మహాపురుషుడో రాడా అతడి కరుణతో ఈ జన్మను తొలగించుకోనా అని ఎదురుచూస్తున్నాను. మీలాంటి వైష్ణవులు కూడా మము పవిత్రులుగా చేయకపోతే మాకిక దారేది. వెనుకటి హేయమైన మా వృత్తిని లెక్కచేయకుండా దయతో నన్ను చూడు' అని బ్రహ్మరాక్షసుడు దాసరిని అర్థించాడు.

## 19. మాదృశులచోట గదియు భవాదృశులకు

**పరిచయం:** శ్రీకృష్ణదేవరాయలు రచించిన 'ఆముక్త మాల్యద' షష్ఠాశ్వాసం లోని 'మాలదాసరి కథ' అనే పాఠ్యభాగం నుండి ఈ వాక్యం స్వీకరించబడింది.

**సందర్భం:** బ్రహ్మరాక్షసుడు తనను కడతేర్చమని దాసరిని కోరే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** పరుసవేది నిరపరాధియైన గొడ్డలి ఇనుమును, బ్రహ్మహత్య చేసిన మహాపాపి అయిన కత్తి ఇనుమును సమానంగానే బంగారంగా చేస్తుంది. ఈ ఉత్తమ న్యాయం నాలాంటి వారి పట్ల మీలాంటి వారు అవలంభించవద్దా. మీ కరుణకు పవిత్రుడు పాత్రం, పాపిపాత్రం కాదు అను భేదం ఉండకూడదు. అందరినీ మీరు సమానం గానే అనుగ్రహించాలి. కాబట్టి పాపినైన నన్ను కడతేర్చుట మీకు ఉచితం.

## 20. పూజనము గాదా ప్రాణి మేల్చఁ క్రికిన్

**పరిచయం:** శ్రీకృష్ణదేవరాయలు రచించిన 'ఆముక్త మాల్యద' షష్ఠాశ్వాసం లోని 'మాలదాసరి కథ' అనే పాఠ్యభాగం నుండి ఈ వాక్యం స్వీకరించబడింది.

**సందర్భం:** బ్రహ్మరాక్షసుడు దాసరిని తనకు ముక్తి కలిగించమని అర్థించే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** నేనేమి ఘంటాకర్ణుడికన్న ఎక్కువ పాపం చేశానా. అతడి ఆ పాపం పోగొట్టి శ్రీహరి అతడికి మోక్ష సామ్రాజ్యాన్ని ఇవ్వలేదా. ఆ హరి భక్తులు శ్రీహరి కన్నా ఎక్కువగా ఇవ్వగలరు కదా. కనుక నువ్వు నాకు ఆ మేలు చేయలేవా? ఏదో ఒక ప్రాణిని సంతోష పెట్టడం హరి పూజనమే కదా అని దాసరిని బ్రహ్మరాక్షసుడు వేడుకున్నాడు.

## 21. త్రుటిగీతఫలంబు నొసగుదునె యిమ్మెయికిన్

**పరిచయం:** శ్రీకృష్ణదేవరాయలు రచించిన 'ఆముక్త మాల్యద' షష్ఠాశ్వాసం లోని 'మాలదాసరి కథ' అనే పాఠ్యభాగం నుండి

ఈ వాక్యం స్వీకరించబడింది.

**సందర్భం:** గీతాఫలాన్ని ఇవ్వనున్న బ్రహ్మరాక్షసుడితో శరీరం కోసం గానఫలాన్ని ఇవ్వలేనని దాసరి చెప్పు సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** నాకు శరీరం ప్రియం కాదు. ఇప్పటికి నేనెత్తిన దేహాలకు లెక్కలేదు. ఇంతకన్నా ఉత్తమ జన్మలను, అధమ జన్మలను ఎన్నో ఎత్తాను, ఆ పరంపరలో ఇది ఒకటి. ఈ దేహం కోసం హరినామ కీర్తనాఫలాన్ని ఒకరోజు ఫలాన్ని కాదు కదా ఒక త్రుటికాలపు ఫలాన్ని కూడా నేను ఇవ్వను అని దాసరి బ్రహ్మరాక్షసుడితో అన్నాడు.

## 22. కంసరి భక్తుల మొకండెకాము గాని

**పరిచయం:** శ్రీకృష్ణదేవరాయలు రచించిన 'ఆముక్త మాల్యద' షష్ఠాశ్వాసం లోని 'మాలదాసరి కథ' అనే పాఠ్యభాగం నుండి ఈ వాక్యం స్వీకరించబడింది.

**సందర్భం:** విష్ణుభక్తులుగా పుట్టడమే కష్టమని దాసరి బ్రహ్మరాక్షసుడికి చేప్పే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** నీవు, నేను ఎన్నిసార్లు లోకపాలకుల దేహాన్ని ధరించి వెంటనే బిచ్చగాని శరీరాన్ని ఎత్తలేదు. రాజు శరీరాన్ని, దాసుడి శరీరాన్ని, సింహం శరీరాన్ని, పురుగు శరీరాన్ని, ఏనుగు శరీరాన్ని, దోమ శరీరాన్ని ధరించలేదు. సోమయాజులుగా, చండాల జన్మలుగా పుట్టలేదు. ఒక్క విష్ణుభక్తులుగా మాత్రమే పుట్టలేదు గాని అని దాసరి బ్రహ్మరాక్షసుడితో అన్నాడు.

## 23. కప్పురంబు వెట్టి యుప్పుగొనట

**పరిచయం:** శ్రీకృష్ణదేవరాయలు రచించిన 'ఆముక్త మాల్యద' షష్ఠాశ్వాసం లోని 'మాలదాసరి కథ' అనే పాఠ్యభాగం నుండి ఈ వాక్యం స్వీకరించబడింది.

**సందర్భం:** అశాశ్వతమైన శరీరం కోసం పుణ్యం అమ్మటం మేలుకాదని దాసరి చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** ఈ దేహం ఊతనీటివలె నిలువనిది. సాలెపురుగు నేసిన నేతలో కట్టిన బూరుగుదూది వలె స్థితిలేనిది. ఎండలోని పసుపు లాంటిది, దూలంలో పురుగు దొలిచిన అక్షరం వంటిది, దీని మీది మమత చేత హరిస్తుతి గీతఫలాన్ని వెలగా ఇవ్వటం కర్పూరాన్ని వెలగా ఇచ్చి ఉప్పుకొనటం వంటిదని దాసరి బ్రహ్మరాక్షసుడితో చెప్పాడు.

## 24. పుట్టు మఱి నూతులద్దవ్వ బేతాళముల్

**పరిచయం:** శ్రీకృష్ణదేవరాయలు రచించిన 'ఆముక్త మాల్యద' షష్ఠాశ్వాసం లోని 'మాలదాసరి కథ' అనే పాఠ్యభాగం నుండి ఈ వాక్యం స్వీకరించబడింది.

**సందర్భం:** శరీరం తప్పించి ఇంకేమీ అడిగే అధికారం రాక్షసుడికి లేదని దాసరి చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** ఓ రాక్షసుడా! నీవు నా దేహం కంటే వేరొకటి అడగటం సరికాదు. నువ్వు నన్ను హరికీర్తనం కోసం పంపేటప్పుడు నాతో చేయించుకున్న ప్రతిజ్ఞ నా శరీరాన్ని ఇస్తానని కానీ గానఫలాన్ని ఇస్తానని కాదు. నీవు ఈ లోతు ప్రశ్నలు మాను. నా దేహాన్ని తీసుకో. నీవు నీ పిశాచజాతికి సులభమైన ఛలోక్తులతో నాకు కోపం తెప్పిస్తే ఆ కోపాన నేను గీతఫలాన్ని ఇస్తే తీసుకోవాలని చూస్తున్నావా ఏంటి ? అలంటప్పుడు బావి త్రవ్వితే భూతం వెలువడినట్లు అవుతుందే కానీ నీ యుక్తి ఫలించదు అని దాసరి బ్రహ్మరాక్షసుడికి చెప్పాడు.

**డా॥ ఇరపని మాధవి**

తెలుగు & ప్రాచ్య భాషా విభాగం,

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,

నాగార్జున నగర్.

పాఠం - 8

# మాలదాసరి కథ

## - శ్రీకృష్ణదేవరాయలు

## ప్రశ్నలు & సమాధానాలు

**1. మాలదాసరి కథ సారాంశాన్ని వ్రాయండి ?**

జ. మాలదాసరి విష్ణుభక్తుడు. అతడు వామనావతారంలో విష్ణుమూర్తి నివసించిన పుణ్యాశ్రమానికి మూడామడల దూరంలోని ఒక గ్రామంలో నివసిస్తూ ప్రతిరోజు బ్రహ్మముహూర్తంలో కురుంగుడి దేవాలయానికి వచ్చి మంగళకైశికి రాగంలో స్తోత్రాలు పాడేవాడు. తన జాతికి ఉచితమైన ధర్మాన్ని ఆచరిస్తూ మనస్సును ఎప్పుడూ శుచిగా ఉంచుకునేవాడు. మసిగుడ్డలో కట్టిన మాణిక్యంలాంటివాడు. జాతిచేత చండాలుడైనా ఉత్తమోత్తముల ఆచారాలను అనుసరించే ఆ దాసరి ప్రతిరోజు తన బరువులైన దీపస్తంభం, చర్మపు సంచి, ములికిలేని బాణం, మొగలి ఆకు గొడుగు, బుట్ట ఇవన్నీ ప్రక్కనపెట్టి ఎండను, గాలిని, ఆకలి గురించి ఆలోచించకుండా మధ్యాహ్నం వరకు శరీరమంతా గగుర్పొడిచే విధంగా, రాళ్ళు కరిగేవిధంగా తన వీణను వాయిస్తూ, ఆనందబాష్పాలు రాలుస్తూ విష్ణుమూర్తి స్తోత్రాలు పాడి భక్తి పారవశ్యంతో తాండవం చేసేవాడు. ఆ విధంగా దేవుడిని సేవించి మొక్కి, గర్భమండపాన్ని కడిగిన జలం శూద్రుడివ్వగా త్రాగేవాడు. ఎండను గాలిని తల్చుకోకుండా స్వామి ప్రసాదం వితరణ జరిగే వరకు వేచివుండి బ్రాహ్మణేతరులు ఎవరైనా ఇతని భక్తికి మెచ్చి దయతలచి పెట్టిన ప్రసాదం వినయంతో స్వీకరించి, దాత ఇచ్చిన తీర్థాన్ని తాగేవాడు. గుడి బయటే ప్రదక్షిణ చేసి గుడి బయట నీరు వెలువడే తూము దగ్గరే నిలిచి వుండి పొద్దెక్కేటప్పుడు తన పట్టణానికి వెళ్ళేవాడు.

ఒకరోజు అర్ధరాత్రి సమయంలో తన గూటిలోకి పిల్లి చొరబడగా అరచిన కోడి అరుపులు విని తెల్లవారినదనుకొని దాసరి విష్ణుమూర్తిని కీర్తించటం కోసం బయలుదేరి దారిలో మరుల తీగను తొక్కి దారి తప్పాడు. అంత భయంకరమైన అర్ధరాత్రి సమయంలో పొలాలన్నీ తిరిగి తెల్లవారే సమయానికి నిర్మానుష్యంగా ఉన్న ప్రదేశంలో ప్రవేశించాడు. పాడుబడిన గ్రామాలను దాటి వెళ్ళాడు. అలా వెళుతుండగా పెద్ద మర్రిచెట్టు ఒకటి కనిపించింది. ఆ మర్రి దగ్గరకు కాలిబాట కనిపిస్తే ఎంతో దుర్గంధంతో కూడిన ఆ దారి వెంట ఆ మర్రిచెట్టును సమీపించాడు. ఆ చెట్టు క్రింద ఉన్న పుర్రెలు, ఎముకలు, చర్మం వంటి వాటిని చూసి ఇక్కడ ఎవరో ఉన్నారు, వాడు మనిషి కాదనుకున్నాడు. అంతలోకి నేను నిన్ను చూశాను పారిబోకంటూ ఒక బ్రహ్మరాక్షసుడు చెట్టుపై నుండి క్రిందకి దూకాడు. తనపైకి వచ్చిన ఆ బ్రహ్మరాక్షసుడితో తలపడి పోరాడాడు దాసరి. ఎంతో ఉపాయంతో దాసరి బ్రహ్మరాక్షసుడి దెబ్బల నుంచి తప్పించుకుంటూ బ్రహ్మరాక్షసుడిని అలసిపోయేవరకు పోరాడాడు. ఆ సమయంలోను దాసరి మనసులో విష్ణు ధ్యానం మరువలేదు. బ్రహ్మరాక్షసుడు తన

బేతాళికలను పిలిచి వారు తానూ కలిసి ఆ దాసరిని కట్టివేశారు. దాసరి తల నరకటానికి కత్తి, రక్తం పట్టడానికి పాత్ర తెమ్మని బేతాళికలను పంపాడు రాక్షసుడు. నీ తలను కత్తితో నరికి నీ మొండెం నుండి దుమికే నీ వేడి రక్తం తృప్తితీర తాగుతాను. నీ మాంసాన్ని రుచిగా వండి నా భార్య అందిస్తుంటే తింటూ తాటికల్లు తాగుతాను అని బ్రహ్మరాక్షసుడు అన్నాడు. దానికి ఏమాత్రం భయపడని దాసరి 'నేను నీ కంచంలోని ఆహారాన్ని, పోరాడకుండా ప్రాణాలు రక్షించుకోవటాన్ని ఉపేక్ష చేస్తే పాపమని నీతో పోరాడాను. నాకీ శరీరం మీద కోరిక లేదు. నీచపు జన్మ పోవటమే మంచిది. ఏదో ఒక కారణంగా చనిపోయే దుర్భల శరీరం ఊరకనే అలా నశించకుండా ఏదో ఒకరిది ఆకలి తీర్చటం మంచిదే కదా. అయితే నేను మధ్యస్థుడిగా ఒక మాట చెబుతాను విను. క్రూర జంతువులలో హీనజన్మ కాదు నీది. మాకులాగే ముఖం, కాళ్ళు చేతులు, ఇంద్రియాలున్నాయి. మాకులాగానే ఏది చేయచ్చు ఏది చేయకూడదని ఆలోచన ఉంది. అలాంటప్పుడు చంపదగింది, చంపకూడనిది, తినదగింది, తినకూడనిదీ, తాగదగింది, తాగకూడనిది అనే వివేకం నీకు లేకపోవటం సరైనదేనా, రుచిగా, శుచిగా లేనిది, పాపంలోనే ఎక్కువైన హింసతో కూడుకున్నదైన ఈ ఆహారం ఎందుకు, ప్రాణభయం లేదనద్దు, నువ్వు నేడో, రేపో చనిపోయిన తర్వాత పరలోకంలో బాధ కలిగిస్తుంది కదా హింస. ఆ యముడు బలవంతుడు. దేవతలు, దానవులు అన్నదమ్ములైనా ఒకరు బాధించేవారు, వేరొకరు బాధింపబడేవారు అవుతున్నారు కదా ! పవిత్రమైన ఆహారం కారణంగా దేవతలు మీకన్నా ఎక్కువకాలం జీవిస్తున్నారు. నేను ఉచ్చరించకూడదు కానీ తొలికళను చంద్రుడు తాగునని చెబుతుంది కదా వేదం. ఆలోచించి నీకు తోచినట్లు చెయ్యి' అన్నాడు.

అది విన్న రాక్షసుడు పెద్దగా నవ్వి మేము చదవని చదువులు ఇవి. నీవు దేవతల గుణాలు పొగిడావు. కానీ అగ్ని సర్వభక్షకుడు కదా, విష్ణుమూర్తి వాహనమైన గరుత్మంతుడు అమృతం దేవతలకిచ్చి పాములను ఆహారంగా కోరుకోలేదా. జాత్యన్నానికి మించింది లేనేలేదు. నిద్ర, ఆహారం మాని చదివి ఇక్కడ నేను పొందింది ఏమీ లేదు, ఇలాంటి శాస్త్రవిషయాలు చెప్పి మెచ్చుకోలు పొందలేవు. ఈ చదివిన దాసరి కూర రుచి అద్భుతంగా ఉంది, ఇంగా తెమ్మనే మెచ్చుకోలు తప్ప అని నాస్తిక వాదపు మాటలు మాట్లాడే బ్రహ్మరాక్షసుడితో ఇక వాదించి ప్రయోజనం లేదని తెలిసి రాక్షసుడికి ఆనందం కలిగించే విధంగా నీవు సర్వజ్ఞుడివి, నేను మానవుడిని, తక్కువ కులస్థుడిని, శాస్త్రాలు చదవనివాడిని, నీకు సమాదానం చెప్పగలనా, నా మాటలు మనసులో ఉంచుకోకుండా దయచేసి నా ప్రార్థన విను అన్నాడు దాసని. ప్రతిదినం తాను కురుంగుడి వెళ్ళి నారాయణుడికి స్తోత్రాలు పాడుతానని, ఆ రోజు కూడా తన వ్రతాన్ని చేసుకొనే అవకాశం ఇవ్వమని, తిరిగి వచ్చి ఆహారమవుతానని దాసరి బ్రహ్మరాక్షసుడిని వేడుకొన్నాడు. దానికి రాక్షసుడు తాను నమ్మలేనని, శక్తి కలిగినంత కాలం దాసరి దార్లు కొట్టాడని, ఇప్పుడు బ్రతకడానికి సులభ మార్గమైన భక్తి నటిస్తూ దాసరి వేషం వేశాడని, మోసం చేయటానికి అలా చెపుతున్నాడని , తప్పించుకొని పారిపోవటానికే చూస్తున్నాడని, నోటి దగ్గర కొచ్చిన ఆహారాన్ని ఎవరూ విడువరని, ఎవరూ తిరిగి ఇచ్చిన మాట కోసం తన శరీరాన్ని ఇవ్వటానికి రారని రాక్షసుడు అన్నాడు.

దాసరి వినకూడని మాటలు విన్నట్లు చెవులు మూసుకొని ఎన్నో ఒట్లుపెడతాడు తనను నమ్మమని. కానీ అన్ని బ్రహ్మరాక్షసుడు అంగీకరించడు. చివరికి దాసరి తాను మాట తప్పి తిరిగి రాకపోతే సృష్టి స్థితిలయకారకుడైన విష్ణువుతో వేరే దైవాన్ని పోల్చిన పాపినవుతానంటాడు. ఆ ఒట్టుకి రాక్షసుడు దాసరిని పంపిస్తాడు. దాసరి కురుంగుడి వెళ్ళి విష్ణుదేవుడి

కీర్తనలు పాడి తిరిగి బ్రహ్మరాక్షసుడి దగ్గరకు వస్తాడు. నా వ్రతం పూర్తయింది. ముక్తనుభవం కలిగింది. నీవు పంపేటప్పుడు ఏ అవయవాలున్నాయో అవే అవయవాలు ఉన్నాయో లేదో చూసుకో అన్నాడు. దానికి బ్రహ్మరాక్షసుడు సత్యవంతుడైన ఆ దాసరి చుట్టూ తిరిగి అతడికి మొక్కి ఈ లోకంలో దేవతలు, రాక్షసులు, రాజులు, మునులు ఎవరూ నీలా శరీర దానం చేసినవారు లేరు. భక్తిలో నీకు సాటి ఎవరూలేరు అనగా దాసరి బ్రహ్మరాక్షసుడిని కౌగిలించుకొని రాక్షసుడి దయతోనే తన వ్రతం పూర్తయిందని, స్థిరంగా ఉండని బండి కండ్ల లాంటి ప్రమాణాలని నమ్మవచ్చా. ప్రాణం కోసం లక్షప్రమాణాలు చేస్తారు, వాటిని నమ్మి ఎంతో కష్టంతో లభించిన అన్నాన్ని వదులుకొనే మంచివాడుంటాడా. రాక్షసుడు మాత్రమే పుణ్యాత్ముడని అంటాడు. ఇంకా కడుపు నకనకలాడుతున్నా పంపాడని, జాత్యుచితమైన ఆహారమైన తనను తినటం వలన ఏ పాపం కలుగదని తన మీద స్నేహం ఉంటే తృప్తితీరా తన శరీరాన్ని భుజించమని దాసరి అంటాడు. దానికి ఆ రాక్షసుడు దుఃఖిస్తూ దాసరిని అలా మాట్లాడవద్దంటాడు. ఇన్నాళ్ళు ఆ నరమాంసమే తన పొట్టకు పెట్టానని, తన పాపం పోగొట్టడం కోసం ఎవరో ఒక మహామునో, వ్రతో, మహాపురుషుడో ఈ దారి గుండా రాడా అని ఎదురుచూస్తున్నా, ఇప్పుడు నువ్వొచ్చి భుజించమనటం మంచిది కాదని, పరుసువేది ఏ ఇనుమునైనా ఎలా బంగారంగా మారుస్తుందో అలాగా పాపినైనా తనను అనుగ్రహించమని వేడుకుంటాడు. శరీరాన్ని ఇస్తానంటే వద్దని దుఃఖిస్తున్నావు మరి ఏం కావాలని దాసరి అడుగగా బ్రహ్మరాక్షసుడు తన పాపాన్ని పోగొట్టి తనని పని త్రుడిగా చేయమంటాడు. పూర్వజన్మలో సోమశర్మ అనే బ్రాహ్మణుడినని, చేసిన చెడ్డ పనులు కారణంగా ఈ బ్రహ్మ రాక్షస జన్మ కలిగిందని, దానిని పోగొట్టడం కోసం ఈ రోజు గాన ఫలాన్ని తనకివ్వమని దాసరిని బ్రహ్మరాక్షసుడు అడిగాడు. దానికి దాసరి తానెన్నో జన్మలు ఇంతకుముందు ఎత్తానని, విష్ణు భక్తుడి జన్మ ఎత్తటమే కష్టమైనదని, పాడు శరీరం కోసం గానఫలాన్ని ధారపోయలేనని చెబుతాడు. పోని గీతఫలంలో సగమివ్వమంటాడు బ్రహ్మరాక్షసుడు. దానికి దాసరి శరీరాన్నిస్తానని ప్రమాణం చేశానుగానీ గీతఫలాన్నిస్తానని కాదుకదా అంటాడు. పోనీ ఈ రోజు పాడిన చివరి గీతఫలమైన ప్రసాదించి అనుగ్రహించమని వేడుకొంటాడు బ్రహ్మరాక్షసుడు. అప్పుడు దాసరి దయతో అతడి పూర్వవృత్తాంతం చెప్పించుకొని విని గానానికి ఫలితం పరమేశ్వరుడి అధీనం. ఫలితం కావాలని కోరుకోవటం కూడా బంధ కాంణమే. ఆ భగవంతుడే రక్షిస్తాడనగానే బ్రహ్మరాక్షసుడు బ్రాహ్మణవేషంలో ఉన్న సోమశర్మగా మారి శాపవిముక్తి పొందుతాడు.

### 2. మాలదాసరి పాత్రచిత్రణ చేయండి ?

జ. శ్రీకృష్ణదేవరాయల మాలదాసరిని విష్ణుభక్తుడిగా, సత్యనిష్ఠాగరిష్టుడిగా, సంగీతజ్ఞుడిగా, సంఘనియమాలు ఉల్లంఘించనివాడుగా, సాహసిగా, దయగలవాడిగా అన్నింటిని మించి విష్ణువుకు ప్రియమైన భక్తుడిగా చిత్రించాడు. **విష్ణు భక్తుడు:** మాలదాసరి విష్ణుభక్తుడు. ఎంత గొప్పభక్తుడంటే విష్ణుమూర్తే స్వయంగా దాసరి గురించి విష్ణుచిత్తుడికి చెప్పేటంత గొప్పభక్తుడు. దాసరి ప్రతిరోజు బ్రహ్మముహూర్తంలో కైశికీ రాగంలో శ్రీహరిని స్తుతిస్తూ పాడటం అతడి భక్తిని నిరూపిస్తుంది. హీనజాతిలో జన్మించినా జాత్యుచిత చరిత్ర కలిగి ఉన్నా అతడి మనసు మాత్రం ఎప్పుడూ పవిత్రంగా ఉంటుంది. మసిగుడ్డలోకట్టిన మాణిక్యం లాంటివాడని దేవుడే స్వయంగా చెప్పటం విశేషం.

దాసరి రూపాన్ని కూడా కృష్ణదేవరాయలు వర్ణిస్తాడిలా

చమురైన తోల్కుబుసంబు టెక్కియును ని
        త్తడి శంఖచక్ర కుండలములమర
దివెదారి కొమ్ము దోల్తిత్తియు జోడమ్ము
        మెడ మీది మొగలాకు గొడుగు దనర
మత్పాదరక్షయు మావు పెన్నెఱగు
        ట్టిన యోటి తిపిరిదండెయును మెఱయ
జిటితాళములు సంకపుటికి నొక్కొక్కమాటు
        గతిరయంబున దాకి కలసిమొరయ
వలుద వనమాలకంటెయు మలినతనువు
బట్టెతిరుమన్ను బెదరుగెంబుట్టుఁ జూపు
బసుపుపొడి తోలువల్గంబు నెసకమెసగ
వచ్చుసేవింప సురియాళు వైష్ణవుండు

రూపంలో కూడా దాసరి భక్తే కనిపిస్తుంది. శంఖ చక్రకుండలాలు అతడి వైష్ణవ భక్తికి సంకేతాలే. తిపిరిదండె, చిటితాళాలు అతడు భక్తి పారవశ్యంతో పాడే స్తుతులకు సాక్షులే. అతడి కంఠహారం విష్ణుమూర్తి కత్యంత ఇష్టమైన తులసి పూసల దండే. ఇంకా ఆ దాసరి భక్తితో తాండవం చేస్తాడు, తన వీణను మీటుతూ భగవంతుడిని కీర్తిస్తూ. ఎంతో భక్తితో పరవశిస్తే కానీ కళ్ళవెంట నీరు రాదు, తనను తాను మరిచి ఎండను, ఆకలిని, గాలిని లెక్కచేయక భగవత్ సంకీర్తనలో మునిగి తన్మయత్వం పొందటం గొప్ప భక్తులకే సాధ్యం. ఈ భక్తికి పరాకాష్ఠ గర్భగుడి కడిగిన మలిన జలాన్ని భక్తితో తాగటం. సాష్టాంగ నమస్కారం దాసరి పూర్తిగా విష్ణువుకి తనను తాను అర్పించుకోవటానికి సంకేతం.

బ్రహ్మరాక్షసుడు తన పైకి దూకినపుడు ఆ బ్రహ్మరాక్షసుడితో పోరాడుతూ కూడా మనసులో మాత్రం భగవంతుడి పాదాలను మరువలేదు. అలాగే బ్రహ్మరాక్షసుడు తాను వినలేని మాటలు మాట్లాడినా చెవులు మూసుకుని శ్రీహరినే స్మరిస్తాడు నారాయణ అంటూ. బ్రహ్మరాక్షసుడిని పోనిమ్మని వేడుకోవటం కూడా చివరిసారి దేవుడిని తనివి తీరా స్తుతించడానికే. అంతేగాక దేవతల జన్మలెత్తినా, నీచపు జన్మలెత్తినా అవి సాధారణమే కానీ విష్ణుభక్తుడిగా పుట్టడం మాత్రం కష్టసాధ్యమైనదని దాసరి చెప్పటం అతడి భక్తినే సూచిస్తుంది. శరీరాన్ని ఇవ్వటానికైనా ఒప్పుకుంటాడు గానీ గానఫలాన్ని ఇవ్వటానికి ఒప్పుకోడు. భగవన్నామ సంకీర్తనా మహాత్మ్యం ఎంత గొప్పదో తెలిసినవాడు దాసరి. అంతేగాక ఎలాంటి కోరిక లేక ఏ ఫలితాన్ని ఆశించకుండా తన భక్తిని మాత్రమే ప్రదర్శించేవాడు, ముక్తిని మాత్రమే కోరేవాడు దాసరి. అందుకే గాన ఫలాన్ని కోరటం కూడా బంధకారణమవుతుందంటాడు. భగవంతుడికి, భక్తుడికి భేదం లేదని నిరూపించేవిధంగా ఒక్క మాటతోనే బ్రహ్మరాక్షసుడి, పాపాన్ని పోగొట్టి పూర్వరూపాన్ని తెప్పించగలిగాడు దాసరి.

**జాత్యుచిత వర్తనుడు:**

ఆనాటి సామాజిక పరిస్థితులననుసరించి తన జాతికి ఉద్దేశింపబడిన నియమాలను పాటించేటటువంటివాడు దాసరి. ఎంతోభక్తి కలిగి ఉన్నప్పటికీ గుడి ప్రవేశం నిషేధం. కాబట్టి దాసరి గుడి వెలుపలుండే స్తుతులు పాడేవాడు. అగ్రవర్ణస్థులకు ఎదురుపడటం నాడు నిషేధం. అందుకే వారు ఎదురుపడితే పక్కకు తప్పుకునేవాడు.

అతడు ముఖజాతి గనినంతన పాయుచు నెండగాలి నెం
తో తడవు ( బ్రసాద వినియోగము వార్చి వసించుచు ద్రివ
ర్ణే తర జాతి మెచ్చి దయనిడ్డ ప్రసాదము దండె సాఁచి శ్ర
ద్ధాతిశయంబునన్ వినతినంది భుజించు ( గొనుందదంబువున్

ఇతడు సమీపిస్తే వారు మైలపడతారు కాబట్టి వారు మైలపడకుండా ఉండటానికి తానే ముందుగా తప్పుకునేవాడు తీర్థం, ప్రసాదం కూడా శూద్రులు ఇవ్వగా దానిని నేరుగా చేయి చాచి తీసుకోకుండా దండె చాపి శ్రద్ధతో తీసుకునేవాడు.

వేదాలు చదవకూడదు, వినకూడదని నియమం. ఆ వేదాన్ని తాను ఉచ్చరించకూడదు కనుక వేదార్థాన్ని మాత్రమే బ్రహ్మరాక్షసుడితో దాసరి పలుకుతాడు. "డేతదర్థంబు మా కుచ్చరింపరాదుగాని వేదంబు ప్రథమకళ యనలుండు త్రావునని చెప్పు" అని దాసరి అంటాడు. స్వయంగా శ్రీహరే దాసరి జత్యుచితవర్తనను గురించి

"జాత్యుచిత చరిత్రమ
మత్ప్రీత్యర్థం బూని తనదు హృదయము శుచితా
నిత్యంబుగ దత్తనుసాం
గత్యము మసిపాత మానికంబై యొదుగన్" అని చెప్పటం విశేషం.

దాసరి గురించి 'చండాలేతరశీలుడు' అని కూడా శ్రీహరి పేర్కొనటం విశేషం. పుట్టుక చేత కాక ఉత్తమోత్తమ ఆచారాల చేత భగవంతుడి మెప్పు పొందవచ్చునటానికి దాసరే మంచి ఉదాహరణ. భగవంతుడు చూసేది గుణాలు మాత్రమే, భక్తి మాత్రమే. సామాజికంగా ఏర్పరచిన కట్టుబాట్లు శరీరానికే కాని మనస్సుకు, ఆత్మకు కాదని ఎవరైనా మోక్షాన్ని సాధించవచ్చని, అంతేగాక ఇతరులకు ముక్తిని ప్రసాదించవచ్చునని చెప్పటానికి దాసరే నిదర్శనం.

**సత్యసంధుడు:**

అన్ని ధర్మాలలోకి గొప్పది సత్యం. ఆ సత్యాన్ని అనుష్ఠించటమే ముక్తికి సాధనం. దాసరి సత్యం కోసం తన ప్రాణాన్ని ఇవ్వటానికి సిద్ధపడినటువంటివాడు. ఆ రోజు విష్ణువుని కీర్తించి వ్రతం పూర్తి చేసుకొని తిరిగి వస్తానని వెళ్ళినవాడు తాను చేసిన ప్రతిజ్ఞ కోసం తిరిగి బ్రహ్మరాక్షసుడి దగ్గరకు వస్తాడు.

"స్తుతికలిత ప్రబంధముల జొక్కగఁ బాడి యసత్య భీభర
ద్రుతగతి వచ్చి రాత్రిచరుతో వ్రతపూర్తి గతార్తినిట్లనున్"

అసత్యం ఆడటం వలన కలిగే పాపానికి భయపడుతాడు దాసరి. ప్రాణం కన్నా సత్యవాక్పరిపాలనే గొప్పదని నిరూపించాడు దాసరి.

**విరాగి:**

గొప్ప వైరాగ్యం కలిగినవాడు దాసరి. శరీరం పట్ల ఏ మాత్రం మోహం లేనివాడు. బ్రహ్మరాక్షసుడితో అందుకే తనకు శరీరం మీద కోరిక లేదని చెప్పగలిగాడు. తన శరీరాన్ని బ్రహ్మరాక్షసుడికి ఆహారంగా ఇస్తే తనకు మేలు కలుగుతుందంటాడు.

తెవులయినం గ్రహంబయిన దేలయినం గరమైన నాత్మపెం
దెవులయిన న్జలంబయినం దెక్కలియైన మృగాగ్నులైన మే
ల్తవులయిన న్వణంబయిన ద్రాఁచయిన న్విడుఁ గైన ( దీర్చు పే
లవ తను వూరకే చెడకిలన్నృశు నొక్కని బ్రోచుటొప్పదే

చావంటే భయం లేనివాడు. శరీరం మీద మోహం లేకపోతేనే చావంటే భయముండదు. పుట్టినవాడు గిట్టక మానదని, ఈ శరీరం అశాశ్వతమని తెలియుటే వైరాగ్యానికి మూలం. ఏదోరకంగా చనిపోయే శరీరాన్ని ఇంకొకరి ఆకలి తీరటం కోసం ఉపయోగించటం మరీ మంచిదనుకోవటం దాసరికే సాధ్యమైంది. తన వ్రతం పూర్తయి వచ్చిన తరువాత కూడా విష్ణుభక్తి కంటే, ముక్తి కంటే దేహం ఎక్కువ కాదనే భావాన్నే దాసరి వ్యక్తపరిచాడు. తనను ఆహారంగా స్వీకరించమని నిర్భీతితో బ్రహ్మరాక్షసుడితో చెప్పాడు. ఈ దేహం అశాశ్వతమని చెప్పాడు.

ఊతనీరు చెలది నేత మూటాయిటి
దూది యెండపసుపు దొట్టియక్క
రంబు మేను దీని రహింబుణ్యమమ్ముట
కప్పురంబువెట్టి యుప్పుగొనుట

శరీరం మీద ఏమాత్రం వ్యామోహం లేనివాడు కనుకనే "త్రుటి గీతఫలంబు నొసగుదునె యిమ్మెయికిన్" అనగలిగాడు.

**శాస్త్రపరిజ్ఞానం కలవాడు:**

బ్రహ్మరాక్షసుడికి మంచి, చెడు గురించి చెబుతూ శాస్త్రార్థాలను వివరించి చెబుతాడు దాసరి. "పెనగక ప్రాణ రక్షణ ముపేక్షయొనర్చుట పాపం" అనే మాటని చెబుతాడు. "శిబియ మేల్బంతిగాడె" నని కూడా చెబుతాడు. మాంసం హింసతో కూడుకున్నది, హింస పరలోకంలో బాధకలిగిస్తుందని, హింసతో కూడిన ఆహారం రుచి కాదు, శుచికాదని చెబుతాడు. సత్త్వతమో గుణాలకు ఆహారమే కారణమని చెట్లకంటే కీటకాలకు, కీటకాల కంటే మృగాలకు, పశుపక్షులకు, వాటికంటే మనుష్యులకు బలం ఎక్కువని చెబుతాడు. బ్రహ్మరాక్షసుడితో తన వ్రతం నెరవేర్చమని కోరేటప్పుడు కూడా "సఖ్యం సాప్తపదీన" మనే శాస్త్రవాక్యాన్నే ఉటంకిస్తాడు. అలాగే అనేక జన్మలెత్తాము అంటూ తనకున్న జ్ఞానాన్నంతా చెబుతాడు.

శాస్త్ర విషయాలే కాకుండా లోకవ్యవహారంలోని కూడా తెలుసు అనటానికి "పుట్టు మఱి నూతుల్దవ్వ బేతాళముల్" అని దాసరి అనటమే నిదర్శనం.

**ధైర్యసాహసాలు కలవాడు :**

ఎంతో ధైర్యం కలవాడు కనుకనే దాసరి అర్ధరాత్రైనా చీకటిలోనే కురుంగుడికి బయలుదేరాడు. అలాగే భయంకరమైన మర్రిచెట్టు పరిసరాలను చూసి భీతి చెందలేదు. బ్రహ్మరాక్షసుడే పైకి దూకినా భయపడక సాహసంతో అతడితో పోరాడాడు. బ్రహ్మరాక్షసుడు బంధించిన తరువాత కూడా అతడు కోపగిస్తాడనే భయం లేకుండా అతడికి మంచి మాటలు చెబుతాడు. వ్రతం పూర్తి చేసుకుని వచ్చిన తర్వాత కూడా తాను నమ్మిన దానికోసమే నిర్భీతిగా రాక్షసుడితో వాదిస్తాడు. అన్ని భయాలకు కారణం మృత్యువు. ఆ చావంటేనే భయంలేని వాడిని ఇంకేమి భయపెట్టగలవు. భౌతికమైనవేవీ భయం కలిగించవు దాసరికి, ఒక్క పాపభీతితప్ప.

**గానకళాకోవిదుడు :**

దాసరి మంచి సంగీత పరిజ్ఞానం కలవాడు. మంగళకైశికీ రాగంలో భగవంతుడిని కీర్తిస్తాడు. సంగీతానికి రాళ్ళు కరుగుతాయనడానికి ప్రత్యక్ష సాక్ష్యం మాలదాసరే. దాసరి భగవంతుడికి చేసిన అర్చన సంగీతార్చన. విష్ణుమూర్తికి ప్రియమైనది కీర్తనలే. అందుకే స్వయంగా శ్రీహరే దాసరి గురించి "చండాలేతరశీలుడుత్పులకుడై చాండాలికన్మీటుచున్ గుండుల్నీరుగ" తన నుతులు పాడుతున్నాడని చెబుతాడు. బ్రహ్మరాక్షసుడు కూడా అందుకే అతడి గానఫలం తనకు ముక్తి కలిగిస్తుందని నమ్మాడు. గానఫలాన్నే ఇవ్వమన్నాడు. చివరకు దాసరి భక్తి, గానఫలం కారణంగానే అతడు ముక్తి పొందాడు.

**వాక్చాతుర్యం గలవాడు:**

సందర్భానుసారంగా ఏమి మాట్లాడాలో, ఎలా మాట్లాడాలో తెలిసినవాడు కనుకనే దాసరి బ్రహ్మరాక్షసుడిని తన మాటలతోనే మెప్పించి బంధం విడిపించుకోగలిగాడు. మళ్ళీ కురుంగుడికి వెళ్ళగలిగాడు. తిరిగి వచ్చిన తర్వాత కూడా బ్రహ్మరాక్షసుడితో చాలాసేపు వాదించగలిగాడు. తాను నమ్మిన దానిని స్పష్టంగా వివరించి చెప్పగలిగాడు. సమయానుసారంగా రాక్షసుడికి నీతులు చెప్పాడు, పొగిడాడు. శరీరం కోసం గానఫలం ఇవ్వనని ఖచ్చితంగా చెప్పాడు, బ్రహ్మరాక్షసుడి పూర్వవృత్తాంతం అడిగి తెలుసుకున్నాడు.

"మీద కార్యంబుగల మాకు దీని గాదనంబనిలేదని...
తన్ముఖోల్లాసంబునకు శబ్దచ్ఛలంబున నంతర్గతంబున సుగతునిడుకొని
నీవు సర్వజ్ఞుడ, నేను నరుడు, హీనకులుండ, ననభ్యస్తశాస్త్రుండ,
నీకుత్తరం బీశక్తుండనే" అని రాక్షసుడిని పొగిడాడు.

గీతఫలం ఇవ్వమన్నప్పుడు కూడా నేను నా శరీరాన్ని ఇస్తానని ఒట్టుపెట్టానా, గీతఫలాన్నిస్తానని ఒట్టుపెట్టానా అని అడిగాడు. అవసరానికి ముందు ముఖస్తుతులు పలికిన దాసరి బ్రహ్మరాక్షసుడు చేసిన మేలు మరవకుండా ఉండటమేకాక

అతడి గొప్పతనాన్ని గుర్తించి మనస్ఫూర్తిగా కీర్తించాడు.

బాసలుబండికండ్లు మఱి ప్రాణభయంబున లక్షసేసినం
గ్రాసము కృచ్ఛలబ్ధ ముడుగన్వసమే యిది నీక చెల్లెనో
భూసురవంశ్య పుణ్యజన పుణ్యజనాంకము దానకీనమే
పోమకూరెడిం గులము పొత్తున దైత్యులకెల్లనంకతన్

దాసరి దయకలిగినవాడు. కాబట్టే బ్రహ్మరాక్షసుడి పూర్వజన్మ వృత్తాంతం విని దయకలిగి అతడికి ముక్తిని ప్రసాదించగలిగాడు. సాటి ప్రాణులపట్ల కరుణ కలిగినవాడు కనుకనే హింస మంచిది కాదని చెప్పగలిగాడు.

అన్ని సద్గుణాలకు నెలవైనవాడు దాసరి కనుకనే భగవంతుడి వాత్సల్యానికి, అనుగ్రహానికి పాత్రుడయ్యాడు.

## 3. శ్రీకృష్ణదేవరాయలు ఆముక్తమాల్యదలో చిత్రించిన నాటి పరిస్థితులను విశ్లేషించండి ?

జ. సాహితీ సమరాంగణ సార్వభౌముడు శ్రీకృష్ణదేవరాయలు. అష్టదిగ్గజ కవులను పోషించి ఆంధ్ర సాహిత్యానికి రాయలయుగమే స్వర్ణయుగం అనే రీతిగా సాహిత్యాన్ని వెలయింపజేశాడు. రాజుగా శత్రురాజులను నిర్మూలించటమే గాక ప్రజలక్షేమమే ధ్యేయంగా పాలన అందించాడు. ప్రజల కష్టసుఖాలను తెలుసుకోవడానికి మారువేషాల్లో తానే స్వయంగా దేశాటన చేసేవాడంటే అతడు ఎంత మంచి పాలకుడో అర్థమవుతుంది. అయితే ఆ చేసిన దేశాటన రాజ్యపాలనకే కాదు తాను సృజించిన సాహిత్యానికి సహజత్వాన్ని ఆపాదించడానికి ఉపకరించింది. వివిధ ప్రాంతాలు తిరిగినప్పుడు తాను చూసిన ప్రకృతిని తనివిదీరా వర్ణించటమేకాక ప్రజల జీవనాన్ని చిత్రించాడు. తన రచనలో, అందుకే ఆముక్తమాల్యదలో మనః ప్రవృతులు కనిపిస్తాయి. ప్రకృతి వర్ణనలు కనిపిస్తాయి. రాయలనాటి సమాజానికి దర్పణం వంటిది ఆముక్తమాల్యద. అందులో మనకు నాటి సామాజిక, రాజకీయ, ఆర్థిక, మత పరిస్థితులన్నీ కనిపిస్తాయి.

మాలదాసరి కథలో శ్రీకృష్ణదేవరాయలు దాసరిని, బ్రహ్మరాక్షసుడిని వర్ణిస్తాడు. దాసరి నంటే సమాజంలో విష్ణుభక్తులుంటారు వారిని చూసి వర్ణించారనుకోవచ్చు. కానీ బ్రహ్మరాక్షసుడి వర్ణనే భయంకల్గించే విధంగా ఉంటుంది. ఇంక ఆ బ్రహ్మరాక్షసుడి నివాసమైన మర్రిచెట్టు ప్రాంతం అంతా బీభత్సంగా ఉంటుంది. రాయలు అటువంటి అడవి ప్రాంతాన్ని వేల సంవత్సరాల క్రితపు మర్రి చెట్టును చూసుంటారనిపిస్తుంది. ఆ చెట్ల నాశ్రయించుకుని ఉండే జంతువులను, పక్షులను వర్ణిస్తారు.

ఎలనీటి బొండలంబులు వోలె మెదడెల్ల
  జుఱ్ఱి వైచిన డొల్లు పుఱ్ఱెగములు
నెఱచి గీఱిన జీర లేర్పడ దుదముట్ట
  జీకిన నులి పచ్చి కీకసములు
దొనదొనయను నీగెతుట్టల రూపేరు
  పడక క్రంపలను వ్రేలాడు గరుసులు

దూళ్ళ మక్కెక్కి మంగళ్ళ తిప్పలు రేగు
 వడువున గాలి నాడెడు నెఱకలుఁ
దునిసిన నరాంగకములం బొత్తులను గమిచి
పోక యొండొంటితో బోరి పీకులాడు
శ్వాపదంబులుఁ బదహతి ప్రస్విలుచు
వరుగుదఱచగు ముఱుత్రోవనరిగి యెదుట

రాయల పాలనాకాలంలో ఇలాంటి జనసంచారం ఎక్కువగాలేని అడవి ప్రాంతాలు ఉండేవనటానికి నిదర్శనం. యుద్ధాలు జరిగినప్పుడు లేదా కరువు కాటకాలు ప్రబలినప్పుడు ప్రజలు ఊర్లను ఖాళీ చేసి పోవటం సాధారణం. మాలదాసరి కథలో కూడా మనకు అలాంటి ఊర్లు కనిపిస్తాయి. అటువంటి ఊర్లను చూసున్న కారణంగానే రాయలు ఆ ఊర్లను గొప్పగా వర్ణించగలిగారనిపిస్తుంది.

ఇడిసిన యిడుపుల యెడల బొట్రేనుత్త
 రేను గసెంద కోరింద పొదలఁ
గెడసిన గరిసెల క్రింద లాఁగలఁ గ్రుస్సి
 యదవ కాఁపురముండు నాఖుతతుల
సగము దుమ్మున బూడి చిగిరింత వామూయఁ
 బెరిగిన నూతిపాఁతర బొఱియలఁ
జీమలు ప్రాలీడ్వఁ జివికిన వెలుగుప
 ట్టునఁ బండి యెండి క్రుంగిన గునుకులఁ
బెంటదొగ్గళ్ళలో గడుపంటిశ్మశ్రు
చలనముల గ్రుక్కు జీర్ణోతువుల బొలంపు
దుండుగల మళ్ల మౌరుల దూలినాడు
చిక్కునేతాల పాడఱు సీమ జనుచు

దాసరి ద్వారాలు కూలిపోయి, గాదెలు పడిపోయి, బావులు పూడుకుపోయి ఆ ప్రాంతాలలో చెత్త పెరిగి పందికొక్కులకు, పిల్లులకు ఆశ్రయమై ఉన్న జనం లేక శూన్యంగా ఉన్న ఊరి నుండి వెళ్ళే మర్రిచెట్టును సమీపించాడు. బ్రహ్మరాక్షసుడున్న ప్రాంతానికి దగ్గరలో ఉంది కాబట్టి ప్రజలు ఆ గ్రామం ఖాళీ చేశారా అనే ఆలోచన రాకమానదు. ఆంధ్రదేశ చరిత్రలోనే స్వర్ణయుగంగా పేరుపొందిన రాయలకాలంలో సకల సంపదలతో సమృద్ధిగా ఉన్న ప్రాంతాలు ఉన్నాయి, అలాగే ఇలా నిర్మానుష్యమైన ప్రదేశాలున్నాయనేది తేటతెల్లమవుతుంది. నాటి ఆర్థిక పరిస్థితులు దీనివలన తెలుస్తాయి.

సమాజంలో చాతుర్వర్ణ వ్యవస్థ బలంగా వేళ్ళూని ఉందనేది అర్థమవుతుంది. ఈ నాలుగు వర్ణాల వారే కాక పంచములు ఉన్నారనటానికి మాలదాసరే ఉదాహరణ. సమాజంలో కఠినంగా నియమాలు పాటింపబడేవని తెలుస్తుంది. దాసరి గుడి వెలుపలే ఉండటం. ప్రసాదమైనా శూద్రుడే ఇవ్వటం, ఆ ఇచ్చిన దానిని చేతితో కాక దండెంతో తీసుకోవటం, బ్రాహ్మణులు ఎదురైతే తాను ఎదురుపడితే వారు మైలపడతారని తప్పుకోవటం వంటివి నాటి సమాజంలో అస్పృశ్యత ఉందని, వీరికి గుడి ప్రవేశం లేదని తెలుస్తుంది. అయితే వీరిని సామాజికంగా దూరంగా ఉంచినా యుద్ధ సమయంలో వీరి సేవలను ఉపయోగించుకొనేవారనేది

"వీడును మున్నురే పగటివేళకు మానిసియౌటఁ బోరితో
వాడిమి గొంతకాలమిల వ్రాలుట లావరి యౌట"

అనేది చూస్తే అర్థమవుతుంది. యుద్ధనైపుణ్యం కలవాడు కాబట్టే దాసరి బ్రహ్మరాక్షసుడితో ఎటువంటి భయం లేకుండ ఎదురు నిలిచి పోరాడగలిగాడు.

వేదాధ్యయనం సమాజంలో జరిగేదని తెలుస్తుంది. వేదాలలో చెప్పబడిన అనేక అంశాలు దాసరి బ్రహ్మరాక్షసుడితో చెబుతాడు. నేను అనకూడదు, విన్నవి అంటాడు. వేదవిద్యలు కూడా అగ్రవర్ణాలకే బోధించబడేవి అనేది అర్థమవుతుంది. దీనివలన అయితే శూద్రులు వేదం వింటే చెవుల్లో సీసం కరిగించి పోయాలి అనేటంత కఠిన విధానాలు ఆ రోజుల్లో లేవనటానికి దాసరి అవి విని తెలుసుకోవటమే నిదర్శనం.

సమాజంలో సత్యనిష్ఠ, భక్తి తత్పరత, పరోపకారగుణం ఉండేవని ఈ కథ వలన తెలుస్తుంది. అంతేకాక ఆ రోజుల్లో వైష్ణవమతం ఎంత ప్రాధాన్యత కలిగి ఉందో కూడా

"ఎవ్వని చూడ్కిఁజేసి జనియించు జగంబు వసించునిజ్జగం
బెవ్వని యందు డిందు మఱి యెవ్వని యందిది యట్టివిష్ణుతో
నివ్వల నొక్క వేల్పు గణియించిన పాతకి నౌదు నేడ నే
నెవ్విధినైన నిన్గదియనేని యనన్విని బంధమూడ్చినన్"

వంటి పద్యాలను చూస్తే అర్థమవుతుంది. దైవమంటే ఇంక విష్ణువే. ఇతర దైవాలను కొలిస్తే పాపం కలుగుతుంది అనే స్థాయితో వైష్ణవమతం విస్తరించిందా రోజుల్లో. అదీకాక తమిళనాట వీరవైష్ణవం విజృంభించింది. విష్ణుమూర్తి భక్తులుగా జన్మించటమే కష్టమని భావించేవారని "కంసరిపు భక్తులమొకండెకాము గాని" వంటి పంక్తులు చూస్తే అర్థమవుతుంది. పరుసవేది వంటి విద్యలు ఆ రోజుల్లో ప్రజలకు తెలుసా అని అనిపిస్తుంది ఈ క్రింది పద్య పాదాలు చూస్తే

"స్పదితియై నను ద్విజు దిన్న శస్త్రమైన
సరియకాగాంచనము చేయు పరుసవేది"

ఈవిధంగా శ్రీకృష్ణదేవరాయలు తన రచనలో తన కాలపు వాస్తవ పరిస్థితులకు కొంత కల్పనను జోడించి ఆముక్త మాల్యదను తెలుగు పంచ మహాకావ్యాలలో ఒకటి కాగలిగే విధంగా రచించారు.

**డా॥ ఇరపని మాధవి**
తెలుగు & ప్రాచ్య భాషా విభాగం,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,
నాగార్జున నగర్.

# 2. అయుతనియుతోపాఖ్యానం - తెనాలి రామకృష్ణుడు

**కవిపరిచయం:**

"గార్లపాటి రామలింగడు" శైవ బ్రాహ్మణుడు, కౌండిన్య సగోత్రుడు, తల్లి లక్కమ్మ, తండ్రి రామయ్య, తమ్ములు శ్రీగిరి, అన్నయ్యలు. స్వస్థలం తెనాలి అగ్రహారం.

గార్లపాటి రామలింగడు, కవితా ప్రస్థానం ప్రారంభించి ప్రసిద్ధి పొందుతున్నప్పుడు, తెనాలి రామలింగడు'గా రూఢికెక్కాడు. విజయనగర చక్రవర్తులు వైష్ణవ మత ప్రవిష్టులై పరిపాలిస్తున్నప్పుడు వీరులు, కవులు, ఇతరులు పదవులు పొందగోరి వైష్ణవ మతంలోకి మారిన వారున్నారు. తెనాలి రామలింగడు రాజాశ్రయంలో ఆస్థాన కవిగా రాణించదలచి, భట్టరు చిక్కాచార్యుడి శిష్యుడై వైష్ణవ మతంలోనికి మారినప్పుడు పేరు మారి తెనాలి రామకృష్ణుడయ్యాడు.

రామకృష్ణుడు కృష్ణరాయల ఆస్థానకవి అని, విదూషకుడని తెలిపే కథలు అసంఖ్యాకంగా ఉన్నాయి. రామకృష్ణుడు చెప్పిన ఆధారాలుగాని, ఇతరులు పేర్కొన్నవిగాని లేవు. రామకృష్ణుడు కృష్ణరాయల కాలానికి 16 శతాబ్దికి చెందిన కవి.

**రామకృష్ణుడి శైవ రచనలు :** రామకృష్ణుడు శైవంలో ఉన్నప్పుడు ఉద్భటారాధ్య చరిత్ర', కందర్పకేతు విలాసం, ఆదిపురాణం, లింగపురాణం, ఒక శతకం రచించాడు. ఉద్భటారాధ్య చరిత్ర లభించింది. ఇతర రచనలు లభించలేదు. 'కందర్పకేతు విలాసం' గురించి కొంత తెలుస్తుంది. ఆదిపురాణ లింగపురాణాలు నామమాత్రంగా తెలియవచ్చాయి. శతకం నామమయినా తెలియరాలేదు.

**ఉద్భటారాధ్య చరిత్ర:** ఉద్భటారాధ్యచరిత్రను ఊరదేచయ మంత్రి అంకితం పొందాడు. అతడు రామలింగడికి దూరపు బంధువు, కొండవీడును పాలించిన నాదెండ్ల గోపయకు రాజ కార్య నిర్వాహకుడు. గోపయ అనగా తిమ్మరసు మేనల్లుడు. గ్రంథ రచనా కాలం క్రీ.శ. 1525-30. దేశయ విద్యాగురువు లొల్ల లక్ష్మీధరుడు. వీరి గురువు ముదిగొండ చంద్ర శేఖరారాధ్యుడు. దేవయ శివపంచస్థలికి వ్యాఖ్యానం రచించాడు.

ఉద్భటుడు 8-9వ శతాబ్దికి చెందిన శివభక్తుడు, శైవ ప్రచారకుడు. కాశ్మీర దేశాన్ని పాలించిన జయాపీడుని ఆస్థానంలో విద్యాపతిగా ఉన్నాడు. దేచయ ఉద్భటారాధ్య చరిత్ర రాయించటానికి మూలకారణం శివభక్తి. ఇంకొక కారణం తన దీక్షా గురువు ఉద్భటుడి వంశంలో జన్మించిన వాడని విశ్వసించడం.

ఉద్భటుడి కథ పూర్వం పాల్కురికి సోమనాథుడు బసవ పురాణంలో 38 ద్విపదలలో రచించాడు. రామలింగడు దానిని ఏర్చి కొత్త కథను కూర్చి 842 పద్యాలతో మూడు ఆశ్వాసాల ప్రబంధంగా రచించాడు. ఉద్భటుడి పోషకుడు చరిత్రలో 'జయాపీడుడు' అయితే సోమనాథుడు భోజుడు అనీ, రామలింగడు 'ముంజభోజుడు' అని అన్నాడు.

'ఉద్భటారాధ్య చరిత్ర'లో కొత్తగా కూర్చిన కథలలో 'మదాలస చరిత్ర' ఒకటి. కాశీ మాహాత్మ్యాన్ని తెలుపుతుంది. కుంతలదేశంలో రత్నగర్భపురిలో ధీనిధి అనే విద్వాంసుడున్నాడు. అతని కుమారుడు మదాలసుడు. వైదిక విద్యా ప్రవీణుడయ్యాడు. వివాహమయింది. కాని యౌవన మదంతో మనిషి మారిపోయాడు. వ్యసనీ, చోరుడు అయ్యాడు. కన్నూ మిన్నూ గానక వావివరుసలు వదిలి తిరుగుతున్నాడు. ప్రజలు ఊరి నుంచి వెళ్ళగొట్టారు.

మదాలసుడు ఊరి శివాలయంలో శివుడి నగలు దొంగిలించి కన్యాకుబ్జం వెళ్ళిపోయాడు. 'కనకలత' అనే వేశ్య ఇంట్లో ఉండి సొమ్మును వెచ్చబెట్టాడు. సొమ్ము చెల్లిపోయాక వేశ్య వెంట తరిమింది. మదాలసుడు ధనచౌర్యం చేయదలచి సమీప పట్టణం ప్రయాణమై అరణ్యమార్గంలో కళ్ళు తిరిగి కింద పడ్డాడు. ఒక రాజు సత్కరించి ఇచ్చిన నూతన వస్త్రాలు, వజ్రాలు పట్టుకొని బాలుడైన కొడుకును వెంటబెట్టుకొని వస్తున్న ఒక విద్వాంసుడు జాలిపడి సపర్యలు చేసి సంరక్షించాడు. మదాలసుడు ఆశ పుట్టి, ఆలోచన తట్టి, ఉపకారం చేసిన విద్వాంసుని గురువుగా పొందగోరి ఒప్పించాడు. పొద్దుపోయి, చీకటి పడటంతో మరునాడు ప్రయాణమవుదామనుకొని ముగ్గురూ నిద్రకుపక్రమించారు. మదాలసుడు నిద్రపోలేదు. నిద్రపోతున్నతండ్రి కొడుకులను చంపి వజ్రాలు, వస్త్రాలు పట్టుకొని కనకలత వద్దకు బయలుదేరాడు. అయితే త్రోవ దప్పి కాశీలో తేలాడు. అక్కడ పాముకాటుతో మరణించాడు. అది కాసీ కాబట్టి శివసాయుజ్యం పొందాడు.

**కందర్పకేతు విలాసం:** పెదపాటి జగ్గన ప్రబంధ రత్నాకరంలో కందర్పకేతు విలాసం కావ్యాన్ని ప్రస్తావించి దానిలోని నాలుగు పద్యాలు ఉదాహరించాడు. కందర్పకేతుడు కథా నాయకుడు రెండు పద్యాలు నాయకుడి విరహ విలాపాలు. ఒక పద్యం చంద్రోదయ వర్ణన, ఒక పద్యం నాయిక విరహస్థితి.

**రామకృష్ణుడి వైష్ణవ రచనలు:** రామకృష్ణుడు వైష్ణవంలో ఉన్నప్పుడు హరిలీలావిలాసం. 'పాండురంగ మాహాత్మ్యం', 'ఘటికాచల మాహాత్మ్యం' రచించాడు. 'హరిలీలావిలాసం' లభించలేదు. మిగిలినవి లభిస్తున్నాయి.

**హరిలీలావిలాసం:** పెదపాటి జగ్గన ప్రబంధ రత్నాకరంలో హరిలీలావిలాసం కావ్యాన్ని గురించి ప్రస్తావించాడు. దానిలోని 21 పద్యాలు ఉదాహరించాడు. అందులో 12 పద్యాలు పురవర్ణనకు సంబంధించినది. అవి- పురనామం, ప్రాకారం, అగడ్తలు, మేడలు, బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు, గుర్రాలు, ఏనుగులు, పౌర కామినులు, పుష్పలావికలు, సంధ్యాకాలం, అంధకారం, నక్షత్రోదయం అనే అంశాలకు 7 పద్యాలున్నాయి. ఒక పద్యం భోజన వర్ణనకు, ఒక పద్యం మధుపాన దూషణకు ఉన్నాయి.

**ఘటికాచల మాహాత్మ్యం:** ఘటికాచలమనగా చోళలింగపురం / షోలింగర్, అది 110 తిరుపతులలో ఒకటి. అక్కడి దేవుడు యోగలక్ష్మీ నరసింహస్వామి, ఘటికాచల మాహాత్మ్యం మూడు ఆశ్వాసాలతో, 476 పద్య గద్యాలుగల ప్రబంధం, క్షేత్రమాహాత్మ్య కావ్యం. ఇందులో రెండు ముఖ్య కథలు. రెండు ఉపకథలు ఉన్నాయి. అవి ధవళాంగుని కథ. నారదుని కథ, సప్తర్షుల కథ, వైఖానసులు కథ.

రామకృష్ణుడు కథాభాగం రచించి అవతారిక రచించకుండా కీర్తిశేషుడయ్యాడు. అతని మనుమడు గ్రంథాన్ని మహారాష్ట్ర రాజు ఖండోజీకి అంకితం చేసాడు. ఖండోజీ ఆదేశించగా. అతని ఆస్థాన కవి అయిన వెంకటగిరి అవతారికను రచించి కావ్యస్వరూపానికి సమగ్రతను సంతరించాడు. రామకృష్ణునకు కుమార భారతి అనే బిరుదు కూడా ఉంది.

**పాండురంగ మాహాత్మ్యం:** రామరాజ భూషణుడి 'వసుచరిత్ర' ఆరవీటి తిరుమలరాయలు. అంకితం పొందాడు. అంకితం కాలం 1571. వసుచరిత్రలో నాయికా నాయకులు గిరి కా వసురాజులు, పాండురంగ మాహాత్మ్యం చతుర్థాశ్వాసంలో సర్పం కథ ఉంది. ఒక పాము విష్ణుదేవుని గుడిలోకి వచ్చింది. అక్కడున్న ఎలుక ప్రాణభీతితో దేవుడి పాదాల చెంతకు చేరింది. పాము గిరిక మీద మరులుకొన్న వసురాజు వలె వేగంగా వచ్చిందని, ఎలుక అముక్తమూల్యదవలె భయపడిందని రామకృష్ణుడు ఉపమించి చెబుతాడు. దీనిని బట్టి పాండురంగ

మాహాత్మ్యం వసుచరిత్ర రచనానంతరం పుట్టిన ప్రబంధమని భావించవచ్చు. విరూరి వేదాద్రి అంకితం పొందాడు. కర్ణాట సామ్రాజ్యంలో పొత్తపినాడును గురుదేవ చోడరాజు కుమారులు మండలేశ్వరులై పాలించారు. పెద్ద కుమారుడు సంగరాజు, విరూరి వేదాద్రి సంగరాజు ఉద్యోగి.

మహారాష్ట్ర దేశంలో పండరీ క్షేత్రం ఉంది. అక్కడ వెలసిన దేవుడు పాండురంగడు. రామకృష్ణుని ప్రబంధం – క్షేత్రమాహాత్మ్య కావ్యం. ఇది అయిదు ఆశ్వాసాల రచన. ఇందులో తొమ్మిది కథలున్నాయి. అవి – పుండరీకుడు, నిగమశర్మ, కృష్ణావతారం– రాధ, కాకి–పాము హంస, తేనెటీగ మోక్షం పొందిన కథ, సుశీల, పాండవులు పాండురంగ దర్శనం, సుశర్మకథ, అయుతనియుతులు.

రామకృష్ణుడు స్కాంద పురాణం ఆధారంగా ఈ ప్రబంధాన్ని రచించినట్లు అవతారికలో పేర్కొన్నాడు. కాని స్కాంద పురాణంలో పాండురంగనికి సంబంధించిన కథలు లేవు. పద్మపురాణంలో పాండురంగ ప్రసక్తి కొంత ఉంది.

రామకృష్ణుడు రచించిన 9 కథలలో నిగమశర్మ కథ, రాధ కథ, సుశీల కథ, అయుత నియుతుల కథ, ప్రత్యేక కావ్యాలవలె ప్రకాశిస్తున్నాయి. నిగమ శర్మ కథ అత్యంతం ప్రత్యేక కథ. నిగమ శర్మ అక్క రామకృష్ణుడి కమనీయ కళాసృష్టి. సజీవ పాత్ర. రామకృష్ణుడు కథలను రచించినట్లు వర్ణనలు కూడా కమనీయంగా రచించాడు. ఒక వర్ణనను గమనించండి.

**శా॥ గంగా సంగమ మిచ్చగించునె మదిన్ గావేరి దేవేరిగా**
**సంగీకార మొనర్చునే యమునతో నానందముం బొందునే**
**రంగత్తుంగ తరంగ హస్తముల నారత్నా కరేంద్రుండు నీ**
**యగంబంటి సుఖించునేని గుణభద్రా తుంగభద్రానదీ**

అగస్త్యుడు భార్య లోపాముద్రతో పుణ్యక్షేత్రాలు పర్యటించి వచ్చి తుంగభద్రనూ ప్రశంసించాడు. ఇదొక పద్యం తుంగ, భద్ర అనే రెండు నదులు రెండు నదులుగా ప్రవహిస్తున్నాయి. అవి ఒక చోటు నుండి తుంగభద్ర అనే పేరుతో ఒక నదిగా ప్రవహిస్తున్నాయి. నదులు సముద్రంలో కలుస్తాయి. తుంగభద్ర సముద్రంలో కలియదు. కృష్ణలో కలుస్తుంది. ఈ అంశం భౌగోళిక వాస్తవం, సముద్రుడు భర్త, నదులు భార్యలు, ఈ అంశం కవి సమయం. తుంగభద్ర కలియదు కాని నది కనుక భార్య అవుతుంది. ఈ అంశం తర్కం. సముద్రుడు గంగ, యమున, కావేరులతో సంగమించి ఆనందిస్తున్నాడు. తుంగభద్రను ఉపేక్షించి తప్పు చేస్తున్నాడు. గుణభద్ర తుంగభద్ర కాని, గంగ కాదు. యమున కాదు, కావేరి కాదు. సముద్రుడు ఒక్కసారి స్పృశించి సుఖపడితే తుంగభద్రను తప్ప గంగాది నదులను మరి ఆదరించదు. ఈ అంశం కల్పన. దేవలోక వాసుల దృష్టిలో గంగ తర్వాతనే ఏ నది అయినా. రామకృష్ణుడు తుంగభద్రను గుణభద్ర అని విశేషించి గంగను తక్కువ చేసాడు. అతడు తుంగభద్రా తీరంలో విజయనగరంలో ఉన్నాడు. తుంగభద్రలో సుస్నాతుడయ్యాడు. తుంగభద్ర నీరు త్రాగాడు. విజయనగరం ఉజ్జ్వల దశను అనుభవించడం క్రీ.శ. 1565లో రక్కసి – తంగడి యుద్ధంతో విధ్వంసమై పోవటం ప్రత్యేక్షంగా చూసాడు. కవి హృదయం హర్ష విషాదాలకు అమితంగా స్పందించింది. అభిమానం అక్షర బద్ధమయింది.

ఇలా తెనాలి రామకృష్ణుని కవిత్వ రచన సాగుతుంది. ఇందులోని అయుతనియుతోపాఖ్యానం కథను పరిశీలిద్దాం.

# అయుతనియుతోపాఖ్యానం - పాఠ్యభాగ సారాంశము

గృహస్థాశ్రమం గొప్పదని చెప్పటానికి నారదునితో శివుడు చెప్పిన కథ ఈ అయుత నియుతుల కథ.

అగస్త్య మహామునికి ప్రయుతుడనే శిష్యుడుండేవాడు. ప్రయుతుని సంతానం 'అయుతుడు, నియుతుడు'. వీరు కూడా అగస్త్యుని శిష్యులై, గురుభక్తితో మన్నన పొందారు. వీరిపట్ల గురువైన అగస్త్యునికి విపరీతమైన ప్రేమ. ఒకరోజున అగస్త్యుడు 'వీళ్లు నాశిష్యులందరిలో తెలివిగలవారు. తేజస్సు – ఓరిమి – శాంతము – ఖ్యాతి – వీటిని జ్ఞానంతో సంపాదించుకుని నిర్మలురై ప్రకాశిస్తున్నారు. వాళ్ల మనసులు గురువైన నాయందే లగ్నమై యున్నాయి. వాళ్లకు వివాహం చేసి గౌరవించాలి' – అని అనుకున్నాడు. "చూస్తే వీళ్లకు విద్య మీద తప్ప వేరే ధ్యాస లేదు. వస్త్రాలపై ధ్యాసలేదు. ఆకలి దప్పులు పట్టవు. తలమాసినా పట్టించుకోరు. శరీరపు బడలికను లెక్కచేయరు. ఇవన్నీ సరే! అహోరాత్రులు వేదాధ్యయనం చేయటం చేత వీళ్లకు అలసటే కలగదా! లేకపోతే వీళ్లు కనీసం ఒక్క కునికిపాటు కూడా పోరు. ఎంత ఆశ్చర్యకరమైన విషయం! – వీళ్లు తమకు తగిన భార్యల్ని ఈ లోకంలో పొందటం కష్టం. అందుచేత నేనే వెళ్లి బ్రహ్మదేవుడిని అడిగి, ఆయన పుత్రికలను తీసుకొని వస్తాను" – అని సత్యలోకానికి బయలుదేరివెళ్లాడు.

సత్యలోకంలో బ్రహ్మ సరస్వతీ దేవితో కలసి హంసవాహనంతో మేరు పర్వతంలా మెరిసిపోతున్నాడు. తెల్లని శరత్కాలమేఘాలను అంటుకున్న పెద్ద పర్వతంలా తెల్లని అలంకారాలతో మెరిసిపోతున్నాడు. తెల్లతామరలగద్దెపై ఆసీనుడైన బ్రహ్మ దిగ్గజంలా ప్రకాశిస్తున్నాడు. అటువంటి బ్రహ్మకు అగస్త్యుడు నమస్కరించి స్తుతించాడు.

బ్రహ్మ అగస్త్యుడిని గౌరవించి ఆసనమిచ్చి ప్రస్తుతించాడు. 'నహుషుని పదవీభ్రష్టుని చేసిన హుంకారాలు, వింధ్య గర్వభంగం చేసిన భ్రూభంగాలు, నిశ్శేషంగా జలరాశిని పుడిసిట పట్టిన పుక్కిలింతలు, వాతాపి ఇల్వలులను మింగిన జఠరాగ్నులు నీవే తప్ప లోకంలోనివి కావు. లోక కళ్యాణార్థం దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసం రోషభీషణ పద్ధతిలో క్రీడించే నేర్పరులు నీలాగా వేరెవరూ లేరు. నీ వలన లోకోపద్రవాలు పోగా, నాతోపాటు శివకేశవులు రక్షించబడ్డాము" – అని కీర్తించి వచ్చిన పనిని గురించి చెప్పమని అడిగాడు. అగస్త్యుడు విశదంగా విషయాన్ని చెప్పాడు. 'అయ్యో! ఇదెంతపని?' – అని తాను లోకంలోని యువతులందరికంటే ఎక్కువ అందంతో సృష్టించిన సావిత్రి, గాయత్రి అనే పేర్లుగల మానసపుత్రికల్ని అగుస్త్యునకు అప్పగించాడు. అగస్త్యుడు తన ఆశ్రమంలోని పర్ణశాలకువచ్చి, అయుత నియుతులను పిలిపించాడు. వాళ్లకు ఈ విషయాన్ని వివరించి ఆ కన్యలను వివాహమాడమని చెప్పాడు.

వారిలో అయుతుడు వివాహానికి అంగీకరించలేదు. అప్పుడా ఇద్దరినీ నియుతునికే యిచ్చి వివాహం చేశాడు. తన ఆజ్ఞను పాటించక, బ్రహ్మ సంతానమైన కన్యకామణిని వద్దని వారించిన అయుతుడిని ఆశ్రమం వదలి పొమ్మని ఆజ్ఞాపించాడు.

తన యిద్దరి భార్యల నల్లని ముంగురులు చీకట్లగుంపుగా, అజ్ఞానంధకారంలా ఉన్నప్పటికీ వాళ్ల మనసులలోని ఆలోచనలు చిత్‌చంద్రికలాగా నియుతునికి సంపన్నంగా ఉన్నాయట. వాళ్ల మధురమైన పెదాలు రాగమహితాలైనప్పటికీ, వాళ్ల భావాలు వైరాగ్యగుణంతో ఒప్పేవట. వాళ్ల పెద్దవైన వక్షోజాలు పొంకంగలవైనప్పటికీ,

వాళ్ళ ఆశయాలు మంచివట. వాళ్లు మందగమనలైనప్పటికీ వాళ్ల మనసులు జ్ఞాన నిలయాలట. చంచలమైన చూపుతో నున్నప్పటికీ వాళ్ల నిండు మనసులు నిశ్చలమైనవట. అందుకే సర్వసంగపరిత్యాగిగా ఉన్న నియుతుడు, వారిద్దరిపట్ల సమబుద్ధిని వహించి, ప్రీతితో ఉండగలిగాడు. నియుతుడిలా ఉంటే – అయుతుడు, గురుతిరస్కారంతో, మానసిక వేదనతో హిమాలయ ప్రాంత భూమికి పోయాడు. అక్కడ మనసులో ఇలా అనుకొన్నాడు.

చిలకలు, మలయమారుతం, చంద్రుడు, తుమ్మెదలు, మన్మథుని సాధన సంపత్తి స్త్రీలకు ఉనికిపట్టు. కొంతమంది సన్న్యాసులు ఈ మన్మథపరివారాన్ని తిరస్కరించకుండానే సిగ్గులేక రేగిన కోర్కెలతో ఉండికూడా రాగద్వేషాదుల్ని జయించామని విర్రవీగుతుంటారు. చుట్టుకోటానికి జడలట. కట్టుకోవటానికి కృష్ణాజినమట. కప్పుకోవటానికేమో కాషాయమట. అడవుల్లో నవసిపోయే తపస్వికీ, మిక్కిలి సుఖజీవనాన్ని కోరుకునే సతికి కలయిక కుదురేపనేనా?

ఆయన దూకమంటే కొండనైనా ఎక్కిదూకుతాను. కాని కుచకుంభాలపైకి లంఘించటం మాత్రం నాకు చేతకాదు. పదునైన ఆయుధాలపై పడమంటే పడతానుకాని స్త్రీల సోగజూపుల డాలుని చూడటం నావల్లకాదు. సముద్రపు సుడిలో మునగమంటే మునుగుతాను కాని స్త్రీల లోతైన బొడ్డును చూడమంటే మాత్రం నేను చూడలేను. ఆజ్ఞాపిస్తే కాలనాగునైనా పట్టుకొంటాను గాని స్త్రీల నూగారు తొడుసును మాత్రం నేను ఇష్టపడను. ఆయన ఏ పని చెప్పినా దానిని ఆజ్ఞగా భావించి నేను చేయలేనా? నేను చేయగలిగిన పనులన్నీ ఆయన సొమ్మేకదా! "మొట్టో? లింగం కట్టవయ్యా జంగమయ్యా అంటే, ఆడ వాళ్లను సమకూరుస్తానంటే ఎట్లా కుదురుతుంది. ఇలాంటి పనికి నియుతుడు తగినవాడే కాని నేను మాత్రం గృహస్థు కావటంకంటే మరో ఆపదలేదని భావిస్తాను. గురువుమాట విని ఉరివేసుకోవటం నాకిష్టం లేదు. అందుకే నేను బ్రహ్మచర్యం వహిస్తాను" – అని మనసులో నిశ్చయించుకున్నాడు.

మునిశ్రేష్ఠుడైన అయుతుడు వాసన చూడని పూవులా అస్ఖలితబ్రహ్మచర్య వ్రతంతో శరీరాన్ని మంగలపు నిప్పుతో తపింపచేస్తూ, సానుకూలమైన మనస్కతతో, అసూయను ఉద్వేగాన్ని విడిచి, స్వచ్ఛమైన మణి దర్పణంలాంటి మనసుతో పరమాత్మతత్త్వం ప్రకాశిస్తుండగా తపస్సు చేయసాగాడు. అయుతుని తీవ్ర తపస్సుకు సమస్తలోకాలూ భయకంపితమయ్యాయి. సూర్యుడు కాంతివిహీనమయ్యాడు. భూమికంపించింది. సముద్రాలు పొంగిపొర్లాయి. ఆకాశం అగ్నుల్ని వర్షించింది. ఆ సమయంలో ఆ యువకుడి ఉగ్రనిష్ఠకు దేవేంద్రుడు కలతపడి, అయుతుని తపస్సును మానిపించేందుకు ముసలి బ్రాహ్మణవేషంలో వేగంగా భూమిమీదికి వచ్చాడు. నలిగిపాడైపోయిన జింకచర్మంతో చుట్టబడిన శాస్త్రగ్రంథాలుగల దేవతార్చన పెట్టెను ఒక శిష్యుడు మోసుకొస్తున్నాడు. కంబళి, చాప, ఆసనం, కావిగుడ్డలు, కమండలువు మరొక శిష్యుడు తెస్తున్నాడు. చింతపండు, తేనె, యవలు, పేలపిండి, బియ్యం, పప్పు మొ॥న వాటిని మరొక శిష్యుడు తెస్తున్నాడు. సమిధలు, నెయ్యితో నిండిన వెదురు పాత్రలు, కుశలు, యజ్ఞయాగాదులలో వాడే స్రుక్కులు, స్రువాలు, ఇంకొక శిష్యుడు మోసుకొని తెస్తున్నాడు. పలుపుతాడు పెనవేసిన మెడతో, చంటవెన్నాడే దూడతో నడవలేకనడిచే ధేనువును మరొక బ్రహ్మచారి రొప్పుతూ తోలుకొస్తుండగా, వృద్ధ బ్రాహ్మణవేషంలో ఇంద్రుడు ఆశ్రమప్రదేశాన్ని చేరాడు. ఆతని వెంట ముసలి భార్యకూడా నెరసిన జుట్టుతో, తలవణకుతుండగా వచ్చింది.

ఇలా కపట గృహస్థుని వేషంతో, తీర్థయాత్రలకు వెళుతున్న వానిలా నటిస్తూ అయుతుని ఆశ్రమసమీపానికి ఇంద్రుడు వచ్చాడు. తపోమహత్త్వంతో ప్రకాశిస్తున్న ఆ ఆశ్రమంలోని ఒక పర్ణశాలలోనున్న మంటపంలో కూర్చుని మధ్యాహ్న విధులు నిర్వర్తించి, కాస్తవిశ్రమించి, నదీతీరంలో సాయంసంధ్యోపాసకుపక్రమించబోతున్న అయుతుడిని ఇంద్రుడు తన పరివారంతో సమీపించాడు. అయుతుడు వారికి ప్రేమతో అతిథిమర్యాదలను చేసి, వచ్చిన పనేమిటో చెప్పమని అడిగాడు.

అప్పుడా కపట విప్రుడు అయుతునితో మాది మేరుపర్వతశిఖర ప్రాంతంలోనున్న ఆశ్రమవాటి. అది దేవతావాసము. స్వచ్ఛజలాలలో కూడిన సరస్సులతో, నవపారిజాతాలతో విలసిల్లుతుంది. అక్కడ క్రోధలోభాలకు తావేలేదు.

సంపన్నులు, గుణసంపన్నులు, సమవర్తనులైన వాళ్లు నాతో సమానమైనవాళ్లు కూడా ఉండగా సంతోషంగా కాపురం చేసుకుంటున్నాను, అన్ని ధర్మాలలో గృహస్థధర్మమే గొప్పదని భావించి, ఈ శరీరం శాశ్వతంకాదని గార్హస్థ్య ధర్మనిష్ఠను ఓరిమితో పాటిస్తూ తీర్థయాత్రలు చేయాలన్న ఆశతో ప్రపంచమంతా తిరుగుతున్నాను. కంచి, తిరుపతి, శ్రీరంగము, ప్రయాగ, గయ, సింహాచలము, పూరి మొ॥న క్షేత్రాల్ని చూచి, అన్ని దిక్కులలోనున్న తీర్థాలలో స్నానాలాడి తిరుగుతున్నాను. అలా తిరుగుతూ కోర్కెలు తీర్చే కల్పవృక్షమూ, లక్ష్మీదేవి లేకుండా ఒంటరిగా ఉన్నవాడు, గచ్చకాయలతో ఆడకునే బాలుడు, అరవిచ్చిన మూడోనేత్రం గలవాడు, వెన్నదొంగ, మన్మథుని కన్నతండ్రియైన పాండురంగవిట్టలుని గూర్చి విన్నాను. ఆయన్ని సేవించుకునేందుకు సపరివారంగా బయలుదేరాను. 'నీవెవరివి? ఏమి కోరుకొని భయంకరమైన ఈ తపస్సును చేస్తున్నావు. ఓ ముని కిశోరమా! శరీరం క్షీణించే తపస్సుకు కారణమైన నీ హృదయం దయలేనిదని చెప్పటానికి నా నోరు బాధపడుతున్నది నిజమేదో ఉన్నదున్నట్లుగా వివరించమని అనగా అయుతుడు ఇలా చెప్పాడు.

ఓ నిగర్వీ! నేను ప్రయుతుని సంతానాన్ని. నా పేరు అయుతుడు. నియుతునికి అన్నను. మా అన్నదమ్ములిద్దరము అగస్త్యుని శిష్యులము. మేమంటే ఆ మునికెంతో యిష్టం. తల్లీ, తండ్రీ, గురువు, దైవమూ, దాత అన్నీ ఆయనే. తిరుగులేని విద్యలనిచ్చాడు. ఒకరోజు మన్మథ బాణాల వంటి ఇద్దరు కన్యలను మాకు చూపి 'మీకోసం బ్రహ్మను వేడి బ్రహ్మపుత్రికలను తీసుకవచ్చాను. జ్యేష్ఠానుక్రమంగా స్వీకరించి వివాహం చేసికొమ్మన్నాడు. నేను అవగుణాల పుట్టలైన స్త్రీల వలన కలిగే కీడుతలచి, వివాహానికి విముఖత చూపాను. కాదన్న మాటకు కోపించిన అగస్త్యుడు నన్ను శపించబోయి ఉపశమించాడు. పిలకముడి వీడిపోగానే కోపం కూడా పోతుందన్నట్లుగా, కరవాలనుకున్న పాము ఉపశమించినట్లుగా, నన్ను ఆశ్రమం నుండి బహిష్కరించి, ఆ యిద్దరు కవలల్ని నా తమ్ముడైన నియుతునికే ఇచ్చి పెళ్లి చేశాడు. సలసలమని కాగే అగస్త్యుని కోపం కారణంగా నేను భయంతో కలతపడి, నెత్తిమీద చేయివేసికొని భయంతో ఆ క్షణమే ఇల్లు వదిలాను.

విషంతో సమానమైన ఇంద్రియసుఖాలను అన్నీ వదలి, బ్రహ్మ చర్య వ్రతాన్ని దీక్షగా పాటిస్తూ, మోక్షాన్ని పొందాలనే కోరికతో తపస్సు చేస్తున్నాను."

అప్పుడా కపట బ్రాహ్మణుడు నవ్వుతూ ఇలా అన్నాడు.

"నీ తండ్రి ప్రయుతుడు నాకు మిత్రుడే. ఆతని ప్రాభవం గొప్పది. అంతటి వాడి పెద్దకొడుకువైనందున, నిన్ను చూడటం నాకెంతో ఆనందంగా ఉంది. కానీ నీ విరుద్ధ ప్రవర్తన మాత్రం చెవుల్లో సూదిపొడిచినట్లుంది.

కులధర్మాన్ని వదలి, గురువుకు కోపం కలిగించి, మిత్రుల్ని, తోబుట్టువుల్ని, అయినవారినీ వదలి దూరంగా వచ్చి, ఇలా ఒంటరిగా ఉట్టికట్టుకొని వ్రేలాడుతున్నావు. మన్మథ జ్వాల సోకనీయకుండా, జ్ఞానామృతాన్ని నిలువరించటం అసాధ్యం. నిశ్చల దీక్షతోనున్న పరాశరుడు వంటి పెద్ద పెద్ద మునీశ్వరులకున్న రాళ్లవంటి మనస్సుల్నే మథనుడు కరిగించాడు. వెన్నెల బాగా కాచిదంటే కరిగిపోయే పసిమనసుల్ని కరిగించటం మన్మథుడికెంతపని? సౌధాలలో నివసిస్తూ, రత్నభూషణాదుల్ని ధరిస్తూ, భార్యలచేత సేవించబడుతూ అన్ని భోగాలనూ అనుభవించిన జనకుని వంటి రాజులు సచ్చిదానందాదుల్ని అనుభవించలేదా?

కలలో సమాచారాన్ని విప్పి చెప్పినట్లుగా పురాణేతిహాసాల గాథలన్నీ అర్థాలతో సహా పూసగుచ్చినట్లు వివరించి చెప్పే సన్యాసులు కూడా, తీవ్రమైన ప్రతినియమాలతో కృశించినప్పటికీ మోక్షం పొందటానికి సమర్థులుకారు. మోక్షం అంటే అంత చులకన అనుకున్నావా? సారస్వత పట్టభద్రులైన కవులు ఎంత విపరీతంగా వర్ణించినా, స్త్రీల విలాసాల సరిహద్దుల్ని ఆవంతయినా కనుక్కోలేకపోయారు. రసమనస్కతలేని నీవు సరసాకారమూ, మదనకళానిధియైన శృంగార రసాన్ని ఎలా నిందిస్తావు? అని గృహస్థ జీవితపు గొప్పదనాన్ని చెప్పాడు.

పశువులకొట్టం నుండి పాలు ఇంట్లోకిరాగా, వివిధ ధాన్యాలు చేలల్లో పండి నిండగా, అప్పుడప్పుడూ పెళ్లిళ్లు, వడుగులూ జరుగుతూ, ఆయా సందర్భాలలో యాచకులువచ్చి, కావలసింది అడిగిపొంది, సంతోషంగా మరలిపోతుంటే, పరిచారికా సమూహం పనిపాటలు పాటిస్తుంటే, చుట్టపక్కాలు యిళ్లకు వచ్చి సందడి చేస్తుంటే, తన వైభవం కారణంగా గ్రామమంతా తన సత్యనిష్ఠకు మెచ్చి, సాక్ష్యం కోరుతుంటే, నిత్యనైమిత్తిక కర్మల్ని శ్రద్ధతో ఆచరిస్తూ, దేవుడికి నివేదించిన అన్నాన్ని భార్య వడ్డిస్తుంటే తినటం ముక్తికాని, నిద్రవంటి, రాతివంటి జీవితం ముక్తికాదు." – అని బోధించిన ఆ ముసలి తాపసిమాటల్ని తన మదిలోనికి చొరనీయక, తన పట్టుదలను వదలక ఇలా అన్నాడు.

"సరస్వతిని పుక్కిటబట్టిన బ్రహ్మనైనా, తడబడితే సరిదిద్దే వాళ్లు మీరు. అటువంటి మీరే న్యాయం తప్పి మాట్లాడితే అన్యాయమనటానికి ఎవరికి వీలవుతుంది. వేగంతో ప్రవహించే నది వంకలు తీర్చి దారిని మరల్చటం ఎవరికి సాధ్యం? నన్ను నిష్కారణంగా, నిర్దయగా ఆశ్రమంనుండి బహిష్కరించిన అగస్త్యుని వదలి నన్ను నిందిస్తున్నారే? మమకార దూరునికి మిత్రులు, కళత్రాలు, అన్నదమ్ములు అనే బంధాలు తగినవేనా? లోతైన విజ్ఞానమయ కోశంలో ఆరూఢియైన నిర్మముని ధీరతను మన్మథుడు చెరచలేడు. మదపుటేనుగు యొక్క కుంభస్థలములోని ముత్యాలను హరించటం ఎలా సాధ్యమవుతుంది?

ఓ పుణ్యవిచారా! మునుల పాలి సంపదయైన మోక్షం వైపు లేకుండా, మాటిమాటికీ బూడిదబొట్టులాంటి నీచమైన ఈగృహస్థ ధర్మాన్ని గురించి పొగుడుతున్నావు. కీచురాయి సింహమవుతుందా? గాజుపెంకు రత్నమవుతుందా? ఉమ్మెత్త కల్పవృక్షమవుతుందా? ఈ పట్టింపులు దేనికి? సంపదలుంటేనేగాని గృహస్థధర్మాలు ఆచరించేందుకు సాధ్యం కాదు. మరి సంపదలేమో పూర్వజన్మ పుణ్యంవల్ల కానిరావు. ఒక వేళ సంపదలు చేకూరినా, అవి మహాత్ములనైనా గర్విష్ఠుల్ని చేస్తాయి. కాబట్టి నన్ను ఈ చచ్చుపుచ్చు బోధలతో చంపవద్దు. మన్మథ బాణాలు, మెఱుపుతీగల గుంపులు, నిరంతరం ప్రవహించే అమృత ప్రవాహాలు, సంపెంగతీగలంటూ విద్వాంసులు, వ్యాజస్తుతులచేత నిందించే ఈ దొండపండువంటి పెదాలుగల ఈ స్త్రీలలో అంతటా ఆనందమన్న భ్రాంతే తప్ప చిదానందం ఎక్కడైనా వృద్ధి చెందుతుందా? శిరోజాల అందాల్ని ఇంద్రనీలమణులకాంతులతోనూ,

బిగువైన స్తనాలను ఎత్తైన కొండలతోను, ముఖకాంతుల్ని చంద్రునితోను పోల్చి చెపుతున్నావుగాని, వృద్ధాప్యం మీద పడితే ఆశిరోజాలు తెల్లబడతాయి. పొంకం నశించి ఆ స్థనాలే వేలాడబడతాయి. చంద్రబింబంలాంటి ముఖాన కూడా ముడుతలు వస్తాయి. నాకు కులమువద్దు. గోత్రమూ వద్దు. స్త్రీలూ వద్దు. సంపదలు అసలేవద్దు. నిషేధాగ్నిలో ధగ్ధమైన జన్మదుఃఖాలను పోగొట్టుకొనే ఉద్దేశంతో తపశ్శక్తి కోసం చూస్తున్నాను." – ఇలా ఒకటికి పదిగా, పదికి నూరుగా బదులిస్తూ, తన యుక్తులకు పై ఎత్తుగా సమాధానాలిస్తున్న అయుతుని దృఢ నిష్ఠకు మనస్సులో సంతోషిస్తూనే, కోపంతో ఆ కపట బ్రాహ్మణుడిలా అన్నాడు.

"పిరికి పందకు, యుద్ధాన్ని గురించి, లోభికి త్యాగాన్ని గురించి, వేటాడే బోయవానికి కరుణను గురించి, నపుంసకునికి స్త్రీ సుఖాన్ని గురించి చెప్పినట్లయింది నా హితబోధ. నా మాటలు నీ మనసులో నాటుకోనందున, నీ వేమయితే నా కెందుకు? నీచునికి యుక్తాయుక్తాలు తెలుస్తాయా? పల్లానికి పోయేనీటిని త్రిప్పి, కావలసిన తావుకు మళ్లించటం ఎవరి వల్ల సాధ్యమవుతుంది. గుడిని మింగేవాడికి, తలుపులు అప్పడాలేకదా! అగస్త్య మహాముని వంటి వాడి ఆజ్ఞనే ధిక్కరించి, చిగురువయసులోనే మిన్నుముట్టిన యింత గొప్పవాడికి నా మాట ఎంత?

శుకమహర్షి మొ॥న వారిని తలచుకొని, మెప్పుకోసం మంగలికత్తిని మింగుతున్నావు. పేరాసతో అందని పండుకోసం అఱ్ఱులు చాస్తున్నావు. బొందిలోనే కైలాసం చేరుకోవాలని చూస్తున్నావు. మొండిపట్టుదలవలన లాభంలేదు." అని ఆ కపట బ్రాహ్మణుడు  అయుతుడిని దాటి కొంతదూరం పోయి మళ్లీ కామధేనువు ద్వారా కార్యసిద్ధిని పొందాలని భావించి మాయలు పన్ని వెళ్లాడు. నారదా! తపస్సు చేసేవాళ్లను చూస్తే యింద్రునికి తలనొప్పి కలుగుతుందికదా!" అని శివుడు నారదునితో చెప్పాడు. కామధేనువును అయుతుని పర్ణశాలలో వదలి వెళ్లాడు.

అతిహీనస్థితిలోనున్న ఆ ఆవు అయుతిని కంటపడింది. లేచినిలబడాలంటే దాని దేహంలో మనోబలం తప్ప శరీరబలంలేదు. నమిలేశక్తిలేక కేవలం కొరికిన గడ్డి మాత్రమే నోటవేలాడుతున్నది. శరీరంపై పుండ్లను పొడిచిపొడిచి కాకులు మాంసాన్ని పీక్కుతింటుంటే తోకతో అడ్డుకొంటోంది. పుళ్లమీద ఈగలు ముసురుతున్నాయి. క్రింద పడుకోవటానికి ప్రయత్నిస్తూ స్వేచ్ఛగా వదలివేయబడిన గంగడోలుతో, బెదురుకళ్లతో, కనిపిస్తోంది. ఒకేవైపు పడుకోవటం చేత దానిక్రీదొడల ఎముకలు విరిగినట్లుగా దట్టమైన కన్నీళ్లతో కనిపిస్తోంది. పాలుతాగే సమయం తెలిసికొన్న చిన్నదూడ, పాలకై పొదుగు మొదలంటి పీడిస్తోంది. పొడవైన తాళ్లతో మెడను బంధించి ఉంచిన ఆ తెల్లని ఆవును తన ముంగిట్లో అయుతుడు చూశాడు. అది అంతకు పూర్వం తాను చూసిన ముని యొక్క హెూమధేనువని భావించి, ఆ మంచి ఆవుకు ఇంతలోనే ఈనైచ్యత ఎలా సంభవించిందని  ఆశ్చర్యపడ్డాడు.

మనసులో దయ కలిగింది. వెంటనే భూమిపై పడిన, ఆ హెూమధేనువును ముని పైకి లేపి, దానిని అపాయపరంపర నుండి తప్పించి, సాకి, బలోపేతగా చేయాలని భావించాడు. కలికాలంలో విష్ణుమూర్తి, ధర్మదేవతను ఉద్ధరించినట్లుగా, ఆవును పైకి లేపాడు. దాని వణుకుపోయేలాగా పట్టుకొని, పక్కనున్న ముడతల్ని పోగొట్టి, అడవిఈగల గుంపును దులిపి, ఆవుకు సంతోషాన్ని కలిగించి, గోళ్లతో గంగడోలును దువ్వి, రక్తం చిమ్మే గాయాలలో దుమ్ము చల్లి, నోట్లోనున్న గడ్డిపరకల్ని లోపలికి తురిమి, నెమ్మదిగా నడిపిస్తూ తీసుకపోయి పందిరికున్న రాయికి ఆ గోవును కట్టేశాడు. మన్మథుని వాహనమైన రాచిలుక పచ్చదనం మించిన పచ్చదనంగల పచ్చికను వేసిప్రేమగా మేపి, కడిగిన వెండి కడ్డీలా ప్రకాశించే స్వచ్ఛజలాన్ని తాగేందుకు పెట్టాడు.

ఆ ధేనువు చుట్టూ తిరుగుతూ, అది పడిపోయినప్పుడు లేవనెత్తుతున్న కారణంగా అయుతునికి ఆసనాభ్యాస నైపుణి పట్టువడింది. గడ్డిపోచల్ని కోసి ఆవుకు తినిపించే పనిలోపడి, యజ్ఞంకోసం చిరుదర్భల్ని తీసుకరావటం మర్చిపోతున్నాడు. ఆవు మెడకు కట్టిన తాడు వదులయితే వెంటనే దానిని బిగించే అయుతునికి, జపమాల త్రిప్పే పని తప్పిపోయింది. ఆవుశరీరంపై నున్న పుండ్లపై వాలి మాంసాన్ని తినే పక్షుల్ని అదిలిస్తూ చేసే హుంకారాలతో మంత్రసాధన కుంటుపడింది. ఆశల్ని తుదికంటా కోసిన ఆ బ్రహ్మచారి అయుతునికి, తన మార్గంలో ముందుకు సాగటానికి గోవు ప్రతిబంధకమైంది. కానిపనులను మీద వేసుకునే వారికి సుఖం ఎక్కడిది?

ఓ నారదా! వేయి విధాలుగా అయుతునిచే పోషించబడిన ఈ గోవు 'బీద బలిసి బందికాడైనట్లు ఆ మహాటవిలో విశృంఖలంగా తిరుగుతోంది. గుండులాంటి బలీయమైన కోడెతో చరించి చూలింత అయింది. ఆరగాపండిన బలుసుపండులాంటి కాంతితో ప్రకాశిస్తూ, క్రమంగా యిచ్చే పాలు తగ్గటంతో సూడి గోవని తేలింది. దూడతో కూడి, సూడిదైన ఆ గోవు ముని తపోనిష్ఠను భగ్నం చేయటానికే ఎదురుచూస్తోంది. కళ్లల్లో విచారం అద్దంలో గోచరమైనట్లు, ఆ ముని కుమారుడు మదిలో బాధకు దుఃఖించి "ఈ ఆవుపై నుండి వీచేగాలి ఆశ్రమపు ఆవరణలోని నీవారపాకాలకు వసనాభిమొక్కలనుండి వీచే విషపుగాలి అయింది. ఆశ్రమ ప్రాంతాలలోని కందమూలాలకు, ఈ ఆవు ముంగాలి గిట్టలు వాడియైన గునపాలయ్యాయి. దర్భవనాల పాలిటికి ఈ ఆవు గరుకునాలుకే భయంకరమైన దావాగ్ని అయింది. ఈ ఆవు చేసే హుంకారాలతో గర్భిణులైన ఆడులేళ్లకు గర్భస్రావాన్ని కలిగించే మంత్రమయింది. ఈ ఆశ్రమంలోని తాపసులంతా మోమోటంతో నాకు మాఱు చెప్పటంలేదుగాని మురికి కాకుండానే ఈ దురదదేనికి? ఈ ఆవును దూడతోసహా ఈ సమీపంలోని అడవికి బలిచేస్తాను. అప్పుడు నా మీద పడ్డ నింద తొలుగుతుంది. ఈ ఆవుతోకనే దండంగా భావించాను. దీని కుండపొదుగునే అమృతంతో నిండిన కమండలమనుకున్నాను. దాని ముక్కుపుటాలే భూమి బిలాంతరాలనుకున్నాను. దీని గంగడోలే నా కౌపీనమనుకున్నాను. మునులకుచితమైన సమస్తాన్ని వదలి దీని వెంటబడి కాపాడవలసిన అవసరమేమిటి? అని వితర్కించుకొని కలతపడి ఆ మాయగోవును త్యజించాడు.

అప్పుడా దూడ అరవగా, అయుతుడు ఒక తాటితో కట్టి, ఆ ఆవు మెడకున్న తాడుతో లంకెవేశాడు. ఆ ఆవు తనను వదలిపోవాలని పై చర్మం ఊడిపోయేలా కొట్టి, దాని మెడకొక గుదిగట్టును కట్టి, దాని తలకుకట్టిన తాడును చేత పట్టుకొని మారిని సాగనంపే విధంగా ఆ ఆవును, తన ఆశ్రమం నుండి బయటకు పంపేశాడు.

అయుతుడు పెట్టిన బాధలకు ఆ గోవు కోపించి, పరమజ్ఞానియైన వాధూలమునీశ్వరుడుండే అడవిలోకి ప్రవేశించింది. పులి ఉన్న పొదలాగా, మొసలికి నెలవైన పెద్దమడుగులాగా, త్రాచుపాము నిలచియుండే పెద్ద పుట్టలాగా, ఆ మునియున్న అడవి ఇంద్రాదులకైనా ప్రవేశింపవీలుకానిది.

ఆ మాయ గోవు, అయుతుని చేతిలోని తాటిని లాక్కొని పరుగెత్తుతూ మార్గమధ్యంలో మేఘాలు కమ్మిన మేరుపర్వతంలా పుట్టలూ, దట్టమైన చెట్ల గుంపులో కలిసిపోయిన ఆకారం గల తపోగరిష్ఠుడూ, వయోవృద్ధుడు, ఏ వ్యామోహమూలేనివాడూ, దేవతలతో సమానుడునైన వాధూలమునిని తొక్కింది. దాంతో ముని కోపంతో ఎగిరిపడిలేచాడు. శరీరంపై పెట్టిన పుట్టలు పగిలి బీటలు పడ్డాయి. చెవులపైనుండే పిట్టలు రెక్కలువిదిల్చికొని ముందుకు వెళ్లాలని భావించగా, దట్టమైన జడల గుంపులో గుమికూడి నిద్రపోయే పాముల గుంపు మేల్కొన్నది. గడ్డితీగలు కార్చిచ్చుపాలై మంటలు ఎగిసిపడుతుంటే ప్రకాశించే పర్వతంలా ముని పొడవైన గడ్డాలు మీసాలతో భయంకరక్రోధమూర్తియై, ఆవును వదిలి బ్రహ్మచారిని నిశితంగా చూస్తూ, ఇలా అన్నాడు.

"ఓరి దురాత్మా! మదాంధా! వినయోజ్ఝితా! బ్రతుకుమీద ఆశలున్నవాడెవడూ ఈ వనంలోకి ప్రవేశించలేదు. నీవీ వనంలోకి ప్రవేశించి, ఇంద్రుడు చేసిన నూరు విధ్వంసయత్నాలకు కూడా చెదరని నా తపస్సమాధిని, రాక్షస పద్ధతిలో ధ్వంసంచేశావు. నేను వృద్ధుడిని. ఈశ్వర ప్రణిధాన నిర్మగ్న బుద్ధిని. శక్తిహీనుడిని. నన్నిలా చేసినందుకు ప్రతిగా నీవు ఈ యౌవనం, రూపం, గర్వం, అన్నీ పోయి కప్పవైపో" – అని శపించాడు.

ఊహించని ఈ పరిణామానికి బిత్తరపోయిన అయుతుడు ముని పాదాలపై బడి "ఓ బ్రహ్మనిష్ఠుడా! నీకోపతీవ్రతను తగ్గించు. మీరు కోపిస్తే కొండలు పడిపోతాయి. సముద్రాలు ఇంకిపోతాయి. భూమిబద్దలవుతుంది. మిన్న విరిగిమీద పడుతుంది. నేనెంత? పూర్తిగా అన్నీ తెలిశాక నీ శాపాగ్నితో నన్ను కాల్చు. నీవు తరుగని ప్రళయాగ్నివని తెలుసు. తెలిసి తెలిసి కొరివితో తలగోక్కునే కుమతి ఎవడైనా ఉంటాడా? నన్ను ఊరక ఉండనీయని, మెడలో కట్టుకున్న పాములాంటి ఈ గోవును వదిలించుకోవాలనుకున్నాను. వేరేయేమీ లేదు. దీనోద్ధరణకై కరుణాసముద్రుడివైన నీ మదిలో మండే ఈ పెద్ద కార్చిచ్చు మంటల్ని ఊహించగలమా? – అని ధేనువు వెంట అడవిలో ప్రవేశించిన వివరాలనన్నీ అయుతుడు మునికి వివరించి చెప్పాడు. అప్పుడు వాధూలముని దివ్యదృష్టితో విషయాన్ని తెలిసికొని, చంద్రునిలా చల్లబడ్డాడు. అయుతుడిని ప్రేమగా చూశాడు! అవనిలో బుధుల కోపాలు గడ్డిపోచల చివరి నీటి బిందువులు కదా!

"వత్సా! నా దివ్యదృష్టితో ఆ పాపిని కనుగొన్నాను. కోపమనస్కుడనై అలా శపించాను. నా వాక్కు తప్పదు. మూర్ఖత ఆవహించినందుకు నేనెంతో క్రుంగిపోతున్నాను. జరిగిన దైవఘటనకు చింతించకు. కర్మనశించాలంటే అనుభవించటమే దానికి మార్గం. విశ్వగురువైన గజేంద్రవరదుడిని నిరంతరం రేయీపగలూ ధ్యానించు. నీకు శుభం కలుగుతుంది. హరిభక్తులకెన్నడూ ఆపగరాదు.

ఇల్లాలిమేని మెరుపుల సమూహానికి జలధరంలా ఏది ప్రకాశాన్ని కలిగిస్తుందో, మణిపూసల్లాంటి సంతానం పుట్టుకురావటానికి ఏది సముద్రంలా ఆవాసమవుతుందో, ఆకలిగొన్న వారికి నీడనొసగే చెట్టయి ఏది నిలువనీడనిస్తుందో, పుణ్యలోకాలకు ఎగబ్రాకే పితృదేవతలకు, కుంటివాడికి మెట్టులా ఏది ఆధారభూతమో, అటువంటి గృహస్థ ధర్మాన్ని నీవు నిందించావు. దాని కారణంగానే ఇదంతా జరిగింది. ఇలా ఒప్పును తప్పని పలికే గర్విష్ఠులకు, రాళ్లపైని గాలికూడా కసరిపై బడుతుంది. నేనింతవాడిని. నేను పూనుకుంటే కానిదేముంది? అని పంతంపడితే మానవులకే కాదు దేవతలకైనా ఫలితం సిద్ధించదు. వేదమంత్రాలతో మునులు నిరంతరం పూజించేవాడు, ప్రహ్లాదవరదుడు, స్తంభాల్లాంటి ముప్పైరెండు శాఖలుగల అశ్వత్థమూర్తీ, తన చక్రంతో క్షేత్రజనుల్ని సంరక్షించేవాడూ, వివిధాయుధాలతో, గొప్ప ఆభరణాలతో వెలుగొందేవాడూ, భీమరథీనది తీరపువాడు, వివిధ కథలు, రూపాలుగలవాడు అయిన ఆ నృసింహదేవుని పాదాలవద్ద కప్పవై నివసిస్తూ స్వామిని సేవించుకో! కొంతకాలం గడిచాక ఆడుకప్పతో జతకట్టి సంతానవంతుడవవుతావు. దాంతో నీకు వెంటనే పితౄణము తీరి మోక్షం పొందుతావు." – అని శాపవిమోచనాన్ని చెప్పి, అయుతుడిని ఊరడించి, వాధూలముని లోకాలకాశ్చర్యాన్ని కలిగిస్తూ సూర్యమండలాన్ని ఛేదించుకొని మోక్ష సామ్రాజ్యసింహాసనారూఢుడు అయ్యాడు. వచ్చిన పని పూర్తికావటంతో మాయగోవు కూడ స్వర్గానికి చేరింది. అయుతుడు ఉస్సూరుమంటూ ముల్లోకాలను పవిత్రం చేసే పాండురంగక్షేత్రానికి చేరుకున్నాడు. భీమరథి మొ॥న పుణ్యక్షేత్రాలలో పుణ్యస్నానాలు చేసి, మాయాగోప్తుడైన కృష్ణుని మణిమయమైన దేవాలయానికి చేరుకున్నాడు. విట్ఠలుని పూజించి కీర్తించాడు.

హంస, నురుగుల గుంపుకలిగిన ఆకాశగంగను దాల్చిన మేరుపర్వతంలాగా, చిలుక, తెల్లని స్పటిక జపమాల చేతిలోనున్న సరస్వతీ దేవిని తన ఎడమతొడమీద వహించిన బ్రహ్మదేవుడు ఆ విట్ఠలుని నాభిలోనూ ఉన్నాడు.

అలా విట్ఠలుని దర్శించుకొని, అక్కడినుండి ఉత్తరంగా వెళ్లి వాడియైనగోళ్ల తీవ్రతతో ప్రహ్లాదుని కష్టాన్ని పోగొట్టి ప్రహ్లాదవరదుడై అశ్వత్థవృక్షరూపంలోనున్న నృసింహుని దర్శించుకొని స్తుతించాడు.

స్వామి తలలోని పారిజాతాలు నీలిమేఘంలోని కొత్తకాంతులలాగా ఉన్నాయి. ముఖమనే వెన్నెలయేటి మొగలో తేలిన చేపల్లా స్వామి కళ్లున్నాయి. స్వామి ధరించిన వస్త్రం, ఆ మేనిపైనే తమాలవృక్షంపైకి పాకిన బంగారుతీగలాగా ఉంది. స్వామి మెడలోవేలాడే హారాలు, నీలాకాశం నుండి జారే నక్షత్రల్లాగా నేలకుతాకుతున్నాయి. అప్సరసలు వీవనలు వీస్తున్నారు. ఆగాలికి స్వామి శరీరానికి పూసుకున్న అంగరాంగ వాసనలు, గాలికి కదిలే భూషణాలకాంతులు కలిసి విజృంభిస్తున్నాయి.

నుదుటిబొట్టు, ప్రక్కన తలపైనున్న నెలవంకపై ప్రతిఫలించి అంగారకుడులాగా అనిపిస్తోంది. మెడలోని నల్లమచ్చ శంఖం కడుపులో ప్రకాశించే నీలంలాగా కనిపిస్తోంది. చంద్రవంక జడయనే ఎర్రని తామరపూవుపై పిల్లహంసలాగా ప్రకాశిస్తోంది. అలా ప్రకాశించే శివుడు విట్ఠలుని ఫాలంపై ఉన్నాడు.

రవ్వలు, శంఖసమూహాలకాంతిలో ప్రకాశించే సరస్వతీదేవి బ్రహ్మ ముఖాలు పాతబడ్డాయని, ఆయన నోరులనే యిళ్లలో చొరటానికి పండితుల నోళ్ల రంగస్థలాలపై కొత్తగా చేరింది. అటువంటి సరస్వతి విట్ఠలుని నాలుకపై ఉన్నది.

మృదువైన ముంగురులు పాచిలా కలిగి, చంద్రబింబంవంటి ముఖంతో, పగడపు మొలకలవంటి తీయని పెదవులతో, పెద్దచేపలలా చలించే కళ్లతో, శంఖంలాంటి మెడతో, పర్వతాలవంటి స్తనాలతో, అలలవంటి వళివిలాసంతో, సుడివంటి నాభితో, ద్వీపాల వంటి పిరుదులతో, ఐరావతముయొక్క తొండంలాంటి పెనుతొడలతో, తాబేటి పిల్లలవంటి పాదాలతో, మణులగుంపులాంటి గోళ్లతో ఎవరి గొప్పరూపం సౌభాగ్యసంపదతో తండ్రిని పోలుతుందో ఆమె లక్ష్మిదేవి. విట్ఠలుని హృదయాంతరంగ.

కప్పగా మారబోతున్న అయుతునికి క్రమంగా ఆ లక్షణాలు వస్తున్నాయి. మనోబలం కోల్పోటం, నీటిదాపునందున్న ఎండ్రకాయ బొరియలో నిద్రించాలని కోరుకోవటం, మట్టి సంబంధ ఆహారాన్ని తినాలని అనిపించటం, పెద్దగా అరవటానికి అటూ యిటూ గెంతులు వేయటానికి మనసు ఉత్సాహపడుతోంది. దూరంనుండి వచ్చే పాముల భయంతో యిరుకైన గోతులలో దూరాలని కోరుకుంటున్నాడు. ఇంత ఘోరశాపం వలన మనసుకలత చెందినప్పటికీ, బుద్ధికి బృహస్పతివంటివాడైన అయుతుడు విష్ణువును వదలక స్తుతిస్తున్నాడు.

సహస్ర భానుతేజోమూర్తి అయిన నరసింహస్వామిని కీర్తించాడు. ఆ హిరణ్య కశిపుని సభలోని స్తంభంలో పుట్టి, ఆ రాక్షసుని గుండె చీల్చి వేయటమొక నవ్వులాటగా చేయటానికి కారణమేమి? నీ లీలలు ఎవరెవరుగుదురు? మిక్కిలివాడికలిగి వజ్రాయుధంతో సమానములై వెలుగొందే నీ గోళ్లమొనలు మృదువుగా మారటం కొత్తసంగతి. లక్ష్మీదేవి కుచపార్శ్వాలలోగల కాఠిన్యంవలన, ఆ చోటులలో నఖక్షతాలులేకపోవటమే దానికి ఋజువు. నీ చూపుల ఎర్రదనానికి కారణం కోపమని, భక్తలోకరక్షాపరతంత్రత వలన కలిగిన చక్కని దయాగుణమని, వీరసముద్రంలో విహరించటం వలన స్పష్టమైన డాలుకు మారురూపమని రకరకాలుగా జనులు భావిస్తారు.

వరాహమూర్తివై ఒక కోరతో భూమిని ఎత్తినప్పుడు ఆ కోరచేత గంటుపడిన తూర్పుకొండ శిఖరమా అనిపించేటట్లు భూదేవికుచంపై నీ నఖక్షతం అందగించింది. దానిని పరిహసించేలా లక్ష్మీదేవి రెండు కుచాలపై నఖక్షతాలనుంచి లక్ష్మీదేవి మనసులో సిగ్గులమొగ్గలు పూయించవా? పూర్ణచంద్రబింబంలాంటి మోమున మధ్యలో అంకురించిన పగడపు మొలకలాగా అమరిన మూడవ నేత్రంతో, లేతమొగిలిరేకుల కత్తుల బోనులో చిక్కిన బడబాగ్ని శిఖలా కోరలమధ్య ఎర్రని నాలుకతోను, వెండి స్తంభాలతో వియ్యమందే చేతులలోని కత్తులు, ఆయుధాలు, యమునా తరంగధారలలాగా విరాజిల్లుతుంటే హిమాలయము వెనుక నిలచి, దాని భారాన్ని మోస్తున్న ఆదిశేషునిలా, వెనుకనున్న వాలము (తోక) ప్రకాశించగా, దైత్యుడైన హిరణ్యకశిపుని మనసును దహించేవాడా! ఓ నృసింహా! నిన్ను సేవిస్తాను." అని సహస్ర సూర్యతేజుడైన నృసింహుని కీర్తించి అయుతుడు ఆ క్షణంలోనే కప్పగా మారిపోయాడు.

ఆ శాంతి, ఆ వివేకం, ఆ శుద్ధి, ఆ తపస్సు, ఆ వేదవిజ్ఞానం, చివరికిలా అయ్యాయి. దైవఘటనలు ఇలాగే ఉంటాయి. తనలాంటి వారి మనస్సులలో నెలకొనియున్న భక్తి లతకు వేఱు అని చెప్పదగిన ఆ విష్ణుని పాదాల నాశ్రయించి దుఃఖాన్ని వీడి అయుతుడు కాలాన్ని వెళ్లదీస్తున్నాడు. ముత్యాలు, పగడపుటాకులూ చక్కని ఆకారంతో కూడినట్లుగా ఉన్న ఆ కప్పరూపాన్ని చూసి, ఆశ్చర్యమనస్కులై ఆ తీర్థంలో తిరిగే జనమంతా కొనియాడే వాడు. అటువంటి ఉజ్జ్వల ప్రకాశమైన దేహంతో ఆ కప్ప కనిపించేది. సూర్యోదయానికి ముందే సంగమతీర్థంలో మునిగి స్నానమాచరించేది. ఆ యిసుక తిన్నెలపై కూర్చున్న మునులు చదివే వేదాన్ని తగినచోట కూర్చొని కొంత ప్రొద్దెక్కేదాకా వినేది. మధ్యాహ్నవేళ, ఆ దేవుని బలిపీఠం వద్ద వేసిన పులగాన్ని మితంగా తినేది. సాయం సంధ్యనుండి అర్ధరాత్రి వరకు స్వామి సన్నిధిలో గడిపేది. నృసింహుడు శేషశయ్యపై విశ్రాంతికి మేను వాల్చగానే, ఆయన పదరాజీవాల మూలనున్న బిలంలో పరిపూర్ణమైన అధ్యాత్మ చింతనతో జాగరణ చేసేది. తెల్లవారు జామున, ఆ నరసింహుని ముంగిట వేసే ముగ్గుల వద్ద కప్ప శరీరం రంగుల పూలగుత్తిలా భాసించేది. చూసే వాళ్లంతా ఆ కప్పను హరిదాసమని పిలిచేవారు. అలా చాలాకాలం పూర్వజన్మస్మృతితో, మోక్ష సౌఖ్యాన్ని కోరి కాలంగడిపింది.

ఒకనాడు కన్యాకుబ్జపురాజు కుమార్తె, పాండురంగని ఉత్సవాలలో స్వామిని సేవించేందుకు చెలికత్తెలతో వచ్చింది. తమ తమ రథాలను దిగి, విరహులైన వాళ్ల మనస్సులలో నాటిన మన్మథ శరాల్లాగా నృసింహతీర్థానికి సమీపంలో విడిది చేశారు. దారిలో కలిగిన బడలికను తీర్చుకునేందుకై, భైమీనదిలోనికిదిగి నీటిని కలచివేశారు. అదేమీ పెద్ద వింతకాదు. ఎందుకంటే వాళ్ల వక్షోజాలగోరువెచ్చని కాంతి లేశమే ముల్లోకాల్ని కలచివేస్తోంది. ఆ భైమీతీర్థజలాన్ని విష్ణువు అభిషేకానికి తప్ప వేరే పనులకు ఉపయోగించరు. బ్రహ్మసైతం ఆ నీటిని వాడుకోవటానికి భయపడేవాడు. అటువంటి నీటిలోకి దిగి, ఆ కాంతల స్తనాలనే జక్కవపిట్టలు నీటిని కలతపెట్టాయి. సుగంధ ద్రవ్యాల మొక్కలున్న తోటలోని పూతేనెల పూతపై వాయుదేవుడే ఊపిరి పీల్చటానికి భయపడతాడు. అటువంటి తోటలో తమ నవ్వుల నునుమంచుతో యథేచ్ఛగా విహరించారు. ఎవరిని చూచి అల్లంత దూరంలో నిలబడి దూరాన నిలబడి దేవతలు దండాలు పెడతారో, అటువంటి ముక్కుమీద కోపంగల కాలభైరవుని, ఆస్త్రీలు ఆటబొమ్మలాగా తాకారు. ఏశంకాలేకుండా ఆ మఠంలోని విశాలమైన ఇసుక తిన్నలపైన ఇరుకు సందుల్లోను, తపస్సు చేసుకుంటున్న మునుల ధైర్యం ఆ బాలికల స్తనాలమీది కస్తూరి వాసనల దెబ్బకు దూదిపింజలై చెల్లాచెదరయింది. కార్యాకార్యాలు ఎంచకుండా ఆ అశ్వత్థవృక్షపు నీడలో మధుపానంచేసి, ఉయ్యాలలూగుతూ,

నర్మోక్తులాడుతూ మన్మథపూజ చేయటంవంటి సాహసం చేశారు. యౌవనమదము, సౌందర్యమదమూ, దనమదమూ వీటికి తోడు మద్యపానపు ఉన్మాదముతోడయ్యాయి.

మద్యంతాగిన మత్తులో వాళ్ల ప్రేలాపనలు మితిమీరాయి. పూలగుత్తి చుట్టూ తుమ్మెదతిరుగుతుంటే చూచి ఒకతె కృష్ణుడు యశోదాస్తన్యాన్ని తాగుతున్నాడని అన్నది. మరొకతె ముత్యాలతో నిండిన వెదురును చూచి అది బలిసిన పాములా ఉండడంతో, కద్రువకు నెలలు నిండాయి చూడండని అన్నది. ఏనుగు అరటి చెట్లను విరచటం చూచి, భీమునిగద వలన దుర్యోధనుని తొడలకు బాధకలిగిందని అన్నది.

తపస్సు చేసుకునే మునులు తమ మనసు చిక్కబట్టుకొని తమ విధులు నిర్వర్తించుకుంటున్నారు. వాళ్లు రోజూ విసరుకొనే వింజామరలు సువాసనలు వెదజల్లుతుంటే వెగటుపడ్డారు. రోజూ పూజకు కోసుకునే పూమొగ్గలు, మదన బాణాలకు సహోదరంగా కనిపించి శ్రమ పెడుతున్నాయి. సోమతీగలను చూచి, అవి చంద్రుని పేరు స్వీకరించినట్లుగా అనిపించి వెలవెల పోయారు. చిగురుటాకుల్ని చూచి, వీటి రంగు చిలకపచ్చరంగులో ఉన్నదని మనోమృదులతను కోల్పోయారు. ఆ కన్యాకుబ్జ రాకుమారి అందచందాలకు అలా కష్టాలపాలయ్యారు. చెలికత్తెలతో కలసి ఆ రాకుమారి వీరవిహారం చేసింది.

పూచిన మంకెన చెట్టును చూపి, సముద్రంనుండి బడబాగ్ని వెలువడిందని చెప్పిందొకతె. ఎర్రతామరను చుట్టిన హంసను చూపి శేషుడు చుట్టుకొన్న మేరుపర్వతమని పొగడిందింకొకతె. ఇలా పరమపావనమైన ఆ పౌండరీక తీర్థంయొక్క పరిశుద్ధతను ఆ రాకుమారి చెలికత్తెలతో కలసి ధ్వంసం చేయటాన్ని గమనించిన ఆ క్షేత్రంలోని ఉపదేవతలకు కోపం వచ్చింది.

దుర్గకు తన జడలోని నెలవంక నుండి స్రవించే అమృతంలా మోము చెమరించింది. మద్యపానం వలన ఎరుపెక్కినట్లుగా కాలభైరవుని కనులుఎరుపెక్కాయి. విట్ఠలుడు తనను కాకుండ అన్యాసక్తుడైనట్లు ముక్తకేశి బొమముడి ఎరుపెక్కింది. వేగంగా ఊపిరితీసుకోవటం వలననా అన్నట్లు శివుని వదనం కంపించింది. ఆ సమయంలోనే ఆ కాంతలు నృసింహుని పాదాల చెంతనున్న బిలంలోనుండి బయటికి వచ్చిన కప్ప పొడల పొడల దేహంతో ఉండటం గమనించారు. అది జడభరతుడిలా ఉందే అనుకున్నారు. దీని పుట్టిల్లు రోహణ నగమో, పాలకడలి గర్భమో, ఇంద్రధనుస్సు పుట్టినచోటో అయి యుంటుంది. లేకపోతే దీనికి యిన్ని వన్నెలు ఎలా ఉంటాయి? అని ఆశ్చర్యంతో సంపెంగ మొగ్గల వంటి ముక్కులున్న ఆయువతులు తమ చూపుల వలలు ఆకప్పచుట్టూ విసిరారు. చూచిందేతడవుగా ఆ కప్పను పట్టుకోవటానికి ఎగబడ్డారు. అది ఆటబంతికాదు. ఆడుకోవటానికి చిలుక అసలే కాదు. అద్దం అంతకన్నాకాదు. పలికే వీణాకాదు. అయినా పట్టుకోవటానికి ఎగబడ్డారు. అందులో, యువకులకు వలవేసి పట్టుకునే కీలకం బాగా తెలిసిన ఒక అందగత్తె తన కొప్పులోని దండతో, కప్పను పట్టుకొనే ప్రయత్నం చేసింది. ఆ కప్పచిక్కలేదు. చిక్కకపోయే సరికి తనలోతానే తికమక పడింది. మరొక మీనాక్షి కప్పను పట్టుకోవటానికి తన వస్త్రాన్ని పరచింది. కప్ప తన గత జన్మలోని మమకారాదులనే నదిని ఈది దాటినట్లుగా గెంతి తప్పించుకుంది. వైకుంఠంలోనున్న వనితలు రావణునికి కలిగించిన అలజడిలా ఈ యువతలు కప్పకు అలజడి కలిగించారు. అయినా కప్పరూపంలోని అయుతుడు చిక్కలేదు. అయినా ఆ రాజకుమారి, తన పర్వత ద్వీప భారాన్ని ధైర్యంగా వహించే భూమాతలా స్వయంగా కప్పను పట్టుకునేందుకు రంగంలోకి దిగింది.

పందెం ఏదయినా వేయండి. దీనిని పట్టితీరుతాను, చూడండి అని చిరునవ్వుతో, చెలికత్తెల్ని పరిహసించి, కదలుతున్న మొలనూలనే వలతో సన్నద్ధమై కప్పను చూచి గర్వంగా ఇలా అన్నది. ఈ కప్ప సకల తీర్థాల ప్రాశస్త్యం తెలిసింది. అన్ని తీర్థాలలో కాంచీపురం శ్రేష్ఠమైందని అనిపించినట్లుంది. ఆ రాకుమారి కాంచి (మొలనూలు)కి కట్టుబడింది.

గర్వంతోకూడిన తన చిరునవ్వు వెన్నెలలు చెక్కిళ్లపై ప్రసరిస్తుండగా ఆ రాకుమారి చిత్రమైన ఆ కప్పను కొంచెం సేపు పక్షిని ఆడించినట్లుగా ఆడించింది. మరికొంచెం సేపు మెరుపును ఆడించినట్లు, బొమ్మను ఆడించినట్లు ఆడించి వినోదించింది. ఆపైన కప్పకు భయపడే ఒక ముసలి విప్రుని మీద పడవేసింది. ఆతని శాపం వలన ఆ రాకుమారి, ఆమె చెలికత్తెలూ, కప్పలై, ఆ హరిదాసము (అయుతుడు)నకు భార్యలయ్యారు. ఇలా తన రూపానికి తగిన రూపము, శీలమూగల భార్యలు లభించారు. కప్పగా ఇంతకు పూర్వం నదీజలాన్ని ఈదినట్టు, ఇప్పుడు సంసారజలధిలో ఇనుమిక్కిలిగా ఈదుతున్నాడు. ఇంతకు పూర్వం రాకుమారికి బహిఃప్రాణంగానున్న చెలికత్తెలంతా ఇప్పుడు కప్పల రాజైన అయుతునికి రాకుమారి బార్యకాగానే వాళ్లంతా సపత్నులయ్యారు. సాపత్న్యమెంతకీదైనది?

ఆ నున్నని మోము, సన్నని నూగుమీసములు నశింపక మునుపు అంటే ఆతడు నూత్నయౌవనంలో నున్న దినాలలో ఆ దేవేంద్రుడే వచ్చి మా అన్నవుగదా! గృహస్థాశ్రమం చేపట్టి అగ్రగణ్యుడవై యుండమని చెప్పినప్పుడు కాదని వాదించిన ధైర్యవంతుడు ఎలా అయిపోయినాడో చూడండి. ఆ కప్పసతులు అలిగితే వారి పాదాలకు నమస్కరించి వేడుకుని మరీ వాటిని ప్రసన్నం చేసుకుంటున్నాడు. మనసుకరిగించి, మన్మథుడు వేసే బాణాల దెబ్బల్ని లెక్కపెట్టుకొంటున్నాడు. స్వాతి చినుకులు ఆలిచిప్పలో పడి ముత్యాలయినట్లు, అయుతుని ప్రేమ పర్యాయక్రమంలో ఆ కాంతలందునిలిచింది. ఆ క్రమంలోనే రాకుమారికి, అయుతునికీ సంతానం కలిగింది. దాంతో శాపపు చీకట్లు తొలిగాయి. వివేకచంద్రోదయమైంది. విష్ణుపదంగా గోచరించింది. ఇలా మందపాలునితో సమానమైన శీలంగల అయుతుని చరితం రసవంతమైంది.

గృహస్థధర్మాన్ని వద్దనేవాడు, దుస్సహమైన మొసలినోటినుండి, దుఃఖమనే గుహలో పడతాడని విష్ణువు చెప్పగా విన్నారు. విష్ణుభక్తులై, వివేకులై, ఆశాదూరులై, దొరికిన దానితో సంతృప్తి చెందేవాళ్లు ఈ పుట్టువును అధిగమిస్తారు – అని పార్వతీపతి నారదునికి వివరించాడు.

# ప్రతిపదార్థ తాత్పర్యాలు

**శా॥ ఈనా శిష్యుల లోన వీరిరువురన్ హృద్యానవద్యోదయ**
**జ్ఞానానూన విచారవాగ్విభవ తేజఃక్షాంతిశాంతిప్రథా**
**సానాథ్యంబున గానిపించెదరు; మత్సక్తాశయుల్; వీరి స**
**న్మానింపందగు బాణిపీడన విధాన శ్రీల వాలాయమున్. (5-170)**

**కవిపరిచయం:** ఈ పద్యం తెనాలి రామకృష్ణునిచే రచించబడిన పాండురంగమాహాత్మ్యంలోని 'అయుతనియుతోపాఖ్యానం' నుండి గ్రహించబడినది.

**సందర్భం:** నిత్యం సంసారంలో తలమునకలుగానున్న వాళ్లకు మోక్షం లభిస్తే ఇక సన్న్యాసమెందుకు? అని అన్న నారదునికి ఈశ్వరుడు గృహస్థాశ్రమ వైశిష్ట్యాన్ని చెప్పటానికి చెప్పిన కథలో అగస్త్యుడు తన శిష్యుల గురించి తలపోసే సందర్భంలోనిది ఈ పద్యం.

**ప్రతిపదార్థం:**

| | |
|---|---|
| ఈనాశిష్యుల లోన | = ఈ నాశిష్యులందరిలో; |
| వీరు+ ఇరువురున్ | = ఈ అయుతనియుతులిద్దరూ; |
| "హృద్య+అనవద్య+ఉదయ" | |
| హృద్య | = మనోహరమై; |
| అనవద్య | = లోపరహితమునై; |
| ఉదయ | = కలిగిన; |
| జ్ఞాన + అనూనవిచార | |
| జ్ఞాన | = జ్ఞానంవలన కలిగిన; |
| అనూనవిచార | = గొప్ప ఆలోచనగలిగి; |
| వాక్+ విభవ | = వాక్ సంపద చేత; |
| తేజః | = తేజము; |
| క్షాంతి | = తేజము; |
| శాంతి | = శాంతం, ప్రసిద్ధి; |
| సానాథ్యంబునన్ | = కూడికతో; |
| కానిపించెదరు | = కనిపిస్తారు; |
| మత్+సక్తాశయముల్ | = నాయందే లగ్నమైన మనస్సుగలవారు; |
| వాలాయమున్ | = అవశ్యంగా; |
| వీరిన్ | = వీళ్లను |
| పాణిపీడన విధానశ్రీలన్ | = వివాహసంపదచే; |
| సన్మానింపన్ + తగున్ | = గౌరవించాలి |

**తాత్పర్యం:** నా శిష్యులందరిలో ఈ అయుతనియుతులిద్దరూ మనోహరమైన తెలివితేటలుగలవారు. నిష్కళంకమైన జ్ఞానం చేత కలిగిన వివేచనాశక్తితో, ఓరిమితో, శాంతితో, ఖ్యాతితో ప్రకాశిస్తున్నారు. వాళ్లమనసులు

నాయందే లగ్నమై యుంటాయి. వాళ్లను తప్పకుండా వివాహం చేసి గౌరవించాలి.

**సంధులు:** హృద్య + అనవద్య = హృద్యానవద్య (సవర్ణదీర్ఘసంధి)
వాక్ + విభవ = వాగ్విభవ (జశ్త్వసంధి)
సత్ + మానింప = సన్మానింప (అనునాసికాదేశసంధి)

**సమాసం:** పాణిపీడన విధానశ్రీలు : పాణిపీడనవిధానమనే సంపదలు (రూపక సమాసం)

**విశే:** గురువు తన శిష్యుల గుణగణాలను చెప్పి మురిసిపోవటం ఇందులోని విషయం. శిష్యులందరిలో వీళ్లిద్దరూ "హృద్యానవద్యోదయ జ్ఞానానూన విచార వాగ్విభవతేజఃక్షాంతి శాంతి ప్రధానాసాధ్యంబున" కానిపించెదరని ఏక సమాసంలో వాళ్ల గుణగణాన్ని చెప్పటంతో గురువుగారి వాత్సల్యం, ప్రేమ, 'శిష్యోత్సాహం' వెల్లడవుతున్నది. వాళ్ల మనసులు గురువుపట్లే లగ్నమై యుండటం చేత, వారికింకేమీ తెలియదని, వారి బాగోగుల బాధ్యత తనదేనని, వాళ్ల వివాహప్రస్తావనతెచ్చాడు. వివహాన్ని 'పాణిపీడన విధానశ్రీలన్' – అని అనటం తెనాలి రామకృష్ణుని పదగుంభననైపుణ్యం.

**ఛందస్సు:** UUU IIU IUI IIU UUI UUI U
ఈనాశి | ష్యులలో | నవీరి | రువురన్ | హృద్యాన | వద్యోద | య

1. ఇది శార్దూలవృత్తం. ఇందులో నాలుగు పాదాలుంటాయి
2. మసజసతతగ అనే గణాలు వరుసగా వస్తాయి
3. యతిస్థానం 13వ అక్షరం
4. ప్రాస నియమం ఉంది

శా॥ **వాసో నిగ్రహమెన్న; రాకలియు నీర్వట్టున్ గణింపర్; తలల్**
**మాసెంగా యన; రంగముల్ బదలినన్ బాటింప; రట్లుండనీ**
**యాసాయంబుగ నానిశాత్యయముగా నామ్నాయముల్ క్రోల్చుచో**
**నాసీన ప్రచలాయితం బయినలే దాహా! వితర్కింపగన్. (5-171)**

**కవిపరిచయం:** ఈ పద్యం తెనాలి రామకృష్ణునిచే రచించబడిన పాండురంగమాహాత్మ్యంలోని 'అయుతనియుతోపాఖ్యానం' నుండి గ్రహించబడినది.

**సందర్భం:** నిత్యం సంసారంలో తలమునకలుగానున్న వాళ్లకు మోక్షం లభిస్తే ఇక సన్యాసమెందుకు? అని అన్న నారదునికి ఈశ్వరుడు గృహస్థాశ్రమ వైశిష్ట్యాన్ని చెప్పటానికి చెప్పిన కథలో అగస్త్యుడు తన శిష్యుల గురించి తలపోసే సందర్భంలోనిది ఈ పద్యం.

**ప్రతిపదార్థం:**

| | |
|---|---|
| వితర్కింపగన్ | = పరిశీలించిచూస్తే; |
| వాసోనిగ్రహము +ఎన్నదు | = వస్త్రాలపై ధ్యాసలేదు; |
| ఆకలియున్ నీర్వట్టున్ | = ఆకలిదప్పులను; |
| గణింపర్ | = లెక్కబెట్టరు; |
| తలల్మాసెన్గా | = జుట్టుబాగా పెరిగిందని, జడలుకట్టాయని; |
| అనరు | = అనుకోరు; |

అంగముల్ బడలినన్ = అవయవాలకు బడలిక కలిగినా;
పాటింపరు = పట్టించుకోరు;
అట్లు+ఉండనీ = అచలా ఉండనీయండి;
ఆ సాయంబుగన్ = సాయంకాలంవరకు;
ఆనిశాత్యాయముగాన్ = ఉదయమయ్యేవరకు (అహెూరాత్రాలు అని చెప్పటం);
ఆమ్నాయముల్ = వేదాలు;
క్రోల్చుచోన్ = అధ్యయనం చేసేటప్పుడు;
ఆసీనప్రచల+ఆయితంబు+అయినలేదు = కదలకుండా కూర్చోటంచేతకలిగే కునుకుపాటులేదు;
ఆహా! = ఆశ్చర్యం!

**తాత్పర్యం:** పరిశీలించిచూస్తే వీళ్లకు విద్యమీద తప్పవేరే ధ్యాసలేదు. వస్త్రాలపై ధ్యాసలేదు. ఆకలిదప్పులు పట్టవు. తల మాసినా పట్టించుకోరు. శరీరపు బడలికను లెక్కచేయరు. అవన్నీ అలా ఉంచండి. అహెూరాత్రాలూ వేదాధ్యయనం చేయటం వలన కలిగిన అలసటచేత కనీసమొక్క కునుకుపాటుకూడాతీయరు. ఆలోచిస్తే ఎంతటి ఆశ్చర్యం.

**సంధులు:** నీరు + పట్టున్ = నీరు వట్టున్ – నీరు శబ్దంలోని ఉకారం లోపించి నీర్ + పట్టున్
సూ॥ ప్రథమము మీది పరుషములకు గసడదవలు బహుళంబుగానగు 'నీర్వట్టున్'
ప్రచల + ఆయితంబు = ప్రచలాయితంబు (సవర్ణదీర్ఘసంధి)

**సమాసాలు:** వాసోనిగ్రహము : వాసముల కొరకు నిగ్రహము (చతుర్థీ తత్పురుష సమాసము)

**విశే:** 'విద్యాతురాణాం నసుఖం ననిద్రా' – అన్న ప్రసిద్ధ భావానికి వాఖ్యానంలా ఉందీ పద్యం. ఆబాలగోపాలం లాగా, 'ఆసమయంబుగ', 'ఆనిశాత్యయంబుగన్' అని అనటం రామకృష్ణుని ముద్ర. కనీసం 'కునికిపాటయినాతీయరే!' – అని గురువే ఆశ్చర్యమగ్నుడు కావటం ఇందులోని ఆశ్చర్యం.

**ఛందస్సు:** UUU IIU IUI IIU UUI UUI U
వాసోని | గ్రహమె | న్న:రాక | లియునీ | ర్వట్టున్గ | ఙింపర్;త | లల్
1. ఇది శార్దూలవృత్తం. ఇందులో నాలుగు పాదాలుంటాయి
2. మసజసతతగ అనే గణాలు వరుసగా వస్తాయి
3. యతిస్థానం 13వ అక్షరం
4. ప్రాస నియమం ఉంది

**చం॥ చిలుకలు గమ్మతెమ్మరలు శీతమయూఖుడు దేటులాదిగా**
**గల ననవిల్తు సాధన నికాయము వేలము పట్టులంగనా**
**కుల, మటుగాన దాని విడగొట్టక, తృట్టెక దొట్ట, వీతరా**
**గులమని విర్రవీగెదరు కొందరు బోదల నానగండలై.** **(5–182)**

**కవిపరిచయం:** ఈ పద్యం తెనాలి రామకృష్ణునిచే రచించబడిన పాండురంగమాహాత్మ్యంలోని 'అయుతనియుతో పాఖ్యానం' నుండి గ్రహించబడినది.

**సందర్భం:** అయుత నియుతుల వివాహంకోసం, అగస్త్యుడు బ్రహ్మలోకంపోయి, బ్రహ్మను అడిగి ఇద్దరు కన్యకామణులను తీసికొని వచ్చాడు. వారిలో ఒకరిని వివాహం చేసికొమ్మని అగస్త్యుడు కోరగా అయుతుడు పెళ్లేవద్దని తిరస్కరించాడు. అప్పుడు అగస్త్యుడు ఆ యిద్దరినీ నియుతునికే యిచ్చి వివాహం చేసి, అయుతుడిని ఆశ్రమం నుండి వెళ్లిపొమ్మని ఆదేశించాడు. ఆ సందర్భంలో అయుతుడు బాధపడుతూ గృహస్థాశ్రమానికి తాపసవృత్తికీ గల వైరుధ్యాన్ని తలపోసే సందర్భంలోనిది

**ప్రతిపదార్థం:**

| | |
|---|---|
| చిలుకలు | = చిలుకలు (మన్మథుని వాహనం); |
| కమ్మతెమ్మెరలు | = మలయమారుతము; |
| శీతమయూఖుడు | = చంద్రుడు; (చల్లనికిరణాలు గలవాడు); |
| తేఁటులు | = తుమ్మెదలు (మన్మథుని వింటి అల్లెత్రాడు); |
| ఆదిగాగల | = మొదలైన; |
| ననవిల్తు | = మన్మథుని; |
| సాధన నికాయము | = సాధనసంపత్తి (పరివారం); |
| అంగనాకులము | = స్త్రీల సమూహం; |
| వేలముపట్టులు | = ఉనికిపట్టులు; |
| అటుగాన | = అందుచేత; |
| దానిన్ | = పైన పేర్కొన్న మన్మథపరివారాన్ని; |
| విడగొట్టక | = త్రోసివేయకుండా; |
| కొందఱుబోడలు | = కొందరు సన్న్యాసులు; |
| నానగండలై | = సిగ్గుమాలినవారై; |
| తృట్టు ఎకదొట్టన్ | = దాహం అతిశయించి (కోరికలురేగి); |
| వీతరాగులమని | = రాగద్వేషాన్ని అధిగమించామని; |
| విఱ్ఱవీగెదరు | = విర్రవీగుతుంటారు. |

**తాత్పర్యం:** చిలకలు, మలయమారుతం, చంద్రుడు, తుమ్మెదలు మన్మథుని సాధన సంపత్తి. ఈ మన్మథుని సాదన సంపత్తికి ఉనికిపట్టులు స్త్రీలు. అందుచేత కొంతమంది సన్న్యాసులు ఈ మన్మథపరివారాన్ని తిరస్కరించకుండానే సిగ్గులేక రేగిన కోర్కెలతో ఉండికూడా రాగద్వేషాదుల్ని జయించామని విర్రవీగుతుంటారు.

**సంధులు:** తృట్టు + ఎకదొట్టన్ = తృట్టెకదొట్టన్ (ఉత్వసంధి)

**సమాసాలు:** శీతమయూఖుడు : శీతలమైన మయూఖాలు కలవాడు (బహువ్రీహి)

ననవిల్తుడు : ననలు బాణాలుగా కలవాడు (బహువ్రీహి)

**విశే:** 'ఆశరేగగా' – అని చెప్పటానికి 'తృట్టెకదొట్ట' – అనటం(తృట్టుఎగదొట్టగా), సిగ్గుమాలిన వాళ్లనటానికి, 'నానగండలు' – అనటం రామకృష్ణుని విశిష్టత.

**అలంకారం:** అసంగతి

లక్షణం: కార్యకారణాలకు విరుద్ధమైన భిన్నదేశత్వాన్ని చెప్పటం అలంగతి అలంకారలక్షణం.

ఈ పద్యంలో మన్మథ పరివారానికి ఉనికిపట్టయిన స్త్రీలను వదలివేయకుండానే, సిగ్గులేక కోరికలతిశయించి, వీతరాగులమని చెప్పుకుంటుంటారు. వీతరాగులమని చెప్పుకోవటానికి స్త్రీలకు దూరంగా ఉండాలి. అలా చేయకుండానే అన్నీ వదిలేశామని చెప్పటం అసంగతి.

**ఛందస్సు:** III IUI UII IUI IUI IUI UIU

చిలుక | లుగమ్మ | తెమ్మర | లుశీత | మయూఖు | డుదేటు | లాదిగా

1. ఇది చంపకమాలావృత్తం ఇందులో నాలుగు పాదాలుంటాయి
2. "న-జ-భ-జ-జ-జ-ర" అనే గణాలు వరుసగా వస్తాయి
3. యతిస్థానం 13వ అక్షరం
4. ప్రాస నియమం ఉంది

**మ॥ సుముఖాంతఃకరణంబు, మత్సరము నౌత్సుక్యంబునున్ బాసి ధౌ**
**త మణిదర్పణరీతి జెన్నుగ దదంతర్లగ్నమై యాదిత**
**త్త్వము దీపింప దపంబొనరించు జటిల వ్యాఘ్రుంబనాఘ్రాతపు**
**ష్పము చందంబగు మేననూన నియమ భ్రాష్ట్రాగ్ని ద్రుంగించుచున్** (5-186)

**కవిపరిచయం:** ఈ పద్యం తెనాలి రామకృష్ణునిచే రచించబడిన పాండురంగమాహాత్మ్యంలోని 'అయుతనియుతోపాఖ్యానం' నుండి గ్రహించబడినది.

**సందర్భం:** గురువాక్యాన్ని తిరస్కరించి, పెండ్లాడనని మొండిగా బ్రహ్మచర్యదీక్షను కొనసాగిస్తూ తపస్సుకు కూర్చున్న అయుతుని మనఃస్థితిని వర్ణించే సందర్భంలోనిది.

**ప్రతిపదార్థం:** జటిలవ్యాఘ్రుంబు = జడలుకట్టిన బ్రహ్మచారియైన అయుతుడు;
అనాఘ్రాతపుష్పము చందంబు + అగు = వాసనచూడని పూవు రీతిగా; (అంటే అస్ఖలితబ్రహ్మచర్యవ్రతం);
మేను = శరీరము;
అనూన = గొప్ప;
నియమ = నియమమనే;
భ్రాష్ట్ర+అగ్నిన్ = మంగలపునిప్పుచేత;
మ్రగ్గించుచున్ = తపింపచేస్తూ;
సుముఖ+ అంతఃకరణంబు = అనుకూలమైన మనస్సుతో;
మత్సరమున్ = అసూయను;
ఔత్సుక్యంబునున్ = ఉత్కంఠను;
పాసి = విడిచి
ధౌతమణీదర్పణరీతిన్ = నిర్మలమైన మణిదర్పణం లాగా
చెన్నుగన్ = చక్కగా;
తత్+అంతర్లగ్నమై = ఆ మనసులో;
ఆదితత్త్వము = దైవతత్త్వము

దీపింపన్ = ప్రకాశింపగా;

తపంబు + ఒనర్చున్ = తపస్సు చేస్తున్నాడు;

**తాత్పర్యం:** జడలు కట్టిన బ్రహ్మచారియైన అయుతుడు, వాసన చూడని పూవులా అస్ఖలితబ్రహ్మచర్యవ్రతం కలవాడై, శరీరాన్ని మంగలపు నిప్పుతో తపింపచేస్తూ, సానుకూలమైన మనస్కతతో, అసూయను ఉద్వేగాన్ని విడిచి, స్వచ్ఛమైన మణిదర్పణంలాంటి మనసులో పరమాత్మ తత్త్వం ప్రకాశింపగా తపస్సు చేస్తున్నాడు.

**విశే:** అయుతుడిని 'జటిలవ్యాఘ్ర' మనటం, శకుంతలను కాళిదాసు అన్నట్లుగా అయుతుడిని 'అనాఘ్రాత పుష్పమనటం' ప్రత్యేకంగా పరిశీలింపదగినది. 'వ్యాఘ్ర' శబ్దానికి శ్రేష్ఠత్వంతోపాటు, పూర్వపు ప్రముకశక్తియుత (Pre-eminently Strong) మన్న అర్థం కూడా ఉంది. బ్రహ్మచర్యంతో 'సతిని ముట్టనినాటి సాంబమూర్తి' వంటి వాడని, 'జటిలవ్యాఘ్ర' – మనటంలో జడలు, పులితోలు ధరించిన శివస్ఫురణకూడ ధ్వనిస్తోంది.

**సంధులు:** ఔత్సుక్యమున్ + పాసి = ఔత్సుక్యమునుంబాసి (ద్రుతసంధి)

తపంబు+ఒనర్చు = తపంబొనర్చు (ఉత్వసంధి)

**సమాసాలు:** ధౌతమణిదర్పణము = దౌతమైన మణిదర్పణము (విశేషణపూర్వపదకర్మధారయము)

జటిలవ్యాఘ్రము = జటిలుడైన వ్యాఘ్రము) (విశేషణ పూర్వపద కర్మధారయము)

**ఛందస్సు:** I I U | U I I | U I U | I I I | U U U | I U U | I U

సుముఖాం | తఃకర | ణంబు,మ | త్సరము | నౌత్సుక్యం | బునున్‌బా | సి ధౌ

1. ఇది మత్తేభవృత్తం. ఇందులో నాలుగు పాదాలుంటాయి
2. స-భ-ర-న-మ-య-వ అనే గణాలు వరుసగా వస్తాయి
3. యతిస్థానం 14వ అక్షరం
4. ప్రాస నియమం ఉంది.

**అలంకారం:** ధౌతమణిదర్పణరీతి, అనాఘ్రాత పుష్పంబు చందంబగుమేన అనటంలో ఉపమాలాంకారం, 'నియమబ్రాష్ట్రాగ్ని' అనటంలో రూపకం ఉన్నాయి.

**ఉత్సా॥ వచ్చి వచ్చి కల్పకంబు వంటి యొంటివాని గ**
**న్నిచ్చవచ్చు గ్రచ్చకాయలెంచి యాడువాని మే**
**విచ్చు నెచ్చుకంటివాని వింటివెన్నముచ్చు న**
**ప్పచ్చవిల్తు గన్నతండ్రి బాండురంగ విట్ఠలున్. (5-197)**

**కవిపరిచయం:** ఈ పద్యం తెనాలి రామకృష్ణునిచే రచించబడిన పాండురంగమాహాత్మ్యంలోని 'అయుతనియుతోపాఖ్యానం' నుండి గ్రహించబడినది.

**సందర్భం:** ఇంద్రుడు అయుతునితో తన తీర్థయాత్రావిశేషాల్ని చెపుతూ పలికిన వాక్కులివి.

**ప్రతిపదార్థం:** వచ్చివచ్చి = అలాతిరుగాడుతూ;

కల్పకంబువంటి = కల్పవృక్షంలాంటి (కోరినవరాలిచ్చే);

| | |
|---|---|
| ఒంటివానిన్ | = లక్ష్మీదేవిలేకుండా ఒంటరిగానున్న వాడిని; |
| కన్ను+ఇచ్చవచ్చు | = కంటికి ఇంపైన; |
| గచ్చకాయలు+ఎంచి ఆడువానిన్ | = గచ్చకాయల్ని ఎంచుకొని ఆడేవాడిని; |
| మేవిచ్చున్ | = పార్శ్వంగా విచ్చుకున్న; |
| ఎచ్చుగంటివానిన్ | = అధికమైనకన్ను (మూడవ నేత్రం) గలవాడిని; |
| వెన్నమ్రుచ్చున్ | = వెన్నదొంగను; |
| ఆ+పచ్చవిల్తున్ | = ఆ మన్మథుని; |
| కన్నతండ్రిన్ | = కన్నతండ్రియైన; |
| పాండురంగవిట్ఠలున్ | = పాండురంగవిట్ఠలుని గురించి; |
| వింటిన్ | = విన్నాను; |

**తాత్పర్యం:** అలా పుణ్యక్షేత్రాలు చూస్తూ, కల్పవృక్షంలా కోరికలు తీర్చేవాడు, లక్ష్మీదేవి లేకుండా ఒంటరిగా నున్నవాడు, కంటికింపైన గచ్చకాయల్ని బాల్యక్రీడగా ఆడుకునేవాడు, కొద్దిగా విచ్చుకున్న మూడోనేత్రంగలవాడు, వెన్నదొంగ, మన్మథుని కన్నతండ్రియైన ఆ పాండురంగవిట్ఠలుని గురించి విన్నాను.

**విశే:** ఈ పద్యంలో 'కల్పకంబువంటి యొంటివాని', 'గ్రచ్చకాయలెంచియాడువాని', 'ఎచ్చుగంటివాని', 'వెన్నముచ్చు' – అనే పదబంధాలన్నీ తెనాలి రామకృష్ణుని ముద్రలే. పాండురంగడు లక్ష్మీదేవివిలేకుండా ఒంటరిగా వెలిశాడు కాబట్టి 'ఒంటివాడు' అని, విట్ఠలుడు అయిదు సంవత్సరాలవాడు కాబట్టి బాల్యక్రీడలయందాసక్తిగలవాడని 'గ్రచ్చకాయలెంచి యాడువాని' – యని, వెన్నదొంగకాబట్టి వెన్నమ్రుచ్చని విశేషణాలు వేశాడు. బిందుపూర్వక టకారం పద్యానికి సౌందర్యా పాదకమైంది.

**సంధులు:** ఆ+పచ్చవిల్తు = అప్పచ్చవిల్తు (త్రికసంధి)
గచ్చకాయలు + ఎంచి = గచ్చకాయలెంచి (ఉత్వసంధి)

**సమాసాలు:** వెన్నమ్రుచ్చు – వెన్నను ముచ్చిలువాడు (బహువ్రీహి)
ఎచ్చుగంటివాడు– ఎచ్చైన కన్నుగలవాడు (బహువ్రీహి)

**ఛందస్సు:** ఉత్సాహవృత్తం
వచ్చి | వచ్చి | కల్ప | కంబు | వంటి | యొంటి | వాని | గ

1. ఇది ఉత్సాహవృత్తం. ఇందులో నాలుగు పాదాలుంటాయి
2. వరుసగా ఏడు సూర్యగణాలు, ఆపైన ఒక గురువు ఉంటుంది.
3. 1–4 గణాల మొదటి అక్షరాలకు యతి చెల్లుతుంది
4. ప్రాస నియమం ఉంది.

**అలంకారం:** 'కల్పకము వంటి యొంటివానిన్'. అనటంలో ఉపమాలంకారముంది.
పసివాడని అనటానికి 'గచ్చకాయలెంచియాడువాడు' అనటంతో 'పర్యాయోక్తి' అలంకారముంది.

**చ॥ అమృతభుగాస్పదంబు, విశదాప్సరమున్, నవపారిజాతము
ఖ్య మహిజరాజిరాజిత మనంత ఫలాయతనంబు, నిత్యర
మ్యమునగు నొక్క యాశ్రమము హైమ నగోపరి సీమ నుల్ల సి
ల్లు మదధివాసమై, మదము లోభము క్రోధము మొల్వవచ్చుటన్ (5-193)**

**కవిపరిచయం:** ఈ పద్యం తెనాలి రామకృష్ణునిచే రచించబడిన పాండురంగమాహాత్మ్యంలోని 'అయుతనియుతోపాఖ్యానం' నుండి గ్రహించబడినది.

**సందర్భం:** అయుతుడిని తపోనిష్ఠనుండి మాన్పించే నిమిత్తం ముసలి బ్రాహ్మణ వేషంలో ఇంద్రుడు వచ్చి, అయుతునితో మాట్లాడే సందర్భంలోనిది ఈ పద్యం.

**ప్రతిపదార్థం:** అమృతభుక్+ఆస్పదంబు = దేవతలకు నివాసమైనది;
విశద+అప్సరమున్ = స్వచ్ఛజలంతోకూడిన సరస్సుకలది; ఆ (స్వర్గపరం) (పరిశుద్ధులైన అప్సరసలతోకూడినది.

'నవపారిజాతముఖ్యమహిజరాజిరాజితము'

| | |
|---|---|
| నవ | = క్రొత్త; |
| పారిజాతముఖ్య | = పారిజాతము మొ॥న |
| మహిజరాజి | = వృక్షాల సమూహం చేత; |
| రాజితము | = ప్రకాశించేది; |
| అనంతఫలాయతనము | = నిరంతరమూ ఫలాలనిచ్చేది (స్వర్గపరంగా 'ఫలాయతనము'=స్వర్గము) |
| నిత్యరమ్యమును+అగున్ | = నిత్యానందకరమైన; |
| ఒక్క+ఆశ్రమము | = ఒక ఆశ్రమము; |
| హైమనగ+ఉపరిసీమన్ | = మేరుపర్వతశిఖరభాగాన; |
| మత్+అధివాసము+ఐ | = నాకు నివాసమై; |
| ఉల్లసిల్లున్ | = ప్రకాశిస్తుంది; |
| అచ్చుటన్ | = అక్కడ; |
| మదము | = అహంకారము; |
| లోభము | = పిసినారితనము; |
| క్రోధము | = కోపము; |
| మొల్వవు | = కలుగవు. |

**తాత్పర్యం:** దేవతలకు నివాసమైనది, స్వచ్ఛజలంతో కూడిన సరస్సుకలది, నవపారిజాత వృక్షాలతో అలరారేది, నిరంతరమూ ఫలాలనిచ్చేది, నిత్యానందకరమైన ఒక ఆశ్రమం మేరుపర్వత శిఖరభాగాన నాకు నివాసమై ప్రకాశిస్తుంది. అక్కడ అహంకారము, క్రోధము, లోభం వంటివి కలుగవు. చెపుతోంది ఇంద్రుడు కాబట్టి ఆశ్రమపరంగా చెప్పిన ఈ అర్థమే స్వర్గపరంగా కూడా అన్వయిస్తుంది. స్వర్గం దేవతానివాసంగదా!

స్వచ్ఛమైన అప్సరగణంతో కూడింది, కొనియాడదగిన పారిజాతవృక్షాలుగలది అయిన మేరుపర్వత శిఖరాన నా నివాసం. అక్కడ క్రోధమదలోభాలు జనించవు అని శ్లేషతో అన్వయించవచ్చు.

**సంధులు:** అమృతభుక్ + ఆస్పదంబు = అమృతభుగాస్పదంబు
మత్ + అధివాసము = మదధివాసము (సరళాదేశసంధి) (జశ్త్వసంధి)
నగ + ఉపరిసీమ = నగోపరిసీమ (గుణసంధి)
రమ్యము+అగు = రమ్యమునగు (నుగాగమసంధి)

**సమాసాలు:** నగోపరిసీమ : నగముయొక్క ఉపరిసీమ (షష్ఠీ తత్పురుష సమాసం)
అనంతఫలాయతనము:అనంతమైన ఫలాలకు స్థానమైనది (విశేషణపూర్వపద కర్మధారయము)

**ఛందస్సు:** III IUI UII IUI IUI IUI UIU
అమృత | భుగాస్ప | దంబు,వి | శదాప్స | రమున్,న | వపారి | జాతము

1. ఇది చంపకమాలావృత్తం ఇందులో నాలుగు పాదాలుంటాయి
2. "న–జ–భ–జ–జ–జ–ర" అనే గణాలు వరుసగా వస్తాయి
3. యతిస్థానం 11వ అక్షరం
4. ప్రాస నియమం ఉంది

**అలంకారం:** శ్లేష

**విశే:** తన నివాసాన్ని గురించి ఇంద్రుడు శ్లేషరూపంలో చెప్పటం ఇందులోని విశేషం.

**చ॥ చలనవిహీన వృత్తి సడిసన్న పరాశరు డాదియైన య**
**య్యల యలరాయివంటి హృదయంబులు నీరుగ జేయపోయ పూ**
**విలుతున కెంతదొడ్డపని? వెన్నెల బిర్రని కాసినంతలో**
**పలన కరంగి పొంగు పసిబాలుర చిత్తము మెత్త చేయగన్** (5–212)

**కవిపరిచయం:** ఈ పద్యం తెనాలి రామకృష్ణునిచే రచించబడిన పాండురంగమాహాత్మ్యంలోని 'అయుతనియుతోపాఖ్యానం' నుండి గ్రహించబడినది.

**సందర్భం:** మారువేషంలో వచ్చిన యింద్రుడు అయుతునితో పలికిన మాటలివి.

**ప్రతిపదార్థం:**

| | |
|---|---|
| చలనవిహీనవృత్తిన్ | = నిశ్చలదీక్షతో; |
| సడిసన్న | = పేరుకెక్కిన; |
| పరాశరుడు+ఆదియైన | = పరాశరుడు మొదలైన; |
| అయ్యల | = పెద్దల; |
| అలరాయివంటి | = రాయిలాంటి; |
| హృదయంబులు | = మనసుల్నికూడ; |
| నీరుఁగజేయు | = కరిగించే; |
| బోయ | = వేటగాడైన; |

| | |
|---|---|
| పూవిల్తునకు | = మన్మథునికి; |
| వెన్నెలబిఘ్ఘ+అని | = వెన్నెల దట్టంగా; |
| కాసినంతలోపలన్ | = విరిసేలోపుగా; |
| కరంగిపొంగు | = కరిగిపొంగే; |
| మెత్తచేయఁగన్ | = మెత్తపరచటం |
| ఎంత దొడ్డపని | = ఎంతగొప్పపని. |

**తాత్పర్యం:** నిశ్చలమైన మనసుతో దీక్షవహించి పేరుకెక్కిన పరాశరుడు మొ॥న పెద్ద పెద్ద మునీశ్వరులకున్న రాయిలాంటి మనసులనే కరిగించివేసిన వేటగాడు మన్మథుడు. వెన్నెలబాగా కాచిందంటే కరిగిపొంగిపోయే పసివాళ్ల మనసుల్ని కరిగించటం అతనికెంతపని?

**విశే:** ఈ పద్యంలో వ్యాసుని తండ్రియైన పరాశరుడు, మత్స్యగంధికి లొంగిపోవటాన్ని సాకుచూపి, అటువంటి మునే మన్మథునికి లొంగిపోతే నువ్వెంత? అని వ్యంగ్యంగా చెప్పటాన్ని గమనించాలి. 'వెన్నెల బిఘ్ఘనికాసినంతలో' – అనటం రామకృష్ణుని ముద్ర.

**సంధులు:** నీరుగన్+చేయు = నీరుగఁజేయు (ద్రుతసంధి)

బిఘ్ఘ+అని = బిఘ్ఘని (ఉత్వసంధి)

**సమాసాలు:** బోయపూవిలుతుడు : బోయవాని వంటి పూవిలుతుడు (ఉపమిత సమాసం)

పసిబాలురచిత్తము : పసిబాలురయొక్క చిత్తము (షష్ఠీతత్పురుష సమాసం)

**అలంకారం:** అర్థాపత్తి

కైముత్యన్యాయంతో అర్థసిద్ధి కలిగినట్లు వర్ణించటం అర్థాపత్తి. పరాశరాదులే మన్మథుని బారినపడితే పసివారైన మీరెంత? అనటంలో అర్థాపత్తి ఉంది.

**ఛందస్సు:** III IUI UII IUI IUI IUI UIU

చలన | విహీన | వృత్తిస | డిసన్న | పరాశ | రుడాది | యైనయ

1. ఇది చంపకమాలావృత్తం ఇందులో నాలుగు పాదాలుంటాయి
2. "న–జ–భ–జ–జ–జ–ర" అనే గణాలు వరుసగా వస్తాయి
3. యతిస్థానం 11వ అక్షరం
4. ప్రాస నియమం ఉంది

మ॥ **లలితాగార విహారులై మణిమయా లంకారులై, శీలవ**
**ల్లలనాలాలితులై, యమూల్య మృదుచేల ద్యోతితాకారులై**
**కలమాన్న ప్రియులై, సుగంధధరులై, కందర్పునింబోని భూ**
**తలనాథుల్ జనకాదులొందిరికదా తత్తాదృగానందముల్.** (5–213)

**కవిపరిచయం:** ఈ పద్యం తెనాలి రామకృష్ణునిచే రచించబడిన పాండురంగమాహాత్మ్యంలోని 'అయుతనియుతోపాఖ్యానం' నుండి గ్రహించబడినది.

**సందర్భం:** మారువేషంలో వచ్చిన యింద్రుడు అయుతునితో పలికిన మాటలివి.

**ప్రతిపదార్థం:** లలిత+ఆగారవిహారులై = మంచి సౌధాలలో విహరించే వారై;

మణిమయ+అలంకారులై = రత్నభూషణాదుల్ని ధరించినవారై;

శీల.... లాలితులై

శీలవత్ = శీలవంతులైన;

లలనా = భార్యలచే;

లాలితులై = సేవించబడినవారై;

అమూల్య = వెలకట్టలేని;

మృదుచేల = మెత్తని పట్టువస్త్రాల చేత;

ద్యోతిత+ఆకారులై = కనిపించే అందమైన రూపంగలవారై;

కలమాన్నప్రియులై = మేలయిన వరి అన్నాన్ని ప్రియంగా తినేవారై;

సుంగధ ధరులై = మంచిగంధాన్ని ధరించినవారై;

కందర్పునిన్+పోని = మన్మథునివంటి;

భూతలనాథుల్ = రాజులు;

జనకాదులు = జనకుడు మొ॥న మహారాజులు;

తత్తాదృక్ = దానికితగిన;

ఆనందముల్ = ఆనందాలను;

ఒందిరికదా = పొందారుకదా!

**తాత్పర్యం:** సౌధాలలో నివసిస్తూ, రత్నభూషణాదుల్ని ధరించి, శీలవంతులైన భార్యలచే సేవించబడి, అమూల్యమైన పట్టువస్త్రాల్ని ధరించి, మేలయిన వరి అన్నాన్ని తిని, మంచిగంధంవంటి అనులేపనాల్ని ధరిఇంచి, మన్మథుని వంటి ఆకారంగల రాజులు జనకుడు మొ॥న రాజులు ఆనందాల్ని అనుభవించలేదా?

**సంధులు:** శీలవత్ + లలనా = శీలవల్లలనా (పర సవర్ణసంధి)

దృక్ + ఆనందముల్ = దృగానందముల్ (జశ్త్వసంధి)

**సమాసాలు:** కలమాన్నప్రియులు : కలమాన్నముపట్ల ప్రియులు (తత్పురుషం)

భూతలనాథుల్ : భూతలానికి నాథులు (తత్పురుషం)

**ఛందస్సు:** IIU UII UIU III U UU IUU IU

లలితా | గారవి | హారులై | మణిమ | యాలంకా | రులై,శీ | లవ

1. ఇది మత్తేభవృత్తం. ఇందులో నాలుగు పాదాలుంటాయి
2. స-భ-ర-న-మ-య-వ అనే గణాలు వరుసగా వస్తాయి
3. యతిస్థానం 14వ అక్షరం
4. ప్రాస నియమం ఉంది.

**అలంకారం:** సాభిప్రాయవిశేషణాలతో చెప్పటం చేత యిది పరికరం.

లలితాగారవిహారాలు, మణిమయాలంకారులు, శీలవల్లలనాలాలితులు... ఇలా రాజుకు చెప్పిన విశేషణాలు సాభిప్రాయంగా ఉన్నాయి. అందుచేత యిది పరికరాలంకారమవుతుంది.

**మ॥ వరసారస్వత పట్టభద్రులు కవుల్ వర్ణించి వర్ణించియున్**
**సరసావంతయు గానలేరు తుద యోషా విభ్రమాంబోధికి**
**న్విరసాంతఃకరణుండవై యెటులుగా నిందించెదో యయ్య! త**
**త్సర సాకారముదార మన్మథ కళా సర్వస్వ శృంగారమున్?** (5-215)

**కవిపరిచయం:** ఈ పద్యం తెనాలి రామకృష్ణునిచే రచించబడిన పాండురంగమాహాత్మ్యంలోని 'అయుతనియుతోపాఖ్యానం' నుండి గ్రహించబడినది.

**సందర్భం:** మారువేషంలో వచ్చిన యింద్రుడు అయుతునితో పలికిన మాటలివి.

**ప్రతిపదార్థం:**

| | |
|---|---|
| అయ్య | = నాన్నా? |
| వర | = శ్రేష్ఠమైన; |
| సారస్వతపట్టభద్రులు | = సారస్వత విద్యలో ఆరితేరినవారైన; |
| కవుల్ | = కవులు; |
| వర్ణించి వర్ణించియున్ | = బహువిధాలుగా వర్ణించి; |
| యోషా | = స్త్రీల యొక్క; |
| విభ్రమ+అంబోధికిన్ | = విలాస సముద్రానికి; |
| సరస | = హద్దు; |
| ఆవంతయున్ | = కొంచెమైనా; |
| గానలేరు | = గమనించలేకపోయారు! |
| తత్ | = ఆ స్త్రీల యొక్క |
| సరస+ఆకారము | = రసవంతమైన ఆకారం; |
| ఉదార | = గొప్ప; |
| మన్మథకళాసర్వస్వ | = మన్మథ కళలకు నిధియైన; |
| శృంగారమున్ | = శృంగార రసాన్ని; |
| ఎటులగా | = ఏ విధంగా |
| నిందించెదో | = నిందిస్తావో |

**తాత్పర్యం:** ఓ అయ్యా! గొప్ప సాహిత్య విద్యలో ఆరితేరిన కవులే, స్త్రీల విలాసాల్ని వర్ణించి, వర్ణించి, దాని సరిహద్దును గాంచలేకపోయారు. అటువంటప్పుడు రసహీనమైన మనస్సుతో, మన్మథ కళలకు, శృంగార రసానికి నిలయమైన స్త్రీలరసస్వరూపాన్ని ఎలా నిందిస్తావు?

**సంధులు:** విరస+అంతఃకరణుండవు = విరసాంతఃకరణుండవు (సవర్ణదీర్ఘసంధి)

**సమాసాలు:** యోషావిభ్రమాంబోధి : స్త్రీల విభ్రమాలనే అంబోధి (రూపక సమాసం)
సరసాంతఃకరణుండు : సరసమైన అంతఃకరణం కలవాడు (విశేషణపూర్వపద కర్మధారయము)

**ఛందస్సు:** IIUUII UIU I I I U UU IUU I U

వరసా | రస్వత | పట్టభ | ద్రులుక | వుల్వర్ణిం | చివర్ణిం | చియున్

1. ఇది మత్తేభవృత్తం. ఇందులో నాలుగు పాదాలుంటాయి
2. స-భ-ర-న-మ-య-వ అనే గణాలు వరుసగా వస్తాయి
3. యతిస్థానం 14వ అక్షరం
4. ప్రాస నియమం ఉంది.

**విశే:** 'వర్ణించివర్ణించియున్' – అనటంలో ప్రయత్న తీవ్రత చెప్పటం. ఆమ్రేడితం అత్యంతార్థంలో ఇక్కడ చెప్పబడింది.

**అలంకారం:** 'యోషావిభ్రమాంబోధికిన్' – అనటంలో రూపకాలంకారముంది.

**ఉ॥ పుక్కిటి యోవరిం జదువు పుత్తడి హత్తిన పెద్దనైన మీ**
**రొక్కొక వేళ పాటవము నొందమి జెందిన జక్కబెట్టువా**
**రక్కట! యొక్కటన్ బెడకి యాడిన గీడన నెవ్వడోపు? బే**
**రుక్కున నేరు నిక్కి చన నొక్కడు వంకలు నొక్క శక్తుడే?** (5-218)

**కవిపరిచయం:** ఈ పద్యం తెనాలి రామకృష్ణునిచే రచించబడిన పాండురంగమాహాత్మ్యంలోని 'అయుతనియుతోపాఖ్యానం' నుండి గ్రహించబడినది.

**సందర్భం:** తనవద్దకు మారువేషంలో వచ్చి ఇంద్రుడు చేసిన ప్రబోధానికి అయుతుడు సమాధానం చెప్పే సందర్భంలోనిదీ ఈ పద్యం.

**ప్రతిపదార్థం:**

| | |
|---|---|
| పుక్కిటి ఓవరిన్ | = పుక్కిలి అనే లోపలిగది (అంతఃపురం)లో; |
| చదువు పుత్తడి | = చదువులతల్లి సరస్వతీదేవి; |
| హత్తిన | = అద్దిన (హత్తుకున్న); |
| పెద్దను + ఐనా | = బ్రహ్మనైనా; |
| ఒక్కొకవేళ | = ఒక్కోసారి (కొన్ని సమయాలలో); |
| పాటవమున్+ఒందమిన్ | = నైపుణ్యాన్ని పొందక పోవటమనే సందర్భం; |
| చెందినన్ | = తారసపడితే; |
| చక్కపెట్టువారు | = చక్కదిద్దేవారు |
| మీరు | = మీరు; |
| అక్కట! | = అయ్యో! |
| ఒక్కటన్ | = ఈ విధంగా |
| బెడకి+యాడినన్ | = న్యాయంతప్పిమాట్లాడితే; |
| కీడు+అన | = అన్యాయమని అనటానికి |
| ఎవ్వడు+ఓపు | = ఎవ్వడికి సాధ్యమవుతుంది? |
| పేరుక్కునన్ | = మిక్కిలివిధాటితో; |

| | |
|---|---|
| ఏఱు | = నది; |
| నిక్కిచనన్ | = అడ్డులేకుండా పోతుంటే; |
| ఒక్కడు | = ఏ ఒక్కడైనా |
| వంకలునొక్క | = దానిదారిని మార్చగల |
| శక్తుడే | = శక్తిగలవాడా? |

**తాత్పర్యం:** పుక్కిలి అనే అంతఃపురంలో కొలువైయున్న సరస్వతి వరించిన బ్రహ్మనైనా కొన్ని సమయాలలో తడబడితే సరిదిద్దేవాళ్లు మీరు. అటువంటి మీరే న్యాయం తప్పి మాట్లాడితే, అన్యాయమనటానికి ఎవరికివీలు అవుతుంది. మిక్కిలి వేగంతో నది సాగిపోతుంటే దాని వంకలు తీర్చి దారిని మార్చగల వారెవరైనా ఉన్నారా?

**సంధులు :** ఎవ్వడు + ఓపు = ఎవ్వడోపు (ఉత్వసంధి)
పేరు + ఉక్కన = పేరుక్కున (ఉత్వసంధి)

**సమాసాలు:** చదువుపుత్తడి : చదువుల పుత్తడిగలది (బహుబ్రీహి)

**ఛందస్సు:** UII U I U   I I I   UII   UII   UIU   IU
పుక్కిటి | యోవరిం | జదువు | పుత్తడి | హత్తిన | పెద్దనై | నమీ

1. ఇది ఉత్పలమాలవృత్తం. ఇందులో నాలుగు పాదాలుంటాయి
2. "భ-ర-న-భ-భ-ర-వ" అనే గణాలు వరుసగా వస్తాయి
3. యతిస్థానం 10వ అక్షరం
4. ప్రాస నియమం ఉంది

**విశే:** ఎక్కువ ఆచ్ఛిక పదాలతో నడచిన పద్యమిది. 'శక్తుడే' – 'పాటవము' అన్న పదాలు తప్ప అన్నీ ఆచ్ఛికపదాలే. 'బ్రహ్మ' – అనటానికి 'పుత్తడిహత్తిన పెద్ద' – అనటం రామకృష్ణుని ముద్ర.

**అలంకారం:** దృష్టాంతం

బింబప్రతిబింబభావంతో చెపితే అది దృష్టాంతం. 'నదివేగంతో పోతుంటే దాని వంకలు తీర్చి సరిదిద్దగల వారెవరైనా ఉన్నారా?' – అనే బింబవాక్యంతో 'బ్రహ్మనైనా సరిదిద్దగల మిమ్మల్ని మేము సరిచేయగలమా?' – అనే ప్రతి బింబవాక్యం చెప్పటం ఇక్కడి సందర్భం.

**చం॥ మునిజన భాగధేయమగు మోక్షము పక్షములేక పల్కి నీ**
**వనఘవిచార! సారె గొనియాడెదు బూడిదబొట్టువోని యీ**
**చెనటి గృహస్థ ధర్మమిది, చిమ్మెట సింగమె? గాజు రత్నమే?**
**కనక శలాటుకాధమము కల్పఫలంబె? చలంబు లేటికిన్?** (5-223)

**కవిపరిచయం:** ఈ పద్యం తెనాలి రామకృష్ణునిచే రచించబడిన పాండురంగమాహాత్మ్యంలోని 'అయుతనియుతోపాఖ్యానం' నుండి గ్రహించబడినది.

**సందర్భం:** తనవద్దకు మారువేషంలో వచ్చి ఇంద్రుడు చేసిన ప్రబోధానికి అయుతుడు సమాధానం చెప్పే సందర్భంలోనిదీ ఈ పద్యం.

| | | |
|---|---|---|
| **ప్రతిపదార్థం:** | అనఘవిచారా! | = పుణ్యచింతనగలవాడా! |
| | మునిజనభాగధేయము | = మునుల పాలిటి సంపద; |
| | అగు | = అయిన; |
| | మోక్షము పక్షము | = మోక్షంవైపు; |
| | లేక | = లేకుండా; |
| | పల్కి | = పలికి; |
| | నీవు | = నీవు; |
| | సారె | = మాటిమాటికి; |
| | బూడిదబొట్టువోని | = బూడిదబొట్టులాంటి; |
| | ఈ చెనటి | = ఈ నీచమైన; |
| | గృహస్థధర్మము | = గృహస్థధర్మాన్ని; |
| | కొనియాడెదు | = పొగడుతున్నావు; |
| | అది | = ఆ గృహస్థాశ్రమధర్మం |
| | చిమ్మెట | = ఇలపురుగు (కీచురాయి) |
| | సింగమె | = సింహమవుతుందా? |
| | గాజురత్నమే? | = గాజు రత్నమవుతుందా? |
| | కనకశలాటుక + అధమమైన | = అధిమమైన ఉమ్మెత్త చెట్టుకాయ |
| | కల్పఫలంబె | = కల్పవృక్షపు ఫలమా? |
| | చలంబులు | = మాత్సర్యాలు |
| | ఏటికిన్ | = ఎందుకు? |

**తాత్పర్యం**: నిర్మలమైన ఆలోచనలు కలిగినవాడా (అనఘవిచార) మునిజనుల సంపదయైన మోక్షము పక్షమున పలుకకుండా ఎప్పుడూ బూడిదబొట్టువలె క్షణికమైన చెత్తగృహస్థధర్మాన్ని కొనియాడతావేమయ్యా? చిమ్మెట సింహమవుతుందా? గాజుపూస రత్నమవుతుందా? ఉమ్మెత్తకాయ కల్పవృక్షమవుతుందా? పంతమెందుకు స్వామీ! అని భావం.

**సంధులు:** బొట్టు + పోని = బొట్టువోని (గసడదవాదేశసంధి)
శలాటుక + అధమము = శలాటుకాధమము (సవర్ణదీర్ఘసంధి)
చలంబులు + ఏటికిన్ = చలంబులేటికిన్ (ఉత్వసంధి)

**సమాసాలు:** గృహస్థధర్మము : గృహస్థునియొక్క ధర్మము (తత్పురుషం)

**ఛందస్సు:**

| I I I | I U I | U I I | I U I | I U I | I U I | U I U |
|---|---|---|---|---|---|---|
| మునిజ | నభాగ | ధేయమ | గుమోక్ష | ముపక్ష | ములేక | పల్కి నీ |

1. ఇది చంపకమాలావృత్తం ఇందులో నాలుగు పాదాలుంటాయి
2. "న-జ-భ-జ-జ-జ-ర" అనే గణాలు వరుసగా వస్తాయి
3. యతిస్థానం 11వ అక్షరం
4. ప్రాస నియమం ఉంది

**అలంకారం:** ఉపమ, నిదర్శనము.

శా॥ **కందర్పాస్త్రములంచు నంచిత తటిత్కాండంబులంచుంసుధా**
**మందస్యందములంచు, గాంచన లతామత్తల్లులంచున్ సుధీ**
**బృందంబుల్ ధ్వనినిందలం దెగడు నీ బింబోష్ఠలందెల్లనా**
**నందాభాసమె కాక భాసిత చిదానందంబు పెంపొందునే?** (5-225)

**కవిపరిచయం:** ఈ పద్యం తెనాలి రామకృష్ణునిచే రచించబడిన పాండురంగమాహాత్మ్యంలోని 'అయుతనియుతోపాఖ్యానం' నుండి గ్రహించబడినది.

**సందర్భం:** మారువేషంలో వచ్చిన ఇంద్రునితో అయుతుడు సంసారం పట్ల తనకుగల విముఖత్వాన్ని తెలియజేసే సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం:**

| | |
|---|---|
| కందర్ప+అస్త్రములు | = మన్మథుని బాణాలు; |
| అంచిత | = ఒప్పిదమైన; |
| తటిత్+కాండంబులు | = మెఱుపుల సమూహాలు; |
| సుధ + అమంద స్యందములు | = ఎడతెగని అమృత ప్రవాహాలు; |
| అంచు | = అంటూ; |
| కాంచనలతామతల్లులు+అంచున్ | = బంగారు సంపెంగ తీగలంటూ; |
| సుధీ బృందంబుల్ | = విద్వాంసుల సమూహాలు; |
| ధ్వనినిందలన్ | = వ్యాజస్తుతులచేత; (ధ్వనిపూర్వకంగా తిట్టే తిట్లచేత) |
| తెగడు | = నిందించే; |
| ఈ బింబోష్ఠలందున్ | = దొండపండువంటి పెదవిగల ఈ స్త్రీలలో; |
| ఎల్లన్ | = అంతటా; |
| ఆనంద+ఆభాసమెకాక | = ఆనందమన్న భ్రాంతి తప్ప; |
| భాసిత | = ప్రకాశించే; |
| చిత్+ఆనందంబు | = చిద్రూపమైన బ్రహ్మానందము |
| పెంపొందునే? | = వృద్ధిచెందుతుందా? |

**తాత్పర్యం:** మన్మథబాణాలు, మెఱుపుతీగల గుంపులు, నిరంతరం ప్రవహించే అమృత ప్రవాహాలు, సంపెంగతీగలంటూ, విద్వాంసులు వ్యాజస్తుతులచేత నిందించే ఈ దొండపండువంటి పెదవులుగల ఈ స్త్రీలలో అంతటా ఆనందమన్న భ్రాంతి తప్ప చిదానందం వృద్ధి చెందుతుందా?

**విశే:** కందర్పాస్త్రములు (మన్మథబాణాలు) సుకుమారమైనవని స్తుతి. కాని అవి అత్యల్పకాలంలోనే వాడిపోతాయని నింద. కారణం మన్మథబాణాలు పూలు కాబట్టి. మెఱుపులగుంపులు అందమైనవని స్తుతి. అవి క్షణికాలని నింద. సుధాస్యందములు (అమృతప్రవాహాలు) మధురమైనవని స్తుతి. చంద్రుని లాగే అవి కూడా క్షీణిస్తాయని నింద. సంపెంగలు ఇంపైనవని స్తుతి. తీగలు తెగటమో, అచిరకాలంలో ఎండటమో జరుగుతుందని నింద. ఇది వ్యాజస్తుతి.

**అలంకారం:** ఉపమ, రూపకం

స్త్రీలను కందర్పాస్త్రములు, అంచితతటిత్కాండములు, సుధామందస్యందములు, కాంచలతామతల్లులు అని ఆరోపించటం చేత యిది రూపకం.

కందర్పాస్త్రాలంటూ, కాంచనలతామతల్లులంటూ, బింబోష్ఠుల్ని పోల్చటంలో ఉపమాలంకారముంది.

**వ్యాకరణవిశేషాలు:** 'మతల్లికా' శబ్దాన్ని తెలుగు కవులు 'మతల్లి'గా వాడటం కనిపిస్తుంది. రామకృష్ణుడు 'మత్తల్లి'గా ఈ శబ్దాన్ని వాడాడు.

**సంధులు:** ధ్వనినిందలన్ + తెగడు = ధ్వనినిందలందెగడు (ద్రుతసంధి)

బింబ+ఓష్ఠులందు = బింబోష్ఠులు (గుణసంధి)

చిత్+ఆనందము = చిదానందము (జశ్త్వసంధి)

**సమాసాలు:** కందర్పాస్త్రములు : కందర్పుని యొక్క అస్త్రాలు (తత్పురుష సమాసం)

భాసిత చిదానందము : భాసించే చిదానందం (కర్మధారయము)

**ఛందస్సు:** UUU IIU IUI IIU UUI UUI U

కందర్పా | స్త్రములం | చునంచి | తతటి | త్కాండంబు | లంచుంసు | ధా

1. ఇది శార్దూలవృత్తం. ఇందులో నాలుగు పాదాలుంటాయి
2. మసజసతతగ అనే గణాలు వరుసగా వస్తాయి
3. యతిస్థానం 13వ అక్షరం
4. ప్రాస నియమం ఉంది

**ఉ॥ వ్యాససుతాదులన్ దలచి వాసికి, మంగలి కత్తి మ్రింగె! దా**
**సాసలనస్రుచాచెదల యందని పంటికి బొందితోన కై**
**లాసము జేరజూచెదు! చలంబది యేమి ఫలంబటంచు నా**
**భూసురు డీసు వెంచి, ముని పుత్రకు బాసి తొలంగి వెండియున్.** (5-230)

**కవిపరిచయం:** ఈ పద్యం తెనాలి రామకృష్ణునిచే రచించబడిన పాండురంగమాహాత్మ్యంలోని 'అయుతనియుతోపాఖ్యానం' నుండి గ్రహించబడినది.

**సందర్భం:** తాను చేసిన హితబోధను పట్టించుకోకుండా దృఢనిష్ఠతో మాట్లాడిన అయుతునితో ఇంద్రుడు కోపంతో మాట్లాడు సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం:**

| | |
|---|---|
| వ్యాససుతాదులన్ | = వ్యాసునికుమారుడైన శుకుడు మొ॥నవారిని; |
| తలచి | = తలచుకొని; |
| వాసికి | = మెప్పుకోసం; |
| మంగలికత్తిన్ | = మంగలికత్తిని; |
| మ్రింగెదు | = మింగుతున్నావు |
| ఆసా + ఆసల | = పేరాశలతో |

| | |
|---|---|
| అందని పంటికి | = అందని పండుకోసం; |
| అఱ్ఱుచాచెదు | = అఱ్ఱులు చాస్తున్నావుసుమా! |
| అదె | = అదిగో! |
| బొందెతోనె | = శరీరంతోనే; |
| కైలాసమున్+చేరన్+చూచెదు | = కైలాసాన్ని చేరాలని చూస్తున్నావు; |
| చలంబు | = మొండి పట్టుదల; |
| అదిఏమి ఫలంబు | = దానివలన ఏమి లాభం? |
| అటంచు | = అంటూ; |
| ఆభూసురుడు | = బ్రాహ్మణరూపంలోనున్న ఇంద్రుడు; |
| ఈసు+పెంచి | = అసూయను పెంచుకొని; |
| మునిపుత్రకున్+పాసి | = ఆ బ్రాహ్మణకుమారుడైన అయుతుని వదలి; |
| తొలంగి | = దాటికొనిపోయి; |
| వెండియున్ | = మరల. |

**తాత్పర్యం:** శుకమహర్షి మొదలైనవారిని తలచుకొని, మెప్పుకోసం మంగలికత్తిని మింగుతున్నావు. పేరాశతో అందనిపండుకోసం అఱ్ఱులు చాస్తున్నావు. బొందితో కైలాసం చేరుకోవాలని చూస్తున్నావు. మొండి పట్టుదలవలన లాభం ఏమిటి? అంటూ బ్రాహ్మణవేషంలోనున్న ఇంద్రుడు కోపంతో అయుతుడిని దాటుకొనిపోయి, మరలా

**విశే:** 'మంగలికత్తి మ్రింగట'మనేది లోకోక్తి. 'గొప్పలకు మంగలికత్తి మింగాడనటం' – లోకంలోనున్నదే! కాని ప్రమాదం తెచ్చుకోవటమనేది యిందులోని తాత్పర్యం.

**సంధులు:** చేరన్+చూచెదు = చేరఁజూచెదు (ద్రుతసంధి)

ఆస+ఆసల = ఆసాసల (అత్వసంధి)

**సమాసాలు:** వ్యాససుతాదులు : వ్యాసుని యొక్క సుతాదులు (తత్పురుషం)

అందనిపండు : అందుకొనవీలుకాని పండు (కర్మధారయం)

**ఛందస్సు:** UII | UIU | III | UII | UII | UIU | IU

వ్యాసను | తాదులన్ | దలచి | వాసికి, | మంగలి | కత్తిమ్రిం | గె! దా

1. ఇది ఉత్పలమాలవృత్తం. ఇందులో నాలుగు పాదాలుంటాయి
2. భరనభభరవ అనే గణాలు వరుసగా వస్తాయి
3. యతిస్థానం 10వ అక్షరం
4. ప్రాస నియమం ఉంది

**అలంకారం:** లోకోక్తి

'వాసికి మంగలికత్తి మింగుట', అందని పంటికి అఱ్ఱుచాచటం, చలంబదియేమిపలమని చెప్పటం – ఇవన్నీ లోకోక్తులు. లోకోక్తుల్ని సందర్భోచితంగా ప్రయోగించటంతో ఇది లోకోక్త్యలంకారం.

**చం॥** **పదముల కొంకువో బిసికి, ప్రక్కల స్రుక్కెడలించి, దంశవం**
**శదమన వృత్తినింపొసగి, సాస్న నఖంబుల ద్రువ్వి, నెత్తురుల్**
**చిదికెదు గంట్ల భూరజము చిల్కి, ముఖస్త తృణంబు ద్రోచి, య**
**మ్మొదవు మృదుక్రియన్ నడిపి, ముంగిటి బందిటిరాట గట్టుచున్** (5-236)

**కవిపరిచయం:** ఈ పద్యం తెనాలి రామకృష్ణునిచే రచించబడిన పాండురంగమాహాత్మ్యంలోని 'అయుతనియుతోపాఖ్యానం' నుండి గ్రహించబడినది.

**సందర్భం:** తన మాటలు వినని అయుతుడిని ఏ విధంగానైనా మాయతో ముగ్గులోకి దించే పన్నాగంతో, కామధేనువు సాయంతో తన పంతం నెరవేర్చుకొనేందుకు అయుతుని సమక్షంలో దానిని వదలివెళ్లాడు. ఆ సందర్భంలో దీనంగా ఉన్న గోవును అయుతుడెలా ఉద్ధరించాడో చెప్పే సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| **ప్రతిపదార్థం:** | పదములన్ | = పాదాలయొక్క; |
| | కొంకు | = దడ; |
| | పోన్ | = పోయేటట్లు; |
| | పిసికి | = పట్టి; |
| | ప్రక్కలసుక్కు | = ప్రక్కలనున్న ముడుతల్ని; |
| | ఎడలించి | = పోగొట్టి; |
| | దంశవంశదమనవృత్తిన్ | = అడవి ఈగల గుంపును దులిపి, అదలించేపనిచేత; |
| | ఇంపు+ఒసఁగి | = సంతోషాన్ని కలిగించి; |
| | నఖంబులన్ | = గోళ్లచేత; |
| | సాస్న | = గంగడోలును; |
| | దువ్వి | = దువ్వి; |
| | నెత్తురుల్ చిదికెదు | = రక్తం చిమ్మే; |
| | గంట్లన్ | = గాయాలలో; |
| | భూరజము | = దుమ్ము; |
| | చిల్కి | = చల్లి; |
| | ముఖస్థతృణంబున్ | = నోటిలో నున్న గడ్డిపరకను; |
| | త్రోచి | = లోనికి చొప్పించి; |
| | మృదుక్రియన్ | = నెమ్మదిగా; |
| | నడపి | = నడిపించి; |
| | ముంగిటన్ | = తన ముందున్న |
| | పందిటిరాటన్ | = పందిరికున్నరాయికి; |
| | ఆ + మొదవున్ | = ఆ గోవును |
| | కట్టుచున్ | = కడుతూ; |

**తాత్పర్యం:** అయుతుడు తాను చూచిన గోవుయొక్క పాదాల వణుకు పోయేటట్లుగా పట్టుకొని, పక్కనున్న ముడతల్ని పోగొట్టి, అడవి ఈగల గుంపును దులిపి, ఆవుకు సంతోషాన్ని కలిగించి, గోళ్లతో గంగడోలు దువ్వి, రక్తం చిమ్మేగాయాలలో దుమ్ముచల్లి, నోట్లోనున్న గడ్డిపరకలను లోపలికి తురిమి, నెమ్మదిగా నడిపిస్తూ తీసుకుపోయి పందిరికున్న రాయికి ఆ గోవును కట్టివేశాడు.

**విశే:** ఈ పద్యంలో ఆవుకు భయాన్ని పోగొట్టి, గాయాలకు మందు బదులు మట్టిపూయటం, గంగడోలు దువ్వటం, అడవి ఈగల్ని తోలటం, పందిరి రాతికి కట్టటం మొ॥నవన్నీ ఎంతో సహజోచితమైన చర్యలు.

**సంధులు:** ఆ + మోదవున్ = అమ్మోదవున్ (త్రికసంధి)
స్రుక్కు+ఎడలించి = స్రుక్కెడలించి (ఉత్వసంధి)
రాటన్ + కట్టుచున్ = రాటఁగట్టుచున్ (ద్రుతసంధి)

**సమాసాలు:** దంశవంశదమనవృత్తి : ఈగల సమూహాన్ని దమించే వృత్తి (తత్పురుష సమాసం)
ముఖస్థ తృణము : నోటియందున్న తృణము (కర్మధారయం)
మృదుక్రియన్ : మృదువైన క్రియన్ (విశేషణ పూర్వపదకర్మధారయము)

**ఛందస్సు:** III IUI UII IUI IUI IUI UIU
పదము | లకొంకు | వోబిసి | కి,ప్రక్క | లస్రుక్కె | డలించి, | దంశవం
1. ఇది చంపకమాలావృత్తం ఇందులో నాలుగు పాదాలుంటాయి
2. "న-జ-భ-జ-జ-జ-ర" అనే గణాలు వరుసగా వస్తాయి
3. యతిస్థానం 11వ అక్షరం
4. ప్రాస నియమం ఉంది

**అలంకారం:** స్వభావోక్తి. ఆవుకు చేసిన సపర్యలు ఎంత సముచితమైనవో అంతసహజంగానూ వర్ణించటం చేత ఇది స్వభావోక్తి.

ఉ॥ **మట్టిన బిట్టు మిట్టిపడి మౌని సముత్థితుడయ్యె మేనిపై**
**బెట్టన పుట్ట నెట్టవిసి బీటలువార, శ్రవశ్శకుంతముల్**
**చట్టువలెత్తు ముందరికి సాగదలంప, జటాచ్ఛటాచ్ఛవిన్**
**ద్రుట్టెలుగట్టి ద్రిలు మరుద్భగధీశకులంబు మేల్కొనెన్.** (5-249)

**కవిపరిచయం:** ఈ పద్యం తెనాలి రామకృష్ణునిచే రచించబడిన పాండురంగమాహాత్మ్యంలోని 'అయుతనియుతోపాఖ్యానం' నుండి గ్రహించబడినది.

**సందర్భం:** మారువేషంలోనున్న కామధేనువు వాధూలముని తపస్సు చేసుకునే ప్రాంతంలోకి వచ్చి, ఆ మహర్షియున్న పుట్టను తొక్కి, కాలిగిట్టలతో మట్టినప్పటి సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం:** మట్టినన్ = తొక్కగా;
మౌని = మునీశ్వరుడైన వాధూలుడు;

| | |
|---|---|
| బిట్టు | = మిక్కిలి; |
| మిట్టిపడి | = ఎగిరిపడి; |
| సముత్థితుడు+అయ్యెన్ | = లేచాడు; |
| మేనిపైన్ | = శరీరంపైన |
| పెట్టిన | = పెట్టిన |
| పుట్టనెట్టు | = పుట్ట ఉన్న చోటును; |
| అవిసి | = పగిలి; |
| బీటలు+పాఱన్ | = బీటలయిపోగా; |
| శ్రవః+శకుంతలముల్ | = చెవులపై నుండే పిట్టలు; |
| చట్టుపలు | = రెక్కలు; |
| ఎత్తి | = విదిల్చికొని విప్పికొని; |
| ముందటికి | = ముందుకు; |
| సాగదలపన్ | = వెళ్లాలని భావించగా; |
| జటాచ్ఛటాచ్ఛదన్ | = దట్టమైన జడల గుంపులో; |
| త్రుట్టెలు కట్టి | = తుట్టెలుకట్టి; (గుమిగూడి) |
| నిద్రిలు | = నిద్రపోయె; |
| మరుత్+భుక్+అధీశకులంబు | = గాలిని మేసే పాములగుంపు; |
| మేల్కొనన్ | = మేల్కొనగా; |

**తాత్పర్యం:** ఆ విధంగా ఆవు తొక్కగా ఆ ముని మిక్కిలి కోపంతో లేచాడు. పైన పెట్టిన పుట్టలు బీటలువారాయి. చెవులపై నివసిస్తున్న పిట్టలు రెక్కలు విప్పి ముందుకు ఎగిరాయి. జడల గుంపులలో చుట్టుకుని నిద్రిస్తున్న పాముల గుంపు మేల్కొన్నది అని భావం.

**సంధులు:** నెట్టు+అవిసి = నెట్టవిసి (ఉత్వసంధి)
శ్రవః+శకుంతముల్ = శ్రవశ్శకుంతముల్ (విసర్గసంధి)

**సమాసాలు:** శ్రవశ్శకుంతలముల్ : చెవులపైనుండే పిట్టలు (తత్పురుషం)
మరుద్భుగధీశకులంబు : గాలిని భోంచేసేవాని కులం (తత్పురుషం)

**ఛందస్సు:** UII UIU III UII UII UIU IU
మట్టిన | బిట్టుమి | ట్టివడి | మౌనిస | ముత్థితు | డయ్యెమే | నిపై

1. ఇది ఉత్పలమాలవృత్తం. ఇందులో నాలుగు పాదాలుంటాయి
2. భరనభభరవ అనే గణాలు వరుసగా వస్తాయి
3. యతిస్థానం 10వ అక్షరం
4. ప్రాస నియమం ఉంది

మ॥ కసవుందీవలు దావపావకశిఖౌఘంబున్ ప్రకాశింప వె
క్కసమై తోఁచిన కొండచందమున దీర్ఘశ్మశ్రుచంచజ్జటా
విసరక్రోధరసోగ్రమూర్తి యగుచున్ వృద్ధవ్రతిశ్రేష్ఠుఁడా
త్మసమీపస్థితు హస్తముక్తసురభిన్ దద్వర్ణి నీక్షించుచున్. (5-250)

**కవిపరిచయం:** ఈ పద్యం "కుమారభారతి" బిరుదాంకితుడు తెనాలి రామకృష్ణకవి రచించిన "పాండురంగమాహాత్మ్యం" అనే ప్రబంధం – పంచమాశ్వాసంలోని అయుత నియుతోపాఖ్యానంలోనిది.

**సందర్భం:** గృహస్థాశ్రమ ధర్మప్రాముఖ్యాన్ని తెలియజేయడంకోసం ఇంద్రుడు – అయుతుడు అనే బ్రహ్మచారిని పరీక్షించేటప్పుడు తపోభంగమైన వాధూలముని అయుతుణ్ణి శపించబోయే సందర్భంలోనిదీ పద్యం.

| | | |
|---|---|---|
| **ప్రతిపదార్థం:** | కసవుందీవలు | = లతలవంటి తృణములు; |
| | దావ | = కార్చిచ్చు యొక్క ; |
| | శిఖా | = జ్వాలల యొక్క ; |
| | ఓఘంబున్ | = సమూహమును; |
| | ప్రకాశింపన్ | = ప్రకటింపగా ; |
| | వెక్కసమై | = అతిశయించినదై ; |
| | తోచిన | = గోచరమైన, కనఁబడిన; |
| | కొండ చందమునన్ | = పర్వతమువలె; |
| | వృద్ధవ్రతిశ్రేష్ఠుఁడు | = ముసలియైన మునివరుడు; |
| | దీర్ఘ | = పొడవైన; |
| | శ్మశ్రు | = మీసము గడ్డమునను వాని యొక్క; |
| | చంచత్ | = ఒప్పుచున్న; |
| | జటా | = జడల యొక్క; |
| | విసర | = సమూహముచేత; |
| | క్రోధరస | = కోపరసముచే; |
| | ఉగ్ర | = భయంకరమైన; |
| | మూర్తి యగుచున్ | = ఆకారముగలవాడగుచు; |
| | ఆత్మ | = తనయొక్క; |
| | సమీప స్థితున్ | = దగ్గరి ప్రదేశము నందు ఉన్నవాడు; |
| | హస్త | = చేతి నుండి; |
| | ముక్త | = విడువఁబడిన; |
| | సురభిన్ | = ధేనువుగలవాడు, అగు; |
| | తద్వర్ణిన్ | = ఆ బ్రహ్మచారిని; |
| | ఈక్షించుచున్ | = చూస్తూ – తరువాత పద్యముతో అన్వయము. |

**తాత్పర్యం:** పొడవైన మీసం, గడ్డంతో పొడవైన జడలతో ఉన్న ముసలిముని - వాధూలముని. కార్చిచ్చుమంటలను స్ఫురింపజేసే లతలవంటి – తీగలతో ఉండే పర్వతంలాగా ఉన్న ఆ ముని పట్టరాని కోపంతో – అప్పుడే తనచేతిలోని గోవును విడిచి పక్కనే నిల్చుని ఉన్న అయుతుణ్ణి చూస్తూ – అని భావం.

**విశేషం:** స్వర్గలోకకామధేనువు పేరు సురభి. అయినప్పటికీ ఇక్కడ గోవు అనే అర్థంలోనే "సురభి" అనే పదాన్ని కవి ప్రయోగించాడు. ఎందుకంటే, వాధూలమునికి అది కామధేనువని దానిని చూసినప్పుడు తెలియదు.

**సంధులు:** కసవుందీవలు = కసవున్ + తీవలు (సరళాదేశసంధి)

శిఖౌఘంబున్ = శిఖ + ఓఘంబున్ (వృద్ధిసంధి)

క్రోధరసోగ్రమూర్తి = క్రోధరస + ఉగ్రమూర్తి (గుణసంధి)

తద్వర్ణిన్ = తత్ + వర్ణిన్ (జశ్త్వసంధి)

**సమాసాలు:** దావపావకశిఖౌఘం–కార్చిచ్చు యొక్క జ్వాలల సమూహం (షష్ఠీతత్పురుష)

క్రోధరసోగ్రమూర్తి – కోపముచేత ఉగ్రమూర్తి (తృతీయాతత్పురుష)

వృద్ధవ్రతిశ్రేష్ఠుడు – వృద్ధుడైనవ్రతిశ్రేష్ఠుడు (విశేషణ పూర్వపద కర్మధారయం)

హస్తముక్తసురభిన్ – చేతినుండివిడిచిపెట్టబడిన సురభికలవాడు (బహువ్రీహి)

**ఛందస్సు:** IIU UII UIU III UUU IUU IU

కసవుం | దీవలు | దావపా | వకశి | ఖౌఘంబున్ | ప్రకాశిం | పవె – (క్ర)

1. ఇది మత్తేభవృత్తం. ఇందులో నాలుగు పాదాలుంటాయి
2. స–భ–ర–న–మ–య–వ అనే గణాలు వరుసగా వస్తాయి
3. యతిస్థానం 14వ అక్షరం
4. ప్రాస నియమం ఉంది.

**అలంకారం:** ఇందులో ఉపమాలంకారముంది. మీసాలు, గడ్డం, జడలతో కోపోద్రిక్తుడై ఉన్న మునిని కార్చిచ్చులాంటి తీగలు, గడ్డి ఉన్న పెద్దకొండతో పోల్చి కవి ఈ పద్యంలో వర్ణించాడు.

మ॥ **భ్రుకుటీ భీషణ ఫాలభాగుడు, దను ప్రోద్భూత ఘర్మాంబుబిం**
**దుకుడున్, ప్రస్ఫురదోష్ఠపల్లవుడు, జేతో భీతికృల్లోల తా**
**రక ఘూర్ణన్నయనుండు గాక, శమసారస్మేరుడయ్యెన్ దప**
**స్వికులగ్రామణి, చిచ్చు చంద్రుపొడవై చెన్నొందు చందంబునన్.** **(5-257)**

**కవిపరిచయం:** ఈ పద్యం "కుమారభారతి" బిరుదాంకితుడు తెనాలి రామకృష్ణకవి రచించిన "పాండురంగ మాహాత్మ్యం" అనే ప్రబంధం – పంచమాశ్వాసంలోని అయుత నియుతోపాఖ్యానంలోనిది.

**సందర్భం:** తపోభంగమైనందుకు కోపంతో తనను శపించిన వాధూలమునితో అయుతుడు తన వృత్తాంతాన్ని విన్నవించగా, నిజం తెలుసుకున్న ముని శాంతించే సందర్భంలోనిది.

| | |
|---|---|
| **ప్రతిపదార్థం:** తపస్వికులగ్రామణి | = తాపసవంశముఖ్యుడు – వాధూలమహర్షి; |
| భ్రుకుటీ | = బొమముడి చేత; |
| భీషణ | = భయంకరమైన; |
| ఫాలభాగుడున్ | = లలాట ప్రదేశము గలవాడును; |
| తను | = శరీరమునుండి; |
| ప్రోద్భూత | = ఎక్కువగా ఉబుకుతున్న; |
| ఘర్మాంబు బిందుకుడున్ | = చెమట కణములుగలవాడు; |
| ప్రస్ఫురత్ | = బాగా కదులుతున్న; |
| ఓష్ఠుడున్ | = చిగురువంటి మోవిగలవాడు; |
| చేతః | = మనస్సునకు; |
| భీతికృత్ | = భయాన్ని కలిగించేదైన; |
| లోల | = చంచలమైన; |
| తారక | = కనుగ్రుడ్లచేత; |
| ఘూర్ణత్ | = తిరుగుడుపడుచున్న; |
| నయనుండున్ | = కళ్ళు గలవాడును; |
| కాక | = కాకుండ; |
| చిచ్చు | = అగ్ని; |
| చంద్రు | = చంద్రుని యొక్క; |
| పొడవై | = ఆకృతియై; |
| చెన్నొందు చందంబునన్ | = అతిశయము ఒప్పారునట్లు; |
| శమ | = శాంతి యొక్క; |
| సార | = అతిశయము చేత; |
| స్మేరుడు | = చిఱునవ్వుగలవాడు; |
| అయ్యెన్ | = అయ్యాడు. |

**తాత్పర్యం:** బొమముడితో భయంకరమైన నుదురు కలవాడు, శరీరం మీద ఎక్కువగా పుట్టిన చెమట బిందువులు కలవాడు, కదులుతున్న చిగురు వంటి పెదవి కలవాడు, మనసునకు బెదురు పుట్టించే, చలించే కనుపాపలున్న కళ్ళు కలవాడైన మునిశ్రేష్ఠుడు – మంట చంద్రుని లాగ మారే విధంగా శాంతి వహించి, ముఖంమీద చిరునవ్వుతో దర్శనమిచ్చాడు – అని భావం.

**విశేషం:** నుదిటిమీది బొమముడి, చెమటలు పట్టడం, పెదాలు అదరడం, కళ్ళెర్రబారడం వంటివి రౌద్ర రసాన్ని సూచిస్తున్నాయి. ఆ అనుభావాలు అన్ని నెమ్మదిగా సద్దుమణిగి ముని శాంతించడాన్ని, చల్లని చంద్రుడితో పోలిక చెప్పి సూచించాడు కవి.

**సంధులు:** ప్రోద్భూత = ప్ర + ఉద్భూత (గుణసంధి)
ఘర్మాంబు = ఘర్మ + అంబు (సవర్ణదీర్ఘసంధి)

ప్రస్ఫురదోష్ఠపల్లవుడు = ప్రస్ఫురత్ + ఓష్ఠపల్లవుడు (జశ్త్వసంధి)

చేతోభీతి = చేత + భీతి (విసర్గసంధి)

కృల్లోల= కృత్ + లోల (పర సవర్ణసంధి)

ఘూర్ణన్నయనుండు = ఘూర్ణత్ + నయనుండు (అనునాసికసంధి)

స్మేరుడయ్యెన్ = స్మేరుడు + అయ్యెన్ (ఉత్త్వసంధి)

చెన్నొందు = చెన్ను + ఒందు (ఉత్త్వసంధి)

**సమాసాలు:** భ్రుకుటీభీషణఫాలభాగుడు–బొమముడితో భయంకరమైన నుదురు కలవాడు (బహుబ్రీహి)

తనుప్రోద్భూత ఘర్మాంబుబిందుకుడున్–శరీరంమీద ఎక్కువగాపట్టిన చెమట బిందువులు కలవాడు (బహుబ్రీహి)

ప్రస్ఫురదోష్ఠపల్లవుడు–కదులుతున్న చిగురు వంటి పెదవికలవాడు (బహుబ్రీహి)

చేతోభీతికృల్లోలతారక ఘూర్ణన్నయనుండు–మనసులో భయాన్ని కలిగించే, చలించే కనుపాపలున్న కళ్ళుకలవాడు(బహుబ్రీహి)

శమసారస్మేరుడు – ప్రశాంతమైన చిరునవ్వు కలవాడు (బహుబ్రీహి)

తపస్వికులగ్రామణి –తాపసవంశమునందు ముఖ్యుడు (సప్తమీతత్పురుష)

**ఛందస్సు:**

| IIU | UII | UIU | II I | U U U | I U U | IU |
|---|---|---|---|---|---|---|
| భ్రుకుటీ | భీషణ | ఫాలభా | గుడు, ద | ను ప్రోద్భూ | త ఘర్మాం | బుబిం |

1. ఇది మత్తేభవృత్తం. ఇందులో నాలుగు పాదాలుంటాయి
2. సభరనమయవ అనే గణాలు వరుసగా వస్తాయి
3. యతిస్థానం 14వ అక్షరం
4. ప్రాస నియమం ఉంది

**అలంకారం:** ఇందులో "కల్పితోపమ" అలంకారముంది. చల్లబడి – చంద్రుడి రూపం దాల్చిన అగ్నితో – కోపం చల్లారి శాంతించిన మునిని పోల్చాడు. ఈ విధంగా కల్పనాత్మకమైన ఉపమానం వల్ల ఈ పద్యంలో కల్పితోపమ అలంకారం భాసించింది.

**ఉ॥ ఫాలముచుక్క వంకనెలపై వెలుగొందెడు లోహితాంగునిన్**
**బోలఁగఁ, గంబుగర్భమునఁ బొల్పగు నీలములీలఁ గంధరా**
**కాళిమ యుల్లసిల్ల, విధుఖండము కెంజడ కెంపుఁదమ్మిలో**
**బాలమరాళ మట్లమర – భాసిలు శూలి, లలాటపట్టికన్. (5–268)**

**కవిపరిచయం:** ఈ పద్యం "కుమారభారతి" బిరుదాంకితుడు తెనాలి రామకృష్ణకవి రచించిన "పాండురంగమాహాత్మ్యం" అనే ప్రబంధం – పంచమాశ్వాసంలోని అయుతనియుతోపాఖ్యానం లోనిది.

**సందర్భం:** పుణ్యతీర్థాలలో స్నానం చేసిన అయుతుడు పరమభక్తితో పుండరీకక్షేత్రగర్భాలయంలో పాండురంగవిట్ఠలుణ్ణి స్తుతిస్తూ ఆ స్వామికి నుదుట శివుడు కొలువున్న తీరును వర్ణించే సందర్భం లోనిది.

| | |
|---|---|
| **ప్రతిపదార్థం:** ఫాలముచుక్క | = నుదిటిబొట్టు; |
| వంకనెలపైన్ | = నెలవంకపై; |
| లోహితాంగుని | = అంగారకుని; |
| పోలగ | = సరిపోలగా; |
| కంధరాకాళిమ | = మెడ పైనున్న నలుపు; |
| కంబుగర్భమునన్ | = శంఖములోని; |
| పొల్పగు | = ప్రకాశించు; |
| నీలములీలన్ | = ఇంద్ర నీలమణి లాగ; |
| ఉల్లసిల్లన్ | = ప్రకాశించగా; |
| విధుఖండము | = అర్ధచంద్రుడు; |
| కెంజడ కెంపుఁదమ్మిలోన్ | = ఎఱ్ఱనిజడ అనే ఎఱ్ఱతామర పువ్వుపైన; |
| బాలమరాళమట్లు | = పిల్లహంస లాగ; |
| భాసిలు శూలి | = ప్రకాశించే శివుడు; |
| లలాటపట్టికన్ | = నుదిటిపైన - అని భావం |

(అసంపూర్ణం - తరువాత పద్యంతో సమన్వయం)

**తాత్పర్యం:** నుదుటిపై నున్న బొట్టు ప్రక్కన తల మీదున్న నెలవంకపై ప్రతిఫలించి అంగారకుని లాగ అనిపించగా, మెడలోని నల్లని ఛాయ శంఖం గర్భంలో ప్రకాశించే నీలమణి లాగ కనిపించగా, చంద్రఖండం ఎఱ్ఱని జడ అనే ఎఱ్ఱని తామరపువ్వుపై పిల్లహంస అన్నట్లుగా ఒప్పగా, వెలుగొందే పరమశివుడు ఆ విఠ్ఠలుడి నుదుటి పైన ఉన్నాడని కవి భావన.

**విశేషం:** పాండురంగ మాహాత్మ్యంలో 5 పద్యాలను ( పంచమాశ్వాసంలో 268 నుండి 272వ పద్యం వరకు) ఒకే క్రియాపదంతో అన్వయించిన ఘట్టముంది. పాండురంగడి లలాటపట్టికయందు శివుణ్ణి(5-268), నాలుకపై సరస్వతిని(5-269), వక్షస్థలాన లక్ష్మిని(5-270), నాభియందు బ్రహ్మను (5-271) అని నాలుగు పద్యాలను అసంపూర్తిగా ముగించి అయిదో పద్యంలో భూదేవి పాదపీఠంగా ఉన్న సకలభువనమయడవైన నిన్ను "కంటి" (5-272) అని వర్ణించాడు. "కంటి" అన్న ఒకే క్రియాపదంతో ముందు చెప్పిన అన్ని పద్యాలకు అన్వయం చెప్పుకోవాలి. ఇది రామకృష్ణుడి కవితా శిల్పం. ఇలా నాలుగు కంటే ఎక్కువ పద్యాలను ఒకే క్రియాపదంతో అన్వయిస్తే దానిని "కులకం" అనే కావ్యప్రభేదంగా భావించాలని సాహిత్యదర్పణం మొదలైన గ్రంథాలు పేర్కొన్నాయి.

ఈ ప్రబంధంలో కవి – విఠోబా(విఠ్ఠలుడు లేదా పాండురంగడు)ను స్తుతిస్తూ ఆయన నుదిటిపై శివుడున్నాడని పేర్కొన్నాడు. శివుడికి ప్రతీకగా భావించే లింగరూపం లాంటి పొడవాటి కిరీటం విఠ్ఠలుడి విగ్రహానికి ఉంటుంది. భక్తి సంప్రదాయాలలో ఒకటైన "వార్కరీ" సంప్రదాయంలో మొదటి కవి జ్ఞానేశ్వరుడు. (13వ శతాబ్దం) ఈతని అభిప్రాయం ప్రకారం విఠోబా శివుణ్ణి తలమీద మోస్తున్నాడు. వైష్ణవ పురాణాల ప్రకారం మొట్టమొదటి విష్ణు భక్తుడు శివుడే. అంటే విఠోబా, భక్తుల భారాన్ని తన తల మీద మోస్తున్నారని తాత్పర్యం.

**సంధులు:** వెలుగొందెదు = వెలుగు + ఒందెదు (ఉత్వసంధి)

లోహితాంగునిన్ = లోహితం + అంగునిన్ (సవర్ణదీర్ఘసంధి)

కెంజడ = కెంపు + జడ (ప్రాతాదిసంధి)

**సమాసాలు:** ఫాలముచుక్క – ఫాలము నందలి చుక్క (సప్తమీ తత్పురుష)

లోహితాంగుడు – ఎఱ్రని శరీరము గలవాడు – అంగారకుడు (బహువ్రీహి)

కంబుగర్భము – శంఖము యొక్క గర్భము (షష్ఠీ తత్పురుష)

కంధరాకాళిమ – కంధరము యొక్క కాళిమ (షష్ఠీ తత్పురుష)

కెంజడ – ఎఱ్రనైన జడ (వి.పూ.పద కర్మధారయం)

కెంపుదమ్మి – ఎఱ్రనైన తామర (వి.పూ.పద కర్మధారయం)

వ్రక్కనెల, విధుఖండము– చంద్రుడి యొక్క ముక్క (షష్ఠీ తత్పురుష)

**ఛందస్సు:** UII UIU III UII UII UIU IU

ఫాలము | చుక్క వ్ర | క్కనెల | పై వెలు | గొందెదు | లోహితాం | గునిన్

1. ఇది ఉత్పలమాలవృత్తం. ఇందులో నాలుగు పాదాలుంటాయి
2. భరనభభరవ అనే గణాలు వరుసగా వస్తాయి
3. యతిస్థానం 10వ అక్షరం
4. ప్రాస నియమం ఉంది

**అలంకారం:** ఇందులో "కల్పితోపమ", "ఉపమ", "ఉత్ప్రేక్ష" అనే మూడు అలంకారాలున్నాయి. నుదుటి బొట్టు– తల మీదున్న నెలవంకలో ప్రతిబింబించి అంగారకుడి లాగ ఉందనడం కల్పితోపమ. మెడ శంఖంలాగా, మెడ మీద నల్లని ఛాయ – శంఖం లోపల ప్రకాశించే నీలమణి లాగ కనపడుతోందనడం ఉపమాలంకారం. చంద్రఖండం – ఎఱ్రని జటాజూటం లోని ఎఱ్రతామరపువ్వు మధ్యలో ఉన్న చిన్నహంస ఏమో అన్నట్లుగా ఉ ందనడం ఉత్ప్రేక్షాలంకారం.

**మ॥ సితకీరస్ఫటికాక్షమాలికలు గెంజేదోయి సంధించి భా**
**రతి వామాంకతలంబునన్ సతతమున్ రంజిల్లఁ గల్లోల సం**
**గతహంసోత్తమఫేనపంక్తి యగు గంగావాహినిం దాల్చు దై**
**వతశైలంబనఁ దేజరిల్లు నల విశ్వస్రష్ట, నాభిం దగన్.** (5–271)

**కవిపరిచయం:** ఈ పద్యం "కుమారభారతి" బిరుదాంకితుడు తెనాలి రామకృష్ణకవి రచించిన "పాండురంగమాహాత్మ్యం" అనే ప్రబంధం – పంచమాశ్వాసంలోని అయుతనియుతోపాఖ్యానం లోనిది.

**సందర్భం:** పుణ్యతీర్థాలలో స్నానం చేసిన అయుతుడు పరమభక్తితో పుండరీకక్షేత్రగర్భాలయంలో పాండురంగవిఠ్ఠలుణ్ణి స్తుతిస్తూ ఆ స్వామికి నాభిలో బ్రహ్మ కొలువున్న తీరును వర్ణించే సందర్భం లోనిది.

**ప్రతిపదార్థం:** కెంజేదోయిన్ = ఎఱ్ఱనైన (అందమైన) రెండు చేతులందును;
సితకీర, స్ఫటికాక్షమాలికల = తెల్లచిలుకను, జపమూలికను (క్రమముగా);
సంధించి = కూర్చి;
భారతి = సరస్వతీదేవి;
వామాంకతలంబునన్ = ఒడిలో ఎడమవైపున;
రంజిల్లన్ = ప్రకాశించగా;
కల్లోల = కెరటములతో;
సంగత = కూడుకొన్న;
హంసోత్తమఫేనపంక్తి = ఉత్తమహంస, నురుగు కల;
గంగావాహినిన్ = గంగానదిని;
తాల్చు = వహించు;
దైవశైలంబు = మేరుపర్వతము;
అనన్ = అన్నట్లుగా;
తేజరిల్లు = ప్రకాశించునట్టి;
విశ్వస్రష్ట = బ్రహ్మ;
నాభిన్ = బొడ్డున;
తగన్ = ఒప్పుగా అసంపూర్ణం-తరువాత పద్యంతో సమన్వయం.

**తాత్పర్యం:** హంస, నురుగుల గుంపు కలిగిన ఆకాశగంగను దాల్చిన మేరుపర్వతం లాగ – తెల్లని చిలుక, స్ఫటిక జపమాల చేతిలో ఉన్న సరస్వతీదేవిని తన ఎడమ తొడమీద వహించిన బ్రహ్మదేవుడు ఆ విఠ్ఠలుడి నాభిలోనూ...( తరువాత పద్యంతో అన్వయం) ఉన్నాడని కవి భావన.

**విశేషం:** నాభియందు బ్రహ్మను అని అసంపూర్తిగా ముగించి తరువాతి పద్యంలో భూదేవి పాదపీఠంగా ఉన్న సకలభువనమయడవైన నిన్ను "కంటి" (5-272) అని వర్ణించాడు. "కంటి" అన్న ఒకే క్రియాపదంతో ముందు చెప్పిన ఈ పద్యానికి అన్వయం చెప్పుకోవాలి. సరస్వతి తెలుపు. గంగాజలము తెలుపు. బ్రహ్మపసుపు. దేవతాశైలమంటే మేరుపర్వతం. అక్కడ ప్రవహించేది ఆకాశగంగ అని భావం.

**సంధులు:** స్ఫటికాక్షమాలిక = స్ఫటిక + అక్షమాలిక (సవర్ణదీర్ఘసంధి)
కెంజేదోయి = కెంపు + చేదోయి (ప్రాతాదిసంధి)
వామాంకతలంబునన్ = వామ + అంకతలంబునన్ (సవర్ణదీర్ఘసంధి)
హంసోత్తమ = హంస + ఉత్తమ (గుణసంధి)
వాహినిందాల్చు = వాహినిన్ + తాల్చు (సరళాదేశసంధి)
నాభిందగన్ = నాభిన్ + తగన్ (సరళాదేశసంధి)

**సమాసాలు:** సితకీరస్ఫటికాక్షమాలికలు – సితకీరము, స్ఫటికాక్షమాల (ద్వంద్వం)
కెంజేదోయి– ఎర్రనైన చేతులు (వి.పూ.పద కర్మధారయం)
హంసోత్తమ – ఉత్తమైన హంస (వి.ఉ.పద కర్మధారయం)

ఫేనపంక్తి – పేనము యొక్క పంక్తి (షష్ఠీ తత్పురుష)
గంగావాహినిన్ – గంగ అనే పేరుగల వాహినిని (సంభా.పూ.పద కర్మధారయం)
దైవతశైలంబు – దేవతల యొక్క శైలము (షష్ఠీ తత్పురుష)

**ఛందస్సు:** IIU UII UIU III UUU I UU IU
సితకీ | రస్ఫటి | కాక్షమా | లికలు | గెంజేదో | యి సంధిం | చిభా

1. ఇది మత్తేభవృత్తం. ఇందులో నాలుగు పాదాలుంటాయి
2. సభరనమయవ అనే గణాలు వరుసగా వస్తాయి
3. యతిస్థానం 14వ అక్షరం
4. ప్రాస నియమం ఉంది

**అలంకారం:** ఈ పద్యంలో "ఉపమాలంకారం" భాసించింది. బ్రహ్మను మేరుపర్వతంతోను, సరస్వతిని గంగతోను, ఆమె చేతిలోని తెల్లచిలుకను హంసతోను, జపమాలను ఫేనపంక్తితోను చక్కగా పోల్చి రామకృష్ణకవి ఈ పద్యంలో వర్ణించాడు.

**శా॥ నీరప్రాంగణకర్కటీబిలములన్ నిద్రింప మృత్స్నామయా**
**హారంబున్ గబళింపఁ బెల్లఱవ నిట్టట్టుం బ్లుతంబుల్ గొనన్**
**దూరాయాస్యదహీంద్రభీతిహతి గొందుల్ దూఱఁగోరున్ మదిన్**
**సారాపేతమనోబలంబగు భవిష్యద్భేక ముత్సేకమై.** (5-275)

**కవిపరిచయం:** ఈ పద్యం "కుమారభారతి" బిరుదాంకితుడు తెనాలి రామకృష్ణకవి రచించిన "పాండురంగమాహాత్మ్యం" అనే ప్రబంధం – పంచమాశ్వాసంలోని అయుతనియుతోపాఖ్యానం లోనిది.

**సందర్భం:** వాధూల ముని శాపం వల్ల అయుతుడిలో కలిగిన కప్ప సంబంధమైన కోరికలను గురించి కవి వర్ణించే సందర్భంలోనిది.

**ప్రతిపదార్థం:**

| | |
|---|---|
| సారాపేతమనోబలంబు | = సారముతొలగిపోయిన మనోబలము కలది–ధైర్యము లేనిది; అగు; |
| భవిష్యద్భేకము | = కప్పగా మారబోయే అయుతుఁడు; |
| ఉత్సేకమై | = అతిశయించినదై; |
| నీర... బిలములన్ | = నీటి ఒడ్డున ఉండే ఎండ్రి కన్నములందు; |
| నిద్రింపన్ | = పడుకోవడానికి; |
| మృత్స్నా మయాహారంబున్ | = మట్టి సంబంధమైన ఆహారానికి; |
| పెల్లు, అరవన్ | = గట్టిగా అరవడానికి; |
| ఇట్టట్టున్ | = ఈవైపునా ఆ వైపునా, |
| ప్లుతంబుల్ గొనన్ | = గంతులు వేయడానికి; |
| దూర | = దూరమునుండి, |
| ఆయాస్యత్ | = రానున్న, |

| | |
|---|---|
| అహీంద్ర | = సర్పశ్రేష్ఠము యొక్క |
| భీతిహతిన్ | = భయమువల్ల (దూరంనుండి వచ్చుచున్న పాములభయము పాటున); |
| గొందుల్ | = సందులను; |
| దూఱన్ | = ప్రవేశించుటకు, |
| మదిన్ | = మనస్సులో; |
| కోరున్ | = వాంఛించును. |

**తాత్పర్యం:** మనోబలసారం తొలగి అయుతుడిలో భవిష్యత్తులో కాబోయే కప్ప వికారాలు అతిశయించాయి. నీటి ఒడ్డున ఉన్న ఎండ్రి బొరియలలో నిద్రించాలని కోరిక కలుగుతోంది. మట్టికి సంబంధించిన ఆహారము తినాలనిపించడం మొదలైంది. పెద్దగా అరవాలనిపిస్తోంది. అటూ, ఇటూ గెంతాలనిపిస్తోంది. దూరంనుండి వస్తున్న పాముల భయం వలన సందులలో దూరాలని అయుతుడికి కోరికలు కలుగుతున్నాయని భావం.

**విశేషం:** కప్పగా మారబోతున్న అయుతుడిలో కప్పలక్షణాలు స్ఫురిస్తున్నాయని ఈ పద్యంలో కవి వర్ణిస్తున్నాడు. మృత్స్నామయ, భవిష్యత్భేకముత్సేకమై వంటి విశేషప్రయోగాలు ఉందులో ఉన్నాయి.

**సంధులు:** మృత్స్నామయాహారము = మృత్స్నామయ + ఆహారము (సవర్ణదీర్ఘసంధి)
పెల్లఱవన్ = పెల్లు + అఱవన్ (ఉత్వసంధి)
ఇట్టట్టున్ = ఇట్టు + అట్టున్ (ఉత్వసంధి)
దూరాయాస్యత్ = దూరం+ ఆయాస్యత్ (సవర్ణదీర్ఘసంధి)
ఆయాస్యదహీంద్ర = ఆయాస్యత్ + అహీంద్ర (జశ్త్వసంధి
అహీంద్ర = అహి + ఇంద్ర (సవర్ణదీర్ఘసంధి)
దూఱఁగోరున్ = దూఱన్ + కోరున్ (సరళాదేశసంధి)
సారాపేత = సార + అపేత (సవర్ణదీర్ఘసంధి)
మనోబలము = మనస్(ః) + బలము (విసర్గసంధి)
భవిష్యద్భేకము = భవిష్యత్ + భేకము (జశ్త్వసంధి)

**సమాసాలు:** నీరప్రాంగణ : నీటి యొక్క ప్రాంగణము (షష్ఠీ తత్పురుష)
కర్కటీబిలము : కర్కటి యొక్క బిలము (షష్ఠీ తత్పురుష)
అహీంద్రభీతి : అహీంద్రము వలన భీతి (పంచమీ తత్పురుష)

**ఛందస్సు:**

| UUU | IIU | IUI | IIU | UUI | UUI | U |
|---|---|---|---|---|---|---|
| నీరప్రాం | గణక | ర్కటీబి | లములన్ | నిద్రింప | మృత్స్నామ | యా |

1. ఇది శార్దూలవృత్తం. ఇందులో నాలుగు పాదాలుంటాయి
2. మసజసతతగ అనే గణాలు వరుసగా వస్తాయి
3. యతిస్థానం 13వ అక్షరం
4. ప్రాస నియమం ఉంది

ఉ॥ **కోపవికారమంచు నొకకొందఱు, కొందఱు భక్తలోకర**
**క్షాపరతంత్రతాజనితసాంద్రకృపాగుణమంచు, గొంద ఱు**
**ద్దీపిత వీరసింధువిహృతిస్ఫుటఖేటవికారమంచు నీ**
**చూపుల రక్తిమం బొగడుచున్ నుతియింపుదు రీశ్వరేశ్వరా!** (5-279)

**కవిపరిచయం:** ఈ పద్యం "కుమారభారతి" బిరుదాంకితుడు తెనాలి రామకృష్ణకవి రచించిన "పాండురంగమాహాత్మ్యం" అనే ప్రబంధం – పంచమాశ్వాసంలోని అయుతనియుతోపాఖ్యానం లోనిది.

**సందర్భం:** పుణ్యతీర్థాలలో స్నానం చేసిన అయుతుడు పరమభక్తితో పుండరీకక్షేత్రంలో వెలసిన నృసింహస్వామిని స్తుతిస్తూ ఆయన చూపులలోని ఎర్రదనాన్ని వర్ణించే సందర్భం లోనిది.

| | | |
|---|---|---|
| **ప్రతిపదార్థం:** | ఈశ్వరేశ్వరా! | = దేవతలకు దేవతయైనవాడా! |
| | నీ చూపులరక్తిమన్ | = నీ కన్నులలోని ఎఱుపును; |
| | భక్తలోకరక్షాపరతంత్రతా | = భక్తుల సమూహమును రక్షిండంలో ఆసక్తిచేత; |
| | జనిత | = పుట్టింపబడిన – కలిగిన; |
| | సాంద్రకృపాగుణము | = ఎక్కువైన దయ; |
| | ఉద్దీపిత | = మిక్కిలి ప్రకాశించే; |
| | వీరసింధువిహృతి | = వీరుల సముద్రము (సమూహము)లో విహరించుటచేత; |
| | స్ఫుట | = స్పష్టమైన; |
| | ఖేటవికారము | = డాలు వాఱుయొక్క (వాఱు=సన్ననితోలు) మాఱురూపు కలది–అని |
| | పొగడుచున్ | = కొనియాడుచు, |
| | నుతియింపుదురు | = పూజిస్తారు. |

**తాత్పర్యం:** ఈశ్వరునకు ప్రభువవైన ఓ నృసింహా (ఈశ్వరేశ్వర)! నీ చూపులలోని ఎర్రదనము (నీ చూపుల రక్తిమంబు) పొగడుతూ స్తుతిస్తారు. ఎవరి కారణం వారిది. కొంతమంది అది (నీ చూపు రక్తిమ) కోపంవల్ల వచ్చినదంటారు. కొందరు భక్తలోకమును రక్షించడానికి జనించిన చిక్కని దయాగుణము వలన వచ్చిందంటారు (భక్తలోక రక్షాపరతంత్రతా జనిత సాంద్రకృపా గుణము). మిక్కిలి ప్రకాశించు వీరులసముద్రమనందు విహరించడం వల్ల (ఉద్దీపిత వీరసింధువిహృతి) స్పష్టమైన డాలుకు మారురూపమంటారు (స్ఫుట ఖేట వికారము). అనగానేమి? శత్రువీరులు స్వామి కన్నులలోని రక్తిమ చూసినంతలో పారిపోతారు.

**విశేషం:** అక్కడి నృసింహస్వామి కళ్ళలోని ఎర్రదనం (ఆయన కోపం) స్వామికి రక్షయైన డాలు లాగా పనిచేస్తోందని విశేషం. ఒక్కొక్కరికీ ఒక్కొక్కాలాగా అది కనిపిస్తోందని కవి వర్ణించారు.

| | |
|---|---|
| **సంధులు:** | వికారమంచునొక = వికారము + అంచను + ఒక (ఉత్వసంధి) |
| | కొందఱుద్దీపిత = కొందఱు + ఉద్దీపిత (ఉత్వసంధి) |
| | రక్తిమం బొగడుచున్ = రక్తిమన్ + పొగడుచున్ (సరళాదేశసంధి) |
| | ఈశ్వరేశ్వరా = ఈశ్వర + ఈశ్వరా (గుణసంధి) |

**సమాసాలు:** అహీంద్రభీతి – అహీంద్రము వలన భీతి (పంచమీ తత్పురుష సమాసం)

**ఛందస్సు:** UII UIU III UII UII UIU IU

కోపవి | కారమం | చునొక | కొందఱు, | కొందఱు | భక్తలో | కర

1. ఇది ఉత్పలమాలవృత్తం. ఇందులో నాలుగు పాదాలుంటాయి
2. భరనభభరవ అనే గణాలు వరుసగా వస్తాయి
3. యతిస్థానం 10వ అక్షరం
4. ప్రాస నియమం ఉంది

**అలంకారం:** ఈ పద్యంలో ఉల్లేఖాలంకారం ఉంది. గ్రహించేవారి భేదము వలన ఒక వస్తువు అనేక రూపములుగ గ్రహింపబడినచో అది ఉల్లేఖము అగును. ఇచట నృసింహుని కనులలోని రక్తిమ కొందరికి క్రోధముగనూ, కొదరికి కరుణ గానూ, కొందరికి ప్రతివీర రక్షాఖేటముగానూ కనిపించినది కనుక ఉల్లేఖమైనది.

# సందర్భ సహిత వ్యాఖ్యలు

**1. “సన్మానింపందగుంబాణి పీడన విధానశ్రీల వాలాయమున్” (5-170)**

**కవి పరిచయము :** తెనాలి రామకృష్ణ కవిచే రచించబడిన పాండురంగమాహాత్మ్యములోని ‘అయుత నియుతోపాఖ్యానము’ అనే పాఠ్యభాగం నుండి గ్రహించబడినదీ వాక్యం.

**సందర్భం:** అగస్త్యుడు తన శిష్యులైన అయుతనియుతుల విశిష్టతను తలచుకొని, ముచ్చటపడి వాళ్లను పాణిగ్రహణంతో సత్కరించాలని భావించే సందర్భంలోనిదీ ఈ వాక్యం.

**భావం:** నా శిష్యులందరిలో ఈ అయుతనియుతులిద్దరూ మనోహరమైన తెలివితేటలుగలవారు. నిష్కళంకమైన జ్ఞానం చేత కలిగిన వివేచనాశక్తితో, ఓరిమితో, శాంతితో, ఖ్యాతితో ప్రకాశిస్తున్నారు. వాళ్లమనసులు నాయందే లగ్నమై యుంటాయి. వాళ్లను తప్పకుండా వివాహం చేసి గౌరవించాలి అని అగస్త్య మహర్షి భావించారని తాత్పర్యం.

**2. “ఆసీనప్రచలాయితంబయిన లేదాహో!” (5-171)**

**కవి పరిచయం :** తెనాలి రామకృష్ణ కవిచే రచించబడిన పాండురంగమాహాత్మ్యములోని ‘అయుత నియుతోపాఖ్యానము’ అనే పాఠ్యభాగం నుండి గ్రహించబడినదీ వాక్యం.

**సందర్భం:** అగస్త్యుడు తన శిష్యులైన అయుతనియుతుల విశిష్టతను తలచుకొని, ముచ్చటపడి వాళ్లను పాణిగ్రహణంతో సత్కరించాలని భావించే సందర్భంలోనిది.

**భావము:** పరిశీలించిచూస్తే వీళ్లకు విద్యమీద తప్పవేరే ధ్యాసలేదు. వస్త్రాలపై ధ్యాసలేదు. ఆకలిదప్పులు పట్టవు. తల మాసినా పట్టించుకోరు. శరీరపు బడలికను లెక్కచేయరు. అవన్నీ అలా ఉంచండి. అహోరాత్రాలూ వేదాధ్యయనం చేయటం వలన కలిగిన అలసటచేత కనీసమొక్క కునుకుపాటుకూడాతీయరు. ఆలోచిస్తే ఎంతటి ఆశ్చర్యం అని అగస్త్య మహాముని భావించాడని తాత్పర్యం.

**3. “పొడవులన్నియుందనయంద పొడము వాని”**

(లేదా)

**కడయునడుమును మొదలు నేర్పడనివాని (5-174)**

(లేదా)

**సచ్చిదానందకందమై హెచ్చువాని (5-174)**

**కవి పరిచయం :** తెనాలి రామకృష్ణ కవిచే రచించబడిన పాండురంగమాహాత్మ్యములోని ‘అయుత నియుతోపాఖ్యానము’ అనే పాఠ్యభాగం నుండి గ్రహించబడినదీ వాక్యం.

**సందర్భం :** అగస్త్యుడు తన ప్రియశిష్యుల వివాహం చేయడానికి తగిన కన్యలు భూలోకంలో ఎవరూ లేరని భావించి బ్రహ్మలోకం వెళ్లి, బ్రహ్మ మానసపుత్రికల్ని యాచించే సందర్భంలో బ్రహ్మ ఉనికిని కవి వర్ణించిన సందర్భంలోనిదీ ఈ వాక్యం.

**భావం:** బ్రహ్మదేవుడు చంద్రరేఖను చేపట్టిన మేరు పర్వతంలాగా సరస్వతీదేవితో మెరిసిపోతున్నాడు. వేగుచుక్కతో ప్రకాశించే మేరు పర్వతంలా బ్రహ్మ తన సమీపంలోనున్న హంసవాహనంతో ప్రకాశిస్తున్నాడు. తెలతెల్లని శరత్కాల మేఘాలు అంటుకున్న మేరు పర్వతంలా తెల్లని ఆభరణాలతో ప్రకాశిస్తున్నాడు. దిగ్గజాలు మోస్తున్న మేరు పర్వతంలా తెల్లని పద్మాసనంపై యున్నాడు. రూపాలన్నీ తనలోనే పొడమేవాడు, ఆదిమధ్యాంతరహితుడు, సచ్చిదానందానికి మూలమైనవాడునైన బ్రహ్మను, అగస్త్యుడు కీర్తించి తృప్తి పరిచాడని భావం.

**4. "నిలిపె సమబుద్ధి ప్రియమూని నియుతమౌని" (5-180)**

**కవి పరిచయం:** తెనాలి రామకృష్ణ కవిచే రచించబడిన పాండురంగమాహాత్మ్యములోని 'అయుత నియుతోపాఖ్యానము' అనే పాఠ్యభాగం నుండి గ్రహించబడినదీ వాక్యం.

**సందర్భం :** అగస్త్యుడు బ్రహ్మనర్థించి కొనిదెచ్చిన సావిత్రి, గాయత్రులను నియుతునికే కట్టబెట్టవలసి వచ్చింది. ఆ సందర్భంలో నియుతుడు ఆ కన్యలతో ఎలా రమిస్తున్నాడో వర్ణించి చెప్పే సందర్భంలోనిది.

**భావము:** సావిత్రి గాయత్రుల నల్లని శిరోజాలు వంకరలు తిరిగి చీకటి ప్రోగుల్లా ఉన్నప్పటికీ వాళ్ళ మనస్సుల్లో జ్ఞానమనే వెన్నెలలు ప్రకాశిస్తున్నాయి. వాళ్ళ పెదవులు ఎర్రగా రజోగుణపూరితాలైనప్పటికీ వాళ్ళ మనసులలో వైరాగ్యం భాసిస్తోంది. వాళ్ళ వక్షోజాలు గర్వంతో విర్రవీగుతున్నట్లు ఉన్నప్పటికీ, వాళ్ళ ఆశయాలు చెడు వికారాల్ని నశింపచేసేవిగా ఉన్నాయి. వాళ్ళ విలాసగమనం మందగమనమే అయినా అంతరంగాలు జ్ఞానయుతమైనవి. వాళ్ల చూపులు పొగరుతో కూడి చంచలాలై యున్నాయి. కాని నిండు మనసులలో నిశ్చలత్వముంది. అటువంటి భార్యలతో నియుతుడు సమబుద్ధితో కాపురం చేశాడని భావం.

**5. "విఱ్ఱవీగెదరు కొందఱు బోడలు నానగండలై" (5-182)**

**కవి పరిచయం:** తెనాలి రామకృష్ణ కవిచే రచించబడిన పాండురంగమాహాత్మ్యములోని 'అయుత నియుతోపాఖ్యానము' అనే పాఠ్యభాగం నుండి గ్రహించబడినదీ వాక్యం.

**సందర్భం :** తన మాటను తిరస్కరించి పాణిగ్రహణము ఒల్లనని పలికిన అయుతునిపై ఆగ్రహించిన అగస్త్యుడు అయుతుని ఆశ్రమంనుండి వెళ్లిపొమ్మని ఆజ్ఞాపించాడు. తన గురువిలా ఆజ్ఞాపించినందుకు బాధపడి ఇలా హిమాలయపర్వతాలకు చేరి తాపసవృత్తిని అవలంబించపోతూ అయుతుడు తన మనసులో రకరకాలుగా ఊహించుకొన్న సందర్భంలోనిదీ వాక్యం.

**భావము:** చిలకలు, మలయమారుతం, చంద్రుడు, తుమ్మెదలు మన్మథుని సాధన సంపత్తి. ఈ మన్మథుని సాదన సంపత్తికి ఉనికిపట్టులు స్త్రీలు. అందుచేత కొంతమంది సన్న్యాసులు ఈ మన్మథపరివారాన్ని తిరస్కరించకుండానే సిగ్గులేక రేగిన కోర్కెలతో ఉండికూడా రాగద్వేషాదుల్ని జయించామని విర్రవీగుతుంటారు.

**6. "మొఱ్ఱోయనంగ లింగంబు గట్టు జంగమన" (5-184)**

**(లేదా)**

**"గురుదేమి పనిచినంజేయలేనె" (5-184)**

**కవి పరిచయం:** తెనాలి రామకృష్ణ కవిచే రచించబడిన పాండురంగమాహాత్మ్యములోని 'అయుత నియుతోపాఖ్యానము' అనే పాఠ్యభాగం నుండి గ్రహించబడినదీ వాక్యం.

**సందర్భం :** తన మాటను తిరస్కరించి పాణిగ్రహణము ఒల్లనని పలికిన అయుతునిపై ఆగ్రహించిన అగస్త్యుడు అయుతుని ఆశ్రమంనుండి వెళ్లిపొమ్మని ఆజ్ఞాపించాడు. తన గురువిలా ఆజ్ఞాపించినందుకు బాధపడి ఇలా హిమాలయపర్వతాలకు చేరి తాపసవృత్తిని అవలంబించపోతూ అయుతుడు తన మనసులో రకరకాలుగా ఊహించుకొన్న సందర్భంలోనిదీ వాక్యం.

**భావము:** స్త్రీల కుచగిరులను వద్దన్నాను గాని గురువు ఆజ్ఞాపిస్తే కులగిరులనైనా ఎక్కి పరుగెత్తమంటే పరుగెత్తనా? మగువల నిడువాలు చూపులపై వాలనన్నాను గాని గురువాజ్ఞాపించి వాడి కత్తులపై వాలమంటే వాలనా? స్త్రీల నతనాభులను చూడనన్నానుగాని సముద్రపు సుడిగుండంలో మునగమంటే మునగనా? స్త్రీల నూగారును స్పృశించనన్నాను గాని గురువు కోరితే కాలసర్పాన్ని స్పృశించమంటే స్పృశించనా? గురువు చెప్పిన ఏ పనిని చేయలేదు. ఈ తనువు, కర్మగతులూ అన్నీ ఆయన సొమ్ములే కదా! వద్దు మొఱ్ఱో! అంటే లింగం కట్టే జంగంలాగా స్త్రీలను అంటకట్టడం తగిన పనేనా? అని మనసులో అయుతుడు తలపోసెనని భావం.

**7. "ఉర్వీధరము లెక్కియుఱుకనే" (5-184)**

**(లేదా)**

**వాడి కైదువులపై వాలనే (5-184)**

**(లేదా)**

**మున్నీటి సుడిపడి మునగనే (5-184)**

**(లేదా)**

**బెడcగారు కాలాహిcదొడుకనే (5-184)**

**కవి పరిచయం:** తెనాలి రామకృష్ణ కవిచే రచించబడిన పాండురంగమాహాత్మ్యములోని 'అయుత నియుతోపాఖ్యానము' అనే పాఠ్యభాగం నుండి గ్రహించబడినదీ వాక్యం.

**సందర్భం :** తన మాటను తిరస్కరించి పాణిగ్రహణము ఒల్లనని పలికిన అయుతునిపై ఆగ్రహించిన అగస్త్యుడు అయుతుని ఆశ్రమంనుండి వెళ్లిపొమ్మని ఆజ్ఞాపించాడు. తన గురువిలా ఆజ్ఞాపించినందుకు బాధపడి ఇలా హిమాలయపర్వతాలకు చేరి తాపసవృత్తిని అవలంబించపోతూ అయుతుడు తన మనసులో రకరకాలుగా ఊహించుకొన్న సందర్భంలోనిదీ వాక్యం.

**భావము:** స్త్రీల కుచగిరులను వద్దన్నాను గాని గురువు ఆజ్ఞాపిస్తే కులగిరులనైనా ఎక్కి పరుగెత్తమంటే పరుగెత్తనా? మగువల నిడువాలు చూపులపై వాలనన్నాను గాని గురువాజ్ఞాపించి వాడి కత్తులపై వాలమంటే వాలనా? స్త్రీల నతనాభులను చూడనన్నానుగాని సముద్రపు సుడిగుండంలో మునగమంటే మునగనా? స్త్రీల నూగారును స్పృశించనన్నాను గాని గురువు కోరితే కాలసర్పాన్ని స్పృశించమంటే స్పృశించనా? గురువు చెప్పిన ఏ పనిని చేయలేదు. ఈ తనువు, కర్మగతులూ అన్నీ ఆయన సొమ్ములే కదా! వద్దు మొఱ్ఱో! అంటే లింగం కట్టే జంగంలాగా స్త్రీలను అంటకట్టడం తగిన పనేనా? అని మనసులో అయుతుడు తలపోసెనని భావం.

**8. "మదము లోభము క్రోధము మొల్వవచ్చుటన్" (5-193)**

**కవి పరిచయం:** తెనాలి రామకృష్ణ కవిచే రచించబడిన పాండురంగమాహాత్మ్యములోని 'అయుత నియుతోపాఖ్యానము' అనే పాఠ్యభాగం నుండి గ్రహించబడినదీ వాక్యం.

**సందర్భం :** అయుతుని బ్రహ్మచర్యమార్గంనుండి మళ్లించి గృహస్థుని చేయాలన్న తలంపుతో మారువేషంతో వచ్చిన ఇంద్రుడు, తన నివాసాది వివరాలు అయుతునితో చెప్పే సందర్భంలోనిదీ ఈ వాక్యం.

**భావము:** దేవతలకు నివాసమైనది, స్వచ్ఛజలంతో కూడిన సరస్సుకలది, నవపారిజాత వృక్షాలతో అలరారేది, నిరంతరమూ ఫలాలనిచ్చేది, నిత్యానందకరమైన ఒక ఆశ్రమం మేరుపర్వత శిఖరభాగాన నాకు నివాసమై ప్రకాశిస్తుంది. అక్కడ అహంకారము, క్రోధము, లోభము వంటివి కలుగవు. చెపుతోంది ఇంద్రుడు కాబట్టి ఆశ్రమపరంగా చెప్పిన ఈ అర్థమే స్వర్గపరంగా కూడా అన్వయిస్తుంది. స్వర్గం దేవతానివాసంగదా! స్వచ్ఛమైన అప్సరగణంతో కూడింది, కొనియాడదగిన పారిజాతవృక్షాలుగలది అయిన మేరుపర్వత శిఖరాన నా నివాసం. అక్కడ క్రోధమదలోభాలు జనించవు అని శ్లేషతో అన్వయించవచ్చు.

**9. "కొయ్యవేల్పుఁగని దిక్కుల తీర్థములెల్లనాడుచున్" (5-196)**

**కవి పరిచయం:** తెనాలి రామకృష్ణ కవిచే రచించబడిన పాండురంగమాహాత్మ్యములోని 'అయుత నియుతోపాఖ్యానము' అనే పాఠ్యభాగం నుండి గ్రహించబడినదీ వాక్యం.

**సందర్భం :** అయుతుని బ్రహ్మచర్యమార్గంనుండి మళ్లించి గృహస్థుని చేయాలన్న తలంపుతో మారువేషంతో వచ్చిన ఇంద్రుడు, తన నివాసాది వివరాలు చెప్పే సందర్భంలోనిది ఈ వాక్యం.

**భావము:** కంచి, శేషగిరి, శ్రీరంగపట్టణం, ప్రయాగ, గయ, సింహాచలం వంటి క్షేత్రాలను ఆ క్షేత్రాలలో నున్న దైవాలను చూసి ప్రణమిల్లాను. సముద్రంలో కొట్టుకువచ్చిన కొయ్యవేల్పయిన జగన్నాథ స్వామిని దర్శించి అన్ని తీర్థాలలో స్నానమాడుతూ ఇటువచ్చానని అయుతునితో కపట బ్రాహ్మణుడైన ఇంద్రుడు పలికెనని భావం.

**10. "కఱువదలచి తానె యుడుగు పాముపగిది" (5-205)**

**(లేదా)**

**"శిఖ విడినంతనె విపులామరవిపుల కోపవిషముందిరుగున్"**

**కవి పరిచయం:** తెనాలి రామకృష్ణ కవిచే రచించబడిన పాండురంగమాహాత్మ్యములోని 'అయుత నియుతోపాఖ్యానము' అనే పాఠ్యభాగం నుండి గ్రహించబడినదీ వాక్యం.

**సందర్భం :** కపటవేషంతో వచ్చిన ఇంద్రుడు తన వివరాలనన్నీ చెప్పిన తరువాత, అగస్త్యుడు తనపై కోపించటానికి గల కారణాన్ని అయుతుడు వివరించే సందర్భంలోనిదీ ఈ వాక్యం.

**భావము:** తాను తెచ్చిన కన్యలలో ఒకరిని వివాహమాడమని చెప్పిన అగస్త్యుని మాటల్ని అయుతుడు తిరస్కరించి వివాహమే వద్దని చెప్పాడు. ఆ మాటలకు అగస్త్యుడు కోపించి శపించబోయాడు. అయినా కఱవ దలచిన పాము కరవకుండా వదిలిపోయినట్టు, అగస్త్యుడు కోపాన్ని నిగ్రహించుకొని శపించలేదు. బ్రాహ్మణకోపం ఎలాంటిదంటే ముడితోనున్న శిఖలాంటిది. ముడివీడిపోగానే కోపం తగ్గిపోతుంది. అలాగే అగస్త్యుని కోపం తగ్గిందని అయుతుడు ఆ ముసలి బ్రాహ్మణవేషధారియైన ఇంద్రునికి తెలిపాడని భావం.

**11. "భవద్విరుద్ధ చరితంబు శ్రవః పుటసూచి యయ్యెడున్"**

**కవి పరిచయం:** తెనాలి రామకృష్ణ కవిచే రచించబడిన పాండురంగమాహాత్మ్యములోని 'అయుత నియుతోపాఖ్యానము' అనే పాఠ్యభాగం నుండి గ్రహించబడినదీ వాక్యం.

**సందర్భం :** అయుతుడు చెప్పిన కథను విని, మారువేషములోనున్న ఇంద్రుడు అయుతునితో పలికే సందర్భంలోనిది ఈ వాక్యం.

**భావము:** నీ తండ్రియైన ప్రయుతుడు నాకు స్నేహితుడు. అతని సంసారజీవనవిధానం, అతని గొప్పదనం విద్వాంసులకు సంతోషదాయకమైన విషయాలు. అటువంటివాని జ్యేష్ట సుతుడవైనందుకు నిన్ను చూస్తే నాకు నేత్రోత్సవంగా ఉంది. కాని నీ ఈ విపరీత స్వభావము నాకు చెవులలో సూదులు గ్రుచ్చినట్లుగా అనిపిస్తున్నది – అని అయుతునితో మారువేషంలోనున్న ఇంద్రుడు పలికాడు.

**12. "నిదురవంటిది ఱాతివంటిదియుఁగాదు"**

**కవి పరిచయం:** తెనాలి రామకృష్ణ కవిచే రచించబడిన పాండురంగమాహాత్మ్యములోని 'అయుత నియుతోపాఖ్యానము' అనే పాఠ్యభాగం నుండి గ్రహించబడినదీ వాక్యం.

**సందర్భం :** అయుతుడు చెప్పిన కథను విని, మారువేషములోనున్న ఇంద్రుడు అయుతునితో పలికే సందర్భంలోనిది ఈ వాక్యం.

**భావము:** పశువుల కొట్టంనుండి పాలు ఇంట్లోకి రాగా, పండిన వివిధ ధాన్యాలు నిండుగా ఉంటే, అప్పుడప్పుడూ పెళ్లిళ్లూ వడుగులూ జరుగుతుంటే, యాచకులు వచ్చి యాచించి, కావలసింది తృప్తిగా పొంది సంతోషంగా పోతుంటే, పరిచారికలు పనిపాట్లు చేస్తుంటే, చుట్టపక్కాలు ఇళ్లకు వచ్చి సందడి చేస్తుంటే, తన వైభవం కారణంగా గ్రామమంతా తన సత్యనిష్టకు మెచ్చి, సాక్ష్యం కోరుతుంటే నిత్య నైమిత్తిక కర్మల్ని శ్రద్ధతో ఆచరిస్తూ, దేవుడికి నివేదించిన అన్నాన్ని భార్య వడ్డిస్తుంటే తినటం ముక్తికాని, నిద్రవంటి, రాతివంటి జీవితం ముక్తి కాదు'' అని గృహస్థాశ్రమ వైశిష్ట్యాన్ని అయుతునికి కపట బ్రాహ్మణుడు వివరించాడు.

**13. "కనక శలాటుకాధమము కల్పఫలంబె" (5-223)**

**(లేదా)**

**"చిమ్మెట సింగమె? గాజు రత్నమె?" (5-223)**

**కవి పరిచయం:** తెనాలి రామకృష్ణ కవిచే రచించబడిన పాండురంగమాహాత్మ్యములోని 'అయుత నియుతోపాఖ్యానము' అనే పాఠ్యభాగం నుండి గ్రహించబడినదీ వాక్యం.

**సందర్భం :** తనవద్దకు మారువేషంలో వచ్చి ఇంద్రుడు చేసిన ప్రబోధానికి అయుతుడు సమాధానం చెప్పే సందర్భంలోనిదీ ఈ వాక్యం

**భావము:** నిర్మలమైన ఆలోచనలు కలిగినవాడా (అనఘవిచార) మునిజనుల సంపదయైన మోక్షపుపక్షాన పలుకకుండా ఎప్పుడూ బూడిదబొట్టువలె క్షణికమైన చెత్తగృహస్థధర్మాన్ని కొనియాడతావేమయ్యా? చిమ్మెట సింహమవుతుందా? గాజుపూస రత్నమవుతుందా? ఉమ్మెత్తకాయ కల్పవృక్షమవుతుందా? పంతమెందుకు స్వామీ! అని భావం.

14. **"సంపద చేతఁగాని కొనసాగవు సువ్వెగృహస్థ ధర్మముల్" (5-221)**

**కవి పరిచయం:** తెనాలి రామకృష్ణ కవిచే రచించబడిన పాండురంగమాహాత్మ్యములోని 'అయుత నియుతోపాఖ్యానము' అనే పాఠ్యభాగం నుండి గ్రహించబడినదీ వాక్యం.

**సందర్భం :** తనవద్దకు మారువేషంలో వచ్చి ఇంద్రుడు చేసిన ప్రబోధానికి అయుతుడు సమాధానం చెప్పే సందర్భంలోనిదీ ఈ వాక్యం

**భావము:** సంపద చేతగాని గృహస్థ ధర్మము కొనసాగదు. మరి ఆ సంపద పూర్వజన్మ సుకృతం చేతగాని సిద్ధించదు. ఒకవేళ సంపద వచ్చిందా! మహాత్ముడికైనా మదం పుట్టిస్తుంది. ఇలా చంపుడు ముంపుడు గాథల్ని చెప్పి నన్ను చంపవద్దని అయుతుడు మారువేషంలో నున్న ఇంద్రునితో అన్నాడు.

15. **"ఆభాసమెగాక భాసితచిదానందంబు పెంపొందునే" (5-225)**

**కవి పరిచయం:** తెనాలి రామకృష్ణ కవిచే రచించబడిన పాండురంగమాహాత్మ్యములోని 'అయుత నియుతోపాఖ్యానము' అనే పాఠ్యభాగం నుండి గ్రహించబడినదీ వాక్యం.

**సందర్భం :** మారువేషంలో వచ్చిన ఇంద్రునితో అయుతుడు సంసారం పట్ల తనకుగల విముఖత్వాన్ని తెలియజేసే సందర్భంలోనిదీ పద్యం.

**భావము:** మన్మథబాణాలు, మెఱుపుతీగల గుంపులు, నిరంతరం ప్రవహించే అమృత ప్రవాహాలు, సంపెంగతీగలంటూ, విద్వాంసులు వ్యాజస్తుతులచేత నిందించే ఈ దొండపండువంటి పెదవులుగల ఈ స్త్రీలలో అంతటా ఆనందమన్న భ్రాంతి తప్ప చిదానందం వృద్ధి చెందుతుందా? అని అయుతుడు తలపోసెనని భావం.

16. **"నా మాట యెంతపాటి" (5-229)**

**(లేదా)**

**"గుడి మ్రింగువానికి తలుపులప్పడములు" (5-229)**

**కవి పరిచయం:** తెనాలి రామకృష్ణ కవిచే రచించబడిన పాండురంగమాహాత్మ్యములోని 'అయుత నియుతోపాఖ్యానము' అనే పాఠ్యభాగం నుండి గ్రహించబడినదీ వాక్యం.

**సందర్భం :** తానెంత చెప్పినా వినని అయుతునితో విసిగిపోయి, కపట బ్రాహ్మణ వేషధారియైన ఇంద్రుడు పలికే సందర్భంలోనిది.

**భావము:** పిరికిపందకు యుద్ధాన్ని గురించి, లోభికి త్యాగాన్ని గురించి, బోయవాడికి కరుణ గురించి, నపుంసకునికి స్త్రీ సుఖాన్ని గురించి చెప్పినట్లు నా హితబోధ నీపట్ల నిరర్థకమయింది. నీ మనసుకు నామాటలెక్కనందున నీతో నాకేం పని? పల్లానికి పోయే నీటిని తిప్పి కావలసిన చోటుకు మళ్ళించటం ఎవరివల్ల సాధ్యమవుతుంది? గుడిని మింగేవాడికి తలుపులు అప్పడాలయినట్లు అగస్త్యమహాముని యంతటివాడి మాటలనే లెక్కచేయని వానికి నా మాటలు ఎంత? - అని కపట బ్రాహ్మణుడు అయుతునితో పలికాడని భావం.

17. **"ధర్మదేవత శతచ్ఛదలోచనుఁడెత్తు కైవడిన్"**

**కవి పరిచయం:** తెనాలి రామకృష్ణ కవిచే రచించబడిన పాండురంగమాహాత్మ్యములోని 'అయుత నియుతోపాఖ్యానము' అనే పాఠ్యభాగం నుండి గ్రహించబడినదీ వాక్యం.

**సందర్భం :** ఇంద్రుడు తన దారిలోకి అయుతుడిని తెచ్చే నిమిత్తమై వదలివెళ్లిన గోవును, అయుతుడు లేవనెత్తి దానికి సపర్యలు చేసే సందర్భములోనిది ఈ వాక్యము.

**భావము:** దీనస్థితిలో నున్న మునిధేనువును అయుతుడు చూచి జాలిపడి దానిని అపాయ పరంపర నుండి రక్షించాలని నిశ్చయించుకున్నాడు. దానికి తగిన ఉపచారాలు చేసి నెమ్మదిగా లేవనెత్తాడు. ఆ ఆవును లేవనెత్తటమెలా ఉందంటే, శ్రీమహావిష్ణువు కలి బారినుండి భూమాతను ఉద్ధరించినట్లుగా ఉందని కవి భావించాడు.

**18. "బీద బలిసి బందికాఁడగు విధంబున" (5-239)**

**కవి పరిచయం:** తెనాలి రామకృష్ణ కవిచే రచించబడిన పాండురంగమాహాత్మ్యములోని 'అయుత నియుతోపాఖ్యానము' అనే పాఠ్యభాగం నుండి గ్రహించబడినదీ వాక్యం.

**సందర్భం :** అయుతుని పోషణలో బలందేరిన ధేనువు అడవిలో స్వైర విహారం చేసే సందర్భంలో కవి పలికిన వాక్యమిది.

**భావము:** వేయి విధాలుగా అయుతుడు పోషించగా, బలిసిన ఆ ఇంద్రుని గోవు, క్రొవ్వెక్కి అడ్డూ అదుపూ లేకుండా చెడ్డవానితో చేసే స్నేహంలాగా, బీదవాడు బలిసి బందికాడైనట్లు విజృంభించి అడవిలో తిరుగసాగిందని భావం.

**19. "పులి యున్న పొదరు" (5-247)**

**(లేదా)**

**"మొసలికి నెలవగు బలుమడువు" (5-247)**

**(లేదా)**

**"త్రాచునిల్చిన వల్మీకంబు" (5-247)**

**కవి పరిచయం:** తెనాలి రామకృష్ణ కవిచే రచించబడిన పాండురంగమాహాత్మ్యములోని 'అయుత నియుతోపాఖ్యానము' అనే పాఠ్యభాగం నుండి గ్రహించబడినదీ వాక్యం.

**సందర్భం :** వాధూల మహాముని ఆశ్రమాన్ని వర్ణించే సందర్భంలోనిది ఈ వాక్యము.

**భావము:** పులి పొంచి దాగున్న పొద, మొసలి నివాసముండే మడుగు, త్రాచుపాముండే పుట్ట లాగా వాధూలముని నివసించే వనం ప్రమాదభరితమైంది. ఇంద్రాదులకు సైతం ఆ వనం చొరరానిదని, అటువంటి వనంలోనికి కపటపు గోవు ప్రవేశించిందని భావం.

**20. "కొఱవింగొని గోఁకఁదివురు కుమతియుఁగలఁడే" (5-254)**

**కవి పరిచయం:** తెనాలి రామకృష్ణ కవిచే రచించబడిన పాండురంగమాహాత్మ్యములోని 'అయుత నియుతోపాఖ్యానము' అనే పాఠ్యభాగం నుండి గ్రహించబడినదీ వాక్యం.

**సందర్భం :** తాను కాపాడి సంరక్షించే ధేనువు కపటపు గోవని తెలియని అయుతుడు, ఆ ధేనువు చేసే దౌష్ట్యాల్ని భరించలేక వదిలించుకోవాలని తన్ని తరుమగా అది వాధూలముని వనంలో ప్రవేశించి ఆయన తపస్సుకు విఘ్నకారియైంది. కోపించిన వాధూలుడు అయుతుడిని కప్పవు కమ్మని శపించాడు. అప్పుడు కోపాన్ని నిగ్రహించుకొమ్మని వాధూల మహామునిని ప్రాధేయపడుతూ అయుతుడు అన్న మాటలివి.

**భావము:** ఓ వాధూల మహామునీ! నీవు తరుగని ప్రళయాగ్నివని తెలుసు. నిజంగా తెలిసి తెలిసి కొరివితో తలగోక్కునే బుద్ధిలేనివాడు ఉంటాడా? అని అయుతుడు నేనేమీ తప్పు చేయలేదని వాధూలమునితో చెప్పెనని భావం.

**21. "తన మేను పువ్వుగుత్తి కరణి పొలుపు నిలుప" (5-287)**

**కవి పరిచయం:** తెనాలి రామకృష్ణ కవిచే రచించబడిన పాండురంగమాహాత్మ్యములోని 'అయుత నియుతోపాఖ్యానము' అనే పాఠ్యభాగం నుండి గ్రహించబడినదీ వాక్యం.

**సందర్భం :** వాధూలముని శాపానికి గురయిన అయుతుడు కప్పగా మారాడు. కప్పగా మారిన అయుతుని జీవన చర్యను వివరిస్తూ చెప్పిన సందర్భంలోనిది ఈ వాక్యం.

**భావము:** తెల్లవారి నరసింహస్వామి ముంగిట వేసే రత్నాలముగ్గుల వద్ద కప్ప శరీరం రంగుల పుష్ప గుచ్ఛంలాగా ఉన్నదని కవి వర్ణించి చెప్పటంలోని తాత్పర్యం.

**22. "విరహి హృద్ధాములగు మారుశరములనఁగ" (5-289)**

**కవి పరిచయం:** తెనాలి రామకృష్ణ కవిచే రచించబడిన పాండురంగమాహాత్మ్యములోని 'అయుత నియుతోపాఖ్యానము' అనే పాఠ్యభాగం నుండి గ్రహించబడినదీ వాక్యం.

**సందర్భం :** కన్యాకుబ్జానికి చెందిన రాకుమారి తన చెలికత్తెలతో కలిసి, పాండురంగక్షేత్రంలోని నృసింహతీర్థానికి సమీపంలో విహారార్థం దిగారని చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

**భావము:** కన్యాకుబ్జపు రాకుమారి, ఆమె చెలికత్తెలు తమ తమ వాహనాలనుండి దిగి, నృసింహతీర్థానికి సమీపంలో విడిది చేశారు. వాళ్లు విడిది చేయటం విరహులైన వాళ్ల మనస్సులలో నాటిన మన్మథుని బాణాలా? అన్నట్లు ఉందని కవి వర్ణించి చెప్పటం ఇందులోని తాత్పర్యం.

**23. "రావణునకు వైకుంఠ పురావాస స్త్రీల చేత నలజడి వోలెన్"**

**కవి పరిచయం:** తెనాలి రామకృష్ణ కవిచే రచించబడిన పాండురంగమాహాత్మ్యములోని 'అయుత నియుతోపాఖ్యానము' అనే పాఠ్యభాగం నుండి గ్రహించబడినదీ వాక్యం.

**సందర్భం :** అయుతుడు వాధూలముని శాపంతో కప్పగామారి జీవిస్తున్నాడు. ఆ సందర్భంలో కన్యాకుబ్జపు రాకుమారి, ఆమె చెలికత్తెలు ఆ కప్పను పట్టుకోవటానికి ప్రయత్నిస్తున్నప్పుడు హరిదాసపు స్థితిని చెప్పే సందర్భంలోనిది ఈ వాక్యం.

**భావము:** ఆ హరిదాసానికి, కన్యాకుబ్జ రాకుమారి, ఆమె చెలికత్తెల వలన ఉపద్రవ మధికమ్మైంది. ఆ ఉపద్రవం ఎలా ఉందంటే రావణునికి పూర్వం వైకుంఠంలో వనితల చేత కలిగిన అలజడిలా ఉందట. రావణుడిని పదితలల పురుగుగా భావించి వైకుంఠపురంలో నున్న స్త్రీలు ఆట పట్టించినట్లు ఐతిహ్యాలున్నాయి. దానిని ఇక్కడ సందర్భోచితంగా కవి ఉపయోగించి విషయాన్ని రూపు కట్టించాడు.

**24. "అలఘు సంసారాబ్ధినీదు దొంటి యాఁతయినుమడింప" (5-311)**

**కవి పరిచయం:** తెనాలి రామకృష్ణ కవిచే రచించబడిన పాండురంగమాహాత్మ్యములోని 'అయుత నియుతోపాఖ్యానము' అనే పాఠ్యభాగం నుండి గ్రహించబడినదీ వాక్యం.

**సందర్భం :** కప్పగా మారిన అయుతుడు, తాను వద్దని తిరస్కరించిన సంసారాన్నే ఈదవలసి వచ్చిన సందర్భాన్ని చెపుతూ కవి పలికిన పలుకులివి.

**భావము:** హరిదాసాన్ని పట్టుకున్న రాకుమారి కాసేపు పక్షిని ఆడించినట్లు, కాసేపు మెరుపు నాడించినట్లు, కాసేపు బొమ్మను ఆడించినట్లు ఆడించి వినోదించింది. ఆపైన కప్పంటే భయపడే ఒక వృద్ధ బ్రాహ్మణునిపై పడవేసింది. కోపించిన ఆ బ్రాహ్మణుని శాపం వలన ఆ రాకుమారి, ఆమె చెలికత్తెలు కప్పలై, హరిదాసానికి భార్యలైనారు. ఇలా రూపశీలాదులలో తనకు అనురూపలైన భార్యలు లభించారు. ఇదివరకు కప్పలై యుండటం వలన నదీజలాలలో ఈదిన అయుతునికి ఇప్పుడు సంసార జలధిలో రెట్టింపుగా ఈదటం అలవాటయింది – అని కవి వ్యాఖ్యానించి చెప్పాడు.

**25. "సాపత్న్యమెంత కీడు" (5-312)**

**కవి పరిచయం:** తెనాలి రామకృష్ణ కవిచే రచించబడిన పాండురంగమాహాత్మ్యములోని 'అయుత నియుతోపాఖ్యానము' అనే పాఠ్యభాగం నుండి గ్రహించబడినదీ వాక్యం.

**సందర్భం :** రాకుమారితోపాటు, చెలికత్తెలు కూడా బ్రాహ్మణశాపంతో కప్పలుగా మారి హరిదాసానికి భార్యలయిన సందర్భంలో రాకుమారిస్థితిని వర్ణించి చెప్పే సందర్భంలోనిది ఈ వాక్యము.

**భావము:** ఇదివరకు రాకుమార్తెకు బహిఃప్రాణాలుగా నున్న చెలికత్తెలు, మండూక సార్వభౌమునికి రాకుమారి భార్య కాగానే సవతులైనారు. సాపత్న్యత ఎంత కీడైనది? చెలికత్తెలే సపత్నులు కావటం రాకుమారి విషయంలో మరింత విషాదమని తాత్పర్యం.

**26. "మనసు గరగించి మమతలఁబెనఁచెగాన" (5-314)**

**(లేదా)**

**"నిలచెఁబర్యాయ పాత్రతానియమసరణి" (5-315)**

**కవి పరిచయం:** తెనాలి రామకృష్ణ కవిచే రచించబడిన పాండురంగమాహాత్మ్యములోని 'అయుత నియుతోపాఖ్యానము' అనే పాఠ్యభాగం నుండి గ్రహించబడినదీ వాక్యం.

**సందర్భం :** హరిదాసను తన భార్యలతో ఎలా సంసారాన్ని చేస్తున్నాడో వివరించి చెప్పే సందర్భంలోనిదీ ఈ వాక్యం.

**భావము:** వాధూలముని శాపవశాన కప్పయైన అయుతుడు మనసును కరిగించి, ప్రేమలోపడి మన్మథ బాణాల దెబ్బల్ని లెక్కపెట్టుకోసాగాడు. స్వాతి చినుకులు, సముద్రంలోగల ఆలిచిప్పలలో పడి ముత్యాలైనట్లు, ఆ అయుతుని ప్రేమ ఆ కాంతలయందు పర్యాయక్రమంలో (ఒకరి తరువాత మరొకరు) వర్షించిందని తాత్పర్యం.

# ప్రశ్నలు - సమాధానాలు

**అయుతుని పాత్రచిత్రణ:**

ఈ ఉపాఖ్యానంలో అయుతుడు కథానాయకుడు. అయుతుడు ప్రయుతుని కుమారుడు. అగస్త్యమహాముని శిష్యులలో ప్రయుతుడు ఒకడు. ప్రయుతుని సంతానమైన అయుతుడు, నియుతుడు ఇద్దరూ అగస్త్యుని శిష్యరికంచేసి మన్ననపొందారు. వీరిలో అయుతుడు పెద్దవాడు. ఈ ఇద్దరి వ్యక్తిత్వాన్ని గురించి అగస్త్యమహర్షి ఇలా ప్రశంసించాడు.

శా॥ "వాసోనిగ్రహమెన్న రాకలియు నీర్వట్టున్ గణింపర్, తలల్
మాసెంగాయన రంగముల్ బడలినన్ బాటింపరట్లుండనీ
యాసాయంబుగనానిశాత్యయముగానామ్నాయముల్ క్రోల్చుచో
నాసీనప్రచలాయితంబయినలేదాహా! వితర్కింపగన్"

"విద్యాతురాణాం నసుఖం ననిద్రా" - అన్నదానికి ప్రత్యక్షోదాహరణ వీరివర్తనం. ధరించే వస్త్రాలను గురించి గానీ, ఆకలిదప్పుల్నిగాని, పట్టించుకోకుండా నిరంతర అధ్యయనశీలురై, ఒక్కకునికిపాటుకూడా లేకుండా అహోరాత్రాలు గడపటం గురువైన అగస్త్యునికే ఆశ్చర్యం వేసింది.

నిరంతరం మనసును గురువునందే లగ్నం చేసి, హృద్యము, అనవద్యమూనైన జ్ఞానాన్ని గురించే ఆలోచనలు చేస్తూ లోకాన్ని పట్టించుకోకుండా గడుపుతున్న శిష్యులను చూచి వీరిని 'పాణిగ్రహణం' చేసి సత్కరించాలని భావించాడు అగస్త్యుడు. వీరి గుణశీలాదులకు తగిన కన్యలు మానవలోకంలో లేరని భావించిన గురువు బ్రహ్మవద్దకేపోయి, ఆయన మానసపుత్రికలైన గాయత్రి, సావిత్రులను యాచించి తీసికొని వచ్చాడు. ఇలా అయుతుడు, నియుతుడు ఇద్దరూ లోకోత్తర గుణసంపదతో గురువుగారి మన్ననకు పాత్రులై గుర్వనుగ్రహాన్ని విద్యార్థులుగా పొందారు.

**బ్రహ్మచర్యంపట్ల ప్రీతి:**

అయుతునికి బ్రహ్మచర్యాశ్రమం పట్లనే మక్కువ. అందుకే గురువైన అగస్త్యుడు బ్రహ్మమానసపుత్రికలను తెచ్చి పరిణయం చేసికొమ్మని చెప్పినా వినలేదు. తనను వెళ్లగొట్టినా, వెళ్లిపోవటానికి సిద్ధపడ్డాడు గాని గృహస్థాశ్రమానికి సన్నద్ధం కాలేదు. తాను ఆరాధించే దైవంలాంటి గురువు చెప్పినా ఈ విషయంలో మారుమాటలేదు. మనసుమార్చుకోలేదు. హిమాలయ ప్రాంతం చేరి తపస్సుకు సన్నద్ధమై 'గృహితకంటె వేరుకీడుగలదె?' - అని గురువుగారు చెప్పారని నేను ఉరివేసుకోలేను' - అని బ్రహ్మచర్యాన్నే ఎంచుకున్నాడు. చివరికి మారువేషంలో వచ్చిన ఇంద్రుడు ప్రబోధించినా వినలేదు. చివరికి కప్పగా మారిన తరువాత కూడా భగవత్ చింతనను వదలలేదు.

**తపశ్శీలం:**

మణిదర్పణంలాంటి నిర్మలమైన మనస్సుతో అసూయను, తీవ్రమైన వాంఛల్ని విడిచిపెట్టి, బ్రహ్మతత్వాన్ని దీపింపజేస్తూ, వాసన చూడని పుష్పంలాంటి శరీరాన్ని కఠిన నియమాల అగ్నితో వ్రేల్చాడు. ఆ తపస్సుకు లోకాలన్నిటిలో భయాందోళనలు విస్తారంగా చెలరేగాయి. సూర్యుని ప్రకాశం తగ్గటం, భూమి వణకటం, సముద్రాలు పొంగటం, నిప్పులు కురియటం వంటి వైపరీత్యాలు కలిగాయి. దీనిని బట్టి అయుతుని తపస్సు తీవ్రతఎలాంటిదో విదితమవుతుంది.

**అతిథి అభ్యాగతులనాదరించే స్వభావం:**

తపస్స్వాధ్యాయాల పట్ల అప్రమత్తుడై మెలిగే అయుతునికి అతిథి అభ్యాగతుల నాదరించటం సహజంగానే అలవడిన సంస్కారం. అందుచేతనే తాను సాయం సంధ్యోపాసన నిమిత్తం తపస్సునుండి లేచినప్పటికీ, ఎదురుగా కనిపించిన అతిథికి (మారువేషంలోనున్న ఇంద్రునికి) అతిథి సత్కారాలను చేసి ప్రియం కలిగించాడు. సుఖాసీనుడిని చేసి వచ్చిన కారణం అడిగాడు.

**సంభాషణా చాతుర్యం గలవాడు:**

అయుతుని సంభాషణా  చాతుర్యం ప్రత్యేకంగా పరిశీలించదగింది. ఇంద్రుడు కపటమునివేషంలో వచ్చి అయుతుడిని గృహస్థాశ్రమంలో ప్రవేశపెట్టటానికి ప్రయత్నించినప్పుడు అయుతుడిని గృహస్థాశ్రంలో ప్రవేశపెట్టటానికి ప్రయత్నించినప్పుడు అయుతుడు ప్రత్యుత్తరించినతీరును చూస్తే అతని మనస్సులాగే, అతని మాటకూడా గట్టిదే. 'బ్రహ్మగారైన ఒక్కొక్కసారి దారితప్పితే చక్కబెట్టగల వారు మీరే. అటువంటి మీరే యిలా న్యాయంతప్పి మాట్లాడితే ఎవరాపగలరు? నిండుగా పారేయేటిని దారిమరల్చగల వారెవరు? మమకారదూరునికి అన్నదమ్ములని, భార్యామిత్రులని బంధాల్ని ఏర్పరచాలనుకోవటం ధర్మమా? సగం శుభ్రత సగం మైలగల వస్త్రాలు ఎలా పనికొస్తాయి? పూర్తి సన్యాసమో, పూర్తి సంసారమో ఉండాలికాని అటు ఇటూ కాకుండా ఉండటం ఎలా కుదురుతుంది? నిర్మముడైన వాడిని మన్మథుడేమి చేయగలడు? భయంకరమైన మదపుటేనుగు కుంభస్థలంలోని ముత్యాలను ఎవడు గ్రహించగలడు? మరువపు తీగలాంటి శ్రీశుకమహర్షిని గురించి ప్రస్తావించక, ఇతరుల వలన జ్ఞానాన్ని సంపాదించిన జనకుని గురించి చెపుతారు! అంటూ చేసిన ప్రసంగానికి ఇంద్రుడే సమాధానం చెప్పలేక గురువైన వశిష్ఠుడినే తిరస్కరించి చెప్పిన నీకునేనేమి చెప్పగలనంటూ తన ప్రసంగాన్ని ఉపసరింహరించుకున్నాడు.

**సుకుమారహృదయం:**

అయుతునిది సుకుమార హృదయం. ఆ విషయం గురువైన అగస్త్యునికీ తెలుసు. అగస్త్యుడు ఆశ్రమం నుండి వెళ్లగొట్టిన తరువాత గురువును తలచుకొని గురువు చేయమంటే ఎంతటి అసాధ్యమైన కార్యాన్నయినా చేస్తాను. కాని వద్దుమొర్రో! అంటే లింగకాయకట్టే జంగమదేవరలాగా ఈ గృహస్థాశ్రమాన్ని మెడకు తగిలిస్తానని గురువుగారనటం అనుచితమని తలపోసే సందర్భంలో ఈ సుకుమారమనస్కతవెల్లడవు తుంది. ఆ సుకుమార హృదయమే మాయగోవును దగ్గరకు తీసేందుకు పురికొల్పింది. ఆ సుకుమార హృదయమే తాను పోషించే గోవు ఆశ్రమానికి తలనొప్పిగామారి ఆశ్రమంలోని యితరులకు ఇబ్బంది కలిగిస్తోందని కొట్టి అడవిలోకి తరిమివేయడానికి కారణమయింది.

**భూతదయ:**

'అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవచ' – అన్న భక్తియోగ సాధక లక్షణం అయుతునిలో ఉంది. సర్వభూతహితకాంక్ష ఉండబట్టే 'కపటిగోవు' అని తెలియక నిజంగా బాధపడే జంతువని భావించి పడియున్న దానిని లేవనెత్తాడు. అయుతుడు ఆ ధేనువుకు చేసిన సేవను గమనించండి.

చ॥ "పదములకొంకువోఁబిసికి ప్రక్కల స్రుక్కెడలించిదంశవం
శదమనవృత్తినింపొసఁగి సాస్నసఖంబులదువ్వి నెత్తురుల్

చిదికెదుగంట్ల భూరజముఁజిల్కి ముఖస్థతృణంబు ద్రోచియ
మ్మొదవుమృదుక్రియన్ నడపి ముంగిటఁ బందిటిరాటఁ గట్టుచున్”

కొంకర్లు పోతున్న ఆవు కాళ్లను ఒత్తి సరిచేయటం, మూగే ఈగల్ని త్రోలి ఉపశాంతి కలిగించటం, గోళ్లతో గంగడోలును దువ్వటం, రక్తమోడే గాయాలపై దుమ్ము చల్లటం, నోటిలోని గడ్డిపరకల్ని లోనికి తోయటం వంటి వన్నీ జంతువుపట్ల అయుతుడు చూపే ప్రేమకు నిదర్శనం. క్రమంగా ఆ జంతువుపట్ల ప్రేమ పెరిగి తపస్సాధనకు ప్రతిబంధకమైంది. పడిపోతున్న గోవును పట్టుకొని, ఎత్తడానికి పాల్పడుతూండటం వల్ల ఆ సనాభ్యాసనైపుణి పట్టుసడలిపోయింది. గడ్డిపోచల్ని యేరి కానుకగా తినిపించే పనిలో ఉండటం చేత కుశల సంగ్రహణ కార్యంకుంటుపడింది. మెడతాడు వదులైనప్పుడెల్లా బిగించటం మొదలుపెట్టాక జపమాల తిప్పే కాకుల్ని అదిలించటానికి చేసేహుంకృతులతో మంత్రోచ్చారణ పారిపోయింది. ఇలా ఆవు ఒక లంపటమై, అయుతుని భూతదయకు భూతమై పీడించింది.

**విధివంచితుడు:**

తానొకటి తలచిన దైవమొకటి తలచిందన్నట్లు అయుతుని జీవితం, అయుతుని లక్ష్యాన్ని కనుగుణంగా సాగలేదు. దుస్సహదుఃఖ భాజనమై ఏ గృహస్థాశ్రమాన్నయితే వద్దని తపస్సుకు కూర్చున్నాడో, ఆతపస్సు భంగమై రూపాంతరంలో అదే గృహస్థాశ్రమాన్ని వరించకతప్పలేదు. గురువైన అగస్త్యుని కోపానికి గురై ఆశ్రమాన్ని వదలి హిమాలయ ప్రాంతాలకు వెళ్లవలసివచ్చింది. అక్కడ ఇంద్రుని మాయగోవువలన వాధూలముని శాపానికి గురై కప్పుగా మారిపోవలసివచ్చింది. చివరికి తనలా కప్పలాగా మారిన కన్యాకుబ్జరాకుమారిని ఆమె చెలికత్తెల్ని పరిణయమాడి బహుసంసారియై, సంతానాన్ని గని, చివరకు విష్ణుపదాన్ని పొందాడు. ఇలా తానుకోరుకున్న విధంగా జీవితం సాగలేదు. అగస్త్యుడివలన కొంత వాధూలముని వలన మరింత జీవితం మారి సమస్యలనెదుర్కొన్నప్పటికీ తాను కోరిన ముక్తిని పొందగలిగాడు.

**అతిశయప్రకృతి:**

అయుతునిది అతిశయప్రకృతి. అందుకే బ్రహ్మచర్యం పట్టి తీవ్రమైన పట్టుదల. స్త్రీజాతిపట్ల తీవ్రమైన వ్యతిరేకత. గృహస్థాశ్రమాన్ని ఒల్లనని, వేయివిధాలుగా తలపోస్తాడు. ఆ తీవ్రతే కపట బ్రాహ్మణవేషంలో వచ్చిన ఇంద్రునితో కూడా “ఒకటికిఁబదియుఁబదింటికి నొక మాఱనుగాగ’ కపటమునివేషంలోనున్న ఇంద్రుని మాటలకు చలించకుండా మాట్లాడాడు. ఆ పట్టుదల, తీవ్రతలు అవతలివ్యక్తిని కొంతమేరకు అభినందింపచేసినా, ఆపైన కోపింపచేస్తాయి. అదే అయుతునికి శాపమై గోరూపంలో మెడకు చుట్టుకుంది.

ఆవును అంతగా ప్రేమించి, ఆదరించిన వ్యక్తి ఆవుదుశ్చర్యలకు కినిసి, దానిని వదలించికోవాలని భావించి చేసిన చర్యలు విపరీతంగా అనిపిస్తాయి. “దీని తోక దండమవుతుందా? దీని పొదుగు అమృతవారి నింపిన కమండలమవుతుందా? ముక్కుపుటాలు భూబిలాలా? దీనిగంగడోలుగోచీపేలికయా? అంటూ లంకెవేశాడు. మెడపై చర్మం ఊడి వచ్చేలా బిగించి, మెడలో గుదిబండను కట్టాడు. తలత్రాడు పట్టుకొని ఆ ఆవును చేతిలో పట్టుకొని దయ్యాన్ని వదిలించే విధంగా ఆ ఆవును వెళ్లగొట్టాడు. ఆ గోవులంకె, మెడలోగుదిబండవలన కలిగే బాధ తట్టుకోలేక పెద్దగా అరుస్తూ, విచ్చలవిడిగా తిరిగి వాధూలమునిని తొక్కింది. అంత ప్రేమగా చూచిన వ్యక్తేనా? ఇలా గోవుని హింసించి మరీ అడవిలోకి వదిలిందని అనిపిస్తుంది. తీవ్రప్రకృతిగల వారే ప్రేమను, తిరస్కారాన్ని ఇంతబలంగా చూపిస్తారు. ఇక్కడ, అయుతుని వ్యవహారంలో కనిపించేది ఆ తీవ్ర స్వభావమే.

**కప్పుగా ఉన్నప్పటికీ వీడని ధార్మిక జీవనం:**

అగస్త్యుని ఆజ్ఞతో హిమాలయాలకు పోయి తాపసవృత్తితో నియమబద్ధజీవనాన్ని గడుపుతున్న అయుతుడు వాధూలముని శాపంతో కప్పగా మారిపోయాడు. కప్పగా మారిన అయుతుని జీవన విధానాన్ని గమనించండి. హరిదాసం సూర్యోదయానికి ముందే సంగమతీర్థంలో మునిగి స్నానమాచరించేది. ఆ ఇసుకతిన్నెలపై కూర్చొన్న మునులు చదివే వేదాన్ని తగినచోట కూర్చొని కొంత ప్రొద్దెక్కేదాకా వినేది. మధ్యాహ్నవేళ ఆ దేవుని బలిపీఠం వద్ద వేసిన వింత పులగాన్ని మితంగా తినేది. సాయంసంధ్యనుండి అర్ధరాత్రి వరకు స్వామి సన్నిధిలో గడిపేది. నృసింహుడు శేషశయ్యపై విశ్రాంతికి మేనువాల్చగానే, ఆయన పదరాజీవాల వద్దనున్న బిలంలో పరిపూర్ణమైన చింతనతో జాగరణ చేసేది. తెల్లవారు జామున ఆస్వామి ముంగిట వేసే ముగ్గులవద్ద కప్ప శరీరం రంగుల పూలగుత్తిగా భాసించేది. చూసేవాళ్లంతా 'హరిదాస'మనే పేరుతో ఆ కప్పను పిలిచేవారు. పూర్వస్మృతితో, మోక్షదృష్టితో కప్ప జీవనం సాగించింది.

**గార్హస్థ్య జీవనం:**

ఏ గృహస్థాశ్రమాన్నయితే వద్దనుకున్నాడో ఆ గృహస్థాశ్రమం వల్లనే మోక్షం సిద్ధిస్తుందని అయుతుడు ఊహించలేదు. వాధూలముని కప్పగా మారమని శపించి, సంసారియై సంతానాన్ని కన్నప్పుడే శాపవిమోచనమని వరమిచ్చాడు. కప్పగా నృసింహ స్వామి సన్నిధిలో జీవిస్తున్న హరిదాసం, కన్యాకుబ్జపు రాకుమారికంటపడటం, చెలికత్తెలతో సహా హరిదాసాన్ని పట్టుకోవటానికి ప్రయత్నించటం, చివరికి రాకుమారి పట్టుకొని దానితో ఆడుకోవటం, ఆపై ఒక బ్రాహ్మణునిపైకి ఆమె కప్పను విసరివేసి, ఆతని శాపానికి గురై తాను చెలికత్తెలు అందరూ కప్పలుగా మారి హరిదాసానికి పత్నులై అనురాగజీవనం గడపటం విచిత్రమైన సంఘటన. హరిదాసపు దాంపత్య జీవనాన్ని గమనించండి.

ఉ॥ నున్ననిమోము మీసముల నూఁగును జెన్నటిగాకమున్న మా
యన్నవుగా! గృహస్థులకు నగ్రణివై మనుమంచుమున్ను వే
గన్నుల వేల్పుదెల్పనది గాదని వాదముసేయు ధైర్య సం
పన్నుడు దేర్పఁగా దొడఁగె బాదనతింగుతికక్రియాతతిన్" (5-313)

యౌవనపు తొలి రోజులలో దేవేంద్రుడే వచ్చి 'అన్నా! గృహస్థాశ్రమం స్వీకరించి అగ్రగణ్యుడవై వెలుగొందమని ప్రాధేయపడితే, కాదు పొమ్మంటూ వాదించిన ధైర్యశాలి చివరికెలా అయిపోయాడంటే, ఆ కప్ప సతులు అలిగితే వారి పాదాలకు నమస్కరించి వేడుకొని మరీ ప్రసన్నం చేసుకునే స్థితిలోనున్నాడు.

చివరికి సంతానాన్ని గని హరిపదాన్ని చేరుకుంటాడు.

స్థూలంగా పరిశీలిస్తే అయుతుని జీవితంలో నాలుగు దశలు కనిపిస్తాయి.

1) అగస్త్య మహాముని శిష్యునిగా, గురుని ప్రేమను పొందినవానిగా

2) అగస్త్యుని కోపానికి గురై హిమాలయాలకు చేరి తాపసిక వృత్తిలో గడిపే నియమవ్రతునిగా

3) వాధూలమహాముని శాపగ్రస్థ జీవనుడైన కప్పగా

4) కన్యాకుబ్జ రాకుమారి ఆమె చెలికత్తెలతో కలిసి జీవితాన్ని పంచుకుని గృహస్థాశ్రమంలో గడపటం.

అయుతుని పట్ల అగస్త్యునికున్న ప్రేమ కారణంగానే శపించకుండా తన ఆశ్రమం నుండి పంపించాడు. ఇంద్రుడు కూడా మార్గాంతరంలో కామధేనువు చేత పని జరిపించుకున్నాడు తప్ప ప్రత్యక్షంగా అపకారం

చేయలేకపోయాడు. వాధూలముని తొలుత శపించినా, తరువాత తనదివ్యదృష్టితో వాస్తవం తెలిసికొని తరుణోపాయాన్ని చెప్పి పరోక్షంగా ముక్తికి మార్గం చూపాడు. ఏతావాతా అయుతుని పాత్ర ముక్తిసోపానక్రమాన్ని సాధించిన తీరులో గృహస్థాశ్రమ ప్రాశస్త్యాన్ని గమనించాలి. అందుకే చివరకు ఈశ్వరునిచేత నారదునికి యిలా చెప్పిస్తాడు.

"గృహమేధి ధర్మవర్మా
సహమతియగుకుమతియయుతుచందమున సుదు
స్సహదుఃఖగ్రాహోనన
గుహఁబడును....." (5-318)

**మీ పాఠ్యభాగమాధారంగా తెనాలి రామకృష్ణుని కవితారీతుల్ని వివరించండి.**

తెనాలి రామకృష్ణునిపేరు చెపితే అందరికీ స్ఫురించే కావ్యం పాండురంగమాహాత్మ్యం. రామలింగడు, రామకృష్ణుడై రచించిన కావ్యమిది. ఈ పాండురంగమాహాత్మ్యంలో అయిదాశ్వాసాలున్నాయి. ఇదొక క్షేత్రమాహాత్మ్యకావ్యం. ఇందులోని పంచమాశ్వాసంలోని కథే అయుతనియుతులనే మునికుమారుల చరిత్ర.

అయుతనియుతోపాఖ్యానమే ఒక స్వతంత్ర ప్రబంధంలాగా అనిపిస్తుంది. ప్రబంధ లక్షణాలలో ప్రధానంగా చెప్పుకోవలసింది వర్ణనా బాహుళ్యం. కథ స్వల్పంగా ఉండటం, శృంగారవీరాలలో ఏదో ఒకటి ప్రధానంగా ఉండటం. కానీ ఈ ప్రబంధంలో ధర్మవీరం ప్రధానమై, శృంగారం అంగరసమై అలరారుతున్నది. అద్భుతరసం కొట్టొచ్చినట్టుగా కనిపిస్తుంది.

రామకృష్ణునికవిత్వతత్త్వాన్ని గురించి చెపుతూ విశ్వనాథసత్యనారాయణగారు "రామకృష్ణుడు సురారామగజము" – అన్నారు. నందనోద్యానంలో తిరిగే ఐరావతంలాంటిది ఆయన కవిత్వపుశైలి అని తాత్పర్యం. 'పాండురంగవిభుని పదగుంఫనము' – అని ప్రసిద్ధ చాటూక్తి. ఇవి కాక కృతిపతి తనను ప్రశంసించినట్లు చెప్పిన పద్యాలలో తనను తాను అంచనావేసికొని చెప్పినట్లు స్వీయకవిత్వ లక్షణాన్ని చెప్పటమూ కనిపిస్తుంది. అలా తనను గురించి చెప్పిన

మ॥ ఉదయంబస్తనగంబు సేతువు హిమవ్యూహంబునున్ జుట్టిరా
విదితంబైన మహిన్ మహేంధ్ర కవితా విద్యాబలప్రౌఢి నీ
కెదురేరీ! సరసార్థబోధ ఘటనాహేలాపరిష్కార! శా
రద నీరూపము రామకృష్ణ కవిచంద్రా! సాంద్ర కీర్తీశ్వరా! (1-27)

సీ॥ తగ సంస్కృతము దెనుంగుగఁ జేయఁ దెనుఁగు సం
స్కృతముగఁ జేయగఁ జతురమతివి
నలుదెఱుంగుల నెన్నఁగల కావ్యధారల
ఘనుడవాశువు నందుఁ గరము మేటి
వఖిల భూమీపాల కాస్థానకమలాక
రోదయ తరుణ సూర్యోదయుఁడవు
శైవవైష్ణవ పురాణావళీ నానార్థ
రచనాపటిష్ఠైక రమ్య మతివి

తే.గీ. ఆంధ్రభూమి కుచాగ్రహారాభమైన
శ్రీతెనాల్యగ్ర హారనిర్ణేత వగ్ర
శాఖికాకోకిలమవేపు సరసకవివి
రమ్యగుణకృష్ణ! రామయ రామకృష్ణ! (1- 23)

ఉ॥ స్కంద పురాణ నీరనిధి కౌస్తుభమై ప్రభవించు దేవకీ
నందను సత్కథోదయము నవ్యకవిత్వకళాకలాపమన్
కుందనమున్ ఘటించి కడు క్రొత్తగు సొమ్మొనరించి, విష్ణు సే
వందులకించు నప్పరమవైష్ణవకోటి నలంకరింపుమా? (1-26)

ఈ పై పద్యాలను పరిశీలించినప్పుడు రామకృష్ణుని కవితా లక్షణాలను ఇలా క్రోడీకరించి చూడవచ్చు.

1. పదగుంఫనం
2. స్వేచ్ఛా విహారం (స్వతంత్రశైలి)
3. సరసార్థఘటనా హేలా పరిష్కారం
4. నవ్యకవిత్వ కళాకలాపం
5. సంస్కృతాన్ని తెలుగుగా తెలుగును సంస్కృతంగా చేయగల చాతుర్యం
6. వివిధ పురాణార్థాల్ని సంఘటించే నేర్పు.

ఈ లక్షణాల్ని అయుతనియుతోపాఖ్యానంలో ఎలా ఉన్నాయో పరిశీలించి చెపితే అది రామకృష్ణుని కవిత్వాన్ని దాని తత్త్వాన్ని వివరించి చెప్పినట్లే అవుతుంది.

**పదగుంఫనం:**

పదాల్ని కూర్చటమే పదగుంఫనం. దీనినొక కవితా లక్షణంగా లాక్షణికులెప్పుడూ చెప్పలేదు. వామనుడు 'విశిష్టపదరచనారీతిః' – అనే నిర్వచనం, పదగుంఫనకు సమానంగా కనిపిస్తుంది. కాని రామకృష్ణుడు రీతి కవి కాదు. పదగుంఫనం ఎలాంటిదంటే మాలనల్లేవాడు ఏకుసుమాన్ని ఎక్కడ పెట్టి అల్లితే దండ అందగిస్తుందో, మరువాన్ని ఎలా పూలతో కలిపి అల్లితే శోభ వస్తుందో తెలిసి అల్లినట్లు రచయిత సమాస కల్పనలో, వర్ణవిన్యాసంలో, నూత్నపదనిర్మాణంలో, జాతీయాలు – లోకోక్తుల్ని వాడటంలో చూపే నేర్పే పదగుంఫనం.

ఈ అయుతనియుతోపాఖ్యానంలో గమనిస్తే రామకృష్ణుని పదగుంఫనవైశిష్ట్యం అడుగడుగునాకనిపిస్తుఇంది.

పాణిగ్రహణమనటానికి 'పాణిపీడనవిధానం' (5–170) మనటం, మునిశ్రేష్ఠుడనటానికి 'జటిలవ్యాఘ్రు' మనటం, సిగ్గులేని వారనటానికి 'నానగండ'లనటం (5–182) బ్రహ్మ అనటానికి 'పుట్టికి యోవరింజదువు పుత్తడి హత్తిన పెద్ద' (5–218) – అనటం, పూరీజగన్నాథుడిని 'వార్ధినేతెంచిన కొయ్యవేల్పు' (5–196) అని, మన్మథుదుని 'బోయపూవిలుతుడు' (5–212) అని అనటం – ఇలా రామకృష్ణుడు తన ముద్రను చూపాడు.

**సమాసకల్పనం:**

వర్షాభూవిభుడు (5–306), భేకరూపకూపబింబితుడు (5–307), దరహాసరసము (5–209), విచ్చు ఎచ్చుకంటివాడు (5–197), దితిపుత్త్రచేతఃకుకూల దహన (5–281), దుర్ధురపట్టభద్రుడు (5–302), శాపపుటిర్లు

(5-316), స్వాతిమేఘంబు చినుకులు (5-315), తొంటిపుట్టు (5-305), మమకారనది (5-305), తురుమువిరిదండుయురి (5-304), చంపకపుష్పనాసికల్ (5-303), పొదల పొదల యొదలి తపసిపుట్టువున్ (5-294), నయగానిఈడ్పు (5-294), ఆకవిరితోటన్ (5-294), కన్నెగేదఁగిఁతేకుకత్తులబోను (5-281)

ఇలా సమాసనిర్మాణంలో రామకృష్ణుని ముద్రను గమనించవచ్చు. పైన పేర్కొన్న సమాసాలలో సంస్కృతాచ్ఛిక మిశ్ర సమాసాలతోపాటు వైరిసమాసాలుకూడా ఉన్నాయి.

రామకృష్ణుని పదగుంభనరీతి వక్రోక్తితో ముడివడికనిపిస్తుంది. అలంకారాలన్నీ ఔపమ్యమూలకాలు. పదగుంభనంలో వర్ణపదసమాస వాక్యాలకూర్పులో ఉక్తివక్రత మాటిమాటికి తొంగిచూస్తుంటుంది. "ఒక పదంలోనో, విగ్రహవాక్యంలోనో ఏదో వైచిత్రిలేనిదాయనకు సమాసమే కుదరదు. ఈతని రచనలో వక్రోక్తి యొక గొప్పవిద్య. ఈ గారడీ శ్రీనాథునిలో ముమ్మరం. శ్రీనాథునినుండే రామకృష్ణుడు దీనిని నేర్చుకొన్నప్పటికీ సంపూర్ణంగా ఆగుణాన్ని స్వాయత్తీకరించుకొని యామేలిమి తనదే యనిపించుకొన్నాడు. ఈ వక్రోక్తిని వాడినప్పుడు కవి ఏమి చెప్పకున్ననూ యేమో చెప్పినట్లు పాఠకులను భ్రమింపజేసే యోగ్యత దానికున్నది" (పుట్టపర్తి నారాయణాచార్యులు) ఈ పదగుంభనమనేది శాబ్దికశైలికి సంబంధించింది. ఏమి చెప్పకున్నా ఏదో చెప్పినట్లుండటం సమాసవక్రత. సందర్భోచితశైలి కూడా సమాసవైరళ్యాన్ని గాఢత్వాన్ని తెలుపుతూ ప్రకరణవక్రతను శైలీపరంగా సూచిస్తుంది. శైలీవక్రతలో ఉపమానవాచక చమత్కారాలు, పర్యాయోక్తులు వంటి అలంకార స్వభావాలు ఇమిడి యున్నాయి.

ఇలా గమనించినప్పుడు ఈ అయుత నియుతోపాఖ్యానంలో వాడిన అర్థోక్తోలు, అర్థాంతరన్యాసాలు, ఉపమానవక్రతలు, రామకృష్ణుని విశిష్టతను తెలియజేస్తాయి.

తన శిష్యులకోసం కన్యకల్ని తీసుకురావటానికి బ్రహ్మవద్దకు పోయినపుడు; బ్రహ్మను వర్ణించే సందర్భంలో బ్రహ్మను మేరుపర్వతంతో ఉపమించి, సరస్వతిని, వాహనాన్ని, ఆసనాన్ని, ఆభరణాల్ని అన్నిటికీ చెప్పిన ఉపమాద్రవ్యం మేరుపర్వతపు ఆలంబనంగానే సాగాయి. చంద్రరేఖను చేపట్టిన మేరువులాగా హంసవాహనంతో ప్రకాశించటం, శరత్కాల మేఘాలంటిన మేరువులాగా ఆభరణాలతో ప్రకాశించటం, దిగ్గజాలు మోస్తున్న మేరువులాగా పద్మాసనంపై కనపించటం వంటి వర్ణనలలో రామకృష్ణుని ఉపమానద్రవ్యపు విశిష్టత తెలుస్తుంది. అయుతుడు తపస్సుకు కూర్చున్న సందర్భంలో స్త్రీలను గురించి చేసిన తలపోతలు, మారువేషంలో ఉన్న ఇంద్రుడు, శాపావసానం చెప్పిన వాధూలముని చేసిన గృహస్థాశ్రమవర్ణన, వాధూలముని శాపానంతరం పండరికి పోయి అక్కడి దేవతల్ని గురించి అయుతుడు చేసిన స్తుతిపూర్వక వర్ణనలోనూ, కన్యాకుబ్జరాకుమారి చెలికత్తెలతో కలసి చేసిన విహారం, జలక్రీడలు - వీటన్నింటిలో రామకృష్ణుని ప్రౌఢమైన భావనాశక్తి కనిపిస్తుంది.

**అర్థోక్తులు - సామెతలు - నానుడులు:**

"అడవులనవయుతపస్వికి
గడు సాఖ్యమెగోరు సతికిఁగలయిక తగునే" (5-183)

"మొఱ్ఱోయనంగ లింగంబుగట్టు జంగమన
నంగనలఁగూర్పఁజనదు" (5-184)

"అఖిలధర్మంబులందుగార్హస్థ్యమెన్ననుత్కటంబు" (5-194)

"గైకొనమడుగుసగము, మైలయుసగమే" (5-220)

"చిమ్మెట సింగమె, గాజు రత్నమే" (5-224)

"సంపదచేతఁగానికొనసాగవు సువ్వెగృహస్థధర్మముల్" (5-224)

"ఈబింబోష్ఠులందెల్లనానందాభాసమెగాక భాసిత చిదానందంబు పెంపొందునే?" (5-225)

"గుడిమ్రింగువానికి తలుపులప్పడములు" (5-229)

"వాసికిమంగలికత్తిమ్రింగెదు" (5-230)

"అకార్యకరణశీలుర కెప్పాటగలదె సుఖము" (5-238)

"బీద బలిసిబందికాడగు విధంబున" (5-239)

"కర్మములపోకకు భోగమె హేతువు" (5-260)

ఇలా సందర్భోచితంగా ప్రస్తావించిన సూక్తిముక్తావళి పదగుంఫనంలో భాగమే.

**అలంకారాలు:**

అలంకారాలు కవి ప్రౌఢోక్తిలో భాగమే. ప్రౌఢోక్తికూడ పదగుంఫనంలో భాగమే.

కన్యాకుబ్జరాకుమారి హరిదాసమును పట్టబోయినప్పుడు "యువజనుల్ని తనహావభావవిలాసాలవలలో పడవేయ గలిగిన అలినీలవేణి, తనసిగపూలమాల అనే ఉరితో కప్పను పట్టుకోవటానికి ప్రయత్నించి చిక్కించుకోలేక తానే చిక్కుల్లో పడింది" (5-304) – అన్నప్పుడు విషమాలంకారం.

"సంపదచేతగాని గృహస్థజీవనం సాగదు. ఆ సంపద పూర్వజన్మ సుకృతంవలనగాని సాగదు. ఆ సంపద మహాత్ముడినైనా మదాంధుడిని చేస్తుంది. కాబట్టి గృహస్థజీవన వ్యర్థగాథలతో తనను మభ్యపెట్టవద్దని (5-224) చెప్పటంలో కారణ మాలాంలంకారము కనిపిస్తుంది.

'గుడిమ్రింగే వానికి తలుపులప్పడాలైనట్లు, అగస్త్యుని ఆజ్ఞనే ధిక్కరించినవానికి నామాటలెంత' – అని కపట బ్రాహ్మణ వేషంలోనున్న ఇంద్రుడు అనటంలో (5-229) లోకోక్త్యలంకారము, బ్రహ్మ అగస్త్యుని స్తుతించిన 'హుంకారములు లేవె... (5-176) అనే పద్యంలో ఉదాత్తాలంకారం, గాయత్రీ సావిత్రులతో నియుతుడు కాపురం చేశాడని చెప్పే సందర్భంలో వర్ణించిన వారి బహిరంతర సౌందర్యంలో అర్థాపత్తి అలంకారము అలరిస్తాయి.

కపటత్రైర్థిక వేషంలో వచ్చిన ఇంద్రుని వెంట వచ్చిన గోవును "అతిస్నిగ్ధవర్ణముగ్ధాకృతియు, చతుర పదవిన్యాస ధన్యాసికయునై సుకవితయుంబోలె" (5-192) – ఉన్నదని చెప్పటంలో ఉపమ ఊసులాడుతుంది.

పాండురంగక్షేత్రంలో ఉత్తర దిక్తటమునందున్న నృసింహుని అయుతుడు స్తుతించిన

"మమ్మటమైన వాడిఁబలి మిత్రములై వెలుగొందు...(5-278)

అనే పద్యంలో లక్ష్మీదేవి వక్షోజకాఠిన్యం సున్నితంగా చెప్పబడింది. ఇందులో ఆక్షేపాలంకారముంది. తరువాతి "కోపవికార మంచు" (5-279) అనే పద్యంలో అభేదరూపకముంది.

ఇంద్రుడు తన హితబోధ వ్యర్థమైనదని అయుతుని నిందించే సందర్భంలో 'పందకుంబోటులో భగ్రస్తునకునీగి...(5-229) అనే పద్యంలో వ్యాజస్తుత్యలంకారము ఉంది.

ఉత్ప్రేక్ష, శ్లేష రెండూ కలిసియున్న ఈ పద్యాన్ని గమనించండి.

తే॥గీ॥ సర్వతీర్థప్రదేశ ప్రశస్తమతికి
గాంచిదవులుట దనకర్థమంచు నొక్కొ?
తవులుపడియుండె వరుణదంతావళంబు
పడతి యురిజేసిమెడచుట్టు పసిడిరశన (5-310)

ఈ పద్యం కన్యాకుబ్జరాకుమారి హరిదాసాన్ని పట్టుకున్నప్పటి సందర్భంలోనిది. 'సకల తీర్థ ప్రాశస్త్యాన్ని తెలిసిన ఆ కప్ప అన్ని తీర్థాలలో కాంచీపురం శ్రేష్ఠమైందని భావించికాబోలు ఆమె కాంచి (మొలనూలు, కాంచీపురం) కి తవులు వడిందని కాంచిశబ్ద శ్లేషతో అలంకారాన్ని ప్రౌఢోక్తితో సాధించాడు.

ఇంకా ఎన్నో ఉపమలు, రూపకాలు రామకృష్ణ కవి పదగుంఫనశైలిని పట్టి చూపుతున్నాయి.

**సరసార్థఘటనా హేలాపరిష్కారం:**

నీరసఘట్టాన్నయినా సరే! సరసార్థాన్ని ఘటించి చెప్పటంలో కవి శక్తిసామర్థ్యాలు తెలుస్తాయి. పాండురంగమాహాత్మ్యం గృహస్థాశ్రమ ధర్మవిశిష్టతను చెప్పటానికి ఉద్దేశించింది. అయుతుడు గురువు తెచ్చిన కన్యల్ని పరిణయమాడనని మొందిపట్టుపట్టాడు. గురువుకు కోపం వచ్చింది. మాటవినని శిష్యుడిని శపించవచ్చు. కాని ఋషిమనసులోని ఆ ప్రేమ శిష్యుడిని శపించనీయలేదు. ఆశ్రమం నుండి బహిష్కరించాడు. గురువు కోపాన్ని తప్పించుకున్నా కారణాంతరాలతో అదే శాపాన్ని వాధూలమునిరూపంలో తీవ్రంగా అనుభవించకతప్పలేదు. ఏగృహస్థాశ్రమాన్నయితే కాదని గురువును, బోధింపజూచిన యితరులను తిరస్కరించాడో అదే గృహస్థాశ్రమాన్ని మార్గాంతరంలో తప్పనిసరి పరిస్థితులలో స్వీకరించక తప్పలేదు.

కథలో అగస్త్యుని కోరికను, ముచ్చటను తిరస్కరించి మొండిగా బ్రహ్మచర్యంతో తాపసవృత్తికి అంకితం కావాలనుకొన్న అయుతునికి ఇంద్రుడు మారువేషంలో వచ్చి ప్రబోధించి, అలవిగాక మాయగోవును అయుతుని ఆశ్రమంలో వదలి, ఆ యావుపట్ల జడభరతునిలా ఆకృష్టుడై, మళ్ళీ దాన్ని వదలించుకోనెంచి చేసిన ప్రయత్నంలో అసంకల్పితంగా వాధూలముని శాపానికి గురవటం, పండరీక్షేత్రంలో కప్పగా జీవిస్తూ, కన్యాకుబ్జరాకుమారి తనలా కప్పగా మారి ప్రణయజీవన రక్తుడిని చేయటం, వద్దన్న సంసారంలోనే మునిగిపోవటమనే సంఘటనలన్నీ సరసార్థఘటనలే! సావిత్రీగాయత్రులవర్ణనం, కన్యాకుబ్జ రాకుమారి ఆమె చెలికత్తెల విహారాదులన్నీ కథను రసవంతంగా చేశాయి.

కవిత్వమెంతబాగున్నా సన్నివేశనిర్మాణంలో కవి చమత్కారం చూపకపోతే అది పాఠకునికి విసువు పుట్టిస్తుంది. కథలో ముందేమి జరుగుతుందో అనే ఆకాంక్ష పాఠకునికి అడుగడుగునా కలిగించి, చివరకు అన్నిటినీ ఒకచోటకు తీసుకరాగలగాలి. బీజము ఫలవంతమయ్యే విధంగా సన్నివేశకల్పనం చేసి, వాటిని సరసార్థబోధకంగా సంఘటించి

క॥ "మునిపతికి రాజసుతకును
తనయుడు జన్మించె; నంతఁవచ్చాపపుటి

ర్లను విరిసె; జ్ఞానచంద్రుడు
గనుపట్టెన్, విష్ణుపదముగానఁగవచ్చెన్"

అని సంతానభాగ్యంతో, తన జీవితాశయైన విష్ణుపదాన్ని చూశాడన్న ఫలప్రాప్తితో, సమస్యకు పరిష్కారం చూపాడు. ఆ చూపటంలోనే రామకృష్ణుని హేల కనిపిస్తుంది.

అయుతుడు కోరుకున్న ముక్తిపథాన్ని శాపావసానంగా పొందటానికి, అతడు నిరసించిన ధర్మమే సాధకమైంది. ఇది ప్రబంధవక్రతలో భాగం. ఆ వక్రతద్వారా సరసార్థబోధఘటనను సంఘటించటం రామకృష్ణుని హేల. ఇందులో కన్యాకుబ్జరాకుమారి, చెలికత్తెల విహారాదులు, కపటవిప్రుని వెంట కపటపు గోవురావటం, ఆ గోసంరక్షణలో అయుతుడు తపస్స్వాధ్యాయాలను వదలివేయటం, వాధూలమహాముని శాపమూలకంగా గోవు ఆపదగా పరిణమించటం వంటి వన్నీ సంఘటనలే. ఇవన్నీ కార్యకారణ సంబంధంతో సంఘటించబడి, పరోక్షంగా అయుతుని విష్ణుపదానికి నడిపించాయి. అలా కూర్చటంలో రామకృష్ణుని నేర్పు ప్రత్యేకంగా గమనించదగింది.

**శైలి:**

తెనాలి రామకృష్ణుడు స్వేచ్ఛగా విహరించే నందనోద్యానపు ఐరావతంలా యథేచ్ఛగా రాస్తాడు. సాధారణంగా ప్రబంధకవులలో పెద్దన, తిమ్మన, రామరాజభూషణుడు వంటి వారు రీతి కవులు. రీతి వారి శైలిలో ప్రధాన లక్షణం. రామకృష్ణుడు రీతికవికాడు. ఎంతో సీరియస్‌గా నడిచే సందర్భంలో హాస్యోక్తితో చతురతను ప్రదర్శించటం స్వేచ్ఛాప్రవృత్తిలో ఒక లక్షణం. ఉదా॥కు అయుతనియుతులిద్దరూ ఎంతో గొప్ప గుణసంపన్నులని అగస్త్యుడు భావించే సందర్భంలో 'ఆసీన ప్రచలాయితంబయినలేదు' – అనటం, చెలికత్తెలతోపాటు కన్యాకుబ్జరాకుమారి హరిదాసానికి భార్యలై రాకుమారికి శత్రువులయ్యారు, 'సాపత్న్యమెంతకీడు' – అనటం వంటి సందర్భాలు రామకృష్ణుని ప్రవృత్తిని తెలుపుతాయి.

పద్యాలలో కూడా ఎత్తుగడ, నిర్వహణంలో విచిత్రమైనశైలి. సీసపద్యనిర్మాణంలో ఒకదానికి మరొకదానికి ఛందస్సులో తప్ప నిర్మాణరీతిలో పోలిక కనిపించదు.

సీ॥ "శశిరేఖగైకొన్న సౌవర్ణగిరివోలె
మినుకుఁజేడియఁగుడిమెఱయువాని" (5–174)

ఇది బ్రహ్మలోకంలో బ్రహ్మను వర్ణించేది. పూర్వపాదంలో ఉపమానం, రెండవపాదం ఉపమేయం.

సీ॥ "హుంకారములు లెవెయుప పురందరహాతో
త్పాటవంబునకుఁ బాల్పడవుగాక" (5–176)

ఇది అగస్త్యుడిని ఉద్దేశించి బ్రహ్మచేసిన ప్రశంస. పూర్వఖండంలో అగస్త్యుడి చర్యను రెండవ ఖండంలో దాని ఫలితం చెప్పటం కనిపిస్తుంది.

గునుగుసీసంలా ఏపాదానికాపాదం తెగిపోకుండా రాసిన సీసపద్యం

సీ॥ "అనియాదరించి యమ్ముని వచ్చుటకుఁబ్రయో
జనముఁదద్విశదోక్తి సరణిఁదెలిసి (5–178)

ఈ పద్యం 'అనియాదరించి' – అని ప్రారంభం కావటమొక వచనంలో కథను చెప్పటానికి పూనుకొన్నట్లుంది.

సీ॥ కుటిలాలకములు చీకటి ప్రోగులగుcనైన
చిచ్చంద్రికాఢ్యముల్ చిత్తుగతులు (5–180)

పూర్వఖండానికి, ఉత్తరఖండానికి భావవైరుధ్యాన్ని చెప్పి సరసార్థాన్ని సంఘటించటం ఇందులోని చమత్కారం.

సీ॥ "ఉర్విధరములెక్కి యుఱుకనే కుచకుంభ
యుగమొల్లcగాక తానుఱుకుమనిన" (5–184)

విధి, నిషేధాలను ఏకపాదంలో సంఘటించి చెప్పటం ఇందులోని విశిష్టత.

సీ॥ "జీర్ణైక వృత్తివేష్టిత శాస్త్ర శబలికా
సౌరపేటిక లొక్క చట్టువున"

– పాదం మొత్తానికి ఒకే భావాన్ని చెప్పటం.

ఇలా పరిశీలిస్తే శ్రీనాథుని ఒరవడి సీసపద్యంలో కనిపించినప్పటికీ, నన్నయగారి గునుగుసీసపద్ధతి కూడా అక్కడక్కడా తారసపడుతుంది. ప్రతిపద్యము జాత్యశ్వము కదనుతొక్కినట్లుగా ఉంటుంది. ఆ పద్యపు రుచి అప్పుడే కొండకొమ్మునుండి పట్టుదులిపితెచ్చిన పచ్చితేనెలా అనిపిస్తుంది. అర్థం శాఖోపశాకలుగా నుండి, తదనుగుణమైన శబ్దప్రయోగం, తద్వైచిత్రి, వాటి పరస్పర సంబంధం – వెరసి రసావిష్కారం ఇదే. తెనాలి వాని కవిత్వపు శైలి.

మారుమూల పదాల్ని, ఔచిత్యంలేని సంస్కృతాన్ని తెచ్చి జాతీయత ఉట్టిపడే తెలుగు పదాలతో జోడించి సమాసాలు కట్టటంలో రామకృష్ణుని స్వేచ్ఛ గజవిహారాన్ని తలపింప చేస్తుంది. నీటిమీది అలల్ని 'నీటిడొంకలు' – (5–157) అని, పెళ్లిని 'పాణిపీడన విధానశ్రీ' (5–170) అని, దిగ్గజాల్ని కకుబిభంబులు (5–174) అని శు క్రాచార్యుడిని 'అసురేజ్యుడని (5–174), మునిశ్రేష్ఠుడనటానికి 'జటిలవ్యాఘ్ర'మనటం (5–186), కాళిదాసు శకుంతలకు వాడిన స్త్రీ సహజోచితమైన ఉపమానాన్ని మగవాడికి (అయుతునికి) వాడి 'అనాఘ్రాతపుష్పము' (5–186) అనటం – ఇవన్నీ స్వేచ్ఛా ప్రవృత్తికి నిదర్శనం.

**నవ్యకవిత్వకళాకలాపం:**

యుగచైతన్యాన్ని ప్రతిఫలించని కవిత్వం ఏదైనా నవ్యకవిత్వం కాదు. రామకృష్ణుని కాలం వరకు కావ్యాన్ని అంకితం తీసుకున్న వాళ్లలో ఎక్కువమంది రాజులు, రంగప్పలే ఉన్నారు. రామకృష్ణుని పాండురంగమాహాత్మ్య కావ్య స్వీకర్త ఒక వ్రాయస ఉద్యోగి. ఆయనకు కావ్యాన్ని అంకితమిచ్చి పుణ్యమూ పురుషార్థము పొందినట్లు భావించటం ఒక చిత్రమైన సన్నివేశం.

ఎంతో సీరియస్‌గా సాగే కథాసందర్భంలో హాస్యాన్ని చొప్పించటం రామకృష్ణుని సహజశైలి. ఇదొక నవ్యత. రాయలెంతగా ప్రజాజీవనంలోని అతిసూక్ష్మమైన అంశాల్ని వర్ణించినప్పటికీ అవిప్రజల ఆహారవిహారాలకే పరిమితమైనట్లు కనిపిస్తుంది. కాని రామకృష్ణుడు ప్రజల మనస్సులలోని అతిసూక్ష్మమైన విషయాన్ని గూడ గమనించి వర్ణించగలడు. ప్రజలమనసులలోని క్షుద్రత్వాన్ని వివేచించి చెప్పగలడు. వద్దు "మొఱ్ఱోయనంగ లింగంబుగట్టు జంగము" లాగా గురువు తనకు అమ్మాయినిచ్చి పెళ్లి చేసుకొమ్మని బలవంతపెడుతున్నాడని అయుతుడు వాపోవటంతో బలవంతపు పెళ్లిళ్లే కాదు, బలవంతపు మతమార్పిడులుకూడా ఎలా చేయబడుతున్నాయో

చెప్పాడు. ఎండతీవ్రతతగ్గి పొద్దువాలిందని చెప్పటానికి "ఎండకండక్రొవ్వుదఱుఁగు నత్తఱి" (5-192) అనటం రామకృష్ణుని విశిష్టత.

పాండురంగని కీర్తించే కావ్యంలోనే పాండురంగని 'గచ్చకాయలెంచియాడువాని', 'వెన్నమ్రుచ్చు' (5-197) అనటం పూరీజగన్నాథుడిని 'వార్ధినేతెంచిన కొయ్యవేల్పు (5-196) అనటం భక్తికాదు. రామకృష్ణుని ప్రత్యేకదృష్టి. అదిలీనమైన భక్తునివాక్కుకాదు. జిజ్ఞాసాపూరితమైన దృష్టి. లేకపోతే, కప్పగా మారిన కన్యాకుబ్జరాకుమారితో హరిదాసానికి జోడుకుదిరిన తరువాత ఆ చెలికత్తెల్ని కూడ కప్పల్ని చేసి హరిదాసానికి భార్యల్ని చేసి వాళ్లు రాకుమారికి సపత్నులయ్యారని 'సాపత్న్యమెంత కీడు' - అని హాస్యోక్తులాడటం, పర్యాయక్రమంలో వాళ్లతో హరిదాసం గడిపిందని చెప్పటం, కోపంతోనున్న ప్రియురాండ్రను పాదాలు పట్టుకొని మరీ బ్రతిమాలుతున్నాడని రాయటం రామకృష్ణుని హాస్యప్రవృత్తికే కాదు తీవ్ర విమర్శనా దృష్టికి కూడా నిదర్శనం.

ఉ॥ "నున్నని మోము, మీసముల నూగును జెన్నటిగాకమున్న మా
యన్నవుగా! గృహస్థులకు నగ్రణిపై మనుమంచు మున్ను వే
గన్నులవేల్పు తెల్ప నదిగాదని వాదము సేయు ధైర్య సం
పన్నుఁడు దేర్పగాఁ దొణఁగె బాదనతిం గుపితప్రియాతతిన్" (5-313)

వేయి విధాలుగా వేయికళ్లవేల్పు (ఇంద్రుడు) బోధించినా వినకుండా వాదులాడిన వాడిప్పుడు కోపగ్రస్థులైన భార్యలపాదాలు పట్టుకొని బ్రతిమిలాడుతున్నాడనటం ఎంత హాస్యమో అంతటి విమర్శ.

"సంపదఁజేతగాని కొనసాగవు సువ్వె గృహస్థ ధర్మముల్" - అనటంలో కూడా గృహస్థాశ్రమధర్మాలన్నీ సంపద చేతనేతప్ప, అన్యంగా సాగవని అనటంలో గృహస్థుల జీవితాలెలా సంపన్నమయి అవి ధార్మిక కార్యాచరణంలో ఎలా ప్రతిఫలిస్తున్నాయో చెప్పటంగా భావించాలి. డబ్బులేకుండా గృహస్థజీవనం సాగనిమాట నిజమే అయినప్పటికీ అదే ప్రధానంకాదు. అలాగే "కలలో వార్తలు విప్పి చెప్పెడు క్రియన్ గాథాపురాణార్థముల్ దెలుపన్నేర్తురుగాని" (5-214) అని చెప్పటంలో ప్రవచనకారుల మీద దూసిన కత్తిని గమనించవచ్చు.

ఇటువంటి తార్కిక, జిజ్ఞాసాపూర్వక దృష్టి రామకృష్ణునిలో కనిపిస్తుంది. సాధారణ ఘటనలలో అసాధారణత్వాన్ని భావించటం, మిగిలిన వారికంటే విలక్షణంగా చూడటం రామకృష్ణుని కవితలో కనిపిస్తుంది. ఇది ఆయన విశిష్టకళాధర్మం.

**సంస్కృతాన్ని తెలుగుగా తెలుగును సంస్కృతంగా:**

సంస్కృతం, దేశిభాషలమధ్య స్పర్ధ నన్నయకాలంనుండి ఉంది.

తే॥ "ప్రౌఢిపరికింపసంస్కృత భాషయండ్రు
పలుకునుడికారమునతెల్గుభాషయండ్రు
ఎవ్వరేమండ్రుగాక! నాకేటి కొఱత" - అని శ్రీనాథుడు,

కం॥ "కొందఱకు తెనుఁగు గుణమగు
కొందఱికిని సంస్కృతమ్ముగుణమగు రెండున్
కొందఱకు గుణములగునే
నందరమెప్పింతు కృతుల నయ్యైయెడలన్"

– అని పోతన చెప్పుకున్నట్లే రామకృష్ణుడు కూడా విరూరివేదాద్రిమంత్రి “తగసంస్కృతమ్ముతెలుంగుగఁజేయఁ దెనుఁగు సంస్కృతముగఁజేయంగఁజతురమతివి” – అని కీర్తించినట్లు చెప్పుకున్నాడు.

**సంస్కృతం – తెలుగు చేయటం:**

త్రినేత్రుడు అనటానికి ‘విచ్చుఎచ్చుకంటివాడు’

సరస్వతి – ‘మినుకుచేడియ’ (5–174)

‘శ్వేతాభరణాలు  అనటానికి ‘తెలుపుకైసేతలు’ (5–174)

శ్వేతపద్మాసనము అనటానికి ‘వెలిదమ్మిగద్దియ’ (5–174)

బ్రహ్మ అనటానికి ‘నలువ’ (5–174)

ప్రతిష్ఠ అనటానికి ‘పెద్దతనము’ (5–177)

శిష్యుడు అనటానికి ‘చట్టు’ (5–179)

మన్మథుడు అనటానికి ననవిల్తుడు (5–182)

మలయమారుతము అనటానికి ‘కమ్మతెమ్మరలు’ (5–182)

స్త్రీబాహ్యలనటానికి ‘నానగండలు’ (5–182)

నేత్రపర్వంగా అనటానికి ‘కన్నుఇచ్చవచ్చు (5–197)

అధికమైన కోపము అనటానికి ‘వెగ్గలపుకినుక’ (5–208)

గోవు అనటానికి ‘గిడ్డి’ (5–245)

గర్భము అనటానికి ‘చూలు’ (5–240)

పుష్పగుచ్ఛము అనటానికి ‘పూలగుత్తి’ (5–287)

**తెలుగు – సంస్కృతం:**

రెండు కళ్లు అనటానికి ‘నయనయుగంబు’ (5–210)

చెవుల్లో పెట్టి పొడిచినట్లుంది – ‘శ్రవఃపుటసూచి’ (5–210)

ఖ్యాతికెక్కిన అనటానికి ‘సడిసన్న’ (5–212)

కునికిపాటు అనటానికి  ‘ప్రచలాయుతంబు’ (5–171)

కూర్చుండి అనటానికి ‘అధ్యాసించి’ (5–192)

ప్రయాణపు బడలిక అనటానికి ‘పథశ్రమంబు’ (5–192)

కోపం కలది అనటానికి ‘సక్రోధ’ (5–246)

కళ్లవికారము అనటానికి ‘లోచన విక్రృతి’ (5–242)

దూడతో కూడినది అనటానికి ‘వత్సయుతము’ (5–241)

తోక అనటానికి ‘వాలధి’ (5–244)

పాములగుంపు అనటానికి ‘మరుద్ధగధీశ కులంబు’ (5–249)

నీటిబిందువులు అనటానికి 'విప్రుషములు' (5–258)

మెడపైని నలుపు అనటానికి 'సుధాంబోధిపుత్రి' (5–270)

కప్పు అనటానికి 'ప్లుతము' (5–274)

మట్టికలిసిన ఆహారం అనటానికి 'మృత్స్నామయాహారము' (5–275)

చిలుకజంటలు అనటానికి 'శుకయుగములు' (5–292)

ఇలా గమనిస్తే తెనాలి రామకృష్ణుడు తెలుగును సంస్కృతం చేయటంలోను, సంస్కృతాన్ని తెలుగు చేయటంలోను చూపే నేర్పు ప్రాచీన కవులందరిలాగే విశిష్టతతో కనిపిస్తుంది.

**వివిధపురాణార్థాల్ని సంఘటించే నేర్పు:**

భారతీయ పురాణేతిహాసాల్ని తెలియకుండా ప్రాచీనసాహిత్యాన్ని అర్థం చేసుకోవటం అంత సులభమైన విషయం కాదు. ప్రతి ప్రాచీన కవి రచనలోను ఈ విషయం స్పష్టంగా కనిపించేదే. తెనాలి రామకృష్ణుని విషయంలో కూడా అంతే. సందర్భాన్ని బట్టి అవసరమైనంతమేరకు పురాణ విషయాల్ని సంఘటించటం ఈ అయుతనియుతుల కథలో కూడా కనిపిస్తుంది. అగస్త్యుడు బ్రహ్మలోకానికి పోయి బ్రహ్మనుస్తుతించాడని చెప్పే సందర్భంలో చెప్పిన అగస్త్యుడిని 'చుళికితపాదోధి' – అనటంలో అగస్త్యుడు సముద్రాన్ని ఆచమించి ఆపోశనపట్టినప్పటి పురాణగాథ మనకు స్మృతికి వస్తుంది. అలాగే బ్రహ్మ అగస్త్యుడిని స్తుతిస్తూ –

సీ॥ హుంకారములు లేవె యుపపురందరహరో
        త్పాటనంబునకు పాల్పడవుగాక
  భ్రూభంగములు లేవె యాభీల వింధ్య గ
        ర్వ స్తంభనమునకు రావుగాక
  చులుకాకృతులులేవె జలరాశి నిశ్శేష
        చూషణ క్రీడకు జొరవుగాక
  జాఠరాగ్నులు లేవె జటితాపివాతాపి
        తనుదాహమున నెదుర్కొనవుగాక
  నిష్ఠ నీమాడ్కి లోకప్రతిష్ఠ గురిచి
  దుష్ట నిగ్రహ శిష్ట సంతుష్టి హేతు
  రోషభీషణ రేఖానిరూఢగాఢ
  లీల గ్రీడించు ప్రోడలు లేరుగాక. (5–176)

ఈ పద్యంలో నహుషుడి ఇంద్రపదవీచ్యుతి, వింధ్యపర్వత గర్వభంగం, కాలకేయుల వధార్థం సముద్రజలాన్ని ఔపోశన పట్టటం, వాతాపి ఇల్వలులగాథ – ఇలా మొత్తం అగస్త్యమునితో ముడివడిన పురాగాథల్ని తడమటం కనిపిస్తుంది.

మారువేషంలో వచ్చిన ఇంద్రుడు, అయుతుని గృహస్థాశ్రమధర్మంవైపు మళ్లించటానికి ప్రబోధిస్తూ పరాశరునివంటి తపస్వులనే మన్మథుడు కరగించగా నువ్వెంత? అని చేసిన ప్రసంగంలో మత్స్యగంధివృత్తాంతం తడవబడింది. జనకమహర్షి మొ॥నవాళ్లు గృహస్థాశ్రమంలో సుఖించి పరమానందసుఖాన్ని పొందలేదా? అన్నప్పుడు

అయుతుడు తిరుగు సమాధానంగా ఇతరుల వలన జ్ఞానాన్ని పొందిన జనకుడిని గురించి చెపుతారుగాని, పుట్టుకతోనే మహాజ్ఞానియైన శుకుని గురించి మాట్లాడరేమంటూ, వేసిన ప్రశ్నలో వ్యాసుని సుతుడైన శ్రీశుకమహర్షి గురించి జనకునిగురించి వారి తత్త్వార్థబోధక శీలంతోపాటు, వారితో ముడివడిన కథలను తడివినట్లు లెక్క.

ఇంద్రుడు కామధేనువు ముఖంగా తన అభీష్టాన్ని నెరవేర్చుకోవాలని భావించి మాయపన్ని పోయినప్పుడు

"． ． ． ． ． ． ． ． ． తపముగావించువార్కి
గనిన దలయేర్చుఁగాదె యాఖండలునకు"–

అన్నప్పుడు ఇంద్రుడు రంభాద్యప్సరోగణాన్ని పంపి చెడగొట్టిన తాపసుల గాథలనన్నీ స్ఫురణకు తెచ్చినట్లు లెక్క.

మాయగోవును అయుతుడు ఉద్ధరించి లేవనెత్తినప్పుడు శ్రీమహావిష్ణువు ధర్మదేవతను లేవనెత్తినట్లుగా ఉన్నదనటంలో 'గోరూపంలో ధర్మదేవత, విలపిస్తుంటే శ్రీమహావిష్ణువు ఓదార్చి ఉద్ధరించిన గాథ గుర్తుకువస్తుంది. వరాహావతారంలో జలధినుండి భూదేవిని కాపాడినట్లు అయుతుడు కాపాడాడనటం కూడా అటువంటిదే.

కప్పగా మారబోయేముందు అయుతుడు పాండురంగక్షేత్రం చేరి చేసిన స్తుతిలో నృసింహావతారాది వివిధ అవతారాల గాథలు ప్రస్తావించబడ్డాయి.

కన్యాకుబ్జరాకుమారి చెలికత్తెలతో కలిసి వనవిహారంలో మధుపానమత్తులై చేసిన ప్రేలాపనలలో 'పూలగుత్తిపై తుమ్మెద చేరటాన్ని గమనించి కృష్ణుడు యశోదాస్తన్యం తాగుతున్నాడనటం, ముత్యాలతోనిండిన వెదురును చూచి కద్రూదేవికి నెలలు నిండాయనటం, ఏనుగు అరటి చెట్లను విరవటం, దుర్యోధనునితొడలకు భీమునిగదవలన నొప్పి కలగిందనటం, ఎఱ్ఱతామరను చుట్టిన హంసను చూచి, శేషుడు చుట్టుకున్న మేరుపర్వతమని పొగటం – ఇవన్నీ భారత భాగవతేతిహాస కథల్ని తడవటమే.

కన్యాకుబ్జపు రాకుమారి చెలికత్తెలతో కలసి కప్పను పట్టుకోవటానికి యత్నించిన సందర్భంలో కప్పకు 'రావణునకు వైకుంఠపురంలో స్త్రీల వలన కలిగిన అలజడిలాంటిదే కలిగింద'ని – అనటం పురాణకథను స్పృశించటమే.

ఇలా ఇతిహాసపురాణ కథల్ని ఉపమానద్రవ్యంగా కవితాసామగ్రిగా, ప్రస్తావనలుగా, ప్రతీకలుగా వాడి తన పౌరాణిక విజ్ఞాన నిరతిని తెటతెల్లంచేశాడు.

**వర్ణనలు:**

వర్ణల చేతనే కవి ప్రతిభ తెలిసేది. రామకృష్ణుని వర్ణనలు మూర్తామూర్తమైన వస్తువుల మధ్య స్పర్ధను కలిగించి చేసేవిగా ఉంటాయి. ఉదా॥కు బ్రహ్మలోకంనుండి అగస్త్యమహర్షి అయుతనియుతులకోసం తీసుకవచ్చిన సావిత్రిగాయత్రుల రూపవైభవాన్ని వర్ణించే

'కుటిలాలకములు చీకటి ప్రోగులగునైన
చచ్చింద్రికాధ్యముల్ చిత్తగతులు" (5–180)

వంటి పద్యాలవర్ణనలు గమనించవచ్చు.

అగస్త్యుడు బ్రహ్మలోకానికిపోయినప్పుడు బ్రహ్మ ఉనికిని వర్ణించే (5-174) పద్యం, హిమాలయాలకుపోయిన అయుతుడు మనసులో బాధపడుతూ గురువు ఆజ్ఞాపిస్తే నేను చేయనన్నదేముంది? అని తలపోసే సందర్భంలోని 'ఉర్వీధరములెక్కియుఁకనేకుచకుంభయుగమెల్లగాక తానుఁకు మనిన' (5-184) వంటి పద్యాలలో రామకృష్ణుని భావశబలతతో కూడిన వర్ణనలు కనిపిస్తాయి.

కపటవేషంలో వచ్చిన ఇంద్రుని పరివారాన్ని వర్ణించే పద్యాలు (5-190,192), ఇంద్రుడు తన నివాసాన్ని గురించి చెపుతూ చేసిన శ్లేషానుప్రాణిత రూపకవర్ణన (5-193,194), ఇంద్రుడు, వాధూలముని చేసిన గృహస్థాశ్రమ వర్ణనలు (5-216, 261), అయుతుడు కపటపు గోవును ఉద్ధరించిన వర్ణన (5-243), అయుతుడు చేసిన దేవతాస్తుతి పూర్వక వర్ణనలు (5-267, 268, 269, 270, 271, 280, 281), కన్యాకుబ్జరాకుమారి చెలికత్తెలతో కలసి చేసిన వనవిహార వర్ణన - జలక్రీడాది వర్ణన (5-294 - 302), హరిదాసము సతులతో చేసిన సంసారవర్ణన (5-313-315) ఇవన్నీ రామకృష్ణుని వర్ణనా పటుత్వాన్ని పట్టి చూపుతాయి.

ఏకవయినా పరిణామాన్ని వర్ణించి చెప్పినప్పుడే గొప్పకవి అవుతాడు. అయుతుడు కప్పగామారే సందర్భంలో అయుతుని మానసిక స్థితి పరిణామాన్ని గురించి చేసిన వర్ణన ప్రత్యేకంగా పరిగణింపదగింది.

శా॥ "నీరప్రాంగణ కర్కటీ బిలమునన్ నిద్రింప మృత్స్నామయా
హారంబున్ గబళింపఁ బెల్లఱవ, నిట్టట్టున్ బుతంబు గొనన్
దూరాయాస్యదహీంద్రభీతిహతి గొందుల్ దూఱంగోరున్ మదిన్
సారాపేత మనోబలంబగు భవిష్యద్భేక ముత్సేకమై " (5-275)

కప్పగా మారబోతున్న మానవునిమనసులో కలిగే భేకసంబంధకోర్కెలు, మనిషిగా మనోబలం తగ్గి, అతనిలో భవిష్యత్తులో కాబోయే కప్పవికారాలు ఎలా అతిశయించసాగాయో చెప్పటం ఇందులో కనిపిస్తుంది. 'నీటి ఒడ్డున నున్న ఎండ్రి బొరియలలో నిద్రించాలని కోరిక కలుగుతోంది. మట్టికి సంబంధించిన ఆహారాన్ని తినాలని అనిపించసాగింది. కప్పలా పెద్దగా అరవాలని అనిపిస్తోంది. కప్పలాగా అటుఇటు దాట్లువేయాలని అనిపిస్తోంది. దూరంనుండి వచ్చే పాముల వలన భయంతో సందులలో దూరాలని అనిపిస్తోంది' - అని చేసిన వర్ణనలలో కప్ప సహజలక్షణాలతోపాటు, మనిషిగా అయుతుని మనసులో చెదరుతున్న మనోబలాన్ని కూడా చెప్పి తనలోకోత్తరమైన ప్రతిభను చాటుకున్నాడు.

**రసము:**

కవి చేసే వర్ణనలు, చెప్పే ఉపమాద్రవ్యం అన్నీ రస నిర్వహణం కొరకే. క్షేత్రమాహాత్మ్య కావ్యాలలో రసం ఏక నాయకాశ్రయంగా చెప్పాలంటే ఆ క్షేత్రపు అధినాయకునికి ఆపాదించి చెప్పవలసిందే. కాని ఆయా ఉపాఖ్యానాలలోని కథలన్నిట్లో వేరే వ్యక్తుల జీవితాల్ని వర్ణించి, వారికి జీవన ఫలప్రదానం చేసిన కారకునిగా క్షేత్రదైవాన్ని చెప్పటం చేత కథానాయకునిగా ఆ క్షేత్ర దైవాన్నే చెప్పవలసివస్తోంది. కాని ఈ అయుతనియుతోపాఖ్యానంలో అయుతుడినే కథానాయకునిగా చెప్పవలసియుంది. కథంతా అయుతుడి ముఖంగానే సాగుతుంది. గృహస్థాశ్రమాన్ని వద్దన్న అయుతుని పట్టుదలలో ధర్మవీరం కనిపిస్తుంది. అది తొలుత అగస్త్యుని వలన వికలం కావలసియున్నప్పటికీ కాకుండ, అనుభావాలతో పరిపుష్టమై కపట విప్రుని వ్యతిరేక సంభాషణలను ప్రతిఘటించి స్థాయిని అందుకోవలసిన సందర్భంలో వాధూలముని శాపంతో వికలమై ధర్మవీరమాభాసమైంది.

కన్యాకుబ్జరాకుమారిరాకతో, ఆమె, ఆమె చెలికత్తెలు కప్పలుగా మారి పరిణయమవటంతో అదిమరింత స్పష్టమైంది. కప్పగా మారి ధార్మిక జీవనంలో ఉన్నప్పటికీ తాను పట్టిన బ్రహ్మచర్యదీక్ష ధ్వంసమై బహునాయికా గతరతితో అది ఆభాసమైంది. శృంగారమైనా, ఏకనాయికతో జరుగలేదు. వాధూలముని చెప్పిన శాపావసానం గృహస్థ జీవనంలో సంతానం కనటం. ఆ సంతును కనటంతో విష్ణుపదం కనిపించిందని చెప్పటంలో కవి ఏ రసాన్నీ పరిపూర్ణంగా వర్ణించి చెప్పలేదు. వికలమైన ధర్మవీరం, శృంగారాభాసం కనిపిస్తుంది. అయుతుడు కోరుకున్న ముక్తి ఎలాగైనా లభించింది గదా అని సరిపెట్టుకుని చూస్తే దానిని సాధించిన ఉత్సాహం, కన్యాకుబ్జ రాకుమారి చేత పడనంతవరకే కొనసాగింది. ఆ పిదప హాస్యాస్పద జీవనం. తన జీవితంలోని పరిణామం. వాధూలుని శాపనిర్దేశాత్మకంగానే సాగింది. కాబట్టి ఈ ఘట్టంలో శృంగారమూ పరిపూర్ణ రసస్థితిని పొందలేదు. ధర్మవీరమూ పరిపూర్ణ రసస్థితిని పొందలేదు. ఈ విషయాన్ని గమనించే రామకృష్ణుడు ఈ కథ చివరిలో “ప్రయుతనందను చరిత్రం బద్భుత రసైకపాత్రంబయ్యే” అని చెప్పిన దానిని బట్టి ఇందులో అద్భుత రసం ప్రధానమని చెప్పవచ్చు. అయుతుడు వాధూలముని శాపానికిగురైనప్పటినుండి జరిగిన కథంతా పాఠకునికి ఆశ్చర్యాన్ని కలిగించేదే కాబట్టి ఆశ్చర్యం పాలుగా గలిగిన అద్భుతరసమూ ప్రధానంగా అనుభూతికి అందుతుంది.

**అయుతనియుతోపాఖ్యానంలోని వివిధ పాత్రల్ని పరిచయం చేయండి.**

**1. నియుతుడు:**

అయుతశబ్దానికి 1,00,000 అని ‘నియుత’ – శబ్దానికి 10,00,000 అని సంఖ్యామానపు అర్థం.

నియుతుడు ప్రయుతుని సంతానం. అయుతునికి సోదరుడు అయుతునిలాగే గుర్వనుగ్రహాన్ని సంపూర్ణంగా పొందినవ్యక్తి. అయుతుని నియుతుని కలిపి గురువైన అగస్త్యుడు ఇలా ప్రశంసించాడు.

శా॥ “వాసోనిగ్రహమెన్న రాకలియు నీర్వట్టున్ గణింపర్, తలల్
మాసెంగాయన రంగముల్ బడలినన్ బాటింపరట్లుండనీ
యాసాయంబుగనానిశాత్యయముగానామ్నాయముల్ క్రోల్చుచో
నాసీనప్రచలాయితంబయినలేదాహా! వితర్కింపగన్”

“విద్యాతురాణాం నసుఖం ననిద్రా” – అన్నదానికి ప్రత్యక్షోదాహరణ వీరివర్తనం. ధరించే వస్త్రాలను గురించి గానీ, ఆకలిదప్పుల్నిగాని, పట్టించుకోకుండా నిరంతర అధ్యయనశీలురై, ఒక్కకునికిపాటుకూడా లేకుండా అహోరాత్రాలు గడపటం గురువైన అగస్త్యునికే ఆశ్చర్యం వేసింది.

బ్రహ్మను యాచించి తెచ్చిన బ్రహ్మమానసపుత్రికలలో ఒకరిని వివాహమాడటానికి అయుతుడు తిరస్కరించాడు. దానితో ఆ యిద్దరు కన్యకల్ని నియుతునికే ఇచ్చి చేశాడు అగస్త్యుడు. ఉత్తమురాంద్రు నిర్మలురునయిన భార్యలపట్ల ప్రేమకలిగి సమబుద్ధితో నియుతుడు వ్యవహిరంచాడు. ఇంతమాత్రమే నియుతుని ప్రస్తావన కనిపిస్తుంది.

గురువుచేత బహిష్కృతుడైన అయుతుడు హిమాలయపర్వతాలకు పోయి మనసులో బాధపడుతూ అనుకున్న మాటలలో నియుతుడే కనిపిస్తాడు. చూడండి. ‘చుట్టుకోవటానికి జడలట! కట్టుకోవటానికి కృష్ణాజినమట. చుట్టుకోవటానికి కాషాయాంబరమట. అలా అడవుల్లో శుష్కించే తపస్వికి, సుఖాలే కోరుకునే వనితకు కలయిక తగుతుందా? ‘నెయ్యఁదట్టి పనికి నియుతుడు తగుఁగాక’ – అని అలాంటి పనికి నియుతునికి చెల్లుతుంది. గురువుకోసం ఉరివేసుకోవటానికి నేను సిద్ధంగాలేనని అయుతుడు అనుకొన్నదానిని బట్టి నియుతుడు గురువాక్యానికి గౌరవమిచ్చి జీవితాన్ని పండించుకున్న వ్యక్తిగా కనిపిస్తాడు.

**అగస్త్యుడు:**

అగస్త్యమహర్షి వైది క ఋషి. భార్యలోపాముద్ర. వైదిక, పురాణేతిహాసాలలో అగస్త్యునికి సంబంధించి ఎన్నో ప్రస్తావనలు కనిపిస్తాయి. వాతాపి, ఇల్వలులను చంపినవానిగా, వింధ్యపర్వత గర్వాన్ని అణచినవానిగా, నహుషుని పదభ్రష్టుని గావించినవానిగా ప్రసిద్ధుడైన అగస్త్యుడు ఈ అయుతనియతోపాఖ్యానంలో శిష్యవాత్సల్య పరిపూర్ణ చేతస్కునిగా కనిపిస్తాడు.

ప్రయుతునితోపాటు ఆతని సంతానమైన అయుతనియుతులు కూడా అగస్త్యుని శిష్యులే అయినారు. అయుతనియుతుల విద్యావ్యాసంగాలకు, వాళ్ల వినయవర్తనానికి ఎంతోముచ్చటపడి ఇలా తలపోస్తాడు.

శా॥ ఈనా శిష్యుల లోన వీరిరువురున్ హృద్యానవద్యోదయ
జ్ఞానానూనవిచారవాగ్విభవ తేజఃక్షాంతి శాంతిప్రథా
సానాథ్యంబున గానిపించెదరుబీ మత్సక్తాశయుల్; వీరి స
న్మానింపందగు బాణిపీడనవిధానశ్రీల వాలాయమున్. (5-170)

శా॥ వానో నిగ్రహమెన్న; రాకలియు నిర్వట్టున్ గణింపర్; తలల్
మాసెంగా యన; రంగముల్ బడలినన్ బాటింప; రట్లుండనీ
యాసాయంబుగ నానిశాత్యయముగా నామ్నాయముల్ క్రోల్చుచో
నాసీన ప్రచలాయితం బయినలే దాహా! వితర్కింపగన్. (5-171)

అలాతలపోసి బహు యోగ్యులైన వీరికి తగిన వధువులు భూలోకంలో ఎవరూలేరు. బ్రహ్మ పుత్రికలు ఉన్నారట. వారికింకావివాహం కాలేదట. బ్రహ్మనడిగి వారిని తీసుకొనివచ్చి పెళ్లి చేయాలని భావించి బ్రహ్మలోకానికి పోయాడు. బ్రహ్మను కీర్తించి, ఆపై బ్రహ్మ ప్రశంసలను పొందాడు.

సీ॥ హుంకారములు లేవె యుపపురందరహఠో
త్పాటనంబునకు పాల్పడవుగాక
భ్రూభంగములు లేవె యాభీల వింధ్య గ
ర్వ స్తంభనమునకు రావుగాక
చులుకాకృతులులేవె జలరాశి నిశ్శేష
చూషణ క్రీడకు జొరవుగాక
జాఠరాగ్నులు లేవె జటితాపివాతాపి
తనుదాహమున నెదుర్కొనవుగాక

తే॥ నిష్ఠ నీమాడ్కి లోకప్రతిష్ఠ గురిచి
దుష్ట నిగ్రహ శిష్ట సంతుష్టి హేతు
రోషభీషణ రేఖానిరూఢగాఢ
లీలఁ గ్రీడించు ప్రోడలు లేరుగాక. (5-176)

ఓ అగస్త్యమహర్షీ! ఇంద్రపదవిలో కూర్చున్న నహుషుడిని కూల్చిన నాటి హుంకారాలు ఇప్పుడు లేవు కదా! వింధ్యాద్రి గర్వాన్ని అణచిననాటి భ్రూభంగాల అవసరం ఇప్పుడు రావటంలేదు కదా! సముద్రాన్ని

ఆపోశనపట్టే పుక్కిటి అవసరం లేదు కదా! మునుల్ని బాధించే వాతాపి తనువును అరగించుకొనేటంత జఠరాగ్నితో పని ఇప్పుడేమీ లేదు గదా! లోక కల్యాణం కోసం దుష్టుల్ని నిగ్రహించే భీషణ కోపం ప్రదర్శించే నీలాంటి వారితో ఆటలాడే నేర్పురులు లేరుకదా! ఈ ఉపద్రవాలను నీవు నివారించటం వల్లనే త్రిమూర్తులమైన మేము మా పెద్దరికాన్ని నిలబెట్టుకోగలిగామని ప్రశంసిస్తాడు. అగస్త్యుని గొప్పతనం అలాంటిది.

వచ్చిన పని ఏమిటని తెలిసికొని, తనమానస పుత్రికలయిన సావిత్రిగాయత్రులను ఇచ్చి పంపుతాడు. భూలోకానికి వచ్చి అయుతనియుతులను ఆ కన్యలను వివాహం చేసికొమ్మని చెప్పగా అయుతుడు తిరస్కరించగా, ఆ ఇద్దరినీ నియుతునికే ఇచ్చి వివాహం చేశాడు. తన మాట వినని అయుతుని పట్ల కోపంతో తన ఆశ్రమంనుండి వెళ్లిపొమ్మని బహిష్కరించాడు. అగస్త్యుడు కోపంతో శపించకుండా కేవలం బహిష్కారశిక్ష వేశాడు. ఈ సందర్భాన్నే అయుతుడు మారువేషంలో వచ్చిన ఇంద్రునితో అగస్త్యుని తీవ్రకోపాన్ని చెపుతూ

కం॥ "ఆడినఁ గూడిన కినుకన్
వీడిన జడముడియుఁ బొగలు వెడలెడు చూపుల్
పోడిమిఁ గొను నిట్టూర్పులు
వాడిన డెందమును మేన వడియుఁ జెమరునై" (5-204)

అని చెపుతాడు. జడముడివీడిపోయిందట. కళ్లల్లో నిప్పులు రాలుతున్నాయట. నిట్టూర్పులునిగుడిస్తూ, మనసు వాడిపోయి, మేను చెమరించగా అగస్త్యుడు శపించాలని అనుకున్నాడట. కాని కరవాలనుకున్న పాము తానంతట తానే మానుకున్నట్లుగా ఉపశమించాడట. అలా సలసల కాగేకోపాన్ని తనకుతానే నియంత్రించుకోవటానికి కారణం శిష్యవాత్సల్యమే.

తాను అమితంగా ప్రేమించే తన ప్రియశిష్యుడు తనను వినకపోయే సరికి తట్టుకోలేని హృదయదౌర్బల్యం కారణంగా ఆశ్రమంనుండి వెళ్లగొట్టాడు. గురువుగారి కోపాగ్నికి భయపడి శిష్యుడు అయుతుడు కూడా ఆక్షణంలోనే ఆశ్రమాన్ని వీడి హిమాలయాలకు పారిపోయాడు.

ఇలా అగస్త్యుడు శిష్యవాత్సల్యంగలవానిగా, బ్రహ్మ గౌరవాన్ని పొందిన పూజనీయునిగా, తనమాటవినని ప్రియశిష్యుడు ఎంత గొప్పవాడైనా, తిరస్కరించి తరిమివేసే తెగువగలవానిగా ఈ అయుతనియుతోపాఖ్యానంలో కనిపిస్తాడు. "దాతయు దైవముం గురుడు తల్లియుఁ దండ్రియునై యభేద్యవిద్యాతిశయంబురాఁజొనిపి" న మునిగా అయుతునిచే కీర్తింపబడినవాడు అగస్త్యుడు.

**ఇంద్రుని పాత్ర:**

ఇంద్రుడు స్వర్గాధిపతి. అదితి సంతానం. అగస్త్యుని కోపానికి గురయిన అయుతుడు హిమాలయ పర్వత ప్రాంతాలకు చేరి తీవ్ర తపస్సు చేసికొంటుండగా, ఆ తపస్సుకు భువనాలు తల్లడిల్లిన సందర్భంలో ఇంద్రుడి పాత్ర ప్రవేశిస్తుంది. అయుతుని తపోనిష్ఠకు నిప్పుదొక్కినట్లు, తేలు తలపై కుట్టినట్లు, ఆవరసాన్ని అధికంగా తాగినట్లు మనసులో తపించి భూలోకానికి పరుగెత్తుకవచ్చాడు. వచ్చేవాడు ఒంటరిగా రాలేదు. కపటవేషంతో, పరివారంతో సహా వచ్చాడు.

సీ॥ జీర్ణైణకృత్తి వేష్టిత శాస్త్రశబళికా
సౌర పేటిక లొక్క చట్టుపూన

గంబళ కట ద్రుసీ కాషాయ కరకంబు
        లొక్క యంతేవాసి యుద్వహింప
నాళ్లికాఫలసార యవసక్తు తండుల
        సూపాదుకొక్క శిష్యుండు మోవ
సమిదాజ్య పూర్ణ కీచక కుశ సృ క్స్రువ
        చయమొక్క ఛాత్రుండు సంగ్రహింప
దలుగు దామెనబెనచిన గళము తోడ
జంట వెన్నాడు క్రేపుతో, జాల నలసి
నడచుధేనువు నొక చిన్న వడుగు రొప్ప
నయుతునాశ్రమ వాటమయ్యతిథి డాసి (5-190)

చినిగిపోయిన జింకచర్మంలో చుట్టబడిన శాస్త్ర గ్రంథాల పెట్టెల్ని ఒక వటువు మోసుకొస్తున్నాడు. మరొక శిష్యుడు కంబళి, సన్న్యాసులు కట్టుకునే కాషాయాల్ని, కమండలాన్ని మోసుకొని తెస్తున్నాడు. ఇంకొక శిష్యుడు చింతపండు – కుశలు– ధాన్యం–బియ్యం– పేలపిండి, పప్పులు మోసుకొని తెస్తున్నాడు. మరొక విద్యార్థి సమిధలు, కుశలు నెయ్యినింపిన వెదురుపాత్ర, స్రుక్కు స్రువము మొ॥వి తీసికొనివస్తున్నాడు. దూడతోపాటు అలసిపోయినదుస్తున్న గోవును పలుపుతాడు కట్టి మరొక శిష్యుడు తోలుకొస్తున్నాడు. వృద్ధ బ్రాహ్మణి తెల్ల బడ్డ జుట్టుతో వణకిపోతున్న తలతో మూర్తీభవించిన ముసలితనంతో భర్తననుసరించి వస్తుండగా ఇంద్రుడు ముసలిబ్రాహ్మణ వేషంలో అయుతుని ఆశ్రమానికి వచ్చాడు. కుశల ప్రశ్నలయ్యాక తానేయేతీర్థయాత్రల్ని చూసింది చెప్పి పాండురంగవిట్ఠలుని సేవించేందుకు వెళ్తున్నానని చెపుతాడు. అయుతుని వివారాలు తెలిసికొని ఆశ్చర్యం నటించి "మీనాన్న ప్రయుతుడు మా స్నేహితుడే. ఆతని సంతానం కావటం నాకు చాలా సంతోష కారకం. కానీ నీ విరుద్ధ ప్రవర్తన మాత్రం వినటానికి బాగాలేదు. కులధర్మాన్ని వీడి, గురువుకు కోపం కలిగించే పని చేశావు. కన్నవాళ్లను తోడబుట్టిన వాళ్లను వదలి ఇలా తాపసిగా ఒంటరిజీవితం గడపటం బాగాలేదు. పరాశరాదులు సైతం మన్మథునికి ఓడిపోయారు. జనకాదులు కుటుంబజీవనులై పరబ్రహ్మానుభూతిని పొందలేదా? మోక్షమంటే అంతసులభమా? ఏ అనుభవమూ లేకుండానే స్త్రీలనెలా నిందిస్తావు? అని గృహస్థాశ్రమ ప్రాశస్త్యాన్ని వివరించి చెపుతాడు. ఎన్ని చెప్పినా ఎంత చెప్పినా అయుతునికి ఆ బోధరుచించలేదు. ఇంద్రుని బోధ ఏటిలోపిసికిన చింతపండే అయింది. గుడినేమ్రింగేవాడికి తలుపులు అప్పడాలయినట్లు అగస్త్యముని మాటలనే గౌరవించని నీకు మేమేపాటివారం. మామాటలెంత? శు కమహర్షివంటివాళ్లను చూచి గొప్పలకు పోయి మంగలికత్తిని మ్రింగుతున్నావు. అందని పళ్లకు అఱ్ఱులు చాస్తున్నావు – అని హెచ్చరించి ఈర్ష్యాసూయలతో అయుతుడిని వీడివెళ్లిపోయాడు.

కపటంగా వచ్చిన ఇంద్రుడు, తాననుకొన్న కార్యసిద్ధి ప్రత్యక్షంగా జరుగులేదు. కాబట్టి, పరోక్షంగా తన కార్యాన్ని సఫలంచేసికోవాలని భావించి, కామధేనువుకు ఆ బాధ్యతను అప్పగించి మాయల్ని పన్ని వెళ్లిపోయాడు. స్థూలంగా ఈ అయుతనియుతుల కథలో ఇంద్రుని పాత్రయిది.

సాధారణంగా ఇంద్రుడంటే తీవ్రతపస్సు చేసే మునుల తపస్సును భంగపరచేవానిగా, యజ్ఞయాగాదులు చేసే సందర్భాలలో యాగాశ్వాన్ని హరించేవానిగా పురాణాలలో కనిపిస్తాడు. ఈ కథలో కూడా కపటముని వేషంలో వచ్చి, అయుతుడిని సానునయంగా మరల్చే ప్రయత్నం చేసి భంగపడ్డాడు. అది సాధ్యం కాకపోయేసరికి కామధేనువును మాయగోవుగా పంపించి, అయుతుని తపస్సును భగ్నంచేయటానికి పరోక్ష పద్ధతిని పాటించి తన

కోర్కెను సాధించుకున్నాడు. అందుకే "తపముగావించువారిఁగనిన తలయేర్చుఁగాదె యాఖండలునకు" (5-231) అని కవి ఇంద్రుని పాత్రను వ్యాఖ్యానిస్తాడు.

ఇలా కపటిగా, తస్స్వాధ్యాయాలను ఆచరించేవారిని భంగపరచేవానిగా ఇంద్రుడు ఈ కథలో కనిపిస్తాడు.

**వాధూలముని పాత్ర:**

అయుత నియుతోపాఖ్యానంలో కీలకమైన పాత్ర వాధూలముని పాత్ర. గురువైన అగస్త్యుని మాటను కాదని, గృహస్థాశ్రమాన్ని స్వీకరించటానికి సుముఖంగాలేక, హిమాలయాలకు పోయి తపశ్చర్యకు పూనుకున్న అయుతునికి గృహస్థాశ్రమ ప్రాశస్త్యం తెలియజెప్పి, ఆ గృహస్థాశ్రమం ద్వారానే తరుణోపాయాన్ని చూపిన తపస్సంపన్నుడు వాధూల మహాముని. ఇంద్రుడంతటివాడు మారురూపంలో వచ్చి చెప్పినప్పటికీ వినని అయుతుడు, వాధూలుని శాపకారణంగా దారికి రాకతప్పలేదు. తప్పు అయుతునిదేమీలేనప్పటికీ ఇంద్రుడు పన్నిన మాయలో చిక్కి, అయుతుడు ఆటబొమ్మ అయ్యాడు.

వాధూలుడు గొప్ప తపస్వి, మహాజ్ఞాని, వయోవృద్ధుడు. వాధూలుని తపస్సును చెరచటానికి ఇంద్రుడు వేయి విధాలుగా ప్రయత్నించి విఫలుడయ్యాడు. ఆ తపస్సుగాఢతకు జనులు భయపడి, వాధూలుడు తపస్సు చేసుకునే వనంలోకి ప్రవేశించటానికి కూడా భయపడేవారు. ఆ వనాన్ని కవి వర్ణిస్తూ పులి యున్న పొదలాగా, మొసలికి నెలవైన పెద్ద మడుగులాగా, త్రాచుపాము నిలచియుండే పెద్ద పుట్టలాగా ఇంద్రాదులకైనా ప్రవేశించటానికి వీలుకానిదని చెపుతాడు.

అటువంటి అడవిలోకి, అయుతుడు, మాయగోవును చర్మం ఊడేలా బాది, దూడను తల్లిగోవుమెడకు లంకెవేసి, ఆశ్రమంనుండి తరిమివేయగా అది వాధూలమహాముని ఉండే అడవిలోకి ప్రవేశించింది.

ఆ మాయగోవు, అయుతుని చేతిలోని తాటిని లాక్కొని పరుగెత్తుతూ మార్గమధ్యంలో మేఘాలు కమ్మిన మేరుపర్వతంలా పుట్టలూ, దట్టమైన చెట్లగుంపులో కలిసిపోయిన ఆకారంగల తపోగరిష్ఠుడూ, వయోవృద్ధుడు, ఏవ్యామోహమూ లేనివాడు, దేవతలతో సమానదునైన వాధూలమునిని తొక్కింది. దాంతో ముని కోపించి ఎగిరిపడి లేచాడు. శరీరంపై పెట్టిన పుట్టలు పగిలి బీటలు పడ్డాయి. చెవులపైనుండే పిట్టలు రెక్కలు విదల్చికొని ముందుకు వెళ్లాలని భావించగా, దట్టమైన జడలగుంపులో గుమికూడి నిద్రపోయే పాముల గుంపు మేల్కొన్నది. గడ్డితీగలు కార్చిచ్చు పాలై మంటలు ఎగిసిపడుతుంటే ప్రకాశించే పర్వతంలా ముని పొడవైన గడ్డాలు మీసాలతో భయంకరక్రోధమూర్తియై, ఆవును వదలి బ్రహ్మచారిని నిశితంగా చూస్తూ, ఇలా అన్నాడు.

"ఓరి దురాత్మ! మదాంధా! వినియోజ్ఝితా! బ్రతుకుమీద ఆశలున్నవాడెవడూ ఈ వనంలోకి ప్రవేశించలేదు. నీవీవనంలోకి ప్రవేశించి, ఇంద్రుడు చేసిన నూరు విధ్వంసయత్నాలకు కూడా చెదరని నా తపస్సమాధిని, రాక్షస పద్ధతిలో ధ్వంసంచేశావు. నేను వృద్ధుడిని. ఈశ్వర ప్రణిధాన నిర్మగ్నబుద్ధిని. శక్తి హీనుడిని. నన్నిలా చేసినందుకు ప్రతిగా నీవు ఈ యౌవనం, రూపం, గర్వం అన్నీ పోయి కప్పవై పో" - అని శపించాడు.

ఊహించని ఈ పరిణామానికి బిత్తరపోయిన అయుతుడు ముని పాదాలపై బడి "ఓ బ్రహ్మనిష్ఠుడా! నీకోపతీవ్రతను  తగ్గించు. మీరు కోపిస్తే కొండలు పడిపోతాయి. సముద్రాలు ఇంకిపోతాయి. భూమి బ్రద్దలవుతుంది. మిన్ను విరిగిమీద పడుతుంది. నేనెంత? పూర్తిగా అన్నీ తెలిశాక నీ శాపాగ్ని నన్ను కాల్చు. నీవు తరుగని ప్రళయాగ్నివని తెలుసు. తెలిసి తెలిసి కొరివితో తలగోక్కునే కుమతి ఎవడైనా ఉంటాడా? నన్ను ఊరక ఉ

ఒడనీయని, మెడలో కట్టుకున్న పాములాంటి ఈ గోవును వదిలించుకోవాలనుకున్నాను. వేరే యేమీ లేదు. దీనోద్ధరణికై కరుణా సముద్రుడివైన నీ మదిలో మండే ఈ పెద్ద కార్చిచ్చు మంటల్ని ఊహించగలమా? – అని ధేనువు వెంట అడవిలో ప్రవేశించిన వివరాలనన్నీ అయుతుడు మునికి వివరించి చెప్పాడు. అప్పుడు వాధూలముని దివ్యదృష్టితో విషయాన్ని తెలిసికొని, చంద్రునిలా చల్లబడ్డాడు. అయుతుడిని ప్రేమగా చూశాడు! అవనిలో బుధుల కోపాలు గడ్డిపోచల చివరి నీటి బిందువులుకదా!

"వత్సా! నా దివ్యదృష్టితో ఆ పాపిని కనుగొన్నాను. కోపమనస్కుడవై అలాశపించాను. నా వాక్కు తప్పదు. మూర్ఖత ఆవహించినందుకు నేనెంతో క్రుంగిపోతున్నాను. జరిగిన దైవఘటనకు చింతించకు. కర్మనశించాలంటే అనుభవించటమే దానికి మార్గం. విశ్వగురువైన గజేంద్ర వరదుడిని నిరంతరం రేయీపగలూ ధ్యానించు. నీకు శుభం కలుగుతుంది. హరిభక్తులకెన్నడూ ఆపదరాదు.

ఇల్లాలిమేని మెరుపుల సమూహానికి జలధరంలా ఏది ప్రకాశాన్ని కలిగిస్తుందో, మణిపూసల్లాంటి సంతానం పుట్టుకురావటానికి ఏది సముద్రంలా ఆవాసమవుతుందో, ఆకలిగొన్న వారికి నీడనొసగే చెట్టయి ఏది నిలువనీడనిస్తుందో పుణ్యలోకాలకు ఎగబ్రాకే పితృదేవతలకు కుంటివాడికి మెట్టులా ఏది ఆధారభూతమో, అటువంటి గృహస్థధర్మాన్ని నీవు నిందించావు. దాని కారణంగానే ఇదంతా జరిగింది. ఇలా ఒప్పును తప్పని పలికే గర్విష్ఠులకు, రాళ్లపైని గాలికూడా కసరిపైబడుతుంది. నేనింతవాడిని. నేను పూనుకుంటే కానిదేముంది? అని పంతంపడితే మానవులకే కాదు, దేవతలకైనా ఫలితం సిద్ధించదు. వేదమంత్రాలతో మునులు నిరంతరం పూజించేవాడు, ప్రహ్లాదవరదుడు, స్తంభాల్లాంటి ముప్పైరెండు శాఖలుగల అశ్వత్థమూర్తీ, తన చంక్రంతో క్షేత్రజనుల్ని సంరక్షించేవాడూ, వివిధాయుధాలతో, గొప్ప ఆభరణాలతో వెలుగొందేవాడూ, భీమరథీ నదితీరపువాడూ, వివిధ కథలు, రూపాలు గలవాడు అయిన ఆ నృసింహదేవుని పాదాలవద్ద కప్పవై నివసిస్తూ స్వామిని సేవించుకో! కొంతకాలం గడిచాక ఆడకప్పతో జతకట్టి సంతానవంతుడవుతావు. దాంతో నీకు వెంటనే పితౄణముతీరి మోక్షం పొందుతావు." – అని శాపవిమోచనాన్ని, చెప్పి అయుతుడిని ఊరడించి, వాధూలముని లోకాలకాశ్చర్యాన్ని కలిగిస్తూ సూర్యమండలాన్ని ఛేదించుకొని మోక్ష సామ్రాజ్యసింహాసనారూఢుడు అయ్యాడు. వచ్చిన పని పూర్తికావటంతో మాయగోవు కూడ స్వర్గానికి చేరింది. అయుతుడు ఉస్సూరుమంటూ ముల్లోకాలను పవిత్రంచేసే పాండురంగక్షేత్రానికి చేరుకున్నాడు. వాధూలముని పాత్ర ఈ విధంగా కీలక పరిణామహేతువై, అయుతుని జీవితాన్ని మలుపుతిప్పింది. ఇంద్రుడు, తాను చేయలేని పనిని కామధేనువును మాయగోవుగా నటింపచేసి, పరోక్షంగా వాధూలముని శాపాగ్రహపాత్రుని చేసి, తనపంతాన్ని కోర్కెను నెరవేర్చుకున్నాడు.

**సావిత్రి – గాయత్రుల పాత్రచిత్రణ:**

అయుతనియుతల పరిణయార్థం అగస్త్యుడు బ్రహ్మలోకానికిపోయి, బ్రహ్మను యాచించి తెచ్చిన కన్యలు గాయత్రి సావిత్రులు. గాయత్రి సావిత్రులిద్దరూ బ్రహ్మమానసపుత్రికలు. వాళ్ల పేర్లు కూడ ప్రశస్తమైనవి.

అయుతుడు పెళ్లికి అంగీకరించనందున ఇద్దరినీ నియుతునికే యిచ్చి చేశారు. వాళ్ల బాహ్యాభ్యంతర సౌందర్యాన్ని గమనించి వాళ్ల యందు నియుతుడు సమబుద్ధితో ప్రేమవహించి వ్యవహరించాడు.

సీ॥ కుటిలాలకములు చీకటి ప్రోగులకు, నైన

చిచ్చంద్రికాధ్యముల్ చిత్తగతులు (5–180)

వంకరలు తిరిగిన ముంగురులు చీకటి పోగులు పెట్టినట్లున్నాయి. అయినా వాళ్ల మనసుల్లో జ్ఞానమనే వెన్నెలలు నిండియున్నాయట. వాళ్ల మధురాధరాలు ఎఱ్ఱగా రాగరంజితాలై ఉన్నాయి. అయినా వాళ్ల భావాలు వైరాగ్య బంధురాలట. వాళ్ల స్తనమండలాలు గర్వభరితాలై పెద్దవిగా ఉన్నాయి. అయినా వాళ్ల ఆశయాలు దుర్వికారాల్ని నశింపచేసేవిగా ఉన్నాయి. మందగమనలే అయినప్పటికీ వాళ్ల మనస్సులు జ్ఞానయుతాలు. చంచలమైన వాళ్ల చూపులు పొగరుతో కూడి యున్నప్పటికీ వాళ్ల నిండు మనస్సుల్లో నిశ్చలత్వముంది. అటువంటి వీళ్ల పట్ల నియుతుడు ప్రేమతో సమబుద్ధితో వ్యవహరించాడు.

ఇలా ఆంతరప్రకృతి, బాహ్యప్రకృతి సౌందర్యమయంగా జీవించే ప్రకృతిగల గాయత్రిసావిత్రులపట్ల నియుతుడు ప్రేమగా జీవితాల్ని సాగించటంలో వింతేమిలేదు? బహుశా అందుకేనేమో ఈ నియుతముని గురించి, వాని భార్యలగురించి కథలో మరే యితర ప్రస్తావనలు కనిపించవు.

ఇంద్రుడు మారువేషంలో వచ్చి, అయుతుని గురించి అడిగినప్పుడు అయుతుడు తన పూర్వకథను చెప్పే సందర్భంలో ఈ యువతుల ప్రస్తావన కనిపిస్తుంది. ఇంద్రునితో "ధాతృసంజాతల సన్నితాన్య జలజాతల జాతలతాంతసాయకద్యోతల నొక్కయిద్దరు తలోదరులన్" తీసికొని వచ్చి అగస్త్యుడు మమ్మల్ని పెళ్లి చేసికొమ్మన్నాడని చెపుతాడు. ఈ విశేషణాల అర్థమేమంటే, బ్రహ్మ పుత్రికలని, చిరునవ్వుగల చంద్రముఖులని, మన్మథుని బాణాల్లాగా కనిపిస్తున్నారని యువతులని. అలాగే ఈ సందర్భంలోనే "కనకనిభా జనకతనుద్యుతివిభవ" – లని అంటాడు. అంటే బంగారు కాంతి వంటి దేహకాంతితో ప్రకాశించే వారని – ఇంతకుమించి ఈ గాయత్రిసావిత్రుల ప్రస్తావనలు లేవు.

అతిలోకసౌందర్యవతులై, అంతకుమించిన మానసిక సౌందర్యంతో నియుతుని భార్యలుగా సాంసారిక జీవితంలో ఒదిగిపోయిన ధార్మికగృహిణులుగా పాఠకుల మనస్సులలో కరిగిపోయే పాత్రలు గాయత్రిసావిత్రులు.

**హరిదాసము విష్ణుపదాన్ని పొందిన విధానాన్ని వివరించండి.**

**లేదా**

**హరిదాసము కన్యాకుబ్జ రాకుమారిని పరిణయమాడిన విధానాన్ని వివరించండి.**

'హరిదాసము' – అన్న పేరు కప్పగా మారిపోయిన అయుతుని పేరు. మాయగోవును వదిలించుకునే క్రమంలో, అయుతుడు వాధూలముని శాపానికి గురయి కప్పగా మారిపోవలసివచ్చింది. పాండురంగని క్షేత్రానికి పోయి, అక్కడున్న నరసింహస్వామి సన్నిధిలో కప్పగా మారి అక్కడున్న బిలంలో కాలం గడుపుతున్నాడు. దైవఘటనకు చింతించకుండా దైవాన్ని మనసులో గట్టిగా పట్టుకుని కాలాన్ని వెళ్లదీస్తున్నాడు. పగడపుటాకులూ, ముత్యాలు కలిసినట్లు చక్కని రూపంతోనున్న ఆ కప్పను చూచి, తీర్థంలో తిరిగే జనం ఆశ్చర్యమగ్నులై ఆ కప్పను కొనియాడేవారు.

ఒకనాడు కన్యాకుబ్జపురాకుమార్తె, పాండురంగని ఉత్సవాలలో స్వామిని సేవించేందుకు చెలికత్తెలతో వచ్చింది. తమ తమ రథాలను దిగి, విరహులైన వాళ్ల మనస్సులలో నాటిన మన్మథ శరాల్లాగా నృసింహతీర్థానికి సమీపంలో విడిది చేశారు. దారిలో కలిగిన బడలికను తీర్చుకునేందుకై, భైమీనదిలోనికిదిగి నీటిని కలచివేశారు. అదేమీ పెద్ద వింతకాదు. ఎందుకంటే వాళ్ల వక్షోజాలగోరువెచ్చని కాంతి లేశమే ముల్లోకాల్ని కలచివేస్తోంది.

తపస్సు చేసుకునే మునులు తమ మనసు చిక్కబట్టుకొని తమ విధులు నిర్వర్తించుకుంటున్నారు. వాళ్లు రోజూ విసరుకొనే వింజామరలు సువాసనలు వెదజల్లుతుంటే వెగటుపడ్డారు. రోజూ పూజకు కోసుకునే పూమొగ్గలు, మదన బాణాలకు సహోదరంగా కనిపించి భ్రమ పెడుతున్నాయి. సోమతీగలను చూచి, అవి చంద్రుని పేరు స్వీకరించినట్లుగా అనిపించి వెలవెల పోయారు. చిగురుటాకుల్ని చూచి, వీటి రంగు చిలకపచ్చరంగులో ఉన్నదని మనోమృదులతను కోల్పోయారు. ఆ కన్యాకుబ్జ రాకుమారి అందచందాలకు అలా కష్టాలపాలయ్యారు. చెలికత్తెలతో కలసి ఆ రాకుమారి వీరవిహారం చేసింది.

ఆ భైమీతీర్థజలాన్ని విష్ణువు అభిషేకానికి తప్ప వేరే పనులకు ఉపయోగించరు. బ్రహ్మసైతం ఆ నీటిని వాడుకోవటానికి భయపడేవాడు. అటువంటి నీటిలోకి దిగి, ఆ కాంతల స్తనాలనే జక్కవపిట్టలు నీటిని కలతపెట్టాయి. సుగంధ ద్రవ్యాల మొక్కలున్న తోటలోని పూతేనెల పూతపై వాయుదేవుడే ఊపిరి పీల్చటానికి భయపడతాడు. అటువంటి తోటలో తమ నవ్వుల నునుమంచుతో యథేచ్ఛగా విహరించారు. ఎవరిని చూచి అల్లంత దూరంలో నిలబడి దూరాన నిలబడి దేవతలు దండాలు పెడతారో, అటువంటి ముక్కుమీద కోపంగల కాలభైరవుని, ఆస్త్రీలు ఆటబొమ్మలాగా తాకారు. ఏశంకాలేకుండా ఆ మఠంలోని విశాలమైన ఇసుక తిన్నలపైన ఇరుకు సందుల్లోను, తపస్సు చేసుకుంటున్న మునుల ధైర్యం ఆ బాలికల స్తనాలమీది కస్తూరి వాసనల దెబ్బకు దూదిపింజలై చెల్లాచెదరయింది. కార్యాకార్యాలు ఎంచకుండా ఆ అశ్వత్థవృక్షపు నీడలో మధుపానంచేసి, ఉయ్యాలలూగుతూ, నర్మోక్తులాడుతూ మన్మథపూజ చేయటంవంటి సాహసం చేశారు. యౌవనమదము, సౌందర్యమదమూ, దనమదమూ వీటికి తోడు మద్యపానపు ఉన్మాదముతోడయ్యాయి. మద్యంతాగిన మత్తులో వాళ్ల ప్రేలాపనలు మితిమీరాయి. పూలగుత్తి చుట్టూ తుమ్మెదతిరుగుతుంటే చూచి ఒకతె కృష్ణుడు యశోదాస్తన్యాన్ని తాగుతున్నాడని అన్నది. మరొకతె ముత్యాలతో నిండిన వెదురును చూచి అది బలిసిన పాములా ఉండడంతో, కద్రువకు నెలలు నిండాయి చూడండని అన్నది. ఏనుగు అరటి చెట్లను విరచటం చూచి, భీమునిగద వలన దుర్యోధనుని తొడలకు బాధకలిగిందని అన్నది. పూచిన మంకెన చెట్టును చూపి, సముద్రంనుండి బడబాగ్ని వెలువడిందని చెప్పిందొకతె. ఎర్రతామరను చుట్టిన హంసను చూపి శేషుడు చుట్టుకొన్న మేరుపర్వతమని పొగడిందింకొకతె. ఇలా పరమపావనమైన ఆ పౌండరీక తీర్థంయొక్క పరిశుద్ధతను ఆ రాకుమారి చెలికత్తెలతో కలసి ధ్వంసం చేయటాన్ని గమనించిన ఆ క్షేత్రంలోని ఉపదేవతలకు కోపం వచ్చింది.

దుర్గకు తన జడలోని నెలవంక నుండి స్రవించే అమృతంలా మోము చెమరించింది. మద్యపానం వలన ఎరుపెక్కినట్లుగా కాలభైరవుని కనులుఎరుపెక్కాయి. విట్ఠలుడు తనను కాకుండ అన్యాసక్తుడైనట్లు ముక్తకేశి బొమముడి ఎరుపెక్కింది. వేగంగా ఊపిరితీసుకోవటం వలననా అన్నట్లు శివుని వదనం కంపించింది. ఆ సమయంలోనే ఆ కాంతలు నృసింహుని పాదాల చెంతనున్న బిలంలోనుండి బయటికి వచ్చిన కప్ప పొడల పొడల దేహంతో ఉండటం గమనించారు. అది జడభరతుడిలా ఉందే అనుకున్నారు. దీని పుట్టిల్లు రోహణ నగమో, పాలకడలి గర్భమో, ఇంద్రధనుస్సు పుట్టినచోటో అయి యుంటుంది. లేకపోతే దీనికి యిన్ని వన్నెలు ఎలా ఉంటాయి? అని ఆశ్చర్యంతో సంపెంగ మొగ్గల వంటి ముక్కులున్న ఆయువతులు తమ చూపుల వలలు ఆకప్పచుట్టూ విసిరారు. చూచిందేతడవుగా ఆ కప్పను పట్టుకోవటానికి ఎగబడ్డారు. అది ఆటబంతికాదు. ఆడుకోవటానికి చిలుక అసలే కాదు. అద్దం అంతకన్నాకాదు. పలికే వీణాకాదు. అయినా పట్టుకోవటానికి ఎగబడ్డారు. అందులో, యువకులకు వలవేసి పట్టుకునే కీలకం

బాగా తెలిసిన ఒక అందగత్తె తన కొప్పులోని దండతో, కప్పను పట్టుకొనే ప్రయత్నం చేసింది. ఆ కప్పచిక్కలేదు. చిక్కకపోయే సరికి తనలోతానే తికమక పడింది. మరొక మీనాక్షి కప్పను పట్టుకోవటానికి తన వస్త్రాన్ని పరచింది. కప్ప తన గత జన్మలోని మమకారాదులనే నదిని ఈది దాటినట్లుగా గెంతి తప్పించుకుంది. వైకుంఠంలోనున్న వనితలు రావణునికి కలిగించిన అలజడిలా ఈ యువతలు కప్పకు అలజడి కలిగించారు. అయినా కప్పరూపంలోని అయుతుడు చిక్కలేదు. అయినా ఆ రాజకుమారి, తన పర్వత ద్వీప భారాన్ని ధైర్యంగా వహించే భూమాతలా స్వయంగా కప్పను పట్టుకునేందుకు రంగంలోకి దిగింది.

పందెం ఏదయినా వేయండి. దీనిని పట్టితీరుతాను, చూడండి అని చిరునవ్వుతో, చెలికత్తెల్ని పరిహసించి, కదలుతున్న మొలనూలనే వలతో సన్నద్ధమై కప్పను చూచి గర్వంగా ఇలా అన్నది. ఈ కప్ప సకల తీర్థాల ప్రాశస్త్యం తెలిసింది. అన్ని తీర్థాలలో కాంచీపురం శ్రేష్ఠమైందని అనిపించినట్లుంది. ఆ రాకుమారి కాంచి (మొలనూలు)కి కట్టువడింది.

గర్వంతోకూడిన తన చిరునవ్వు వెన్నెలలు చెక్కిళ్లపై ప్రసరిస్తుండగా ఆ రాకుమారి చిత్రమైన ఆ కప్పను కొంచెం సేపు పక్షిని ఆడించినట్లుగా ఆడించింది. మరికొంచెం సేపు మెరుపును ఆడించినట్లు, బొమ్మను ఆడించినట్లు ఆడించి వినోదించింది. ఆపైన కప్పకు భయపడే ఒక ముసలి విప్రుని మీద పడవేసింది. ఆతని శాపం వలన ఆ రాకుమారి, ఆమె చెలికత్తెలూ, కప్పలై, ఆ హరిదాసము (అయుతుడు)నకు భార్యలయ్యారు. ఇలా తన రూపానికి తగిన రూపము, శీలమూగల భార్యలు లభించారు. కప్పగా ఇంతకు పూర్వం నదీజలాన్ని ఈదినట్టు, ఇప్పుడు సంసారజలధిలో ఇనుమిక్కిలిగా ఈదుతున్నాడు. ఇంతకు పూర్వం రాకుమారికి బహిఃప్రాణంగానున్న చెలికత్తెలంతా ఇప్పుడు కప్పల రాజైన అయుతునికి రాకుమారి బార్యకాగానే వాళ్లంతా సపత్నులయ్యారు. సాపత్న్యమెంతకీడైనది?

ఆ నున్నని మోము, సన్నని నూగుమీసములు నశింపక మునుపు అంటే ఆతడు నూత్నయౌవనంలో నున్న దినాలలో ఆ దేవేంద్రుడే వచ్చి మా అన్నవుగదా! గృహస్థాశ్రమం చేపట్టి అగ్రగణ్యుడవై యుండమని చెప్పినప్పుడు కాదని వాదించిన ధైర్యవంతుడు ఎలా అయిపోయినాడో చూడండి. ఆ కప్పసతులు అలిగితే వారి పాదాలకు నమస్కరించి వేడుకుని మరీ వాటిని ప్రసన్నం చేసుకుంటున్నాడు. మనసుకరిగించి, మన్మథుడు వేసే బాణాల దెబ్బల్ని లెక్కపెట్టుకొంటున్నాడు. స్వాతి చినుకులు ఆలిచిప్పలో పడి ముత్యాలయినట్లు, అయుతుని ప్రేమ పర్యాయక్రమంలో ఆ కాంతలందునిలిచింది. ఆ క్రమంలోనే రాకుమారికి, అయుతునికీ సంతానం కలిగింది. దాంతో శాపపు చీకట్లు తొలిగాయి. వివేకచంద్రోదయమైంది. విష్ణుపదంగా గోచరించింది. ఇలా మందపాలునితో సమానమైన శీలంగల అయుతుని చరితం రసవంతమైంది. ఇది హరిదాసము సంసార జలధిలో జీవుని గాథ.

**'పాండురంగమాహాత్మ్యం-గృహస్థాశ్రమధర్మబోధకమైంది'-మీ పాఠ్యభాగం ఆధారంగా నిరూపించండి.**

**(లేదా)**

**'అయుతనియుతోపాఖ్యానం గృహస్థధర్మాన్ని బలపరిచేది' – వివరించండి.**

పాండురంగమాహాత్మ్యం క్షేత్రమాహాత్మ్యకావ్యం. పాండురంగవిట్ఠలుని గురించి ఎంతగా కీర్తిస్తుందో, అందులోని కథలద్వారా మాతాపితరుల సేవను, గృహస్థధర్మాన్ని అంతకుమించి వివరిస్తుంది. ఈ అయుతనియుతోపాఖ్యానం ద్వారా కూడా అటువంటి గృహస్థధర్మాన్నే సమర్థించి బోధిస్తుంది.

అయుతనియుతులెంత గొప్ప శిష్యులయినా అగస్త్యుడు వాళ్లను తాపసజీవనానికి ప్రోత్సహించలేదు. బ్రహ్మమానస పుత్రికల్ని తెచ్చి పరిణయం చేసికొమ్మని కోరాడు. కాదు బ్రహ్మచర్యమే కావాలన్న అయుతుడిని ఆశ్రమంనుండి వెళ్లగొట్టి, నియుతునికే ఆ ఇద్దరు కన్యకలనిచ్చి పెళ్లిచేశాడు.

తాపసచర్యకు కూర్చున్న అయుతుని వద్దకు వచ్చిన ఇంద్రుడు, మారువేషంలో సకుటుంబంగా వచ్చే బాటసారిగానే వచ్చాడు. ఇంద్రుడు అయుతునితో చేసిన సంభాషణలో బహుముఖాలుగా గృహస్థధర్మాన్ని గురించే ప్రస్తావించాడు. కులధర్మాన్ని పాటించి, కన్నవాళ్లను గౌరవించి, మిత్రుడు, సౌభ్రాత్రుల్ని, తోబుట్టువుల్ని ఆదరించి గృహస్థువు కమ్మని చెప్పాడు. గృహస్థునిగా ఉండి రాజయోగిగా సుఖభోగాలననుభవించిన జనకమహర్షి గురించి చెప్పి మనసు మార్చుకొమ్మని చెప్పాడు.

సీ॥ కీలారముననుండి పాలింటికేతేర
బహుధాన్యములు చేల బండి యొరగ
నెడనెడ బెండ్లిండ్లు వడుగులు వొడమ గృ
తార్థులై యర్థించు యర్థు లలర
బరిచారికా కోటి పనిపాటు పాటింప
జుట్టంపు సందడి నెట్టుకొనగ
గ్రామమెంతయు నిజప్రాభవంబున మన
సత్య నిష్ఠకు దన్ను సాక్షి గోర
తే. నిత్యనైమిత్తికములు నిర్ఛిద్రబుద్ధి
నాచరించుచు హరిభుక్త మాత్మభార్య
భక్తినిడ భుక్తిగొనుచున్కి ముక్తి కాని
నిదురవంటిది రాతివంటిదియు గాదు. (5-216)

ఇదొక ఆదర్శ గృహస్థ జీవన దృశ్యం. మోక్షమంటే నిద్రలాంటిదో, రాతిలాంటిదో కాదని, గృహస్థజీవనాన్ని ఎంతో అందంగా చెప్పాడు. కుటుంబ జీవన సౌందర్యాన్ని సాహిత్యంలో ఇంత అందంగా వ్యాఖ్యానించి చెప్పిన పద్యాలు అరుదు. ఇంటికొట్టంలోనుండి పాలు ఇంట్లోకి తెచ్చుకొంటూ సమృద్ధిగా చేలల్లో పండిన బహుధాన్యాలు ఇంటికి వస్తుంటే – పాడి పంట సమృద్ధిగా ఉన్నట్లు లెక్క. అప్పుడప్పుడు పెళ్లిళ్లు, ఒడుగులు వంటి శుభకార్యాలు జరుగుతుంటే, బంధువర్గం వచ్చి సందడి చేస్తుంటే యాచనార్థం వచ్చిన యాచకులు కావలసింది యజమాని ద్వారా పొంది సంతోషంగా పోతుంటే, ఊళ్లో జనం సత్యనిష్ఠకు సాక్షిగా పిలుస్తుంటే, భగవంతునికి నివేదించిన అన్నాన్ని, భార్యవడ్డించగా తింటూ జీవించటాన్ని మించిన ముక్తి ఏముందని ప్రశ్నిస్తాడు? సమాజంలో గృహస్థ జీవనమెలా కీలకంగా ఉందో ఈ పద్యం ద్వారా వ్యాఖ్యానించి చెప్పాడు.

వాధూలముని శాపానికి గురైన అయుతుడు, మునిపాదాలపైబడి ప్రాధేయపడినప్పుడు శాపావసానాన్ని చెపుతూ గృహస్థజీవన వైశిష్ట్యాన్ని చెపుతూ

సీ॥ జలధరంబున నెద్ది పొలపంబు పుట్టించు
నిల్లాలి మెరుగుల మొల్లములకు

మున్నీరనగ నెద్ది మొలుచుట కావాల
మాణిపూసలు వోని ఆత్మజులకు
నీడగ్రాకన నెద్ది నిలువనీడై తోచు
నాకట నిండు ద్విజావళులకు
దాపన నెద్ది యాధారమై దివిగ్రాకు
పితృవర్యులకు కుంటు పిచ్చుకలకు
తే॥ నట్టి గృహమేధి ధర్మంబు నందు నీవు
కుత్సజేయుట నీరీతి కొదవయొదవె
నొప్పునది యొప్పదని పల్కునుద్ధతులకు
గసరి పైవచ్చు రాళ్ళపై గాలియైన. (5-261)

ఈ పద్యంలో గృహస్థధర్మపు వైశిష్ట్యంతోపాటు, దానిని నిరసించటం వలన కలిగిన అనర్థాన్ని కూడా చెప్పటాన్ని గమనించవచ్చు.

గృహస్థాశ్రమమంటే భార్య మెఱుగులకు ప్రకాశం కలిగించే మేఘంలాంటిది. మణిపూసల్లాంటి సంతానం మొలిచే సముద్రంలాంటిది. పశుపక్ష్యాదులకు నీడనిచ్చే వృక్షంలాంటిది. పితృదేవతలను ఊర్ధ్వగతులకు పంపించే ఆధారం. ఇటువంటి గృహస్థధర్మాన్ని నీవు నిందించటం వలన నీకెలాంటి అవస్థ కలిగింది. ధర్మమైన దానిని ధర్మం కాదనే దురహంకారులకు, రాళ్లపైనుండైనా సరే! గాలి వచ్చి దెబ్బతీస్తుంది! అని చెప్పటంలో ఈ గృహస్థాశ్రమ ప్రాశస్త్యమే కనిపిస్తుంది.

వాధూలముని చెప్పిన శాపావసానం కూడా సంతానం కన్న తరువాతే ముక్తి లభిస్తుందని. జీవితాన్ని పచ్చగా పండించుకోవటమంటే భార్యాపిల్లలతో వర్ధిల్లి పదిమందికి ఆశ్రయం కావటమేనన్న స్ఫూర్తి వాధూలుని ప్రసంగంలో కనిపిస్తుంది.

సంతానాన్ని కనటమంటే కని సమాజంమీద పారవేయటం కాదు. పితౄణం, వంశఋణం తీర్చుకోవటంగా మన ఋష్యాదులు భావించారు. అయుతునితో వాధూలుడు చేసిన ప్రస్తావనలోకూడా ఆడకప్పతోనీకు సంతానసిద్ధి కలుగుతుంది. అప్పుడు పితౄణం తీరిశాపవిమోచనం, మోక్షసిద్ధి కలుగుతాయని చెపుతాడు. అంటే సంతానం పితౄణం తీర్చుకోవటానికి దారియని మన సంస్కృతి బోధిస్తున్నది. కేవల కామేచ్ఛ తీర్చుకొని, భూభారంగా సంతానాన్ని కనటం వారి తాత్పర్యంకాదు.

అయుతునికి శాపమోక్షణం జరిగాక, ఈ కథను చెప్పే పరమేశ్వరుడు నారదునితో ఇలా అంటాడు. "సలపితుండగుట మందపాలసమశీలుండగు ప్రియుతనందను చరిత్రం బద్భుత రసైక పాత్రంబయ్యెనిట్లు" (5-317) – అని మందపాలునితో సమానమైన శీలంగల అయుతుని చరిత్ర అద్భుతరసంతో కూడి కనిపిస్తుందని అంటాడు.

మందపాలుడు కూడా అయుతునిలాగే బ్రహ్మచర్యంతో గడిపిన ముని. తపస్సుచేసి యోగంతో దేహాన్ని వదిలాడు. కాని సంతానం లేనందున పుణ్యగతులు కలుగలేదు. అందుకని మళ్లీ భూమి మీదికొచ్చి మానవునిగా సంతానాన్ని పొందటం ఆలస్యమవుతుందని పక్షిగా మారి జరితయందు సంతానాన్ని కన్నాడు. ఆ పిదప

జరితను సంతానాన్ని విడిచి లపితతో యుండిపోయాడు. అప్పుడే ఖాండవవన దహనం జరిగి, జరిత తన బిడ్డ ప్రాణాల్ని కాపాడుకోవటం కోసం ఎంతో ప్రయాసపడుతుంది.

అగ్నిదేవుని ప్రార్థించి సంతానాన్ని కాపాడుకుంటుంది జరిత. ఆ పిదప వచ్చిన మందపాలుడు భార్యాబిడ్డలు అగ్నికి ఆహుతికానందుకు ఎంతో సంతోషిస్తాడు. మందపాలునిలాగే అయుతుడు కూడా, మోక్ష మార్గానికి సంతుపొందటమే కారకమైంది. జరితతో సరిపెట్టుకోకుండా మందపాలుడు లపితపట్ల ఆకర్షితుడైనట్లు, అయుతుడు కూడ కన్యాకుబ్జ రాకుమారితో మాత్రమే సరిపెట్టుకొనలేదు. ఆమె చెలికత్తెల్ని కూడా పరిణయం చేసుకుని సుఖాలననుభవించాడు. ఆ విషయాన్నే వ్యంగ్యంగా 'సలపితుండగు మందపాలు సమశీలుండగు ప్రియుతనందను చరిత్రం'బని ఉపమించి చెప్పాడు. ఏమైనా మందపాలునకు, అయుతునకు సంతానప్రాప్తి జరిగాకే మోక్షప్రాప్తి లభించింది.

చివరిగా గృహస్థధర్మాన్ని ప్రశంసిస్తు శివుడు ఇలా అంటాడు.

క॥ "గృహమేధి ధర్మమర్మా
సహమతియగు కుమతి యయుతు చందమున, సుదు
స్సహదుఃఖగ్రాహాసన
గృహఁబడునని వింటిమునుముకుందునిచేతన్" (5-318)

"గృహస్థధర్మమనే కవచాన్ని వద్దనే దుష్టబుద్ధి, భరింపరాని మొసలినోరనే దుఃఖపు గుహలో నలిగిపోతాడని పూర్వం విష్ణువు చెప్పగా విన్నా"నని చెప్పటంలో ఈ గృహస్థ ధర్మాన్ని మరింతగా చెప్పటమే.

పాఠం - 13

# సీతాపరిత్యాగం

## - కంకంటి పాపరాజు

## (శ్రీ మదుత్తర రామాయణం-షష్ఠాశ్వాసం-232 నుండి 351 వరకు పద్యాలు)

## కవి పరిచయం, పాఠ్యభాగ ఇతివృత్తం

### 13.1. కవి పరిచయం:

కంకటి పాపరాజు 17వ శతాబ్దానికి చెందిన కవి, నెల్లూరు మండలానికి చెందినవాడు. మదన గోపాలస్వామి భక్తుడు. చతుర్విధ కవితా నిపుణుడు, గణితశాస్త్ర రత్నాకరుడు. చేమకూర వేంకటకవి తరువాత అంత మంచికవిగా చెప్పుకోదగినవాడు కంకంటి పాపరాజు. కంకంటి పాపరాజు "విష్ణుమాయా విలాసం" అనే యక్షగానాన్ని, "ఉత్తర రామాయణం" అనే ఉత్తమ ప్రబంధాన్ని రచించాడు. ఈ రెండు రచనలు మదన గోపాలస్వామికే అంకితమిచ్చాడు.

ఎనిమిది ఆశ్వాసాల శ్రీమదుత్తర రామాయణాన్ని తానెందుకు రచించాడో తెలిపాడిలా:

"పరమ శ్రావ్య మఘ వ్యయామిత కథాభవ్యంబు దీవ్యత్సుధే
పరిషత్సంతత సేవ్యమబ్జభవ సంభావ్యంబునై మించును
త్తర రామాయణ కావ్యమున్ మృదువచోధారార్థ సందర్భ ని
ర్భర తత్తద్రసముల్ రహింప రచియింపం బూనితిన్ వేడుకన్"

సంస్కృతంలోని వాల్మీకి రామాయణంలోని ఉత్తర కాండను స్వీకరించి తిక్కన 'నిర్వచనోత్తర రామాయణం' గా రచించాడు. తిక్కన తర్వాత కంకంటి పాపరాజు మాత్రమే ఉత్తర రామాయణాన్ని రచించాడు. కంకంటి పాపరాజు కవిత్వంలో మృదుపద విన్యాసం, అర్థ సందర్భం, రస సంపద వంటటి కవితాగుణాలున్నాయని కరుణశ్రీగారు వివరించారు. ఇంకా ఇతడి శైలి సంస్కృత సమాసభూయిష్టమై ధారాళంగా సాగుతుంది.

'శ్రీ మదుత్తర రామాయణం' లోని 'సీతా పరిత్యాగం' ప్రస్తుత పాఠ్యాంశం. ఈ పాఠ్యాంశంలో భవభూతి ఉత్తర రామచరితలో ఏవిధంగా కరుణరసం పరాకాష్ఠకు చేరిందో అలాగే ఇందులోనూ కరుణ రసం పరాకాష్ఠకు చేరింది.

### 13.2. పాఠ్యభాగ సందర్భం:

రాజ్యంలోని ప్రజలు రాజ్యపాలనలోని మంచిని, రాజు మృదువర్తనని గుర్తించలేని వారు గుమికూడి రాజు రావణుడు లంకలో ఉంచుకున్న ఇల్లాలిని తెచ్చి మోహంతో ఏలుకుంటున్నాడని అనుకుంటున్నారని చారుడు భద్రుడు రాముడి

ఆజ్ఞకు లోబడి తెలియజేశాడు. ఆ మాటలకు ఎంతగానో బాధపడిన రాముడు తన తమ్ములను పిలిచి ప్రజలు అంటున్న మాటలు తన గుండెలో అమ్ములై గుచ్చుకుంటున్నాయని తెలియజేశాడు. రాజుకు అపకీర్తి కలిగితే వారి తర్వాత కూడా అది భూమిపై నిలిచిపోతుందని ఆ అపకీర్తి తొలిగించుకోవటానికి ప్రాణానికి ప్రాణమైన మిమ్మల్నైనా వదులుకుంటాను. ఇంక జానకిని ఎడబాయటం ఎంత అని తెలిపాడు. లక్ష్మణుడితో సీతకు గంగాతీరంలోని తపోవనాలు చూడాలనే కోరిక కలిగింది, ఆ నెపంతో ఆమెను అక్కడ విడిచిరమ్మని చెప్పాడు. లక్ష్మణుడు ఆ తరువాతి రోజు సుమంత్రుడితో రథం తెప్పించి రథం వచ్చింది రమ్మనగా సంతోషంతో వస్తున్న సీతాదేవిని చూస్తూ మనస్సులోనే దుఃఖించాడు లక్ష్మణుడు. సీతాదేవిని లక్ష్మణుడు తపోవనానికి తీసుకువెళ్ళి అక్కడ వదిలిపెట్టి వచ్చే సందర్భంలోనిదీ పాఠం.

## 13.3. పాఠ్యభాగ ఇతివృత్తం:

సీతాదేవి తపోవనంలోని మునిపత్నులకివ్వటం కోసం కొన్ని వస్త్రాలు, రత్న భూషణాలు తీసుకొని మరిదితోపాటు ఎంతో వేడుకగా రథాన్ని ఎక్కి కూర్చోగా సుమంత్రుడు వేగంగా రథాన్ని తోలాడు. రాముడి ఆజ్ఞకు భయపడుతూ లక్ష్మణుడు భయం, ఆర్తి, దైన్యం ముప్పిరిగొన్న మనస్సు కలిగివాడై ఉండగా సీతకు ఎన్నో దుశ్శకునాలు కనిపించాయి. ఆ దుశ్శకునాలు చూసిన సీతాదేవి భయపడుతూ లక్ష్మణుడితో 'ఈ విధంగా దుశ్శకునాలు కనిపించటం నా మనసుకు భయం కలిగిస్తుంది. జగమంతా పాడయినట్లు నా కంటికి కనిపిస్తుంది. నా భర్తను వదిలి మునిపత్నులను చూస్తానని నేనెందుకు వచ్చాను, మంచి చెడులూ తెలియనివారు స్త్రీలని రాముడు నన్ను పంపకుండా ఉండకుండా ఎందుకు పంపాడు? నా మనసులోని కోరిక చెప్పమంటే పదునాలుగేండ్లు చూసిన అడవులే కదా ఇంకేముంటాయిలే అనుకోక నేను అడవులు చూడాలని విపరీతమైన కోరిక ఎందుకు కోరుకున్నాను ? అలా విపరీత కోరికలు కోరేవారికి దుశ్శకునాలు కనిపించకుండా ఎలా ఉంటాయి ? బుద్ధి హీనులకు విపరీతకాలానికి విపరీత బుద్ధులన్నట్లు నేను కోరరాని కోరిక కోరి వచ్చాను, నా దుర్దశను తెలిపే శకునాలులాగా ఇవి ఉన్నాయి. భర్తను ఎడబాసి వస్తున్న తెగువదారిని నాకు బాధ ఎందుకు ? ఈ అపశకునాల వలన కలుగు ఆపదలన్నీ పోగొట్టి రాముడికీ, నీకు, అత్తలకు, మిగిలిన బంధువులకు, ప్రజలకు వివిధ శుభాలు ఆ దేవతలివ్వాలని నమస్కరించింది. ఆమె చిత్తశుద్ధికి లక్ష్మణుడు ఈమె లోకమాత, ఎప్పుడూ భర్తతో కూడి ఉండి సుఖించేవిధంగా చేయకుండా ఎడబాసే విధంగా చేసింది విధి అని ఉస్సురంటూ నిట్టూర్చాడు. లక్ష్మణుడి తీరు, ఆగకుండా కనిపిస్తున్న దుశ్శకునాల తీరు చూసి మెదలకుండా ఉంది దైవగతిని మార్చలేము కదా. ఈ విధంగా సీతాలక్ష్మణులు అడవులు దాటి, ఏరులు దాటి, పర్వతాలు దాటి, పట్టణాలు దాటి ప్రయాణిస్తూ రాత్రవటం చేత ఒక ఆశ్రమంలో విశ్రాంతి తీసుకుని ఉదయాన్నే మళ్ళీ రథమెక్కి ప్రయాణించి ఆ మధ్యాహ్నానికి గంగానదీ తీరాన్ని చేరారు.

గంగానదిని చూసి సంతోషిస్తున్న సీతను చూచి లక్ష్మణుడు ప్రజలు పలికిన అపవాదు ఈమెకు తెలియదు, ఇంక తెలియజేస్తాను అనుకొని కన్నుల నీరు నింపుకొని, ఆపలేని బాధతో దిగులుపడుతున్న లక్ష్మణుడిని చూసి సీతాదేవి పట్టణం వదిలిన దగ్గర నుంచి నీ ముఖం తీరు చూసి దిగులు కలుగుతుంది. మీ అన్నకు, సోదరులకు, ఆప్తులకు శుభమే కదన్న, నీ కళ్ళలో కన్నీరెందుకొస్తుంది? సంపదంతా వదిలి అడవికొచ్చి అన్నను సేవించేటప్పుడు, ఇంద్రజిత్తునితో యుద్ధం చేసేటప్పుడు, రావణాసురుడి శక్తి నీ రొమ్ములో దిగినప్పుడు నీ కంట కన్నీరు రాలేదు. ఇప్పుడెందుకు వస్తుంది తండ్రీ చెప్పు మానసిక బాధలని, శారీరక రోగాలను పోగొట్టే పుణ్యరాశి అయిన గంగానదిని చేరి కూడా బాధపడవచ్చా ? వెంటనే

ఈ నది దాటి తాపసపత్నులను చూసి కానుకలిచ్చి, దీవెనలు అందుకొని వేగంగా వద్దాము రా' అని పలికింది. ఇంకా బాధపడుతున్న లక్ష్మణుడితో 'చూడకూడని దుశ్శకునాలు చూసినప్పటి నుండి మనసు నాకు కలత చెందుతుంది, పోనీ తిరిగి వెళ్ళిపోదామా' అని అడిగింది. కన్నీరు నింపుతూనే లక్ష్మణుడు దుశ్శకునాలే నాకు బాధకలిగించాయి, అయోధ్యకెందుకు, అవతలి ఒడ్డుకు వెళదామంటూ రథముదిగి అక్కడనే సారథిని ఉంచి ఓడపై సీతాదేవిని ఎక్కిపించి, తానూ ఎక్కి గంగానదిని దాటి ఇంకా శోక సముద్రంలోనే మునిగి ధారగా కన్నీరు కారుస్తున్నాడు.

సీతాదేవిని దీనంగా చూస్తూ అమ్మా! ఈ హృదయగాయం మానదు, శోకమనే అగ్నిలో కాలటం కంటే కూడా మరణమే మేలు. ప్రజలు నిందించే పని చేయడానికి వచ్చాను, నన్ను శపించు అంటూ లక్ష్మణుడు ఆమె పాదాలపై పడి ఏడవసాగాడు. సీతాదేవికి మొదట్లో లేని దీనత్వం కలుగగా, 'మీ అన్న అనేక కష్టాలు పడినప్పుడు కూడా నువ్వు ఇంతకుముందు ఇంత బాధపడలేదు. నిన్ను అందరూ మంచి గుణాలకు సముద్రుడి వంటారు, ఎవరికి నీవు కీడు తలపెట్టావు చెప్పు. పరస్త్రీలను ఎప్పుడూ తల్లులుగా భావిస్తావు, పరాయి సొమ్ము అంటే హాలహలంలాగా చూస్తావు. ఎప్పుడూ అసత్యం చెప్పవు. ఎవరినీ పరుషంగా మాట్లాడవు. బ్రాహ్మణ భక్తి, రామసేవ వదలవు. వీటిలో జనులు నిందించే పనులేమున్నాయి ? మన్నన విడిచి మీ యన్న నిన్ను నిరాకరించాడా, నీకు అన్న మీద భక్తి తొలగిందా, కన్నతల్లిని కష్టపెట్టావా, గురునింద చేశావా, పరదూషణ చేశావా, కృపలేక శరణన్న వారిని త్రోసేశావా, శత్రువులకు వెన్ను చూపించి పారిపోయావా, రాముడి ఆజ్ఞ లేకుండా నన్ను ఇక్కడకు తీసుకొని వచ్చావా, నా మీద రాముడి మనసు తొలగి ఉందా? ఏమైందీ నాకు తెలియజెయ్యి' అని అడిగింది. ఇంకా 'లక్ష్మణా! నాకు భయం కలుగుతుంది. భూదేవి అల్లుడు, పద్మదళాక్షుడు, దివికుల పూర్ణచంద్రుడు, రాక్షసులకు మదగజంలాంటివాడు, ఆ మహారాజు రాముడు క్షేమంగానే ఉన్నాడు కదా, దయలేనివాడై నిన్ను గాని, నన్ను గాని మానాడా, అనుమానం లేకుండా చెప్పు' అని సీతాదేవి అడిగింది. విషయం తెలపటానికి కొంత బాధపడి, తెలుపకుండానూ వెళ్ళరాదని దృఢనిశ్చయంతో నమస్కరించి కన్నీరు కారుతుండగా సీతాదేవితో 'ఇంత పనికి పూనుకొని వచ్చి చెప్పకుండా ఉంటానా తల్లీ, వినుము. చెడ్డవారు 'రాక్షసుడి చేతిలోబడిన భార్యను తిరిగి ఏలుకుంటున్నాడు, రాముడెంత మోహి' అని నిందలు పలుకగా విని రాజు నిన్ను అడవులలో వదిలి రమ్మనాడు. మునులు, తపోధనులు, అమోఘమైన దయగలవారిని ఆశ్రయించి ఇంక నువ్వు అడవులలో నీ రోజులు గడుపు. నా నాలుక ఇలాంటి మాటలు చెప్పడం, నా మనసు కష్టం సహించటం, ఎంత అయ్యిందో చూడు. రాజు లోకనింద పడలేక నిను అడవిలో వదలమంటే విని సహించి అడువులకు తీసుకొని వచ్చాను, జనుల నెదిరించలేనివాడిని, నేను ఎంతటి మూర్ఖుడిని, నన్ను విధి ఏవిధంగా సృష్టించిందో, భయంకర అడవులలో నిన్ను దింపి రమ్మని రాముడు నన్ను పంపాడు. ఇక్కడ ఎలా ఉండగలవు, ఎవరు స్నేహితులవుతారు. ఏమి ఆలోచిస్తూ రోజులు వెళ్ళదీస్తావు. నీ పవిత్రత, వినయం, సద్గుణాలు రాముడికి తెలిసివుండి కూడా నిందలకు భయపడి నీవు కోరిన వరం నెపంగా ఇక్కడికి పంపాడు. నీ విరహాబ్ధిని అతడు ఎలా ఈదగలడు ఇంక మీదట. శత్రువులకైనా ఇలాంటి కష్టం వస్తే చూడలేము. ఈ అడవిలో నిన్ను విడిచి నేనెలా వెళ్ళగలను, రాజు నన్ను ఇలాంటి పనికి పొమ్మన్నాడు. ఏ పనైనా చేయడానికి వెనుకాడడు ఈ కఠిన హృదయం కలిగినవాడని పంపాడేమో! ఇంక ఈ భయంకరమృగాలే నీకు స్నేహితులు, ఈ అడవులే నీవు విహరించే పూదోటలు. ఎంత భయంకరమైన చోట ఒంటరిగా నిలిచావు తల్లీ. నీవు మహా పతివ్రతవు, సౌశీల్యవతివి. ఇల్లాళ్ళందరిలో గొప్పదానివి. రాముడి పాదపద్మాలను హృదయంలో నిలుపుకొని ఉండుమమ్మా అని చెప్పటానికి నేనెవ్వరిని, భర్తను వదిలి నిన్ను ఒంటరిని చేసిన పాపాత్ముడిని' అని చెప్పాడు.

అప్పుడు మెల్లగా అవన్నీ విన్న సీత హా తల్లీ! అంటూ నేలపై పడిపోయింది. అలాపడి ఒళ్ళు తెలీకుండా, చేతనం లేకుండా రెండు ఘడియలుండి కొంతసేపటికి తెలివొంది కళ్ళనుండి కీన్నరు కారి చెక్కిళ్ళపై జారుతుండగా, నిట్టూర్పు సెగలకు చిగురులాంటి నోరు తుకతుక ఉడకగా, కొప్పుముడి విడిపోగా, చెమటలు కమ్మి శరీరం గడగడ వణకగా, ధైర్యం కోల్పోయి, దుఃఖం ముప్పిరిగొనగా కొంచెంసేపు ఎక్కిఎక్కి ఏడుస్తూ, మళ్ళీ కొంచెంసేపు ఏడుపు ఆపి మౌనంగా ఉంటూ, మౌనం మాని తనలో తాను నవ్వుకుంటూ, నవ్వు మాని తల ఊపుతూ, తల ఊపటం ఆపి ముక్కుపై వేలుంచుకొని, జాలిగా ఏడుస్తూ, లక్ష్మణుడి వైపు తిరిగి ఈ విధంగా అంది "లక్ష్మణా! నువ్వు బాధపడకు, రాజు ఆజ్ఞ నువ్వు జవదాటకూడదు కదా, భూమి మీద బాధలు పడమని విధి నన్ను సృష్టించింది, దానిని అనుభవించకుండా ఎవరు ఆపగలరు. అడవులకు వెళ్ళినప్పుడే ఆపదలు అనుభవించాను అనుకున్నాను కానీ చివరకు నా గతి ఇలా అవుతుందనుకోలేదు. ఆ దుశ్శకునాల ఫలితం ఈ దుఃఖం. ఈ దుఃఖం కలగాలనే విధి తలచి నా మనసులో ఆ కోరిక కలిగించింది. పూర్వజన్మలో ఏ దంపతులను విడదీసి వారు బాధపడుతుంటే నవ్వానేమో, ఆ పాపం ఊరకనే పోతుందా ? ఆనాడు రామపాదపద్మాల దగ్గర వసించాను. ఈనాడు భర్త పొందు వదలి అనాథనై ఈ శరీరంలో ప్రాణాలని ఎలా భరించగలను. నేను సాధ్వినని అందరూ నన్ను గౌరవిస్తారని సంతోషించాను గాని మధ్యలో ఇలాంటి నిందలు కలిగి రాముడు నన్ను అడవులకి పంపుతాడని ఎరుగను. అయ్యో లక్షణా! పిడుగు కంటే అధికమైన మాట ఈ విధంగా విని కూడా గుండె ఎప్పటిలానే ఉంది. ఇంత కఠినమైన భావానికే ప్రాణాలు పోకుండా భరించి ఉన్నాను, ఇంక ఈ అడవిలో ఇంకే కష్టాలు పొందగనున్నానో, కలవరపడి నువ్వు తెల్పావో లేక పరాకుగా విన్నావో లేకపోతే కలలోనైనా శ్రీరాముడు నన్ను అడవులలో త్రోయపంపునా, లక్ష్మణా మతిభ్రమ అయినదా, భ్రాంతి ఉందో, ఇంక ఎన్నటికైనా నేను రాముడిని నా కళ్ళతో చూడగలనో, లేదో చూడలేకపోతే ప్రాణమెందుకు పోలేదు, రాముడికి ఇదంతా వినిపించు. నా శరీరముంది ప్రక్కనే గంగానది ఉంది, చివరకు ఎలా అయితే అలా అవుతుంది. నా భర్త నాడు తనను వదిలి చాలా రోజులు అశోకవనంలో ఉంది కదా ఇప్పుడూ అలాగే బ్రతుకుతుందనుకుంటున్నాడేమో ఆ రోజున భర్త వచ్చి శత్రువుని చంపి నన్ను ఏలుకుంటాడనే ఆశ నన్ను బ్రతికించింది. ఈ రోజు ఏ ఆశతో శరీరాన్ని నిలుపుకోగలను లక్షణా! ఎరుగని మూర్ఖులు పలికిన నిందలకు భయపడి భర్త కరకుమనసుతో అడవికి పంపవచ్చు. కానీ ఆ విధానం ఒకసారి నన్ను పిలిచి తెల్పి మనోవ్యధ తీర్చి నిన్ను మరువనని పంపలేదు కదా, నాపై అభిమానం, చెలిమి ఎటుపోయాయో కదా! అకస్మాత్తుగా పుట్టిన అపవాదుకు శ్రీరాముడు ఆ కరుణను, ప్రసన్నతను, కూరిమిని, ప్రియంగా మాట్లాడటాన్ని, ఆ గౌరవాన్ని మరిచిపోయాడు కదా. ఓ లక్షణా! చెవుల వరకు ఉన్న దీర్ఘనేత్రాలతో, మణులతో కూడిన కుండలాలు కలిగిన రెండు చెవులతో, సుందరమైన నుదురుతో, వెన్నెల వంటి చిరునవ్వులతో అలలారే ఆ శ్రీరాముడి ముఖాన్ని ఈ జన్మలో ఇక చూసే భాగ్యమింకలేదేమో! భూమి నుండి అయోనిజగా పుట్టి, మిథిలలో జనకుని ఇంటిలో నేను పెరిగిన విధం వినరో, అనసూయ వంటి సతీమణులు నన్ను మెచ్చినది వినరో, ఆ లంకలో మూడు లోకాలు నన్ను ప్రస్తుతించే విధంగా అగ్నిలో నేను ప్రవేశించినది వినరో, ఈ సీత నిర్దోషి, ఏలుకోమని రాముడికి బ్రహ్మాదులు చెప్పినది వినరో, విని చూసి కూడా ప్రజలు నన్ను నిందిస్తే అంతమాత్రానికే రాజు ఉలికిపడి ఇలా తెగించటం నా అభాగ్యమే ఇంక వేరే మాటలెందుకు? ఈ వనానికి భర్తను వదిలి ఒంటరిగా ఎందుకు వచ్చావని మునిపత్నులు అందరూ గూమికూడి అడిగితే వారికి నేనేమని వివరించగలను. ఇంత ఆపదను ఎలా దాటగలను, దేని ఆధారంగా ఈ ప్రతిక్షణ మహాయుగాలని గడుపగలను లక్ష్మణా ?" అని సీతాదేవి భర్త తెగువకు పరితపిస్తూ చిత్రంలా నిలిచిన మరిదితో ఇంకా ఇలా అంది.

'బాధతో నాకు తోచినవన్నీ అన్నాను. భర్తకు జగదపవాదును దాటటం సాధ్యమేనా ? నేను వియోగభారంతో తెగించి రాముడిని జననిందితుడిని చేయను. తన ఆజ్ఞ అన్ని విధాలుగా పాటిస్తూ నేనీ అడవులలో నివసిస్తాను

ఈ శరీరమున్నంత వరకు. ఇంక లక్ష్మణా! ఆలశ్యమెందుకు, అయోధ్యాపురానికి వెళ్ళు ముగ్గురత్తలకు మ్రొక్కానని చెప్పు. అక్కడి బంధువులందరినీ అడిగానని చెప్పు. ఎక్కువ దయగలవాడైన శ్రీరాముడికి నేను మ్రొక్కినట్లుగా నీవు అతిభక్తిగా మ్రొక్కు. తన ఆజ్ఞ శిరసావహించి అడవులలో నివసిస్తానని చెప్పు. ప్రజలను, బంధువులను బాగా బ్రోవమని చెప్పు. నాకు దిక్కు తనే అని చెప్పు. నా మనసు తన రూపాన్ని మరువదని చెప్పు. కొంత నమ్మకం నా మీద నిలుపమని చెప్పు. పోయిరా, నీకు శుభాలు కలుగుతాయి, నన్ను మరిచిపోవద్దు'' అంటూ కళ్ళల్లో కన్నీరు నిండగా ఆ సీతాదేవి దీనయై దుఃఖిస్తుండగా వెళ్ళడానికి కాళ్ళు రాక, వెళ్ళకుండా ఉండనూ లేక, ఆవును వీడుతున్న దూడలా, 'అమ్మా! రాజును కొల్వటానికి వెళతా'నంటూ ఆమెకు మ్రొక్కి కాళ్ళు వణుకుతుండగా ప్రదక్షిణ చేసి శరీరమంతా చలిస్తుండగా పెద్దగా రోదిస్తూ పెద్దగొంతుతో నా తల్లిని వదిలి వెళుతున్నాను. తపస్వినులారా, నా తల్లిని ప్రేమతో చూసుకోండి అంటూ వెళ్ళాడు. నావను ఎక్కి వెనక్కి తిరిగి తిరిగి సీతాదేవినే చూస్తూ దిక్కుండీ దిక్కులేని దానివయ్యావమ్మా అంటూ దుఃఖిస్తూ అవతలి తీరానికి చేరుకొని రథమెక్కి సుమంత్రుడితో రాముడి భార్యకు ఎంత కష్టమొచ్చింది అని బాధపడుతూ వెళ్ళాడు.

మళ్ళీ తిరిగి లక్ష్మణుడు ఒకవేళ వెనక్కి వస్తాడేమో అని సీతాదేవి లక్ష్మణుడు వెళ్ళిన దారినే చూస్తూ విధిని తిట్టుకుంటుంది. ఆమె మొదట రథాన్ని చూసింది, తరువాత జెండా చూసింది, తర్వాత ధూళి చూసింది, ఆ తర్వాత ఖాళీ ప్రదేశాన్నే చూసింది, చూసి చూసి అలిసిపోయి, ధైర్యం కోల్పోయి, బాధపడి, నిట్టూరుస్తూ దిగులు పెరుగగా క్రుంగిపోయి, అలిసి సొలసి మూర్ఛపోయి, మళ్ళీ తెలివిలోకి వస్తుంది, ఆమె అంతకుముందు రాముడితో ముచ్చట్లాడేటప్పుడు అతడు చేసే పనులను తల్చుకుంటుంది. ఒడిలో నుంచుకొని యెదచేర్చుట చేరిక కది చివరి సారేమో, చెక్కిళ్ళపై చెమటను కొంగుతో తుడవటం చెలిమికి చివరి చీటీయేమో, నోట్లోని కర్పూర సుగంధాన్నివ్వటం అనురాగానికది చివరేమో, కోరిన పనికి అంగీకరించటం కరుణా ప్రబంధానికి ఫలగ్రంథమదేమో, ముఖానికి ముఖం చేర్చి ముద్దాడుట మోహపు పనికి ముగింపేమో. వచ్చే నవ్వుని లోపలే ఆపుకొని చూడటం మేలచిన్నెలకు అదే పొలిమేరేమో అని దుఃఖిస్తూ అపనిందను రాజు తెలుపకుండానే ఇంత మోసం చేశాడు. జరిగింది చెప్పి పొమ్మనచ్చు కదా! ఓ దైవమా, భర్తను దూరం చేశావే, ఇంకెవరు దిక్కు, ఈ ప్రాణాలు పోవేంటి అంటుంది. అమ్మా అంటే ఏమ్మా అనే గంగానది దయగలది, నన్ను స్వీకరించమ్మా అనుకుంటుంది. వనవిహార సమయంలో రాముడు పలికే చతురోక్తులను ప్రేమతో తల్చుకొని కంపిస్తుంది, జలకేళి ఆడేటప్పుడు భర్త చేసే పరిహాసాలను భావించి బాధపడుతుంది. భోజన సమయాలలో రాముడు ఇచ్చే బహుమానాలు ఊహించి భ్రాంతి చెందుతుంది. జూదమాడేటప్పుడు ఏమి ఎరుగనట్లుండే రాజు కళలను లెక్కిస్తూ కలవరపడుతుంది. ఒకే పాన్పుపై ఉండటం తలచి తలచి ప్రణయకలహాలను, వలపు ముచ్చటలను తల్చి తల్చి సీతాదేవి విలపించింది.

పండ్ల కోసం వచ్చి అక్కడ తిరుగుతున్న మునికుమారులు స్త్రీరత్నమైన ఆ సీతాదేవి ఆవిధంగా రోదించటం చూచి విని వాల్మీకి మహర్షి దగ్గరకు వెళ్ళి సీతాదేవి గురించి ఎవరో దేవతా స్త్రీ సుకుమారి బాధపడటం గురించి తెలియజేశారు. వాల్మీకి దివ్యదృష్టితో అంతా తెలుసుకొని ఆమె శ్రీరాముడి పట్టమహిషి సీతాదేవి అని తెలియజేసి వెంటనే అర్ఘ్యపాత్ర తీసుకొని మునికుమారులు తనను కొలుస్తూ వెంటరాగా గంగానదీ తీరానికి చేరాడు. రథం వెళ్ళినవైపే చూస్తూ, కన్నీరు

కారుస్తున్న మేనుకి ధూళి అంటగా నిట్టూరుస్తున్న జానకిని చూసి దగ్గరకు వెళ్ళగా ఆ శబ్దానికి సీతాదేవి తలెత్తి చూసి అతడి పాదాలపై రోదిస్తూ వాలింది, ఎంతో దయతో మహర్షి ఆమెను బుజ్జగిస్తూ నీ సద్గుణాలు నీ భర్తకు తెలిసి కూడా అననిందకు ధైర్యం సడలగా ఈవిధంగా చేశాడు. నేనిదంతా నా మనోదృష్టితో తెలుసుకున్నాను. నన్ను నీ తండ్రి జనకుడిలాగానే భావించు. నీవింక దుఃఖించకు. నా ఆశ్రమం నీదె. ఇక్కడి తపస్వినులు నీకు ఉపచారాలు చేస్తారు. వివేకవంతులు విధివిధానాన్ని మార్చలేమని మరువరు కదా! జనకుడు తండ్రి, దశరథుడు మామ, శ్రీరాముడు భర్త. భర్త ఆజ్ఞ స్వీకరించి చరించు, ఎందుకు దుఃఖంతో క్రుంగిపోతావు, ఇదిగో అర్ఘ్యం స్వీకిరించు, ఇంక బాధపడకు లే, జలం తీసుకో. ముఖం కడుక్కో అంటూ అనునయిస్తూ అర్ఘ్యం ఇచ్చాడు. మహర్షి తన ఆశ్రమానికి సీతాదేవిని తీసుకొని వెళ్ళి తన ఆశ్రమంలోని తాపసతులతో ఈవిధంగా అన్నాడు. ఈమె రాముడి భార్య, జనకుడి కూతురు, దశరథుడి పెద్దకోడలు. ఈమెకు మీరందరూ తగిన విధంగా పూజలు చేయండి. రావణుడి చెరలోనున్న సీతను రాముడు ఏలుకుంటున్నాడనే మాటకు రాముడు చలించి, ఈమె సద్గుణాలు మనసులో తెలిసి కూడా అడవికి పంపాడు. మీరు ఈమెను దయచూడండి అని వారికి సీతను అప్పగించాడు. వారు మహా ప్రసాదమని ఆమెను గౌరవించి పర్ణశాలకు తీసుకువెళ్ళి యథోచితంగా వంతులవారిగా ఆమెకు ఉపచారం చేస్తుండగా ఆమె కూడా కొంతకాలానికి ఊరడిల్లింది. రంగురంగుల బంగారు చీరెలు కట్టే సీత నారచీరలు ధరించింది. ఎంతో రుచికరమైన భోజనాలు చేసే సీతాదేవి కందమూలాలు ఆరగించింది. చంద్రశిలలతో చేసిన గదులలో నివసించే సుకుమారి మునిపర్ణశాలలోనె వసించింది. శ్రీరాముడితో పడుకునే సీతాదేవి ఒంటరిగా పడుకుంది. కనుసన్నలలో అంతఃపురం స్త్రీలు చేసే సేవలను మెచ్చుకోని సీతాదేవి మునిముగ్ధలు చేసే ఉపచారాలకు సంతోషించింది. విధికి సాధ్యంకానిదేమీ లేదు కదా!

లక్ష్మణుడు వెళుతూ దారిలో సుమంత్రుడితో సీతాదేవికి ఎంత కష్టం వచ్చింది? ఆమె బ్రతికి ఉంటుందో లేదో? అడవులలో అన్ని రోజులు కష్టాలు పడి, భర్తకు దూరమై, రాక్షసుడి చెరబడి ఎవరూ పడని కష్టాలకు లోనై, అగ్నిలో ప్రవేశించి ఎంతో ప్రయత్నంతో సుఖం పొందింది, చివరకు ఆ కాపురమూ కడతేరలేదు కదా! శివధనుస్సు విరిచి, వాలిని సంహరించి, వానరులనేలె, వారధి నిర్మించె, రావణుడిని యుద్ధభూమిలో అంతం చేశాడు. సీతాదేవి కోసం రాముడు ఇంత కష్టపడ్డాడు. ప్రియమైన భార్యను దూరం చేసుకొని ధైర్యంగా ఉండగలడా? ప్రజలు అన్న మాటలకు కదా సీతను విడిచాడు, మరా పాపం రాముడిదా, ప్రజలదా లెక్కించు సారథి అన్నాడు. బాధపడుతూ లక్ష్మణుడు చెబుతున్న మాటలకు సారథి విని నమస్కరించి సంతోషం, దుఃఖం కాలవిధానంలో వస్తూ ఉంటాయి. ఎవరికైనా విధి ముందు పౌరుషం సాగుతుందా, ముందు పెద్దలు చెప్పిన మాటలు చెబుతాను విను. ధర్మ నిధి అయిన నీ తండ్రి దశరథుడు తన పురోహితుడిని చూడాలని నేను రథం నడుపుతుంటే వశిష్ఠముని ఆశ్రమానికి వెళ్ళాము. ఆ యాగం సంవత్సర కాలం నడుస్తుంది.

దుర్వాసుడు కూడా వచ్చి వశిష్టుడితో ఉండగా చూసి ఎంతో సంతోషంతో వెళ్ళి వారికి నమస్కరించి ఉండగా మా ఇంటికి రాజు నీవే అతిథివైనావు అని కందమూలాలు వేడుకతో ఇచ్చి తామూ భుజించి వారందరూ మాట్లాడే సమయంలో తగిన సమయం చూసి దశరథుడు రాముడు ఎన్ని సంవత్సరాలు భూమిని పాలిస్తాడు, కొడుకులెంతమంది కలుగుతారు, ఆయుష్షు ఎంత, అతడి సోదరులకు ఎలాంటి జీవితం లభిస్తుంది. ఈ వంశ చరిత్ర ఎంత వరకుంటుంది అని అడుగగా దుర్వాసుడు నీ పెద్దకుమారుడు పదకొండు వేల సంవత్సరాలు పరిపాలిస్తాడు, అనేక యజ్ఞాలు చేస్తాడు, తర్వాత ఇద్దరు కుమారులను పొందుతాడు. వారిలో పెద్దవాడు అయోధ్యకు రాజవుతాడు. మిగిలిన నీ కుమారులకు ఒక్కొక్కరికి ఇద్దరిద్దరు

పుత్రులు కలుగుతారు. ఇతర రాజ్యాలు పాలిస్తారు. చాలాకాలం ఇక్ష్వాకు వంశం భూమిపై ఉంటుంది. ఇంకొక మాట విను రాముడు అనేక సంవత్సరాలు సీతను ఎడబాసి ఉంటాడు. ఆ ఎడబాటుకు కారణముంది, దేవతలు దాడి చేయగా రాక్షసులు భృగుపత్నిని చేరి దాక్కోగా ఎంతో ప్రేమతో ఆమె కూడా వారికి అభయమిచ్చి శత్రువులను నివారించింది. అప్పుడు దేవతలు విష్ణుని చేరి విషయం చెప్పగా విష్ణుమూర్తి తన చక్రంతో ఆమె శిరసు ఖండించగా దానికి కోపించిన భృగువు దేవుడివంటూ అందరూ నిన్ను కీర్తిస్తారు. కాని నీవింత క్రూరంగా స్త్రీ వధ ఎలా చేశావు, ఈ పాపం అనుభవించకుండా ఎలాపోతుంది ? మానవుడిగా నీవు భూమిపై పుట్టినప్పుడు నీ భార్య విరహాగ్నితో బాధపడతావు అని శపించగా శ్రీహరికి ఇచ్చిన ఆ శాపం మళ్ళీ ఋషుల బోధలతో మాన్పాడు. ఆ భృగుశాపం కారణంగా శ్రీహరి నీకు కొడుకయ్యాడు, రాముడు ఆ ఫలితాన్ని పొందగలడు. హరికైనా, హరుడికైనా, బ్రహ్మకైనా బ్రాహ్మణుడి మాటలు త్రోసివేయటం సాధ్యపడుతుందా అని దుర్వాసుడు చెప్పగా రాజు ఆశ్చర్యపోయాడు. ఈ రహస్యం నేను విన్నాను. ఇంక ఎవరూ వినలేదు. దీనిని నీ బాధ పోగొట్టటానికిప్పుడు చెప్పాను. కొన్ని సంవత్సరాలకు కార్యాలన్నీ పూర్తి చేసి మిమ్మల్ని ముందు పంపి తర్వాత తాను బ్రహ్మసదనానికి చేరుతాడు. సీత కోసం బాధపడువలసిన పని లేదు. అనగా లక్ష్మణుడు బాధ తొలగిపోగా ఆ రోజుకి గోమతి చేరారు.

తర్వాతి రోజు సుర్యోదయాన్నే బయలుదేరి అయోధ్యకు చేరారు. వెళ్ళి దీనుడై పురద్వారం ప్రవేశించి అక్కడ ఎవరినీ చూడకుండా తలవంచుకొని రాజమార్గంలో వెళుతుండగా సీత లేక ఖాళీగా ఉన్న రథాన్ని చూసి పురజనులు గుంపులుగా చేరి గుసగుసగా నిన్న మనం విన్నది నిజమే అని తోస్తుంది, చూడండి అని గుసగుసలాడేవారు, ఇలాంటి సంసారాలు విడిపోవటం మన ఊరి పుణ్యాత్ములవల్లనే కదా ఇంకేం మాట్లాడుతాం అనే వారు, ఇంతమాత్రానికి రాజు రాముడు ఇంత సాహసం చేయవచ్చా అనేవారు. ఇలాంటి సాహసం చేయకపోతే రాముడు వచ్చిన అపవాదు ఎలా పోగొట్టుకోగలడు అనేవారు, అలాంటి మాట వినగానే వచ్చిన కోపం ఆపలేక పాపపుణ్యాలు ప్రజలకే వదిలి రాజు ఇలాంటి పని చేశాడు ఇంక అతనిని అలా ఇలా అనవచ్చునా అనేవారు, తెలివిలేకుండా మొరటుతనంతో అలాంటి పరమ పతివ్రతను అనినవారు ఇంక చల్లగా బ్రతికుతారాఅనేవారు, వీరి బ్రతుకు బంగారమైంది ఇప్పుడు బంగారం వంటి కాపురం విడిచి ఆ సీతాదేవి కారడవులలో పడి దుఃఖిస్తుంది గదా అనేవారు, పూచిన తంగేడులాగా అలంకరించిన రథంలాగా కన్నుల పండుగగా ఉన్న నిండుచూలాలిని అడవుల పాలుచేసి మన రాజు ఏ ధైర్యంతో నిల్చాడో అనేవారు, ఇక్కడ వేయిమంది ఉండి కూడా దిక్కులేని దానిలాగా అడవిలో పడి ఎంత బాధపడతావో కదా అని సీతాదేవిని తల్చుకుని దుఃఖించేవారు, ఇలాంటి కష్టాలు పగవారికి కూడా వద్దు దేవుడా అని కన్నీరు కార్చేవారు, ఇలా అనేక మంది అనేక రకాలుగా మాట్లాడుకుంటున్నారు.

ఇవన్నీ వింటూ మొగసాల దగ్గర రథం దిగి సుమంత్రుడిని సగౌరవంగా ఇంటికి సాగనంపి, మీ పట్టపురాణిని నట్టడవులలో విడిచి వచ్చాననే ఈ కఠినమైన మాట రాజుతో ఎలా విన్నవిస్తాను, దైన్యానికి నిలయంలాగా ఉండే శ్రీరాముడి ముఖం చూచి ఏవిధంగా తట్టుకోగలను అని బాధపడుతూ లోపలికి వెళతూ రాజహంసలేని సరస్సులాగా, రత్నంలేని పెట్టెలాగా, పద్మంలేని కొలనులాగా, చంద్రకళలేని ఆకాశంలాగా, సరస్వతిలేని ముఖంలాగా, రామభక్తిలేని చిత్తము లాగా, ఉపకృతిలేని సంపదలాగా, కీర్తిలేని జీవితంలాగా, వార్తలేని కవిత్వంలాగా, కాంతిలేని అద్దంలాగా, శాంతిలేని తపస్సులాగా,

కొమ్మలేని చెట్టులాగా, రేఖలేని బొందిలాగా అన్ని వైభవాలు ఉండి కూడా సీతలేని కారణంగా అందం తగ్గిపోయి ఉన్న ఆ నగరులోకి ప్రవేశించి తన ఇంటిలోపల ఒంటరిగా ఉండి ముందు సీత పలికిన ప్రేమపుమాటలు తల్చుకొని ప్రజల అపవాదు స్వీకరించి ఆలోచించక ఎంత సాహసం చేశాను అని ఏడుస్తూ ఉన్న రాముడికి విషయం లక్ష్మణుడు తెలియజేయగా భార్య ఏమైందోనని ఏడుస్తూ భర్తను వీడి ఇంక బ్రతుకగలదా అని భయపడుతూ ఇంక ఏ సుఖమైనా ఎందుకని కళ్ళనుండి కన్నీరు కారుస్తూ అనేకసార్లు పక్కపై ఒరిగి అలసిన రాజుని చూసి లక్ష్మణుడు ఆర్తి చెందినవాడై అన్న పాదాలపై పడి కన్నీరు ఏరులై పారగా ధైర్యం కోల్పోయి దుఃఖిస్తూ రాముడిని తన కన్నీటిలో ముంచాడు. ఆ సమయంలో లక్ష్మణుడు హృదయంలో ధైర్యాన్ని పెంచుకొని పైకిలేచి రాజు దీనవదనాన్ని చూస్తూ రాజు విధించిన ఆజ్ఞననుసరించి సీతాదేవిని తీసుకుపోయి తపోవన భూములలో దించివచ్చాను. ఆ కష్టాలు ఎన్నైనా ఉండనీ విధివిధానాలు దాటలేము గదా. ఎప్పుడు శరీరధారికి సుఖమే ఉండదు కదా, బాధపడితే పోతాయా, పుట్టడం చావడం, చేరటం దూరమవటం, ప్రాణుల స్వభావాలు, చిన్మయమూర్తివైన అది నీవు ఎరుగవా, దుఃఖించటం సరికాదు, మీలాంటి మహాత్ములు ఆత్మతత్వం ఆలోచించి చూస్తే బాధ ఏముంటుంది, సచ్చిదానందకరమైన పరమాత్మవు నువ్వు. జగత్తు అంతా నీ ఆలోచనతోనే కలిగింది. మొట్టమొదటి గురువైన నీకు నేను ఉపదేశించగలవాడనా నేను. పంచభూతాత్మకమైన ప్రపంచమంతా వివిధ చరాచర జగత్తు నీవై నిండి వెలుగొందుతుంటే సీతాదేవి ఎక్కడికి పోయింది? నీ ఆధీనంలోలేని వస్తువు ఒకటైనా ఉందా? మర్చిపోయి ఇలా దుఃఖించటమెందుకు? పవిత్రతతో మిమ్మల్ని తెలుసుకోగలిగిన మహాత్ములే భార్యా బిడ్డలు స్నేహితులపైన మోహం లేక విరక్తి కలిగి ఉండగా మీకు ఇలా భ్రమతో దుఃఖించటం తగినదేనా? భార్యను విడిచి రాజ్యపాలన చేయటం రాముడు మర్చిపోయాడంటూ ప్రజలు అనరా అని లక్ష్మణుడు బోధించగా బాధతీరి తమ్ముడిని ప్రసన్నంగా చూచి నీ మాటలతో సంతోషం కలిగింది, నాలుగు రోజులైంది భూజన సంరక్షణ చేసి అని ఇంకా మంచి పౌరులను రక్షిస్తూ చెడ్డవారిని దండిస్తూ ప్రజలు తెలిపే విన్నపాలను ఆలకిస్తూ పాలన చేసే రాజు కీర్తిపొందుతాడు. భోగలాలసుడైన రాజును ఇక్కడ ప్రజలు తిడతారు. అక్కడా సంతాపం కలుగుతుంది. ప్రజల విన్నపాలు వినని రాజు వలన చెడు జరుగుతుంది అని రాముడు లక్ష్మణుడితో అన్నాడు.

**డా॥ ఇరపని మాధవి**

తెలుగు & ప్రాచ్య భాషా విభాగం,

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,

నాగార్జున నగర్.

**పాఠం - 14**

# సీతాపరిత్యాగం

**- కంకంటి పాపరాజు**

## సమగ్ర వ్యాఖ్యలు

**232. అంబుజగంధి యయ్యెడ మహర్షుల పత్నులకంచుఁ గొన్ని**
**మాంబర రత్నభూషణ చయంబులు గైకొని యమ్మఁలందియున్**
**వెంబడి నెక్కఁ గా రథము వేడుక నెక్కి చిరత్నరత్నపీ**
**ఠంబున నుండె వాజుల హుటాహుటిఁ దోలె సుమంత్రుడంతటన్**

**పరిచయం:**

కంకటి పాపరాజు రచించిన 'శ్రీ మదుత్తర రామాయణం' షష్ఠాశ్వాసంలోని 'సీతా పరిత్యాగం' అనే పాఠ్యభాగం లోనిదీ పద్యం.

**సందర్భం:**

రాముడు జనవాక్యానికి భయపడి సీతను అడవులలో విడిచి రమ్మని లక్ష్మణుడిని ఆజ్ఞాపించగా ఆ విషయం తెలియని సీత ముని ఆశ్రమాలను చూడబోతున్నాననే ఆనందంతో, వేడుకగా బయలుదేరే సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| అంబుజగంధి | = | తామరల వంటి సువాసన గలిగిన సీతాదేవి |
| అయ్యెడ | = | అక్కడ |
| మహర్షుల పత్నులకు | = | మునుల భార్యలకు |
| అంచు | = | అంటూ |
| హేమాంబర | = | బంగారు పట్టువస్త్రాలు |
| రత్నభూషణ | = | రత్నాలతో కూడిన ఆభరణాలు |
| చయంబులు | = | సమూహాలు |
| గైకొని | = | తీసుకొని |
| అమ్మఁలందియున్ | = | మరిది లక్ష్మణుడు |
| వెంబడిన్ | = | వెంట |

| | | |
|---|---|---|
| ఎక్కఁగా | = | ఎక్కఁగా |
| రథము | = | రథం |
| వేడుకనెక్కి | = | వేడుకతో ఎక్కి |
| చిరత్న రత్న పీఠంబున | = | రత్నపీఠంపై |
| ఉండె | = | కూర్చుంది |
| వాజుల | = | గుఱ్ఱాలను |
| హుటాహుటిన్ | = | వెంటనే |
| తోలె | = | తోలాడు |
| సుమంత్రుడు | = | సుమంత్రుడు |
| అంతటన్ | = | అంత |

**తాత్పర్యం:**

ఆ సీతాదేవి మునిపత్నులకు ఇవ్వటం కోసం బంగారు పట్టువస్త్రాలు, రత్నాలతో కూడిన ఆభరణాలు తీసుకొని మరిది లక్ష్మణుడు వెంటనెక్కగా రథం ఎక్కి రత్నపీఠంపై కూర్చోగా సారథి, సుమంత్రుడు వెంటనే గుఱ్ఱాలను పోనిచ్చాడు.

**విశేషాంశాలు :**

ఎవరైనా పెద్దలను, గురువులను సందర్శించటానికి వెళ్ళేటప్పుడు బహుమతులు తీసుకెళ్ళటం అనేది భారతీయ సంప్రదాయం. వాల్మీకి ననుసరించి కంకటి పాపరాజు బహుమతులు సీతే తీసుకెళ్ళినట్లుగా రాయగా తిక్కన మాత్రం దానిని మార్చి

"జననాథుఁ డుడుగరలు భూ
తనయ మనంబలరఁ గట్టి తగనొప్పించెన్
మునివరుల పత్నులకు ని
మ్మని మణిమయ భూషణాంబరాదుల ప్రీతిన్" అని రాశారు.

ఈ సందర్భంలోనే తిక్కన 'పాలతో విషంబిడు పగిది' అనే ప్రయోగం కూడా చేస్తారు. రాముడు సీతకు తానెందుకు ఆమెను అడవులకు పంపుతున్నాడో ఆమెకు తెలీకుండా నవ్వుతూనే సాగనంపే సందర్భంలో ఈ ప్రయోగం చక్కగా సరిపోయింది.

**232. మునుకొని యిట్లు దుశ్శకునముల్ గనిపించుటకున్ మెఱుంగు వె**
**ట్టిన గతి నా మనంబునఁ గడింది భయంబు జనించె దక్షిణాం**
**గనికరముల్ చలించె ధృతిగాసిలె మేనవశత్వ మొందె నే**
**మని వివరించుదాన జగమంతయుఁ బాడయితోఁచెఁజూడ్కికిన్**

**పరిచయం:**

కంకటి పాపరాజు రచించిన 'శ్రీ మదుత్తర రామాయణం' షష్ఠాశ్వాసంలోని 'సీతా పరిత్యాగం' అనే పాఠ్యభాగం లోనిదీ పద్యం.

**సందర్భం:**

అడవిలో విడిచి రావటం కోసం సీతని రథంపై తీసుకొని వెళుతుండగా సీతకు దారిలో అనేక అపశకునాలు కనిపించే సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| మునుకొని | = | ముందుపడి |
| ఇట్లు | = | ఈవిధంగా |
| దుశ్శకునముల్ | = | అపశకునాలు |
| కనిపించుటకున్ | = | కనిపించడానికి |
| మెఱుంగు | = | మెరుగు |
| పెట్టిన గతి | = | పెట్టిన విధంగా |
| నా మనంబున | = | నా మనసులో |
| కడింది భయంబు | = | అధికంగా భయం |
| జనించె | = | పుట్టింది |
| దక్షిణాంగ నికరముల్ | = | కుడివైపు అవయవ సమూహం |
| చలించె | = | అదిరె |
| ధృతిగాసిలె | = | ధైర్యం సడలింది |
| మేనన్ | = | శరీరం |
| వివశత్వం | = | వశం లేని విధంగా |
| ఒందెన్ | = | అయింది |
| ఏమని | = | ఏమని |
| వివరించుదాన | = | వివరించగలను |
| జగమంతయున్ | = | లోకమంతా |
| పాడయి | = | పాడైనట్లుగా |
| తోచెన్ | = | తోస్తుంది |
| చూడ్కికిన్ | = | నా చూపులకు |

**తాత్పర్యం:**

ముందుపడి ఈ విధంగా అపశకునాలు కనిపించడం వలన నా మనసులో అధికంగా భయం కలిగింది. కుడివైపు శరీరావయవాలన్నీ అదురుతున్నాయి. ధైర్యం సడలింది. శరీరంలో వివశత్వం కలిగింది. ఏమని వివరించగలను, లోకమంతా పాడైనట్లుగా నా చూపులకు కనిపిస్తుంది.

**237. నా సఖు నా మనోహరుని నా ప్రభు నారఘురామదేవునిన్**
**బాసి వనాళి నున్న మునిపత్నులఁ జూచెదనంచు నేలపే**
**రాస గణించి వచ్చితి హితాహిత చింతలు లేనివారుగా**
**రే సతులింత మాన్పకతఁ డేమిటికిన్ వరమిచ్చెలక్ష్మణా**

**పరిచయం:**

కంకటి పాపరాజు రచించిన 'శ్రీ మదుత్తర రామాయణం' షష్ఠాశ్వాసంలోని 'సీతా పరిత్యాగం' అనే పాఠ్యభాగం లోనిదీ పద్యం.

**సందర్భం:**

సీతాదేవికి అపశకునాలు కనిపించగా కలతచెందుతూ తన భర్తకు, బంధువులకు ఏమైనా కీడు జరుగుతుందేమో అని తన తప్పిదమేనేమో అనుకునే సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| లక్ష్మణా | = | ఓ లక్ష్మణా |
| నా సఖున్ | = | నా స్నేహితుడిని |
| నా మనోహరుని | = | నా మనసు హరించినవాడిని |
| నా ప్రభున్ | = | నా రాజును |
| నా రఘురామ దేవునిన్ | = | నా రఘురాముడనే దైవాన్ని |
| బాసి | = | విడిచి |
| వనాళిన్ | = | అడవులలో |
| ఉన్న | = | ఉన్న |
| మునిపత్నులు | = | మునుల భార్యలను |
| చూచెదన్ | = | చూస్తాను |
| అంచున్ | = | అంటూ |

| | | |
|---|---|---|
| ఏల | = | ఎందుకు |
| పేరాస | = | అధికమైన ఆశ |
| గణించి | = | ఉగ్గడించి / లెక్కించి |
| వచ్చితి | = | వచ్చాను |
| హిత + అహిత | = | మంచి చెడు |
| చింతలు | = | ఆలోచనలు |
| లేనివారు | = | లేనటు వంటివారు |
| కారే సతులు | = | కదా భార్యలు |
| అంచు | = | అంటూ |
| మాన్పక | = | ఆపకుండా |
| అతడు | = | ఆ రాముడు |
| ఏమిటికిన్ | = | ఎందుకు |
| వరమిచ్చెన్ | = | వరం ఇచ్చాడు |

**తాత్పర్యం:**

ఓ లక్ష్మణా! నా స్నేహితుడు, నా మనసు హరించినవాడు, నా దైవం, నా భర్త అయిన శ్రీరాముడిని విడిచి మునిపత్నులను చూస్తానని నేను పేరాశతో వచ్చాను, మంచి చెడుల ఆలోచనలు లేనివారు స్త్రీలు అని రాముడు నన్ను వెళ్ళవద్దనక నాకు వరం ఎందుకు ఇచ్చాడు.

**విశేషాంశాలు :**

మానవ సహజమైన ప్రవృతి సీతలో ఇక్కడ కనిపిస్తుంది. కష్టం కలుగుతుందేమో అనే ఆలోచనకే సీత అంతగా కలత పడుతుంది. ఆ కష్టమే ఎదురైతే.

**238. నను మది కోర్కి దెల్పుమని నాథుడనన్ బదునాలుగేండ్లు చూ**
**చిన వనులింతెకా యని విశేషము వేఁటొకటిచ్చగింపకే**
**మని వనిఁ జూడఁ గోరి తహాహా యిటులన్ విపరీత కాంక్ష పా**
**త్తునఁ జనుపాపజాతికిని దుశ్శకునంబులు గాక యుండునే**

**పరిచయం:**

కంకటి పాపరాజు రచించిన 'శ్రీ మదుత్తర రామాయణం' షష్ఠాశ్వాసంలోని 'సీతా పరిత్యాగం' అనే పాఠ్యభాగం లోనిదీ పద్యం.

**సందర్భం:**

దుశ్శకునాలు కనిపించినప్పుడు సీత పరిపరివిధాల ఆలోచించే సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| నను | = | నన్ను |
| మది | = | మనసులో |
| కోర్కి | = | కోరిక |
| తెల్పుమని | = | తెలుపమని |
| నాథుడనన్ | = | భర్త అనగా |
| పదునాలుగేండ్లు | = | పద్నాలుగు సంవత్సరాలు |
| చూచిన | = | చూసిన |
| వనులు | = | అడవులు |
| ఇంతెకాయని | = | ఇంతేకదా అని |
| విశేషము | = | ప్రత్యేకమైనది |
| వేఱొకటి | = | మరొకటి |
| ఇచ్చగింపక | = | ఇష్టపడక |
| ఏమని | = | ఏమనుకొని |
| వని | = | అడవిని |
| చూడగోరితి | = | చూడాలని కోరాను |
| ఆహాహ్ | = | ఆహా! |
| యిటులన్ | = | ఈవిధంగా |
| విపరీత కాంక్ష | = | వ్యతిరేకమైన కోరిక |
| పొత్తున | = | సంబంధంతో |
| చను | = | ప్రవర్తించే |
| పాపజాతికిని | = | పాపిష్టులైన వారికి |
| దుశ్శకునంబులు | = | అపశకునాలు |
| కాకయుండున్ | = | కాకుండా మంచివి ఉంటాయా! |

**తాత్పర్యం:**

నా మనసులోని కోరిక తెలుపమని రాముడడుగగా పద్నాలుగేళ్ళు చూసిన అడవులే కదా. వాటిలో ప్రత్యేకతేముంది అనుకొని వేరేది ఇష్టపడకుండా ఆ అడవిని ఏమనుకొని చూడాలని కోరుకున్నాను. ఆహా! వ్యతిరేకమైన కోరికల సంబంధంతో ప్రవర్తించే పాపజాతికి చెడు సంకేతాలుగాక మంచివి కలుగుతాయా?

**విశేషాంశాలు:**

ఎప్పుడూ ఏమీ కోరని సీతాదేవి బంగారు లేడి కావాలని కోరుకున్నప్పుడు ఆ కోరిక కారణంగా రాముడిని ఎడబాయవలసి వచ్చింది. ఇప్పుడు మరల ఇంకొక కోరిక కోరినప్పుడు ఇప్పుడూ దాని ఫలితం ఎడబాటే. కష్టం కలిగినపుడు కంటే కలుగుతుందేమో అన్నప్పుడే మనిషి ఎక్కువగా వ్యాకులపడతాడు. మానవ సహజస్వభావం ఇక్కడ సీతలో కనిపిస్తుంది.

**239. కుమతి వినాశకాలమునకున్ విపరీతబుద్ధిఁ బూని య**
**క్రమములె కాంక్ష చేరి చెడుఁ గావున నేనును గోరరానిది**
**ష్టమని తలంచి దుర్దశఁ బడం బఱితెంచితి మీఁ ద దుర్దశా**
**సమితికి నీ నిమిత్తము వలె సాకిరి గావె నృపాలనందనా**

**పరిచయం:**

కంకటి పాపరాజు రచించిన 'శ్రీ మదుత్తర రామాయణం' షష్ఠాశ్వాసంలోని 'సీతా పరిత్యాగం' అనే పాఠ్యభాగం లోనిదీ పద్యం.

**సందర్భం:**

అపశకునాలను చూసిన సీత తనను తానే నిందించుకుంటూ ఏ కష్టాలు కలుగబోతున్నాయోనని పరిపరివిధాలుగా మాట్లాడే సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| నృపాలనందనా | = | రాజకుమారా ఓ లక్ష్మణా! |
| కుమతి | = | చెడు బుద్ధి కలవాడికి |
| వినాశకాలమునకున్ | = | నాశనమయ్యే కాలానికి |
| విపరీత బుద్ధి | = | వ్యతిరేకమైన బుద్ధి |
| పూని | = | వహించి |
| అక్రమములే | = | సరిగాలేనటువంటివే |
| కాంక్ష చేరి | = | కోరికలుగా చేరి |
| చెడు | = | చెడతాడు |

| | | |
|---|---|---|
| కావున | = | కనుక |
| కోరరానిది | = | కోరుకోకూడని |
| ఇష్టమని | = | నాకిష్టమని |
| తలంచి | = | భావించి |
| దుర్దశ | = | చెడు దశలో |
| పడం | = | పడటానికి |
| పఱతెంచితి | = | వచ్చాను |
| మీద | = | జరగబోయే |
| దుర్దశా సమితికిన్ | = | ఆ దుర్దశల సమూహానికి |
| ఈ నిమిత్తము వలె | = | ఇచ్చేటందుకే కారణంగా |
| సాకిరి | = | పెంచారు |
| కావె | = | కదా! |

**తాత్పర్యం:**

ఓ లక్ష్మణా! దుర్బుద్ధి కలవాడికి వినాశకాలంలో వ్యతిరేకమైన బుద్ధి పుడుతుంది. అక్రమాలే కోరికలుగా చేరి చెడతాడు. కాబట్టి నేను కూడా కోరరానిది ఇష్టమని తలచి దుర్దశలో పడటానికి వచ్చాను. కలుగబోయే దుర్దశలకు ఇవ్వటం కోసమే నన్ను సాకారు.

**240. ధవునెడబాసి వచ్చు తెగుదారికి నాకిఁక వంతయేల ని**
**య్యపశకునంబులన్ బొడము నాపదలన్నియు మాన్చి రామ భూ**
**ధవునకు నీకు నత్తలకుఁ దక్కిన బాంధవ పౌరకోటికిన్**
**వివిధ శుభంబు లీవలయు వేల్పులటంచు నమస్కరించినన్**

**పరిచయం:**

కంకటి పాపరాజు రచించిన 'శ్రీ మదుత్తర రామాయణం' షష్ఠాశ్వాసంలోని 'సీతా పరిత్యాగం' అనే పాఠ్యభాగం లోనిదీ పద్యం.

**సందర్భం:**

అపశకునాలు చూసిన సీతాదేవి తనను తానే నిందించుకుంటూ తనవారికి ఏ కష్టం కలగకూడదని కోరుకునే సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| ధవున్ | = | భర్తను |
| ఎడబాసి | = | విడిచిపెట్టి |
| వచ్చు | = | వస్తున్న |
| తెగుదారికి | = | సాహసికి |
| నాకు ఇక | = | నాకింక |
| వంతల్ | = | సంతాపాలు |
| ఏల | = | ఎందుకు |
| ఇయ్యపశకునంబులన్ | = | ఈ అశుభ సూచకాలు |
| పొడమున్ | = | జనించటం వలన |
| ఆపదలన్నియు | = | కలిగే కష్టాలన్నీ |
| మాన్చి | = | పోగొట్టి |
| రామభూధవునకు | = | రాజు రాముడికి |
| నీకున్ | = | నీకు |
| అత్తలకు | = | అత్తలకు |
| తక్కిన | = | మిగిలిన |
| బాంధవ | = | బంధువులకు |
| పౌరకోటికిన్ | = | పౌరుల సమూహానికి |
| వివిధ | = | రకరకాల |
| శుభంబుల్ | = | శుభాలు |
| ఈవలయున్ | = | ఇవ్వవలెను |
| వేల్పులు | = | దేవతలు |
| అటంచు | = | అంటూ |
| నమస్కరించినన్ | = | నమస్కరించగా |

**తాత్పర్యం:**

భర్తను విడిచిపెట్టి వస్తున్న సాహసికి నాకు ఇంత బాధ ఎందుకు, ఈ అపశకునాలవలన కలిగే బాధలన్నింటినీ పోగొట్టి రాముడికి, నీకు, అత్తలకు, మిగిలిన బంధువులకు, పురజనులందరికీ వివిధ రకాలైన శుభాలు ఆ దేవతలివ్వాలని నమస్కరించింది సీతాదేవి.

**విశేషాంశాలు :**

రాముడు రాజుగా ప్రజలవాక్యమే ప్రధానమని భావించి సీతావియోగానికి పూనుకుంటే సీత తన భర్త, మరుదులు, అత్తలు, బంధువుల క్షేమం మాత్రమే కోరుకోకుండా ప్రజలందరి క్షేమాన్ని కూడా కోరుకోవటం గమనించవలసిన అంశం. రాణిగా ఆమె ప్రజలను బిడ్డలుగా భావిస్తుంది కనుక వారి క్షేమాన్ని కోరుకుంది.

**241. ఆయమచిత్తశుద్ధికి నయంబునకున్ వెఱఁగంది లక్ష్మణుం**
**డీయఖిలైక మాత పతి నెప్పుడుఁ గూడి సుఖించునట్లుగా**
**జేయక పాయఁజేసె విధి చేష్ట గదాయని నిందసేయునే**
**మో యనఁబోవు మాను వగనుస్సురనున్ దలవంచునయ్యెడన్**

**పరిచయం:**

కంకటి పాపరాజు రచించిన 'శ్రీ మదుత్తర రామాయణం' షష్ఠాశ్వాసంలోని 'సీతా పరిత్యాగం' అనే పాఠ్యభాగం లోనిదీ పద్యం.

**సందర్భం:**

సీతాదేవి మాటలు విని, ఆందోళనను చూసిన లక్ష్మణుడు తన మనసులో ఆమె ఔన్నత్యాన్ని తలుస్తూ వ్యథ చెందే సందర్భంలోనిదీ పద్యం.

**తాత్పర్యం:**

సీతాదేవి మనోనైర్మల్యతకు, మంచితనానికి భయపడి లక్ష్మణుడు సీతాదేవి అఖిలలోకాలకు తల్లి ఆమె ఎప్పుడూ భర్తతోనే కలసి ఉండి సుఖపడేటట్లు చేయకుండా ఎడబాటు కలిగించడం విధి కృత్యమే కదా అని విధిని నిందిస్తూ ఏమో మాట్లాడబోయి మానుకుంటాడు. బాధతో ఉస్సురంటాడు, తలవంచుకుంటాడు.

**247. ~~ఈ~~ చందంబునఁ గంగఁ జూచి తనలో నింపొంది కీర్తించు సీ**
**తా చంద్రాస్యను లక్ష్మణుండు గని యాత్మస్వామి యజ్ఞాపనం**
**బా చింతాభర మాయపప్రథయు నింతైనన్ వినన్ లేమి నెం**
**తో చెల్వొందెడి నీమె కావిసపు పల్కేలా గిఁకన్ దెల్పుదున్**

**పరిచయం:**

కంకటి పాపరాజు రచించిన 'శ్రీ మదుత్తర రామాయణం' షష్ఠాశ్వాసంలోని 'సీతా పరిత్యాగం' అనే పాఠ్యభాగం లోనిదీ పద్యం.

**సందర్భం:**

గంగానదిని చూసి సంతోషిస్తున్న సీతాదేవిని చూసి లక్ష్మణుడు అనుకునే సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| ఈ చందంబునన్ | = | ఈ విధంగా |
| గంగన్ | = | చూచి |
| తనలోన్ | = | తన లోపల |
| ఇంపు ఒంది | = | ఆనందించి |
| కీర్తించు | = | స్తుతించే |
| సీతాచంద్రాస్యను | = | చంద్రుడి వంటి ముఖం గల సీతాదేవిని |
| లక్ష్మణుండు | = | లక్ష్మణుడు |
| కని | = | చూచి |
| ఆత్మస్వామి | = | తమ ప్రభువు రాముడి |
| అజ్ఞాపనంబు | = | ఆజ్ఞను |
| ఆ చింతాభర | = | ఆ బాధించే |
| మాయపప్రథయున్ | = | చెడ్డపేరు |
| ఇంతైనన్ | = | కొంచమైనా |
| వినన్ | = | వినక |
| లేమిన్ | = | పోవటం చేత |
| ఎంతో | = | ఎంతగానో |
| చెల్వొందెడి | = | అందగించిన |
| ఈమెకు | = | సీతాదేవికి |
| ఈ విసపుపల్కు | = | ఆ విషపుమాట |
| ఎలా | = | ఎలా |
| ఇకన్ | = | ఇంక |
| తెల్పుదున్ | = | తెలియజేస్తాను |

**తాత్పర్యం:**

ఈవిధంగా గంగను చూచి తనలో తానే ఆనందిస్తూ కీర్తించే సీతాదేవిని చూసి లక్ష్మణుడు తన భర్త ఆజ్ఞను, బాధను కలిగించే ఆ అపకీర్తిని కొంచెం కూడా ఈమె వినలేదు కనుక ఎంతో ఆనందిస్తున్నది. ఈమెకు ఇంక ఆ విషపు మాటలను ఎలా తెలుపుతాను.

**249. విన్నఁ దనంబు మించెఁ బురి వెల్వడి నప్పటి నుండి నీ మొగం
ఉన్న తెఱంగుఁ గాంచి దిగులొందుచు నుందు నిదేమొ యంచు మీ
యన్నకుఁ దత్సహోదరుల కాప్తులకున్ శుభమే కదన్న నీ
కన్నుల నేల నశ్రువులు గ్రమ్మెడిఁ దెల్పఁ గదన్న లక్ష్మణా**

**పరిచయం:**

కంకటి పాపరాజు రచించిన 'శ్రీ మదుత్తర రామాయణం' షష్ఠాశ్వాసంలోని 'సీతా పరిత్యాగం' అనే పాఠ్యభాగం లోనిదీ పద్యం.

**సందర్భం:**

లక్ష్మణుడిలో కలుగుతున్న మార్పులను చూసి సీతాదేవి కారణమేమిటని అడుగుతున్న సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| లక్ష్మణా | = | ఓ లక్ష్మణా! |
| విన్నదనంబు | = | వివర్ణత |
| మించెన్ | = | ఎక్కువయ్యింది |
| పురి | = | పూరాన్ని |
| వెల్వడిన | = | విడిచిన / బయటపడిన |
| అప్పటి నుండి | = | దగ్గర నుండి |
| నీ మొగంబు | = | నీ ముఖం |
| ఉన్న తెఱంగున్ | = | ఉన్నతీరు |
| కాంచి | = | చూచి |
| దిగులు | = | దిగులు |
| ఒందుచునుందును | = | పొందుతున్నాను |
| ఇదేమొ | = | ఇదేంటి |
| అంచు | = | అంటూ |
| మీ అన్నకు | = | మీ అన్నకు |
| తత్ సహోదరులకు | = | ఆయన తమ్ములకు |
| ఆప్తులకున్ | = | ఆప్తులకు |
| శుభమే కదన్న | = | క్షేమమే కదా |

| | | |
|---|---|---|
| నీ కన్నులన్ | = | నీ కళ్ళల్లో |
| ఏల | = | ఎందుకు |
| అశ్రువులు | = | కన్నీరు |
| క్రమ్మెడిన్ | = | క్రమ్ముతుంది |
| తెల్పగదన్న | = | తెల్పవయ్యా |

**తాత్పర్యం:**

ఓ లక్ష్మణా! నీవు తెల్లబోదటం ఎక్కువైంది. పురాన్ని విడిచి బయటపడిన దగ్గర నుండి నీ ముఖం ఉన్న విధానాన్ని చూసి ఇదేమిటా అని దిగులుపడుతున్నాను. మీ అన్నకు, సోదరులకు, ఆప్తులకు క్షేమమే కదా. నీ కళ్ళలో నీరెందుకు క్రమ్ముకుంటుంది, తెల్పవయ్యా.

**విశేషాంశాలు :**

సీతాదేవి చాలా దయగలిగినది, ఇతరుల బాధ చూడలేదు. లక్ష్మణుడి ముఖ కవళికలను బట్టి ఏదో విషయం ఉందని గ్రహించ గలగటం మనకిక్కడ కనిపిస్తుంది. తనకు కష్టం కలుగుతుందనుకోక తనవారికేమైనా అవుతుందా అని పదేపదే అనుకోవటం ఆమె గొప్పతనం.

**250. అడవిని దొల్లి శ్రీ దొఱఁగి యన్నను గొల్చుచు వచ్చునప్పుడున్**
**గడుసరి యింద్రజిత్తుని ముఖాముఖిఁ గయ్యము సేయునప్పుడున్**
**జడుఁడగు రావణాసురుని శక్తి యురంబున నాఁటినప్పుడున్**
**బొడమదు కంట నీరిపుడు పుట్టిన దేటికొ తండ్రి దెల్పవే**

**పరిచయం:**

కంకటి పాపరాజు రచించిన 'శ్రీ మదుత్తర రామాయణం' షష్ఠాశ్వాసంలోని 'సీతా పరిత్యాగం' అనే పాఠ్యభాగం లోనిదీ పద్యం.

**సందర్భం:**

బాధపడటానికి కారణమేమిటని సీతాదేవి లక్ష్మణుడిని అడుగుతూ అంతకుముందు జరిగిన సన్నివేశాలను గుర్తుచేసుకునే సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| తండ్రి | = | నాయనా లక్ష్మణా |
| అడవిని | = | అడవిని / వనవాసానికి |
| తొల్లి | = | పూర్వం |

| | | |
|---|---|---|
| శ్రీ దొఱఁగి | = | సంపద పోయి |
| అన్నను | = | మీ అన్నను |
| కొల్చుచు | = | సేవిస్తూ |
| వచ్చు నప్పుడున్ | = | వచ్చే సమయంలో |
| గడుసరి | = | మాయలమారి |
| ఇంద్రజిత్తుని | = | మేఘనాథుడిని |
| ముఖాముఖిన్ | = | ఎదురెదురుగా |
| కయ్యము | = | యుద్ధం |
| చేయునప్పుడున్ | = | చేసే సమయంలో |
| జడుడగు | = | మూర్ఖుడైన / కఠినుడైన |
| రావణాసురుని | = | రావణాసురుడి |
| శక్తి | = | శక్తి అనే ఆయుధం |
| ఉరంబున | = | నీ రొమ్ములో |
| నాటినప్పుడున్ | = | దిగినప్పుడు |
| పొడమదు | = | కలుగ లేదు |
| కంటనీరు | = | కళ్ళల్లో నీరు |
| ఇపుడు | = | ఈ సమయంలో |
| పుట్టినది | = | పుట్టింది |
| ఏటికో | = | ఎందుకో |
| తెల్పవే | = | తెలుపరాదా |

**తాత్పర్యం:**

ఓ లక్ష్మణా! పూర్వం రాజ్యాన్ని వదిలి వనవాసానికి శ్రీరాముడిని సేవిస్తూ వెళ్ళే ఆ సమయంలో ఇంద్రజిత్తుతో ముఖాముఖి యుద్ధం చేసే సమయంలో, ఆ రావణాసురుడి శక్తి ప్రయోగం నీ రొమ్ములో నాటుకున్నప్పుడు కన్నీరు రాలేదు. మరి ఇప్పుడు కన్నీరు రావటానికి కారణమేంటో తెలియజేయి.

**251. మానసిక వ్యథలు రుజలు మాన్పఁగ నోసిన పుణ్యరాశి గం**
**గానదిఁ జేరి యుండియును గస్తిపడన్ వగునయ్య వేడ్కతో**
**నీనది దాటి తాపసుల యింతులఁ గన్గొని భూషణావళుల్**
**కానుక లిచ్చి దీవెనలు గైకొని వత్తము రమ్ము చెచ్చెరన్**

**పరిచయం:**

కంకటి పాపరాజు రచించిన 'శ్రీ మదుత్తర రామాయణం' షష్ఠాశ్వాసంలోని 'సీతా పరిత్యాగం' అనే పాఠ్యభాగం లోనిదీ పద్యం.

**సందర్భం:**

లక్ష్మణుడిలో కలుగుతున్న మార్పులను చూసి కారణం అడుగుతూనే లక్ష్మణుడికి ఊరట కలిగేవిధంగా మాట్లాడే సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| మానసిక వ్యథల్ | = | మానసికమైన బాధలు |
| రుజలు | = | రోగాలు |
| మాన్పగన్ | = | పోగొట్టడానికి |
| ఓపిన | = | పూనుకొన్న |
| పుణ్యరాశి | = | పుణ్యరాశి |
| గంగానదిన్ | = | గంగానదిని |
| చేరి యుండియున్ | = | చేరుకొని కూడా |
| కస్తిపడన్ | = | దుఃఖించటం |
| తగునయ్యె | = | సరి అయినదేనా |
| వేడ్కతోన్ | = | వేడుకతో |
| ఈనది దాటి | = | ఈ గంగానదిని దాటి |
| తాపసుల యింతులన్ | = | మునుల భార్యలను |
| కన్గొని | = | చూచి |
| భూషణావళుల్ | = | బహుమతులు |
| ఇచ్చి | = | ఇచ్చి |
| దీవనలు | = | ఆశీస్సులు |
| గైకొని | = | స్వీకరించి |
| వత్తము | = | వద్దాము |
| రమ్మి | = | రా |
| చెచ్చెరన్ | = | వెంటనే |

**తాత్పర్యం:**

మానసికమైన బాధలను, శారీరకమైన రోగాలను పోగొట్టగలిగిన పుణ్యరాశి గంగానదిని చేరుకొని కూడా దుఃఖపడటం తగినదేనా, వేడుకతో ఈ నదిని దాటి మునిపత్నులను చూసి భూషణాలు మొదలైన కానుకలను ఇచ్చి ఆశీర్వాదాలు తీసుకొని వెంటనే వచ్చేద్దాము.

**విశేషాంశాలు :**

గంగానది పవిత్రమైనది. అది శారీరకమైన రోగాలనే కాదు మానసికమైన బాధలను పోగొట్టగలదు. ఆ నీటిలో అన్ని బాధలను పోగొట్టగలిగిన ఔషధాలు కలవటమే దానికి కారణం.

**256. జనకజ మోము దీనత యెసంగఁ గనుంగొని యీరెలుంగుతో**
**జననిరో పాయదీ హృదయశల్యము శోకదవాగ్నిఁ గ్రాఁగుకం**
**టెను మరణంబు మేలు జననిందిత కృత్యముఁ బూని వచ్చితిన్**
**నను శపియించుమంచుఁ జరణంబుల చెంగట వ్రాలి యేడ్వఁగన్**

**పరిచయం:**

కంకటి పాపరాజు రచించిన 'శ్రీ మదుత్తర రామాయణం' షష్ఠాశ్వాసంలోని 'సీతా పరిత్యాగం' అనే పాఠ్యభాగం లోనిదీ పద్యం.

**సందర్భం:**

సీతాదేవి మాటలకు బాధపడుతూ పాపపు పనికి పూనుకున్నానని లక్ష్మణుడు చెప్పే సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| జననిరో | = | అమ్మా |
| జనకజ | = | సీతాదేవి |
| మోము | = | ముఖంలో |
| దీనత | = | దీనత్వం |
| ఎసంగన్ | = | కలుగగా |
| కనుంగొని | = | చూచి |
| ఈరెలుంగుతో | = | హీనస్వరంతో |
| పాయదీ | = | విడిచిపోదీ |
| హృదయశల్యము | = | హృదయానికైన గాయం |

| | | |
|---|---|---|
| శోకదవాగ్నిన్ | = | శోకమనే అగ్నిలో |
| క్రాగుకంటెను | = | క్రాగిపోవటం కంటే |
| మరణంబు | = | చనిపోవటమే |
| మేలు | = | మంచిది |
| జననిందిత | = | ప్రజలచే నిందింపబడే |
| కృత్యమున్ | = | కార్యానికి |
| పూని | = | పూనుకొని |
| వచ్చితిన్ | = | వచ్చాను |
| నను | = | నన్ను |
| శపియించుము | = | శపించు |
| అంచున్ | = | అంటూ |
| చరణముల | = | పాదాల |
| చెంగట | = | ముందు |
| వ్రాలి | = | పడి |
| యేడ్వగన్ | = | ఏడుస్తుండగా |

**తాత్పర్యం:**

సీతాదేవిని దీనత్వంతో కూడిన ముఖంతో చూచి లోగొంతుకతో అమ్మా! ఈ హృదయానికి అయిన గాయం మానదు. శోకమనే అగ్నిలో క్రాగిపోవటం కంటే మరణించటమే మంచిది కదా. ప్రజలు నిందించే పనికి పూనుకొని వచ్చాను. నన్ను నీవు శపించు అంటూ పాదాల ముందు పడి లక్ష్మణుడు దుఃఖిస్తుండగా.

**259. పరసతులెల్లఁ దల్లులుగ భావన సేయుదు వెల్లవేళలన్**
**బరధనమన్న హాలహలభంగిగఁ జూతువు బొంకవెన్నఁడున్**
**బరుషము లాడవెవ్వరిని బ్రాహ్మణభక్తియు రామసేవయున్**
**దిరమగునీకుఁ దండ్రి జననిందిత కృత్యము లెవ్వి యియ్యెడన్**

**పరిచయం:**

కంకటి పాపరాజు రచించిన 'శ్రీ మదుత్తర రామాయణం' షష్ఠాశ్వాసంలోని 'సీతా పరిత్యాగం' అనే పాఠ్యభాగం లోనిదీ పద్యం.

**సందర్భం:**

లక్ష్మణుడి మంచి గుణాలన్నీ చెబుతూ నువ్వు జనులు నిందించే పనిచేయటమేమిటని సీత అడిగే సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| తండ్రి | = | ఓ లక్ష్మణా! |
| పరసతులు | = | ఇతరుల భార్యలు |
| ఎల్లన్ | = | అందరినీ |
| తల్లులుగ | = | నీ తల్లులుగా |
| భావన సేయుదువు | = | భావిస్తావు |
| ఎల్లవేళలన్ | = | అన్ని సమయాలలో |
| పరధనమన్న | = | పరుల సొమ్మంటే |
| హాలహలభంగిగన్ | = | కాలకూట విషంలాగా |
| చూతువు | = | చూస్తావు |
| బొంకవు | = | అబద్ధమాడవు |
| ఎన్నడున్ | = | ఎప్పుడూ |
| పరుషములాడవు | = | కఠినంగా మాట్లాడవు |
| ఎవ్వరిని | = | ఎవరినీ |
| బ్రాహ్మణ భక్తియు | = | బ్రాహ్మణులపై భక్తి |
| రామసేవయున్ | = | రామసేవ |
| తిరమగు | = | స్థిరమైన |
| నీకు | = | నీకు |
| జననిందిత | = | జనులు నిందించే |
| కృత్యములు | = | పనులు |
| ఎవ్వి | = | ఏవి |
| ఇయ్యెడన్ | = | ఇక్కడ |

**తాత్పర్యం:**

ఓ లక్ష్మణా! ఎప్పుడూ పరుల భార్యలను తల్లులుగా భావిస్తావు. పరుల సొమ్ముఅంటే హాలహలంలాగా చూస్తావు. అబద్ధం ఎప్పుడూ చెప్పవు. ఎవ్వరిని పరుషంగా మాట్లాడవు. బ్రాహ్మణ భక్తిని, రామసేవ స్థిరంగా చేసే నీకు జనులు నిందించే పనులేంటి వీటిలో.

**విశేషాంశాలు :**

పరులవేవైనా ఆశిస్తే అవి పాపాన్నే కల్గిస్తాయి. పరుల సొమ్ము పామువంటిదని, పరాయి భార్య తల్లివంటిదని, సత్యమే అన్ని ధర్మాలలో గొప్పదని, మాటలతో కూడా ఎవ్వరినీ నొప్పించకపోవటమే అహింస అని ధర్మశాస్త్రాలు చెబుతున్నాయి.

**268. మునులు మహాతపోనిధులమోఘ దయాంబుంధు లాశ్రయించుకా**
**ననములు చేరి నీవిఁక దినమ్ములు ద్రోయఁ గదమ్మ యంచు నీ**
**యునికి కనర్హమైన యెడలొప్ప గణింపఁగ నొగ్గె నాల్క నీ**
**యనదతనంబు సైఁచె మది యమరొ యెంతటికైతిఁ జూడుమా**

**పరిచయం:**

కంకటి పాపరాజు రచించిన 'శ్రీ మదుత్తర రామాయణం' షష్ఠాశ్వాసంలోని 'సీతా పరిత్యాగం' అనే పాఠ్యభాగం లోనిదీ పద్యం.

**సందర్భం:**

లక్ష్మణుడు బాధపడుతూ ఇంక వనంలోనే నివసించమని సీతకు చెప్పే సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| మునులు | = | మునులు |
| మహాతపోనిధులు | = | గొప్ప తపస్సంపన్నులు |
| అమోఘ | = | వ్యర్థం కాని గొప్పదైన |
| దయాంబుధులు | = | దయకు సముద్రంవంటివారు |
| ఆశ్రయించు | = | ఆశ్రయించి |
| కాననములు | = | అడవులను |
| చేరి | = | చేరి |
| నీవిక | = | నువ్వు ఇంక |
| దినమ్ములు | = | రోజులు |
| ద్రోయగదమ్మ | = | గడుపవమ్మా |
| అంచున్ | = | అంటూ |
| నీ యునికికి | = | నీవు ఉండటానికి |

| | | |
|---|---|---|
| అనర్ఘమైన | = | అర్హతలేని |
| యెడలొప్ప | = | స్థలాన్ని వీడుట |
| గణింపగన్ | = | లక్ష్యపెట్టక |
| ఒగ్గె | = | పూని విడిచింది |
| నాల్క | = | నాలుక |
| అనదతనంబు | = | అల్పత్వం |
| సైచె | = | సహించింది |
| మది | = | మనసు |
| అవురొ | = | అమ్మా |
| ఎంతటికైతి | = | ఎలాంటి స్థితి కలిగింది |
| చూడుమా | = | చూడవమ్మా |

**తాత్పర్యం:**

మునులు గొప్ప తపస్సంపన్నులు, గొప్పదైన దయకు సముద్రం వంటి వారు. వారిని ఆశ్రయించి ఇంక వనాలను చేరి నీవు ఇంక రోజులు గడపవమ్మా అంటూ నీవుండటానికి వీలులేదని, నీ అల్పత్వాన్ని పల్కిన నాలుకను లక్ష్యపెట్టక నా మది ఎలా సహించిందో, ఎలాంటి స్థితి కలిగిందో చూడవమ్మా.

**271. నీ విమల ప్రభావమును నీ వినయాదిక సద్గుణంబులున్**
**దేవుఁ డెఱింగి యుండియును నిందలకున్ బుయిలోడి యోజగ**
**త్పావని నీవు గోరిన నెపంబున నిచ్చటి కంపినాఁడు గా**
**కీ విరహాబ్ధి నే కరణి నీఁదగలాఁడతఁ డింక మోదటన్**

**పరిచయం:**

కంకటి పాపరాజు రచించిన 'శ్రీ మదుత్తర రామాయణం' షష్ఠాశ్వాసంలోని 'సీతా పరిత్యాగం' అనే పాఠ్యభాగం లోనిదీ పద్యం.

**సందర్భం:**

రాముడు సీతను విడిచాడని లక్ష్మణుడు చెప్పే సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| ఓ జగత్పావని | = | లోకంలోకే పవిత్రురాలివైన ఓ సీతాదేవి |

| | | |
|---|---|---|
| నీ | = | నీ యొక్క |
| విమల | = | నిర్మలమైన |
| ప్రభావమును | = | గొప్పతనాన్ని |
| నీ | = | నీ యొక్క |
| వినయాదిక | = | అధికమైన వినయం వంటి |
| సద్గుణంబులన్ | = | మంచి గుణాలు |
| దేవుడు | = | రాముడు |
| ఎఱింగి యుండియును | = | తెలిసి కూడా |
| నిందలకున్ | = | అపనిందలకు |
| వుయిలోడి | = | వెనుదీసి |
| నీవు | = | నీవు |
| కోరిన | = | కోరిన |
| నెపంబున | = | మిషతో |
| ఇచ్చటికి | = | అడవులకు |
| అంపినాడు | = | పంపించాడు |
| కాకీ విరహాబ్ధిన్ | = | కాకపోతే ఈ విరహమనే సముద్రంలో |
| ఏ కరణిన్ | = | ఏ విధంగా |
| ఈదగలాడు | = | ఈదగలడు |
| అతడు | = | ఆ రాముడు |
| ఇంకమీదటన్ | = | ఇకపైన |

**తాత్పర్యం:**

లోకపావనివైన ఓ సీతాదేవి! సీ నిర్మలత్వాన్ని, నీ వినయం మొదలైన సద్గుణాలను రాముడు తెలిసివుండి కూడా నిందలకు వెనుదీసి నీవు కోరావు అనే మిషమీద ఇక్కడికి పంపాడు. ఇకపై రాముడు ఏవిధంగా ఈ విరహం అనే సముద్రాన్ని ఈదగలడు.

**279. ఎడపక పూర్వజన్మము నే మిథునంబులఁ బాయఁ జేసి వా**
**రడలఁగ నవ్వుచుండితినొ యాయఘ మూరక పోనె నాఁడు కా**
**ఆడవుల రామపాద జలజాప్తి వసించితి నేఁడు నాథుపాం**
**దెడపి యనాథనై యిచట నేగతి భరింతుఁ బ్రాణముల్**

**పరిచయం:**

కంకటి పాపరాజు రచించిన 'శ్రీ మదుత్తర రామాయణం' షష్ఠాశ్వాసంలోని 'సీతా పరిత్యాగం' అనే పాఠ్యభాగం లోనిదీ పద్యం.

**సందర్భం:**

రాముడి నిర్ణయాన్ని లక్ష్మణుడి ద్వారా విన్న సీతాదేవి ఆవేదన చెందే సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| ఎడపక | = | ఆలోచించకుండా |
| పూర్వజన్మములన్ | = | ముందు జన్మలలో |
| ఏ మిథునంబులన్ | = | ఏ జంటలను |
| పాయజేసి | = | వేరుచేసి |
| వారడలగ | = | వారు బాధపడుతుండగా |
| నవ్వుచుండితినొ | = | నవ్వుతూ ఉన్నానో |
| ఆ అఘం | = | ఆ పాపం |
| ఊరకపోనె | = | ఊరకనే పోతుందా |
| నాడు | = | అప్పుడు ఆ అరణ్యవాస సమయంలో |
| కాఅడవుల | = | భయంకరమైన అడవులలో |
| రామపాద | = | రామ చరణాలనే |
| జలజాప్తి | = | పద్మాల దగ్గర |
| వసించితి | = | నివసించాను |
| నేడు | = | ఈరోజు |
| నాథు | = | భర్త |
| పొందు | = | ప్రేమను |
| ఎడసి | = | దూరం చేసుకొని |
| అనాథనై | = | ఎవరూ లేనిదానినై |
| ఇచట | = | ఇక్కడ |
| ఏ గతి | = | ఏ విధంగా |
| భరింతు | = | భరించగలను |
| ప్రాణమున్ | = | ప్రాణాలు |

**తాత్పర్యం:**

పూర్వజన్మలలో ఏ జంటలను విడతీసి వారు దుఃఖిస్తుంటే నేను నవ్వుతూ ఉన్నానో ఆ పాపం ఊరకనే పోతుందా. వనవాస సమయంలో రాముడి పాదపద్మాల దగ్గర నివసించాను. ఈ రోజు భర్త పొందు పోగొట్టుకొని అనాథలాగా ఏవిధంగా ఈ జీవితాన్ని భరించగలను.

**విశేషం:**

భారతదేశంలో ఎవరి మీదో నేరాన్ని, దోషాన్ని నెట్టకుండా ఏది జరిగినా నేను పోయిన జన్మల్లో చేసిన పాపం వలనే నేడు నాకీ పరిస్థితి కలిగింది అనుకోవటం పరిపాటి. ఇతరులపై పగ, ద్వేషం కారణంగా ఇంకా సమస్యలే పెరుగుతాయి. కానీ మనశ్శాంతి కలుగదు. నా పనుల వల్లే నేను బాధపడుతున్నాను అనుకున్నప్పుడు, అదీ తెలియని పూర్వజన్మలో అనుకున్నప్పుడు కొంత మనస్సు శాంతిస్తుంది.

**284. పతి మది నెంచెనేమొ తనుఁ బాసి యశోకవనంబులోపలన్**
**బ్రతుకదె పెక్కునాళ్లనుచుఁ గ్రమ్మఱదాఁ జనుదెంచి శత్రునిన్**
**హతునిగఁ జేయు నేలు నను నాసగదా బ్రదికించె నాఁ టికా**
**గతి నిఁకనేమి యాసగొని కాయము నిల్పుదుఁ దెల్పు లక్ష్మణా**

**పరిచయం:**

కంకటి పాపరాజు రచించిన 'శ్రీ మదుత్తర రామాయణం' షష్ఠాశ్వాసంలోని 'సీతా పరిత్యాగం' అనే పాఠ్యభాగం లోనిదీ పద్యం.

**సందర్భం:**

సీతాదేవి ఆవేదన చెందుతూ భర్త ఒకవేళ ఇలా భావించాడేమో అని లక్ష్మణుడికి తెలిపే సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| లక్ష్మణా | = | ఓ లక్ష్మణా! |
| పతి | = | భర్త |
| మదిన్ | = | మనసులో |
| ఎంచెనేమొ | = | ఆలోచించాడేమో |
| తనున్ | = | తనను |
| పాసి | = | విడిచి |
| అశోకవనంబు | = | అశోకవనం |

| | | |
|---|---|---|
| లోపలన్ | = | లోపల |
| బ్రతుకదె | = | జీవించలేదా |
| పెక్కునాళ్ళు | = | ఎక్కువ రోజులు |
| అనుచున్ | = | అంటూ |
| క్రమ్మఱ | = | తర్వాత |
| తాన్ | = | తను |
| చనుదెంచి | = | వచ్చి |
| శత్రునిన్ | = | శత్రువుని |
| హతునిగన్ | = | చచ్చినవాడిగా |
| చేయున్ | = | చేస్తాడు |
| ఏలునసున్ | = | నన్ను పాలిస్తాడు అనే |
| ఆశగదా | = | ఆశగదా |
| బ్రతికించెన్ | = | నన్ను బ్రతికించింది |
| నాటికా గతిన్ | = | అప్పుడు ఆవిధంగా |
| ఇకనేమి | = | ఇప్పుడు ఏ |
| ఆశగొని | = | ఆశతో |
| కాయము | = | శరీరము |
| నిల్పుదున్ | = | నిలుపగలను |
| తెల్పు | = | తెల్పుము |

**289. వనమున కేలవచ్చితివి వల్లభునిన్ బెడఁ బాసి యొంటిగా**
**నని మునిపత్నులెల్ల గుమిగై యడుగన్ ధృతిమాలి వారికే**
**మని వివరింతు నింత విపదంబుధి నేకరణిన్ దరింతునే**
**యనువున నీ ప్రతిక్షణ మహాయుగముల్ క్రమియింతు లక్ష్మణా**

**పరిచయం:**

కంకటి పాపరాజు రచించిన 'శ్రీ మదుత్తర రామాయణం' షష్ఠాశ్వాసంలోని 'సీతా పరిత్యాగం' అనే పాఠ్యభాగం లోనిదీ పద్యం.

**సందర్భం:**

భర్త లేకుండా ముని ఆశ్రమాలకు వెళితే మునిపత్నులు ఏమనుకుంటారో అని సీత ఊహించుకునే సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| లక్ష్మణా | = | ఓ లక్ష్మణా! |
| వనమునకు | = | అడవికి |
| ఏలవచ్చితివి | = | ఎందుకు వచ్చావు |
| వల్లభునిన్ | = | భర్తను |
| ఎడబాసి | = | విడిచి |
| ఒంటిగాన్ | = | ఒంటరిగా |
| అని | = | అని |
| మునిపత్నులు | = | మునుల భార్యలు |
| ఎల్ల | = | అందరూ |
| గుమియై | = | గుమిగూడి |
| అడుగన్ | = | అడిగితే |
| ధృతిమాలి | = | ధైర్యం విడిచి |
| వారికేమని | = | వారికి ఏమని |
| వివరింతును | = | వివరించగలను |
| ఇంత | = | ఇంత |
| విపదంబుధిని | = | ఆపతే సముద్రాన్ని |
| ఏ కరణిన్ | = | ఏ విధంగా |
| తరింతును | = | దాటగలను |
| ఏ యనువునన్ | = | ఏ ఉపాయంతో |
| ఈ ప్రతిక్షణం | = | ఈ నిరీక్షించే క్షణం అనే |
| మహాయుగముల్ | = | మహాయుగాలని |
| క్రమియింతు | = | అధిగమించగలను |

**తాత్పర్యం:**

లక్ష్మణా, మునికాంతలందరూ గుమిగూడి భర్తను వదిలి ఒంటరిగా అడవికి ఎందుకు వచ్చావు అని నన్ను అడిగితే ధైర్యవ విడిచి వారికి నేను ఏమని వివరించగలను. ఇంత ఆపద అనే సముద్రాన్ని నేను ఏవిధంగా దాటగలను. ఏ ఉపాయంతో ప్రతిక్షణం మహాయుగంలాగా అనిపిస్తుంటే దానిని ఏవిధంగా అధిగమించగలను.

**విశేషం:**

లోకవ్యవహారం ఇక్కడ మనకు కనిపిస్తుంది. ఇతరులేమనుకుంటారో అనే స్త్రీ సహజమైన ఆలోచనను ఇక్కడ సీతాదేవి కలిగి ఉండటం గమనించవచ్చు.

**303. అని దుఃఖించు నపప్రథన్ దెలుపకాహా భూవిభుండింతవం**
**చనఁ గావించునె యంచు విన్ననగు నేచందంబునన్ దెల్పి పొ**
**మ్మనె మోమోడక యంచు నెంచుఁ బతిఁ బాయన్ జేతితే దైవమా**
**యను నింకెవ్వరు దిక్కనున్ దొలఁ గవీ ప్రాణంబులౌరా యనున్**

**పరిచయం:**

కంకటి పాపరాజు రచించిన 'శ్రీ మదుత్తర రామాయణం' షష్ఠాశ్వాసంలోని 'సీతా పరిత్యాగం' అనే పాఠ్యభాగం లోనిదీ పద్యం.

**సందర్భం:**

భర్త తనను వదిలేశాడనే దుఃఖంతో సీత మానసిక పరిస్థితిని కవి చిత్రించిన సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| అని | = | అని |
| దుఃఖించున్ | = | శోకిస్తుంది |
| అపప్రథన్ | = | అపకీర్తిని |
| తెలుపక | = | తెలియజేయకుండా |
| ఆహా | = | ఆహా |
| భూవిభుండు | = | రాజు |
| ఇంతవంచన | = | ఇంతమోసం |
| కావించునె | = | చేస్తాడా |
| అంచు | = | అంటూ |

| | | |
|---|---|---|
| విన్నసగున్ | = | తెల్లబోతుంది |
| ఏచందంబునన్ | = | ఏవిధంగా |
| తెల్పి | = | తెలియజేసి |
| పొమ్మనె | = | పొమ్మనటానికి |
| మోమోడక | = | సంకోచించక |
| అంచున్ | = | అంటూ |
| ఎంచున్ | = | ఆక్షేపిస్తుంది |
| పతిన్ | = | భర్తను |
| పాయన్ | = | ఎడబాసేటట్లు |
| జేతితే దైవమాయనున్ | = | చేశావు కదా దేవుడా అంటుంది |
| ఇంకెవ్వరు | = | ఇంక ఎవరు |
| దిక్కనున్ | = | నాకు దిక్కు |
| తొలగవు | = | పోవుకదా |
| ఈ ప్రాణంబులు | = | నా ప్రాణాలు |
| ఔరా అనున్ | = | ఔరా అంటుంది |

**తాత్పర్యం:**

అని సీతాదేవి దుఃఖిస్తూ రాజు అయిన శ్రీరాముడు అపవాదును తెలుపకుండానే అడవికి పంపి మోసం చేశాడు అంటుంది, తెల్లబోతుంది, సంకోచం లేకుండా విధానమంతా తెలిపి పొమ్మనలేదే అని ఆక్షేపిస్తుంది. ఓ దైవమా! నా భర్త నుండి ఎడబాటు కలిగించావే అంటుంది. ఇంక నాకు దిక్కెవరు అంటుంది. ఈ ప్రాణాలు పోవటం లేదేంటి అనుకుంటుంది.

**308. అని మునిబాలకుల్ తెలుప నమ్ముని యాంతరదృష్టినంతయున్**
**గని రఘురాముదేవి జనక క్షితిపాత్మజ యంచుఁ బల్కిఁ గ**
**క్కున నటు లర్ఘ్యపాత్రఁ గొని కొల్చుచు వెంబడి నేఁ గుదేరఁ బా**
**యని దయ నెమ్మనంబు మొనయన్ జని గాంగతటంబు చెంగటన్**

**పరిచయం:**

కంకటి పాపరాజు రచించిన 'శ్రీ మదుత్తర రామాయణం' షష్ఠాశ్వాసంలోని 'సీతా పరిత్యాగం' అనే పాఠ్యభాగం లోనిదీ పద్యం.

**సందర్భం:**

సీతాదేవిని దైవస్థితిలో చూసిన మునిబాలకులు ఆ విషయాన్ని వాల్మీకి మహర్షికి తెలిపిన సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| అని | = | అని |
| ముని బాలకుల్ | = | ముని కుమారులు |
| తెలుపన్ | = | తెలుపగా |
| అమ్మని | = | ఆ వాల్మీకి మహర్షి |
| ఆంతరదృష్టిన్ | = | దివ్య దృష్టితో |
| అంతయున్ | = | అంతా |
| కని | = | చూచి |
| రఘురాముదేవి | = | శ్రీరాముని భార్య |
| జనక క్షితిపాత్మజ | = | జనకుని కూతురు |
| అంచు | = | అంటూ |
| పల్కి | = | చెప్పి |
| గ్రక్కున | = | వెంటనే |
| అటుల | = | ఆవిధంగా |
| అర్ఘ్య పాత్ర | = | అర్ఘ్య పాత్రను |
| కొని | = | తీసుకొని |
| కొల్చుచు | = | సేవిస్తూ |
| వెంబడిన్ | = | వెంట |
| ఏగుదేరన్ | = | బయలుదేరగా |
| పాయని | = | విడువని |
| దయన్ | = | దయతో |
| నెమ్మనంబు | = | నిండు మనస్సుతో |
| మొనయన్ | = | పూనుకొని |
| జని | = | వెళ్ళి |

| | | |
|---|---|---|
| గాంగతటంబు | = | గంగా తీరం |
| చెంగటన్ | = | సమీపంలో |

**తాత్పర్యం:**

అని మునికుమారులు తెలుపగా ఆ వాల్మీకి మహర్షి తన దివ్యదృష్టితో అంతా చూసి రాముడి భార్య, జనకరాజు కుమార్తె అంటూ చెప్పి వెంటనే అర్ఘ్యపాత్రను తీసుకొని తన వెనుకే మునిబాలకులు తనను కొలుస్తూ రాగా దయగల తన నిండు మనసుతో పూనుకొని వెళ్ళి ఆ గంగానది తీరంలో.

**312. అఱమర యేలనే నిలుచు నాశ్రమదేశము నీదెకాదె నీ**
**కెఱబఱికంబు లేక యిఁ క నిచ్చట నున్న తపస్వి కాంతలం**
**దఱు నుచితోపచారము లొనర్పఁ గలారు వివేక శాలినుల్**
**మఱతురె తెల్వి దైవగతి మాన్పఁ గ నెవ్వరికైన శక్యమే**

**పరిచయం:**

కంకటి పాపరాజు రచించిన 'శ్రీ మదుత్తర రామాయణం' షష్ఠాశ్వాసంలోని 'సీతా పరిత్యాగం' అనే పాఠ్యభాగం లోనిదీ పద్యం.

**సందర్భం:**

సీతాదేవికి ఊరటకలిగిస్తూ మహర్షి ఓదార్పు మాటలు పలికే సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| అఱమర | = | కొత్తదనం |
| ఏలనే | = | ఎందుకు |
| నిలుచున్ | = | నిలుస్తుంది |
| ఆశ్రమ దేశము | = | ఆశ్రమ ప్రదేశం |
| నీదె కాదె | = | నీదే కదా |
| నీకు | = | నీకు |
| ఎఱబఱికంబు | = | అసహ్యం |
| లేక | = | లేకుండా |
| యిక | = | ఇకపై |
| ఇచ్చటన్ | = | ఇక్కడే |

| | | |
|---|---|---|
| ఉన్న | = | ఉండే |
| తపస్వి కాంతలు | = | తపస్వినులు |
| అందరు | = | అందరూ |
| ఉచితోపచారములు | = | తగిన సేవలు |
| ఒనర్పగలారు | = | చేయగలరు |
| వివేకశాలినుల్ | = | వివేకం కలిగినవారు |
| మఱతురె | = | మరుస్తారా |
| తెల్పి | = | తెలివిని |
| దైవగతి | = | విధి విధానం |
| మాన్పగన్ | = | మాన్పటం |
| ఎవ్వరికైన | = | ఎవరికైనా |
| శక్యమే | = | సాధ్యమూ |

**తాత్పర్యం:**

కొత్తదనం ఎందుకు నేను ఉన్న ఆశ్రమ ప్రదేశం నీదేకదా నీకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇక్కడ ఉన్న తపస్వినులు అందరూ నీకు ఉచితమైన సేవలు చేయగలరు. వివేకవంతులు తెలివిని మరుస్తారా. విధి విలాసాన్ని ఎవరైనా మార్చగలగటం సాధ్యమా?

**విశేషం:**

సీతాదేవికున్న సందేహాలు తొలగేవిధంగా ఆమె మనసు చదివినట్లుగా మహర్షి మాట్లాడుతున్నాడు.

**318. చెడుగులు రావణాసురునిచే ( జెఱవోయిన కాంత( దెచ్చి యే**
**లెడునని తన్ను( బల్కిన( జలించి రఘూద్వహు( డీమె సద్గుణం**
**బెడద( నెఱంగియున్ సడి సహింపక కానల కంపినా(డు మీ**
**రెడపక యీమె( బ్రోవు(డని యింతిని వారల కప్పగించినన్**

**పరిచయం:**

కంకటి పాపరాజు రచించిన ‘శ్రీ మదుత్తర రామాయణం’ షష్ఠాశ్వాసంలోని ‘సీతా పరిత్యాగం’ అనే పాఠ్యభాగం లోనిదీ పద్యం.

**సందర్భం:**

సీతాదేవి గురించి వాల్మీకి మహర్షి మునిపత్నులకు వివరించే సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| చెడుగులు | = | చెడ్డవారు |
| రావణాసురినిచేన్ | = | రావణాసురుడి వలన |
| చెఱవోయిన | = | చెరబట్టబడిన |
| కాంతన్ | = | స్త్రీని |
| దెచ్చి | = | తీసుకొని వచ్చి |
| యేలెడునని | = | ఏలుకుంటున్నాడని |
| తన్ను | = | తనను |
| పల్కినన్ | = | అనగా |
| చలించి | = | చలించిన |
| రఘూద్వహుడు | = | రఘురాముడు |
| ఈమె | = | సీత |
| సద్గుణంబు | = | మంచి గుణాలు |
| ఎడదన్ | = | మనసులో |
| ఎఱింగియున్ | = | తెలిసివుండి కూడా |
| సడి | = | ఆ శబ్దాలు (మాటలు) |
| సహింపక | = | సహించలేక |
| కానలకు | = | అడవులకు |
| అంపినాడు | = | పంపించాడు |
| మీరెడపక | = | మీరు భేదభావం లేకుండా |
| ఈమెన్ | = | ఈమెను |
| బ్రోవుడని | = | రక్షించండి అని |
| యింతిని | = | సీతాదేవిని |
| వారలకు | = | మునిపత్నులకు |
| అప్పగించినన్ | = | అప్పగించగా |

**తాత్పర్యం:**

చెడ్డవారు రావణాసురుడి చేత చెరపట్టబడిన స్త్రీని తెచ్చి ఏలుకుంటున్నాడని పలుకగా చలించిన రాముడు ఈమె మంచి గుణాలు మనసులో తెలిసి ఉండి కూడా ఆ మాటలను సహించలేక అడవులకు పంపాడు. మీరు తేడా లేకుండా ఎల్లప్పుడూ ఈమెను అనుగ్రహించండని సీతాదేవిని వారికి అప్పగించగా.

**విశేషం:**

ఉన్న వాస్తవాన్నే మునికాంతలకు చెప్పి సీతాదేవిని మీరే కాపాడాలని చెప్పటంతో ఇంక సీత భయపడిన విధంగా వారు ఆమెను ఏ ప్రశ్నలు అడగరు. మునులు లాగానే దయగలిగినవారు మునిపత్నులు కూడా. అంతేకాక వారు వివేకవంతులు కూడా. వారు చెడ్డవారు కాదు కదా ఊహాపోహలు చేయటానికి, వాల్మీకి చెప్పిన మాటే వారికి వేదవాక్కు.

**327. ఆ సత్రంబున కేకవార్షిక మఖ వ్యాసక్తిమై వచ్చి దు**
**ర్వాసుండన్ గురుచెంత నున్కిఁ గని దీవ్యద్వహ్ని భానుద్యుతుల్**
**భాసిల్లం దగువారిఁ జేరఁ జని సద్భక్తిన్ నతుల్ సేసిత**
**త్ప్రాసన్న్యంబున కుబ్బుచున్ గొలిచి భూపాలుండు వర్తిల్లఁ గన్**

**పరిచయం:**

కంకటి పాపరాజు రచించిన 'శ్రీ మదుత్తర రామాయణం' షష్ఠాశ్వాసంలోని 'సీతా పరిత్యాగం' అనే పాఠ్యభాగం లోనిదీ పద్యం.

**సందర్భం:**

సుమంత్రుడు జరిగిన వృత్తాంతాన్ని లక్ష్మణుడికి తెలియజేసే సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| ఆ సత్రంబునకు | = | ఆ యుగానికి |
| ఏక వార్షిక | = | ఒక సంవత్సరం కాలం |
| మఖవ్యాసక్తియై | = | యజ్ఞం చూడాలనే ఆసక్తి కలవాడై |
| వచ్చి | = | వచ్చి |
| దుర్వాసుండున్ | = | దుర్వాసుడు |
| గురుచెంతన్ | = | వసిష్ఠుడి దగ్గర |
| ఉన్నిన్ | = | ఉండగా |
| కని | = | చూసి |

| | | |
|---|---|---|
| దీవ్యద్వహ్నిభాను | = | దివ్యమైన అగ్ని, సూర్యుల |
| ద్యుతుల్ | = | వెలుగులు |
| భాసిల్లం | = | వెలుగొందగా |
| తగువారిన్ | = | తగినవిధంగా వారిని |
| చేరజని | = | చేరుకొని |
| సద్భక్తిన్ | = | భక్తితో |
| నతులేసేసి | = | స్తుతించి |
| తత్ప్రసన్న్యంబున | = | వారి ప్రసన్నత్వం |
| కంబ్బుచున్ | = | సంతోషిస్తూ |
| కొలిచి | = | సేవించి |
| భూపాలుండు | = | దశరథ మహారాజు |
| వర్తిల్లగన్ | = | నిలిచి ఉండగా |

**తాత్పర్యం:**

ఒక సంవత్సరం కాలం ఆ యజ్ఞాన్ని చూడాలనే ఆసక్తి కలవాడై దశరథుడు వచ్చి దుర్వాసుడు వసిష్టుడి దగ్గర ఉండటం చూసి దివ్యమైన అగ్ని, సూర్యుని వంటి వెలుగులతో ప్రకాశిస్తున్న వారి చెంతకు తగిన రీతిగా వెళ్ళి భక్తితో స్తుతించి వారి ప్రసన్నతకు ఆనందిస్తూ వారిని సేవించి దశరథుడు ఉండగా.

**336. దేవుఁ డ వంచు నిన్ను వినుతింపుదు రందఱు నింత క్రూరతన్**
**స్త్రీ వధ యెట్లు చేసితివి శ్రీధర యీకొలచెందకుండ ( గా (**
**బోవునె మానవత్వమున భూమిని నీవికఁ బుట్టి యాత్మప**
**త్నీ విరహార్తి నందురు మనేక దినంబు లటంచు ( దిట్టినన్**

**పరిచయం:**

కంకటి పాపరాజు రచించిన 'శ్రీ మదుత్తర రామాయణం' షష్ఠాశ్వాసంలోని 'సీతా పరిత్యాగం' అనే పాఠ్యభాగం లోనిదీ పద్యం.

**సందర్భం:**

సుమంత్రుడు పూర్వం జరిగిన వృత్తాంతాన్ని రాముడి కష్టానికి కారణాన్ని లక్ష్మణుడికి వివరించే సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| శ్రీధర | = | ఓ నారాయణుడా! |
| దేవుడవు | = | దేవుడివి |
| అంచు | = | అంటూ |
| నిన్ను | = | నిన్ను |
| వినుతింపుదురు | = | స్తుతిస్తుంటారు |
| అందఱున్ | = | అందరు |
| ఇంత | = | ఇంత |
| క్రూరతన్ | = | క్రూరత్వంతో |
| స్త్రీ వధన్ | = | స్త్రీ హత్యను |
| ఎట్లా | = | ఎలా |
| చేసితివి | = | చేశావు |
| ఈకొల | = | ఈ పాపం / హింస |
| చెందకుండగాన్ | = | చెందకుండా |
| పోవునె | = | పోతుందా |
| మానవత్వమున | = | మానవత్వంతో |
| భూమిని | = | భూమిని |
| నీవికన్ | = | నీవికపై |
| పుట్టి | = | జన్మించి |
| ఆత్మన్ | = | ఆత్మతో |
| పత్నీ విరహార్తి | = | భార్యా వియోగబాధను |
| వందురు | = | బాధపడు |
| అనేక దినంబులు | = | చాలా రోజులు |
| అటంచున్ | = | అంటూ |
| తిట్టినన్ | = | శపించగా |

**తాత్పర్యం:**

ఓ నారాయణా! నువ్వే దేవుడివి అంటూ అందరూ నిన్ను స్తుతిస్తారు. ఇంత క్రూరంగా స్త్రీ వధ ఎలా చేశావు. ~~ఈ~~ హింస చేసిన పాపం నీకు చెందకుండా పోతుందా? మానవుడిగా భూమి మీద నీవు పుట్టి చాలారోజులు నీ భార్యా వియోగ ఆర్తితో బాధపడు అంటూ శపించగా.

**విశేషం:**

రాముడికి కలిగిన కష్టానికి అతడికి లభించిన శాపమే కారణమని చెప్పటం రాముడి ఉదాత్తత చెడకుండా ఉండటానికే వాల్మీకి రామాయణంలో ఉన్న దానినే ఇక్కడ కంకంటి పాపరాజు స్వీకరించి చెప్పారు. ఇది నిర్వచనోత్తర రామాయణంలో కనిపించదు.

**341.** **కతిపయవర్షముల్ చనినఁ గార్యములన్నియుఁ దీర్చి రామభూ**
**పతి మిము మున్నుగా ( బనిచి బ్రహ్మసదనంబున కేఁగు సితకై**
**వెతపని లేదనన్ ధృతియు వేడుకయున్ దహియించి లక్ష్మణుం**
**డతని నుతించుచున్ జని రయంబున గోమతిఁ జేరె నాఁటికిన్**

**పరిచయం:**

కంకటి పాపరాజు రచించిన 'శ్రీ మదుత్తర రామాయణం' షష్ఠాశ్వాసంలోని 'సీతా పరిత్యాగం' అనే పాఠ్యభాగం లోనిదీ పద్యం.

**సందర్భం:**

సుమంత్రుడు తాను వినిన మాటలను లక్ష్మణుడికి ఊరట కలిగించటం కోసం చెప్పే సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| అతిపయ | = | కొన్ని |
| వర్షములు | = | సంవత్సరాలు |
| చనినన్ | = | గడువగా |
| కార్యములు | = | పనులు |
| అన్నియును | = | అన్నీ |
| తీర్చి | = | పూర్తి చేసి |
| రామభూపతి | = | రాజు రాముడు |
| మిము | = | మిమ్ములను |
| మున్నుగాన్ | = | ముందుగా |

| | | |
|---|---|---|
| పనిచి | = | పంపించి |
| బ్రహ్మ సదనంబునకు | = | బ్రహ్మ సదనానికి |
| ఏగు | = | వచ్చును |
| సితకై | = | నిర్ణయింపబడిన దాని కోసం |
| వెతపని | = | బాధపడవలసిన పని |
| లేదనన్ | = | లేదు |
| ధృతియు | = | ధైర్యం |
| వేడుకయున్ | = | కుతూహలం |
| వహియించి | = | పూనుకొని |
| లక్ష్మణుండు | = | లక్ష్మణుడు |
| అతనిన్ | = | సుమంత్రుడిని |
| ఉతించుచున్ | = | మెచ్చుకొంటూ |
| చని | = | వెళ్ళి |
| రయంబున | = | వేగంగా |
| గోమతి | = | గోమతిని |
| చేరె | = | చేరాడు |
| నాటికిన్ | = | ఆ రోజుకు |

**350. అమలత మిమ్మెఱింగిన మహాత్ములె పుత్రకళత్రమిత్రవ**
**ర్గముపయి మోహముంచక విరక్తి వహింపఁగ మీకుఁజెల్లునే**
**భ్రమగొని వందురన్ దరుణిఁ బాసిధరాపరిపాలనంబు సే**
**య మఱచె రాముఁడంచు ననరా ప్రజలాశ్రితరక్షణోత్సుకా**

**పరిచయం:**

కంకటి పాపరాజు రచించిన 'శ్రీ మదుత్తర రామాయణం' షష్ఠాశ్వాసంలోని 'సీతా పరిత్యాగం' అనే పాఠ్యభాగం లోనిదీ పద్యం.

**సందర్భం:**

లక్ష్మణుడు రాముడిని సమీపించి రాముడికి ఉపశమనం కలిగేవిధంగా మాట్లాడే సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| అమలత | = | పవిత్రతలో |
| మిమ్ము | = | మిమ్మలిని |
| ఎఱింగిన | = | తెలిసి వున్న |
| మహాత్ములై | = | మహాత్ములే |
| పుత్ర | = | కుమారులు |
| కళత్ర | = | భార్య |
| మిత్ర | = | స్నేహితులు |
| వర్గముపయి | = | సమూహం మీద |
| మోహముంచక | = | మోహం ఉంచుకోకుండా |
| విరక్తి | = | విరక్తి |
| వహింపగ | = | వహించగా |
| మీకు | = | మీకు |
| చెల్లునే | = | సరిపోతుందా |
| భ్రమగొని | = | భ్రమతో |
| మందురన్ | = | బాధపడగా |
| తరుణి | = | భార్యను |
| పాసి | = | పోగొట్టుకొని |
| ధరా పరిపాలనంబు | = | భూపాలన |
| సేయమఱచె | = | చేయటం మరచాడు |
| రాముడు | = | రాముడు |
| అంచున్ | = | అంటూ |
| అనరా | = | నిందించరా |
| ప్రజలు | = | ప్రజలు |
| ఆశ్రిత రక్షణోత్సుకా | = | ఆశ్రితులను రక్షించే ఉత్సుకత కలవాడా! |

**తాత్పర్యం:**

పవిత్రతతో మిమ్మల్ని తెలుసుకున్న మహాత్ములే కుమారులు. భార్య, స్నేహితుల మొదలైన వారిపై మోహం లేకుండా వైరాగ్యం వహిస్తుంటే మీకు ఇలా భ్రమతో బాధపడటం తగినదేనా. భార్యను విడిచి రాజ్యపాలన చేయటం కూడా రాముడు మరచిపోయాడని ప్రజలు నిందించరా!

**విశేషం:**

రాముడి నాడి తెలిసి లక్ష్మణుడు మాట్లాడటం ఇక్కడ గమనించవలసినది. ప్రజలు నిందించారని భార్యను వదిలాడు. మళ్ళీ ప్రజలు నిందించరా అంటే రాజ్యపాలన చేస్తాడని లక్ష్మణుడు తెలివిగా పలకటం గమనించవచ్చు.

**డా॥ ఇరపని మాధవి**

తెలుగు & ప్రాచ్య భాషా విభాగం,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,
నాగార్జున నగర్.

పాఠం - 15

# సీతాపరిత్యాగం

### - కంకంటి పాపరాజు

## సందర్భ సహిత వ్యాఖ్యలు

### 1. మహిజకుఁ ద్రోవనయ్యె దుశ్శకునంబుల్.

**పరిచయం:** కంకటి పాపరాజు రచించిన 'శ్రీ మదుత్తర రామాయణం' షష్ఠాశ్వాసంలోని 'సీతా పరిత్యాగం' అనే పాఠ్యభాగం నుండి ఈ వాక్యం గ్రహింపబడింది.

**సందర్భం:** ప్రజలు వేసిన అపవాదుకు భయపడి దానిని పోగొట్టుకోవటం కోసం రాముడు సీతాదేవిని అడవిలో దించి రమ్మని లక్ష్మణుడిని ఆజ్ఞాపించగా అన్న ఆజ్ఞననుసరించి సీతాదేవిని రథంపై అడవులకు తీసుకువెళ్ళే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** సీతాదేవి మునిపత్నులకని కొన్ని బంగారు వస్త్రాలు, రత్నాలతో కూడిన ఆభరణాలు తీసుకొని మరిది వెంటరథం ఎక్కగా సుమంతుడు గుర్రాలను వేగంగా తోలగా రామాజ్ఞకు భయపడుతూ లక్ష్మణుడు భయం, ఆర్తి, దైన్యంతో నిండిన మనసుతో ఏమీ అనలేక ఉండగా వెంటవెంటనే సీతాదేవికి దారిలో అపశకునాలు కనిపించాయి.

### 2. దైవగతిఁ గమింపఁగ ( దరమే.

**పరిచయం:** కంకటి పాపరాజు రచించిన 'శ్రీ మదుత్తర రామాయణం' షష్ఠాశ్వాసంలోని 'సీతా పరిత్యాగం' అనే పాఠ్యభాగం నుండి ఈ వాక్యం గ్రహింపబడింది.

**సందర్భం:** అపశకునాలు చూసిన సీతాదేవి కలతపడుతూ తన భర్తకు, మరుదులకు, బంధువులకు, ప్రజలకు ఏ కీడు జరగకుండా అపశకునాల వలన కలిగే కీడు వైరం పోగొట్టాలని సీతాదేవి కోరుకుంటున్న సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** సీతాదేవి చిత్తశుద్ధికి, స్నేహానికి భయపడి లక్ష్మణుడు ఈమె జీవిత లోకమంత భర్తతో ఎప్పుడూ కలిసి వుండేటట్లు గాక వేరయ్యేటట్లు విధి చేశాడని బాధపడుతూ, మాట్లాడబోయి మానుకుంటు ఉస్సురుస్సురంటూ నిట్టూరుస్తు ఉన్న లక్ష్మణుడిని చూసి, ఆగకుండా కనిపిస్తున్న దుశ్శకునాలను చూసి కూడా సీతాదేవి మెదలకుండా వెళ్ళింది. విధివిధానం తప్పించటం ఎవరితరమూ కాదు కదా!

### 3. నీకా యన్నపయి భక్తి దొలగెనొ.

**పరిచయం:** కంకటి పాపరాజు రచించిన 'శ్రీ మదుత్తర రామాయణం' షష్ఠాశ్వాసంలోని 'సీతా పరిత్యాగం' అనే పాఠ్యభాగం నుండి ఈ వాక్యం గ్రహింపబడింది.

**సందర్భం:** లక్ష్మణుడిలోని కలతను గుర్తించిన సీత కారణమేంటి అని అడుగగా లక్ష్మణుడు జనుల చేత నిందించబడే పనికి పూనుకున్నాను, నన్ను శపించమన్నప్పుడు సీతాదేవి అతడి సద్గుణాలను శ్లాఘించే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** పరుల భార్యలను తల్లులుగా ఎప్పుడు భావిస్తావు. పరులధనమంటే హాలాహలంగా చూస్తావు. అసత్యం ఎప్పుడూ చెప్పవు. ఎవ్వరిని పరుషంగా మాట్లాడవు. బ్రాహ్మణ భక్తి, రామసేవ విడువవు. జనులు నిందించే పనులేవి ఇంక గౌరవం విడిచి మీ అన్న నిన్ను నిరాకరించారు, నీకు ఆ అన్నపైన భక్తి తొలగిపోయిందా?

### 4. యేమిటి కడలెదవు తండ్రి యెఱిఁగింపఁగదే.

**పరిచయం:** కంకటి పాపరాజు రచించిన 'శ్రీ మదుత్తర రామాయణం' షష్ఠాశ్వాసంలోని 'సీతా పరిత్యాగం' అనే పాఠ్యభాగం నుండి ఈ వాక్యం గ్రహింపబడింది.

**సందర్భం:** లక్ష్మణుడు శపించమన్నప్పుడు కారణమడిగే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** గురునింద చేశావా? పరదూషణ చేశావా? దయలేకుండా శరణన్న వారిని కాదన్నావా, శత్రువును చూసి పారిపోయావా, రాముడి ఆజ్ఞ లేకుండానే నన్ను ధైర్యంగా ఇక్కడికి తీసుకొచ్చావా? రాముడి మనసు నా పట్ల విముఖంగా ఉందా, ఎందుకు బాధపడుతున్నావు తండ్రీ లక్ష్మణా తెలియజెయ్యి.

### 5. నినుఁ గానన లోపల డించి రమ్మనెన్.

**పరిచయం:** కంకటి పాపరాజు రచించిన 'శ్రీ మదుత్తర రామాయణం' షష్ఠాశ్వాసంలోని 'సీతా పరిత్యాగం' అనే పాఠ్యభాగం నుండి ఈ వాక్యం గ్రహింపబడింది.

**సందర్భం:** లక్ష్మణుడు తాను దుఃఖించటానికి కారణం చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** ఇక్కడ వరకు వచ్చి చెప్పకుండా పోతానా తల్లీ. చెడ్డ ఆలోచనలు కలిగిన వారు రాక్షసుడిచే చెరబట్టబడిన నిన్ను తిరిగి రాముడు ఏలుకుంటున్నాడని నిందలు పలుకగా అది విని రాజు నిందించబడ్డానని తలచి నిన్ను అడవులలో దింపి రమ్మనాడు.

### 6. యడవిఁ ద్రోచు రాముఁడనుచు నెఱుగ.

**పరిచయం:** కంకటి పాపరాజు రచించిన 'శ్రీ మదుత్తర రామాయణం' షష్ఠాశ్వాసంలోని 'సీతా పరిత్యాగం' అనే పాఠ్యభాగం నుండి ఈ వాక్యం గ్రహింపబడింది.

**సందర్భం:** సీతాదేవి రాముడు తనను అడవిలో విడిచిరమ్మన్నాడని లక్ష్మణుడు చెప్పగా విన్నప్పుడు ఆమె బాధపడుతూ లక్ష్మణుడితో మాట్లాడే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** నేను పతివ్రతను అంటూ అందరు నన్ను పొగుడుతున్నారని ఇన్ని రోజులు సంతోషిస్తున్నాను. కానీ మధ్యలో ఇలాంటి భయంకరమైన నిందలు పట్టి రాముడు నన్ను అడవిలో త్రోసేస్తాడనుకోలేదు.

**7. నా యభాగ్యమింతె యొకరిఁ బల్కనేల.**

**పరిచయం:** కంకటి పాపరాజు రచించిన 'శ్రీ మదుత్తర రామాయణం' షష్ఠాశ్వాసంలోని 'సీతా పరిత్యాగం' అనే పాఠ్యభాగం నుండి ఈ వాక్యం గ్రహింపబడింది.

**సందర్భం:** తనను రాముడు త్యజించాడని లక్ష్మణుడి వలన తెలుసుకున్న సీత పరిపరివిధాల బాధపడే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** ఆ లంకలో మూడు లోకాలు నన్ను స్తుతించే విధంగా నేను అగ్నిలో ప్రవేశించిన వార్త వినలేదు, ఈ సీత నిర్దోషి ఏలుకొమ్మని బ్రహ్మాది దేవతలు రాముడితో అన్న మాటలు వినలేదా? విని చూసి కూడా ప్రజలు నిందచేసినంత మాత్రానికే రాజు ఉలికిపడి ఇంత సాహసం చేయటానికి పూనుకోవటం నా దురదృష్టమే. దీనికై ఇంకొకరిని నిందించటం ఎందుకు ?

**8. భావమెప్పుడుఁ దనమూర్తిఁ బాయదనుము.**

**పరిచయం:** కంకటి పాపరాజు రచించిన 'శ్రీ మదుత్తర రామాయణం' షష్ఠాశ్వాసంలోని 'సీతా పరిత్యాగం' అనే పాఠ్యభాగం నుండి ఈ వాక్యం గ్రహింపబడింది.

**సందర్భం:** సీతాదేవి రాముడితో చెప్పమని తన ఆవేదనంతా లక్ష్మణుడికి తెలిపే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** అయ్యా! లక్ష్మణా ఇంక ఆలస్యమెందుకు అయోధ్యకు వెళ్ళు, ముగ్గురత్తలకు నమస్కరించానని చెప్పు బంధువులందరిని అడిగానని చెప్పు. చాలా దయకలిగిన రాముడికి నేను మ్రొక్కినట్లుగా నీవు మ్రొక్కు. తన ఆజ్ఞానుసారమే తాను నిందపడకుండా నేను జీవిస్తానని చెప్పు. ప్రజలను, బంధువులకు రక్షించమను, నా జీవనం తానే అని చెప్పు. నా భావంలో తన రూపం ఎప్పుడూ పోదని చెప్పు, కొంచెం నమ్మకం నా మీద ఉంచమని చెప్పు.

**9. రమణి మఱికొంత వడి దాఁక రథము జూచుఁ.**

**పరిచయం:** కంకటి పాపరాజు రచించిన 'శ్రీ మదుత్తర రామాయణం' షష్ఠాశ్వాసంలోని 'సీతా పరిత్యాగం' అనే పాఠ్యభాగం నుండి ఈ వాక్యం గ్రహింపబడింది.

**సందర్భం:** లక్ష్మణుడు వెళ్ళిపోగా మళ్ళీ తిరిగి వస్తాడేమో అనే ఆశతో అటువైపే సీత చూసే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** లక్ష్మణుడు నది దాటి రథమెక్కి వెళుతూ దిక్కుండి దిక్కులేనిదయ్యింది అని సీత ఉన్న వైసే చూస్తూ బాధపడుతుండగా ఇక్కడ సీతాదేవి అతడు తిరిగి వస్తాడేమో అని వెళ్ళిన త్రోవవైపే అనేకసార్లు చూస్తూ విధిని నిందిస్తూ బాధపడుతుంది. రథం దూరమవుతున్న దానికి సూచన ఇది. సీతాదేవి కొంతసేపు రథం చూచింది. మరికొంత సేపు జెండా చూసింది, ఇంకొంతసేపు రథం వల్ల రేగిన ధూళి చూసింది, ఆ తరువాత వట్టి బయలే చూసింది. రథం దూరమవుతున్న దానికి సూచన ఇది.

## 10. మేలు చిన్నెల కది పొలిమేరయేమొ.

**పరిచయం:** కంకటి పాపరాజు రచించిన 'శ్రీ మదుత్తర రామాయణం' షష్ఠాశ్వాసంలోని 'సీతా పరిత్యాగం' అనే పాఠ్యభాగం నుండి ఈ వాక్యం గ్రహింపబడింది.

**సందర్భం:** సీతాదేవి లక్ష్మణుడు వెళ్ళిన తర్వాత అనేక రకాలుగా దుఃఖిస్తూ తాను, రాముడు ఏకాంతంగా ఉన్న సమయంలో రాముడు చేసిన చేష్టలను గుర్తుచేసుకునే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** ఒడిలో ఉంచికొని యెద చేర్చుట చేరిక కది చివరి సారేమో. చెక్కిళ్ళపై చెమటను కొంగుతో తుడవటం చెలిమికి చివరి చీటీయేమో నోట్లోని కర్పూర సుగంధాన్నివ్వటం అనురాగానికది చివరేమో, కోరిన పనికి అంగీకరించటం కరుణా ప్రబంధానికి ఫలగ్రంథమదేమో, ముఖానికి ముఖం చేర్చి ముద్దాడుట మోహపు పనికి ముగింపేమో. వచ్చే నవ్వుని లోపలే ఆపుకుని చూడటం మేలు చిన్నెలకది పొలిమేరేమో.

## 11. నిర్వ్యాజ బంధుజనులు గారె బ్రహ్మమునులు.

**పరిచయం:** కంకటి పాపరాజు రచించిన 'శ్రీ మదుత్తర రామాయణం' షష్ఠాశ్వాసంలోని 'సీతా పరిత్యాగం' అనే పాఠ్యభాగం నుండి ఈ వాక్యం గ్రహింపబడింది.

**సందర్భం:** మునిబాలకులు సీతను చూచి ఆ విషయం వాల్మీకి మహర్షికి తెలియజేయగా వాల్మీకి సీతాదేవిని ఓదార్చి తన ఆశ్రమానికి తీసుకువెళ్ళే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** అమ్మా జానకి, బాధపడకు, నా వనమే నీకు లీలావనమౌతుంది. రా, ఈ నీళ్ళు తీసుకో, నీ ముఖం కడుక్కో అంటూ మహర్షి అనునయించి అర్ఘ్యం ఆమెకు ఇప్పించి తనతోపాటుగా ఎంతో ప్రేమతో తన ఆశ్రమానికి ఆమెను తీసుకొని వెళ్ళాడు. కల్మషం లేనటువంటి బంధువులు కదా బ్రహ్మర్షులు.

## 12. శ్రీరామునురముపై ఁబవళించు బాలికామణి యొంటి పవ్వళించె.

**పరిచయం:** కంకటి పాపరాజు రచించిన 'శ్రీ మదుత్తర రామాయణం' షష్ఠాశ్వాసంలోని 'సీతా పరిత్యాగం' అనే పాఠ్యభాగం నుండి ఈ వాక్యం గ్రహింపబడింది.

**సందర్భం:** అంతఃపురంలో ఎంతో సుఖవంతమైన జీవితాన్ని గడిపిన సీతాదేవి ముని ఆశ్రమంలో ఎలా ఉందో వివరించే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** రంగురంగుల బంగారు చీరలు కట్టే సీతాదేవి నారచీరలు ధరించింది. ఎంతో రుచికరమైన భోజనాలు ఆరగించే సీతాదేవి కందమూలాలు తిన్నది. చంద్రశిలలతో చేసిన గదులలో నివసించే సుకుమారి ముని పర్ణశాలలోనే నివసించింది. శ్రీరాముడి యెదపై నిద్రించే సీతాదేవి ఒంటరిగా పడుకుంది. కనుసన్నలలో అంతఃపుర స్త్రీలు చేసే సేవలను మెచ్చుకొని సీతాదేవి ముని ముగ్ధలు చేసే ఉపచారాలకు సంతోషించింది.

## 13. వధూటిన్ బెడఁ బాసి నిల్వఁ గఁ గలండే తాల్మి చిత్తంబునన్.

**పరిచయం:** కంకటి పాపరాజు రచించిన 'శ్రీ మదుత్తర రామాయణం' షష్ఠాశ్వాసంలోని 'సీతా పరిత్యాగం' అనే పాఠ్యభాగం నుండి ఈ వాక్యం గ్రహింపబడింది.

**సందర్భం:** లక్ష్మణుడు రాముడికి కలిగిన కష్టాలన్నిటినీ తల్చుకొని బాధపడే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** సీతాదేవి కోసం శివధనస్సు విరిచాడు, వాలిని సంహరించాడు. సుగ్రీవుడి స్నేహాన్ని స్వీకరించాడు. వానరులను పాలించాడు. సముద్రాన్ని బంధించాడు. రావాణాసురుడిని యుద్ధభూమిలో సంహరించాడు. రాముడు అలాంటి భార్యను దూరం చేసుకొని ధైర్యంగా ఉండగలడా.

## 14. అతిథి వైతివి మా యింటి కధిపయనుచు.

**పరిచయం:** కంకటి పాపరాజు రచించిన 'శ్రీ మదుత్తర రామాయణం' షష్ఠాశ్వాసంలోని 'సీతా పరిత్యాగం' అనే పాఠ్యభాగం నుండి ఈ వాక్యం గ్రహింపబడింది.

**సందర్భం:** లక్ష్మణుడి ఆవేదన చూసి అతడి దుఃఖం పోగొట్టడానికి సుమంత్రుడు తనకు మాత్రమే తెలిసిన గత సంగతులు లక్ష్మణుడికి చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** దశరథుడు సంవత్సరల కాలం జరిగే యజ్ఞం చూడటం కోసం వశిష్ఠుడి ఆశ్రమానికి వెళ్ళి అక్కడ గురువుతో పాటు దుర్వాసుడు ఉండగా వారిని సమీపించి మ్రొక్కగా వారు సంతోషించి ఓ రాజా నీవు మా ఇంటికి అతిథివయ్యావు అంటూ కందమూలాలు సంతోషంగా ఇచ్చారు.

## 15. పిదపఁ బుత్ర యుగ్మముఁ గాంచున్.

**పరిచయం:** కంకటి పాపరాజు రచించిన 'శ్రీ మదుత్తర రామాయణం' షష్ఠాశ్వాసంలోని 'సీతా పరిత్యాగం' అనే పాఠ్యభాగం నుండి ఈ వాక్యం గ్రహింపబడింది.

**సందర్భం:** దశరథుడు దుర్వాసుడితో తన పుత్రుల, ప్రజల క్షేమం గురించి అడుగగా దుర్వాసుడు భవిష్యత్తులో జరుగబోయేది చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** నీ పెద్ద కుమారుడు ఈ భూమిని పదకొండువేల సంవత్సరాలు పరిపాలిస్తాడు. మునులు మెచ్చే విధంగా అనేక యజ్ఞాలు చేస్తాడు. ఆ తరువాత ఇద్దరు కుమారులను కంటాడు. వారిలో పెద్దవాడు అయోధ్యకు రాజై పరిపాలన చేస్తాడు. ఆ తరువాత చివరకు బ్రహ్మలోకానికి వెళతాడు.

## 16. భూవర రాముఁ డొందు దత్ఫల మింకన్.

**పరిచయం:** కంకటి పాపరాజు రచించిన 'శ్రీ మదుత్తర రామాయణం' షష్ఠాశ్వాసంలోని 'సీతా పరిత్యాగం' అనే పాఠ్యభాగం నుండి ఈ వాక్యం గ్రహింపబడింది.

**సందర్భం:** భృగువు విష్ణుమూర్తికిచ్చిన శాపం గురించి దుర్వాసుడు దశరథుడికి చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** శ్రీహరి దేవతలకిచ్చిన అభయం కారణంగా రాక్షసులను రక్షిస్తున్న భృగుపత్నిని చక్రాయుద్ధంతో సంహరించగా కోపించిన భృగువు నిన్ను అందరూ దేవుడని స్తుతిస్తుంటే ఇంత క్రూరంగా స్త్రీ వధ ఎలా చేశావు? ఆ హింసాఫలం ఊరకనేపోతుందా? భూలోకంలో మానవుడిగా జన్మించి భార్య వియోగ బాధను అనుభవిస్తావని శపించాడు. ఋషుల బోధలను విన్న భృగువు హరిని కీర్తించాడు. ఆ భృగుడి శాపం కారణంగా శ్రీహరి నీకు కుమారుడయ్యాడు. నీ అదృష్టం గొప్పది కానీ రాముడు ఆ ఫలాన్ని పొందుతాడు.

### 17. నట్టడవులలో మీపట్టంపు దేవిని విడిచి పెట్టివచ్చితి.

**పరిచయం:** కంకటి పాపరాజు రచించిన 'శ్రీ మదుత్తర రామాయణం' షష్ఠాశ్వాసంలోని 'సీతా పరిత్యాగం' అనే పాఠ్యభాగం నుండి ఈ వాక్యం గ్రహింపబడింది.

**సందర్భం:** ఆ సీతాదేవిని అడవిలో వదిలిపెట్టి అంతఃపురానికి వచ్చిన లక్ష్మణుడు ఆ విషయాన్ని రాముడికి ఎలా విన్నవించాలి అనుకొనే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** సీతను వదిలి నగరానికి వచ్చిన లక్ష్మణుడు పురజనులు అనేక విధాలుగా అనుకుంటున్న మాటలు విని రథం దిగి సుమంత్రుడిని ఇంటికి పంపి భయంకరమైన అడవులలో మీ పట్టపు రాణిని విడిచిపెట్టి వచ్చాననే కఠినమైన మాట ధైర్యంగా ఎలా రాజును చేరి విన్నవించగలను. దీనత్వంతో నిండిన రాముడి ముఖం ఎలా చూడగలను.

### 18. ప్రాణేశ్వరినిఁ బాసి ప్రాణంబు నీక మేన నిలుచునె.

**పరిచయం:** కంకటి పాపరాజు రచించిన 'శ్రీ మదుత్తర రామాయణం' షష్ఠాశ్వాసంలోని 'సీతా పరిత్యాగం' అనే పాఠ్యభాగం నుండి ఈ వాక్యం గ్రహింపబడింది.

**సందర్భం:** సీతను పరిత్యజించిన రాముడు సీతా వియోగ జనిత దుఃఖాన్ని అనుభవించే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** ఒంటరిగా ఉన్న రాముడు పూర్వం సీత పల్కిన ప్రేమతో కూడిన మాటలు తల్చుకొని తల్చుకొని దుఃఖిస్తూ ప్రజల అబద్ధపు అపనిందను స్వీకరించి ఎంత సాహసంతో వెంటనే లక్ష్మణుడికి ఈ విషయం తెలిపాను. నా భార్య ఏమయిందో అని దుఃఖిస్తూ ప్రాణేశ్వరిని విడిచి ఇంక ఈ శరీరంలో ప్రాణాలు ఎలా నిలుస్తాయా అని భయపడి, ఇంక ఏ సుఖాలైనా ఎందుకని కళ్ళల్లో కన్నీరు నింపుతూ పాన్పుపై ఒరిగాడు.

### 19. రఘువీరుఁ డతని మస్తమఁుశుల ముంచెన్.

**పరిచయం:** కంకటి పాపరాజు రచించిన 'శ్రీ మదుత్తర రామాయణం' షష్ఠాశ్వాసంలోని 'సీతా పరిత్యాగం' అనే పాఠ్యభాగం నుండి ఈ వాక్యం గ్రహింపబడింది.

**సందర్భం:** దుఃఖంతో ఉన్న రాముడి దగ్గరకు లక్ష్మణుడు వచ్చిన సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** పాన్పుపై పడుకొని విలపిస్తున్న రాముడిని చూచి లక్ష్మణుడు ఆర్తితో అన్న దగ్గరకు వచ్చి అతడి పాదాలపై పడి తన కన్నీరు ఏరులై పారగా దుఃఖిస్తుండగా అది చూచి ధైర్యం సడలగా రాముడు దుఃఖిస్తూ లక్ష్మణుడి తలను కన్నీటితో నింపాడు.

## 20. చిన్మయ మూర్తివి నీ వెఱుంగవే.

**పరిచయం:** కంకటి పాపరాజు రచించిన 'శ్రీ మదుత్తర రామాయణం' షష్ఠాశ్వాసంలోని 'సీతా పరిత్యాగం' అనే పాఠ్యభాగం నుండి ఈ వాక్యం గ్రహింపబడింది.

**సందర్భం:** సీతా వియోగంతో దుఃఖిస్తున్న రాముడిని ఓదారుస్తూ లక్ష్మణుడు రాజు కర్తవ్యాన్ని గుర్తుచేసే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** విధివిధానం శరీరం ధరించిన వారికి దాటటం కష్టం. ఎప్పుడూ సుఖం ఉంటుందా దుఃఖిస్తే వచ్చే ఆపదలు పోతాయా ? పుట్టడం, చావటం, పొందటం, పోగొట్టుకోవడటం జీవుల స్వభావాలు, చిన్మయ మూర్తివైన నీకు ఇవి తెలియనివా? నీలాంటి మహాత్ములకు బాధపడటం సరికాదు. పరమాత్మవు నువ్వు నీకు నేను ఉపదేశించగలనా ?

**డా॥ ఇరపని మాధవి**
తెలుగు & ప్రాచ్య భాషా విభాగం,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,
నాగార్జున నగర్.

## పాఠం - 16

# సీతాపరిత్యాగం

**- కంకంటి పాపరాజు**

## ప్రశ్నలు & సమాధానాలు

### 1. 'సీతా పరిత్యాగం' పాఠ్యభాగ సారాంశాన్ని రాయండి ?

జ. రామరాజ్యంలోని ప్రజలు కొందరు చెడ్డవారు గుమిగూడి రాక్షసుడైన రావణుడు లంకలో ఉంచుకున్న భార్య సీతని తెచ్చుకొని ఆమె మీద మోహంతో రాముడు ఏలుకుంటున్నాడని అనుకుంటున్నారని చారుడైన భద్రుడు రాముడికి తెలియజేశాడు. ఆ మాటలకు రాముడు బాధపడుతూ తన సోదరులను పిలిచి ప్రజలు అంటున్న మాటలు తనను బాధిస్తున్నాయని, ఆ అపకీర్తి తొలగించుకోవటానికి మిమ్మలినైనా వదులుకుంటాను. జానకిని విడిచిపెట్టడం ఎంత అని చెబుతాడు. లక్ష్మణుడితో సీతకు గంగాతీరంలోని తపోవనాలు చూడాలనే కోరిక కలిగింది, ఆ మిషతో ఆమెను అక్కడవదలి రమ్మని అంటాడు. లక్ష్మణుడు అన్న ఆజ్ఞననుసరించి సీతాదేవిని తీసుకువెళ్ళడం కోసం సుమంత్రుడి రథం ఏర్పాటుచేస్తాడు. విషయం తెలియని సీతాదేవి తపోవనంలోని మునిపత్నుల కివ్వటం కోసం పట్టువస్త్రాలు, ఆభరణాలు తీసుకొని ఎంతో సంతోషంగా మరిదితో పాటు రథం ఎక్కుతుంది. రథాన్ని సుమంత్రుడు నడుపగా బయలుదేరిన దగ్గర నుండి సీతాదేవికి దారిలో అనేక అపశకునాలు విడువక కనిపించాయి. దానికి తోడు లక్ష్మణుడు దిగులుగా ఉండటం గమనించింది. 'నా భర్తను వదిలి మునిపత్నులను చూస్తానని నేనెందుకు కోరుకున్నాను. రాముడు నన్నెందుకు పంపాడు, అడవులు చూడాలనే విపరీతమైన కోరిక కోరుకున్న నాకు నా దుర్దశను తెలిపే శకునాలు కనిపిస్తున్నాయనిపిస్తుంది. ఈ అపశకునాలు వల్ల కలిగే చెడు ఫలితాలు తన భర్తను, మరుదులను, బంధువులను, ప్రజలను ఏమీ చేయకుండా భగవంతుడు రక్షించాలని ప్రార్థిస్తుంది సీతాదేవి. అంత మంచిదైనా సీతాదేవికి ఈ కష్టమేంటి అని లక్ష్మణుడు నిట్టూర్చాడు. లక్ష్మణుడి ఆవేదన చూస్తున్న సీతాదేవి నాయనా, నువ్వెందుకిలా దిగులు చెందుతున్నావు? అందరికీ శుభమే కదా! అరణ్యవాసం చేసేటప్పుడు, యుద్ధం చేసేటప్పుడు చివరికి రావణాసురుడి శక్తి నీ రొమ్ములో దిగినప్పుడు నీ కంట కన్నీరు రాలేదు. ఇప్పుడెందుకు దుఃఖిస్తున్నావు? బాధలు, రోగాలు పోగొట్టే గంగానదిని చేరి కూడా ఈ ఆవేదనెందుకు ? మునిపత్నులకు కానుకలిచ్చి ఆశీస్సులందుకొని వెంటనే తిరిగివద్దాం, లేకపోతే వెంటనే తిరిగి వెనక్కి వెళ్ళిపోదామా అంటుంది. సీతాదేవిని దీనంగా చూస్తూ లక్ష్మణుడు అపశకునాలే నాకూ బాధ కలిగించాయని అంటాడు. రథం దిగి ఓడనెక్కి నది దాటిని తర్వాత ఇంక చెప్పక తప్పదని లక్ష్మణుడు అమ్మా! ఈ హృదయ గాయం మాననిది, శోకమనే అగ్నిలో కాలటం కంటే మరణమే మేలుకదా, నిందార్హమైన పని చేస్తున్నాను, నన్ను శపించు అని సీతాదేవి పాదాలపైబడి దుఃఖించాడు.

సీతాదేవి, 'నాయనా!' మీ అన్న అన్ని కష్టాలు పడినప్పుడు గానీ, ఇంతకుముందు ఎప్పుడూ నువ్వింత బాధపడలేదు. నువ్వు నిందార్హమైన పని చేయటమేమిటి ?, పరుల భార్యలను తల్లులుగా, పరాయి ధనాన్ని హాలాహలంగా భావిస్తావు.

ఎప్పుడూ అబద్ధం చెప్పవు, ఎవరినీ కఠినంగా మాట్లాడవు, బ్రాహ్మణ భక్తి, రామసేవ వదలవు. నీ అన్న నిన్ను విడిచాడా, నీకు అన్నపై భక్తి తగ్గిందా? గురునింద చేశావా, కన్నతల్లిని కష్టపెట్టావా? రాముడి ఆజ్ఞ లేకుండా నన్నిక్కడకు తెచ్చావా? నా మీద రాముడి మనసు తొలగిపోయిందా, నాకు తెలుపు 'అని అడిగింది. ఇంకా భయపడుతూ రాముడు క్షేమంగానే ఉన్నాడు కదా, దయలేనివాడై రాముడు నిన్ను గానీ, నన్ను గానీ విడిచాడా, చెప్పు అంది. తెలియజేయకుండా వెళ్ళరాదని లక్ష్మణుడు బాధపడుతూ తల్లీ! ఇంతపనికి పూనుకొని వచ్చి నీకు చెప్పకుండా ఉంటానా, చెడ్డవారు కొందరు రాక్షసుడి చేతిలో పడిన భార్యను తిరిగి రాముడు ఏటుకుంటున్నాడని, రాముడెంత మోహి అని నిందించగా అది విని రాజు నిన్ను అడవులలో వదిలి రమ్మనాడు' అని చెప్పాడు. మునులు దయామయులు. ఇంక నువ్వు వారిని ఆశ్రయించి నీ రోజులు గడుపు. భయంకరమైన అడవులలో నిన్ను దింపిరమ్మని రాముడు నన్ను పంపటం అంతా విధికృతం. నీ పవిత్రత, వినయం, సద్గుణాలు రాముడికి తెలుసుండి కూడా నిందకు భయపడి నీవు కోరిక వరం నెపంగా ఇక్కడికి పంపాడు. నిన్ను విడిచి నేనెలా వెళ్ళగలను, నేను కఠినాత్ముడినని రాజు నన్ను ఈ పనికి పంపాడేమో! ఇంక నీకు ఈ మృగాలే స్నేహితులు. ఇల్లాళ్ళలందరిలో గొప్పదానివైన నీవు నీ భర్త పాదాలనే హృదయంలో నిలుపుకొని ఉండవమ్మా అని చెప్పటానికి నేనెవరిని, నిన్ను ఒంటరిని చేసిన పాపాత్ముడిని అని చెప్పాడు.

అది విన్న సీతాదేవి నిశ్చేష్టురాలై నేలపై పడిపోయింది. కొంతసేపటికి తెలివొంది కన్నీరు కారుస్తూ, నిట్టూరుస్తూ వణుకుతూ, ధైర్యం కోల్పోయి దుఃఖిస్తూ, నవ్వుకుంటూ, తల ఊపుతూ, ముక్కుపై వేలుంచుకుంటూ ఇలా పరిపరివిధాల బాధపడుతూ, జాలిగా లక్ష్మణుడితో 'లక్ష్మణా! నువ్వు బాధపడకు, రాముడి ఆజ్ఞ జవదాటకూడదు కదా, భూమి మీద బాధలు పడటానికే నేను సృష్టించబడింది, దానిని అనుభవించకుండా ఎవరు ఆపగలరు, పూర్వజన్మలో ఏ దంపతులను విడదీసి ఆనందించానో, దాని పాపం ఊరకనే పోదురు కదా. ఆనాడు రాముడి పాదపద్మాల చెంతనే వసించాను. ఇప్పుడు అనాథనయ్యాను. ఈ ప్రాణాలు ఎలా నిలుపకోగలనింక. నేను పతివ్రతనని అందరూ మెచ్చుకుంటున్నారని సంతోషించాను గానీ మధ్యలో ఈ నిందలు పుట్టి రాముడు నన్ను అడవుల పాలు చేస్తాడనుకోలేదు. లక్ష్మణా! ఇంక ఏనాటికైనా నేను రాముడిని చూస్తానా, రాముడికి చెప్పు నా శరీరముంది, ప్రక్కనే గంగానది ఉంది, చివరకు ఎలా అయితే అలా అవుతుందని. అప్పుడు రాముడు లేకుండానే అశోకవనంలో చాలా రోజులు బ్రతికింది కదా, ఇప్పుడు అలాగే బ్రతుకుతుంది అని అనుకున్నాడేమో, అప్పుడు రాముడు వచ్చి రావణుడిని చంపి మళ్ళీ నన్ను ఏలుకుంటాడనే ఆశతో బ్రతికాను, ఈ రోజు ఇంక ఏ ఆశతో బ్రతకగలను. ఎవరో తెలియని మూర్ఖులు అనిన మాటలకు నన్ను అడవికి పంపవచ్చు గాక, కానీ ఆ మాట నాకు చెప్పి పంపవచ్చు కదా. భూమి నుండి అయోనిజగాబుట్టి, మిథిలలో జనకుని ఇంటిలో పెరిగిన విధం, అనసూయ వంటి సతీమణులు నన్ను మెచ్చినది వినలేదో, ఆ లంకలో మూడు లోకాలు నన్ను స్తుతించే విధంగా అగ్నిలో నేను ప్రవేశించటం వినలేదా, ఈ సీత నిర్దోషి ఏలుకొమ్మని రాముడికి బ్రహ్మాదులు చెప్పినది వినలేదో, విని చూసి కూడా ప్రజలు నన్ను నిందిస్తే అంతమాత్రానికే రాజు ఇలా తెగించి నన్ను వదలటం నా దురదృష్టమే కానీ ఇంక వేరే మాటలెందుకు. అడవికి ఒంటరిగా భర్తను వదిలి ఎందుకు వచ్చావంటే మునిపత్నులకు నేనేమని వివరించగలను. ఈ ఆపదను ఎలా దాటగలను. ఈ కాలాన్ని ఎలా గడపగలను' అని ఆవేదన చెందింది సీత. ఇంకా అందరికీ చివరిసారి నమస్కరించానని చెప్పమంది. రాముడి ఆజ్ఞను అనుసరించే జీవిస్తానని, తన రూపాన్ని మరువనని తన మీద నమ్మకముంచమని చెప్పమంది.

నన్ను మరిచిపోవద్దంటూ లక్ష్మణుడిని సాగనంపింది. ఆమెను విడువలేక విడువలేక లక్ష్మణుడు ఆమెకు మ్రొక్కి రోదిస్తూ వెళ్ళాడు. మళ్ళీ తిరిగి వెనక్కు వస్తాడేమోనని రథం వెళ్ళిన వైపే చూస్తూ ఉండిపోయింది. రాముడిని తల్చుకుంటూ, తామిద్దరూ ఏకాంతంగా ఉన్నప్పుడు తనతో అతను ముచ్చట్లాడటాన్ని, అతడు చేసే చేష్టలన్నీ తల్చుకుంటూ దుఃఖిస్తుంది, అపనిందను తెలుపకుండానే తనను అడవులకు పంపి తనను మోసంచేశాడనుకుంటుంది.

అక్కడకు పండ్ల కోసం వచ్చిన మునిబాలకులు దీనావస్థతో ఉన్న సీతాదేవిని చూసి వెంటనే వాల్మీకి మహర్షి దగ్గరకెళ్ళి ఆమె గురించి తెలియజేసి ఎవరామె అని అడుగగా తన దివ్యదృష్టితో అంతా తెలుసుకున్న మహర్షి ఆమె రాముడి భార్య సీతాదేవని చెబుతాడు. వెంటనే అర్ఘ్యపాత్ర తీసుకొని ఆమె దగ్గరకు మునికుమారులతో కలిసి వెళతాడు. సీతాదేవిని వాల్మీకి మహర్షి ఓదారుస్తూ నీ సద్గుణాలు నీ భర్తకు తెలిసి కూడా అపనిందకు ధైర్యం సడలి ఈవిధంగా చేశాడు. నేనిదంతా నా దివ్యదృష్టితో తెలుసుకున్నాను. నన్ను నీ తండ్రి జనకుడి లాగానే భావించు. నీవు దుఃఖించవద్దిక. ఈ ఆశ్రమం నీదే. ఇక్కడి తపస్వినులు నీకు ఉపచారాలు చేస్తారు. భర్త ఆజ్ఞననుసరించి చరించు, ఇదిగో అర్ఘ్యం స్వీకరించు, జలం తీసుకో, ముఖం కడుక్కో అని అర్ఘ్యం ఇచ్చాడు. తన ఆశ్రమానికి ఎంతో ఆదరంతో సీతాదేవిని తీసుకువెళ్ళి తాపసపత్నులకు జరిగిన యదార్థ విషయాలు తెలిపి ఆమెకు తగినరీతిగా సేవలు చేయమంటాడు. వారు ఎంతో ఆదరంతో ఆమెను ఉపచరిస్తుండగా సీతాదేవి కొంతకాలానికి ఊరడిల్లింది. ఎంతో సుఖంగా అంతఃపురంలో జీవించే సీతాదేవి ఆ పర్ణకుటీరంలోనే వసించింది.

లక్ష్మణుడు వెళుతూ సుమంత్రుడితో తన అన్నకు, వదినకు వచ్చిన కష్టం తెలిసి ఎంతో బాధపడుతుంటే అది చూసిన సుమంత్రుడు తనకు మాత్రమే తెలిసిన యదార్థాన్ని లక్ష్మణుడికి దుఃఖ శాంతి కోసం తెలియజేస్తాడు. దశరథుడు వశిష్ఠుడి ఆశ్రమానికి యజ్ఞం చూడటానికి వెళ్ళినప్పుడు అక్కడే దుర్వాసమహర్షి ఉన్నాడని, ఆ ఋషులిద్దరికీ ఎంతో భక్తితో దశరథుడు నమస్కరించగా వారు రాజుకి అతిథి సత్కారాలు చేశారని, వారు ముగ్గురూ మాట్లాడుకునే సందర్భంలో దశరథుడు తన పుత్రుల భవితవ్యాన్ని, వంశ చరిత్రను గురించి దుర్వాసుడిని అడుగగా రాముడు పదకొండు వేల సంవత్సరాలు రాజ్యపాలన చేస్తాడని, అతడికి ఇద్దరు పుత్రులు కలుగుతారని, వారిలో పెద్దవాడు రాజ్యానికి రాజవుతాడని చాలా సంవత్సరాలకి రాముడు ముందు తమ్ముళ్ళను పంపి తర్వాత తాను బ్రహ్మ లోకానికి చేరతాడని చెబుతాడు. అయితే భృగు మహర్షి శాపం కారణంగా శ్రీహరి ఇప్పుడు రాముడిగా జన్మించాడని, ఆ శాప కారణంగా భార్యా వియోగం పొందుతాడని చెప్పగా విన్నాను అని సుమంత్రుడు లక్ష్మణుడితో చెబుతాడు. దాని కోసం దుఃఖించవలసిన పని లేదని సుమంత్రుడు చెప్పగా లక్ష్మణుడు కొంత ఊరడిల్లుతాడు. తర్వాతి రోజు అంతఃపురానికి చేరిన లక్ష్మణుడు రాముడి దగ్గరకు వెళ్ళి సీతను ఎడబాసి ఎంతగానో దుఃఖిస్తున్న రాముడిని ఓదార్చి రాజు కర్తవ్యాన్ని గుర్తుచేస్తాడు. అన్నీ తెలిసిన మీలాంటి మహాత్ములు ఇలా దుఃఖించటం సరికాదు, రాజ్యపాలన మరిచి రాజు భార్య కోసం దుఃఖిస్తున్నాడని ప్రజలు నిందించరా అని అంటాడు. రాముడు తమ్ముడి మాటలతో కొంత సేదతీరి 'భూజన సంరక్షణ చేస్తూ మంచి పౌరులను రక్షిస్తూ, చెడ్డవారిని దండిస్తూ ప్రజలు తెలిపే విన్నపాలను ఆలకిస్తూ పాలన చేసే రాజు కీర్తిపొందుతాడని' లక్ష్మణుడికి తెలియజేస్తాడు.

**2. కంకంటి పాపరాజు పాత్రలను తీర్చిదిద్దిన విధానాన్ని 'సీతాపరిత్యాగం' పాఠ్యభాగం ఆధారంగా విశ్లేషించండి?**

జ. కంకంటి పాపరాజు వాల్మీకి ఉత్తర రామాయణంలోని కథను తీసుకొని తన కాలానికి తగిన ప్రబంధ రీతి ననుసరించి సందర్భోచితమైన వర్ణనలను, సంభాషణలను జోడించి శ్రీ మదుత్తర రామాయణాన్ని రచించాడు. ఇహపర సాధకమైన రాముడి కథను రాయాలని సంకల్పించగా స్వప్నంలో తనకు దర్శనమిచ్చిన మదనగోపాలుడు

"అమ్మహనీయ కీర్తి కరుణాన్వితుఁడై యను వత్స నీ ప్రబం
ధమ్ము మదంకితంబుగ నొనర్పు కృతార్థుఁ డవయ్యెదింతె కా
దిమ్మహి వస్తు వాహన సమృద్ధ రమారమణీయ భోగభా
గ్యమ్ములుఁ గల్గెడుం గృతియు నారవితారకమై ప్రకాశిలున్"

అని ఆనతిచ్చాడని పాపరాజు తెలియజేశాడు. షష్ఠాశ్వాసంలోని సీతాపరిత్యాగ ఘట్టాన్ని పాపరాజు కరుణ -రసాత్మకంగా తీర్చిదిద్దారు. కరుణ రసాన్ని పండించటానికి తగిన విధంగా సంభాషణలను, సన్నివేశాలను కూర్చారు. ఈ ఘట్టంలోని పాత్రలను కరుణా స్వరూపులుగా తీర్చిదిద్దారు. 'సీతాపరిత్యాగం' అనే పాఠ్యభాగంలో మనకు కనిపించే ప్రధాన పాత్రలు సీతాదేవి, లక్ష్మణుడు, రాముడు, సుమంత్రుడు, వాల్మీకి మహర్షి, వీరుకాక దశరథుడు, దుర్వాసుడు, వశిష్ఠుడు, భృగుమహర్షి పాత్రలు కనిపిస్తాయి. మునిబాలకులు, మునిపత్నులు కనిపిస్తారు.

**సీతాదేవి:** సీతాదేవి జనకుడి కూతురు, దశరథుని కోడలు, రాముడి భార్యగా అనేక సందర్భాలలో పరిచయం చేయబడినప్పటికీ తనదైన వ్యక్తిత్వం, ఆత్మాభిమానం కలిగినదానిగా కనిపిస్తుంది.

"జనకుడు తండ్రి సద్గుణవిశాలుఁడు పంక్తిరథుండు మామ దు
ర్జన భుజ గర్వ వైభవి రాముఁడు భర్త నీకు" .... అని సీతతో,
" రాజకులాభిరాముఁ డగు రాముని దేవి విదేహధారుణీ
రాజకుమారి పంక్తి రథరాజబిడౌజుని పెద్దకోడలీ..." అని మునిపత్నులతో వాల్మీకి మహర్షి వచిస్తాడు.

సీతాదేవి ఆత్మాభిమానం ఆమె ప్రతి మాటలో కనిపిస్తుంది. భూమి నుండి అయోనిజగా పుట్టాను, జనకుని ఇంటిలో పెరిగాను, అనసూయ వంటి సాధ్వీమణుల మెప్పు పొందాను అంటుంది. రాముడు తనను విడనాడాడని తెలిసి తన మీద అంత మాత్రం నమ్మకం లేదా అని ఆవేదన చెంది రాముడి రూపాన్ని మరువనని, తనపై నమ్మకముంచమని చెబుతుంది. అంతగా బ్రతకటం కష్టమైతే ప్రక్కన గంగానది ఉంది అంటుంది. పెద్దల పట్ల భక్తి ప్రపత్తులు కలిగినది.

సీతాదేవి పెద్దలంటే భక్తి గౌరవాలు కలిగి ఉంటుంది. ముఖ్యంగా మునులు, గురువులంటే ఎంతో భక్తి. ఆ కారణంగానే మునిఆశ్రమాలను చూడాలనే వరం కోరుకుంది. దీనికి కారణం ఆమె నిండు చూలాలు. తన బిడ్డలకు, తనకు మునుల ఆశీస్సులు ఆ సమయంలో అవసరమని భావించి ఉంటుంది. మునిపత్నులపై నున్న ఆదరాభిమానాలతో వారికి అనేక కానుకలు తీసుకెళుతుంది. లక్ష్మణుడు ఆవేదన చెందుతుంటే

"మానసిక వ్యథల్ రుజలు మాన్పఁగ నోపిన పుణ్యరాశిగం
గానదిఁ జేరియుండియును గస్తిపడన్ దగునయ్య వేడ్కతో
నీనది దాఁటి తాపసుల యింతులఁ గన్గొని భూషణావళుల్
కానుకలిచ్చి దీవనలు గైకొని వత్తము రమ్ము చెచ్చెరన్" అంటుంది.

వాల్మీకి మహర్షిని చూడగానే కూడా ఆయన పాదాలపై పడుతుంది. అలాగే అత్తలపట్ల కూడా ఎంతో గౌరవ మర్యాదలు కలిగి ఉంటుంది. అందుకే లక్ష్మణుడితో "అన్న లక్ష్మణ యింక నాలస్య మేటికిఁ జను మయోధ్యా పురంబునకు నీవు ముగ్గురత్తలకు మ్రొక్కితినని తెల్పు మచటి బంధుల నెల్ల నడిగితినను...." అని చెబుతుంది.

ఇది తిక్కన నిర్వచనోత్తర రామాయణంలో ఇంకా బాగా

"అతులిత పుణ్యమూర్తులగు నత్తలకెల్లను నేను భక్తి మ్రొ
క్కితి నెఱిఁగింపు సూర్యకులకేతువు నా విలసిల్లు రాముసం
తతి భరియించి యున్నయది దానికి శోభన మందఁ గచ్చప
స్థితినయినం దలంపు దయ సేయుఁడు మీరని యప్పగింపుమీ" అని

అంటుంది సీత. తాబేలు గుడ్లు ఎక్కడో పెట్టి ఆ గుడ్లనే తలుస్తూ ఉంటుంది. ఆ గుడ్ల నుండి పిల్లలు వస్తాయి. అలాగే ఎక్కడో ఉన్న అత్తలు తన గర్భమందున్న బిడ్డలు మంచి గురించి కోరుకోవాలని సీత ఆకాంక్షిస్తుందిక్కడ. నిర్వచనోత్తర రామాయణంలో ఆమె గర్భవతి అనే విషయం సూచించే విధంగానే తిక్కన ప్రతి సందర్భంలో రాశారు. అది మదుత్తర రామాయణంలో కనిపించదు. మొదట్లోనే రథాన్ని ఆమె అలవకుండా నెమ్మదిగా సుమంత్రుడు నడిపాడని చెప్పటం అలాగే వాల్మీకి మహర్షి

"ఇదె మనయాశ్రయం విచట నీవు వసింపు తపస్వినుల్ ప్రియం
బొదవఁగ నీకు నెల్లపనియుం బరమాదర వృత్తి నాచరిం
చెద రిదె నీ గృహంబునకుఁ జేరితి గావున నీదు గర్భమ
భ్యుదయముఁ బొందు దుర్యశము వోవుఁ బదంబడి నమ్ముమెమ్మెయిన్"

అనటంలో స్త్రీలు సహజంగా పుట్టింటికి కాన్పుకై వెళతారు కదా. అలాగే పుట్టింటికొచ్చావనుకో అనే భావన స్ఫురింపజేయటం తిక్కన రచన.

**పతివ్రతా శిరోమణి:**

భర్తను తప్ప అన్యులను ఆలోచనల్లో కూడా రానీయని గొప్పపతివ్రత సీతాదేవి. ఎల్లప్పుడూ భర్త క్షేమాన్నే కోరుకుంటుంది. అపశకునాలు కనిపిస్తే తనకేదో ఆపద వస్తుందనుకోక రాముడు క్షేమంగా ఉండాలని కోరుకుంటుంది. పదేపదే రాముడి క్షేమం గురించే లక్ష్మణుడిని అడుగుతుంది.

"సౌమిత్రీ భయమయ్యెడిన్ నుడువు మక్ష్మాదేవి జామాత యు
శ్రీమత్పద్మ దళాక్షుఁ డారవికుల క్షీరాబ్ధి పూర్ణేందుఁడా
హేమక్ష్మాధరధీరుఁ డాయసురమత్తేభేంద్ర హర్యక్షుఁడా
శ్యామాంగ ప్రభుఁడా మహాప్రభుడు లెస్సై యున్నవాడే పురిన్"

రాముడు క్షేమంగా ఉండాలని కోరుకుంటుంది. రాముడు తనను త్యజించాడని లక్ష్మణుడు చెప్పినప్పుడు కూడా రాముడిని ఇంక ఈ జన్మలో చూసే భాగ్యంలేదేమో అని భర్త సౌందర్యాన్ని తల్చుకుంటుందిలా.

"ఆకర్ణాయత నేత్రమై మణిమయోద్యత్కుండల ద్వంద్వ శో
భాకీర్ణాంచిత గల్లమై సురదనంబై సుందర భ్రూయుతం
బై కమ్రస్మిత చంద్రికా విలసితంబై యొప్పు శ్రీరాముమో
మీకాయంబునఁ జూచు భాగ్యమిఁక లేదేమో సుమిత్రాత్మజా"

భర్త అడవికి పంపవచ్చు కానీ అది తనకు చెప్పి పంపవచ్చుగా అతడి ఆజ్ఞను తానూ కాదనదుగా అని బాధపడుతుంది. భర్త ఆజ్ఞ శరీరమున్నంత వరకు పాటిస్తాను పోయిరమ్మని తన రూపమే మనసులో నిలుపుకుంటానని తన మీద నమ్మకముంచమని చెబుతుంది. లక్ష్మణుడు విడిచివెళ్ళిన తర్వాత కూడా అపవాదు తనకు చెప్పకుండా రాముడు తనను మోసం చేసి పంపాడనుకుంటుంది. తామిద్దరూ ఏకాంతంగా ఉన్నప్పుడు రాముడు పలికే మాటలను, అతడి చేతలను తల్చుకుని రోదిస్తుంది. రాముడు తప్ప అన్యం ఎరుగని సాధ్వీలలాను సీతాదేవి.

దీనినే తిక్కన నిర్వచనోత్తర రామాయణంలో

"పతియ చుట్టంబుఁ బక్కంబుఁ బతియ చెలియుఁ
బతియ తల్లియుఁ దండ్రియుఁ బతియ గురుఁడు
పతియ దైవంబుఁ గావున నతని పంపొ
నర్చుటయె కాదె ధర్మంబు నాతి కరయ" అని సీత చేత పలికించారు.

**మనోభావాలను తెలుసుకోగలిగిన నేర్పరి:**

సీతాదేవి లక్ష్మణుడి ముఖకవళికలను చూసి అతడు మామూలుగా లేడని గుర్తిస్తుంది. అదే విషయాన్ని పరిపరివిధాలుగా అతడిని అడుగుతుంది. అతడి దీనత్వం చూసి తాను బాధపడుతుంది.

"విన్నఁ దనంబు మించెఁ బురి వెల్వడి నప్పటి నీ మొగం
బున్న తెఱంగుఁ గాంచి దిగులొందుచు నుందు నిదేమొ యంచు.."

అని అడుగుతుంది. అంతేగాక లక్ష్మణుడు ఏ ఏ అంశాలకు కలత చెందుతాడో తెలిసినది. అతడి మనసు బాగా ఎరిగినది కాబట్టి

"మన్నన దొలంగి నిను మీ
యన్న నిరాకరణ చేసి యాడెనొ" అని అడుగుతుంది.

అతడి నుండి సమాధానం రాక ఏమడిగితే సమాధానం చెబుతాడో తెలిసినది. కనుక

"రామాజ్ఞ లేకయే నను
దీమసమున నిందుఁ దోడితెచ్చితొ నాపై
స్వామి మతి యెడసియున్నదొ
యేమిటి కడలెదవు తండ్రీ యెఱిఁగింపఁ గదే" అని అడుగుతుంది.

రాముడి గురించి కూడా రాముడు లేకుండానే అశోకవనంలో అన్ని రోజులున్నానని ఇప్పుడూ అలాగే ఉండగలనను కుంటున్నాడేమో అని అంటుంది.

**సున్నిత మనస్కురాలు:**

తనను ప్రజలు నిందించారని రాముడు ఆ నింద పోగొట్టుకోవడానికి తనను అడవులకు పంపాడని వినగానే ఆమె తట్టుకోలేక భూమిపై పడిపోతుంది. ఎంతగానో దుఃఖిస్తుంది.

"ఏను సాధ్విననుచు నెల్లవారలు నన్ను
సన్నుతింతురనుచు సంతసింతుఁ
గాని నడుమ నిట్టికట్టిక నిందలు పుట్టి
యడవిఁ ద్రోచు రాముఁ డనుచు నెఱుఁగ" అని వాపోతుంది.

అడవిలో అనాథనై ఎలా ప్రాణం నిలుపుకోగలను రాముడు లేక అని బాధపడుతుంది.

లోకరీతి ఎరిగినది కనుక మునిపత్నులు ఒంటరిగా ఎందుకు వచ్చావంటే ఏమి చెప్పగలనని రోదిస్తుంది.

**సంభాషణా చాతుర్యం కలది:**

ఎంత అబలగా సీతాదేవి కనిపిస్తుందో అంత స్థిరమతి కూడా. ఒక ప్రక్క దుఃఖపడుతూనే రాముడికి తెలుపమని తన ఆవేదననే కాక రాముడిని ప్రశ్నిస్తుందా అనే విధంగా మాట్లాడుతుంది.

"అవని నయోనిజనయి పుట్టి మిథిలేంద్రుపీట నేఁ బెరిఁగిన విధము వినరొ
యఁగ రాగము లిచ్చి యనసూయ మొదలైన సతులెంచుకొన్నది చాల వినరొ
యా లంకలోఁ దొల్గి త్రైలోక్యము నుతింప వహ్నినేఁ జొచ్చిన వార్త వినరొ
యీ సీత నిర్దోషి యేలుకొమ్మని రాము బ్రహ్మాదులపుడన్న పలుకు వినరొ"
వినియుగనియుఁ బ్రజలు నననిందసేసిన
యంతమాత్రమునకె యదిపుఁ డులికి
యింత తెగువ సేయ నిచ్చగించుట నాయ
భాగ్యమింతె యొకరిఁ బల్కనేల".

తన పాతివ్రత్యం గురించి ఒకవేళ ప్రజలకు తెలియకపోయినా రాముడికి తెలుసు కదా, తెలిసి ఎలా పంపాడు అనే ఆవేదన కనిపిస్తుంది, అదంతా తన దురదృష్టం అనుకునే బేలతనం కనిపిస్తుంది. అన్నీ చెప్పి రాముడిని తప్పుపట్టినట్లుగా కాక అది తన దురదృష్టం వల్లే, పూర్వజన్మల్లో చేసిన పాపం వల్లే అని అనుకోవటం ఆమె ఔన్నత్యాన్ని, ఎదుటివారు తనను తప్పుపట్టని విధంగా మాట్లాడగలిగే నేర్పరితనాన్ని సూచిస్తుంది.

**సహనశీలి:** సహనానికి మారుపేరైన భూదేవి తనయ కనుక అదే సహనం తానూ కలిగి ఉంది సీతాదేవి. ఎంతో సుఖవంతమైన జీవితాన్ని గడిపే సీతాదేవి మునిఆశ్రమంలో సాధారణ జీవితం గడపగలిగిన సహనశీలి. రాముడిని నిందించకుండా అతడి అజ్ఞానం పాలించిన సహనశీలి. బంగారు చీరలు ధరించే ఆమె నార చీరలు కట్టింది. రుచికరమైన భోజనాలు చేసే ఆమె కందమూలాలు ఆరగించింది. చంద్రశాలలలో నివసించే ఆమె పర్ణశాలలో ఉంది.

"గనుసన్నల శుద్ధాంతకాంత లాచ
రించు సేవలు మెచ్చని కాంచనాంగి
యొగ్గె మునిముగ్ధ కాంతాకృతోపచార
విధికి నెంచ నసాధ్యంబు విధికిఁ గలదె"

**ఇతరుల సద్గుణాలు గుర్తించగల నైపుణ్యం కలది:**

లక్ష్మణుడి స్వభావం పూర్తిగా తెలిసినది. అతడి గొప్పగుణాలను గుర్తించి

"పరసతులెల్లఁ దల్లులుగ భావనసేయుదు వెల్లవేళలన్
బరధనమన్న హాలహాలభంగిగఁ జూతువు బొంకవెన్నడున్
బరుషము లాడవెవ్వరిని బ్రాహ్మణ భక్తియు రామసేవయున్
దిరమగు నీకుఁ దండ్రి జననిందితకృత్యములెవ్వియియ్యెడన్".

అని అడుగుతుంది.

**జగన్మాత:**

సీతాదేవి లోకానికంతా తల్లిలా అందరి క్షేమాన్ని కాంక్షిస్తుంది. రాణిగానే కాక తల్లిలా ప్రతి సందర్భంలోనూ ప్రజల క్షేమాన్ని కోరుకుంటుంది.

తన భర్త, మరుదులు, బంధువుల క్షేమమే కాక పౌరుల క్షేమాన్ని గురించి "తక్కిన బాంధవ పౌరకోటికిన వివిధ శుభంబు లీవలయు వేల్పులటించు....." అని కోరుకుంటుంది. "భూజనుల బాంధవుల లెస్సప్రోవుమనుము" అని రాముడికి చెప్పమని లక్ష్మణుడికి చెబుతుంది.

అనేక సద్గుణాలు కలిగినది సీతాదేవి గంగానదిని చూసి చిన్న పిల్లలా సంతోషపడటం, అపశకునాలను, లక్ష్మణుడి తీరును చూసి ఆందోళనచెందటం, కారణం తెలుసుకోవటానికి లక్ష్మణుడిని అనేక రకాలుగా ప్రశ్నించటం, కారణం తెలిసి బాధపడటం, మానసికంగా, శారీరకంగా దిగులుతో, దుఃఖంతో క్రుంగటం, రాజాజ్ఞ పాటిస్తానంటూనే రాముడు చేసింది అన్యాయమే కదా అనే విధంగా మాట్లాడటం, భవిష్యత్తును తల్చుకొని కలత చెందటం, వాల్మీకి ఆశ్రయమివ్వటంతో

కొంత ఊరట చెందటం వంటి ఘట్టాలను మూలంలో వాల్మీకి రచించిన దానికి ఇంకొంత జోడించి రచించి కంకంటి పాపరాజు సీతాదేవి పాత్రను కరుణ రసాత్మకంగా చిత్రించారు. మూలంలో లేని సీతాదేవి రాముడి శృంగారచేష్టలను తల్చుకోవటం వంటివాటిని ప్రబంధరీతి ననుసరించి కల్పించి రాశారు. మొత్తం మీద సీతలేకపోతే అయోధ్యాపురి ఎలా వెలవెలబోతుందో కవి "రాయంచలేని కొలంకువలె రత్నంబులేని పెట్టియవలెఁ బద్మంబు లేని కొలను వలె, జంద్రకళలేని గగనంబువలె సరస్వతి లేని ముఖంబువలె రామభక్తి లేని చిత్తంబువలె నుపకృతి లేని సంపదవలెఁ గీర్తిలేని బ్రతుకువలె వార్తలేని కవిత్వంబు వలెఁ గాంతిలేని యుద్దంబు వలె శాంతిలేని తపంబువలె శాఖలేని చెట్టువలె, రేఖలేని బొందివలె సకలవైభవంబులు గలిగియు జనకనందన లేనందునఁ జెన్ను దఱిఁగి వన్నెై యున్నయగ్నగరు..." అని చెప్పటం ద్వారానే సీత ప్రాధాన్యతను, ఔన్నత్యాన్ని నిరూపించారు. అంతేగాక సామాజికులకు "ఇంటికి దీపం ఇల్లాలు" అనే సందేశమిచ్చా -రనిపిస్తుంది.

**లక్ష్మణుడు:**

'సీతాపరిత్యాగం' లో సీత పాత్ర తర్వాతి ముఖ్యపాత్ర లక్ష్మణుడు. లక్ష్మణుడు రాముడికి సోదరుడు. అన్న ఆజ్ఞ జవదాటనివాడు. సీతను అడవులకు పంపటం అన్యాయమని ఎరిగినా అన్న మాట దిక్కరించలేక విధి తనకు ఎటువంటి పరిస్థితి తెచ్చిందా అని ఆవేదన చెందుతాడు. లక్ష్మణుడి సుగుణాలని సీతాదేవి 'పరస్త్రీలను తల్లులుగా భావించేవాడని, పరాయి ధనాన్ని హాలాహలంగా చూస్తాడని, అబద్ధమాడటం ఎరుగనివాడని, పెద్దల పట్ల, గురువుల పట్ల గౌరవం కలవాడని, ఎవరిని కఠినంగా మాట్లాడడని, రామసేవ వదలనివాడని చెబుతుంది. ఆమె చెప్పని లక్ష్మణుడి ఇంకో సుగుణం సీతాదేవి పట్ల గల అచంచలమైన భక్తి, నమ్మకం. ప్రతి సందర్భంలోనూ లక్ష్మణుడిలో ఈ లక్షణం కనిపిస్తుందీ పాఠ్యభాగంలో. సీతాదేవి గొప్పతనాన్ని ఎరిగినవాడు కనుకనే ఆమె మంచితనానికి, అందరి క్షేమం కోరుకునే ఆమె ఔన్నత్యాన్ని చూస్తూ భయపడతాడు.

"ఆయమచిత్తశుద్ధికి నయంబునకున్ నెఱఁగంది లక్ష్మణుం
డీ యఖిలైక మాత పతినెప్పుడుఁ గూడి సుఖించునట్లుగాఁ
జేయక పాయఁజేసే విధి చేష్టగదా యని నిందసేయునే
మో యనఁబోవు మాను వగ నుస్సురనున్ దలవంచు నయ్యెడన్".

అన్నావదినల ఎడబాటే లక్ష్మణుడికి ఎక్కువ దుఃఖ కారకమైంది. అందుకే అంతకముందు ఎన్నడూ పొందనంత దుఃఖాన్ని పొందుతాడు. అడవులలో దింపేవరకు కారణం చెప్పకూడదు. కనుక సీత ఎంతగా తనను అడిగినా కారణం చెప్పడు. అన్న ఆజ్ఞను అంతగా శిరసావహిస్తాడు.

రాముడిని చూడకుండా ఒక్క గడియ కూడా ఉండలేని లక్ష్మణుడు రాముడిని విడిచి వచ్చినందుకు బాధపడుతు న్నాడేమో ఒకవేళ అని సీతాదేవి తిరిగి వెళ్ళిపోదామా అంటే

"కన్నులనీరు గ్రుక్కుకొని గ్రక్కున లక్ష్మణదేవుఁ డన్నము
న్నన్నది నెమ్మదిం దలఁచి యార్తి యొకించుక డించి తల్లిరో
నిన్నటి దుర్నిమిత్తములె నెవ్వఁగ గూర్చె నయోధ్య కేల మీ
రెన్నిన లీల నవ్వలికి నేఁగుద మంచు వచించి ధీరతన్" అని

సమాధానం చెబుతాడు. సీత గట్టిగా పట్టుబట్టి వెనక్కి వెళదామంటే అన్న ఆజ్ఞ నెరవేర్చలేడు కనుక అపశకునాల కారణంగానే బాధపడుతున్నానని చెబుతాడు. తీరం దాటి వనం చేరిన తర్వాత చెప్పక తప్పదని ఎంతో కష్టంగా, బాధగా అసలు విషయం చెబుతాడు. ఆ విషయం చెప్పటానికి కూడా ఉపోద్ఘాతంగాను, తనకు ఆ విషయం ఎంత దుఃఖం కలిగిస్తుందో తెలియజేసేలా లక్ష్మణుడి స్థితిని

"జనకజ మోము దీనత యెసంగఁ గనుంగొని యూరెలుంగుతో
జననిరొ పాయదీ హృదయశల్యము శోక దవాగ్ని గ్రాగుకం
టెను మరణంబు మేలు జననిందిత కృత్యముఁ బూని వచ్చితిన్
నను శపియించు మంచుఁ జరణంబుల చెంగట వ్రాలి యేడ్వగన్".

అని చూపారు.

రాముడికే తనపై అపనమ్మకమంటే సీత ఎంతగా వేదన చెందుతుందో తెలిసినవాడు కనుక లక్ష్మణుడు ఆమె మనసుకి కొంచెం ఊరట కలిగించే విధంగా

"నీ విమల ప్రభావమును నీ వినయాదిక సద్గుణంబులున్
దేవు డెఱింగి యుండియును నిందలకున్ బయిలోడి యోజగ
త్పావని నీవు గోరిన నెపంబున నిచ్చటి కంపినాడు గా
కీ విరహాబ్ధి నే కరణి నీఁదఁ గలాఁ డతఁ డింక మీదటన్"

అని చెబుతాడు. సీత సద్గుణాలు తెలిసిన వాడు, సీత లేకుండా జీవించలేనివాడు రాముడని తెలిపేవిధంగా లక్ష్మణుడు మాట్లాడాడు.

సీత లక్ష్మణుడికి తల్లివంటిది కనుక సీతను ఒంటరిగా అడవిలో వదిలివెళ్ళడానికి ఎంతో కష్టమనిపిస్తుంది. తల్లిని వదిలివెళ్ళే దూడలాగా లక్ష్మణుడు వెళ్ళలేక వెళ్ళలేక విడిచి వెళతాడు.

"ఏఁ గి నావ యెక్కి యెడఁద దల్లడపడఁ
దిరిగి తిరిగి సీత దిక్కుఁ గనుచు
దిక్కు కలిగి నీకు దిక్కు లేదాయెఁగా
తల్లి యనుచు నవలి తటము జేరి"

ఆ సీత కోసమే అన్న ఎంతగానో కష్టపడ్డాడు. సీతను రావణాసురుడు అపహరించినప్పుడు రాముడు సీత కోసం పడిన బాధ తెలిసున్నవాడు. అన్నకు వదినపై గల అనురాగం తెలిసినవాడు కనుకనే

"శివుకోదండము ద్రుంచె వాలి నడఁచెన్ జేపట్టు సుగ్రీవునిన్
బ్లవగ శ్రేణుల నేలెక్షారజలధిన్ బంధించెఁ బౌలస్త్యునా
హవభూమిన్ దెగటార్చె నీవనితకై మర్త్యాన్వయస్వామి య
ట్టి వధూటిన్ బెడఁబాసి నిల్వఁగఁ గలండే తాల్మి చిత్తంబునన్"

అని లక్ష్మణుడు అంటున్నట్లుగా కవి ముందు జరిగిన రామాయణ గాధను ఒకసారి మళ్ళీ స్మరింపజేశారు. తన బాధనంతా సారథి అయిన సుమంత్రుడితో లక్ష్మణుడు చెబుతూ ఈ పాపమంతా ఎవరిదని ప్రశ్నిస్తాడు.

"జనులందఱాడుకొనియెద
రని కద పతి సీత విడిచె నవనిజతాపం
బున నగు పాపము జనులదొ
జననాథునిదో గణింపు సారథియనుచున్".

అనగలిగిన లక్ష్మణుడు న్యాయం, ధర్మం ఎరిగినవాడు. అంతేకాదు భగవత్ తత్త్వం, వేదాంతసారం ఎరిగినవాడు రాముడికి దైన్యం విడిచి రాజ్యపాలన చేయమని కష్టసుఖాలు వచ్చిపోతుంటాయని రాముడు మనసుకు ఉపశమనం కలిగేవిధంగానూ మాట్లాడినవాడు. రాముడి దుఃఖం చూడలేనివాడు.

"అవనిజలాగ్ని వాయుగగనాత్మకమైన ప్రపంచమంతయున్
వివిధ చరాచరావళులు నీవయి నిండి వెలుంగుచుండఁగా
నవనిజ యెందుఁ బోయినది యయ్య భవద్వ్యతిరిక్తమైనవ
స్తువొకటి యున్నదే మఱపుఁ జూపునఁ జూచి తలంక నేటికిన్".

పంచభూతాత్మకమైన ప్రపంచమంతా నీవై నిండివుంటే సీతాదేవి ఎక్కడికి వెళ్ళింది, నీతోనే ఉంది కదా, నీలోనే ఉంది కదా అనే భావన రాముడికి కలిగించాడు. రాముడు మరిచిన విష్ణుతత్వాన్ని మళ్ళీ తిరిగి గుర్తుచేశాడు. అంతేగాక రాముడిపై ఏ మాటలు ఎక్కువగా ప్రభావం చూపుతాయో ఎరిగినవాడు కనుక ఏ నిందకు భయపడి సీతను రాముడు విడిచాడో అవే నిందలు రాజ్యపాలన మరిచి కర్తవ్యం విముఖుడైనా కలుగుతాయనే భయం కలిగించాడు.

"భ్రమగొని వందురన్ దరుణిఁ బాసి ధరాపరిపాలనంబు సే
య మఱచె రాముఁడంచు ననరా ప్రజలాశ్రితరక్షణోత్సుకా".

ఈ మాటలు విన్న రాముడు నిజంగానే కర్తవ్యాన్ని గుర్తించటం ఇక్కడ విశేషం. ఈ విధంగా లక్ష్మణ పాత్రను కవి చిత్రించారు.

**రాముడు:**

సీతాపరిత్యాగానికి పూనుకున్నది రాముడు. ప్రజల కోసం భార్యనైనా త్యజించటం రాజ కర్తవ్యంగా భావించినవాడు, తన కారణంగా వంశానికి అపకీర్తి కలుగరాదనుకున్నాడు. ఈ పాఠ్యభాగంలో రాముడి పాత్ర ప్రత్యక్షంగా స్వల్పంగానే కనిపిస్తుంది. మిగిలిన పాత్రలు అందరి మాటలలో రాముడు లేకుండా ఉన్నదే లేదు.

సీతావియోగాన్ని భరించలేని వాడుగా కనిపిస్తాడు. సీతను విడిచినందుకు పరితపిస్తాడు. తనను తానే దోషిగా నిందించుకుంటాడు.

"ఏకతంబునఁ దొల్గి యింతి పల్కిన కూర్మి పల్కులు వా(క్రుచ్చి పనవి పనవి
ప్రజల మిథ్యానిందఁ బాటించి వడి నెంత తెగువ సేసితి నంచుఁ పొగిలి పొగిలి
యీ మాట సౌమిత్రి యెఱిఁగింప సతియేమి యయ్యెనొ వనినంచు నడలియడలి
ప్రాణేశ్వరుని బాసి ప్రాణంబు లిఁక మేన నిలుచునెయనిభీతిఁ గలఁగి కలఁగి
యేసుఖమునింక నేలని యెంచి యెంచి
నేత్రముల శోక బాష్పమున్ నించి నించి
సొరిగి పలుమాఱు బాన్పుపై నొఱగి యొఱగి
యలయువిభుఁ జూచి లక్ష్మణుడార్తుఁ డగుచు"

సీతను వీడిన నాలుగురోజుల నుంచి భూజన సంరక్షణ చేయటం మరచినప్పటికి లక్ష్మణుడు చెప్పిన మాటలకు కొంత సేదతీరి రాజ్యపాలన చేయాలని నిశ్చయించుకున్నాడు రాముడు.

**వాల్మీకి:**

రామాయణ కర్త వాల్మీకి ఆ రామాయణంలో తానూ ఒక పాత్ర కావటం విశేషం. దయాసముద్రుడు వాల్మీకి భూతభవిష్యత్ వర్తమానాలన్నీ తెలిసినవాడు. మునిబాలకులు చెప్పగానే ఆమె సీతాదేవని తెలిసి ఆమె దగ్గరకు వెంటనే వెళతాడు. ఆమెకు ఏ మాటలు చెబితే ఊరట కలుగుతుందో అటువంటి మాటలు చెబుతాడు. తనను తండ్రిలా భావించి తమ ఆశ్రమానికి రమ్మంటాడు.

"అఱమర యేల నేనిలుచు నాశ్రమదేశము నీదెకాదె నీ
కెఱబఱికంబు లేక యిఁక నిచ్చట నున్న తపస్వికాంతలం
దఱు నుచితోపచారము బొనర్పఁ గలారు వివేక శాలినుల్
మఱతురె తెల్వి దైవగతి మాన్పఁగ నెవ్వరికైన శక్యమే".

అని వాల్మీకి సీత మనసులోని సందేహాలన్నీ తీరేవిధంగా ఆమె ఏమీ చెప్పకుండానే గ్రహించి చెబుతాడు. ఆశ్రమానికి తీసుకువెళ్ళినప్పుడు కూడా తిరిగి మునికాంతలు సీతను ఏమీ ప్రశ్నించే అవకాశం లేకుండా జరిగిన వాస్తవాన్ని తానే వారికి తెలియజేస్తాడు.

"చెఱుగులు రావణాసురిచేఁ జెఱవోయిన కాంతఁ దెచ్చియే
లెడునని తన్నుఁ బల్కినఁ జలించి రఘూద్వహుఁ డీమె సద్గుణం
బెడఁద నెఱింగియున్ సడి సహింపక కానల కంపినాఁడు మీ
రెడపక యీమెఁ బ్రోవుఁ డని యింతిని వారల కప్పగించినన్".

రాముడు చేసిన పొరబాటు మీరు చేయవద్దనే సూచన ఇందులో కనిపిస్తుంది. అంతేగాక వాల్మీకి మహర్షి మాట మునికాంతలను ఆజ్ఞలాంటిది. కనుక మహర్షే సీత గురించి అంతగొప్పగా చెప్పినప్పుడు వారు ఆమెను తక్కువ చేసే ప్రసక్తే ఉండదు.

**సుమంత్రుడు:** సీతాపరిత్యాగంలో కనిపించే మరొకపాత్ర సుమంత్రుడు. ప్రారంభం నుంచి చివరి వరకు ఉండే పాత్ర కానీ సంభాషించినది మాత్రం లక్ష్మణుడి పరితాపాన్ని పోగొట్టటం కోసమే. తను రథసారథ్యాన్ని మాత్రమే చేస్తూ అనవసర విషయాలలో జోక్యం చేసుకోకపోవటం గమనించవచ్చు. దశరథుడికి కూడా ఆప్తుడు, సన్నిహితుడు కనుకనే ఎవరికీ తెలియని రహస్యం సుమంత్రుడికి తెలిసింది. దశరథుడి ఆజ్ఞననుసరించి అన్ని సంవత్సరాలు ఎవరికీ చెప్పలేదు. అది అతడి ప్రభుభక్తికి సంకేతం. కానీ లక్ష్మణుడి వేదన చూడలేక తనకు తెలిసిన వాటిని లక్ష్మణుడికి తెలియజేశాడు. అది అతడి సున్నిత మనస్తత్వాన్ని సూచిస్తుంది. తన ప్రభువులు సంతోషంగా ఉండాలనే తలపు కనిపిస్తుంది. అంతేకాక సుమంత్రుడి మాటలలో అతడో జ్ఞానిగా, వేదాంతతత్త్వం తెలిసినవాడుగా కనిపిస్తాడు.

"వగచుచుఁ బల్కు లక్ష్మణుని వాక్కులు సారథి యాలకించి కేల్
మొగిచి వచించె నేలవెత మోదము ఖేదముఁగాల పద్ధతిన్
దగులుచు నుండ నెవ్వరికి దైవము ముందరఁ బౌరుషంబు పెం
పగునె మహాత్మ తొల్లి బుధులాడిన మాటలు విన్ము తెల్పుదున్".

అని లక్ష్మణుడిని అనేక రకాలుగా ఊరడిస్తాడు.

సుమంత్రుడు తెలిపే పూర్వకథలో దశరథుడు, వశిష్ఠుడు, దుర్వాసుడు పాత్రలుగా కనిపిస్తారు. మళ్ళీ దుర్వాసుడు దశరథుడితో ప్రస్తావించిన విషయాలలో శ్రీహరి, భృగుమహర్షి పాత్రలుగా కనిపిస్తారు. ఈ పాత్రలే కాకుండా మనకు పాఠంలో కనిపించే పాత్రలు సీతను ఆదరించిన మునిపత్నులు, సీత గురించి వాల్మీకి చెప్పిన మునిబాలకులు.

కంకంటి పాపరాజు ప్రతిపాత్రనీ ఔచిత్యవంతంగా, దాని ప్రాధాన్యత దానికుండే విధంగా వాల్మీకి రామాయణాన్ని అనుసరిస్తూ తీర్చిదిద్దారు.

**డా॥ ఇరపని మాధవి**
తెలుగు & ప్రాచ్య భాషా విభాగం,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,
నాగార్జున నగర్.

పాఠం - 17

# పాండవోద్యోగము

**- తిరుపతి వేంకట కవులు**

**17.1. కవి పరిచయం**

**17.2. నాటక నేపథ్యం**

**17.3. నాటకేతివృత్తం**

## 17.1. కవి పరిచయం:

"శతఘంట కవనమ్ము సల్పుసంగతియన్న
గరతలామలకమ్ము గాదె మాకు
అష్టావధాన కష్టావలంబనమన్న
నంబికొండయ దండనంబు మాకు
ఆశుధారా కవిత్వాడంబరంబన్న
నల్లేరుపై బండి నడమ మాకు...."

అని చెప్పుకున్న కవి దిగ్గజాలు తిరుపతి వేంకట కవులు. దివాకర్ల తిరుపతి శాస్త్రి, చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి వీరిరువురు జంటకవులు, తిరుపతి వేంకటకవులుగా సుప్రసిద్ధులు. 1872వ సంవత్సరములో దివాకర్ల తిరుపతి శాస్త్రి పశ్చిమగోదావరి జిల్లా ఎండగండి అనే గ్రామంలో జన్మించారు. చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి తూర్పు గోదావరి జిల్లా కడియము గ్రామంలో 1870వ సంవత్సరంలో జన్మించారు. చర్ల బ్రహ్మయశాస్త్రి దగ్గర విద్యనభ్యసిస్తూ సహాధ్యాయులు అయ్యారు. వీరిరువురు కొంతకాలం వేరువేరుగా కవిత్వం చెప్పినా క్రమంగా కలిసి చెప్పటం ప్రారంభించి జంటకవులుగా పేరు ప్రఖ్యాతలు సంపాదించారు. అనేక శతావధానాలను, అష్టావధానాలను నిర్వహించారు. వీరి మొదటి శతావధానం వీరికి 19 సంవత్సరాల వయస్సులో కాకినాడలో జరిగింది. అలాగే వీరి మొదటి రాజ సందర్శనం వేంకటగిరి రాజును సందర్శించటం. అలా తమ అవధాన ఆశుకవితా కౌశలంతో సభాసదులను ఆకర్షించి, మెపించి ఎన్నో సన్మానాలు పొందారు. ఆ రోజుల్లో వీరి శిష్యులమని చెప్పుకోవటం గొప్పగా భావించేవారు. పింగళికాటూరి కవులు, విశ్వనాధ సత్యనారాయణ మొదలైనవారు వీరి శిష్యులే.

తిరుపతి వేంకటకవులు పద్యకావ్యాలు, గద్యకావ్యాలు, విమర్శలు, వ్యాసాలు మొదలైన వందలాది గ్రంథాలు రచించారు. వీరి రచనల్లో ఎక్కువ స్వతంత్ర కావ్యాలు, కొన్ని అనువాదాలు. వీరు మొదట్లో సంస్కృత భాషలోనే రచన చేశారు. "ధాతు రత్నాకరము" వీరి మొదటి రచన తరువాత "శృంగార శృంగాటకము" అనే వీధి నాటకాన్ని సంస్కృతంలోనే రాశారు. వీరు నెల్లూరు వెళ్ళిన సందర్భంగా జరిగిన సన్మాన సభలో సభాసదుల కోరికపై అప్పటికప్పుడే సంస్కృతంలో "మూల స్థానేశ్వర స్థుతి శతకము" రచించారు. ఇంకా సంస్కృతంలో "దేవి భాగవతము" ను రచించి తమ గురువుగారైన

చర్ల బ్రహ్మయ్య శాస్త్రి గారికి అంకితమిచ్చారు. ఆత్మకూరు రాజైన సీతారామ భూపాలుడి కోరికపై "శ్రీనివాస విలాసము" అనే కావ్యాన్ని తెనిగించారు. కృష్ణమాచారి రచించిన ప్రౌఢమైన శబ్దార్థలంకారాలతో కూడిన సంస్కృత కావ్యమిది. అంత కావ్యాన్ని అనువదించారని సంతోషించి ఆ రాజు వీరిని ఏనుగుపై ఎక్కించి ఊరేగించాడు. తిరుపతి వేంకట కవులు ప్రోలవరపు జమీందారు కోరికపై ఎడ్విన్ ఆర్నాల్డ్ ఇంగ్లీష్‌లో రాసిన "లైట్ ఆఫ్ ఏషియా" ను తెలుగులో "బుద్ధ చరితము" గా రచించారు. వీరికి ఆంగ్ల భాషరానికారణంగా ఇతరులచే అర్థాన్ని చెప్పించుకొని రసరమ్యకావ్యంగా తీర్చిదిద్దారు. ఆ తరువాత వచ్చిన ఎన్నో బుద్ధ చరిత్రలకు ఇది మైలురాయిగా నిలిచింది.

వీరి స్వతంత్ర కావ్యాలలో, 'శ్రమానందము' చెప్పుకోవలసింది. ఐదు ఆశ్వాసాల ఈ కావ్యం శృంగారరసప్రధానమై నీతి బోధకంగానూ ఉంటుంది. ఆరోజుల్లో ఈ రచనలోని మకుటం "మనమా! వద్దికనాడు మాట వినుమా మర్యాద గాపాడుమా" గా కలిగిన పద్యం అన్ని చోట్ల వినబడేది. వీరు రాసిన సాంఘిక ప్రబంధం "పాణిగృహీత". ఇందులో బాల్యవివాహాల వలన కలిగే అనర్థాలను, బాలవితంతువుల దీనస్థితిని, వేశ్యల చంచల మనోవృత్తిని చిత్రించారు. దీనిని పుచ్చా సీతారామయ్యగారికి అంకితమిచ్చారు. వీరు తమ స్వీయచరిత్రలను "జాతక చర్య" అనే పేరుతో పద్యరూపంలో రచించారు. పద్యరూపంలో వచ్చిన స్వీయచరిత్రలలో ఇది మొదటిది. కామేశ్వరి శతకము, ఆరోగ్య కామేశ్వరి అనే స్తుతికావ్యం, ఆరోగ్య భాస్కరస్తవము, మృత్యుంజయస్తవము, సౌభాగ్య కామేశ్వరస్తవము, సతీస్మృతి మొదలైన ఎన్నో కావ్యాలను రచించారు. తిరుపతి వేంకటకవులకు ఇతర కవులతో జరిగిన వివాదాలను, వీరి అపూర్వ ప్రతిభాపాటవాలను తెలుపుతూ వచ్చిన రచనలు గీరతము, గుంటూరు సీమ, చళ్ళపిళ్ల జయంతి.

తిరుపతి వేంకట కవులు పద్దెనిమిది నాటకాలు రాశారు. వీటిలో ముఖ్యమైనవి పాండవోద్యోగము, పాండవ విజయము. ఈ రెండూ కలిపి "పాండవోద్యోగ విజయము" గా ప్రదర్శింపబడేవి. ఈ రెండే కాక పాండవ జననము, పాండవ ప్రవాసము, పాండవాశ్వమేధము అనే భారతేతివృత్త నాటకాలున్నాయి. "కురుక్షేత్రము" పేరుతో వీరు ఏ నాటకము రాయకపోయిన ఈ ఐదింటిలోనూ ముఖ్యఘట్టాలను కలిపి కురుక్షేత్రము పేరుతో ప్రదర్శింపబడేది. ఈ నాటకానికి వచ్చిన ప్రఖ్యాతి మరే ఇతర తెలుగు నాటకానికీ రాలేదు. ఈ నాటకంలోని పద్యాలు రెండో, మూడో రాని తెలుగువాడు లేడంటే అది అతిశయోక్తి కాదు. "అదిగో ద్వారక", అయినను పోయి రావలయు హస్తినకు", "బావా ఎప్పుడు వచ్చితీవు", "చెల్లియో చెల్లకో", "అలుగుటయే ఎరుంగని", "సేవా ధర్మమును సూత ధర్మమును", "జెండాపై కపిరాజు" మొదలైన పద్యాలు తెలియని తెలుగువారు ఉండరు. భారతం చదవనివారు కూడా ఆయా పాత్రల స్వరూప స్వభావాలను ఆకళింపు చేసుకోగలిగారీ నాటకం ద్వారా.

వీరు "మీరు రాజులైతే మేము కవిరాజులం" అని ధీమాగా పల్కినవారే కానీ ఎవరినీ యాచించి ఎరిగినవారు కారు.

"దోసమటం చెటింగియును దుందుడుకొప్పగ బెంచినారమీ
మీసము రెండుబాసలకు మేమె కవీంద్రుల మంచు దెల్పగా
రోసము గల్గినంగవివరుల్ మము గెల్చుడు గెల్చిరేని యీ
మీసము తీసి మీ పద సమీపములందలలుంచి మ్రొక్కమే"

అని చెప్పగలిగిన ఆత్మవిశ్వాసం వీరి స్వంతం. సుమారు అర్ధశతాబ్ద కాలం ఆంధ్ర కవితా సామ్రాజ్యాన్ని ఏలిన సరస్వతీపుత్రులీ కవులు.

1920వ సంవత్సరంలో తిరుపతిశాస్త్రి స్వర్గస్థులయ్యారు. తరువాత కూడా వేంకటశాస్త్రి తాను చేసిన రచనలను "తిరుపతి వేంకట కవుల" రచనలుగానే వెలువరించారు. వారి సాహిత్యమైత్రి అలాంటిది. 1950లో వేంకటశాస్త్రి మరణించారు. ఈ జంటకవులు పరమపదించినా వారి భారత నాటకాలు అజరామరంగా నిలిచాయి. అందులోనూ "పాండవోద్యోగము" నాటకం వెలలేని రత్నం.

పాండవోద్యోగము: యావత్ ఆంధ్రలోకాన్ని ఉర్రూతలూగించిన వీరి రచనైన "పాండవోద్యోగము" ప్రస్తుత పాఠ్యభాగం. ఉద్యోగమంటే ఉత్ + యోగం. ఉత్ అంటే ఉన్నతులైన సాధనా మనోవృత్తులతో, యోగం అంటే కలయిక. ఉద్యోగపర్వంలో పాండవపక్షం సాత్త్వికవృత్తుల సమీకరణం. కౌరవపక్షం తామసిక వృత్తుల సమీకరణం. ఈ రెండు వృత్తులూ యుద్ధానికి తలపడి తమతమ ఉన్నతులకు బలం చేకూర్చుకునే యత్నం చేయటమే ఉద్యోగం అన్నమాట.

ఈ నాటకంలో పెదవి కదిపితే పద్యం పలుకుతుంది. కానీ ఎక్కడా క్లిష్టతుండదు. రసవత్తమైన వీరి పద్య రచనా చాతుర్యం ప్రతిపద్యంలోనూ కనిపిస్తుంది. భారత కథా సంబంధమైన చలనచిత్రాలలో సైతం వీరి పద్యాలు తప్పనిసరి అయ్యాయి. పద్యాలేకాక కథాభాగం కూడా భారతానికి ఆయువుపట్టు లాంటిది. శ్రీకృష్ణుడు రాయబారిగా వెళ్ళి కౌరవసభలో చేసే సంభాషణలు, కర్ణుడితో కృష్ణుడు, కుంతి మాట్లాడే సన్నివేశాలను మరిచిపోలేని విధంగా వీరు రచించారు. కవిత్రయ భారతాన్ని, సంస్కృత భారతాన్ని పూర్తిగా అవగతం చేసుకొని ఆయా పాత్రల మనస్తత్వాలను ప్రేక్షకులకు అర్థమయ్యే విధంగా వీరు రచించారు. అంతేగాక ఈ ఒక్క నాటకం చూసినా ముందు జరిగిన సంఘటనలు తెలిసేవిధంగా సంభాషణలు రాశారు. తెలుగుదనం, తెలుగు పలుకుబడి ప్రతి అక్షరంలో ప్రత్యక్షమవుతుంది. ఇటువంటి నాటకం చదవటం వలన విద్యార్థులు తిరుపతి వేంకట కవుల రచనా వైశిష్ట్యాన్ని తెలుసుకోగలుగుతారు. ఇది ఆరు అంకాల నాటకం.

## 17.2. పాఠ్యభాగ సందర్భం:

పాండవులు అరణ్యవాసం, అజ్ఞాతవాసం పూర్తయిన తరువాత తమ రాజ్యభాగం కోసం ధౌమ్యుడిని రాయబారిగా ధృతరాష్ట్రుడి దగ్గరకు పంపుతారు. ఆ రాయబారం విఫలమవుతుంది. ధృతరాష్ట్రుడు సంజయుడిని రాయబారిగా పాండవుల దగ్గరకు పంపుతాడు. అదీ విఫలమై ఇంక యుద్ధం తప్పదనే ఉద్దేశ్యంతో కృష్ణుడి సహాయం కోరి దుర్యోధనుడు, అర్జునుడు కృష్ణుడి దగ్గరకు రావడతో ఈ నాటకం ప్రారంభమవుతుంది. దశరూపక కర్త ధనంజయుడు చెప్పిన నాటక లక్షణాలైన నాంది, ప్రస్తావనలు, అర్థోపక్షేపకాల వంటివి పాటిస్తూ తిరుపతి వేంకటకవులు నాటక రచన చేశారు.

## 17.3. నాటక ఇతివృత్తం:

అర్జునుడు కృష్ణుడి దగ్గరకు బయలుదేరాడు. తన మనసులో 'ద్రుపదుడు పంపగా వెళ్ళిన పురోహితుడి మాట దుర్యోధనుడు వినలేదు, సంధి చెడింది. అన్నిటిని నడుపగల సమర్థుడైన శ్రీకృష్ణుడి తోడునే కోరుకుంటాను, అదిగో ద్వారక, ఆలమందలవిగో' అనుకుంటూ కృష్ణుడి మందిరానికి వచ్చాడు. తనకన్నా ముందు వచ్చిన దుర్యోధనుడిని చూచి 'కృష్ణుడిని తనవాడిగా చేసుకోవాడానికి వచ్చాడు కాబోలు, కానీ కృష్ణుడు పాండవ పక్షపాతి కదా, కాదు కాదు ధర్మపక్షపాతి

అని ఇతడికి తెలీదా ఏంటి' అనుకున్నాడు. దుర్యోధనుడు శ్రీకృష్ణుడు నిద్రిస్తున్నందున అతడి తలవైపు పీఠంపై కూర్చొని ఉండగా కృష్ణుడు కపటనిద్ర నటిస్తూ "ఇంకా అర్జునుడు రాడేంటి, దుర్యోధనుడు యుద్ధానికి సహాయం చేయమని అడగటానికి వచ్చాడు అనుకుంటుండగా అర్జునుడు ప్రవేశించి 'ఎవరి పాదాలు పాపాలన్నీ పోగొడతాయో ఆ పాదాల దగ్గర ఉండగలగటం పావనం' అనుకుంటూ కృష్ణుడి పాదాల దగ్గర నిల్చుంటాడు. దురోధన్యుడు అర్జునుడిని చూచి 'అర్జునుడు, శ్రీ కృష్ణులు ఏకశరీరులంటారు. అటువంటి అర్జునుడి పట్ల విముఖుడై నాపై అభిమానం చూపటం ఎలా, కృష్ణుడికి అర్జునుడు బంధువు కదా. బంధుత్వమేముందిలే నాకూ ఉంది కదా, ఒకవేళ బంధుత్వం లేకపోయినా నేను ముందు తనను దర్శించటానికి వచ్చాను. ఒకవేళ అర్జునుడికే ప్రాధాన్యతిస్తే లోకులు పక్షపాతి అంటారని సందేహిస్తాడులే, మొత్తం ఇప్పుడే తెలుస్తుందిగా' అనుకున్నాడు.

అర్జునుడు రావటం గమనించిన కృష్ణుడు సంతోషంలో నిదురమత్తు నటిస్తూ ముందు అర్జునుడినే చూచినట్లుగా "అర్జునా! ఎక్కడి నుండి వస్తున్నావు, అందరూ సుఖంగా ఉన్నారుగా, నీ అన్నలు, తమ్ముళ్ళు చక్కగా ఉన్నారా, భీముడు ధర్మరాజు ఆజ్ఞ పాటించి శాంతంగా ఉంటున్నాడా" అంటూ ప్రక్కకు తిరిగి అప్పుడే దుర్యోధనుడిని చూచినట్లుగా గౌరవంతో "బావా, ఎప్పుడు వచ్చితివి, నీ సోదరులు, కుమారులు సుఖంగా ఉన్నారా? కర్ణుడు, భీష్ముడు, ద్రోణుడు మొదలైనవారు క్షేమమా? నువ్వు వచ్చిన పని చెప్పు. యావత్ రాజ్యానికి రాజువి, నువ్వు రావటం సామాన్యం కాదుకదా" అన్నాడు. దానికి దుర్యోధనుడు "పాండవులు, కౌరవులు యుద్ధం చేసే సమయం దగ్గరపడింది. మాకూ, వారికి ముఖ్యమైన బంధువు నువ్వు. నీవు మాతో చేరటం మా ఇద్దరికీ క్షేమం కలిగిస్తుంది. కనుక సహాయం అడగటానికి వచ్చాను. ఇద్దరికీ సమానుడవు. నేను ముందు వచ్చాను. కనుక నాకు యుద్ధ విషయంలో అనుకూలుడవు కా" అన్నాడు.

దానికి కృష్ణుడు "దుర్యోధనా! నువ్వు చెప్పింది తగినవిధంగా ఉంది. నేను మీ ఇద్దరుకు సహాయం చేయగలవాడిని. కాకపోతే నువ్వు ముందు వచ్చావు, మునుముందుగా నేను అర్జునుడిని చూశాను. ఇద్దరికీ సహాయం చేస్తాను. సైన్యాన్ని విభజిస్తాను. అయితే చిన్నవాడు కనుక ముందుగా అర్జునుడు కోరుకోవటం సరైనది" అన్నాడు. దానికి దుర్యోధనుడు మనసులో కృష్ణుడిని సందేహించినా పైకి నీ ఇష్టం వచ్చినట్లుగా చేయమన్నాడు. అర్జునా నీ అభిప్రాయమేంటి అని కృష్ణుడడుగగా సకల ధర్మస్వరూపుడవైన నీకు ఇతరులు చెప్పవలసినదేముంది అన్నాడు అర్జునుడు. దానికి దుర్యోధనుడు ముందు కోరుకునే అవకాశం అర్జునుడికిచ్చి మళ్ళీ అభిప్రాయం అడగటమేమిటన్నాడు. దానికి కృష్ణుడు "నువ్వు స్వతంత్రుడివి దుర్యోధనా, అర్జునుడు అలా కాదు గదా, అన్న చెప్పుచేతల్లోనివాడు, ఇప్పుడు ఇతడిని అడగకుండా మనం భాగం వేస్తే ధర్మరాజుకి నచ్చకపోతే బంధువై కూడా కృష్ణుడే మమ్మల్ని మోసం చేశాడనవచ్చు. అప్పుడు మీ తమ్ముడికి చెప్పే చేశానని నేను అనవచ్చు కదా" అంటాడు. ఇంకా "అన్ని విధాలుగా నాకు సమానులైనవారు గోపకులు పదివేలమంది ఒకవైపు, మరొక ప్రక్క నేను. అదీగాక నేను యుద్ధం చేయను, నా బుద్ధికి తోచిన సహాయం మాత్రం చేస్తాను" అన్నాడు. దురోధ్యనుడు కృష్ణుడెంత మోసం చేస్తున్నాడని అనుకుంటుండగా అర్జునుడు కోరవచ్చా అని అడుగగా 'కోరుకో కాని నేను చెప్పింది జాగ్రత్తగా విన్నావు కదా ఆయుధం పట్టను, ఏదో నాకు తోచిన మాట సహాయం చేస్తాను, తర్వాత నిన్ను నిందించకూడదు' అంటాడు కృష్ణుడు. దానికి అర్జునుడు "యుద్ధంలో నా రథంలో ఉండు, సూర్యుడిలాంటి నీ తేజస్సుతో శత్రువుల తేజం తగ్గిపోతుంది. నీవు ఆయుధం పట్టనవసరం లేదు నేను దానికి అంగీకరిస్తున్నాను" అన్నాడు. దుర్యోధనుడు మనస్సులో

కృష్ణుడి కపటోపాయం తనకే లాభం చేకూర్చిందనుకుంటూ "మిగిలినది నేను తీసుకుంటాను బావా" అన్నాడు. కృష్ణుడు పోయిరా అంటే దుర్యోధనుడు వెళ్ళిపోతాడు.

అప్పుడు కృష్ణుడు అర్జునుడితో "నిజంగానే యుద్ధం చేయనన్నాను, గోపాలుడిని నన్ను కోరుకున్నావు, సమర్థులైన యదుధనుర్ధరులని దుర్యోధనుడు కోరుకోగా నువ్వు చిన్నవాడవయ్యావు కదా" అన్నాడు. అర్జునుడు ఆనందంతో 'నీ యుద్ధం ఎవరికి కావాలి, నీవు అండగా ఉండటమే పదివేలు. నువ్వు రథంలో ఉంటే చాలు, నేను శత్రువులందరిని సున్నం చేస్తాను, నాకు పేరు వస్తుంది. అదే నువ్వు యుద్ధం చేస్తే చంద్రుడి ముందు చుక్కలలాగా నాకు పేరు ఎలా వస్తుంది? పది వేలు కాదు పది కోట్లున్నా నీకు సాటి కాదు" అన్నాడు.

కృష్ణుడు "అర్జునా! నీ భక్తికి సంతోషించాను, నేను ఊరకనే కూర్చున్నా శత్రువులు ఫక్కున నవ్వుతాను కాబట్టి నీ రథానికి సారథినై ఈరోజు నుంచి విజయసారథినవుతాను" అన్నాడు. అర్జునుడు పట్టరాని సంతోషంతో "చాలా రోజులనుండి నా మనసులో ఉన్న కోరికే నువ్వు చెప్పావు. బంధువునే కాదు నీ భక్తుడిని అయిన నన్ను ముందుకు నడిపే భారం నీదే, నా కన్నా అదృష్టవంతుడెవడింక, వేదాల సారమైన కృష్ణుడు సారథంట, ఆయన పాదపద్మాల పట్ల భక్తి కలిగిన అర్జునుడు రథికుడంట, గుర్రాలు దేవతలివ్వగా, అస్త్రశస్త్రాలు శివాదులివ్వగా ఇంక యుద్ధంలో మన ముందు ఎవరు ఆగగలరు. బావా, అన్న నీ కోసం ఉపప్లావ్యంలో ఎదురు చూస్తున్నాడు, అక్కడకు వెళదాం రా" అన్నాడు. అలాగే వెళదాము ఇప్పుడు దుర్యోధనుడు ఎక్కడికి వెళ్ళాడో తెలుసా అర్జునా అని కృష్ణుడడుగగా బలరాముడి సందర్శనం కోసమనుకుంటానని అర్జునుడు సమాధానం చెప్పాడు. మరి నువ్వెందుకు మా అన్నను సందర్శించి సహాయం కోరవు అని కృష్ణుడనగా "నీవు ఒక్కడివే జగాలన్నీ జయించగలవు నేను కూడా అంతే. నాకు పేరు కలుగకుండా నీకు పేరొస్తుందేమో అనుకునే నాకు నీవు యుద్ధం చేయనని చెప్పి నా అభిమతం తీర్చావు. కొండను ఎక్కినట్లయింది. కానీ బలరాముడు అలా కాదు. శత్రువులను మృగాలను వేటాడినట్లు చెండాడుతాడు. అప్పుడు బలరాముడికే పేరు వస్తుంది కానీ నాకు పేరెలా వస్తుంది" అన్నాడు అర్జునుడు. దానికి కృష్ణుడు నవ్వి అతడు ఎదుటిపక్షంలో ఉంటే మనకింగా భారం కదా అనగా నీ అనుగ్రహముంటే ఏ లోపం రాదన్నాడు అర్జునుడు. కృష్ణుడు నవ్వి 'నీ ధైర్యానికి సంతోషించాను, కానీ అతడు యుద్ధంలో మీకు గానీ వారికి గానీ తోడుగా రాడు. అతడి ఆలోచన ముందే నాకు తెలుసు, మీ ఇద్దరికీ సంధి జరిగితే బలరాముడు సంతోషిస్తాడు, నా కోరిక కూడా అదే. ధర్మరాజు ఇష్టం కూడా అదే కనుక దాని కోసం ప్రయత్నిద్దాము' అన్నాడు. ఇది మొదటి అంకం ఇతివృత్తం.

ఇంక రెండవ అంకంలో కృష్ణుడు, పాండవులు, ద్రౌపదిని కలిసి యుద్ధం పట్ల వారి వారి అభిప్రాయాలు తెలుసుకోవటం ఉంటుంది. కృష్ణుడు ధర్మరాజుని "దేవా, అజాతశత్రు, యుద్ధిష్ఠిర అని సంభోదిస్తూ నా తరం కాకపోయినా చేతులు జోడించి చేస్తాను, నీ ఆలోచన ఏంటో చెప్పు" అన్నాడు. ధర్మరాజు "నీ ఈ పిలుపు భావికార్య సూచికమేమో కానీ వానప్రస్థుడనైన నేను ఇప్పటికి ఈ పిలుపుకు సరిపోను. తమ్ముడి కొడుకులు అని ఆలోచించడు, రాజ్యంలో భాగం ఇవ్వడు, ఆ విషయం సంజయుడు తేల్చాడు. జయాపజయాలు దైవాధీనాలు. నా దైవమైన నువ్వు మాతో ఉన్నావని తెలుసు, అయినా భార్యాబిడ్డలు ఏడ్వగా, రాజులు యుద్ధంలో చనిపోగా, చుట్టాలందరూ రూపుమాయగా రాజ్యం దక్కుతుందా, దక్కనిస్తారా? రాజ్యభాగం చాలు. ప్రజలు సుఖంగా ఉంటే చాలు. నేను సరిపోక కాదు, నెత్తుటి కూడు తినలేను" అన్నాడు.

కృష్ణుడు "ఈ సమయం కాని సమయంలో ఈ నిర్వేదమెందుకు? రాజులకు నెత్తురు కూడు కాక జోలికూడు తినుట ధర్మమా, అయిన నీ అభిమతం ఏదో నిర్వర్తించుటే పరమధర్మం కావున స్పష్టంగా చెప్పు" అన్నాడు. అప్పుడు ద్రౌపది "తెలిపేదేముంది, మొన్న సంజయుడు యుద్ధం చేయనిదే రాజ్యం రాదని, యుద్ధం చేసి రాజ్యం కోరటం కంటే నందక రాజ్యంలోనో, వృష్ణి రాజ్యంలోనో బిచ్చమెత్తుకొని జీవించడం మంచిదని చెప్పాడు కదా, అలా బిచ్చమెత్తుకొని, మధ్యమధ్యలో అడవులకెళ్ళి వెనుకటిలాగానే కందమూలాలు తింటూ, ఋషులతో ధర్మశాస్త్రాలు ముచ్చటిస్తూ ఉండవలసిందేనని మీ బావగారి అభిప్రాయం" అంది. కృష్ణుడు అమ్మా ద్రౌపది, చెప్పవలసినదంతా చెప్పనివ్వు అన్నాడు. "యుధిష్టర మహారాజా, సంజయరాయబారసారం తెలుసుకున్నాం. మీకు శాంతి, వారికి కోపం ఒప్పుతాయన్నాడు. మీకు బిచ్చపుగంజి రుచిస్తుంది, వాళ్ళకు కమ్మని పాలు రుచిస్తాయి, మీ కోసం పర్వతాలు పుట్టాయి, వారి కోసం భూమి పుట్టింది అంటూ తెలిపాడు. ఎంత శుష్కప్రియంగా మాట్లాడాడు. వాళ్ళకు ఆయుష్షు, ఆరోగ్యం, ధనం, మీకు మాత్రం రుణం అనేవిధంగా ధృతరాష్ట్రుడు నడిపిన సంధి సారాంశం. మీ భాగం ఇవ్వడు. ఈ సంధి సారాంశం నీ కంట్లో నేను వేలుపెడతాను, నా నోట్లో నువ్వు వ్రేలుపెట్టమన్నట్లే ఉంది. నీ మనసు యుద్ధానికి వెనుదీస్తుంది. ఇంతకీ నీ నిశ్చయం తెలియజేయి" అని కృష్ణుడు ధర్మరాజునడిగాడు.

ధర్మరాజు "నువ్వు చెప్పినదంతా నిజమే, అయినా భీష్ముడు, ద్రోణుడు, కృపుడు మొదలైన ముఖ్యులు వినుచుండగా మా పెద్దనాన్న ధృతరాష్ట్రుడితో నువ్వు కూడా సంధి మాటలు విన్నవించు వింటాడేమో! సంధి మాట విన్నా, వినకపోయిన మనసు నిశ్చితంగా ఉంటుంది. ప్రజలు మన క్షేమాన్నే కోరుకుంటారు. వారి నిర్ణయాన్ని నిందిస్తారు. నిన్ను స్తుతిస్తారు, మా సామంతరాజులకు మా పని స్పష్టమవుతుంది. మమ్మల్ని ఈ ఆపద అనే సముద్రం నుండి కాపాడు. సంధి చేసి మా భరతసంతతిని రక్షించు, లేదా దుర్యోధనుడి సహాయులతో నశింపజేయి. నీ భుజాల మీదనే భారం పెట్టాము, మాకు కీర్తో, రాజ్యమో! సకల ధర్మ స్వరూపుడివైన నీకు నేను చెప్పేదేముంది. అయిన ఒక విషయం చెబుతాను. కౌరవులు సంధికి ఇష్టపడితే అన్నదమ్ములం మేము నూటఐదుగురం. వారు ఇష్టపడకపోతే వారు వందమంది, మేము ఐదుగురుమే కృష్ణా" అని అన్నాడు.

కృష్ణుడు "అలా జరగటమే కష్టం, కానీ జరిగితే మంచిదే. మీరూ మీరూ పోరాడటం ప్రజలకు కూడా మేలు కాదు. నీ కోరిక మీద వెళతాను. అక్కడ నీ కూర్మి, ఓర్మి ప్రజలకు స్పష్టమవుతుంది" అన్నాడు. ధర్మరాజు "నిన్ను పాపాత్ములైన వారి దగ్గరకు పంపటం అపాయకరం అనుకుంటున్నాను. త్రిలోకాధిపత్యం కూడా పాండవులకు నీ క్షేమం కంటే ఎక్కువ కాదు కదా" అన్నాడు. కృష్ణుడు నవ్వుతూ "బావా, అలా సందేహించకెప్పుడు. కౌరవులు, మిగిలిన రాజులందరూ కలిసినా నా దగ్గరకు రాగలరా. నిజంగా నేను కోపిస్తే వీరంతా ఒక లెక్కా? న్యాయమార్గం వినని కర్ణుడు, శకుని, దుశ్శాసనుడు తోడుగా కలిగిన ఆ దుర్యోధనుడి దగ్గర సంధి కుదురుతుందా అనే సందేహ మొక్కటే నా మనస్సులో ఉంది" అన్నాడు. ధర్మరాజు దానికి నీతో బాటు సాత్యకిని వెంటబెట్టుకొని వెళ్ళమన్నాడు.

భీముడు కళ్ళెర్రజేసి 'ఇంతకీ సంధి ఏమని' అని అడిగాడు. ద్రౌపది ఐదూళ్ళిచ్చిన చాలునంట అంది. భీముడు మనసులో ఎంత అవమానం, పరాక్రమం కలిగిన పాండవులకు ఐదు ఊళ్ళిచ్చిన చాలునంట, అలా బ్రతకాలనుకోవటం రాచకుమారులకు గొప్పా' అనుకొని పైకి దుర్యోధనాదులు ఎదుట ఉన్నారనే భావంతో పెద్దగా" ఓరీ దుర్యోధన, దుశ్శాసన హతకులారా, అన్న పంపవచ్చు గాక, కృష్ణుడు వెళ్ళుగాక, మీరు కోపం తగ్గి సంధి చేసుకోనున్నారు గాక కానీ మీకు

మృత్యువు తప్పదు అన్న చేసిన సంధికి రాజులందరూ చావకుండా ఉండటం మాత్రమే ఫలమవుతుంది'' అన్నాడు కోపంగా వెంటనే ద్రౌపది "దుర్మార్గులైన కౌరవులు మీ ఎదురుగా నన్ను జుట్టుపట్టి ఈడ్చి, బట్టలూడ్చినా చూస్తూ ఉండి దిక్కుమాలిన దానిగా చేసిన భీముడికి సమయం కాని సమయంలో ఈ కోపమేంటి? అసమర్థులు పరోక్షంలోనే ప్రగల్భాలు పలకటం ఎక్కువ'' అన్నది. దానికి భీముడు "వారు ఇక్కడ లేరా, కోపాంధకారంలో ఇలా అన్నాను. ద్రౌపదీ, నిజమే, మేము అసమర్థులం. కాకపోతే ఒక దుర్మార్గుడు కొప్పు పట్టుకొని రాజులందరూ చూస్తుండగా, భయపడకుండా నీవు కట్టిన వస్త్రం సభలో లాగగా చూడడమా, దానికి ఊరకనే ఉన్న కారణంగా మమ్మల్ని వాచాశూరులుగా నిందిస్తున్నావు'' అన్నాడు. అది విన్న ధర్మరాజు "రాజదంపతులారా, శాంతించండి అనగా భీముడు గద నేలపై విసిరి శాంతించి చాలకాలమైంది అన్నాడు.

కృష్ణుడు "ధర్మరాజా! సంజయుడి మాటలు విన్నాను, నీ నిశ్చయం కూడా తెలియజేశావు. ఇంక బయలుదేరి వెళ్ళి హస్తినాపురానికి వెళ్ళి నీ ఇష్టం తీర్చటానికి ప్రయత్నిస్తాను. కాని కౌరవులు నీతిలేనివారు, స్నేహం కుదరటం అనిశ్చయం. బురదలో పడిన ఏనుగులాగా నీ బుద్ధి కలత చెందింది. మాయజూదంలో అమాయకుడవైన నిన్ను గెలిచి, ద్రౌపదికి చేయరాని అంత అవమానం చేసి, అరణ్యాలకు పంపి, హాయిగా ఉండనివ్వక చెడ్డవారై కీడులు చేస్తున్న ఆ దాయాదులు చస్తారని దయతలుస్తున్నావు, ఎంతటి ధర్మరాజువో! పరాక్రమం లేని రాజులకు ఆపదలు ఎక్కువని, కష్టాలు పడేవారికి అదృష్టం దూరం అని, అదృష్టహీనులకు సంపద కలుగదని చెప్పే పెద్దల నీతి వాక్యాలు గుర్తుతెచ్చుకో. శత్రువులను నిరసించి యుద్ధం చేయటానికి మనసును సిద్ధం చెయ్యి. నిశ్చింతగా సింహం ఏనుగులను చంపి జీవించాలనుకుంటుంది గానీ నీరస పడదు ఎప్పుడూ. మానహానికి మహాత్ములు ఒప్పుకోరు, ప్రాణాలైనా విడవటానికి అనుమతిస్తారు కానీ బూడిదను ముంగాళ్ళతో తంతూపోతారు గానీ, మంట దగ్గరికి వెళ్ళటానికి చూస్తారా మనుష్యులు'' అన్నాడు.

ధర్మరాజు దానికి శత్రువులు ఎక్కువ బలం కలిగినవారు, మనమా అంత బలసహాయం లేని వారం. జయం మనకో శత్రువులకో తెలియటం కష్టం. కనుక సుఖం నిశ్చితం కాదు. కాబట్టి సంధి చేయటమే మన కర్తవ్యం'' అన్నాడు. దానికి కృష్ణుడు "ధర్మరాజా, నీ బలపరాక్రమం నీ తమ్ముల తేజస్సు నీకు తెలియక మాట్లాడుతున్నావు నీ నలుగురు తమ్ముళ్ళు బలవంతులు. శత్రువులు చంపబడతారు. ఇది భవిష్యత్తుకు సంబంధించిన ఉపదేశం. అయిన హస్తినకు పోవాలి. సంధి మాట ఎలా ఉన్నా శత్రురాజుల బలాబలాలు చూడవచ్చు. నీ మనసులో కలిగిన అనుమానం తీర్చవచ్చు. ఆ సమాధానం, మీ పద్ధతి తాత, గురువు, పెద్దలందరూ వింటారు'' అన్నాడు.

భీముడు పెద్దగా "కృష్ణా, పాండవదూతా! నీ ఆలోచన, మా రాజు ఆలోచన వేరుగా ఉన్నాయి. యుద్ధం, యుద్ధమని అసంబద్ధమైన మాటలు మాట్లాడవద్దు. సంధి చెడగొట్టక ధర్మరాజు కోరిన విధంగా సంధి చేయి. అదే మాకు క్షేమం. దుర్యోధనుడు తన గుణం విడువడు. ఒక్కో కులం నశించడానికి ఒక్కొక్కడు పుడతాడు. పూర్వం గొప్పరాజులు జన్మించారు. దుష్టులు నేటికి గాంధారి కడుపున పుట్టారు, భరతవంశం కాల్చటానికి'' అన్నాడు. కృష్ణుడు నవ్వి "ఇవి భీమసేనుడి మాటలేనా? ఎప్పుడూ వినని, చూడని శాంతం కనిపిస్తుంది. దుర్యోధనుడి తొడలు విరుస్తాను, దుశ్శాసనుడి రొమ్ము చీల్చి వేడి రక్తం కడుపారా తాగుతానని సభలో గొప్పలు చెప్పి, పిరికివాడి లాగా ఈ మాటలేంటి ఇప్పుడు'' అన్నాడు. ద్రౌపది వందమాటలు చెప్పవచ్చు గానీ ఒక మాట పాటించటం కష్టం కదా అంది. కృష్ణుడు "దానికి బరువు మోయలేని బలహీనుడు సమయం చూసి ఏకాంతానికి వెళ్ళినట్లుగా ప్రగల్భాలు పలికి యుద్ధానికిపుడు భీముడు భయపడుతున్నాడు'' అన్నాడు. ధర్మరాజు

తన మనసులో ఎలాగోలా చల్లారిన భీముడి కోపాగ్నిని కృష్ణుడు రగుల్కొల్పుతున్నాడు. కనుక ఇలా చేయకూడదని మందలిస్తానని అనుకొని పైకి "కృష్ణా! పగ విడిచి భీముడు నాపై భక్తి కారణంగా కాళ్ళ సంకెళ్ళు తగిలించుకొని లోపల బాధపడుతున్నవాడితో వైరం తెచ్చిపెట్టుకొని, శౌర్యం రెచ్చగొట్టి యుద్ధానికి సన్నద్ధం చేస్తే ఇక మన ప్రయత్నాలు సాగుతాయా" అన్నాడు.

కృష్ణుడు "ఈ భీముడికి కోపం అలంకారమైనట్లుగా శాంతం కాదు కాబట్టి కోపం రావటానికై ఈ ప్రశంస తెచ్చాను గానీ ఇది నిజం కాదు" అన్నాడు. ద్రౌపది "అన్నా! నా పరాభవ బాధను పాలుపంచుకోవటానికి భీముడి కోపాగ్నే చల్లారితే ద్రౌపది ఇంక దిక్కులేనిదవుతుంది" అంది. భీముడు ఎగతాళిగా "పాండవదూతా, కృష్ణా! యుద్ధానికి భీముడు భయపడుతున్నాడని పుట్టుకతోనే శూరుల వంశానికి ఆభరణం వంటివాడినైన నన్ను అనవలసినదే. పసితనంలోనే పాలివ్వటానికి వచ్చిన స్త్రీని చంపానా, పశువులతో పోరాడి బలవంతులని పేరు పొందానా, నాకు శౌర్యం ఎక్కడిది" అన్నాడు. కృష్ణుడు భీముడికి కోపం పెరుగుతుంది అనుకుంటూ" బావా, ఉన్న మాటంటే నీకు ఉలుకెందుకు" అన్నాడు. భీముడు "కృష్ణా, యుద్ధానికి భయపడ్డానో, అన్న గారి ఆనతికి భయపడ్డానో తెలుసుకోలేకపోయావు. సముద్రాలు ఇంకిపోవచ్చు గాక, ప్రళయం వచ్చుగాక, సూర్యచంద్రులు తలక్రిందులగుదురుగాక, గొప్పకష్టాలు రావచ్చు కాక, సంపదలు పోవచ్చు గాక, ఎలాంటి పరిస్థితులలోనూ అన్న మాటలను జవదాటరు పాండవులు" అన్నాడు.

కృష్ణుడు "దుర్యోధనుడి తొడలు విరుగగొట్టి చంపుతానని, దుశ్శాసనుడి రొమ్ము చీల్చి నెత్తురు త్రాగుతానని నీవన్న మాటలు కావా" అన్నాడు. భీముడు "అవును నేనన్న మాటలే" అన్నాడు. కృష్ణుడు నవ్వుతూ అయితే "భీముడు తప్ప మిగిలిన సోదరులే అన్న మాట జవదాటని వారు" అన్నాడు కృష్ణుడు. భీముడు అపహాస్యంగా "ఓయీ నీకు అన్నమాట అంటే అర్థమే తెలీలేదుగా, గొల్ల ఇల్లాళ్ళను మోసం చేసి ఇల్లు ఇల్లు తిరిగి పాలు, వెన్న పెరుగు దొంగతనంగా తిని పొట్టనింపుకొని జీవించిన వెర్రిగొల్లడివి, నీకు విద్యల గొడవెందుకు? ధర్మరాజు నడిచిన దారిలోకాక మరోదారిలో వెళ్ళటం మా మతం కాదు. లేకపోతే ద్రౌపది శోకం ఆర్పటానికి నువ్వు దిక్కయ్యావు అన్న గోడు మాకెందుకు" అన్నాడు.

అర్జునుడు హాస్యం శృతిమించుతుందనుకొని "భీమసేన! నేను, దుర్యోధనుడు యుద్ధ సహాయం కోరి ఒకేసారి ప్రార్థించినా వేరొకనెపం కల్పించి మనమీద పక్షపాతంతో మనకు అండగా వచ్చిన మహానుభావుడిని చెడుమాటలని విరక్తుడిగా చేస్తున్నావు. అతడి గోడే మనకు ఎప్పుడూ కావలసింది" అన్నాడు. భీముడు "అర్జునా! నీకు తెలీదు పరాచికాలాడటానికి దేశకాలాదులు చూడనవసరం లేదా? బకాసురుడిని చంపాను, హిడింబాసురుడిని తుదముట్టించాను. కీచకులను అంతం చేశాను. భీముడికి వేరొక తోడెందుకు? నా గురించి తెలియక యుద్ధానికి భయపడుతున్నానన్నాడు. ఒక గొల్లవాడికి తెలుసా ఈ భూమిపైనే గొప్పవీరుడైన పవనసుతుడు భీముడి ధైర్యం" అన్నాడు. నకులుడు మెచ్చుకోవలసిన కృష్ణుడిపై ఎందుకో చిన్నతనం చూపిస్తున్నాడు భీముడనుకొని "జరగాల్సింది ఒకటైతే జరుగుతుంది మరొకటిగా ఉంది. పాండురాజు మరణించిన దగ్గర నుండి ఏ కష్టాలు రాకుండా ఎప్పుడూ ఈయనే కదా మనలను కాపాడుతున్నవాడు, అలాంటివాడు ఒక్కమాట ఎగతాళికి మాట్లాడితే సహించలేవా, కాకపోతే గొల్లడు గొల్లడని వినకూడని మాటలతో ఈ పరమాత్ముడి చేష్టలు తెలిసి కూడా నిందించటం తగునా? తల్లి కుంతి కూడా ఎప్పుడూ గురువుగా తలుస్తారుగా దానినైనా నీ మనసులో తల్చుకోక అమాయకపు కోపం చూపించావు" అన్నాడు. భీముడు "తమ్ముడా! ఎందుకీ అనవసరపు మాటలు. మీరందరూ అతడి

అడుగులకు మడుగులొత్తిన వత్తుతారు గాక, చావకుండా ఇతడే రక్షించాడా? లక్క ఇంటిలో ఇతడే రక్షించాడా, అడవులలో కష్టాలు పడుతున్నప్పుడు ఇతడే రక్షించాడా'' అన్నాడు. సహదేవుడు "అన్నా! అప్రస్తుత ప్రశంస ఎందుకు, ముందెప్పుడూ మనకు ఉపకారం చేయకనే పోవచ్చు, ప్రస్తుతం సహాయం చేయడానికి వచ్చాడు కదా. అతడు పరిహాసమాడితే అనవసరంగా కుటుంబ కలహాలకు పూనుకున్నావు. గోడలకు చెవులుంటాయి, దాయాదులు వింటే లోకువకామా అనైనా మెదలకుండా ఉండలే. అయినా యదార్థం ఆలోచించినా తాత, గురువు, మిగిలినవారు చూస్తుండగా మన భార్యను పట్టి పరాభవిస్తే ఆమె మాన రక్షణ చేసినట్టి మహోపకారి. నిన్నీతడు శౌర్యహీనుడని మేలమాడితే లోపముందా?'' అన్నాడు. భీముడు "ఛీ, కుర్రవాడితో కూడా ఇలాంటి మాటలు అనిపించుకున్న ఈ దురభిమానపు బ్రతుకెందుకు? ఈ గదాదండంతో తల ముక్కలు చేసుకుంటాను'' అని గదతో తలకొట్టుకోబోగా ద్రౌపది భీముడి చేయి పట్టుకొని'' శాంతింపుము, శత్రువులను గెలవటం లేదా చావటం ఆనాడు చేయవలసినవి కానీ నేడీ వృథా ప్రాణత్యాగమెందుకు? హాస్యానికి దేశకాల పాత్రాలు లేవా? అని మీరు అడిగిన మాటలు మంచివి. మీ తప్పు లేదు. కృష్ణుడి తప్పు లేదు. ఈ దీనురాలిని ఏమి చేస్తారు ? నా పరాభావాన్ని ఎవరు చల్లారుస్తారు ? నేనింక అనాధనవుతానా, ముత్తైదువనవుతానా? ఆ కౌరవులను చంపి నా అవమానాలన్నీ చల్లార్చండి లేదా రణంలో వీర స్వర్గమనుభవించండి. ఇలా చావటం వలన ప్రయోజనమేముంది? ఓ ధర్మరాజా! సైంధవుడిని కట్టితెచ్చినట్లుగా యుద్ధంలో దుర్యోధనాదులను పట్టితేవడానికి నీ తమ్ముడికి ఆజ్ఞ ఇవ్వు'' అంది. భీముడు "నన్ను వారించవద్దు, ఏవిధంగానూ ధర్మరాజు యుద్ధానికి ఒప్పుకోడు, నీవేమో పరాభవమని ఏడుస్తావు. లోకంలో ఇలాంటి బ్రతుకు బ్రతకటం కంటే చావటమే మేలు'' అన్నాడు.

ధర్మరాజు భీముడిని సమీపించి "నువ్వెందుకు ఈ ఆత్మహత్మకు పూనుకున్నావు? కృష్ణా, గోరుతో పోయేదానికి గొడ్డలితో నరికేటట్లు చేశావు. ద్రౌపదీ, భీముడి కోపాగ్నిని ప్రజ్వలింపజేసేందుకు కట్టెలు విరిచిపెట్టినట్లే మాట్లాడుతున్నావు కదా. సహదేవా, ఎంత బాధకలిగినా ఇతరులను చిన్నమాట అననివాడవు, గురువుల పట్లా అపచారం. జూదరినై భార్యను దుఃఖం పాలు చేసి, తల్లి దాయాదుల ఇంట్లో ఉండగా చిన్నవాడైన తమ్ముళ్ళను, భార్యను అడవులలో కష్టాల పాలు చేసిన నేనుండగా భీముడినెందుకు బలి తీసుకుంటావు గదా ప్రహారమా'' అన్నాడు. కృష్ణుడు వ్యవహారం శృతిమించుతుంది. కనుక భీమసేనుడిని ఎప్పటిలాగానే చేయాలనుకొని "ధర్మరాజు ఏంటిది, నీకీ వెర్రి, ఊరక చూస్తూ ఉండు. భీమసేనా, బాధ తెలియని మీ అన్న ధర్మరాజుకి కూడా బాధ కల్గించావు. నువ్వు లేక ద్రౌపది శోకం తీరుతుందా? నీ పరాక్రమం ఎవరికి తెలీదు, చిన్నతనం నుండి దుర్మార్గులైన దుర్యోధనాదుల దురాలోచనలకు నువ్వే సరైనవాడివి. త్రాళ్ళతో కట్టారు, నీళ్ళలో త్రోశారు. విషాన్ని త్రాగించారు. అలాంటిది నన్ను సంధి చేయమని ఎలా ప్రేరేపించావు'' అన్నాడు. దానికి భీముడు కోపం పోయి "మాటమాటకు నన్నెందుకు వాగిస్తావు. ఎందుకు భార్యను జుట్టుపట్టి ఈడుస్తుంటే చూశానో, ఎందుకు వనవాసం చేశానో, ఎందుకు శాంతి వహించి ఒకరి కొలువులో ఉన్నానో, అందుచేతనే ఈ సంధికి ఒప్పుకొంటున్నాను. ఐనా సంధి మాటలు ధృతరాష్ట్రుడితో ఇలా చెప్పు. పాండురాజు జనుల చేత కీర్తించబడేవాడు. నీ తమ్ముడు రాజ్య భారం అతడే భరించాడు తాను పోయేవరకు. ఇప్పుడు నీవు ఇంటికి పెద్దవై కూడా అంధుడవు కనుక నీ కొడుకులకు సరిగా రాజ్యం పంచిపెట్టి నీ కుమారుల అభివృద్ధి వింటూ సుఖంగా ఉండు. అలా పంచిపెట్టడానికి అంగీకరించలేకపోతే యుద్ధంలో నీ కొడుకులనందరినీ ఒక్క గదకే బలిస్తాను'' అనగా ద్రౌపది 'నాథ, నీ చల్లని మాటలకు నా మనోవ్యథ తీరిపోయినట్లే ఉంది'' అంది.

భీముడు "ద్రౌపది, కొన్ని రోజులలో నీ కనుకొలకుల్లో ఆనందభాష్పాలు జారుతాయి" అన్నాడు. కృష్ణుడు తనలో తాను ఇప్పటికి మత్తగజం కట్టుకొయ్యకు చేరింది అనుకొని పైకి "ఓ అర్జునా నకుల సహదేవులారా! మీరు చెప్పవలసిన మాటలేమైనా ఉన్నాయా" అని అడిగాడు. అర్జునుడు "చెప్పవలసిందంతా ధర్మరాజు చెప్పాడు, నీవు దైవస్వరూపిడివి, ఇంక కొదవేముంది, సంధి చేసినా, యుద్ధం కలిగించినా భారం నీదే. అయినా నా మాటలు నేను చెబుతాను. చిరకాలం నుంచి అనుభవించే రాజ్యం ప్రేయసిలాంటిది. బలవంతమైన విధివల్లకాక ఎవరు దానిని వదలాలనుకుంటారు. అదీ దుర్యోధనుడు లాంటి చెడ్డవాడు ఎలా విడుస్తాడు? సూదిమొన మోపినంత భూమైనా ఇవ్వనని సూచించాడు కదా, సంజయుడి ద్వారా ఐదు ఊర్లు చాలునన్నా లాభం లేదు కదా. అది నాకు తోచింది అయినా సభలో భీష్ముడితో, ద్రోణాచార్యుడితో నా మాటలుగా చెప్పు. కర్ణుడి స్నేహంతో పగకు పూనుకున్నవాడు దుర్యోధనుడు. మీరు అతని పట్ల వారవ్వటం న్యాయమా? ఓ తాత, గురువా, నేను గాండివధారినయినా యుద్ధభూమిలో ఎలా పోరాడగలను, ధర్మం కాదని మందలించరా? అలా మందలించలేకపోతే మనుమళ్ళే అపాయం చేశారని, శిష్యులే అపచారం చేశారని మనసులో ఆలోచించక మాకు అభయం ఇవ్వండి" అన్నాడు.

కృష్ణుడు నకులా నీ అభిప్రాయమేంటి? అని అడుగగా నకులుడు "అడవిలో ఉన్న సమయంలో రాజ్యాశ మనకు లేదు. వారికి దుర్బుద్ధి లేదు నిజం. కష్టాని కోర్చి చివరికి భాగం కోరేటప్పటికి వారికి ఇలాంటి దురాశ పుట్టింది. అలా సంధి కోసం కబురు పంపారు కానీ భీష్ముడు, ద్రోణుడు యుద్ధం ఎలా మాన్పుతారు, యుద్ధానికి కాలుదువ్వటానికి మన బలం సామాన్యమా, ధర్మరాజు ధనుస్సు పట్టి నిలిస్తే ఎదుర్కొనే వాడెవడు? మిగిలిన పాండవులు, విరాటుడు, ద్రుపదుడు, దృష్టద్యుమ్నుడు, కాశీరాజు, చేదిరాజుల బలపరాక్రమాలు, నీ సామర్థ్యం తెలియని వాళ్ళు ప్రగల్భాలే పలుకుతుంటారు. అయినా సంధి నడుపు, యుద్ధానికి కూడా సంధి నడిపించు" అన్నాడు.

కృష్ణుడు చిన్నబావా, సహదేవా! నీ ఆలోచన వ్యక్తం చెయ్యి అనగా సహదేవుడు "అడిగారు కాబట్టి చెప్పకుండా వదలటం ధర్మం కాదని చెబుతున్నాను, ఒకవేళ తప్పున్నా మనసులో ఉంచుకొని నా మాటలు క్షమించండి. పేదరికం వచ్చిందని పెద్దలు నలుగురూ కలిసి చేశారు అనకూడదు. దుర్యోధనుడితో వేడుకతో జూదమాడి ధర్మరాజు సమస్తం పొగొట్టుకోగా మనకు భాగ్యం ఎలా కలుగుతుంది? పాంచాలి వరాల కారణంగా ధృతరాష్ట్రుడే మన రాజ్యం మనకిచ్చాడు. భూమిపైని రాజులందరూ చూడగా గద, గాండీవం ధరించిన రాజులే స్త్రీ సంపాదించిన భూమిని పాలిస్తారా? అభిమానం ఉన్న రాజులకు అసత్యాలు తగునా? అందుకని మా భాగం ఇవ్వండి అనకుండా బలపరాక్రమాలని చూపే యుద్ధభేరీ మ్రోగించండి. రాజులమైతే యుద్ధంలో జయించి రాజ్యం ఏలాలి లేదా చచ్చి స్వర్గంలో తిరగాలి. మంచి క్షత్రియులకు ఇంకొకటి లేదు" అని చెప్పాడు. కృష్ణుడు బావా, చిన్నవాడైనా నా మనసుకు నచ్చిన మాట చెప్పాడు అనగా "మా అన్నలు, నువ్వు సంధికి దుర్యోధనుడు ఒప్పుకోడని తెగ భాధపడుతున్నారు. అన్నలకు ధర్మవర్తనులన్న కీర్తి ఒకటుంటే చాలు. కానీ ద్రౌపది తల ఎత్తుకోగలదా?" అన్నాడు.

ద్రౌపది శ్రీకృష్ణుడితో "అన్నా! ఈ ఆడుదాని మాట కూడా ఆలకించు, యజ్ఞగుండం నుంచి పుట్టి, ద్రుపదరాజుకి ముద్దుల కూతురినై దృష్టద్యుమ్నుడికి సోదరినై, స్వయంవరంలో రాజులందరినీ జయించిన గొప్పరాజులు ఐదుగురికి భార్యనై. ప్రత్యేకంగా నీకు చెల్లినై, ఒక్క కులనాశకుడు తాకకూడని సమయంలో కొప్పుపట్టుకొని ఈడ్చి కొలువులో కట్టిన

వస్త్రాలు లాగి పరాభవించగా ఓర్చుకున్నాను. పన్నెండు సంవత్సరాలు వనవాసం, ఒక సంవత్సరం అజ్ఞాతవాసం చేశాను. ఇన్ని కష్టాలకు ఓర్చుకొని బ్రతికి ఉన్నందుకు ఫలితంగా ఆ కౌరవ చండాలుర చావు వినుటకు కానీ సంపదలకు ఆశించుదానను కాను. వేయెందుకు, ఈ మేటి భర్తలకు పౌరుషం వస్తుందని కదా, ఈ రోజుకీ దుశ్శాసనుడిచే చిన్నవైన తలవెంట్రుకలు ముడుచుకోకుండా, కట్టిన వస్త్రం విడువకుండా జీవిస్తున్నాను. అయినా ఇప్పటికీ నా నోములు ఫలించటం లేదు" అన్నది. దానికి కృష్ణుడు "అమ్మాయి, ఇంక ఆపు. నీ మనసులో కోరిక తెలుసు. ముందు నీవు సహించినన్ని రోజులు సంతాపభారాన్ని ఇంక సహించనవసరం లేదు. నీలాగానే కురురాజు భార్యలు కూడా ఏడ్చేకాలం వస్తుంది. ఇది నిజం" అన్నాడు. బావలారా, నాకందరూ సెలవియ్యండని అనగా వారు సాగనంపుతారు.

ధర్మరాజు "ఓ కురుకుల దేవతలారా, పంచభూతములారా, నా పట్ల దయవుంచి మా వంశాన్ని ఆశీర్వదించండి. యుద్ధాన్ని ఆపటం కోసం పరమదయామయుడు, మా ఇరుపక్షాలవారికి బంధువు, చరాచర జగత్తునంతా బ్రోచేవాడైన కృష్ణుడిని బ్రతిమాలి వారి దగ్గరకు పంపుతున్నాను" అని మనసులో అనుకొని పైకి నువ్వు తిమ్మి అంటే తిమ్మి, బ్రమ్మి అంటే బ్రమ్మి ఇంక వేయి మాటలెందుకు నీకు ఇష్టమైనట్లు చేయవయ్యా, రెండు వైపుల నీకు కాని వారెవరున్నారు అంటాడు. అందరూ నిష్క్రమిస్తారు.

మూడవ అంకంలో వృద్ధ పురోహితుడు ప్రవేశించి "ధృతరాష్ట్రుడు కృష్ణుని తమ ఇంటికి తీసుకురమ్మని నన్ను నియోగించగా నా మధ్యమ పుత్రుడైన త్రివేదిని పంపాను, పెద్దవాడైన ద్వివేదిని రాజాగారంలోనే ఉండమన్నాను. ఇంక చిన్నవాడైన చతుర్వేది, నేను మా ఇంటికి అతిథులుగా వచ్చిన మునీంద్రులకు ఆతిథ్యమిస్తున్నాము. ఎప్పుడూ రాని పెద్దలు ఇప్పుడు ఇంటికి వచ్చారు, వారిని వదిలి నేను రాజు దగ్గరకు ఎలా వెళ్ళగలను, వారు శపిస్తారు కదా, దుర్యోధనుడు ఏమి చేస్తాడో, కానున్నది కాకమానదు కదా. సత్యవతి తల్లిలేని మా తండ్రిని పెంచిందట, అలాగే అంబికాదేవి నన్ను అలా పెంచింది. నేను, ధృతరాష్ట్రరాజు ఒకే వయసువారము. కాబట్టి చిన్నప్పటి నుండి అతడికి స్నేహితుడనై, పౌరోహిత్యం పేరుతో సామ్రాజ్యాన్ని అనుభవించాను. శ్రీకృష్ణుడి రాక సంధి కోసమని తెలిసే కాబోలు నాతో ఏమో చెప్పాలని కబురు పంపాడు. అయినా కొరకరాని కొయ్యలైన దుర్యోధనాదులు తండ్రి మాట వినరు. భరతకులానికి చేటుమూడింది. ఇంత దిక్కుమాలిన ఆశ పనికిరాదు. పాపం ఆ పాండవులు బిచ్చగాళ్ళలాగా ఐదు ఊర్లిస్తే చాలంటే ఎందుకు ఇవ్వకూడదు. సాక్షాత్తుగా శ్రీకృష్ణుడే సంధిచేయడానికి వచ్చాడని అంగీకరిస్తారేమో అని మళ్ళీ పెదవి విరిచి వీరికి గురువు, దైవమనిలేదు. వీళ్ళని చిన్నతనం నుంచి చూస్తున్నాను. కర్ణుడు ఏ వైపు త్రిప్పితే ఆ వైపు కురురాజు దుర్యోధనుడు పోతాడు. అతడి తమ్ములు కూడా పడవతాడును ఆ వైపే లాగాలని చూస్తారు. శకునే భరతకుల నాశనానికి కారకుడు. ఓ కర్ణా, శరీరానికున్న కవచకుండలాలు కూడా తెగగోసి ఇచ్చిన దాతవు. మీ శరీరాలే వేరుగాని నువ్వే దుర్యోధనుడివి, దుర్యోధనుడే నీవు. సంధికి శ్రీకృష్ణుడు పాండవుల భూభాగం అడగడానికి వచ్చాడు. నిన్ను ఇదొక్కటే కోరదగనిది, భాగం మాట అలా వుంచి అతడిని అవమానించకుండా ఎలా వచ్చాడో అలా పోనిస్తే అదే చాలును" అనుకుంటుండగా ద్వివేది వస్తాడు.

ద్వివేదిని వృద్ధ పురోహితుడు "నాయనా! మురారిని మన త్రివేది ధృతరాష్ట్రుడి రాచనగరుకు తీసుకొని వచ్చాడా, అక్కడి విశేషాలేంటి" అని అడుగగా ద్వివేది "ఇప్పటికేమీ లేవు, విదురుడితో కలిసి త్రివేది చేసిన అర్ఘ్యపాద్యాలు స్వీకరించి ధృతరాష్ట్రుని ఇంటికి మత్తగజంలాగా వచ్చాడు. కొంతసేపు రాజుతో ఉచిత ప్రసంగం చేసి అంధదంపతులకు వీడ్కోలు

చెప్పి విదురుడితో కలిసి కుంతి ఇంటికి వెళ్ళాడు'' అన్నాడు. కన్నకొడుకులు అడవుల పాలై దాయాదుల ఇంట తినడానికి బాధపడుతూ ఉన్న కుంతికన్నులకు ఇదే మొదటి పండగ అన్నాడు వృద్ధుడు. తర్వాత దుర్యోధనుడి ఇంటికెళ్ళి అక్కడ ఎంత వేడినా విందారగించకుండా విదురుని ఇంటికి వెళ్ళాడు, నేను తిరిగి వస్తాను అని అన్నాడు ద్వివేది. శ్రీకృష్ణుడు వెళ్ళేటప్పటికి రారాజు ఏమి చేస్తున్నాడన్న తండ్రితో ద్వివేది కర్ణశకుని సైంధవ ప్రముఖులతో కొలువు తీర్చివున్నాడన్నాడు. వృద్ధుడు దానికి 'శ్రీకృష్ణుడు దుర్యోధనుడిని అనాదరించాడు, మొదట నుండి కృష్ణుడికి పాండవులంటే ఎక్కువ. ఆ కారణంగానే బలరాముడు తన కుమార్తెను అభిమన్యుడికి ఇచ్చి వివాహం చేయటానికి అంగీకరించక దుర్యోధనుడి కుమారుడైన లక్ష్మణ కుమారునకు ఇవ్వాలని ఆశించాడు. ఆ పెళ్ళికని వెళ్ళిన రాజులకేమైంది. చావు తప్పి వచ్చారు. ఘటోత్కచుడు అర్జునుడి కుమారుడికే పెళ్ళిచేశాడు కదా'' అన్నాడు. అంతక్రితం సుభద్రను కూడా బలరాముడు దుర్యోధనుడికే ఇవ్వాలనుకుంటే కృష్ణుడే అర్జునుడికిచ్చి వివాహం చేశాడని విన్నాను, ఇంక నాకు శెలవివ్వండి, ఋషులనందరినీ సభకు తీసుకు వెళ్ళాలని ద్వివేది అనగా వృద్ధుడు రాయబారపు సభకేనా, భీష్మాది కులవృద్ధులు, ద్రోణ కృపాశ్వత్థామాది గురువులు, శకుని మొదలైన బంధువులు, కర్ణవికర్ణాది సామంతరాజులు, దుర్యోధనాది కుమారులు గల ఈ కొలువే ధృతరాష్ట్రుడు జరిపిన సభలన్నింటిలో నిండైన సభ అని నేనూ వెళ్ళనా అయినా ఎందుకు కనలేను, వినలేను అనుకుంటాడు.

ఈ సంభాషనంతా తిరుపతి వేంకటకవుల కల్పన. ప్రదర్శించటానికి వీలులేని భాగాలని అర్థోపక్షేపకాలుగా ప్రదర్శించాలి. అర్థోపక్షేపకాలలో ఒకటైన విష్కంభమిది. ప్రేక్షకుడికి జరిగిన దానినంత ఇద్దరి సంభాషణల ద్వారా తెలియజేశారు కవులు.

కురుసభకు ధృతరాష్ట్రుడు, భీష్మద్రోణులు, గాంధారి కలసి ప్రవేశిస్తారు. విదురుడు సాత్యకులతో కలిసి శ్రీకృష్ణుడు, ఆ వెంట దుర్యోధనాది దుష్టచతుష్టయ కృపాశ్వత్థామ వికర్ణులు ప్రవేశిస్తారు. భీష్ముడు కృష్ణా నీవు ఆసనం స్వీకరించమంటే కృష్ణుడు అన్ని దిక్కుల నుంచి మహామునులు అనేకమంది వచ్చి ఉన్నారు. ముందు వారికి ఆసనములేర్పాటు చేసి తర్వాత మనం కూర్చోవటం సముచితమని ఆకాశం వైపు చూసి ఆకాశం నుంచి కూడా మునీంద్రులు వచ్చారనగా నారదుడు ప్రవేశిస్తాడు. అందరూ కూర్చుంటారు.

కృష్ణుడు నవ్వుతూ ధృతరాష్ట్రుడితో "మామా! కౌరవులకు, పాండవులకు సంధిచేసి రాజులనందరినీ రక్షించమని నిన్ను అర్థించటానికి పాండవదూతగా నీ దగ్గరకొచ్చాను. నీ తమ్ముడి కుమారులు సగభాగం ఇవ్వమన్నారు. కాదంటే ఐదుగురికీ ఐదు ఊర్లయినా ఇవ్వమన్నారు. ధర్మంగా నీకు తోచినట్లు చేయి. నీ కొడుకుల మాటవింటావో, లేకపోతే ఈ కొడుకులతో ఎందుకని నీవు స్వతంత్రిస్తావో ఒకదారిని ఎంచుకో. చదువు, నీతి, శాంతి, దాంతి, ఖ్యాతి, యుద్ధ నైపుణ్యం గల రాజులందరూ కీర్తించే కులం మీ కులం. మీవారందరూ నిత్యసత్యదయాశీలురు అనే కీర్తి నిలుపుకో. పాండవులు పతితులు కారు, నీ పట్ల భక్తి కలవారు, శుంఠలు కారు. విద్యలన్నీ నేర్చినవారు, మంచి వారు, రాజుకు తలలోని నాలుకవంటివారు. కృష్ణుడికి ఇష్టులు, యుద్ధంలో శూరత్వం చూపేవారు. అటువంటి పాండవులు దీనులై అడుగుతుంటే ఇంక నీకు సంశయమెందుకు? పాండవులు ద్రౌపది వేరువేరుగా చెప్పిన మాటల సారం నీకు చెప్పాను'' అన్నాడు. దానికి ధృతరాష్ట్రుడు "అల్లుడా, కృష్ణా! అన్నీ తెలిసి కూడా నా మీద నెపం పెడుతున్నావు. గ్రుడ్డివాడనవటం కారణంగా రాజ్యాన్ని పాండురాజు కొంతకాలం పాలించాడు. కొడుకులు ఇప్పుడు పరిపాలిస్తున్నారు. ఈ కారణంగా నాకు మాట కూడా

గ్రుడ్డిదయ్యింది. కొడుకులు తండ్రుల మాట జవదాటరు అనటానికి మా వంశం జనించిన దగ్గరి నుండి ఈ భీష్ముడే చివరి వాడు'' అన్నాడు. విదురుడు ధృతరాష్ట్రుడితో "అన్నా, నిన్న శ్రీకృష్ణుడి రాక విని సంతోషంతో అదిస్తా, ఇదిస్తా నన్నావు కదా, ఆ ఐదూళ్ళు కృష్ణుడికే ఇచ్చాననుకొని ఇవ్వరాదా, మళ్ళీ మనకిలాంటి సమయం రాదు, ఆలోచించుకో అన్నాడు. ధృతరాష్ట్రుడు విననట్లే ఊరుకున్నాడు. కృష్ణుడు మనస్సులో ఈ ధృతరాష్ట్రుడు తన వాక్ చాతుర్యాన్ని చూపిస్తున్నాడనుకొని పైకి "నాకు తెలుసు, అయినా పెద్దవాడివని చెప్పాను. అంత గొప్ప కులంలో పుట్టి మహాత్ములైన పాండురాజు సోదరుడవై పాలించిన నీవు చేసిన పాపమేదో కష్టంగా రానుంది. దీనిని ఎలా దాటగలవో, నీవు చెప్పగలిగినంత చెప్పి చూడు. పాండవులచే సేవలే చేయించుకుంటావో, యుద్ధమే చేయించుకుంటావో నీ చేతిలోనే ఉంది. వారు రెండింటికీ సిద్ధంగానే ఉన్నారు'' అని చెప్పాడు. ధృతరాష్ట్రుడు నేను చెప్పగలిగినంత నీ ఎదుటే ఉపదేశిస్తాను అన్నాడు.

కర్ణుడు "కృష్ణా! అతడు పాపమే చేశాడో పుణ్యమే చేశాడో అది ఇప్పుడు ఆలోచించవలసినది కాదు. అధిక ప్రసంగం చేయటానికి కూడదు, దూతవై వచ్చినవాడివి నీవు చెప్పవలసిందేదో చెప్పు'' అన్నాడు. భీష్ముడు కోపంగా కృష్ణుడి మాటకేమి, నీకెవరు ఈ అధిక ప్రసంగం చేసే అధికారమిచ్చారు అన్నాడు. ద్రోణుడు కూడా కర్ణుడిని ఎదుటి వారి శక్తి తెలియకుండా న్యాయం విడిచి రారాజుకు స్నేహితుడినని నోరెలా వస్తే అలా ప్రేలటం ఎవరు మెచ్చుతారు. నలుగురు నడిచే దారిలో వెళ్ళకుండా ఉండటం ఎక్కడి పాపకర్మో కదా అన్నాడు. దుర్యోధనుడు కర్ణుడికి ఊరుకోమని కనుసైగ చేసినా ఊరుకోక ఎగతాళిగా ద్రోణుడితో "ముసలితనంతో మదితప్పి భీష్ముడితో పాటు నీకూ మతిపోయిందా ఏంటి? కూడు, గుడ్డ ఇచ్చే రాజును ఎవరో ఒకడు వచ్చి తిడుతుంటే చూస్తూ ఊరుకోవడానికి భీష్ముడో, ద్రోణుడో కాడీ కర్ణుడు. లోపలొక మాట పైనొక మాట కాక ప్రాణాలైనా ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నాడీ కర్ణుడు'' అన్నాడు.

ద్రోణుడు వెంటనే "భీష్ముడి వృద్ధత్వం, నీ తారుణ్యం గురువైన పరశురాముడే ఎరుగును'' అన్నాడు. అశ్వత్థామ కర్ణుడితో "సుయోధనుడి దయతో అంగరాజ్యాధిపతివై సేవకుడవైన నీకు వర్తించే ధర్మాలు భీష్మ ద్రోణులకు ఉపదేశిస్తున్నావా? న్యాయపక్షపాతులకు రాజు మనసును అనుసరించాల్సిన అవసరం లేదు. రారాజు సభలో చేయకూడని పనులు నీ సాహచర్యం కారణానే చేశాడు. నువ్వు ఇంత మిడిసిపడటానికి కారణం చెప్పు కర్ణా'' అన్నాడు. అప్పుడు వికర్ణుడు అశ్వత్థామతో "న్యాయపక్షపాతులు అనేది ఈ భీష్ముడు మొదలైనవారికి వర్తించేది కాదు. ద్రౌపదిని నిండు కొలువులోకి ఈడ్చి దుర్మదంతో వస్త్రాలు వలుస్తుంటే, దాసీ ఈ సభలో ఇక్కడ కూర్చో అని తొడ చూపించగా రాజు భయం దిగత్రావి రాజుతో ఇది చెడుపని అని చెప్పగలిగారా?'' అన్నాడు. దానికి అశ్వత్థామ "అది గొప్ప పని అని ఏమైనా ఆ రోజు దుర్యోధనుడిని పొగిడారా, నువ్వు ఏదో నాలుగు ధర్మ వాక్యాలు ఆ రోజు చెప్పినంతనే వారి కన్నా పెద్దవాడివయ్యావా? దీనికంతకూ నీ తండ్రే కదా కారణం. మదించిన వారు కన్ను గానక సాహసకృత్యాలు చేసే సమయంలో ధర్మవచనాలు వింటారా, అప్పుడు ఊరుకోవటమే పెద్దలకు ఉత్తమం. చేయరాని పనులు చేసి కులానికంతా కీడు తెచ్చారు. పాండవులు దాని ఫలితంగానే రారాజు మీదికి యుద్ధానికి వచ్చారు. దుర్యోధనుడు సకుటుంబంగా నశించే ఉపాయం కర్ణుడికి మాత్రమే తెలుసు. కక్ష మాన్పి సంధి చేయటానికి వచ్చిన కృష్ణుడి మాటలు వినకుండా రాజభక్తంతా వెల్లడి చేసినట్లుగా ఈ కర్ణుడు గొడవపడటం ఎందుకు?'' అన్నాడు. కర్ణుడు ఎగతాళిగా "పాండవులు యుద్ధం చేయవచ్చారని కృష్ణుడి మాటకు భయపడి దుర్యోధనుడు తన వీరత్వాన్ని నీళ్ళపాలు చేసేవిధంగా భయపడటానికి కర్ణుడు చేతకానివాడుకాడు'' అన్నాడు. అశ్వత్థామ పట్టరాని

కోపంతో "కర్ణా, ఇంకెన్ని రోజులు ఇలా బీరాలు పలుకుతావు. భయంకరమైన యుద్ధంలో అర్జునుడు వేలబాణాలు వేస్తూ, పారిపోయే నిన్ను నిలుమో కర్ణా అంటూ వెన్నంటకుండా ఉంటాడా?" అన్నాడు.

ధృతరాష్ట్రుడు 'మనమందరం పని మీద వచ్చిన కృష్ణుని పని పూర్తి చేసి పంపాలి అని చూడాలి కదా, ఇలా మీలో మీరే అకారణంగా పోట్లాడుకోవడం ఏమిటి, పెద్దవాడనైన నామాట వినండి' అని సుయోధనుడు ఎక్కడ అని చేతులతో వెదికి దగ్గరకు రమ్మనాడు. దుర్యోధనుడు తనలో ఇతడేవో పనికి మాలిన మాటలు ఉపదేశిస్తాడు, కాని వినాలి అనుకొని తండ్రి దగ్గర కూర్చుంటాడు. ధృతరాష్ట్రుడు కొడుకుని దగ్గరకు తీసుకొని "కుమారా! ఇంద్రియాల మదాన్ని మొదలంట త్రుంచి, మనసును నిగ్రహించి, త్రిగుణాతీతులైన మునీంద్రులే ఎవరి రూపు చూడాలని కోరుకుంటారో అతడే దూతయై మన దగ్గరకు వచ్చాడు. ఆ పుణ్యాత్ముడి మాటలు విని సమాధానం చెప్పు" అన్నాడు. దుర్యోధనుడు "ఈ రోజు కొత్తేముంది, ఆ రోజు సంజయుడు చెప్పిన మాటనే ఇతడూ చెబుతాడు. అందుకు నేనొప్పుకోనని తెలియని వారెవరున్నారు" అన్నాడు. దానికి ధృతరాష్ట్రుడు "భీష్మ ద్రోణ కృతాశ్వత్థామ మొదలైన వారందరూ సంధికి అంగీకరించడానికి కృతనిశ్చయమై ఉన్నారు. పాండవులైనా ఐదూళ్ళిస్తే చాలంటున్నారు. అన్యాయంగా దాయాదుల పట్ల ఈ ద్వేషమెందుకు? యుద్ధం చేస్తావా? నీకు కర్ణుడు మొదలైనవారున్నారు కదా ఇంక భయమెందుకనే ధైర్యమేమో, నేడు అర్జునుడికి సాటి అయిన వారెవరో చెప్పు" అన్నాడు. గాంధారి కూడా "కుమారా! మీ తండ్రి మాటలు విను. అనేక దేశాలుండగా ఐదూళ్ళు వారికిస్తే నీకు తగ్గేదేముంది, పెద్దల మాటలెందుకు నిరాకరిస్తావు? చాలాకాలం నుండి ఈ కురువంశంలో రాజ్యం చిన్న కుటుంబమందే నిలుస్తుంది. యయాతి కొడుకులలో పెద్దవాడైన యదువుండగా అతడి మదోన్మత్తత కారణంగా చిన్నవాడైనా పితృభక్తి కలిగిన పూరుడు రాజయ్యాడు. మీ ముత్తాతలు దేవాపి, బాహ్లిక, శంతనులలో పెద్దవాడు రోగగ్రస్తుడవ్వటం చేత చిన్నవాడైన శంతనుడే రాజయ్యాడు. తర్వాత దేవవ్రతుడు పెద్దవాడైనా మీ తాతగారైన విచిత్రవీర్యుడికే రాజ్యం వచ్చింది. మీ తండ్రి విషయంలో కూడా పాండురాజు పాలనచేయటం నీకు తెలియంది కాదు. కనుక లోభం విడిచి మీరూ మీరూ కలిసి అనుభవించటం మంచిది. మమ్మలిని తుట్టతుదకు దిక్కులేని వాళ్ళుగా చేయద్దు? పెద్దలమాట విని బ్రతుకు" అని చెప్పింది.

ధృతరాష్ట్రుడు "ఇంకో విశేషం చెబుతాను విను, అజాతశత్రువైన ధర్మరాజు కోపిస్తే లోకాలు భస్మమవుతాయి. యుద్ధం వద్దు నాయనా" అని అందరూ వినేవిధంగా చెప్పి దుర్యోధనుడికి వినిపించే విధంగా "మీ అమ్మ మాట నిజం, పూర్వం నుంచి చిన్నవాళ్ళే రాజులవుతున్నారు. అలాగే ధర్మరాజు అవుతాడు. కనుక నువ్వు మారు మాట్లాడకుండా సంధి కొప్పుకో, లేకపోతే సర్వం కోల్పోయి అనేక కష్టాలు కలుగుతాయి" అన్నాడు. గాంధారి "నాయనా! వారు తమ భాగం కోసం పోరాడేవారే కానీ, అధర్మపరులు కారు. ధర్మమే జయిస్తుందంటారు. అంతేకాక పెద్దలైన భీష్ముడు మొదలైనవారు న్యాయపక్షపాతులు. న్యాయంగా 12 ఏళ్ళు అరణ్యవాసం, 1 సంవత్సరం అజ్ఞాతవాసం చేసి తమ తండ్రి భాగం కోసం యుద్ధం చేయగలిగి కూడా ఐదూళ్ళిచ్చినా చాలని కృష్ణుడిని పంపారు. అలాంటి ధర్మాతుల ముందు శివుడు కూడా నిలువలేడు. విష్ణువు కూడా వారివైపే ఉన్నాడు. కనుక నీ నూరుమంది తమ్ముళ్ళను రక్షించుకొని పాండవులతో కలిసి జగత్తునంతా పాలించుకో" అంది.

దుర్యోధనుడు "తల్లిదండ్రుల్లారా, మీరు చెప్పవలసిన వారు కనుక చెప్పారు. ఐదూళ్ళిస్తే చాలునని కబురుపంపితే నేను ఇవ్వదలిస్తే వారు ఓడినట్లే కదా. ఒకవేళ పెద్దలమాట కాదనక ఇచ్చానే అనుకోండి, మొదటి నుండి మేము మేము పరస్పరం అపకారం చేసుకున్నవాళ్ళం ఇప్పుడు కలిసి స్నేహంగా ఎలా ఉండగలం? ఉన్నా లోపల పగ, బయట స్నేహమే కదా. వారు బలవంతులు మిమ్మల్ని అంతం చేస్తారని కలలో కూడా అనుకోవద్దు. వాళ్ళు బలవంతులైతే యుద్ధం చేయరా, నలుగురు చూస్తుండగా భార్య పరుల చేత అవమానించబడుతుంటే చూస్తూ ఊరుకుంటారా, మమత, సిగ్గు, మానం , అవమానం లేని వారి స్నేహం తగినదేనా, రాజులందరూ అలాంటి వారితో స్నేహం చేస్తే నవ్వరా? కర్ణుడు, నేను, తమ్ముళ్ళు యుద్ధంలో నిలిస్తే ఇంద్రుడైనా ఎదురు నిలువగలడా? బలం కలిగిన రాచబిడ్డలయితే ధర్మమని పన్నెండేళ్ళు అరణ్యవాసమేళతారా? అంతేగాక తమ్ముడి కొడుకులని భాగం ఇవ్వమంటున్నావు, నీ తమ్ముళ్ళు ఎవరు? యముడు, వాయుదేవుడు, ఇంద్రుడు, అశ్వనీదేవతలా లేక పాండు రాజా? చెప్పు తండ్రీ" అన్నాడు.

గాంధారి "నాయనా, నీకా అప్రస్తుత ప్రసంగమెందుకు? తీగలాగితే డొంకంతా కదులుతుంది. ధర్మశాస్త్ర ప్రకారంగా వాళ్ళకు భాగం లేదంటే ఆ మాటలు చెప్పి సభలోని వారిని ఒప్పించు" అంది. అప్పుడు జమదగ్ని రహస్యంగా జాబిలితో "ఈ గాంధారి చాతుర్యం చూశావా, పాండవులని ఆక్షేపిస్తే తన కొడుకులను ఎవరైనా గోళకులని నిందిస్తారేమో అని ఆ ప్రస్తావన ముగించమంది. కానివ్వు సభలో పతివ్రతలను అవమానించటం మనకెందుకు" అన్నాడు. అప్పుడు జాబిలి "మొదట ఈ గాంధారిని వివాహం చేసుకున్నవాడు మరణిస్తాడంటే ముందు ఒక గాడిదకిచ్చి వివాహం చేశారంట. తర్వాత ధృతరాష్ట్రుడికి వివాహం చేశారు. ఎలా చూసినా గొప్పవారి చరిత్రలు విచిత్రంగా ఉంటాయి. అందులోనూ కౌరవులది మరీ విచిత్రం" అన్నాడు.

దుర్యోధనుడు తల్లితో "తల్లీ! ధర్మమంటున్నాడు, రాజ్యం పెద్దవారి కుటుంబానిదే కానీ, చిన్నవారి కుటుంబానిది కాదు. తండ్రి అవివేకం కారణంగా పాండవులకు అర్ధ రాజ్యం వచ్చింది. కాబట్టే వారిప్పుడు నా మీదకే యుద్ధానికొస్తున్నారు. ఇది అధర్మం. నీవు చెప్పినట్లుగా ధర్మమే గెలిచే పనైతే జయం నాకే కలుగుతుంది. నాకు ఆ ధర్మశాస్త్రం గోల ఎందుకు? యుద్ధంలో జయం కలిగినా, పరాజయం కలిగినా నా నిర్ణయం విను. నేను గెలిస్తే ఈ జగతిని పరిపాలిస్తాను, శత్రువులు గెలిస్తే స్వర్గ సుఖాలు అనుభవిస్తాను. కృష్ణుడి మాటలకు భయపడి మీరు చెప్పిన ఉపదేశం వినలేదని బాధపడకు. రాజరాజు అనే నామం సార్ధకమయ్యేటట్లుగా, నా పేరు జగతిలో నిలిచేటట్లుగా దీవించు" అన్నాడు. ధృతరాష్ట్రుడు "కుమారా! నీవు యుద్ధం గురించి కృతనిశ్చయుడవై ఉన్నావు. తోక తొక్కిన నాగుబాములా నీపైకి దూకబోతున్న పాండవుల బలపరాక్రమాలను తలిస్తే నా కడుపులో చెయ్యిపెట్టి కలిచినట్లవుతుంది. భరతకులం నిలపమని తల్లి అయిన సత్యవతి వేడిందని వేదవ్యాసుడు మన సంతతి నిల్పాడు. తాత సంసారం అసహ్యించుకొని కూడా పరవశంతో పెంచాడు కదా. దానిని కుటుంబ కలహాలతో నేడు త్రుంచుతావా?" అన్నాడు.

గాంధారి "నాయనా! భీముడు, జరాసంధుడు, హిడింబాసురుడు, కీచకులను చంపాడని విన్న దగ్గర నుంచి నా కడుపు మండుతుంది. మీ సమాధ్యాయులైదుగురిలో ఒక్కడి చేతిలో మిగిలిన నలుగురూ చావగలరని మీ గురువు శపించాడని విన్నాను. అందులో భీముడి చేతిలోబడటానికి నీవు ఒక్కడివే మిగిలి ఉన్నావు. కాబట్టి సంధి చేసుకుని నీ ప్రాణాలు నిలుపుకో. మమ్మల్నీ దుఃఖ సాగరాన్ని దాటించు" అంది. దుర్యోధనుడు "తల్లీ! తిని కూర్చోకుండా ఎందుకిలా అమంగళం

మాట్లాడుతున్నారు, భరతకులానికి లోపమేమీ లేదు. రెండువైపుల వారు చావటం ఎక్కడైనా ఉందా? సంధి చేసుకుంటే చావు తప్పుతుందా? గురుడి వాక్యం నిజంగా జరిగితే చావు తప్పుతుందా? నేను ఇలాంటివాడినని చెప్పుకోకూడదు. కానీ మీ సందేహాలు తీర్చటం కోసం చెబుతున్నాను. ద్రోణుడు, కృపుడు, భీష్ముడు ఎంత బలవంతులని భావిస్తారో నన్నూ అలాగే అస్త్రశస్త్రాలు, బాహుబలం, ధైర్యం, స్థైర్యం, శౌర్యాలలో అంతేనని భావించండి. మీరు ఎంతసేపు సంజయుడి మాటల ప్రభావంతో వారికి దేవతలు కూడా సహాయం చేస్తారని చెబుతున్నారు. అది పొరపాటు. కామక్రోధాలకు వశమై దేవతలు ఎప్పుడూ ప్రవర్తించరు. అలా ప్రవర్తిస్తే వారికి దైవత్వమే ఉండదు. కాబట్టి వాళ్ళు మనుషులే, మేమూ మనుషులమే. అన్ని రకాలుగా బలపరాక్రమాలో ఎక్కువ. భవిష్యత్తు నేను ముందే నిర్ణయించాను. దానిని విని స్థిమితపడండి. యుద్ధంలో పాండవులనందరినీ సంహరిస్తాను. ద్రౌపదితో కూడి యజ్ఞాలు చేసి అందరూ మెచ్చేవిధంగా బ్రాహ్మణులకు బంగారం, మణులు, అగ్రహారాలు దానం చేస్తాను" అన్నాడు. ధృతరాష్ట్రుడు తనలో అమంగళం శాంతించునుగాక అనుకున్నాడు.

కర్ణుడు గాంధారితో "అమ్మా! తాపసికి పుట్టాడు కాబట్టి ధృతరాష్ట్ర మహారాజు యుద్ధానికి వెనుదీయమని కొడుకులతో మాట్లాడుతున్నాడు. పరువైన క్షత్రియకులంలో పుట్టిన నీవెందుకు ఇలా చెబుతున్నావు?" అన్నాడు. ధృతరాష్ట్రుడు తనలో ఈ సూతపుత్రుడి స్నేహమే నా కులానికి చేటు తెచ్చింది అనుకొని కోపంగా "ఓరీ! కర్ణా! ఇంకేమి చేయిస్తావురా, నువ్వు నీళ్ళు పాలులాగా కలిసి ఉండాల్సిన పిల్లలకు పగ తాగించావు. ధర్మరాజును రప్పించి జూదమాడించావు, ద్రౌపదిని సభలో కీడ్పించి బట్టలు ఊడదీయించినది నువ్వే. తిండి బట్టలకు దూరం చేసి పాండవులను అడవులకు పంపావు. సంధి చేయడానికి వచ్చిన కృష్ణుడితో అడ్డదిడ్డంగా మాట్లాడావు. నీకిష్టమొచ్చినట్లుగా చేయించు, ఔరా! భరతవంశం బ్రతుకు నీ పాలపడింది కదా!" అన్నాడు. గాంధారి "మన సంతానాన్ని మందలించలేక ఇతరులను నిందిస్తే ప్రయోజనమేముంది? మీరన్నది మాత్రం సత్యమే. అర్జునుడిని గెలవగలననే కర్ణుడి ప్రగల్భాలే దుర్యోధనుడు ఇలా తెగించడానికి కారణం" అంది. వికర్ణుడు "రాజా! నీ కుమారుడు దుర్యోధనుడితో స్నేహం చేసిన కర్ణుడికి తగిన బిరుదునిచ్చావు. రాజువు నీ కన్నకొడుకుతో సమానంగా పెంచావు. మా కుటుంబం కోసం నీ మాటలకు ఎదురు చెప్పకూడదు. కానీ నీకు తెలియని పని ఎవరు చేశారో చెప్పు. పాండవుల పట్ల నిజంగా నీకు అంత వాత్సల్యముంటే పరాయివాళ్ళను తిట్టడమెందుకు? వారిని పిలిచి ఈ రోజు మొత్తం ఇవ్వడానికి నీకు స్వతంత్రం లేకుండా ఉన్నావా? ఇలా ఎందుకు అతిథి చేత పాముని చంపించే నేర్పరితనంతో మాట్లాడుతున్నావు? మీ వారు అందరూ వింటున్నారనా? అంతేగాక భూమి మీదున్న రాజులందరినీ జయించిన పాండవుల సంపద చూసి ఓర్వలేక శత్రుత్వం పూనిన నీ కొడుకు వారికి చేసిన అపరాధాలన్నీ కర్ణుడిపైన వేయటం తగినదేనా?" అన్నాడు.

దుర్యోధనుడు "కుమారా, వికర్ణా! ముసలితనంతో మదితప్పిన ఈ రాజు మాటలకు అభిమానపడుతున్నావెందుకు" అని తండ్రితో "తండ్రీ! నా బహిఃప్రాణమైన కర్ణుడినంటే ఒకటి, నన్నంటే ఒకటా? ఇంకోసారి ఇలాంటి వినలేని మాటలతో నిందిస్తే చివరిదాకా గాంధారి కడుపుమండుతుంది. పాండవులకు భూమంతా వశమవుతుంది, నీ కోరిక తీరుతుంది" అన్నాడు. కర్ణుడు చెవులు మూసికొని "పాపం శాంతించుగాక, మిత్రమా! మహారాజు మాటకు నా మనసు విరుగుతుందనా ఇలాంటి మాటలు మాట్లాడుతున్నావు. చాలింక, ఇన్నాళ్ళు స్నేహం చేసినా నా మనోనిశ్చయం గుర్తించలేకపోయావు. ఏడు సముద్రాలు ఒకటై భూమి క్రుంగినా, ఆకాశం వంగినా, పర్వతాలు పగుళ్ళిచ్చినా, లోకం తెల్లవారిన, కర్ణుడి శరీరంలో

ప్రాణం ఉంటే అర్జునుడి చావు తప్పుతుందా"? అన్నాడు. ధృతరాష్ట్రుడు గాంధారితో నెమ్మదిగా "గాంధారీ! కుంతి కొడుకులు ఇంత కూడుపెడితే బ్రతకమని బ్రహ్మ మననొసటన రాశాడేమో. వీడు ఒక్కకొడుకుని కూడా బ్రతకనివ్వడు" అన్నాడు. గాంధారి "దుర్యోధనా, దుశ్శాసనా! మాకెందుకు తినటానికా, దాచుకోవటానికా కాలం తీరిన ముసలివాళ్ళం మాకేం కావాలి, ఏం చెప్పినా మీ మంచి కోసమే కదా. మీ అభివృద్ధి చూస్తూ ఇంకా కొన్నాళ్ళు బ్రతకాలనుకున్న తల్లిదండ్రులను ఈరోజే చంపుతున్నారా?" అని మూర్ఛబోయింది.

విదురుడు "సుయోధనా! నీవు వినవని తెలిసి కూడా కొంచెం ఉపదేశించి నా మనసులోని తాపాన్ని కొంత ఉపశమింపజేసుకుంటాను. తల్లి, తండ్రీ, ప్రజలకు తప్పనిపించిన పనికి నీ మనసు బాధపడదు. అల్లరిమూక మాట విన్చావా? తమ్ముళ్ళు, పిల్లలు చల్లగా ఉండే మాట వినవు. అయినా సభలో ఏది చేయవచ్చు, ఏది చేయకూడదని విచారించేటప్పుడు ఎక్కువమందికి సమ్మతమైనదే చేయాలని శుక్రచార్యుడు చెప్పిన రీతినైన అనుసరించు, ఇక్కడ అందరికీ నీ పద్ధతి, పాండవుల పద్ధతి తెలుసు. ఎక్కువమంది ఎవరి మార్గం మంచిదంటారో దానిని అనుసరించి సభాసదులు చెప్పింది చెయ్యి. దానికి అంగీకరిస్తే అందరి చావు తప్పుతుంది. కాదు అంటే ఇంకో మార్గం చెబుతాను. రెండు పక్షాల నుంచి ఒకరొకరిని ఎంచుకొని వారికి ద్వంద్వ యుద్ధం ఏర్పరచి వారిలో ఎవరు గెలిస్తే ఆ పక్షం గెలిచినట్లుగా నిర్ణయించాలి. నువ్వు అర్జునుడితో యుద్ధం చేయగలవాడు కర్ణుడని పేరాసతో ఉన్నావు. కాబట్టి వీరిద్దరికి పోరాటం పెట్టు, అప్పుడు యుద్ధం ఉండదు, జగత్తంతా సంతోషిస్తుంది" అన్నాడు. భీష్ముడు "దుర్యోధనా! వినేపనైతే ఈ విదురుడి మాటలు మంచి మాటలు. కర్ణుడికి అర్జునుడితో యుద్ధం చేయటం ఇష్టం. కర్ణుడి చేత అర్జునుడిని ఓడించటం నీ కోరిక. ఈ రెండు కోరికలు తీరుతాయి కదా! ఇద్దరి కోసం రాజులందరూ బాధపడటం పోయి భార్యా బిడ్డలతో సంతోషంగా ఉంటారు. అది అలా ఉంచితే ఇంకో నిజం విను. ఎప్పుడో పుట్టాము, ఎప్పుడో పెరిగాము, ముసలివాళ్ళం. మాకు యుద్ధమెందుకు? భగవన్నామం తల్చుకుంటూ బ్రతుకుతాము" అన్నాడు.

దుర్యోధనుడు "తాతా! ముసలివాడివి కాకపోయినా నువ్వు మాకు సహాయపడతావనుకున్నామా ఏంటి? ద్వంద్వ యుద్ధంలో అర్జునుడిని ఓడించినా ఫలితమేముంది? చావని మిగిలిన నలుగురు మాకు నాలుగూళ్ళిచ్చిన చాలు అనరా! మళ్ళీ అప్పుడు మీరందరూ చెప్పరా, జూదంలో పోగొట్టుకొనిన భాగమంతా వీరుల్లాగా పొందాలని చూడరా! అంతేకాదు ఐదుగురూ మాకు శత్రువులే. అర్జునుడొక్కడే మాకు చేసిన కీడేముంది? బ్రతికితే ఐదుగురూ బ్రతకాలి, చస్తే ఐదుగురూ చావాలి" అన్నాడు. ద్రోణాచార్యుడు చిరునవ్వు నవ్వి "సుయోధనా! వెర్రివాడివి, కర్ణుడు అర్జునుడిని జయిస్తాడనే అనుకుంటున్నావా, అతడి బలపరాక్రమాలు నీకేం తెలుసు. శివుడిని యుద్ధంలో ఎదుర్కొని పాశుపతాస్త్రాన్ని పొందాడు. స్వర్గలోకమెళ్ళి ఇంద్రుడి సింహాసనంపై కూర్చున్నాడు. రాజులందరినీ గెల్చి తన అన్న చేత అశ్వమేధం చేయించాడు. నీ ఆశేకాని కర్ణుడు యుద్ధంలో అర్జునుడిని తాకగలడా? విరటుడి పశువులను పట్టుకున్నప్పుడు అతడి ఒక్కడిధాటికి మనందరి గతి ఏమైందో, మనం ఎలా పారిపోయామో మరిచారా" అన్నాడు. దుర్యోధనుడు "ఆచార్య! అన్నీ తెలిసిన మీరే అలా అంటే నేనేమి చెప్పగలను. పాండవపక్షపాతం మీ అభిప్రాయం మార్చిందా, అర్జునుడు మీకంటే బలపరాక్రమాలు కలిగినవాడా? ఎప్పుడో అయిన యుద్ధం మాటెందుకు, మీకు ఈవిధంగా దయకలిగితే నేనేమి చేస్తాను. మీరందరూ పాండవులతో సంధి చేయమనటం కంటే రాజ్యమంతా పాండవులకిచ్చి మమ్మల్నే అరణ్యాలకు పొమ్మనటమే ధర్మం. జవదాటరాని మీ ఆజ్ఞతో

సంధి చేశాననుకోండి ఇద్దరు స్వతంత్రులు ఒక దేశం పాలించగలరా? ముదిరిన రెండు చెట్లు అంటుగడతాయా? రెండు కత్తులు ఒక ఒరలో ఇముడుతాయా'' అన్నాడు. ద్రోణాచార్యుడు "దుర్యోధనా! మేము పాండవుల పట్ల కానీ, మీ పట్ల కానీ వ్యతిరేకభావం కల్గినవాళ్ళం కాదు. భీమార్జునుల బలం తెలిసినవాళ్ళం కనుక ఇలా చెబుతున్నాము. ముసలివాళ్ళం, సంపదలనుభవించాం, మేము బ్రతకాలని ఈ యుద్ధం వద్దని చెపుతామా'' అన్నాడు.

దుర్యోధనుడు నమస్కరించి "మా తల్లి, తండ్రి, తాత, మీరు చెప్పటం మా మేలుకోసమే ఎలా శత్రువులతో సంధి చేసుకుంటాము. చావనేది ప్రాణులకు తప్పనిదే. దానికి భయపడటం న్యాయమా, అవమానం కదా అది. చస్తామో లేక శత్రువీరులను చంపుతామో ఎవరికి తెలుసు. రాదలిస్తే వచ్చి యుద్ధం చేసి ధైర్యం పెంచండి, శత్రువులను జయించండి, ఇదే నా ప్రార్ధన'' అని నమస్కరించబోయాడు. అప్పుడు కర్ణుడు దుర్యోధనుడిని లాగుతూ స్నేహితుడనైన నాకు కూడా సిగ్గుచేటైన పని చేస్తున్నావు. బ్రాహ్మణుడు, గురువని నమస్కరించవచ్చుకానీ యుద్ధానికి సహాయం చేయమని బ్రాహ్మణుడిని ప్రార్ధించవచ్చా, యుద్ధం రానీ గాక, నీ మిత్రుడు కర్ణుడు చచ్చాడా, ఇలా దైన్యం పొందటం ఎందుకు?'' అన్నాడు. అప్పుడు అశ్వత్థామ కోపంతో అయితే ఈరోజే చచ్చావురా అని మీదికి దూకబోగా కృష్ణుడు అడ్డుపడి "కోపించకు అశ్వత్థామ, రణచక్రమంతా తన చేతిమీదే తిప్పాలనే కర్ణుడి కోరికే తీర్చు. సేవాధర్మం. సూతధర్మం కలిసిన కర్ణుడి మాటలకు మీకు కోపమెందుకు? రాజు ఎప్పుడు మిమ్మల్ని పిలిస్తే అప్పుడే యుద్ధానికి వెళ్ళి పోరాడండి. కర్ణుడి చావు వరకో లేక చివరిదాకానో యుద్ధాన్ని విడిచిపెట్టండి'' అన్నాడు.

కర్ణుడు కృష్ణా ఆపద్దు రానివ్వు ఏం చేస్తాడో చూద్దాము అన్నాడు. అశ్వత్థామ కోపంతో ఏమి చేస్తానా, ఈ పిడికిలితో నీ తల వేయి ముక్కలు చేస్తానని కృష్ణుడిని తప్పించుకోబోయాడు. దుర్యోధనుడు అశ్వత్థామను అనునయిస్తూ "కోపం ఎందుకయ్యా, మాకందరికీ ఉపయోగకరమైన దారిలో వెళ్ళు యుద్ధం చేయటానికి. కోపం శత్రువులపై చూపించి వారిని చెండాడు. మనలో మనకీ పోరాటం న్యాయమేనా'' అన్నాడు. దానికి అశ్వత్థామ "మూఢ దుర్యోధన, ఇంకా సిగ్గులేకుండా నన్ను అనునయించటానికి వచ్చావా, యుద్ధంలో సహాయం చేయమని కోరదగనివాడా గురువు. ఈ కర్ణుడు నిన్ను ఆజ్ఞాపించేది. అతడు చెబితే నువ్వు నమస్కరించటం మానుకుంటావా'' అన్నాడు.

ద్రోణుడు "కుమారా! రాజదూషణ ఎందుకు, చెడ్డవాడైనా రాజును విడిచిపెట్టడం న్యాయంగాని దూషించటం న్యాయం కాదు'' అన్నాడు. కృష్ణుడు అలా పరిత్యజింటం మాత్రం ధర్మమా అన్నాడు. కర్ణుడు ఇలాంటివారు విడిస్తే ఏమి, విడవకుంటే ఏమి అని దుర్యోధనుడితో "యుద్ధం వదలటానికి ఇదొక నెపం ఆచార్యుడికి భయమెందుకు? యుద్ధానికి వీరు సహాయం చేస్తారని ఆశిస్తున్నావా'' అన్నాడు. అశ్వత్థామ "పొల్లుమాటలు మాట్లాడవద్దు. యుద్ధానికి మీరాజు రండి అని పిలిచినప్పుడే వస్తాము లేరా'' అని తండ్రిని, మామని చూచి రండి పోదాం, ఎవరిని రాజు ఆశించాడో వారే యుద్ధంలో గెలుస్తారు, వారి బలాలు చూస్తాను అని లేచిపోబోతాడు.

కృష్ణుడు "అశ్వత్థామ కొంచెం సేపు ఓపిక పట్టు. అందరం వెళ్ళవచ్చు. ఈ కొలువు కూటం రణకూటమవుతుంది. పదిమంది ఉండగానే నా మాటలు ఆలకించండి. చెల్లియో, చెల్లకో తమకు చేసిన అవమానాలన్నీ భరించారు. ఆ రోజులు గతించాయి. ఈ రోజు నన్ను దూతగా సంధిచేయటానికి పంపారు. నీ పిల్లలు, ప్రజలు అభివృద్ధి చెందగా సంధి కుదరనిస్తావో,

యుద్ధం తెస్తావో, స్పష్టంగా తెలియజేయి కౌరవరాజా. కోపించటమే తెలియని అజాతశత్రువే కోపిస్తే సముద్రాలన్నీ ఏకమవుతాయి. పదివేలమంది కర్ణులైనా యుద్ధంలో బాధపడతారు, ఛస్తారు దుర్యోధనా! నా మాటలు నమ్ము. ప్రజలందరినీ రక్షించు. జెండాపై కపిరాజు, ముందు గుర్రాలను కూర్చి నేను దండం ధరించి తోలే రథంపై నారిసారిస్తూ గాండీవం ధరించి అర్జునుడు మూకలను చెండాడేటప్పుడు ఒక్కడు కూడా నీ మొర ఆలకించడు రారాజా! సంతోషంగా సంధిచేస్తారా? లేదా ద్రౌపది వస్త్రాపహరణం జరిగే రోజు భీముడు చేసిన ప్రతిజ్ఞలను తీర్చటం కోసం నీ ఎదురుగానే నీ తమ్ముడు దుశ్శాసనుడి రొమ్ము నుండి రక్తం త్రాగటం, అతడి గద నీ తొడలను ఛేదించటం నిశ్చయం" అని చెప్పాడు. ఆ మాటలు దుర్యోధనుడు విననట్లే నటిస్తూ తనలో నోటికొచ్చినట్లల్లా ప్రేలుతున్నాడు. "ముందు వీడి మదం అణిస్తేగాని ఆ పాండవుల మదం అణగదు. ఇప్పుడే వీడికి ప్రాయశ్చితం చేస్తాను' అనుకున్నాడు.

భీష్ముడు "కుమారా! మనకు చుట్టం, జగానికే ప్రత్యేకం అయిన ఈ కృష్ణుడి మాటలైనా విను. ముందు ఈ కర్ణుడి మాటలు విని చెడిపోయావు ఈ రోజు కృష్ణుడి మాటలు వినకపోతే నువ్వు నీ వందమంది తమ్ముళ్ళు చెడతారు" అన్నాడు. దుర్యోధనుడు భీష్ముడితో "తాతా! మీకందరికీ కర్ణుడిపై ఇంత చిన్న చూపెందుకు? బంధువులైన వాళ్ళు, తినవచ్చినవాళ్ళు సంధిచేయమని భయపడి మాట్లాడుతుంటే నా పద్ధతి తెలిసి ఒప్పుకున్న బంధువు కర్ణుడే. అతడికి మిగిలిన వేయిమందైనా సమానం కాదు. నా తండ్రి పేరు మీద దాసితనయుడైన విదురుడు ఇప్పటివరకు రాజ్యమేలాడు. ఇక సూతకుమారుడైన కర్ణుడు నా పేరున రాజ్యం ఏలతాడు" అన్నాడు.

కృపాచార్యుడు "రాజా! నీ రాజ్యాన్ని నువ్వు కర్ణుడితో పాలించుకో లేక ఇంకొకరిచే పరిపాలించుకో. కానీ నీవు ఎంత రాజువైనా తినవచ్చిన వాళ్ళు అని ఇంత చులకనగా మాట్లాడకు. నీ సొమ్ము తినుండటం వల్ల కదా మాలాంటి వారికి ఇలాంటి సూటిపోటి మాటలు కలిగాయి. కానీ ఇంక ఎన్నాళ్ళులే. యుద్ధం సమీపించింది, కాలం తీరినవాళ్ళ కోసం. నీ కోరిక తీర్చటం కోసం యుద్ధంలో పాల్గొనకుండా ఉండి నీ నిష్ఠూరాలకు లోనవుతామా? నువ్వు చదివిన చదువుకు తగిన పద్ధతి ఈ రోజుకి చూశాము. యుద్ధ సన్నద్ధుడవై పదిమంది బలవంతుల సహాయం కోరవలసిన దానికి బదులుగా నీవు అనవలసిన మాటలేనా ఇవి. బుద్ధి కర్మననుసరిస్తుంది కదా నిన్ను అనవలసిందేముందిలే. చక్కటి రాజ వంశంలో పుట్టావు. ఈ సూతుడి కొలువు నీకేందుకు? నీ అవసరమేముందని కులవృద్ధుడైన భీష్ముడిని, ద్రోణుడుని, అశ్వత్థామని తూలనాడుతున్నావే" అన్నాడు.

నారదుడు "దుర్యోధనా! ఈ కృపాచార్యుడి మాటలు నిరాకరింపవలసినవి కావు. నీ తండ్రి అంధుడవటం వలన దాసీతనయుడైనా లోకోత్తరుడైన విదురుడు రాజ్యం శాసించాడు. ఇక ఇప్పుడు ఇతరులెందుకు పరిపాలించాల్సి వస్తుంది? ఒకవేళ వచ్చిందే అనుకో నీకు తమ్ముళ్ళున్నారు, పాండవులున్నారు. కర్ణుడెందుకు? అనేక శాపాలు కలిగిన ఈ కర్ణుడి స్నేహానికి ప్రయోజనం భీష్ముడు మొదలైనవారితో శత్రుత్వం కాదు. వీనికి కలిగిన శాపాలు విను. మారువేషంతో బ్రాహ్మణుడినని చేరి పరశురాముడి దగ్గర చదివిన దివ్యాస్త్రాలు అవసరానికి గుర్తురావని చివరకు శపించబడ్డాడు. చిన్నతనంలోనే మొదటిశిక్షగా మేస్తూ ఉన్న యజ్ఞపు ఆవుపై బాణం వేసి చంపిన కారణంగా బ్రాహ్మణుడు యుద్ధసమయంలో నీవు ఉన్న రథం భూమిలో క్రుంగుతుందని శపించాడు. సహజ కవచకుండలాలుంటే వీనిని తన కొడుకు గెల్వలేడని కదా ఇంద్రుడు వీని కోరలు ఊడ్చే పన్నాగం చేసినా వీని బలం తెలుసుకోలేకపోతున్నావు. ఇది ఇలా ఉండనీ ఇంకొకటి విను.

అందరూ నన్ను కలహ ప్రియుడంటారు, అది నిజమే, ఎవరికైనా గొడవ తీసుకురావటం నాకు సందడి, యుద్ధం చూసేవాడిని. అలాంటి నేను నీకు కూడదంటున్నాను, నా మాట నమ్ము'' అన్నాడు. భీష్ముడు తనలో అతడు గ్రుడ్డివాడు, కానీ ఇతడు మదంతో గ్రుడ్డివాడయ్యాడు. ఈ ఇద్దరిలో అతడే నయం అనుకొని పైకి "కొంచెం కూడా వినవు, ఈ రాజ్యమంతా నాది, నేను కాదంటేనే పాండురాజు, నీ తండ్రి రాజులు నేనుండగా మీ నూరుగురు, ఆ ఐదుగురు యుద్ధం చేయటానికి కారణమేంటి? మీ ఇద్దరూ నా అనుమతితో పరిపాలించుకోవటానికి అంగీకరిస్తాను'' అన్నాడు.

విదురుడు "పితామహా! మీరెందుకు ఊరుకుంటున్నారు, ఇంతకుముందు నువ్వే నన్ను, ధృతరాష్ట్రుడిని రాజ్యంలో నిల్పావు. ఇప్పుడు పొమ్మంటే పోయేవాళ్ళం. అంతేగాని నిన్నెవరు ఆపగలరు. నీవు పితామహుడివి, ఆ బ్రహ్మ సృష్టించి తగిన విధంగా అభివృద్ధి పరచి చివరకు ఎలా లయం చేసుకుంటాడో అలాగే నువ్వు మమ్మల్ని నడుపు'' అన్నాడు. ద్రోణాచార్యుడు "సుయోధనా! ఇది విను. భీష్ముడు ఏది చెబితే అదిచేయటం క్షేమం కలిగిస్తుంది. ఒకవేళ ఇంకొకటి ఈర్ష్యతో చేయదలిస్తే నేనొప్పుకొనను. నాకు జీవనానికి మొత్తం భీష్ముడే ఇచ్చాడు. ఇక జీవనానికి నిన్ను కానీ పాండవులను కానీ కోరను. ఇరువైపుల వారు నాకు శిష్యులే. మీ ఇద్దరికీ గురువును నేను. మీరందరూ నాకు అశ్వత్థామలాగా కనిపిస్తారు. నేను వేరు, భీష్ముడు వేరు అనుకోకు. అతడు ఎటో నేనూ అటే, ధర్మం ఎక్కడుంటుందో అక్కడే విజయం తప్పకుండా ఉంటుంది'' అన్నాడు.

జమదగ్ని "దుర్యోధనా! వృధా దురహంకారానికి పోవద్దు. యయాతి, గరుత్మంతుడు మొదలైన పూర్వులు చెడిపోవటానికి ఇదే కారణం. కులవృద్ధుడగు భీష్ముడిని, గురువైన ద్రోణుడిని, అశ్వత్థామను, కృపుడుని, తల్లిదండ్రులను చూడక నీకు నీవే పెద్దవా చెప్పు. నిన్ను అందరూ బ్రతిమాలుతున్న కొలదీ కర్ణుడే దిక్కని వీరి మాటలు వినటం లేదు. భీష్ముడు పెట్టిన భిక్షే కదా, లేకపోతే నీకెక్కడిది రాజ్యం. ఆ పుణ్యాత్ముడే రాజ్యం పాలించటానికి అంగీకరిస్తే అని భీష్ముడివైపు చూచి "భీష్మా! ఈ భూమి అంతా నీది గానీ ఈ చెడ్డవారిది కాదు. అంతా భరించావు. కొంచెమైనా నీపై నమ్మకం లేని ఈ మూర్ఖులపై దయ ఎందుకు? నీకెందుకీ నమ్మకం. నీ మనసుకు నచ్చిన వాళ్ళకు ఇవ్వు. నీ ఆజ్ఞను అవును, కాదు అనగలవాడు భూమి మీద లేడు'' అన్నాడు. కర్ణుడు నవ్వుతూ "జమదగ్ని వంటి తపోనిష్ఠాగరిష్ఠులైన శుద్ధశ్రోత్రియులకు ఈ రాజకార్య ప్రసంగాలెందుకు? అంబ అంబిక అంబాలికలను ముగ్గురు రాచకన్యలను తీసుకువచ్చి వారిలో ఇద్దరితో విచిత్రవీర్యుడికి పెళ్ళి చేసి అంబను ఉభయభ్రష్టురాలిని చేసిన నపుంసకుడికి రాజ్యమెక్కడిది? ఏదీ, మనసు వచ్చిన వారికి ఇప్పించు. వచ్చిన అపవాదు ఎలానూ వచ్చింది. యుద్ధంలో పాండవులైదుగురు చచ్చేదాక కర్ణుడి ప్రచారం పోదు. ఇప్పుడు ఎవరు ఏమి చెప్పినా రారాజు స్వీకరించడు. ఎవరు ఎన్ని మాటలన్నా కొంగుపట్టి స్వీకరిస్తాను. ఇంక ఎక్కువ మాటలెందుకు'' అన్నాడు. దానికి జమదగ్ని "ఓరీ బాలకా! శుద్ధ శ్రోత్రియులమా? ఇప్పుడు మా పరశురాముడు ఇక్కడుంటే మా శుద్ధ శ్రోత్రియత్వం కనబడుతుంది'' అన్నాడు.

భీష్ముడు "స్వామీ, సహించండి. మీ కుమారుడిక్కడ లేడనటం ఎందుకు, ఈ శిష్యపరమాణువు ఎవరు, అయినా నికృష్టులతో మాట్లాడటం తగదనికదా నేను ఊరుకున్నాను'' అన్నాడు. జాబాలి "కర్ణా! ఎవరెంత మాటరానిచ్చినా కొంగుపట్టావుగా. ఇదిగో రానిస్తున్నాను. ఒక్కడిని చంపుతుందని ఇంద్రుడిచ్చిన శక్తి అర్జునుడినొక్కడినికాక యోధులలో ఒకరిని చంపుతుంది. ఖాండవం దహించబడేటప్పుడు ఒక నాగు నీవైపు దాక్కుందిగా, అది అదృష్టం చేత గురిదప్పుగాక''

అన్నాడు. కర్ణుడు తనలో "అయ్యో! ఈ ముసలి ఋషి శాపం కారణంగా అర్జునుడిని గెలవడానికి విజయసాధనాలైన నా రెండు సాధనాలు వ్యర్థమవుతాయి కాబోలు. ఇతరులపై పక్షపాతంతో కోపించి పలికినవైనా ఋషివాక్యాలు జరుగక తప్పవు అనుకొని నిర్లక్ష్యంగా దుర్యోధనుడితో "మిత్రమా! ఈ ఋషి ఇలా అన్నాడని భయపడుతున్నావా ఏంటి? చిన్నతనం నుంచి ఇలాంటి తిట్లు అనేకం పొందాను. అవన్నీ నిజమైనట్లయితే నేను ఇప్పటికీ ఉండేవాడిని కాను'' అన్నాడు.

దుర్యోధనుడు వినయంగా "మునీంద్రులారా! మీకు మేమేమి అపకారం చేశాం. మీ జపతపాలు పాడుచేయలేదు, మీ జోలిగానీ, ఋషులజోలిగాని తలపలేదు, మీకెందుకు ఈ అనవసర కోపం. రాజులందరికీ రాజధర్మమైనా కూడా యుద్ధంలో పోరాడటానికి మిమ్మల్ని పిల్చామే'' అన్నాడు. దుశ్శాసనుడు దుర్యోధనుడితో చిన్నగా "అన్నా! ఈ ఋషులందరూ దురాగ్రహంతో శపించటం మొదలుపెట్టారు. భీష్ముడు మొదలైనవారందరూ పాండవపక్షపాతంతో ధర్మాధర్మాలు ఆలోచించకుండా మాట్లాడుతున్నారు. వీరందరూ తమ మాట వినకపోతే నిన్ను కృష్ణుడికి అప్పగించాలని తలుస్తున్నట్లు నాకు ఊహ కలుగుతుంది. ఒప్పేదో చూడకుండా ఈవిధంగా ఒప్పులో తప్పులో మాట్లాడి వీరు నిన్ను తప్పుగా చూపించనున్నారు. కాబట్టి నువ్వు నా మాట విను. ఇక్కడి నుండి వెళ్ళిపోదాము రాజు మూర్ఛ తొలగిపోకముందే" అన్నాడు. దుర్యోధనుడు "భళిరా! తమ్ముడా! సమయానికి అనుకూలమైన మాట చెప్పావనుకుంటూ కర్ణదుశ్శాసనులతో నిష్క్రమిస్తాడు.

ధృతరాష్ట్రుడు మూర్ఛ నుండి తేరుకొని "ఓరీ దురాత్మ! నేనేమనుకున్నానో, అంతపని చేశావురా'' అని గజగజవణకసాగాడు. విదురుడు "మహారాజా! ఎందుకు భయపడుతున్నావు, మన దుర్యోధనుడు సభలోని వారు చెప్పేమాటలు వినలేక కొలువు నుండి వెళ్ళిపోయాడు'' అన్నాడు. ధృతరాష్ట్రుడు "అంతేకదా, నిజం చెప్పు. దుర్యోధన దుశ్శాసన కర్ణశకునులు నలుగురు కలిసి శ్రీకృష్ణుడి మహత్త్వం తెలుసుకోక అతడిని బంధించబోయినట్లు అప్పుడు కృష్ణుడు తన విశ్వరూపం చూపించినట్లు ఒక కలకన్నాను'' అన్నాడు. విదురుడు"అది ఇంతవరకు జరగలేదు, ముందేమవుతుందో, ఒక్కోసారి కలలు జరగబోయేవి సూచిస్తాయి'' అన్నాడు. కృష్ణుడు "మామా! బాధపడకు అలాంటిపని ఎందుకు జరుగుతుంది, జరిగినా నాకేమి భయం. వినవచ్చు వినకపోవచ్చు కానీ మనవాడు ఈవిధంగా కొలువువిడిచి పోయినందుకు బాధపడుతున్నాను'' అన్నాడు. గాంధారి మూర్ఛ నుండి తేరుకొని ఏంటీ కోలాహలం అంది. ధృతరాష్ట్రుడు నీ కొడుకు చేసిన వెర్రిపని అన్నాడు. భీష్ముడు "ధృతరాష్ట్రా! జరిగినదానికి బాధపడినా లాభం లేదు. కలియుగం ప్రవేశించింది, యుద్ధం జరుగకమానదు'' అన్నాడు. ధృతరాష్ట్రుడు గాంధారితో దేవి మరొక్కసారి సుయోధనుడిని రప్పించి చెబితే వింటాడేమో అన్నాడు. గాంధారి "మొదటినుండి దురాత్ముడైన వాడికి రాజ్యమిచ్చిన దానికి ఫలితం అనుభవించబోతున్నాం. వాడి దుష్టప్రవర్తనకు మనమే కారణం. రాజ్యం ఇవ్వటం సులభం కానీ దుష్టప్రవర్తనను మాన్పటం కష్టం కదా. అందరి నవ్వులకు పాత్రులమయ్యాం. అయినా నాకు తెలిసిన విధంగా చెబుతాను'' అంది. ధృతరాష్ట్రుడు విదురుడితో మీ అమ్మ పిలుస్తుందని నువ్వెళ్ళి దుర్యోధునుడిని తీసుకొనిరా అనగా విదురుడు అలాగే అని వెళ్ళి దుర్యోధనుడితో తిరిగి వచ్చాడు.

దుర్యోధనుడు "తల్లీ, నమస్కారం. నన్ను పిలిపించిన పనేంటి?'' అన్నాడు. గాంధారి "తండ్రీ దుర్యోధనా! సోదరులు కలిగిన నీవు నీకు మేలు కలిగించే నీ తండ్రి మాటలు విను. భీష్ముడు, ద్రోణుడు, కృపాచార్యుడు, విదురుడు మొదలైనవారు నీ క్షేమం కోరనివారు కారు. ఐశ్వర్యం అదృష్టం కారణంగా వస్తుంది కానీ, బుద్ధి ద్వారా సాధించగలిగేది కాదు. జితేంద్రియుడు, మేధావి కానివాడికి ప్రజాపాలన సులభం కాదు. నీకు కామక్రోధాలు శత్రువులు గానీ పాండవులు కారు. మొదట నీవారికి

నీవు ఇష్టుడవు కాకపోతే శత్రువులను ఎలా జయించగలవు? కన్నులు తెగిన వలలో చేపలు చిక్కనట్లే కామక్రోధాలచే తూట్లుపడిన రాజువలలో శత్రువులు చిక్కరు. కాబట్టి అరిషడ్వర్గాలనే శత్రువులను జయించి శత్రుపంచకమని తలుస్తున్న పాండవులతో కలిసి నీ రాజ్యం సుఖంగా పాలించుకో. కుటుంబకలహానికి భయపడి కదా మీ తాత, మీ తండ్రి వారి భాగం వారికివ్వదలిచారు. భూమంతా పాలించాలనుకుంటే వారడిగిన ఐదు ఊళ్ళు వారికివ్వు. నా ఉపదేశం నిరర్థకమని తెలిసీ కన్నకడుపు కనుక చెబుతున్నాను. మీ పట్ల, పాండవుల పట్ల సమాన ప్రేమ కలిగిన భీష్ముడు మొదలైనవారు తమ శక్తితో సమరం జరుగకుండా చేయటమే నిజం కనుక బంధుమరణానికి పూనుకోకు" అని చెప్పింది. దుర్యోధనుడు "తల్లీ! ఐశ్వర్యం అదృష్టసాధ్యమై మరణం మాత్రం బుద్ధి సాధ్యమవుతుందా, భరతవంశాన్ని నిలపడానికి పాండవులైనా ఉండాలి, లేకపోతే మేమైనా ఉండాలి. కుటుంబనాశకుడిని, ధూర్తుడిని పుట్టాను సహించు, బలవంతపు దీవెన ఇచ్చి పంపు" అంటూ నిష్క్రమించాడు. విదురుడు "మహారాజా! సభ్యులందరికి సెలవిచ్చి కృష్ణుడిని కూడా సాగనంపి మీ అంతఃపురంలోకి వెళ్ళండి. రారాజు భవిష్యత్ పనికి బాధపడుతూ కొలువు నుండి వెళ్ళిపోయాడు" అన్నాడు. ధృతరాష్ట్రుడు నాయనా, జనార్ధనా! దగ్గరకు రా అని కృష్ణుడిని కౌగిలించుకొని "వందమంది కొడుకులను కని, జగతిలోనే అందరికీ మించిన సంపద పెంచాను. ఇక ఏమి కాబోతుందో, మాకు చితివిధి పాండవుల చేత చేయిస్తావా? కడెపెడు పిల్లలను కని కూడా కాలం తీరిన వృద్ధాప్యంలో కొడుకులందరినీ పోగొట్టుకొని తమ ఇంటికి చేరే పరిస్థితి కలిగినా సహించమని కోరారని కుంతితో, పాండవులతో చెప్పు" అన్నాడు.

కృష్ణుడు "మామా! అలా అనకు నీ కొడుకులేమైనా బలహీనులా, కుంతికే నీ ఇంటికి పొట్టకూటి కోసం వచ్చే పరిస్థితి కలుగుతుందేమో? గెలవటం సాధ్యమా? కర్ణుడేమైనా భుజబలం లేనివాడా, సామాన్యుడా? బలవంతులైన గురువు, అశ్వత్థామ మొదలైన యోధులు నీ కొడుకుకు యుద్ధంలో సహాయం చేయకుండా ఎక్కడికి పోతారు" అన్నాడు. ధృతరాష్ట్రుడు "వాసుదేవా! చక్రరక్షకుడవై నీవుండగా పాండవులకేమి కొదవ? వీరు బాణాలను మాత్రమే వదులుతారు గాని ఎవరికి చేతులాడుతాయి పాండవులను వధించడానికి వందమంది కౌరవులు యుద్ధంలో చిక్కితే చంపకుండా ఎవరు వదిలి దయతలుస్తారు. నాకు చెప్పు" అన్నాడు. కృష్ణుడు "లేకపోతే ఇంత వివాదమెందుకు? గొప్పవారందరూ ఇక్కడ లేరా? దుర్యోధనుడు ఇంత దుష్టుడయ్యాడా? యోగ్యత లేని వాళ్ళ లాగా ఈ దుశ్శాసనుడి శాసనం స్వీకరించాల్సి ఎందుకు వచ్చింది, విడువకూడదా, చంపకూడదా దుర్మదుడిని లోకం మేలు కోసం" అన్నాడు. భీష్ముడు కృష్ణుడితో "నువ్వు చెప్పావు. మేము చెప్పాము తప్పులకుప్ప అయిన రాజు మనదారికి రాకుండా వెళ్ళిపోయాడు. వానికే తిప్పలు లేవు. సంధి చేయలేని కారణంగా మనలాంటి వారికే ముప్పు వచ్చింది. ఆ చెడ్డవాడి కారణంగా, అయినా కాలగతిని తప్పించుకోగలమా? యుద్ధ శకునాలు కుప్పలుగా కనిపిస్తున్నాయి. సెలవివ్వు. ధర్మం తప్పకుండా ఈ ఓడ నడిపించు" అన్నాడు.

సాత్యకి తత్తరపాటుతో వెళ్ళి మళ్ళీ తిరిగి వచ్చి కృష్ణుడితో రహస్యంగా "అన్నా! ఇంతకుముందు దుర్యోధనాదులు చేసిన దురాలోచనను నేను కనిపెట్టాను. నీవు జాగ్రత్తగా ఉండాలి. నిన్ను ఈ సభ నుండి పోనీయకుండా పట్టి బంధించాలనుకుంటున్నారు. అదిగో చూడు దుర్యోధనుడి దగ్గర తాడు ఉంది." అన్నాడు. కృష్ణుడు వీరు నన్నేమీ చేయలేరు అన్నాడు. సాత్యకి "అన్నా, అలా అని ఉపేక్షించకూడదు. నువ్వు ఒక్కడివే. కానీ ఈ దుష్టులందరికీ సరిపోతావు. ఇంక పై నుండి వచ్చే వారిని కృతవర్మ వధించగలడు. ద్వారంలో కూడా నరసింహుడికి ఇదంతా చెప్పివచ్చాను. ఈ దుర్యోధనుడిని

ఈ రోజే చంపి రాజ్యం పాండవులకిద్దాము. దీనికి భీష్మ ద్రోణ కృత అశ్వత్థామలు ఒప్పుకునేవారే, దీనికేమంటావు" అంటుండగానే కర్ణుడు, శకుని, దుశ్శాసనుడు తాళ్ళు పట్టుకొని వేరువేరు దిక్కుల నుంచి వచ్చారు. కృష్ణుడు "మనం ఇప్పుడు వీరిని చంపకూడదు. దానికి కారణం వివరంగా చెబుతాను. నీవు ఊరికే చూస్తూ ఉండు. వీరందరూ పటాపంచలైపోయేటట్లు చేస్తాను" అన్నాడు. భీష్ముడు తేరిపార చూచి "ఎంత పాడుకాలం, దుర్యోధనుడు తాను అనుకున్న చెడు తంత్రమంతా నడిపిస్తున్నాడు. కానీ ఎవరు త్రవ్వుకున్న గుంతలో వారే పడతారు. పదిలక్షల కర్ణులు, తొంభై లక్షల శకునులు, రాజులు కలిసిన కృష్ణుడి ఒక పాదరేణువు చాలు వారందరిని అంతం చేయడానికి" అనుకున్నాడు.

సాత్యకి "ఓ విదుర, భీష్మ నీతిదురంధరులారా! ఇది వినండి అదే చూడండి, దుర్మతులు, అహంకారులైన కౌరవులు దుర్మదులై అగ్గిపైకి ఉరికే కీటకాలలాగా అన్నని పట్టుకుందామని పొంచి నక్కుతూ వస్తున్నారు. మీరందరూ ఉస్సురంటూ ఉండగా వారందరూ చస్తారు" అన్నాడు. విదురుడు అదిరిపడి "అన్నా! ధృతరాష్ట్రా! కృష్ణుడిని నీ కొడుకులు కట్టబోతున్నారు. ఈరోజు విలయం జరిగి నీ కులమంతా ధ్వంసం కాబోతుంది" అన్నాడు. ధృతరాష్ట్రుడు నిశ్చేష్టుడయ్యాడు. కృష్ణుడు భీష్ముడి వైపు చూచి "తాతా, భీష్మా! నా మీద కోపం వహించి నీ మనుమళ్ళు ఉన్మాదంతో వస్తున్నారు. నన్ను రారాజు పట్టుగాక, పోనీ కొంత ఆజ్ఞ ఇవ్వండి. ఈ కృష్ణుడు తాను ఆపదలో పడతాడో ఇంకేమవుతుందో, మొదటినుంచి చూడండి" అన్నాడు. ధృతరాష్ట్రుడు తమ్ముడా నీవెళ్ళి వారినందరిని ఇక్కడకు తీసుకురా అన్నాడు. విదురుడు వెళ్ళి దుర్యోధనాదులను తీసుకొని వచ్చాడు. ధృతరాష్ట్రుడు "కుమారా! ఏమిటీ చెడుపని. నువ్వూ తమ్ముళ్ళూ చావదలుస్తున్నారా. అతడిపై కోపం ఎందుకు, ఎక్కడి దుండగం ఇది. శ్రీకృష్ణుడు కోపిస్తే భువనం అల్లాడదా" అన్నాడు. విదురుడు "ధృతరాష్ట్ర మహారాజా! నా మాట విను. ఎందరు ఎదుర్కొని ఏ గతి పొందారో శ్రీకృష్ణుడంటే అందరితో పోల్చదగిన మనిషా? వృథాగా బాధపడకు"- అన్నాడు.

కృష్ణుడు చిరునవ్వుతో "దుర్యోధనా! ఇటు చూడు. ఒక్కడిని చేసి నన్నిక్కడ అంతం చేయదలిచావు. నేను చిక్కాను పక్షిలాగా, ఎక్కడికి పోగలను. పట్టుకో, దగ్గరకు రా, భలే మంచి ఊహ కలిగింది నీకు, ఈ తమ్ముళ్ళతో రా" అన్నాడు. దుర్యోధనాదులు కృష్ణుడిని చూడలేక కళ్ళు మూసుకొని భయంతో గడగడ వణికారు. కృష్ణుడు దివ్వదృష్టినిచ్చాను పుణ్యాత్ములందరూ చూడండి, ఇదే నిజమైన రూపం, తపస్సంపన్నులకు ఇదే ముక్తినిస్తుందన్నాడు. మునులు, భీష్ముడు, ద్రోణుడు, విదురుడు ఆనందపరవశులయ్యారు. ధృతరాష్ట్రుడు కూడా శ్రీకృష్ణుడి నిజరూపాన్ని చూడదలచి 'దేవా! నీ పాదాలు చూడాలని కోరుకుంటున్నాను. నీ సేవకుడిని, నాకు దర్శనం ఇవ్వు' అని అడిగాడు. కృష్ణుడు దివ్యదృష్టి ప్రసాదించగా చూచి ఒక దగ్గర బ్రహ్మ, ఒక దగ్గర శివుడు, ఇంకో దగ్గర విష్ణువు, దేవతలందరూ ఒకచోట, చంద్రుడు మొదలైనవారు ఒక దగ్గర, భూమి మీద జనులు ఒక దగ్గర, యాదవులు పాండవులు కనబడుతున్నారు. ఇదేమి చిత్రమో, అద్భుతం ఇతడి రూపం అనుకొని నమస్కరించి "విశ్వరూపా! విలయాగ్ని వెలుగులు అంతటా వెలుగొందుతున్నాయి. ఈ వెలుగును చూడలేము, మిమ్మల్ని రక్షించవయ్యా" అన్నాడు. కృష్ణుడు విశ్వరూపం ఉపసంహరించగా ఇతన్ని చూసిన చూపుతో దుష్ట లోకం ఎలా చూడాలనుకొని "మహానుభావా! నీదైన ఆనంద స్వరూపాన్ని చూశాను, పాపాత్ములైన నా కొడుకుల కారణంగా, నీ రూపం చూసిన కంటితో ఇతరులను చూడలేను. నీవిచ్చిన దివ్యదృష్టిని నీవే ఉపసంహరించు' అన్నాడు. కృష్ణుడు మామా, నువ్వు కోరినట్లే అవుతుందన్నాడు.

కృష్ణుడు భీష్ముడు మొదలైనవారిని చూస్తూ మంచి, చెడు మీ మీ శక్తి కొలది చెప్పి చూశారు. రాజు యుద్ధంపట్లే ఆసక్తి కలిగి ఉన్నాడు. మహాకాలుడు కాచుకొని ఉన్నాడు. ఇంక ఎవరాపగలరు? నాకింక ఇక్కడ ఆలశ్యమెందుకు? అందరూ అనుజ్ఞ ఇవ్వండి అని లేవగా భీష్మాదులు అతడిని సాగనంపుతుండగా కొంచెం దూరం నడిచిన తరువాత "మంచిది నాకీ విచారం మాత్రం బాధిస్తుంది. అర్జునుడు గురువుల పట్ల భక్తిగలవాడు, శాంత స్వభావి, సత్యవంతుడు, అన్ని సద్గుణాలు కలిగినవాడు, వానితో యుద్ధం చేయటం ఎంత దుఃఖం" అని భీష్ముడు, "అర్జునుడినే మేటిగా విలువిద్యలో తీర్చిదిద్దాను, అర్జునుడి పట్ల నాకు నాకుమారుడి కంటే ప్రేమ ఎక్కువ అతడితో యుద్ధం ఎలా చేయగలను" అని ద్రోణుడు అన్నారు. కృష్ణుడు ఏమి చేయగలం, అర్జునుడికీ అదే సమస్య, కానీ కాలం తప్పదు కదా అన్నాడు. భీష్మాదులందరూ వెళ్ళిపోయారు. కృష్ణుడు తన నివాసానికి వెళుతున్నాడు. ఇతడితో మాట్లాడటానికి ఇదే తగిన సమయం అనుకున్నాడు. కృష్ణుడు కర్ణుడితో "ఒంటరిగా నీతో మాట్లాడే అవకాశం ఇస్తావా, రేపు సూర్యోదయాన వెళతాను నేను. నేను విదురుడి ఇంటిలో ఉంటాను, నువ్వు సాయంత్రం అక్కడికి వస్తావా, లేక నన్ను రమ్మంటావా చెప్పు కర్ణా" అన్నాడు. కర్ణుడు తనలోతానే ఇతడు నాజన్మరహస్యం గురించి మాట్లాడుతాడు కాబోలు అనుకొని పైకి తప్పకుండా నీవువెళ్ళే సమయానికి వచ్చి కలుసుకుంటాను అన్నాడు. కృష్ణుడు మంచిది అన్నాడు.

నాలుగవ అంకంలో కృష్ణుడు కుంతితో, కర్ణుడితో మాట్లాడటం ఉంటుంది. కృష్ణుడు, కుంతి వస్తారు. అత్తా! నాకింక శెలవివ్వు, కౌరవసభలో విశేషాలన్నీ చెప్పాను కదా. యుద్ధం సమీపించింది. కురువంశం నశించుట నిశ్చయం. పాండవబలమే జయిస్తుందనటం నా వశమా. గురువు మొదలైన యోధులతో ఎదుర్కోవటానికి శివుడైనా చాలడు, యుద్ధం చేయాలా, వద్దా వివరించి చెప్పు. కొడుకులు, కోడళ్ళు, మనుమలు కలిసిపోయి పెనుగొండ గుహల్లో దాక్కోండి బ్రతకదలిస్తే, బ్రతికుంటే బలుసాకైనా తినవచ్చు అన్నాడు. దానికి కుంతి, "నీ తల్లి చతురతంతా నీ మాటల్లో చూపిస్తున్నావు. నా మనసు తెలుసకోదలచి కాని నీకు తెలీదా కొండగుహల్లోనే ఉంటారో, ప్రసాద మందిరాల్లోనే ఉంటారో, సుక్షత్రియులనిపించుకోవాలనే నా ఆలోచన, కుంతిభోజుడికి దత్తపుత్రికనై, ధరాతలం అంతా పాలించిన పాండురాజుకి భార్యనై, బలవంతులని పేరుపొందిన ఐదుగురు కొడుకులకు తల్లినై, దాయాదుల ఇంట పదమూడేళ్ళు తింటూ ఉండటం కంటే అడవులలో ఉండటం నయం. అయినా నిర్భాగ్యురాళ్ళకు ఉదాహరణగా కుంతిని చేయొద్దని , పాంచాలిని గౌరవించమని, శత్రుగర్వం అణచని కొడుకు తల్లి ఒక తల్లి కాదని నేను అన్నట్లు ధర్మరాజుకు చెప్పు" అని అంది.

కుంతివెళ్ళిపోగా కృష్ణుడు ఇంకా కర్ణుడు రాడే అనుకుంటుండగా కర్ణుడు వచ్చాడు. కృష్ణుడు బావా అంటూ కర్ణుడిని కౌగలించుకొని నీకొక పరమరహస్యం చెబుతాను వింటావా అన్నాడు. నీ సంబోధనలోనే తెలుస్తుంది. అయినా చెప్పు అన్నాడు కర్ణుడు. కృష్ణుడు "కన్నె వయస్సులోనే సూర్యుడి దయతో పది నెలలు మోసి నిన్ను కన్నది కుంతి, నిన్ను చేరదీసి పెంచింది రాధ. కనుక నువ్వు రాధేయుడవు కావు నిశ్చయంగా. నీకు తెలీని ధర్మశాస్త్రాలు లేవు. కానీనుడికి తల్లిని పెండ్లి చేసుకున్నవాడే తండ్రి అని చెబుతారు కనుక ధర్మరాజాదుల వలె నీవూ పాండవుడవే. దుర్యోధనుడు సంధికి ఒప్పుకోడని తెలిసి కూడా నీకు నిజం తెల్పి నిన్ను తీసుకుపోవటమే నా రాకకు మొదటి కారణం. బంధువులైన అందరి ముందు చెప్పి నిన్ను మెచ్చుకునేటట్లు చేస్తాను. కుంతి చేత సూర్యుడి చేత సాక్ష్యం చెప్పిస్తాను. అర్జునుడు మొదలైన వీరులు నిన్ను కొలువగా భూమినంతా పరిపాలింపజేస్తాను. నీ తల్లి పక్షం మేమంతా. మమ్మల్ని చూడు. తండ్రి పక్షం

ధర్మరాజు వాళ్ళందరు, వారిని చూడు. నా వెంట వారి దగ్గరకు రా. నీ తల్లి సంతోషించేటట్లు రాజ్యం తీసుకో. నీకు ధౌమ్యుడు వేదోక్తంగా పట్టాభిషేకం చేసేటట్లు చేస్తాను. పాండవులందరూ సేవిస్తుండగా పట్టాభిషేకం జరుగుతుంది. ఇంతేగాక ఇంకో విషయం చెబుతాను. ఏ స్త్రీ యజ్ఞం చేసేటప్పుడు అగ్ని నుండి పుట్టిందో, ఏ స్త్రీ వివాహం వేళ రాజులందరూ అర్జునుడి చేతిలో ఓడారో, ఏ సతిపై మోహంతో నువ్వు, దుర్యోధనుడు ఇంత చేశారో, నిన్ను ఆ ద్రౌపది ఆరవభర్తగా పెండ్లిచేసుకోగలదు'' అన్నాడు.

కర్ణుడు కృష్ణుడితో "కృష్ణా! ఈ విషయం కవచకుండలాలు ఇంద్రుడికి ఇచ్చే సమయంలో సూర్యుడి నుండే కొంత తెలుసుకున్నాను. నా మేలుకోరి నీవు చెప్పగా పూర్తిగా తెలుసుకున్నాను. సూతుడి చేతికి దొరికి, సూతుని భార్య పాలు త్రాగి, ఆ సూతుడి అన్నం తిని సూతకాంత ద్వారానే బిడ్డలను పొంది ఈనాటికి ఒక రాజు కుమారుడినని తెల్పగా నా మనసు ఒప్పుకుంటుందా? ఛీ! ఎవరు ఎలా సిగ్గుమాలినా! నా ఉమ్మ చెమటను భరించి పెంచిన తల్లిని చివరకు వదలటం ధర్మమా! కామం చేతకాని, భయంతో కానీ, ఈ భూమిని పాలించాలనే కోరికతో గాని నేను నా స్నేహితులను, బంధువులను విడిచి సుయోధనుడిని విడిచి వస్తానా? వస్తే ప్రజలు మెచ్చుకుంటారా? మొత్తం భూమినంతా పట్టం కట్టుకోవాలనే కోరిక నాకులేదు. నా స్నేహితుడే నా బలం, నా గొప్పతనం నమ్మి రారాజు శత్రువులతో యుద్ధాన్ని ఆశించాడు. ఆ రాజును వదలటం తగినదేనా? రేపో మాపో చావబోతుండగా అంతమాత్రానికి ఇదంతా ఎందుకు? అర్జునుడు కర్ణుడి చేతిలో ఓడిపోతాడని భయపడి ఈ పన్నాగం పన్నాడని ప్రజలు నిన్ను, సూత సుతుడు పాండవుడనని చెప్పి వెళ్ళాడని నన్ను దూషిస్తారు. పదమూడు సంవత్సరాల నుండి దుర్యోధనుడి పేరు మీద నేను ఈ భూమండలం అంతా పాలించాను. కాబట్టి విషయ సుఖాల మీద ఆశ తీరిపోయింది. అయినా ఇంకో విషయం ఉంది విను. నా మేలు కోరే ఇదంతా చెప్పావు. నీ ఆజ్ఞ ఆశ్చర్యం. రాజ్యసంపాదన నేను చేసినా దుర్యోధనుడే రాజవుతాడు. నేను భటుడిని. భటుడు రాజెలా అవుతాడు? నేను పెద్ద వాడినని తెలిసి ధర్మరాజు రాజ్యాన్ని పరిత్యజించటం నిజం. అది లోకులకే కాదు నాకు ఆమోదయోగ్యం కాదు. ఎందుకంటే నిత్యసత్యవ్రతుడైన ధర్మరాజే రాజ్యాన్ని పాలించటానికి తగినవాడు. పాండవులు నీ దయచేత నిశ్చయంగా కురురాజుని గెలుస్తారని నాకు తెలుసు. తెలియనివాడినికాను దేవా, యుద్ధమనే యజ్ఞం జరుగుతుంది. దానికి హోత అర్జునుడు, సర్వాన్ని జరిపించేది మాత్రం నీవే అధ్వర్యుండవు కనుక. అన్నీ తెలిసి కూడా సభలో పాండవులను నేను నిందించుట దుర్యోధనుడి ప్రీతి కోసమే. అది గుర్తుకొచ్చినప్పుడు నా మనసు బాధపడుతుంది. ఇంక నాకు సెలవివ్వు. ఇదంతా ధర్మరాజుకి చెప్పనని నాకు వరం ఇవ్వు'' అన్నాడు.

కృష్ణుడు తనలో ఏమీ ఇతడి మనోనిశ్చయం అనుకొని కర్ణుడితో "కర్ణా! సర్వజ్ఞుడివి అయి కూడా రావణాసురుడిని అనుకరిస్తున్నావు. నాకేవో కొన్ని ప్రీతికరమైన మాటలు చెప్పావు కానీ నీకు విజయం సాధించాలనే కోరికుందని నాకు తెలుస్తుంది. ఈ మాట కూడా విని వెళ్ళు, ఉట్టిమాటలు కావు, భీష్ముడు మొదలైన మిమ్మల్నందరిని పట్టి వధించటం నిజం అలాంటి సూచనలు పాండవులలో కనిపిస్తున్నాయి. నీ చెడు ఆలోచన మాని ధర్మరాజు దగ్గరకు రా. కృతయుగం పోయింది, ద్వాపరం జరుగుతుంది. అర్జునుడి లాంటి యుద్ధ నైపుణ్యం కలవాడిని ఎక్కడా చూడలేదు అనేది తెలుస్తుంది. నీవు ఒక్కడివే చావవు. రాజులందరూ నీ కారణంగా చస్తారు. నీ సేవాధర్మానికి ఈ జగత్తంతా చెడుతుంది. కాబట్టి తరువాత బాధపడితే లాభముండదు ముందే మేలుకో'' అన్నాడు. కర్ణుడు "నీ మాటలలో దేనికీ తిరిగి వ్యాఖ్యానించదగింది

లేదు. మొత్తం నువ్వన్నట్లే జరుగుతుంది. ఇంత తెలిసిన నీకు కర్ణుడి మనోనిశ్చయం మాత్రం తెలీదా? నన్నెందుకు నిర్బంధిస్తున్నావు. ఇప్పుడు జరిగిన భూమిపై ఈ ప్రళయానికి కారకులు నలుగురు దుర్యోధనుడు, దుశ్శాసనుడు, శకుని, కర్ణుడు. ఇందులో కపటమేమీ లేదు. కౌరవనాశనం నిజం. అది నాకూ తెలుస్తుంది, కానీ ఏమి చేయగలను? పాండవుల దరికి రాలేను. ఎంత చెప్పినా ఇంక లాభం లేదు. కీర్తి కోసం రాజులు యుద్ధం చేసి చస్తే కాని భారతావనికి కీర్తి కలుగదు. ఇది దృష్టాంతమై నిలుస్తుంది. గొప్ప కవులకు వారి వాచాశుద్ధికి మూలమవుతుంది'' అన్నాడు. కృష్ణుడు అవును చెడ్డకాలానికి చెడే మంచిగా కనిపిస్తుంది అన్నాడు. కర్ణుడు విననట్లు నటిస్తూ గెలిస్తే నిను తీరికగా దర్శిస్తాను లేకపోతే స్వర్గంలో చూస్తాను, నాకు ఆజ్ఞ ఇవ్వు అన్నాడు. కృష్ణుడు మంచిదనగా కర్ణుడు వెళ్ళిపోయాడు. కృష్ణుడు నేను చేయవలసింది చేశాను. ఇంక జనులు నన్ను నిందించరు. ఒకవేళ కుంతి ఇతడికి చెపితే ఇతడి వెర్రి కుదురుతుందేమో అనుకొని అయినా వినడు. తల్లి చెప్పినా తండ్రి చెప్పినా కీర్తో, చావో అంటాడు. ప్రాణం ఇతడికి గడ్డిపోచ అనుకున్నాడు. కుంతి చెప్పినది ధర్మరాజుకు తెలియజేస్తాననుకున్నాడు.

కుంతి తనలో తాను "అయ్యో! నేనేమి చేసేది, కర్ణుడు అర్జునుడి చేత చంపబడినా, కర్ణుడిచే అర్జునుడు చంపబడినా నాకు ఒకేవిధమైన దుఃఖం. కాబట్టి నేను వెళ్ళి ఏదో రకంగా చెప్పి కర్ణుడిని పాండవులతో చేరుస్తాను. అంతేగాక దుర్యోధనుడి సైన్యంలో కర్ణుడు తప్పించి పాండవులకు అపకారం చేసేవారు వేరు ఎవరూ లేరు. దీనిని ఎలాగైనా మార్చి సుఖంగా ఉంటానని'' గంగాతీరంలో సూర్యార్ఘ్యం ఇస్తున్న కర్ణుడిని సమీపించింది. కర్ణుడు ఆమెను చూచి అతిరథుడి కుమారుడు రాధేయుడు అయిన వసుషేణుడు నమస్కరిస్తున్నాడు అన్నాడు. కుంతి కర్ణుడిని కౌగిలించుకొని "తండ్రీ! నువ్వు కౌంతేయుడవు గాని రాధేయుడవు కావు. కుంతిభోజుడి ఇంటిలో నేను కన్యగా ఉండి దుర్వాసుడు ఇచ్చిన వరాన్ని పరీక్షింపదలచి సూర్యుడిని తలిస్తే అతడి ప్రసాదం నాకు నిన్ను అనుగ్రహించాడు. నేను కూడా భయపడి నిన్ను గంగలో విడిచాను. సహజమైన కవచకుండలాల కారణంగా తండ్రి కంటే వేయిరెట్లు ఎక్కువ కాంతి గల నిన్ను వదిలిన మహాపాపాత్మురాలిని అయిన నా తప్పు క్షమించి నీ తమ్ముళ్ళతో కలిసి రాజ్యం పాలించు'' అన్నది. అప్పుడు ఆకాశం నుండి "నిజం కుమారా, కుంతికి జన్మించిన మాట నిజం, సూర్యుడి కుమారుడివి. నీ తల్లి చెప్పిన విధంగా చేసి రాజులందరు, ప్రజలు సంతోషించగా కురు పాండవ యుద్ధం ఆపించి, ధర్మరాజుకు సంతోషం కలిగించి అసమానమైన కీర్తి పొందు'' అని వినిపించింది.

కర్ణుడు "నేను కుంతి కుమారుడినని నీవేగాక ఆకాశవాణి కూడా స్పష్టం చేసింది. అయినా కూటి కోసం గుడ్డ కోసం పరాయివాళ్ళ ఇంటికి చేరి పదమూడేళ్ళ దుఃఖం కలిగినా ఉన్నావు కానీ ఈ మాట చెప్పావా? నీ మేలు కోరుకుని చెప్పటానికి వచ్చావు నా మీద ప్రేమున్నట్లుగా కొంచెమైనా దయలేకుండా కన్నకొడుకుని గంగ కర్పించిన గొడ్రాలివి, ఇంక నీకు ప్రేమెక్కడ ఉంది. నా రాజకులాన్ని పోగొట్టావు, సూత ధర్మాన్ని చూపావు. ఇంక సంధి చేసినా పోయిన కులం వస్తుందా? పంచపాండవులనే మాట వేరుచేయటం నాకు ఇష్టం కాదు. చిన్నతనం నుండి దయచూపి నా ఉన్నతిని కోరిన రాజుకంటే నాకు అన్నలు, తమ్ముళ్ళు, ఆప్తులు ఎక్కువ కాదు. అతడిని విడవటం నా పని కాదు'' అన్నాడు. కుంతి "కుమారా! పంచపాండవులని వేరు చేయనన్నావు కదా, అదే నాకు వరమివ్వు'' అంది. కర్ణుడు "నీ వరం ఇచ్చాను. నీవు వచ్చిన పని సఫలమైందిగా ఇంకవెళ్ళు యుద్ధంలో అర్జునుడిని తప్ప మిగిలిన వారిని చేతికి చిక్కినా చంపను. అర్జునుడు

ఛస్తే నేను, నేను ఛస్తే అర్జునుడు ఇలా ఐదుగురం పాండవులం" అన్నాడు. కుంతి మనసులో అర్జునుడు ఇతడికి చిక్కడనుకొని 'కుమారా! ఉపపాండవులు ఐదుగురిపై కూడా దయచూపు' అంది. కర్ణుడు "పాండవులతో కలవమనటం తప్ప నీ కోరికలన్నీ నెరవేరుస్తాను. శ్రీకృష్ణుడితో కలిసి వచ్చే అర్జునుడిని చూసి భయపడినట్లే ఆ పాండవులతో కలిసి వచ్చే నన్ను చూసి శత్రురాజులందరూ నవ్వుతారు" అన్నాడు.

ఐదవ అంకంలో పాండవులు, కృష్ణుడు సమావేశమై ఉంటారు. ధర్మరాజు కృష్ణుడితో "కృష్ణా! నీవు చెప్పిన విశేషాలన్నీ విన్నాను. దిగులు తీరింది. యుద్ధం చేయాలనే ఆలోచన కలిగింది. దైవకృతాన్ని ఎవరాపగలరు" అనగా భీముడు దైవమేమి చేసింది, చేసినదంతా దురోధ్యనుడే. వాడి మదం అణచి బలవంతులైన శత్రువులనందరిని చంపి చేసిన ప్రతిజ్ఞలు నెరవేర్చి ఈ భూమికి నిన్ను రాజును చేసి ఆ అరణ్యవాస సమయంలో అనుభవించిన బాధలన్నీ తీరగా ద్రౌపది అభిమానం నిల్పుతాను" అన్నాడు. ఒక పురుషుడు ప్రవేశించి "దేవా, జయము, జయము, మీ ఆజ్ఞననుసరించి స్కంధావారమంతా చూచి వచ్చాను. రెండు ప్రక్కలవారు సిద్ధంగా ఉన్నారు. ఇంకొక మనవి దుర్యోధనుడు ఉలూకుడిని ఇక్కడికి పంపుతాడనే వార్త ఒక ఫణిహారి వల్ల విన్నాను. అతడు ఎప్పుడైనా రావచ్చు" అన్నాడు.

కృష్ణుడు నువ్వా ఫణిహారిని పంపు అనగా అతడు ఫణిహారిని పంపాడు. ఫణిహారిని భీముడు కౌరవ సేనలోని విశేషాలేంటి అని అడుగగా "దుర్యోధనుడు కురువృద్ధుడైన భీష్ముడిని అతిరథ మహారథ నిర్ణయం చేయమన్నప్పుడు కర్ణుడిని అర్థ రథులలో పరిగణించాడు" అనగానే ధర్మరాజు "ఈ విషయంలో తాతగారిదే లోపమన్నాడు. అతడు అర్థరథుడైతే ఇంక ఎవరు అతిరథ, మహారథులుగా పిలువబడువారు, అంత బలవంతుడిని ఇంత చేతకానివాడిగా తాతగారు భావించారెందుకో" అన్నాడు. కృష్ణుడు అర్జునుడిని ఎలా పరిగణించారు అనగా ఫణిహారుడు 'అర్జునుడి సామర్థ్యం వర్ణించటం ఎవరి తరం కాదు. అతడికి అతడే సాటి అన్నారు' అన్నాడు. అర్జునుడు 'సూతపుత్రుడినేకాక నన్ను కూడా తాతగారు పూర్తిగా అవమానించారు. అర్జునుడంట అర్థరథుడైన కర్ణుడితో యుద్ధం చేస్తున్నాడనే మాటలు యుద్ధంలో నా మనోరథాన్ని దెబ్బతీయవా?' అన్నాడు. కృష్ణుడు దానికేమి రేపటి నుండి యుద్ధంలో నిన్నెదుర్కోబోయే వారందరు అతిరథ మహారథ సమరథులే ఉంటారా? మహారథులు, సమరథులు, అతిరథులు అందరూ ఉంటారు" అన్నాడు. నకులుడు 'అన్న తాత్పర్యం అదికాదు, ద్వంద్వ యుద్ధమనేది అన్ని రకాలుగా సమానులైన వారికే జరగాలి, ఇతరులకు కాదు. కావున ఇది విచారమే' అన్నాడు. కృష్ణుడు, 'భద్రా, కృష్ణుడిని అర్థరథులలో చేర్చడానికి భీష్ముడేమి కారణాలు చెప్పాడు' అన్నాడు. దానికి ఫణిహారి 'ఇంతకుముందు కర్ణుడు పొందిన శాపాలు ఉదహరించి తన మాటలు సమర్థించుకున్నాడన్నాడు.

కృష్ణుడు ధర్మరాజు ఫణిహారుడితో 'భీష్ముడు తనను అర్థరథులలో చేర్చినందుకు కర్ణుడు సమ్మతించి ఊరుకున్నాడా" అని అడిగాడు. అతడెందుకు ఊరుకుంటాడు, తోక తొక్కిన త్రాచులాగా నిట్టూరిస్తూ 'ఓయీ పితామహా! వీరులు విచారిస్తే నేను అర్థరథుడినైనా అవుతాను. రారాజు మన్నించి ముసలవాడివైన నిన్నీ పదవిలో ఉంచాడు. నీవు యుద్ధరంగంలో ఉండగా నేను యుద్ధం చేయను అని అస్త్ర సన్యాసం చేశాడు' అన్నాడు ఫణిహారుడు. కర్ణుడి దురాలాపాలకు భీష్ముడేమన్నాడు అని ధర్మరాజు అడిగాడు. అనటానికేముంది వచ్చిన కోపాన్నంతా నవ్వుగా మార్చుకొని భీష్ముడు 'నువ్వెంత నీ బలమెంత? నీవు యుద్ధంలో నాకు చేసే సహాయం ఆవగింజంత లేదని నాకు తెలుసు' అన్నాడు. ప్రతిహారి ప్రవేశించి శకుని కుమారుడైన ఉలూకుడు వచ్చాడు అని చెప్పగా ధర్మరాజు వెంటనే ప్రవేశపెట్టమన్నాడు.

ఉలూకుడు ప్రవేశించి ధర్మరాజు చూపిన ఆసనంపై కూర్చొని "వినుమో ధర్మరాజా! మహావీరుడు దుర్యోధనుడు పంపగా వచ్చాను. అతడు చెప్పమని చెప్పి పంపిన మాటలు కొన్నున్నాయి. శాంతంగా నువ్వు, నీ సోదరులు వినండి" అన్నాడు. దానికి ధర్మరాజు "దూతగా వచ్చిన నీపై కోపించడానికి నేను దుర్యోధనుడినికాను. నీ ధర్మం నువ్వు నిర్వర్తించు యుద్ధంలో దుర్యోధనాదులను శిక్షించటం చేయవలసిన పని కానీ దూతవైన నిన్ను బాధించటం కాదు" అన్నాడు. ఉలూకుడు దానికి "చేసిన ప్రతిజ్ఞలను నిలుపుకోవాలి, ఊరికే అంటే లాభం లేదు. సభాసదులందరూ వినగా వలలుడు నా తొడలు పగులగొడతానని, దుశ్శాసనుడి ప్రేగులు మెడలో వేసుకొని రక్తం తాగుతానని, చేసిన ప్రతిజ్ఞ గుర్తుందా? జూదమాడుతూ ఒకడు, వంటవాడు ఒకడు, నపుంసకుడై భోగపు విద్య నేర్పుతూ ఒకడు, గుర్రాలశాలలో ఉద్యోగి ఒకడు. ఆలమందలో ఒకడు అయినవారు నన్ను జయించటమా? ఎవడు భీష్ముడిని, ద్రోణుడిని, కర్ణుడిని, కృపుడిని, నూరుగురు కొడుకులను ఎదిరించగలడు? ఇప్పుడే ఎవరు ఎవరితో పోరాడుతారో స్పష్టం చేసుకోమను వీరు నిజంగా రాజకుమారులైతే యుద్ధంలో నిల్చి మీ ప్రతాపం చూపండి మాయలమారి, కొంపలు కూల్చే ఎన్నో ఉపాయాలు చేయగలవాడు కృష్ణుడు ఇంక మీకు దిక్కు. కృష్ణులు, జిష్ణులు ఎందరు ఏ మాయలు పన్నినా భయం మాకు కలుగదు, అది తెలిసిరండి" అని మీ అందరికీ చెప్పమన్నాడు అన్నాడు. భీముడు పళ్ళు పటపట కొరకుతూ "దూతవు కాబట్టి నీ మాటలు సహించాను. నీ రాజు మదం అణిచేటప్పుడు నువ్వు, నీ తండ్రి గుడ్ల నీటితో చూద్దురు గాని, అప్పటికి ఎవరూ మిమ్మల్ని యముడి దగ్గరకు పంపకుండా ఉంటే" అన్నాడు.

ధర్మరాజు, తమ్ముడా! నువ్వే కోపిస్తే ఎలా ఇతరులకు చెప్పవలసిన వాడివి అన్నాడు. కృష్ణుడు "ఉలూకా! మీ రాజుతో నా మాటలుగా చెప్పు. చావు నిశ్చయం. శూరులు మెచ్చేటట్లుగా చావండి. ఈ బలం అంతా యుద్ధరంగంలో చూపండి. ఊరకనే ఈ మొరగటం వింటే నవ్వరా! నీ తొడలు విరుగగొట్టడం నిజం. దుశ్శాసనుడి రక్తం భీముడు ఆస్వాదిస్తాడు. దానిని ఎవరు ఆపగలరో వారిని ఇప్పుడే ప్రార్థించి కాపలా ఉంచుకోమను" అన్నాడు. ఉలూకుడు తనలో ఈ మాటలు విని ఉండటం కన్నా అభిమానికి చావు మేలుకదా అనుకొని నేనిక వెళ్ళవచ్చా అన్నాడు. ధర్మరాజు వెళుదువుగానీ ఎవడురా అక్కడ, చందన తాంబూల వస్త్ర ఆభరణాలు తీసుకొని రండి ఈ ఉలూకుడిని గౌరవించటానికి అనగానే వాటినన్నిటిని తీసుకొని భటుడు రాగా ధర్మరాజు అవి ఇచ్చి ఉలూకుడిని గౌరవిస్తాడు. ఉలూకుడు బయలుదేరుబోతుండగా నేను చెప్పానని నీ రాజుకు చెప్పు" వారున్నారు వీరున్నారని ఊరుకనే గర్వపు మాటలను ఎందుకు వ్యయం చేయటం. నీ కారణంగా యుద్ధంలో భీష్ముడిని, గురువుని చంపుతాను. కర్ణుడిని చంపటం ఎంతపని? ఇతరుల భుజబలమే శరణం నీకు. నీ కోసం కురువృద్ధులను, గురువృద్ధులను చంపాల్సి వస్తుంది కదా" అన్నాడు అర్జునుడు. ఉలూకుడు కోపం అణచుకొంటూ వెళ్ళిపోయాడు.

ధర్మరాజు కృష్ణుడితో 'నీవు తోడుంటే విజయలక్ష్మిని పొందలేమా' అన్నాడు. కృష్ణుడు "ఇదంతా భారతయుద్ధానికే సూచన. అమాయకుడవైన నీ నోటిమాటలే నిజం కాకపోతే భగవంతుడి మాటలు, వేదాలు నిజమవుతాయా? ఆరోజు ఘోషయాత్రలోనే నీవు అర్జునుడిని పంపకపోతే దుర్యోధనుడు చచ్చేవాడు కదా" అన్నాడు. ఇంతలో రుక్మివచ్చి కృష్ణుడిని నిందిస్తాడు. దుర్యోధనుడి సైన్యానికి ఆధిపత్యం వహిస్తామని వెళ్ళిపోతాడు.

నాటకం చివరి అంకమైన షష్ఠాంకంలో యుద్ధరంగంలో కృష్ణుడు, అర్జునుడికి భీష్ముడిని, ద్రోణుడిని, కర్ణుడిని చూడమని చెప్పగా అర్జునుడు నిరుత్సాహంగా "కొందరు బంధువులు, కొందరు గురువులు, కొందరు తమ్ములు ఇలా బంధువులందరినీ రణభూమిలో చంపి సంపద పొందటం కంటే బిక్షమెత్తుకోవటం మంచిది కదా, ఎలా బాణం వేయగలను. తాతతో, గురువుతో, కృపుడితో, అశ్వత్థామతో, పెద్ద తండ్రి కొడుకులతో మిగిలిన రాజులతో ఎలా యుద్ధం చేయగలను" అన్నాడు. దానికి కృష్ణుడు "ఇంతకముందే కదా యుద్ధంలో అందరినీ చంపుతానన్నావు, ఎంత సిగ్గుచేటు నీ సోదరులకు, ఇది తెలిస్తే శత్రువులు నవ్వరా. చంపేది, చచ్చేది శరీర ధర్మం. జీవుడు ఈ శరీరాన్ని నమ్మకుండానే ఉంటాడు. నీవు నిమిత్త మాత్రంగా శత్రువులను చంపు" అని రహస్యమేదో చెవిలో చెప్పాడు. అయినా అర్జునుడు రాజ్యం కోసం బంధువులను గురువులను చంపలేను అనగా విశ్వరూప సందర్శనంతో గాని అర్జునుడి సందేహాలు నివృత్తికావని విశ్వరూపాన్ని చూపిస్తాడు. అర్జునుడు దానితో తన అజ్ఞానం తొలగిందని, భీష్మద్రోణ యోధులను చంపింది నీవే, నీచే చంపబడిన వారిని మళ్ళీ నేను చంపటం నా కీర్తి కోసమే నీ విశ్వరూపం ఇంక ఉపసంహరించు అని కోరతాడు.

ధర్మరాజు వెళ్ళిపోతూ ఉంటే భీముడు, నకులుడు, సహదేవుడు అందరూ ఎవరికి వారుగా భయపడిపోవద్దన్నా, మేము ఉన్నాముగా, నువ్వు వెళితే అందరూ నవ్వుతారని ఎంత వేడినా అతడు వెళతాడు. దానికి భీముడు అన్న చేసిన పని ఇదమిత్థమని తెలియదు కానీ తాతగారి, గురువుగారి ఆశీస్సుల కోసం వెళుతున్నట్లనిపిస్తుందంటాడు. ధర్మరాజు భీష్ముడి దగ్గరికి, ఆ తరువాత ద్రోణుడి దగ్గరకు వెళ్ళి వారి ఆశీస్సులే కాక వారి మరణ రహస్యాలను చెప్పించుకొని వస్తాడు. అంతేగాక ఎవరైనా తన పక్షానికి వచ్చేవారున్నారాఅని శత్రువుల సైన్యాన్ని అడుగుతాడు. అప్పుడు యుయుత్సుడు ధర్మరాజు దగ్గరకు అన్నా అంటూ వస్తాడు. ద్రోణుడు తనలో తను ధృతరాష్ట్రుడి సంతానంలో యుయుత్సుడే మిగులుతాడు అనుకుంటాడు. కృష్ణుడు ఉపాయశాలి అయిన ధర్మరాజు విజయసాధనాలు చక్కగా సంగ్రహించాడు అనుకున్నాడు. భీష్ముడి ధాటికి మీరు గెలవలేరు అని కర్ణుడు కృష్ణుడితో అనగా కృష్ణుడు వేయిమంది భీష్ములు, పదివేలమంది ద్రోణులు, నూరువేలు కర్ణులు కలిసివచ్చినా పార్థుడి చేతిలో చచ్చేవారే, కృష్ణుడంటే ఎవరో కొంచెం తెలుసుకో. నిన్ను ఈ హస్తినాపురానికి రాజుని చేయదలచి నేను చేసిన ప్రయత్నం నీ అంతరాత్మకు పరమాత్మకు తప్ప ఎవరికీ తెలియదు. అయిన నీకు నేనింకేమి మేలు చేయగలను? అయినా ఇలా జరుగుగాక ధర్మమెప్పటికి గెలుస్తుందని, ఈ కలికాలంలో భారతాన్ని ఆశ్రయించుకున్న కావ్యాలు, నాటకాలు, ఆటలు పాటలై భూలోకంలో వెలయుగాక అని భరతవాక్యం పలికాడు.

**డా॥ ఇరపని మాధవి**
తెలుగు & ప్రాచ్య భాషా విభాగం,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,
నాగార్జున నగర్.

ဢ ဢ ಆ ಆ

**పాఠం - 18**

# పాండవోద్యోగము

**- తిరుపతి వేంకట కవులు**

## సందర్భ సహిత వ్యాఖ్యలు

**1. అదిగో ద్వారక! యాలమందలవిగో!**

**పరిచయం:** తిరుపతి వేంకట కవులు రచించిన పాండవోద్యోగము నాటకం లోనిదీ వాక్యం.

**సందర్భం:** యుద్ధం జరుగుతుందని, అది తప్పదని తెలిసిన తర్వాత కృష్ణుడి సహాయం కోసం అర్జునుడు ద్వారకకు వెళ్ళే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** అదిగో ద్వారక. ఆలమందలవిగో, అదే కోట, అదే అగడ్త. వారే యాదవులు. యదుసింహుడైన కృష్ణుడు నివసించే మేడ అదిగో.

**2. బావా! యెప్పుడు వచ్చితీవు? సుఖులే భ్రాతల్సుతుల్చుట్టముల్?**

**పరిచయం:** తిరుపతి వేంకట కవులు రచించిన పాండవోద్యోగము నాటకం లోనిదీ వాక్యం.

**సందర్భం:** కృష్ణుడు దగ్గరికి సహాయం కోరి వచ్చిన దుర్యోధనుడిని చూచి కృష్ణుడు కుశల ప్రశ్నలడిగే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** కృష్ణుడు దుర్యోధనుడిని బావా, నువ్వు ఎప్పుడు వచ్చావు, సోదరులు, పుత్రులు, బంధువులు సుఖంగా ఉన్నారు కదా. నిన్ను వెన్నంటి ఉండే కర్ణుడు, మీ వంశోన్నతిని కోరు భీష్ముడు, మీ మేలు కోరుకునే ద్రోణుడు మొదలైనవారు క్షేమమే కదా!

**3. ముందుగ వచ్చితీవు మునుముందుగ నర్జును నేను జూచితిన్.**

**పరిచయం:** తిరుపతి వేంకట కవులు రచించిన పాండవోద్యోగము నాటకం లోనిదీ వాక్యం.

**సందర్భం:** తనను సహాయం కోరటానికి ముందుగా దుర్యోధనుడు వచ్చిన నిద్ర నటించిన కృష్ణుడు అర్జునుడు వచ్చిన తరువాతనే కళ్ళు తెరిచి ముందుగా అర్జునుడినే చూసి పలకరించిన తర్వాత దుర్యోధనుడిని పలకరించి వారిద్దరు యుద్ధంలో తన సహాయం కోరిన సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** ముందుగా వచ్చావు నీవు, మునుముందుగా నేను అర్జునుడిని చూశాను. బంధువులన్న విషయం మనసులో నిల్చి ఉంది కనుక సహాయం ఇద్దరికీ లభించటం న్యాయం. మీ కోసం సైన్య విభాగం చేస్తాను, మీకు తగినది తీసుకొనండి, ముందు కోరటం మాత్రం చిన్నవాడైన అర్జునుడు కోరటం సరైనది.

### 4. కడమ యీతని పాలగుఁ బాండునందనా!

**పరిచయం:** తిరుపతి వేంకట కవులు రచించిన పాండవోద్యోగము నాటకం లోనిదీ వాక్యం.

**సందర్భం:** కృష్ణుడు తనకు ధీటైన సైనికులు పదివేల మంది ఒకవైపు, తాను ఒక్కడు ఒకవైపు ఈ రెండింటిలో ఎవరికి కావలసింది వారు కోరుకోవచ్చు అనే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** ఆయుధాన్ని పట్టను, యుద్ధంలో ఒక ప్రక్క నుండి ఊరకనే సహాయం చేస్తాను. తరువాత నన్ను చులకనగా నిందిస్తే కాదు. నిజం ముందుగానే చెప్పాను. నీకేది ఇష్టమో కోరుకో అర్జునా. నువ్వు కోరిన తరువాత మిగిలింది దుర్యోధనుడి వంతగుతుంది.

### 5. సారథినై యిఁకన్ విజయసారథినామమునన్ జరించెదన్

**పరిచయం:** తిరుపతి వేంకట కవులు రచించిన పాండవోద్యోగము నాటకం లోనిదీ వాక్యం.

**సందర్భం:** అర్జునుడు తనవంతుగా కృష్ణుడిని కోరుకుని యుద్ధ సమయంలో తన రథంలో ఉంటే చాలు అని చెప్పిన సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** అర్జునుడి భక్తికి మెచ్చి కృష్ణుడు 'ఊరక చూస్తూ ఉండటం చూసి శత్రువులు ఫక్కున నవ్వుతారు. శూరుల వంశం అది ఒప్పదు. కనుక నేను నీ రథానికి సారథినై ఇంక విజయసారథి అనే పేరుతో చరిస్తాను'' అన్నాడు.

### 6. నాకు జగతిన్ బేరెట్టు పెంపారెడిన్

**పరిచయం:** తిరుపతి వేంకట కవులు రచించిన పాండవోద్యోగము నాటకం లోనిదీ వాక్యం.

**సందర్భం:** దుర్యోధనుడు బలరాముడిని చూడటానికి వెళ్ళివుండచ్చని అర్జునుడు అనగా నువ్వు బలరాముడి సహాయం కోరవచ్చుగా అని కృష్ణుడు అన్న సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** బలరాముడుని ప్రార్థిస్తే అతడు ఒప్పుకోవచ్చు లేకపోవచ్చు కానీ అతడు ఒప్పుకొని యుద్ధం చేస్తే శత్రువులను జంతువులలాగా చెండాడతాడు. అప్పుడు నాకు జగతిలో పేరెలా కల్గుతుందని అర్జునుడన్నాడు.

### 7. వారికయి పృథ్వి జనించె నటంచు దెల్పెడిన్.

**పరిచయం:** తిరుపతి వేంకట కవులు రచించిన పాండవోద్యోగము నాటకం లోనిదీ వాక్యం.

**సందర్భం:** నీ అభిమతమేదో తెల్పు అని ధర్మరాజుని కృష్ణుడడుగగా రోషంతో ద్రౌపది మొన్న సంజయుడు చెప్పాడు కదా. బిచ్చమెత్తుకొని జీవించుట యుక్తమని అన్నప్పుడు కృష్ణుడు ధర్మరాజుని చెప్పవలసినదంతా చెప్పనివ్వు అనే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** ధర్మరాజా! సంజయరాయబారం సారం తెలుసుకున్నాం. అతడు ఎంతసేపటికి మీకు శాంతి, వారికి కోపం, మీకు బిచ్చపుగంజి రుచిస్తుంది, వారికి కమ్మనిపాలు రుచిస్తాయని, మీకోసం వింధ్యపర్వతం, వారి కోసం భూమి పుట్టిందంటూ తెల్పాడు.

### 8. సంధి యొనర్చి మా భరతసంతతి నిల్పుము.

**పరిచయం:** తిరుపతి వేంకట కవులు రచించిన పాండవోద్యోగము నాటకం లోనిదీ వాక్యం.

**సందర్భం:** ధర్మరాజు సంధి చేయమని కృష్ణుడితో చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** సంధి మాట వారు విన్నావినకున్నా మా నిశ్చయం రాజులందరికీ మా నిశ్చయం తేటతెల్లమవుతుంది. నా అభిమతమైన సంధిని సాధించి భరత సంతతిని కాపాడు లేదా కౌరవులచేత మమ్మల్ని నశింపజేయి. రెండు భుజాలపై భారం మోపాము. మాకు కీర్తో, రాజ్యమో నీదే భారం.

### 9. యింకేటికి మమ్ము దూఱెదవు వాచాశూరు లిప్పాండవుల్.

**పరిచయం:** తిరుపతి వేంకట కవులు రచించిన పాండవోద్యోగము నాటకం లోనిదీ వాక్యం.

**సందర్భం:** ఎదురుగా దుర్యోధనాదులున్నారు అన్నట్లుగా మాట్లాడుతున్న భీముడిని ద్రౌపది పరోక్షంలో ఈ ప్రగల్భపు మాటలెందుకు అని ద్రౌపది అనే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** భీముడు ద్రౌపదితో ఒక దుర్మార్గుడు కొప్పుపట్టుకొని రాజులందరు చూస్తుండగా నీవు కట్టిన వస్త్రాలు సభలో లాగగా చూస్తూ ఊరకనే ఉన్న అసమర్థులం. ఇంకెందుకు నిందిస్తావు? పాండవులు వాచాశూరులు మాత్రమే.

### 10. ఐనను బోయిరావలయు హస్తినకు.

**పరిచయం:** తిరుపతి వేంకట కవులు రచించిన పాండవోద్యోగము నాటకం లోనిదీ వాక్యం.

**సందర్భం:** ధర్మరాజు శత్రువులు బలసంపన్నులు, మనం అంతటి బల సహాయం లేనివారం, సంధి చేయుటయే మన కర్తవ్యం అని కృష్ణుడికి చెప్పిన సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** కృష్ణుడు ధర్మరాజుతో అయినా హస్తినకు వెళ్ళి రావాలి. సంధి మాట ఎలా ఉన్నా శత్రురాజుల బలాబలాలు చూడచ్చు. నీ మనసులోని అనుమానం తీర్చవచ్చు. మీ పద్ధతిని తాత, గురువులు అందరూ వింటారు అన్నాడు.

### 11. ఖలులు నేటికి గాంధారి కడుపునందు / జననమందిరి భరతవంశంబుఁ గాల్ప.

**పరిచయం:** తిరుపతి వేంకట కవులు రచించిన పాండవోద్యోగము నాటకం లోనిదీ వాక్యం.

**సందర్భం:** భీముడు కృష్ణుడితో యుద్ధం యుద్ధమంటున్నావు, సంధి చెడగొట్టకు అని చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** ఒక్కో కులం నశించటానికి ఒక్కొక్కడు పుడతాడు. పూర్వం ఈ వంశంలో అపూర్వమైన రాజులు పుట్టారు. ఈనాటికి గాంధారి కడుపులో చెడ్డవారు పుట్టారు భరతవంశాన్ని కాల్చటానికి.

### 12. అడుగు దాఁటరు పాండవులన్న మాటకున్.

**పరిచయం:** తిరుపతి వేంకట కవులు రచించిన పాండవోద్యోగము నాటకం లోనిదీ వాక్యం.

**సందర్భం:** నిండు సభలో అన్ని ప్రతిజ్ఞలు పలికిన ఇప్పుడు సంధి అంటున్నాడేంటి అని కృష్ణుడు ఎగతాళిగా మాట్లాడినప్పుడు భీముడు దానికి కారణం చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** కృష్ణా! సముద్రాలు ఇంకినా, ప్రళయం వచ్చినా, లోకాలు సూర్యచంద్రులు తలక్రిందులవుదురు కాక, గొప్ప కష్టాలు వచ్చినా, సంపద పోయినా, ఎలాంటి పనులలోనైనా పాండవులు అన్నమాట దాటరు.

### 13. యుల్లము లోపలం దలఁప వుత్తయమాయిక కోపి వక్కటా!.

**పరిచయం:** తిరుపతి వేంకట కవులు రచించిన పాండవోద్యోగము నాటకం లోనిదీ వాక్యం.

**సందర్భం:** శాంతి అంటున్న భీముడిని కృష్ణుడు ఎగతాళిగా మాట్లాడుతుంటే దానికి భీముడు కోపించి కృష్ణుడుని తూలనాడే సమయంలో నకులుడు భీముడికి సర్ధిచెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** గొల్లడు, గొల్లడంటూ వినకూడని మాటలతో ఇలా నిందించటం తగినదేనా? ఈ పరాత్పరుడి చేష్టలు తెలిసి ఉండటం వల్లనే కదా తల్లి కూడా ఎప్పుడూ గురువుగా భావిస్తారు. దానికైనా నీ మనసులో గుర్తుతెచ్చుకోవాలి కదా ఎంత అమాయకపు ముక్కోపివి.

### 14. దాయలు విన్న లోకువగదా! యనియైనను మిన్నకుండరే.

**పరిచయం:** తిరుపతి వేంకట కవులు రచించిన పాండవోద్యోగము నాటకం లోనిదీ వాక్యం.

**సందర్భం:** భీముడిని సముదాయిస్తూ సహదేవుడు మాట్లాడే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** సహాయం చేయటానికి కృష్ణుడు వచ్చాడు. అతడు ఏదో ఒక పరాచికం ఆడితే నువ్వు కుటుంబకలహానికి దిగావు. నీ కోయతనం బయటపడింది. గోడలకు చెవులుంటాయి కదా, దాయాదులు వింటే లోకువ అనైనా మెదలకుండా ఉండచ్చు కదా.

### 15. సమయమిదె వచ్చుచున్నది శౌర్యమునకు.

**పరిచయం:** తిరుపతి వేంకట కవులు రచించిన పాండవోద్యోగము నాటకం లోనిదీ వాక్యం.

**సందర్భం:** భీముడు చిన్నవాళ్ళ చేత కూడా చెప్పించుకోవలసిన గతి పట్టింది అని చనిపోదామనుకుంటే వ్యవహారం ముదురుతుందని గ్రహించిన కృష్ణుడు భీముడిని ప్రసన్నుడిని చేయాలనుకునే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** నీవు లేకపోతే ఈ శోకం ద్రౌపదికి తీరుతుందా, అన్న మాటవిని నీవు అన్నమాట ఆశ్చర్యం కలిగించగా నేను అలా అన్నాను. నీ పరాక్రమం ఎవరికి తెలియదు, నీ శౌర్యం చూపే సమయం ఇదే వస్తుంది.

### 16. సూతుని మైత్రిచేఁ బగకు (జొచ్చినగొంటు సుయోధనుండు.

**పరిచయం:** తిరుపతి వేంకట కవులు రచించిన పాండవోద్యోగము నాటకం లోనిదీ వాక్యం.

**సందర్భం:** సంధి కోసం కౌరవసభకు వెళ్ళినపుడు భీష్ముడికి, ద్రోణుడికి అర్జునుడు తన మాటలు చెప్పమన్న సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** సూతుడి స్నేహంతో పగకు పూనుకున్న దుష్టుడు దుర్యోధనుడు మీరు అతడి పట్ల వారగుట న్యాయమా? గాండీవధారినైన నేనే భయపడుతున్నాను పెద్దలతో యుద్ధం ఎలా చేయగలనని ఓ తాత, గురువా! మీరయినా ధర్మం కాదని మందలించరా!

### 17. అయినను సంధినడపుచు యుద్ధమునకుఁ గూడ సంధి నడుపుచుండుము.

**పరిచయం:** తిరుపతి వేంకట కవులు రచించిన పాండవోద్యోగము నాటకం లోనిదీ వాక్యం.

**సందర్భం:** కృష్ణుడు నకులుడి అభిప్రాయం అడిగినపుడు అతడు తన అభిప్రాయం చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** యుద్ధానికి కాలు దువ్వకుండా ఉండటానికి మన బలం మాత్రం సామాన్యమైందా. ధర్మరాజు యుద్ధానికి సిద్ధపడడనే ఆలోచన ఉన్నంతవరకు వారు ఇలాంటి ప్రగల్భాలే పలుకుతుంటారు. అయినా సంధి నడుపుతూ యుద్ధానికి కూడా సంధి నడుపు.

### 18. మంచి క్షత్రియుల కింతే యొండు లేదెచ్చటన్.

**పరిచయం:** తిరుపతి వేంకట కవులు రచించిన పాండవోద్యోగము నాటకం లోనిదీ వాక్యం.

**సందర్భం:** సహదేవుడు తన అభిప్రాయం వ్యక్తీకరించే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** రాజ్యభాగం గురించి మాట్లాడకుండా మన బలపరాక్రమాలకు ఫలితంగా రణభేరి మ్రోగించండి. దొర ఒక్కడు అనటం ఏమి మాట? బలవంతుడెవడో వానిది ఈ భూమి. యుద్ధంలో జయమో పరాజయమో కలుగదా. గెల్చి రాజులందరూ మెచ్చగా రాజ్యం పరిపాలిస్తాం. చనిపోతే స్వర్గంలో తిరగవచ్చు. మంచి క్షత్రియులకు ఇంతే వేరేదెక్కడా లేదు.

### 19. యిమ్మేటి మగలకుఁ బౌరుషంబు వచ్చునని కదా!

**పరిచయం:** తిరుపతి వేంకట కవులు రచించిన పాండవోద్యోగము నాటకం లోనిదీ వాక్యం.

**సందర్భం:** తన మొర కూడా కొంచెం వినమని ద్రౌపది కృష్ణుడితో తన ఆవేదన చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** యజ్ఞం నుండి పుట్టి, ద్రుపదుడికి కూతురినై, దృష్టద్యుమ్నుడికి సోదరినై, పాండవులకు భార్యనై, నిండు కొలువులో అవమానించబడి, పన్నెండు సంవత్సరాలు వనవాసం చేసి ఒక సంవత్సరం అజ్ఞాతవాసం అనుభవించి, ఇన్ని కష్టాలకు ఓర్చుకొని బ్రతికి ఉన్నందుకు ఫలంగా ఆ కౌరవచండాలుర చావు వినుట తప్ప మిగిలిన కలిమి లేములకు ఆశించేదానిని కాను. ఈ మేటి అయిన భర్తలకు పౌరుషం వస్తుందని కదా నేటికీ దుశ్శాసనుడిచే వీడిన వెంట్రుకలను ముడవకుండా, కట్టిన వస్త్రం విడువకుండా జీవిస్తున్నాను.

### 20. అతిథీనులై యడుగగా నిఁక నేఁటికి సంశయింపఁగన్.

**పరిచయం:** తిరుపతి వేంకట కవులు రచించిన పాండవోద్యోగము నాటకం లోనిదీ వాక్యం.

**సందర్భం:** కురుసభలో కృష్ణుడు పాండవులు చెప్పమన్న మాటలు రాయబారిగా చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** ధృతరాష్ట్ర మహారాజా! పాండవులు పతితులు కారు, నీ పట్ల భక్తి కలిగినవారు. శుంఠలు కారు. విద్యలలో నైపుణ్యం కలవారు. మంచివారు, రాజులందరికి తలలోని నాలుక వంటి వారు, అచ్యుతుడికి కావలసినవారు, యుద్ధంలో శౌర్యం కలవారు, అటువంటి పాండవులు ఈవిధంగా అతి దీనులై అడుగుతుంటే ఇంక ఎందుకు నువ్వు సంశయించటం?

### 21. గ్రుడ్డిదయ్యె మాట గూడ నాకు.

**పరిచయం:** తిరుపతి వేంకట కవులు రచించిన పాండవోద్యోగము నాటకం లోనిదీ వాక్యం.

**సందర్భం:** కృష్ణుడి మాటలు విన్న ధృతరాష్ట్రుడు సమాధానం చేప్పే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** వాసుదేవా! అన్నీ తెలిసి కూడా నా మీద నెపం పెడుతున్నావు. గ్రుడ్డివాడినవటం చేత కొంతకాలం పాండురాజు రాజ్యాన్ని పాలించాడు. కొడుకులిప్పుడు పరిపాలించసాగారు. ఈ కారణం చేత నాకు మాట కూడా గ్రుడ్డిదయ్యింది.

### 22. నల్వురు చనుత్రోవగా నడువఁబోనిది యెచ్చటి పాపకర్మమో.

**పరిచయం:** తిరుపతి వేంకట కవులు రచించిన పాండవోద్యోగము నాటకం లోనిదీ వాక్యం.

**సందర్భం:** కృష్ణుడు ధృతరాష్ట్రుడుని పాపం చేయవద్దంటే కర్ణుడు జోక్యం కలిగించుకుని కృష్ణుడిని దుర్భాషలాడే సమయంలో ద్రోణుడు కల్పించుకొని కర్ణుడిని వారించే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** రాధేయా! కృష్ణుడు ధృతరాష్ట్రుడి పాపానికి కారణం చెప్పాడు, మధ్యలో నీకీ దుందుడుకు తనమెందుకు? మంచి దారిలో వెళ్ళక, ఎదుటివారి శక్తి తెలియక రాజునకు కావలసినవాడినని నోరెలావస్తే అలా ప్రేలటానికి వచ్చావా, ఆహా, ఇతరులు మెచ్చుకుంటారా, నలుగురు వెళ్ళే దారిలో నడవకపోవటం ఇది ఎక్కడి పాపకర్మో!

### 23. ప్రాణములైన వీడుటకు వీఁడున్నాఁడు సిద్ధంబుగన్.

**పరిచయం:** తిరుపతి వేంకట కవులు రచించిన పాండవోద్యోగము నాటకం లోనిదీ వాక్యం.

**సందర్భం:** కర్ణుడు ద్రోణుడిని ఎగతాళి చేస్తూ మాట్లాడే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** ఓ ద్రోణాచార్య! ముసలితనంతో మది తప్పిన భీష్ముడితో పాటు నీకూ మతిపోయిందా? కూడు, గుడ్డా ఇచ్చే రాజుని ఎవరో ఒకడొచ్చి దూషిస్తే చూస్తూ ఊరుకోవటానికి వీడు భీష్ముడో, ద్రోణుడో కాడు. లోపలా బయటా వేరువేరు ఆలోచనలు లేకుండా ప్రాణాలైనా వదలటానికి వీడున్నాడు సిద్ధంగా.

### 24. తెల్పుము కవ్వడిం దొడరు వారెవ్వరొ? నాముందఱన్.

**పరిచయం:** తిరుపతి వేంకట కవులు రచించిన పాండవోద్యోగము నాటకం లోనిదీ వాక్యం.

**సందర్భం:** ధృతరాష్ట్రుడు దుర్యోధనుడికి మంచి మాటలు చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** భీష్మ ద్రోణ కృపాశ్వత్థామల వంటి వారందరూ సంధికి అంగీకరించటానికి కృతనిశ్చయులై ఉన్నారు. ఐదూళ్ళిచ్చిన చాలు మాకని అన్న దాయాదులతో అన్యాయంగా ఈ ద్వేషమేంటి? నీకు కర్ణాదులు ఉన్నారు భయం ఎందుకు అనే ధైర్యం ఉంది కాబోలు. రెండు చేతులతో భాణాలు వేయగల అర్జునుడికి సాటి అయిన వారు ఎవ్వరో చెప్పు.

### 25. తేజోబల ప్రాధాన్యంబు గలట్టి రాచకొడుకుల్ పౌరవ్యవంశాగ్రణీ!.

**పరిచయం:** తిరుపతి వేంకట కవులు రచించిన పాండవోద్యోగము నాటకం లోనిదీ వాక్యం.

**సందర్భం:** దుర్యోధనుడు తల్లిదండ్రులు మాటలు విని సమాధానం చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** పాండవులు బలవంతులై మమ్మల్ని చంపుతారని కలలో కూడా అనుకోవద్దు. బలం ఉంటే సమరం చేయరా. నలుగురు చూస్తుంటే భార్యను ఇతరుల చేత అవమానింపబడుతుంటూ చూస్తూ ఊరుకుంటారా? మానావమానాలు, సిగ్గులేని వారి స్నేహం సరైనదేనా? కర్ణుడు, నేను, తమ్ముళ్ళు యుద్ధంలో నిలిస్తే ఇంద్రుడికైనా గెల్వటం సాధ్యమా? ధర్మమని పన్నెండేళ్ళు అడవులకు వెళతారా తేజోబలం కలిగిన రాచబిడ్డలెవరైనా?

### 26. నీ ప్రాణంబులు నిలుపుకొని మమ్మీ దుఃఖ పారావారముం దాఁటింపుము.

**పరిచయం:** తిరుపతి వేంకట కవులు రచించిన పాండవోద్యోగము నాటకం లోనిదీ వాక్యం.

**సందర్భం:** గాంధారి దుర్యోధనుడిని దగ్గర కూర్చోబెట్టుకొని సంధి చేయమని మంచి మాటలు చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** తండ్రీ! భీముడు జరాసంధుడు హిడింబ కీచకులను చంపాడని విన్న నాటి నుండి నా కడుపు బగ్గుబగ్గున మండుతూనే ఉంది. మీ సహాధ్యాయులు ఐదుగురిలో ఒకరి చేత తక్కిన నలుగురు చావగలరని మీ గురువు శపించారని విని ఉన్నాను. అందులో భీముడి చేతిలో బడటానికి నీవొక్కడివి మిగిలున్నావు. కనుక సంధి చేసుకొని నీ ప్రాణాలు నిలుపుకొని మమ్మీ దుఃఖపారావారం దాటించు.

### 27. పరువైన క్షత్రియ కుటుంబములోపలిదాన వక్కటా.

**పరిచయం:** తిరుపతి వేంకట కవులు రచించిన పాండవోద్యోగము నాటకం లోనిదీ వాక్యం.

**సందర్భం:** యుద్ధం వద్దు సంధి కొప్పుకోమని చెబుతున్న గాంధారి మాటలు విన్న కర్ణుడు గాంధారితో యుద్ధానికి వెనుదీయవద్దని చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** తల్లీ గాంధారి! తాపసికి పుట్టిన కారణంగా ధృతరాష్ట్రుడు యుద్ధానికి వెనుకదీసే మాటలు కొడుకుకు చెప్పవచ్చు గాక పరులైన క్షత్రియ కుటుంబంలో నీవే పుట్టి కుమారులకు ఇలాంటి మంచి మాటలు చెప్పటానికి పూనుకున్నావు ఎందుకు?

**28. భరతవంశంబు బ్రతుకు నీపాలఁ బడియె.**

**పరిచయం:** తిరుపతి వేంకట కవులు రచించిన పాండవోద్యోగము నాటకం లోనిదీ వాక్యం.

**సందర్భం:** గాంధారితో కర్ణుడు మాట్లాడిన మాటలు విని కర్ణుడిని ధృతరాష్ట్రుడు నిందించే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** ఓరీ, కర్ణా! కలిసి పాలు నీళ్ళలాగా కలిసి ఉండవలసిన బిడ్డలకు పగ తాపావు. ధర్మరాజును రప్పించి వంచించి జూదమాడించావు, ద్రౌపదిని రచ్చ కీడ్పించి వస్త్రాలు వలిపించావు. కూడు గుడ్డలకు పాండవులను దూరం చేసి వారిని అడవికి పంపావు. సంధి చేయటానికి వచ్చిన కృష్ణుడితో అడ్డదిడ్డంగా మాట్లాడి పంపుతున్నావు. ఔరా నీ ఇష్టమొచ్చినట్టు చేయించు, భరతవంశం బ్రతుకు నీ పాలిట పడింది.

**29. యేల యిట్లతిథి చేతం బాముఁ జంపించు నేర్పరిచందంబున మెచ్చులాడెదవు?**

**పరిచయం:** తిరుపతి వేంకట కవులు రచించిన పాండవోద్యోగము నాటకం లోనిదీ వాక్యం.

**సందర్భం:** ధృతరాష్ట్రుడు కర్ణుడిని నిందించటం సహించలేని వికర్ణుడు ధృతరాష్ట్రుడిని తూలనాడే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** పాండవుల పట్ల నీకంతగా నిజమైన వాత్సల్యం ఉంటే పరులను నిందించటం ఎందుకు? వారిని పిలిపించి ఈరోజు మొత్తం ధారపోయటానికి స్వతంత్రం లేదా? ఎందుకు ఇలా అతిథి చేత పాము జపించే నేర్పరిలాగా మీ వారందరూ వినగా మాట్లాడుతున్నావు?

**30. సమరంబు మాను జగమెల్లరకుం గడుసంతసంబగున్.**

**పరిచయం:** తిరుపతి వేంకట కవులు రచించిన పాండవోద్యోగము నాటకం లోనిదీ వాక్యం.

**సందర్భం:** దుర్యోధనుడికి విదురుడు యుద్ధం మానమని చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** పెద్దల మాట వినవు. ముందు శుక్రాచార్యుడు చెప్పిన విధమైనా పాటించు. రెండు వైపుల నుండి ఇద్దరు బలవంతులకు యుద్ధం జరిపి ఎవరు గెలిస్తే ఆ పక్షం వారు గెల్చినట్లు. అర్జునుడితో యుద్ధం చేయగలవాడు కర్ణుడని నువ్వు పేరాస పెట్టుకున్నావు. వారిద్దరికీ ద్వంద్వ యుద్ధం పెట్టి గెలిచిన వారి పక్షం గెలిచినట్లుగా మనం ఎంచుకుంటే యుద్ధం ఉండదు. జగత్తులో అందరికీ మిక్కిలి సంతోషం కలుగుతుంది.

**31. చచ్చిరేనియు నేవురుఁ జావవలయు.**

**పరిచయం:** తిరుపతి వేంకట కవులు రచించిన పాండవోద్యోగము నాటకం లోనిదీ వాక్యం.

**సందర్భం:** విదురుడి మాటలకు దుర్యోధనుడు సమాధానం సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** పాండవులు అయిదుగురు మాకు శత్రువులే. అర్జునుడు మాకు చేసిన కీడు ఏంటి? బ్రతికుంటే ఐదుగురు బ్రతకాలి, ఛస్తే ఐదుగురు చావాలి.

### 32. సేవాధర్మము సూతధర్మమును రాశీభూతమై యొప్ప.

**పరిచయం:** తిరుపతి వేంకట కవులు రచించిన పాండవోద్యోగము నాటకం లోనిదీ వాక్యం.

**సందర్భం:** తమను తూలనాడాడని కోపించి కర్ణుడి మీదకు దూకబోతున్న అశ్వత్థామను కృష్ణుడు ఆపే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** అశ్వత్థామ! కోపించకు, యుద్ధ చక్రమంతా తానే తిప్పాలనుకునే కర్ణుడి మనోరథమే నెరవేరనీ. సేవాధర్మం, సూతధర్మం రాశీభూతమై ఒప్పే వాచావాత్సల్యం చూపాడు. మాత్సర్యం మీకెందుకు? రాజు ఎప్పుడు మిమ్మల్ని కోరతాడో అప్పుడే యుద్ధానికి వెళ్ళండి. కర్ణుడి చావు వరకే లేక చివరి వరకో యుద్ధాన్ని విడిచిపెట్టండి.

### 33. చెల్లియొ చెల్లకో తమకుఁ జేసిన యెగ్గులసైచి రందఱుం

**పరిచయం:** తిరుపతి వేంకట కవులు రచించిన పాండవోద్యోగము నాటకం లోనిదీ వాక్యం.

**సందర్భం:** కృష్ణుడు దుర్యోధనుడితో కొలువులో అందరూ వింటుండగా చెప్పవలసిన మాటలు చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** చెల్లుబాటు అయ్యో, కాకో తమకు చేసిన అవమానాలు అందరూ సహించారు. జరిగింది అయిపోయింది. ఈరోజు నన్ను దూతగా పంపారు సంధి చేయటానికి. నీ పిల్లలు పాపలు ప్రజలు సంతోషించే విధంగా పొందు చేస్తావో, యుద్ధం తెస్తావో స్పష్టంగా చెప్పు దుర్యోధన.

### 34. అలుగుటయే యెఱుంగని మహామహితాత్ముఁడజాతశత్రుడే యలగినవాడు.

**పరిచయం:** తిరుపతి వేంకట కవులు రచించిన పాండవోద్యోగము నాటకం లోనిదీ వాక్యం.

**సందర్భం:** కృష్ణుడు పాండవుల శక్తి సామర్థ్యాలు సభలో దుర్యోధనుడికి చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** కోపించటమే తెలియని ఎంతో గొప్పవాడైన ధర్మరాజే కోపిస్తే సముద్రాలన్నీ ఏకం కాకపోతాయా! కర్ణులు పదివేల మంది అయినా యుద్ధంలో బాధపడతారు, ఛస్తారు దుర్యోధనా! నా మాటలు నమ్ము, ప్రజలను అందరినీ కాపాడు.

### 35. జెండాపై కపిరాజు ముందు సితవాజి శ్రేణియుం గూర్చి.

**పరిచయం:** తిరుపతి వేంకట కవులు రచించిన పాండవోద్యోగము నాటకం లోనిదీ వాక్యం.

**సందర్భం:** పాండవుల సామర్థ్యాన్ని యుద్ధం జరిగితే జరగబోయే దానిని దుర్యోధనుడికి కృష్ణుడు చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** జెండాపై కపిరాజు, ముందు గుర్రాలను కూర్చి నేను దండం తీసుకొని రథం తోలుతుంటే అర్జునుడు నారి సారిస్తూ గాండీవం ధరించి శత్రుమూకలను చెండాటేటప్పుడు దుర్యోధనా! ఒక్కడూ నీ మొర ఆలకించడు.

**36. బంధువు కర్ణుడే యతనిఫాటియె తక్కిన వేవురేనియున్.**

**పరిచయం:** తిరుపతి వేంకట కవులు రచించిన పాండవోద్యోగము నాటకం లోనిదీ వాక్యం.

**సందర్భం:** పాండవుల ప్రతాపాలు కృష్ణుడి నోట విన్న దుర్యోధనుడు కర్ణుడి ఔన్నత్యాన్ని చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** తాతా! మీకందరకు కర్ణుడిపై ఈ చిన్న చూపెందుకు? బంధువులైనవారు, తినవచ్చినవారు, పొందు చేయి, సంధి చేయి అని యుద్ధానికి భయపడి చెబుతుంటే నా పద్ధతికి తలఊపిన కర్ణుడే బంధువు, మిగిలిన వేయిమందైనా అతనికి సాటికాదు.

**37. నీ శాసన మౌను గాదనఁగ జాలివాఁడెవఁ డుర్విలోపలన్**

**పరిచయం:** తిరుపతి వేంకట కవులు రచించిన పాండవోద్యోగము నాటకం లోనిదీ వాక్యం.

**సందర్భం:** దుర్యోధనుడి దురహంకారం చూసిన జమదగ్ని భీష్ముడితో మాట్లాడే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** అన్నీ నువ్వు అసహ్యించుకున్నారని నాకు తెలుసు. అయినా కొంచెమైనా విశ్వాసం లేని చెడ్డవారిపై దయ ఎందుకు? నీకెందుకింత విశ్వాసం. నీ మనసుకు నచ్చిన వారికి రాజ్యమివ్వు. నీ శాసనాన్ని ఔను, కాదు అనగల వాడెవడున్నాడీ భూమి మీద.

**38. కడిపెఁడు బిడ్డలం గనియుఁ గాలము తీరిన వార్ధకంబునం.**

**పరిచయం:** తిరుపతి వేంకట కవులు రచించిన పాండవోద్యోగము నాటకం లోనిదీ వాక్యం.

**సందర్భం:** ధృతరాష్ట్రుడు కృష్ణుడిని దగ్గరకు పిల్చి కౌగిలించుకొని మాట్లాడే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** వందమంది కొడుకులను కన్నాను, ఎనలేని సంపదను పెంచాను. ఏమి కాబోతుందో, మాకు పాండవుల చేత చితివిధి చేయిస్తావా? కడిపెడు బిడ్డలను కని, కాలం తీరిన ముసలితనంలో కొడుకులనందరినీ పొగొట్టుకొని తమ ఇంటికి చేరు పరిస్థితులు కలిగినా మా పట్ల చెడు మాట్లాడక సహించమని కుంతికి, పాండవులకు చెప్పానని చెప్పు.

**39 పశువులు హేతువు గాఁగ నీ కులము విధ్వస్తంబు నీనాఁడెయౌ.**

**పరిచయం:** తిరుపతి వేంకట కవులు రచించిన పాండవోద్యోగము నాటకం లోనిదీ వాక్యం.

**సందర్భం:** కృష్ణుడిని దుర్యోధనాదులు బంధించతలచిన సమయంలో విదురుడు అదిరిపడి ధృతరాష్ట్రుడితో చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** శిశుపాలుడిని చంపినవాడు, కంసుడిని అంతం చేసిన సింహం వంటి శ్రీకృష్ణుడిని దర్దశపాలు చేయాలని నీ కొడుకులు శకునితో కలిసి కృష్ణుడిని పూనుకున్నారు. ప్రళయం వస్తుందీ రోజే. ఈ పశువులు కారణం కాగా నీ కులం ఈ రోజే విధ్వంసమయిపోతుంది.

### 40. చక్కనియూహ పుట్టె ననుజన్ములతో నరుదెమ్మ్మ పార్థివా!

**పరిచయం:** తిరుపతి వేంకట కవులు రచించిన పాండవోద్యోగము నాటకం లోనిదీ వాక్యం.

**సందర్భం:** తనను బంధించాలని వస్తున్న దుర్యోధనుడిని కృష్ణుడు ఆహ్వానించే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** ఒక్కడిని చేసి నన్నిక్కడ అంతం చేయాలని తలచావా? నేను ఎక్కడకు పోగలిగినవాడిని. ఇక ఇక్కడ పక్షిలాగా చిక్కాను. నీకు దక్కాను. పట్టుకో, దగ్గరకు రా. చాలా మంది ఊహ కలిగింది నీకు. నీ తమ్ములతో దుర్యోధనా! అని కృష్ణుడు అట్టహాసం చేశాడు.

### 41. ఆసతి పెండ్లియాడఁగల దాఱవ భర్తగా సూర్యనందనా!

**పరిచయం:** తిరుపతి వేంకట కవులు రచించిన పాండవోద్యోగము నాటకం లోనిదీ వాక్యం.

**సందర్భం:** కర్ణుడిని పాండవుల పక్షం రమ్మని నువ్వే కుంతి పెద్ద కొడుకువని, నువ్వే రాజువవుతావని, పాండవులందరూ సేవ చేస్తారని కృష్ణుడు చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** ఏ సతి యజ్ఞం చేసే సమయంలో అగ్ని నుండి జన్మించిందో, ఇంతకుముందు ఎవరి కోసం రాజులందరూ అర్జునుడి చేతిలో ఓడిపోయారో, ఏ సతి మీద మోహంతో నువ్వు, దుర్యోధనుడు ఇంత చేశారో, ఆ సతి ద్రౌపది నిన్ను ఆరవ భర్తగా పెండ్లి చేసుకోగలదు కర్ణా.

### 42. స్వామి సుయోధనున్విడిచి వత్తునె? వచ్చిన మెత్తురే జనుల్?

**పరిచయం:** తిరుపతి వేంకట కవులు రచించిన పాండవోద్యోగము నాటకం లోనిదీ వాక్యం.

**సందర్భం:** కృష్ణుడు కర్ణుడిని పాండవులతో కలవమని చెప్పగా కర్ణుడు అతడికి సమాధానం చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** కామంతో కానీ, భయకంపితమైన మనసు చేతగాని, ఈ భూమినంతా ఏలుకోవాలనే ప్రయత్నంతో కానీ నేను నా క్షేమాన్ని ఆశించి బంధువులను, స్నేహితులను విడిచి నా రాజైన దుర్యోధనుడిని విడిచి వస్తానా? వస్తే ప్రజలు హర్షిస్తారు!

### 43. నీవు కౌంతేయుండవు గాని రాధేయుండవు కావు

**పరిచయం:** తిరుపతి వేంకట కవులు రచించిన పాండవోద్యోగము నాటకం లోనిదీ వాక్యం.

**సందర్భం:** కుంతి కర్ణుడిని కలిసి మాట్లాడు సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** కుంతిని చూసి కర్ణుడు 'దేవి! అతిరథ సుతుడనైన, రాధేయుడనైన వసుషేణుడు నమస్కరిస్తున్నాడు' అనగా కుంతి కర్ణుడిని కౌగిలించుకొని తండ్రీ! నువ్వు రాధేయుడవు కావు కౌంతేయుడవు. కుంతి భోజుడి ఇంట్లో నేను కన్యగా ఉన్నప్పుడు దుర్వాసుడు ఇచ్చిన వరాన్ని పరిశీలించటానికి సూర్యుడిని తల్చుకోగా అతడి ప్రసాదం నాకు నిన్ననుగ్రహించింది. నేను భయపడి నిన్ను గంగలో వదిలాను.

### 44. గొడ్డురాలవిఁకఁ బ్రేముడి యెక్కడిదమ్మనీకు?

**పరిచయం:** తిరుపతి వేంకట కవులు రచించిన పాండవోద్యోగము నాటకం లోనిదీ వాక్యం.

**సందర్భం:** కుంతితో కర్ణుడు తన బాధను, అయిష్టతను తెలియజేసే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** కూటికోసం, గుడ్డకోసం పదమూడు సంవత్సరాలు పరుల ఇంటిలో దుఃఖం కలచినా ఉన్నావు కానీ ఇట్టిదీ మాట అని చెప్పావా? నీ మేలు కోరుకొని ఈ రోజుకి చెప్పవచ్చావు నా మీద ప్రేమున్నట్లుగా కొంచెం కూడా లోపల కరుణ లేకుండా కన్న కొడుకును గంగకు అర్పించిన గొడ్రాలివి ఇంక నీకు ప్రేమ ఎక్కడిదమ్మా. నాదైన రాచకులాన్ని పోగొట్టుకొని సూత ధర్మాన్ని చూశాను. నీటిలో వదిలిన కులం సంధి చేసినా ఇక వస్తుందా?

### 45. విచార మంది ఫలమందురు రేపని ప్రమందుఁడందఱున్

**పరిచయం:** తిరుపతి వేంకట కవులు రచించిన పాండవోద్యోగము నాటకం లోనిదీ వాక్యం.

**సందర్భం:** కౌరవులు పంపగా రాయబారిగా వచ్చిన ఉలూకుడు దుర్యోధనుడు చెప్పమన్న మాటలు పాండవులకు తెలియజేసే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** ఎవడు పితామహుడును ఎదుర్కొంటాడు, ఎవడు ద్రోణుడిని ఎదిరిస్తాడు? ఎవడు కర్ణుడుని సహించగలడు. ఎవడు కృపుడుని ఆపు, నూరుగురు కొడుకులతోనూ ఎవడు యుద్ధం చేయగలవాడు. ఇప్పుడే స్పష్టంగా నిర్ణయించుకోండి. తరువాత విచారపడి ఫలితం పొందరు, అందరూ యుద్ధంలో నశిస్తారు.

### 46. కర్ణుని దోలు టెంతపని వాచాశూరునిన్ భీరునిన్

**పరిచయం:** తిరుపతి వేంకట కవులు రచించిన పాండవోద్యోగము నాటకం లోనిదీ వాక్యం.

**సందర్భం:** ఉలూకుడి మాటలకు అర్జునుడు కోపించి దుర్యోధనుడికి చెప్పమని మాట్లాడే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** అర్జునుడు చెప్పాడని మీ రాజుకు చెప్పు. వారున్నారు వీరున్నారని వారించటానికి శక్యం గాని గర్వోక్తులతో నోటిని వ్యర్థం చేస్తున్నావెందుకు? నిన్ను బట్టి భీష్ముడిని యుద్ధంలో చంపకమానను. అలాగే గురువులను పోగొట్టుకోవటం, మా మీదకు సారం లేని కర్ణుడిని తోలటం ఎంత పని? వాచాశూరుడిని, భీరువుని.

### 47. బలిమిఁజేసి పార్థుఁ బంపకున్న!

**పరిచయం:** తిరుపతి వేంకట కవులు రచించిన పాండవోద్యోగము నాటకం లోనిదీ వాక్యం.

**సందర్భం:** కృష్ణుడు ధర్మరాజుతో ఇదంతా భారతరణానికి సూచనే అని చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** ధర్మరాజు అమాయకుడై స్వంత తమ్ముడంటూ బలవంతంగా అర్జునుడిని పంపకపోతే వాడే ఘోషయాత్ర సమయంలో ఆ దుర్యోధనుడు చచ్చేవాడే.

**48. ప్రసన్నుఁడనై యీ రూపం బుపసంహరింపుము.**

**పరిచయం:** తిరుపతి వేంకట కవులు రచించిన పాండవోద్యోగము నాటకం లోనిదీ వాక్యం.

**సందర్భం:** శ్రీకృష్ణుడు విశ్వరూపం చూసిన సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** నా అజ్ఞానం నశించింది. నీవు లోకక్షయకర్తవైన రుద్రుడివి. నీ చేత చంపబడిన భీష్మాదియోధులను చంపటం నా కీర్తి కోసం కానీ మరొకదానికి కాదు. నువ్వు ప్రసన్నుడవై ఈ విశ్వరూపం ఉపసంహరించుకో.

**డా॥ ఇరపని మాధవి**
తెలుగు & ప్రాచ్య భాషా విభాగం,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,
నాగార్జున నగర్.

**పాఠం - 19**

# పాండవోద్యోగము

## - తిరుపతి వేంకట కవులు

## ప్రశ్నలు & సమాధానాలు

### 1. 'పాండవోద్యోగము' నాటక సారాంశాన్ని రాయండి?

జ. తిరుపతి వేంకట కవులు భారతేతివృత్తంతో రాసిన పాండవ జననము, పాండవ ప్రవాసము, పాండవోద్యోగము, పాండవ విజయము, పాండవాశ్వమేధము అనే నాటకాలలో ఎక్కువగా ఆంధ్ర ప్రజానీకాన్ని ఉర్రూతలూగించిన నాటకం పాండవోద్యోగము. మహాభారతంలోని ఉద్యోగపర్వంలోని రాయబారాలలో ముఖ్యమైనది శ్రీకృష్ణరాయబారం. ఆ రాయబారానికి ముందు, ఆ తరువాత జరిగిన సంఘటనలన్నీ కూడా చూసే ప్రేక్షకుడికి అర్థమయ్యేరీతిలో ఈ నాటకాన్ని అద్భుతంగా రచించారు తిరుపతి వేంకట కవులు. ఈ నాటకంలోని పద్యాలు తెలియని తెలుగువాడుండడంటే ఎంతగా ప్రజలను ఈ నాటకం రంజింపజేసిందో అర్థం చేసుకోవచ్చు.

అర్జునుడు శ్రీకృష్ణుడి సహాయం కోరటం కోసం ద్వారకకు వెళ్ళేటప్పటికే అర్జునుడి కంటే ముందుగానే దుర్యోధనుడు వచ్చి కృష్ణుడి తల దగ్గర కూర్చొని ఉంటాడు. కృష్ణుడు మాయనిద్ర నటిస్తూ అర్జునుడు వచ్చిన తర్వాత కళ్ళు తెరిచి ముందుగా అర్జునుడినే చూసినట్లుగా నటిస్తూ అర్జునుడిని క్షేమ సమాచారాలడుగుతాడు. ఆ తరువాత దుర్యోధనుడిని చూసి క్షేమసమాచారాలడుగుతాడు. తనను సహాయమడిగిన ఆ ఇద్దరికి తాను ఆయుధం పట్టను. యుద్ధం చేయను అలాంటి తాను ఒక పక్షం తనతో సమానులైన గోపకులు పదివేల మంది ఒకవైపు అని ఈ రెండింటిలో ఎవరు కావాలో ముందుగా చిన్నవాడు కనుక అర్జునుడిని కోరుకోమంటాడు. అర్జునుడు కృష్ణుడినే కోరుకుంటాడు. దుర్యోధనుడు దానికి సంతోషిస్తూ మిగిలిన గోపకులను తీసుకుంటానంటాడు. దుర్యోధనుడు వెళ్ళిన తర్వాత తాను యుద్ధం చేయకపోయినా తననెందుకు కోరుకున్నావనగా అర్జునుడు కృష్ణుడి యుద్ధం తనకవసరం లేదని, కృష్ణుడు రథంలో ఉంటే చాలు, శత్రువులందరినీ తాను గెలుస్తానని అంటాడు. అర్జునుడు భక్తికి మెచ్చి కృష్ణుడు రథానికి సారధ్యం వహించి విజయసారథి నవుతానంటాడు. బలరాముడు ఎవరి పక్షం వహించడని ఇద్దరికీ సంధి కుదిరితే సంతోషిస్తాడనే విషయం కూడా చెబుతాడు.

కృష్ణుడు కౌరవసభకు రాయబారిగా వెళ్ళటానికి అంగీకరించిన తర్వాత పాండవుల అభిప్రాయాలు ఒక్కొక్కరిని అడిగి తెలుసుకుంటాడు. ధర్మరాజు భార్యబిడ్డలకు దుఃఖాన్ని కలిగించే, బంధువులనందరినీ నశింపజేసే యుద్ధం వద్దని, నెత్తుటికూడు తినలేనని, ప్రజలు క్షేమంగా ఉంటే చాలని అంటాడు. అందుకోసం సంధి చేయమంటాడు. ఐదుగురికి ఐదు ఊళ్ళిస్తే చాలంటాడు. కొలువులో అందరూ వింటుండగా ధృతరాష్ట్రుడికి సంధి మాట విన్నవించమని, అతడు విన్నా, వినకపోయినా మిగిలిన రాజులకు, ప్రజలకు తమ పని స్పష్టమవుతుందని, భారత సంతతిని నిలుపమని చెబుతాడు. అయితే కౌరవుల దగ్గరికి ఒంటరిగా వెళ్ళటం క్షేమం కాదని, సాత్యకిని వెంట తీసుకెళ్ళమంటాడు. దానికి కృష్ణుడు వారు

తనను ఏమీ చేయలేరని, అంతకష్టాలు పెట్టిన కౌరవులపై దాయాదులు చస్తారని దయతలుస్తున్నావని అంటాడు. అయినా సంధి చేయటమే మన కర్తవ్యం అంటాడు ధర్మరాజు. భీముడు కూడా అన్నమాట ప్రకారం సంధినే కూర్చమంటాడు. దానికి కృష్ణుడు భీముడిని ఎగతాళి చేస్తాడు. ద్రౌపదిని కౌరవులు అవమానించే సమయంలో చేసిన ప్రతిజ్ఞలు మరిచి ఇప్పుడీ శాంతి మాటలేంటి అంటాడు కృష్ణుడు. అన్నీ అన్న కోసమే అంటాడు భీముడు. భీముడిని హాస్యమాడుతున్న కృష్ణుడిపై కోపగించిన భీముడిని తమ్ముళ్ళు అది తగినది కాదని చెబుతారు. కృష్ణుడు కూడా నువ్వు లేకపోతే ద్రౌపది శోకం తీర్చేవారెవరు అని, నీ పరాక్రమం ఎవరికి తెలీదు అంటాడు కృష్ణుడు. అర్జునుడు కూడా చెప్పవలసినదంతా ధర్మరాజు చెప్పాడని, సంధి చేసినా, యుద్ధం కలిగించినా ఇక కృష్ణుడి ఇష్టమని అన్నాడు. నకులుడు కూడా సంధి నడిపించు అయితే యుద్ధానికి కూడా సంధి నడిపించమని చెబుతాడు సహదేవుడు. ఇదంతా ధర్మరాజు జూదం ఆడటం కారణంగానే జరిగిందని, ఇప్పుడైనా భాగమివ్వమనకుండా యుద్ధం భేరీ మ్రోగించమని, రాజులైతే యుద్ధంలో జయించి రాజ్యం సంపాదించాలని చెబుతాడు. ద్రౌపది కూడా తాను ఎన్నో అవమానాలు సహించానని, అన్ని కష్టాలు సహించి జీవించి ఉండటానికి కారణం కౌరవుల చావు వార్త వినటానికేనని సంపదలకోసం కాదని చెబుతుంది.

కృష్ణుడు రాయబారిగా రాగా అది చూడటం కోసం కురుసభకు అనేక మంది రాజులు, మునులు, ఋషులు వస్తారు. కురుసభలో కృష్ణుడు ధృతరాష్ట్రుడితో కౌరవులకు, పాండవులకు సంధి చేసి రాజులందరినీ రక్షించమని అర్థించటానికి పాండవదూతగా వచ్చానంటాడు. వారు తమ సగభాగం తమకు ఇవ్వమన్నారని లేకపోతే ఐదుగురికీ ఐదు ఊళ్ళిచ్చినా చాలన్నారని, ధర్మమనిపించింది చేయమని, పాండవులు నీపట్ల భక్తి కలిగినవారు, పవిత్రులు, సమర్థులు అని కొడుకుల మాట వినక స్వతంత్రించి న్యాయం చేయమని చెబుతాడు. దానికి ధృతరాష్ట్రుడు గ్రుడ్డివాడు కావటం కారణంగా పాండురాజు కొంతకాలం రాజ్యం పాలించాడని, ఇప్పుడుతన కొడుకు పాలిస్తున్నాడని అందుచేత తన మాట కూడా గ్రుడ్డిదయ్యిందని చెబుతాడు. దానికి కృష్ణుడు పాండవుల చేత సేవలే చేయించుకుంటావో, యుద్ధమే చేయిస్తావో నీ చేతిలోనే ఉందంటాడు. మధ్యలో కర్ణుడు కలుగచేసుకోగా కర్ణుడిని వారిస్తూ భీష్ముడు, ద్రోణుడు మాట్లాడతారు. కర్ణుడు వారిని చాలా తిరస్కారంగా మాట్లాడుతుంటే అశ్వత్థామ సహించలేకపోతాడు. ఈవిధంగా కురుసభలో తమలో తామే కలహించుకుంటూ ఒకరిపై ఒకరు నిందారోపణలు చేస్తూ ఉండగా ధృతరాష్ట్రుడు కృష్ణుడికి తాను వచ్చిన పని చేసిపెట్టి సాగనంపాలి కదా అని దుర్యోధనుడికి ధృతరాష్ట్రుడు శ్రీకృష్ణుడు దూతగా మన దగ్గరకొచ్చాడు. ఆ పుణ్యాత్ముడి మాటలు విని సమాధానం చెప్పు అన్నాడు. నేను ఒప్పుకోనని తెలియని వారెవరున్నారు అన్నాడు దుర్యోధనుడు. ధృతరాష్ట్రుడు, గాంధారి ఎంతగా చెప్పినా దుర్యోధనుడు పాండవులతో సంధికి అంగీకరించడు. పాండవుల శౌర్యం గురించి చులకనగా మాట్లాడుతాడు. యుద్ధం జరిగితే తమకు కడుపుకోత తప్పదన్న తల్లిదండ్రులకు తిని కూర్చోక అశుభాలు ఎందుకు మాట్లాడతారంటాడు. కర్ణుడు మధ్యలో కలుగజేసుకోగా ధృతరాష్ట్రుడు కర్ణుడిని నిందిస్తే వికర్ణుడికి కోపం వస్తుంది. పాండవులపై అంత వాత్సల్యం ఉంటే పిల్చి రాజ్యం ఇవ్వవచ్చు కదా, ఇతరులను నిందించటమెందుకు అంటాడు.

విదురుడు కూడా యుద్ధం జరిగితే రాజులందరూ, ప్రజలందరూ బాధపడవలసి వస్తుందని దాని బదులు కర్ణుడికి, అర్జునుడికి ద్వంద్వ యుద్ధం జరిపి ఎవరు గెలిస్తే ఆ పక్షం గెల్చినట్టు అని అలా చేస్తే లోకాన్ని రక్షించినవాడవవుతారని చెప్పినా దుర్యోధనుడు వినడు. ఛస్తే ఐదుగురూ చావాలని అంటాడు. భీష్ముడు, ద్రోణాచార్యుడు యుద్ధం వద్దు, పాండవులతో

సంధి చేసుకోమంటే వారినీ వారు పాండవపక్షపాతులని నిందిస్తాడు. ధైర్యముంటే యుద్ధం చేయమంటాడు. అశ్వత్థామ కూడా కర్ణుడి పట్ల కోపం ప్రదర్శిస్తాడు. తమలో తాము ఇలా కలహించుకోవటం మంచిది కాదంటాడు ధృతరాష్ట్రుడు. కృష్ణుడు అందరూ ఒకసారి తనమాట ఆలకించమంటాడు. చెల్లియో, చెల్లకో తమకు చేసిన అవమానాలన్నీ పాండవులు సహించారని, ఇప్పుడు ఆ రోజులు పోయాయని, పిల్లలు, ప్రజలు అభివృద్ధి చెందగా సంధి చేయమని, అలాకాకపోతే కోపించటమే తెలియని అజాతశత్రువే కోపిస్తే సముద్రాలన్నీ ఏకమవుతాయని, పదివేల మంది కర్ణులైనా యుద్ధంలో ఛస్తారు, ప్రజలందరినీ రక్షించు జెండాపై కపిరాజు, గుర్రాలను పూన్చి దండం ధరించి తాను తోలే రథంపై నారి సారిస్తూ గాండీవం ధరించి అర్జునుడు శత్రువులను చంపేటప్పుడు ఒక్కడు కూడా నీ మొర ఆలకించరని చెబుతాడు. భీష్ముడు కృష్ణుడి మాట వినమని, కర్ణుడి మాటలు వినటం మానమని చెబుతాడు. అందుకు దుర్యోధనుడు అందరూ కర్ణుడినెందుకు నిందిస్తారు. అందరూ యుద్ధం వద్దంటుంటే నా మనసు ఎరిగి యుద్ధం చేయడానికి సిద్ధంగా ఉన్నవాడు కర్ణుడు మాత్రమేనని, అతడు తప్పక అందరినీ జయించగలడని అంటాడు. నారదుడు కర్ణుడికి వున్న శాపాలను గురించి ప్రస్తావిస్తాడు. జమదగ్ని కూడా దానిని సమర్థిస్తూ మాట్లాడతాడు. భీష్ముడికి ఈ భూమి అంతా నీదే కదా, నీకు నచ్చిన వారికి రాజ్యం ఇవ్వమని అంటాడు. కర్ణుడు కలుగజేసుకోగా జాబిలి ఒకడిని చంపుతుందని ఇంద్రుడిచ్చిన శక్తి అర్జునుడిని కాక ఇంకో యోధుడిని చంపుతుందని శపిస్తాడు.

దుశ్శాసనుడు దుర్యోధనుడితో వీరందరి తీరు చూస్తుంటే నిన్ను పట్టి కృష్ణుడికి అప్పగించేటట్లుందని చెప్పి సభ నుండి తీసుకెళ్ళిపోతాడు. మళ్ళీ ధృతరాష్ట్రుడి మాటపై గాంధారి కొడుకును పిలిపిస్తుంది. మళ్ళీ నీతులు చెబుతారు. వినకుండా దుర్యోధనుడు వెళ్ళిపోతాడు. మళ్ళీ అందరూ దుర్యోధనుడి ప్రవర్తనపై మాట్లాడుకుంటారు. ఇంతలో సాత్యకి వచ్చి కృష్ణుడిని బంధించాలని దుష్టచతుష్టయం పన్నాగం పన్నుతున్నారని వారిని ఇప్పుడు వధించి రాజ్యం పాండవులకు ఇద్దామని చెబుతాడు. అలా తాము వధించకూడదని, తనను వారు ఏమీ చేయలేరని అంటాడు. నాలుగువైపుల నుంచి వచ్చిన దుర్యోధనాదులు కృష్ణుడిని బంధించాలనుకుంటారు. కృష్ణుడు తన విశ్వరూపం చూపగా వారు చూడలేకపోతారు. ధృతరాష్ట్రుడి కోరికపై అతడికి చూపునిచ్చి తన రూపం చూచిన తర్వాత అతడి కోరికపై మళ్ళీ చూపు తీసివేస్తాడు కృష్ణుడు. కృష్ణుడు కుంతిని కలిసి యుద్ధం పట్ల ఆమె అభిప్రాయం తెలుసుకుంటాడు. తనను నిర్భాగ్యురాళ్ళకు ఉదాహరణగా చేయవద్దని, పాంచాలి గౌరవం నిలుపమని, శత్రుగర్వం అణచని కొడుకు తల్లి ఒక తల్లి కాదని తన మాటగా ధర్మరాజుకు చెప్పమంటుంది.

కర్ణుడు వచ్చి కృష్ణుడిని కలువగా కృష్ణుడు అతడికి అతడి జన్మరహస్యం చెప్పి పాండవుల పక్షం చేరి పెద్ద అన్నగా రాజ్యపాలన చేయమంటాడు. కృష్ణుడు ఎన్ని విధాలుగా చెప్పినా కర్ణుడు ప్రలోభపడక స్నేహ ధర్మానికే ప్రాధాన్యతనిస్తూ తన ప్రాణం ఉన్నంతవరకూ రారాజును వదలనంటాడు. పాండవులే కృష్ణుడి దయవల్ల గెలుస్తారని, ధర్మరాజు రాజ్యాన్ని పాలించటమే సరైనదని, తాను కుంతి కొడుకునని ధర్మరాజుకు చెప్పవద్దని అంటాడు కర్ణుడు. ఆ తరువాత కర్ణుడిని కుంతి కలుస్తుంది. కుంతికీ అదే మాట చెబుతాడు. ఆమె కోరికపై అర్జునుడిని తప్ప మిగిలిన నలుగురిని సంహరించనని, అర్జునుడు ఒకవేళ యుద్ధంలో చనిపోతే అప్పుడు తనతో కలిపి పంచపాండవులవుతారని చెబుతాడు.

కృష్ణుడు పాండవులకు రాయబార విశేషాలు చెప్పి యుద్ధానికి ధర్మరాజుని సన్నద్ధం కమ్మంటాడు. ఫణిహారుడు

కౌరవ పక్షంలోని యుద్ధ సన్నాహాల గురించి చెబుతాడు. ఉలూకుడు పాండవుల దగ్గరకు రాయబారిగా వచ్చి దుర్యోధనుడు పాండవులను నిందాపూర్వకంగా చులకన చేస్తూ పంపిన సందేశాన్ని వినిపిస్తాడు. కోపించిన పాండవులు కూడా యుద్ధంలో దుర్యోధనుడి తొడలు విరగకొట్టడం, దుశ్శాసనుడి గుండెలు చీల్చటం, కర్ణుడి కారణంగా భీష్మ ద్రోణులను చంపక తప్పదని చెప్పి పంపిస్తారు. యుద్ధరంగంలో బంధువులను చంపవలసి వస్తుందని నిర్వేదానికి లోనయిన అర్జునుడికి గీతోపదేశం చేసి విశ్వరూపం చూపిస్తాడు. ధర్మరాజు ఎంతో తెలివిగా భీష్మ ద్రోణులను కలిసి వారి ఆశీర్వాదాలు తీసుకుంటాడు. కర్ణుడు కృష్ణుడిని ఎంత మాయావిని అనుకుంటాడు. కృష్ణుడు వేయి మంది భీష్ములు, పదివేల మంది ద్రోణులు, నూరువేల కర్ణులు కలిసి వచ్చినా అర్జునుడి చేతిలో చచ్చేవారే, కృష్ణుడంటే ఎవరో తెలుసుకో. నిన్నీ హస్తినకు సార్వభౌముడిని చేయదల్చి చేసిన ప్రయత్నం నీ అంతరాత్మ, పరమాత్మ తప్ప ఇతరులు ఎరుగరు అన్నాడు.

## 2. పాండవులు, ద్రౌపది యుద్ధం పట్ల, సంధి పట్ల కృష్ణుడికి తెలియజేసిన అభిప్రాయాలను వివరించండి?

జ. కృష్ణుడు ధర్మరాజుని దేవా, అజాతశత్రు, యుధిష్ఠిర అని సంబోధిస్తూ తనతరం కాకపోయినా చేతులు జోడించి చేస్తానని, ధర్మరాజు అభిప్రాయం చెప్పమంటాడు. ధర్మరాజు “నీ ఈ పిలుపు భావికార్య సూచకమేమో కానీ వానప్రస్థుడనైన నేను ఇప్పటికి ఆ పిలుపుకు సరిపోను. ధృతరాష్ట్రుడు తమ్ముడి కొడుకులని ఆలోచించడు. రాజ్యంలో భాగం ఇవ్వడు. దుర్యోధనుడు కనుగానడు. యుద్ధం తప్పదు, బంధనాశనం తప్పదు. జయాపజయాలు దైవాధీనాలు నాదైవమైన నువ్వు మాతో ఉన్నావని తెలుసు. అయినా భార్యాబిడ్డలను, రాజులను, బంధువులను అందరికీ చావునే ఇచ్చే యుద్ధం వద్దు. రాజ్యం దక్కనిస్తారా? రాజ్యభాగం చాలు, ప్రజలు సుఖంగా ఉంటే చాలు. నెత్తుటి కూడు వద్దు. సభలో అందరూ వినుచుండగా సంధి మాటలు విన్నవించు. విన్నా వినకపోయినా మనసు నిశ్చింతగా ఉంటుంది. ప్రజలు మన క్షేమాన్నే కోరుకుంటారు. వారి నిర్ణయాన్ని నిందిస్తారు. మా సామంతరాజులకు మన నిర్ణయం స్పష్టమౌతుంది. సంధి చేసి మా భరతసంతతిని రక్షించు. సంధికి వారు ఇష్టపడితే అన్నదమ్ములం నూటఐదుగురం, ఇష్టపడకపోతే వారు నూరుగురు, మేము ఐదుగురం” అన్నాడు.

భీముడు ఇంతకీ సంధి ఏమని అని అడిగాడు. ద్రౌపది ఐదూళ్ళిచ్చిన చాలు అని అంది. భీముడు “కృష్ణా! పాండవదూతా! నీ ఆలోచన, మా రాజు ఆలోచన వేరువేరుగా ఉన్నాయి. యుద్ధం యుద్ధమని అసంబద్ధమైన మాటలు మాట్లాడవద్దు. సంధి చెడగొట్టకుండా ధర్మరాజు కోరిన విధంగా సంధి చెయ్యి. అదే మాకు క్షేమం. దుర్యోధనుడు తన గుణం విడవడు. ఒక్కో కులం నశించడానికి ఒక్కొక్కడు పుడతాడు. పూర్వం గొప్పరాజులు జన్మించారు. దుష్టులు నేటికి గాంధారి కడుపున పుట్టారు భరతవంశాన్ని కాల్చటానికి” అన్నాడు. కృష్ణుడు భీముడిని చూసి పరిహసిస్తూ ఇవి భీముడి మాటలేనా? ఈ శాంతం ఏంటి? చేసిన ప్రతిజ్ఞలన్నీ ఏమయ్యాయి? అని భీముడిని రెచ్చగొట్టే విధంగా మాట్లాడాడు. భీముడు కోపంతో కృష్ణుడిని, అతడు చేసిన చేష్టలను తూలనాడతాడు. తాను అన్న మాట కోసం శాంతం వహించానన్నాడు. చేసిన ప్రతిజ్ఞలు తీర్చకపోవటం అన్నమాటెలా అవుతుందంటాడు. నీకు అది కూడా అర్థం కాలేదు, అన్న మాటంటే ధర్మరాజు మాట అంటాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం జరుగుతుంటే తమ్ముళ్ళు వారిస్తారు భీముడిని, చిన్న వాళ్ళ చేత కూడా చెప్పించుకోవలసి వచ్చినందుకు భీముడు మరణిస్తానంటాడు. ధర్మరాజు వారిస్తాడు. కృష్ణుడు వ్యవహారం

శృతిమించుతుందని హాస్యానికి అన్నానని భీముడి బలం ఎవరికి తెలీదని సర్ది చెబుతాడు. ద్రౌపది తన పరాభవాన్ని తీర్చే వారెవరింకెవరని ఏడుస్తుంది. భీముడు 'నేనేం చేయగలను, ధర్మరాజు యుద్ధానికి ఒప్పుకోడు, ద్రౌపదేమో పరాభవమని ఏడుస్తుంది. లోకంలో ఇలాంటి బ్రతుకు బ్రతకటం కంటే చావటమే మేలు' అంటాడు. ఇంకా "ఎందుకు భార్యను జుట్టుపట్టి ఈడుస్తుంటే చూశానో, ఎందుకు వనవాసం చేశానో, ఎందుకు శాంతి వహించి ఒకరి కొలువులో ఉన్నానో, అందుకే ఈ సంధికి ఒప్పుకుంటున్నాను. ఐనా సంధి మాటలు ధృతరాష్ట్రుడితో చెప్పు. పాండురాజు జనుల చేత కీర్తించబడేవాడు, నీ తమ్ముడు రాజ్యభారం అతడే భరించాడు. ఇప్పుడు నువ్వు ఇంటికి పెద్దవై కూడా అంధుడవు కనుక నీ కొడుకులకు సరిగా రాజ్యం పంచిపెట్టి నీ కుమారుల అభివృద్ధి వింటూ సుఖంగా ఉండు. అలా పంచిపెట్టడానికి అంగీకరించకపోతే యుద్ధంలో నీ కొడుకులనందరినీ గదకే బలిస్తాను" అని చెప్పమన్నాడు భీముడు.

అర్జునుడు "చెప్పవలసినదంతా ధర్మరాజు చెప్పాడు, నీవు దైవస్వరూపిడివి, ఇంక కొదవేముంది, సంధి చేసినా, యుద్ధం కలిగించినా భారం నీదే. అయినా నా మాటలు నేను చెబుతాను. చిరకాలం నుండి అనుభవించే రాజ్యం ప్రియురాలివంటిది. బలవంతమైన విధి వల్ల కాక ఎవరు కావాలని దానిని వదులుతారు. అదీ దుర్యోధనుడి లాంటి చెడ్డవాడు ఎలా విడుస్తాడు. సూదిమొన మోపినంత భూమైనా ఇవ్వనని సూచించాడు కదా. అయినా సభలో భీష్ముడితో, ద్రోణాచార్యుడితో నా మాటలుగా చెప్పు. కర్ణుడి స్నేహంతో పగకు పూనుకున్నవాడు దుర్యోధనుడు. మీరు అతడి పక్షం వారవ్వటం న్యాయమా. నేను గాండీవధారినైనా యుద్ధ భూమిలో ఎలా పోరాడగలను. ధర్మం కాదని మందలించరా. అలా మందలించలేకపోతే మనుమళ్ళే అపాయం చేశారని, శిష్యులే అపచారం చేశారని మనసులో ఆలోచించకుండా మాకు అభయం ఇవ్వండి" అని చెప్పమన్నాడు.

నకులుడు తన అభిప్రాయాన్ని చెప్పాడిలా. "అడవిలో ఉన్న సమయంలో రాజ్యాశ మనకు లేదు. వారికి దుర్బుద్ధి లేదు నిజం. కష్టాని కోర్చి చివరికి భాగం కోరేటప్పటికి వారికి ఇలాంటి దురాశ పుట్టింది. అలా సంధి కోసం కబురు పంపారు కానీ భీష్ముడు, ద్రోణుడు యుద్ధం ఎలా మాన్పుతారు, యుద్ధానికి కాలుదువ్వటానికి మన బలం సామాన్యమా. ధర్మరాజు ధనస్సు పట్టి నిలిస్తే ఎదుర్కొనేవాడెవడు. మిగిలిన పాండవుల, విరాట ద్రుపద దృష్టద్యుమ్న కాశీరాజు చేదిరాజుల బలపరాక్రమాలు, నీ సామర్థ్యం తెలియని వారు ప్రగల్భాలే పలుకుతారు. అయినా సంధి నడుపు. యుద్ధానికి కూడా సంధి నడిపించు" అని చెప్పాడు. సహదేవుడు "పేదరికం వచ్చిందని పెద్దలు నలుగురూ కలిసి చేశారు అనకూడదు దుర్యోధనుడితో వేడుకతో జూదమాడి ధర్మరాజు సమస్తం పోగొట్టుకోగా మనకు భాగ్యం ఎలా కలుగుతుంది, పాంచాలి వరాల కారణంగా ధృతరాష్ట్రుడే మన రాజ్యం మనకిచ్చాడు. రాజులందరూ చూస్తుండగా ద్రౌపది పరాభవం చూపిన తర్వాత ధృతరాష్ట్రుడు ఇవ్వటం, గద, గాండీవం ధరించిన రాజులే స్త్రీ సంపాదించిన భూమిని పరిపాలిస్తారా, అభిమానం గల రాజులకు అబద్ధాలు తగునా! అందుకని భాగమివ్వమనకుండా బలపరాక్రమాలని చూపే యుద్ధబేరీ మ్రోగించండి. రాజులమైతే యుద్ధంలో జయించి రాజ్యం పాలించాలి. లేకపోతే చచ్చి స్వర్గంలో విహరించాలి, మంచి క్షత్రియులకు ఇంకో మార్గం లేదు" అని అన్నాడు. కృష్ణుడు బావా చిన్నవాడవైనా నా మనసుకు నచ్చిన మాట చెప్పావు అనగా మా అన్నలు సంధికి దుర్యోధనుడు అంగీకరించడని బాధపడుతున్నారు. అన్నలకు ధర్మవర్తనులన్న కీర్తి ఒకటుంటే చాలు. కానీ ద్రౌపది తల ఎత్తుకోగలదా? అన్నాడు.

ద్రౌపది శ్రీకృష్ణుడితో "అన్నా! ఈ ఆడదాని మాటకూడా విను. యజ్ఞగుండం నుండి పుట్టి, ద్రుపదరాజుకి కూతురినై, దృష్టద్యుమ్నుడికి సోదరినై, స్వయంవరంలో రాజులందరినీ జయించిన గొప్పవీరులు ఐదుగురికి భార్యనై, ప్రత్యేకంగా నీకు చెల్లిలినై ఒక కులనాశకుడు తాకకూడని సమయంలో కొప్పుపట్టుకొని ఈడ్చి కొలువులో కట్టిన వస్త్రాలు లాగి పరాభవించగా ఓర్చుకున్నాను. పన్నెండు సంవత్సరాలు వనవాసం, ఒక సంవత్సరం అజ్ఞాతవాసం చేశాను. ఇన్ని కష్టాలకు ఓర్చుకొని బ్రతికి ఉన్నందుకు ఫలితంగా ఆ కౌరవచండాలుర చావు వినుటకు కానీ సంపదలకు ఆశించేదానిని కాను. వేయెందుకు, ఈ మేటిభర్తలకు పౌరుషం వస్తుందని కదా, ఈ రోజుకీ దుశ్శాసనుడిచే చిన్నమైన తలవెంట్రుకలు ముడుచుకోకుండా కట్టిన వస్త్రం విడువకుండా జీవిస్తున్నాను. అయినా ఇప్పటికీ నా నోములు ఫలించటం లేదు" అని చెప్పింది.

ఈ విధంగా పాండవులు, ద్రౌపది తమతమ అభిప్రాయాలను కురుసభలో చెప్పవలసిన విషయాలను కృష్ణుడికి చెప్పారు.

### 3. కురుసభలో దుర్యోధనుడికి యుద్ధం వద్దని ఎవరెవరు ఏమని నీతిబోధ చేశారో రాయండి?

జ. ధృతరాష్ట్రుడు సుయోధనుడను దగ్గరకు రమ్మనగా దానికి దుర్యోధనుడు ఇతడేవో పనికిమాలిన మాటలు ఉపదేశిస్తాడు. కానీ వినాలి అనుకుంటూ తండ్రి దగ్గర కూర్చుంటాడు. ధృతరాష్ట్రుడు కొడుకుని దగ్గరకు తీసుకొని "కుమారా! మునీంద్రులు ఎవరి రూపు చూడాలనుకుంటారో ఆ శ్రీకృష్ణుడే దూతగా మన దగ్గరకు వచ్చాడు. ఆ పుణ్యాత్ముడి మాటలు విని సమాధానం చెప్పు" అన్నాడు. దుర్యోధనుడు "ఈ రోజు కొత్తేముంది, ఆ రోజు సంజయుడు చెప్పిన మాటలే ఇతడూ చెబుతాడు. అందుకు నేనొప్పుకోనని తెలియని వారెవరున్నారా" అన్నాడు. దానికి ధృతరాష్ట్రుడు "భీష్మ ద్రోణ కృపాశ్వత్థామ మొదలైనవారందరు సంధికి అంగీకరించటానికి కృతనిశ్చయులై ఉన్నారు. పాండవులైనా ఐదూళ్ళిస్తే చాలంటున్నారు. అన్యాయంగా దాయాదుల పట్ల ఈ ద్వేషమెందుకు? యుద్ధం చేస్తావా, నీకు కర్ణుడు మొదలైన వారున్నారని భయం ఇంకెందుకు అనే ధైర్యమేమో, నేను అర్జునుడికి సాటి అయినవారెవరో చెప్పు?" అన్నాడు. గాంధారి కూడా "కుమారా! మీ తండ్రి మాటలు విను. అనేక దేశాలుండగా ఐదూళ్ళు వారికిస్తే నీకు తగ్గేదేముంది. పెద్దల మాటలు ఎందుకు నిరాకరిస్తావు, చాలాకాలం నుండి ఈ కురువంశంలో రాజ్యం చిన్నకుటుంబమందే నిలుస్తుంది. యయాతి కొడుకులలో పెద్దవాడైన యదువుండగా అతడి మదోన్మత్తత కారణంగా చిన్నవాడైన పితృభక్తి కలిగిన పూరుడు రాజయ్యాడు. మీ ముత్తాతలు దేవాపి, బాహ్లిక, శంతనులలో పెద్దవాడు రోగగ్రస్తుడవ్వటం చేత చిన్నవాడైన శంతనుడే రాజయ్యాడు. తర్వాత దేవవ్రతుడు పెద్దవాడైనా మీ తాతగారైన విచిత్రవీర్యుడికే రాజ్యం వచ్చింది. మీ తండ్రి విషయంలో కూడా పాండురాజు పాలన చేయటం నీకు తెలియంది కాదు. కనుక లోభం విడిచి మీరూ మీరూ కలిసి అనుభవించటం మంచిది. మమ్మలిని తుట్టతుదకు దిక్కులేని వాళ్ళుగా చేయవద్దు. పెద్దల మాట విని బ్రతుకు" అని చెప్పింది.

ధృతరాష్ట్రుడు "ఇంకొక విశేషం చెబుతాను విను. అజాతశత్రువైన ధర్మరాజు కోపిస్తే లోకాలు బూడిదవుతాయి. యుద్ధం వద్దు నాయనా. మీ అమ్మ మాటే నిజం. పూర్వం నుంచి చిన్న వాళ్ళే రాజులవుతున్నారు. అలాగే ధర్మరాజు అవుతాడు. కనుక నువ్వు మారుమాట్లాడకుండా సంధికొప్పుకో, లేకపోతే సర్వం కోల్పోయి అనేక కష్టాలు కలుగుతాయి"

అన్నాడు. మళ్ళీ గాంధారి కూడా "నాయనా! వారు తమ భాగం కోసం పోరాడేవారే కానీ, అధర్మపరులు కారు. ధర్మమే జయిస్తుందంటారు. అంతేగాక భీష్ముడు మొదలైన పెద్దలందరూ న్యాయపక్షపాతులు. న్యాయంగా పన్నెండు సంవత్సరాలు అరణ్యవాసం, ఒక సంవత్సరం అజ్ఞాతవాసం చేసి తమ తండ్రి భాగం కోసం యుద్ధం చేయగలిగి కూడా ఐదు ఊళ్ళిచ్చినా చాలని కృష్ణుడిని పంపారు. అలాంటి ధర్మాత్ముల ముందు శివకేశులే నిలువలేరు. కనుక నీ నూరు మంది తమ్ముళ్ళను రక్షించుకొని పాండవులతో కలిసి జగత్తునంతా పాలించుకో" అని చెప్పింది. అయినా దుర్యోధనుడు అంగీకరించలేదు. మళ్ళీ ధృతరాష్ట్రుడు"కుమారా! నువ్వు యుద్ధం గురించి కృతనిశ్చయుడవై ఉన్నావు. తోకతొక్కిన నాగుబాములా నీపైకి దూకబోతున్న పాండవుల బలపరాక్రమాలు తెలిస్తే నా కడుపులో చెయ్యిపెట్టి కలిచినట్లవుతుంది. భరతకులం నిలుపమని తల్లి అయిన సత్యవతి వేడిందని వేదవ్యాసుడు మన సంతతి నిల్పాడు. తాత సంసారం అసహ్యించుకొని కూడా పెంచాడు కదా. దానిని కుటుంబ కలహంతో నేడు త్రుంచుతారా" అన్నాడు. గాంధారి "నాయనా! భీముడు జరాసంధుడు, హిడింబాసురుడు, కీచకులను చంపాడని విన్న దగ్గర నుంచి నా కడుపు రగులుతుంది. భీముడి చేతిలో బడటానికి నువ్వొకడివి మాత్రమే ఇక మిగులున్నావు. కాబట్టి సంధి చేసుకొని నీ ప్రాణాలు నిలుపుకో. మమ్మల్నీ దుఃఖ సాగరాన్ని దాటించు" అంది. దుర్యోధనుడు "తల్లీ!తిని కూర్చోకుండా ఎందుకిలా అశుభం మాట్లాడుతున్నారు. భరతకులానికి లోపమేమీ లేదు. రెండువైపుల వారు యుద్ధంలో చావటం ఎక్కడైనా ఉందా? సంధి చేసుకుంటే మాత్రం చావు తప్పుతుందా? అయినా నేను చెప్పకూడదు కానీ యుద్ధంలో పాండవులందరినీ సంహరిస్తాను" అన్నాడు.

విదురుడు దుర్యోధనుడితో "సుయోధనా! నీవు వినవని తెలిసి కూడా ఉపదేశించి నా మనోతాపాన్ని తగ్గించుకుంటాను. అందరికీ తప్పనిపించిన పని చేయడానికి నీ మనసు బాధపడదు. సభలో ఏది చేయచ్చు. ఏది చేయకూడదని విచారించేటప్పుడు ఎక్కువ మందికి సమ్మతమైనదే చేయాలి కదా. ఎక్కువ మంది ఎవరి మార్గం మంచిదంటారో అది అనుసరించి సభాసదులు చెప్పింది చేయి. దానికి అంగీకరిస్తే అందరి చావు తప్పుతుంది. కాదు అంటే ఇంకో మార్గం ఉంది. రెండు పక్షాల నుంచి ఒకరొకరిని ఎంచుకొని వారికి యుద్ధం ఏర్పరచి వారిలో ఎవరు గెలిస్తే ఆ పక్షం గెల్చినట్లు నిర్ణయించాలి. నువ్వు అర్జునుడికీ కర్ణుడికి ద్వంద్వయుద్ధం చేయించు. అప్పుడు యుద్ధం ఉండదు కనుక జగత్తంతా సంతోషిస్తుంది" అన్నాడు. భీష్ముడు కూడా దానికి "దుర్యోధనా! వినేపనైతే విదురుడి మాటలు మంచిమాటలు. మీ కోసం రాజులందరూ చావడం తప్పి వారి భార్యాబిడ్డలతో సంతోషంగా ఉంటారు. మేము ఎప్పుడో పుట్టాము, ఎప్పుడో పెరిగాము. ముసలివాళ్ళం, మాకు యుద్ధమెందుకు? భగవన్నామం తల్చుకుంటూ బ్రతుకుతాను" అన్నాడు.

ద్రోణాచార్యుడు కూడా అర్జునుడిని కర్ణుడు జయించలేడని, అతడు శివుడితోనే యుద్ధం చేసి పాశుపతాస్త్రాన్ని పొందాడు. స్వర్గలోకమెళ్ళి ఇంద్రుడి సింహాసనంపై కూర్చున్నాడు. రాజులందరినీ గెలిచి తన అన్న చేత అశ్వమేధం చేయించాడు. విరటుడి పశువులను పట్టుకున్నప్పుడు అతడి ఒక్కడి ధాటికి మనగతి ఏమైందో చూశాం కదా" అన్నాడు. ద్రోణుడిని కర్ణుడు తూలనాడుతుండగా అశ్వత్థామకు ఆగ్రహం కలిగింది. దుర్యోధనుడితో అశ్వత్థామ "మూఢ దుర్యోధనా! ఇంకా సిగ్గులేకుండా నన్ను అనునయించడానికి వచ్చావా. యుద్ధంలో సహాయం చేయమని కోరదగనివాడా గురువు. ఈ కర్ణుడా నిన్ను ఆజ్ఞాపించేది" అన్నాడు. ఇంకా యుద్ధానికి మీ రాజు రండి అన్నప్పుడే వస్తామని కర్ణుడితోనూ అన్నాడు.

కృష్ణుడు "చెల్లియో, చెల్లకో తమకు చేసిన అవమానాలన్నీ పాండవులు భరించారు, ఆరోజులు పోయాయిక. ఈ

రోజు దూతగా సంధి చేయడానికి పంపారు. నీ పిల్లలు, ప్రజలు అభ్యుదయం పొందేటట్లు సంధి కుదరనిస్తావో లేదా యుద్ధం తెస్తావో స్పష్టంగా చెప్పు. కోపించుటమే తెలియని అజాతశత్రువే కోపిస్తే సముద్రాలన్నీ ఏకమవుతాయి. పదివేల మంది కర్ణులైనా యుద్ధంలో బాధపడతారు, ఛస్తారు. దుర్యోధనా! నా మాటలు నమ్ము. ప్రజలందరినీ రక్షించు. జెండాపై కపిరాజు ఉండగా గుర్రాలను కూర్చి దండం ధరించి నేను రథం తోలగా దానిపై నారిసారిస్తూ గాండీవం ధరించిన అర్జునుడు మూకలను చెండాటేప్పుడు ఒక్కడు కూడా నీ మొర ఆలకించరు. రారాజా! సంతోషంగా సంధి చేస్తావా? లేదా ద్రౌపది వస్త్రాపహరణం జరిగే రోజు భీముడు చేసిన ప్రతిజ్ఞలను నెరవేరుస్తూ భీముడు నీ ఎదురుగానే దుశ్శాసనుడి రొమ్ము నుండి రక్తం గ్రోలటం, ఆ తరువాత అతడి గద నీ తొడలను ఛేదించటం నిశ్చితం" అని చెప్పగా దుర్యోధనుడు విననట్లే వుండి ముందు వీడి మదం అణిస్తే గాని పాండవుల గర్వం అణగదు. వీడికి తగిన ప్రాయశ్చితం చేస్తాను అనుకుంటాడు.

భీష్ముడు కూడా దుర్యోధనుడికి "కుమారా! మనకు బంధువైన ఈ కృష్ణుడి మాటలైనా విను. ముందు ఈ కర్ణుడి మాటలు విని చెడిపోయావు. ఈ రోజు కృష్ణుడి మాటలు వినకపోతే నువ్వు నీ వందమంది తమ్ముళ్ళు చెడతారు" అని చెప్పాడు. దుర్యోధనుడు భీష్ముడిని తూలనాడుతుండగా కృపుడు "నీవు ఎంత రాజువైనా తినవచ్చిన వాళ్ళని ఇంత చులకనగా మాట్లాడకు. కాలం తీరిన వాళ్ళ కోసం యుద్ధం దగ్గర కొచ్చింది. యుద్ధంలో పాల్గొనకుండా ఉండి నీ నిష్ఠూరపు మాటలకు లోనవుతాను. నువ్వు చదివిన చదువుకు తగిన పద్ధతి ఈ రోజుకి చూశాము. యుద్ధసన్నద్ధుడవై పదిమంది బలవంతుల సహాయం కోరవలసిన దానికి బదులుగా నీవు అనవలసిన మాటలేనా ఇవి. బుద్ధి కర్మననుసరిస్తుంది కదా, నిన్ను అనవలసిందేముందిలే. చక్కటి రాజవంశంలో పుట్టిన నీకు ఈ సూతుడి కొలువెందుకు? మీ అవసరమేముందని భీష్ముడిని, ద్రోణుడిని, అశ్వత్థామను తూలనాడుతున్నావే" అన్నాడు.

నారదుడు "దుర్యోధనా! ఈ కృపాచార్యుడి మాటలు నిరాకరించవలసినవి కావు. నీ తండ్రి అంధుడవటం వలన దాసీతనయుడైనా లోకోత్తరుడైన విదురుడు రాజ్యం శాసించాడు. ఇక ఇప్పుడు ఇతరులెందుకు పరిపాలించాల్సి వస్తుంది. పాలించినా నీ తమ్ముళ్ళు, పాండవలున్నారు కదా, ఈ కర్ణుడెందుకు? ఈ కర్ణుడికి అనేక శాపాలున్నాయి. ఈ కర్ణుడితో స్నేహానికి ఫలితం భీష్మాదులతో శత్రుత్వం కాదు. ఎవరైనా కలహిస్తే సంతోషించే నేనే యుద్ధం వద్దంటున్నాను, నా మాట నమ్ము" అని చెప్పాడు.

భీష్ముడు "కొంచెం కూడా ఆలకించవు. ఈ రాజ్యమంతానాది, నేను కాదంటేనే పాండురాజు, నీ తండ్రి రాజులు,, నేనుండగా మీరు వందమంది, ఐదుగురు పాండవులు యుద్ధం చేయడమేమిటి. మీ ఇద్దరూ నా అనుమతితో పరిపాలించు కోవటానికి అంగీకరిస్తాను" అన్నాడు. ద్రోణుడు "దుర్యోధనా! ఇది విను. భీష్ముడు ఏది చెబితే అది చేయటం క్షేమం కలిగిస్తుంది. ఒకవేళ ఇంకొకటి ఈర్ష్యతో చేయదలిస్తే నేనొప్పుకోను. నా జీవనానికి మొత్తం భీష్ముడే ఇచ్చాడు. ఇక జీవనానికి నిన్ను గానీ పాండవులను కానీ కోరను. ఇరువైపులవారు నాకు శిష్యులే. మీరందరూ నాకు అశ్వత్థామతో సమానం. నేను వేరు, భీష్ముడు వేరు అనుకోవద్దు. అతడు ఎటో నేనూ అటే. ధర్మం ఎక్కడుంటందో విజయం తప్పకుండా అక్కడే ఉంటుంది" అని చెప్పాడు.

జమదగ్ని "దుర్యోధనా! వృధా దురహంకారానికి పోవద్దు. యయాతి, గరుత్మంతుడు మొదలైన పూర్వులు

చెడిపోవటానికి ఇదే కారణం. కులవృద్ధుడైనా భీష్ముడిని, గురువైన ద్రోణుడిని, అశ్వత్థామను, కృపుడిని, తల్లిదండ్రుల మాటలు వినక నీకు నీవే పెద్దవా చెప్పు. నిన్ను అందరూ బ్రతిమాలుతున్న కొలదీ కర్ణుడే దిక్కని వీరి మాటలు వినటం లేదు. భీష్ముడు పెట్టిన భిక్షే కదా లేకపోతే నీకెక్కడిదీ రాజ్యం'' అన్నాడు.

చివరిగా గాంధారి మళ్ళీ "తండ్రీ దుర్యోధనా! సోదరులు కలిగిన నీవు నీకు మేలు కలిగించే నీ తండ్రి మాటలు విను. భీష్ముడు, ద్రోణుడు, కృపుడు, విదురుడు మొదలైనవారు నీ క్షేమం కోరనివారు కారు. ఐశ్వర్యం అదృష్టం కారణంగా వస్తుంది కానీ బుద్ధి ద్వారా సాధించగలిగేది కాదు. జితేంద్రియుడు, మేధావి కానివాడికి ప్రజాపాలన సులభం కాదు. నీకు కామ క్రోధాలు శత్రువులు కానీ పాండవులు కారు. మొదట నీ వారికి నీవు ఇష్టుడవు కాకపోతే శత్రువులను ఎలా జయించగలవు. కన్నులు తెగిన వలలో చేపలు చిక్కనట్లే కామక్రోధాలచే తూట్లుపడిన రాజు వలలో శత్రువులు చిక్కరు. కాబట్టి అరిషడ్వర్గాలనే శత్రువులను జయించి పాండవులతో కలిసి నీ రాజ్యం సుఖంగా పాలించుకో. కుటుంబ కలహానికి భయపడి కదా మీ తాత, మీ తండ్రి వారి భాగం వారికివ్వదలచారు. భూమంతా పాలించాలనుకుంటే వారడిగిన ఐదుఊర్లు వారికివ్వు, బంధువుల మరణానికి పూనుకోవద్దు'' అని చెప్పింది.

అయినా దుర్యోధనుడు ఎందరు ఎన్ని చెప్పినా సంధికి అంగీకరించలేదు. దూతగా వచ్చిన కృష్ణుడినే బంధించబోయాడు.

**ఇంకారాదగిన ప్రశ్నలు:**

1. పాండవోద్యోగం నాటకం ఆధారంగా పాత్రల మనస్తత్వాలను చిత్రించండి?
2. పాండవోద్యోగం నాటకం ఆధారంగా రచయితల సంభాషణా చాతుర్యాన్ని నిరూపించండి?
3. కర్ణుడు, కృష్ణుడు, కుంతిల మధ్య జరిగిన సన్నివేశాల సారాంశాన్ని రాయండి?
4. కృష్ణరాయబారం, తర్వాత జరిగిన పరిణామాలను వివరించండి?

**డా॥ ఇరపని మాధవి**
తెలుగు & ప్రాచ్య భాషా విభాగం,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,
నాగార్జున నగర్.